# rēDiyō nāTakālugā mārina ‘gaNapati’, ‘vēyi paDagalu’ navalalu: vimarSanātmaka pariSīlana

A Thesis submitted to the UNIVERSITY OF HYDERABAD in partial fulfillment of the Degree of

**Doctor of Philosophy**

in

**Telugu**

by

**Rajender.S**

**Roll No: 13HTPH11**

**Department of Telugu**
**School of Humanities**
**University of Hyderabad**
**Hyderabad–500 046**
**Telangana State**

June-2016

# రేడియో నాటకాలుగా మారిన ‘గణపతి’, ‘వేయిపడగలు’ నవలలు : విమర్శనాత్మక పరిశీలన

పిహెచ్.డి. పట్టాకోసం

హైదరాబాదు విశ్వవిద్యాలయానికి సమర్పించిన పరిశోధనా వ్యాసం


పరిశోధన

**రాజేందర్.ఎస్**

**Roll No: 13HTPH11**

పరిశోధకుడు

**డా॥ దార్ల వెంకటేశ్వరరావు**

తెలుగు శాఖ

మానవీయ శాస్త్రాల విభాగం

హైదరాబాదు విశ్వవిద్యాలయం

హైదరాబాదు – 500 046

తెలంగాణ రాష్ట్రం



జూన్ – 2016

# CERTIFICATE

This is to certify that the Thesis entitled ***"rēDiyō nāTakālugā mārina 'gaNapati', 'vēyi paDagalu' navalalu: vimarSanātmaka pari Sīlana"***submitted by ***Mr.Rajender.S*** bearing Regd. No.**13 HTPH11** in partial fulfillment of the requirements for the award of **Doctor of Philosophy** in Telugu is a bonafide work carried out by him under my supervision and guidance.

The dissertation has not been submitted previously in part or in full to this or any other University or Institution for the award of any degree or diploma.

**Dr. Darla VenkateswaraRao**
**Research Supervisor**

**Head, Department of Telugu**

**Dean, School of Humanities**

## DECLARATION

I, **Rajender.S** hereby declare that this Thesis entitled ***"rēDiyō nāTakālugā mārina 'gaNapati', 'vēyi paDagalu' navalalu: vimarSanātmaka pariSīlana"*** submitted by me under the guidance and supervision of **Dr. Darla VenkateswaraRao** is a bonafide research work. I also declare that it has not been submitted previously in part or in full to this University or any other University or Institution for the award of any degree or diploma. I do hereby agree that this can be deposited in SHODGANGA / INFLIBNET.

***Rajender.S***
Regd. No. 13HTPH11

Date:

# కృతజ్ఞతలు

నాకు జన్మనిచ్చి, నన్ను ఈ స్థాయి వరకు కంటికి రెప్పలా కాపాడుకుంటూ వచ్చిన మా అమ్మ శ్రీమతి భాగ్యమ్మకు కృతజ్ఞతలు.

నాకు పరిశోధనకు అవకాశం కలిగించిన తెలుగు శాఖ, హైదరాబాదు విశ్వవిద్యాలయం వారికి ప్రత్యేక కృతజ్ఞతలు.

నిరుత్సాహంతో, నిస్పృహతో ఉన్న నాలో ఉత్సాహాన్ని కలిగించి, ధైర్యాన్ని నూరిపోసి, ఆత్మస్థైర్యాన్ని కలిగించి ఫోనులో సహితం విసుగు చెందకుండా తగిన సలహాలను అందిస్తూ Visually Challenged Persons కున్న టెక్నాలజీని తెలుసుకుని నాలాంటి వారికి ఏ రీతిలో పరిశోధన చెయ్యాలో వివరిస్తూ నా పరిశోధనకు పూర్తి సహకారాన్ని అందించిన మా పర్యవేక్షకుడు డా॥ దార్ల వేంకటేశ్వరరావు గారికి కృతజ్ఞతలు తెలుపుకుంటున్నాను.

ఎప్పుడు కనపడినా ఆప్యాయంగా పలకరిస్తూ నా భుజం తట్టి ప్రోత్సహించిన తెలుగు శాఖ అధ్యక్షులు ఆచార్య తుమ్మల రామకృష్ణ గారికి, ఆచార్య శరత్ జ్యోత్స్నా రాణిగారికి, ఆచార్య జి. అరుణకుమారి గారికి, ఆచార్య రేమిల్ల వేంకట రామకృష్ణ శాస్త్రి గారికి, డా॥ పిల్లల మర్రి రాములు గారికి, డా॥ పమ్మి పవన్ కుమార్ గారికి, డా॥ దేవారెడ్డి విజయలక్ష్మి గారికి, డా॥ బాణాల భుజంగ రెడ్డి గారికి, డా॥ డి. విజయ కుమారి గారికి  కృతజ్ఞతలు.

ఈ కేంద్రీయ విశ్వవిద్యాలయంలో అడుగు పెట్టిన తర్వాత నన్ను మొట్ట మొదటి సారిగా పలుకరించి నా జీవితానికి సంబంధించిన మెలకువలను నేర్పించిన ఆచార్య బేతవోలు రామబ్రహ్మం గారికి, నా రీసెర్చ్ టైటిల్ ని  ఫొనిటిక్ స్క్రిప్టులో రాసి పంపించిన ప్రసిద్ధ భాషాశాస్త్రవేత్త ఆచార్య జి.ఉమామహేశ్వరరావుగార్కి నా ప్రత్యేక కృతజ్ఞతలు.

నేను అడగగానే తగిన సూచనలు చేసి అవసరమైన సమాచారాన్ని అందించిన ప్రముఖ రచయిత్రి డా॥ దిట్టకవి శ్యామలాదేవి గారికి, హైదరాబాద్ ఆకాశవాణి కేంద్రంలో కార్యక్రమ నిర్వాహకులు సి.యస్ రాంబాబు గారికి కృతజ్ఞతలు.

నన్ను చదివించడానికి తన చదువును మానుకుని తన రెక్కల కష్టంతో సంపాదించిన డబ్బును ఖర్చు పెడుతున్న నా తమ్ముడు రాంబాబుకు, ఇంట్లోనే ఉన్న నన్ను బయట ప్రపంచానికి పరిచయం చేసి నేను ఇంత చదువు చదవడానికి కారణమైన  పి. ఆర్. సురేష్ అన్నకు, చెల్లెలు లక్ష్మికి, మేనల్లుడు చరణ్ కు, అమ్మమ్మ నారాయణమ్మకు, నన్ను కొడుకులాగా భావించి అప్పుడప్పుడు నన్ను ఆర్థికంగా ఆదుకున్న వై. వెంకటేశ్వరరావు గారికి, చెల్లి విజ్ఞితాకు, ప్రజాశక్తి రిపోర్టర్ పి. ఆర్. చంద్ర శేఖర్ అన్నకు, శ్రీ దేవి అక్కకు, ఎ. సుహాసిని కి , శివా గారికి కృతజ్ఞతలు.

నా పరిశోధన ఆరు సంవత్సరాల తర్వాత అయిపోతూ ఉంది నువ్వు ఇంకా ఎప్పుడు చేస్తావు అంటూ నిరంతరం భయపెడుతూ నన్ను మేలుకొలిపి నా పరిశోధన మూడు సంవత్సరాలలోపే పూర్తి చేయడానికి పరోక్షంగా తోడ్పడిన  కె.యశోదకు ప్రత్యేక కృతజ్ఞతలు. నా కుటుంబంలోని మనిషిగా నిస్వార్థంతో నా పరిశోధనకు సహాయ సహకారాలు అందించిన నల్లా సుభాషిణికి కృతజ్ఞతలు. TV9 న్యూస్ రీడర్ దీప్తి వాజ్ పేయ్ అక్కకు, దీపాకు, ఎస్. ఎస్. వాజ్ పేయ్ గారికి,  విజయదుర్గకు, హరికి నా పరిశోధనకు చేతనైన సహాయం చేసిన  నా ప్రియ పుత్రుడు ఎస్. వి. వి. ఎస్. ధనుష్ దత్తకు,

మిత్రుడు రవిచంద్రకు, రాజేష్ కు, రవికి, ఆత్మీయమిత్రుడు జగదీష్, శేఖర్ కు, ప్రదీప్ కు మిత్రుడు S.I కిషోర్ కు, పావనికి, లతకు, సృజనకు , నాగరాజుకు, మల్లేష్ కు, బాలరెడ్డికి, నాకు Scribersగా సహకరించిన వారందరికీ పేరు పేరున కృతజ్ఞతలు.

పత్రికా సంస్థలకు, ఆడియో మెటీరియల్ అందిస్తున్న Vision through group Director అయిన ఉమామహేశ్వర్ గారికి, Empower committee వారికి, సహకరించిన డా॥ మంజుశ్రీ గారికి,

నాకు డాక్టరేట్ చేయడానికి అవకాశం కల్పించిన కేంద్రీయ విశ్వవిద్యాలయానికి , బోధనేతర సిబ్బంది అయిన భవాని శంకర్ గారికి, రాంబాబు గారికి, గణేష్ గారికి, గ్రంథాలయానికి, ఆకాశవాణి కేంద్రాలకి కృతజ్ఞతలు.

సుబ్బారావుగారికి, జరీనా కు, రామారావుగారికి, ఎప్పటికప్పుడు నా సమయ భావనను తెలియజేస్తూ నా పరిశోధన కు సహకరించిన Executive Officer

కె. యస్. మాధవి గారికి, అలాగే రామ మోహన్ రావు గారికి సోదరి శాలినికి, నాకు పెద్దక్క లాగా అనిపించే సత్య విజయలక్ష్మి గారికి, సంధ్య గారికి ఇంక నాతోనే ఉంటూ నాకు నిరంతరం సహాయ పడుతున్న విజయ్ కుమార్ కి, నిబేదిత, కృతజ్ఞతలు. మాచిరెడ్డి కవితకు, దారిశెట్టి పుష్పిణికి, వాణికి, సుమలతకు, మిత్రులు నరసయ్యకు, పవన్ కుమార్, బడిగె ఉమేశ్, ఎం. చంద్రమౌళిలకు కృతజ్ఞతలు.

నా జీవితంలోనే కాకుండా నా పరిశోధనలో భాగస్వామి యై నా పరిశోధన పూర్తి చేయడానికి సహకారాన్ని అందించిన నా సతీమణి శ్రీమతి సుజనకు నా ప్రత్యేక కృతజ్ఞతలు.

**–పరిశోధకుడు**

# విషయసూచిక


కృతజ్ఞతలు iii

ప్రస్తావన xv


మొదటి అధ్యాయం

## చిలకమర్తి లక్ష్మీనరసింహం,
## విశ్వనాథ సత్యనారాయణల సాహిత్య కృషి

(పుటలు: 1–37)


1.1.చిలకమర్తి– జీవితం 2

1.2. విశ్వనాథ – జీవితం 3

1.3. నాటక సాహిత్యంలో చిలకమర్తి – విశ్వనాథల కృషి 5

1.3.1. చిలకమర్తి నాటకాలు – సంక్షిప్త పరిచయం 5

1.3.2.ద్రౌపది పరిణయం 5

1.3.3. గయోపాఖ్యానం 7

1.3.4..పార్వతి పరిణయం 8

1.4. విశ్వనాథ నాటకాలు – సంక్షిప్త పరిచయం 12

1.4.1. ధన్య కైలాసం 12

1.4.2.నర్తనశాల(కీచక వధ) 14

1.4.3.వేనరాజు 16

1.5. నవలా సాహిత్యంలో చిలకమర్తి– విశ్వనాథల కృషి 18

1.6. చిలకమర్తి నవలలు– సంక్షిప్త పరిచయం 20

1.6.1..రామచంద్ర విజయం 20

1.6.2.రాజారత్నం 22

1.6.3.సౌందర్య తిలక 24

1.7. విశ్వనాథ నవలలు– సంక్షిప్త పరిచయం 28

1.7.1. ఏకవీర 28

1.7.2.దేవతల యుద్ధం 30

1.7.3.హాహాహూహూ 32

రెండవ అధ్యాయం

# దృశ్య, శ్రవ్య నాటక వికాసం–
# గణపతి, వేయిపడగల నవలలు పరిచయం

(పుటలు: 38–60)


| | |
|---|---|
| 2.1. నాటకం నిర్వచనం | 41 |
| 2.2. నాటక లక్షణాలు | 42 |
| 2.3. తెలుగు నాటక వికాసం | 43 |
| 2.3.1. పౌరాణిక రూపకాలు | 46 |
| 2.3.2. సాంఘిక రూపకములు | 46 |
| 2.3.3.చారిత్రక రూపకాలు | 48 |
| 2.3.4. ప్రచార రూపకాలు | 49 |
| 2.3.5. మనస్తత్వ నిరూపణ రూపకాలు | 49 |
| 2.3.6. విషాద రూపకాలు | 50 |
| 2.4.రేడియోనాటకాల చరిత్ర | 52 |
| 2.5. రేడియో నాటకాల విభజన | 53 |
| 2.5.1. రంగస్థల నాటకాలు– రేడియో అనుసరణ | 54 |
| 2.5.2. నవలలు – రేడియో అనుసరణ | 55 |
| 2.6.శ్రవ్యరూపకములు– పరిమితులు | 56 |
| 2.7. రేడియో నాటకీకరణ | 58 |
| 2.7.1. నాటకాలు రేడియో నాటకాలు భేద సాదృశ్యాలు | 58 |
| 2.8. గణపతి వేయిపడగల నవలలు పరిచయం | 59 |

మూడవ అధ్యాయం

# గణపతి, వేయిపడగల నవలలు:

# ఇతివృత్త పరిచయం

(పుటలు: 61–96)


3.1. ఇతివృత్తం 61

3.2. 'గణపతి' నవల – ఇతివృత్త నిర్మాణ వైఖరి 62

3.3.. గణపతి నవల – ఇతివృత్తం 63

3.3.1. గణపతి నవల– కారణాలు 63

3.3.2.గణపతి పూర్వీకుల చరిత్ర 64

3.3.3. గణపతి పూర్వీకుల వృత్తి 64

3.3.4. బాల్యవివాహం 65

3.3.5.గంగాధరం చేసే పని 65

3.3.6. సంపాదన కోసం గంగాధరుని ప్రయత్నం 66

3.3.7. గణపతి జననం 67

3.3.8. గణపతి అల్లరి 67

3.3.9.అబద్ధాలతో గడిపిన గణపతి 68

3.3.10.గణపతి గిరజాలకోసం పడే పాట్లు 69

3.3.11.గణపతికి కోటు తొడుక్కోవాలనే ఆశ 70

3.3.12.మేనత్త మేనమామలతో గణపతి ప్రవర్తన 71

3.3.13.పొట్టకూటికోసం భిక్ష మెత్తిన సింగమ్మ 72

3.3.14.గణపతి వివాహ ప్రస్తావన 72

3.3.15.బడిపంతులుగా గణపతి 73

3.3.16.గణపతి కుంభకర్ణుని నిద్ర 74

3.3.17. నటుడుగా గణపతి 74

3.3.18.వంటవాడుగా గణపతి 75

3.3.19.గణపతి చిలిపి చేష్టలు 75

3.3.20. గణపతి వివాహ ప్రస్తావన 76

3.3.21.సింగమ్మ మరణం 76

3.3.22. భయంతో అదృశ్యమైన గణపతి 76

3.4. వేయిపడగలు – ఇతివృత్త నిర్మాణ వైఖరి 77

3.5. వేయిపడగలు నవల– ఇతివృత్తం 79

3.5.1. సుబ్బన్న పేట వృత్తాంతం 79
3.5.2. కృష్ణమనాయుని  పరిపాలన 80
3.5.3.రామేశ్వర శాస్త్రి వృత్తాంతం 80
3.5.4.ధర్మరావు ఆర్థిక పరిస్థితి – కృష్ణమనాయుడి సహాయం 81
3.5.5.సుబ్బన్న పేటకు అరుంధతి రాక 82
3.5.6. రంగారావు పట్టాభిషేకం 82
3.5.7.ధర్మరావింటికి రుక్మిణమ్మ 83
3.5.8 ధర్మారావు చదువు సాహిత్య చర్చ 83
3.5.9.ధర్మారావుకి రామచంద్రరాజు పరిచయం 84
3.5.10. ధర్మారావు గుంటూరు ప్రవేశం– దారిద్ర్యం 84
3.5.11.ధర్మరావుకి కోట ప్రవేశానికి నిరాకరణ 84
3.5.12.కిరీటి శశిరేఖల వివాహం 85
3.5.13.రుక్మిణమ్మ సరోజని దేవి మరణం 85
3.5.14.హరప్ప విద్యాభ్యాసం 86
3.5.15.సుబ్బన్న పేటలో జాతీయ కళాశాల స్థాపన 86
3.5.16.కేశవరావు మరణం 86
3.5.17..పాలనా సంఘ సభ్యుల ఎన్నిక 87
3.5.18.చంద్రారెడ్డికి దివ్య సర్ప దర్శనం 87
3.5.19.జాతీయ కళాశాల అధ్యక్షుడుగా శివరావు 88
3.5.20.జోస్యుల మరణం 88
3.5.21.రామేశ్వరం జైలు శిక్ష 88
3.5.22.ధర్మారావు, గణాచారి సంభాషణ 89
3.5.23. రంగారావు కలలో సర్ప దర్శనం 89
3.5.24.ధర్మారావు అరుంధతి కి మగ బిడ్డ జన్మించడం 89
3.5.25.ఆంధ్రపండిత పదవి అభ్యర్థిగా ధర్మారావు 89
3.5.26. కుమారస్వామి ధర్మారావుని ఇంటికి ఆహ్వానించడం 90
3.5.27. చిన్న అరుంధతి ప్రవేశం 90
3.5.28.సుబ్బన్న పేటలో సారంగధర నాటకం వేయడం 90
3.5.29.సుబ్బన్న పేటలో నూతన మార్పులు 90
3.5.30.మహిళా మండలి ఏర్పాటు 91
3.5.31.సుసాని ఇంగ్లాండ్ ప్రయాణం 91
3.5.32.హరప్ప పనితీరు 91

3.5.33.రాఘవరావు భార్య మరణం 92
3.5.34.కుమారస్వామి ఉద్యోగాన్ని వదలటం 92
3.5.35.వేణుగోపాలుని గిరిక ఐక్యమవడం 92
3.5.36.గోపన్న మరణం 93
3.5.37.మంగమ్మ ప్రాయశ్చిత్తం– మరణం 93
3.5.38.అరుంధతి మరణం 93
3.5.39.హరప్ప యోగ మరణం 94
3.5.40.రంగారావులో పరివర్తన – మరణం 94
3.5.41.పసరిక మరణం 94
3.5.42.గణాచారి మరణం 94
3.5.43.ధర్మరావుతో చిన్న అరుంధతి ప్రస్తావన 94
3.5.44.ధర్మరావు – చిన్న అరుంధతి వివాహం 95

నాల్గవ అధ్యాయం

## రేడియో నాటకీకరణ విధానం– శ్రవ్య నాటక లక్షణ సమన్వయం

(పుటలు: 97–156)

4.1. రేడియో నాటకీకరణ 98
4.2. శ్రవ్యనాటక ముఖ్యాంశాలు 99
4.3. రేడియో నాటక ప్రసారాలు– గణపతి, వేయిపడగలు 99
4.4. హాస్య రచనగా గణపతి 100
4.5. శ్రవ్యనాటకంగా 'గణపతి' 101
4.6. గణపతి రేడియో నాటకం – హాస్య లక్షణాలు 102
4.7. గణపతి రేడియో నాటకం– హాస్య నాటక లక్షణాల సమన్వయం 106
4.8. గణపతి రేడియో నాటకం – శ్రవ్యనాటక లక్షణాలు సమన్వయం 109
4.9. 'గణపతి' రేడియో నాటకం–శ్రోత అనుభూతి 110
4.9.1.గణపతి పాత్ర బడి ప్రవేశం పిల్లల అల్లరి 110
4.9.2.రొట్టెను దొంగలించిన గణపతి–అత్త ఎత్తిపొడుపు మాటలు 113
4.9.3.గాడిద పై ఊరేగింపు సమర్థించుకున్న గణపతి 113
4.9.4.గిరజాలు పెంచడానికి ప్రయత్నాలు చేస్తున్న గణపతి 115
4.9.5.సింగమ్మ గణపతికి వివాహం చేసే ప్రయత్నం 115

| | |
|---|---|
| 4.9.6.గణపతి ఉద్యోగ ప్రయత్నాలు | 117 |
| 4.9.7.తల్లిని బాధించిన గణపతి | 119 |
| 4.9.8.పారిపోయిన గణపతి కాశికి వెళ్ళిన సింగమ్మ | 119 |
| 4.10. శ్రవ్యనాటక లక్షణాలు | 120 |
| 4.11. వేయిపడగలు రేడియో నాటకం – శ్రవ్యనాటక లక్షణాల సమన్వయం | 121 |
| 4.12. వేయిపడగల రేడియో నాటకం –శ్రోత అనుభూతి | 137 |
| 4.12.1.గణాచారి పాత్ర ప్రవేశం స్త్రీ సంభాషణ | 137 |
| 4.12.2. గోపన్న కబుర్లు | 138 |
| 4.12.3. కృష్ణమనాయుని పాత్ర ఆలయ ప్రవేశం | 138 |
| 4.12.4.కృష్ణమనాయుని స్వభావం | 139 |
| 4.12.4. కృష్ణమనాయుడు, ధర్మారావు సంభాషణ | 140 |
| 4.12.6. భయంతో రంగారావు | 140 |
| 4.12.7.సావిత్రమ్మ దుఃఖం | 140 |
| 4.12.8.ధర్మారావు ఊహల్లో అరుంధతి | 140 |
| 4.12.9. ధర్మారావు గిరిక సంభాషణ | 141 |
| 4.12.10. గంగాధర సోమాయజల ఇంటికి ధర్మారావు | 141 |
| 4.12.11. అరుంధతి కాపురం | 141 |
| 4.12.12. రంగాజమ్మ ఆరోగ్య స్థితి | 141 |
| 4.12.13. గిరిక భక్తిభావం | 144 |
| 4.12.14.పాత్రల మానసిక సంఘర్షణ | 144 |
| 4.12.15.ధర్మారావు అప్పు కోసం అన్వేషణ | 145 |
| 4.12.16.రాజమ్మ పాత్ర ప్రవేశం | 146 |
| 4.12.17.గణాచారి కోటలోకి ప్రవేశం | 146 |
| 4.12.18.సరోజిని దేవి ఆలయ ప్రవేశం | 146 |
| 4.12.18.సరోజని దేవి భర్త కోసం ఎదురుచూపులు | 147 |
| 4.12.19.సరోజనిదేవి ఆఖరి మాటలు | 147 |
| 4.12.20.రాజమ్మ, రంగన్న సంభాషణ | 148 |
| 4.12.21.హరప్ప ధర్మారావు పరిచయం | 148 |
| 4.12.22.పేరు లేని పాత్రల సంభాషణ | 149 |
| 4.12.23. చంద్రారెడ్డి కాలు బాధ | 149 |
| 4.12.24.గణాచారి పై చులకన భావంతో రామేశ్వరం | 150 |
| 4.12.25.శివరావు ఆలోచనా విధానం | 150 |

4.12.26.మంగమ్మను లోబరుచుకున్న రామేశ్వరం 151
4.12.27. ధర్మారావు స్వప్న వృత్తాంతం 152
4.12.28.రామేశ్వరం పై మంగమ్మ హేళనా భావం 152
4.12.29. అరంధుతి అనారోగ్యంతో బాధపడటం 153
4.12.30.రంగారావు సర్పదర్శనం 155
4.12.31.గిరిక భగవంతునిలో ఐక్యమైపోవడం 155
4.12.32.పసరిక మరణం 155
4.12.33.ధర్మారావు చిన్న అరుంధతితో వివాహం 156

ఐదవ అధ్యాయం

## గణపతి, వేయిపడగలు:

## రేడియో నాటకీకరణ పాత్ర పోషణ

(పుటలు: 157–181)

5.1.పాత్రపోషణ 157
5.2.గణపతి– రేడియో నాటకీకరణ –పాత్ర పోషణ 159
5.2.1. గణపతి 159
5.2.2. సింగమ్మ 161
5.2.3.నాగన్న 162
5.2.4.మాచమ్మ 163
5.2.5.రంగన్న(చాకలివాడు) 163
5.2.6. గరుడాచలం 164
5.2.7.మహదేవ శాస్త్రి 164
5.3. గణపతి రేడియోనాటకం లో నటించిన పాత్రలు పాత్రధారులు 164
5.4. వేయిపడగలు– రేడియోనాటకీకరణ – పాత్రపోషణ 165
5.4.1. గణాచారి 165
5.4.2.ధర్మారావు 166
5.4.3.అరుంధతి 167
5.4.4.రామేశ్వర శాస్త్రి 169
5.4.5.సావిత్రమ్మ 169

5.4.6.గోపన్న 171
5.4.7.కృష్ణమ నాయుడు 172
5.4.8. రుక్మిణమ్మ 173
5.4.9.రంగారావు 173
5.4.9.1. గిరిక 174
5.4.9.2. హరప్పనాయుడు 175
5.4.9.3.పసరిక 177
5.2.9.4.రామేశ్వరం 177
5.4.9.5.మంగమ్మ 178
5.4.9.6.జోస్యులు 179
5.5. వేయిపడగలు రేడియో నాటకంలో నటించిన పాత్రలు– పాత్రధారులు179

ఆరవ అధ్యాయం

## రేడియో నాటకీకరణ, మార్పులు,చేర్పులు:

## విమర్శనాత్మక పరిశీలన

(పుటలు: 182–234)

6.1.' గణపతి' రేడియో నాటకీకరణ మార్పులు చేర్పులు 183
6.1.1.గణపతి పాత్ర ప్రవేశంలో మార్పులు 183
6.1.2.నాగన్న, సింగమ్మ సంభాషణలో మార్పులు 184
6.1.3. గణపతి– గాడిద పై ఊరేగింపు సన్నివేశంలో జరిగిన మార్పులు 184
6.1.4.గణపతి గిరజాలు పెంచే ప్రయత్నం– సన్నివేశంలో మార్పు 185
6.1.5.గణపతి భోజన వేళలో వచ్చిన మార్పు 187
6.1.6.గణపతి అమాయకత్వంలో జరిగిన మార్పులు 190
6.1.7.గణపతి వంట పని– మార్పు 190
6.1.8.గణపతి నాటక సమయంలో జరిగిన మార్పు 191
6.1.9.మితిమీరిన గణపతి ప్రవర్తనలో మార్పులు 192
6.1.10. గణపతి పారిపోవడం లో జరిగిన మార్పు 193
6.2.వేయిపడగలు రేడియో నాటకీకరణ మార్పులు– చేర్పులు 194
6.2.1.గణాచారి ప్రవేశం 194
6.2.2. రామేశ్వర శాస్త్రి – సావిత్రమ్మ సంభాషణల్లో మార్పు 196

6.2.3.కృష్ణమనాయుని ప్రవేశం– సంభాషణలో మార్పు 198
6.2.4. రామేశ్వర శాస్త్రి గోపన్న సంభాషణలో మార్పు 199
6.2.5. కృష్ణమనాయుడు–రామేశ్వర శాస్త్రి కలయికలో మార్పు 200
6.2.6.సన్నివేశ కల్పనలో మార్పు 201
6.2.7 ధర్మారావు హరప్ప సంభాషణలో మార్పు 205
6.2.8. పసరిక ప్రవేశం – సంభాషణలో 206
6.2.9. రుక్మిణమ్మ ప్రవేశం– సంభాషణ 208
6.2.10. గిరక ప్రవేశం – సంభాషణ 209
6.2.11. ధర్మారావు ఆర్థిక స్థితి– సంభాషణ 210
6.2.12. రాజ్యలక్ష్మమ్మ శృంగారోపదేశం 211
6.2.13. అరుంధతి , ధర్మారావు– సంభాషణ 212
6.2.14. రామచంద్ర రాజు ప్రవేశం – సంభాషణ 216
6.2.15. సరోజనీదేవి ప్రవేశం–సన్నివేశం 216
6.2.16. కళాశాల ఉత్సవాల్లో మార్పులు 217
6.2.17.వర్ణనలో మార్పు 218
6.2.18.రామేశ్వరం గణాచారిని అవమానించడం 219
6.2.19.శివరావు, ధర్మారావు సంభాషణ 221
6.2.20.గిరిక మధురభక్తి 221
6.2.21.జోస్యులు ప్రవేశం 222
6.2.22. కిరీటి దుఃఖం– వివాహప్రస్తావన 223
6.2.23.సంభాషణలో మార్పు 224
6.2.24.ధర్మారావు రెండవ వివాహ ప్రస్తావన 225
6.3. గణపతి– వేయిపడగలు – రేడియో నాటకీకరణ – కుల వ్యవస్థ 225
6.4. గణపతి– వేయిపడగలు రేడియో నాటకీకరణ – విమర్శ 227
6.5.గణపతి, వేయిపడగలు రేడియో నాటకీకరణ – భాష 231
6.5.1. భాషాపదాలు 231
6.5.2.సామెతలు 233
ముగింపు (235-240)
ఉపయుక్తగ్రంథసూచిక (241-244)

# ప్రస్తావన

పరిశోధనాంశం– వివరణ:

నా పరిశోధనాంశం ''రేడియో నాటకాలుగా మారిన *గణపతి, వేయిపడగలు* నవలలు – విమర్శనాత్మక పరిశీలన'' సాహిత్యలోకంలో ఎన్నో ప్రక్రియలు వాటిలోని వైవిధ్యాన్ని పాఠకులకు విజ్ఞాన సంపదను ఇవ్వడమే కాకుండా ఆనందాన్ని కూడా సమకూరుస్తున్నాయి. రచనలో కొత్తదనం ఉంటేనే ప్రజలు వాటిని ఆస్వాదిస్తారు. ఈ నేపథ్యంలో నవలా సాహిత్యాన్ని పరిశీలించినప్పుడు ఇది ఎంతగానో పాఠకులను ఆకర్షించింది. నవలల ద్వారా వారి జీవన గమనాన్ని సరిదిద్దుకున్న వారు లేకపోలేదు. ఈనాడు నవలలను సినిమాలుగాను, సిరియల్ గాను ప్రసారం చేస్తున్నారు. ఈ క్రమంలోనే నవలలు రేడియోనాటకాలుగా ప్రసారమవుతూ శ్రోతలకు, ఆనందాన్ని అందిస్తున్నాయి. అయితే నవలలు రేడియోనాటకాలుగా మారినప్పుడు వాటిలో ఉన్న పాత్ర పోషణ, సంభాషణలోనూ, శిల్పంలోనూ వర్ణనలోనూ కొన్ని మార్పుటు చోటుచేసుకున్నాయి. వాటిని దృష్టిలో పెట్టుకుని రేడియోనాటకాలుగా మారిన *గణపతి, వేయిపడగలు* నవలలను తీసుకుని *''రేడియో నాటకాలుగా మారిన గణపతి, వేయిపడగలు నవలలు– విమర్శనాత్మక పరిశీలన''* పేరుతో ఈ పరిశోధన చేయాలనుకున్నాను.

పరిశోధనా లక్ష్యాలు:

ఒక నవల రేడియో నాటకంగా మారినప్పుడు జరిగే మార్పులను పరిశీలన చేయడం నా పరిశోధనా లక్ష్యం. గణపతి, వేయిపడగల నవలలు రేడియో నాటకాలుగా మారినప్పుడు అందులో వచ్చిన మార్పులను పరిశోధన చేయడం ప్రధానాంశం.

1. ఇతివృత్తంలో ఏమైనా మార్పులు చేశారా?

2. సంభాషణలను యథాతథంగా తీసుకున్నారా లేదా మార్పులు చేశారా?

3. వర్ణనలను రేడియో నాటకంగా చేసిన మార్పులు ఏమిటి? వాటిని శ్రోతలకు ఎలా ఆనందించారు.

4. నవలలో సుదీర్ఘమైన సంభాషణలు, వర్ణనలు సన్నివేశ కల్పనలు ఉంటాయి. వాటిని రేడియో నాటకంగా మార్చినప్పుడు ఎలాంటి మార్పులు చేశారు.

5. నవల నాటకంగా మారినప్పుడు పాటించే శిల్పాన్ని గుర్తించడం.

6.నవలను చదివినప్పుడు కలిగే అనుభూతి రేడియో నాటకంగా మారినప్పుడు ఆ అనుభూతి కలుగుతుందా లేదా?

ఇలాంటి పై అంశాలను నా పరిశోధనలో అధ్యయనం చేయాలనుకుంటున్నాను. దీనివల్ల ఒక నవల గానీ, కథ గానీ నాటకంగా, సినిమాగా మారే క్రమంలో ఎలాంటి జాగ్రత్తలు తీసుకోవాలో గుర్తించే అవకాశం కలుగుతుందని భావిస్తున్నాను. ఒక ప్రక్రియ నుండి మరొక ప్రక్రియకు మారే క్రమంలో వస్తువులో పెద్దగా మార్పులు రాకపోయినా, శిల్ప పరమైన, సాంకేతికాంశాలను జాగ్రత్తగా అధ్యయనం చేయాల్సిన అంశాలెన్నో ఉంటాయి. దీనిలో భాగంగానే ఈ పరిశోధనను చేయాలనుకున్నాను.

**పరిశోధన పరిధి:**

తెలుగులో ఎన్నో నవలలు రేడియో నాటకాలుగా మారాయి. ఆ క్రమంలోనేచిలకమర్తి లక్ష్మీనరసింహం గారి గణపతి[1]నవల (1917), విశ్వనాథ సత్యనారాయణగారి 'వేయిపడగలు' (1934) నవలలు రేడియో నాటకాలుగా మారాయి. అలా మారినప్పుడు వర్ణనాత్మక అంశాలు శ్రోతలకు చేరడానికి ఎలాంటి జాగ్రత్తలు తీసుకున్నారనే అంశంపై దృష్టిని కేంద్రీకరించడం నా పరిశోధనా పరిధి. ముఖ్యంగా ఈ రెండు నవలలు రేడియోనాటకాలుగా మారినప్పుడు వర్ణనలు, సంభాషణలు, శ్రోతలకు చేరడానికి తీసుకున్న సాంకేతికమైన విషయాలను అధ్యయనం చేయడమే నా పరిశోధనలో ప్రధాన పరిధి. ఈ పరిశోధనలో గణపతి నవల, వేయిపడగలు రేడియోనాటకాలుగా వచ్చిన వాటిని తులనాత్మకంగా పరిశీలించడం కూడా నా పరిశోధనా పరిధిలో భాగంగానే భావిస్తున్నాను.

**పరిశోధన పద్ధతి:**

నవల నాటకంగా, రేడియో నాటకంగా, సినిమాగా మారేటప్పుడు కథ ఒకటే ఉన్నా వర్ణనలు, పాత్రలు, సన్నివేశాలు రంగ విభజనలుమారుతూ ఉంటాయి.

[1]గణపతి నవలను 1920లో ప్రచురించినట్లు చాలామంది పేర్కొంటున్నారు.

అందువల్ల నా పరిశోధనాంశానికి సంబంధించి రేడియోనాటకాలుగా మారిన గణపతి, వేయిపడగల నవలలు స్క్రిప్టు సంపాదించాను. అయితే, వేయిపడగలు నవల రేడియో నాటకం స్క్రిప్టుగా మారినది కొన్ని భాగాలు మాత్రమే దొరికాయి. మిగతావి దొరకలేదు. వాటిని మరలా స్క్రిప్టుగా రాసుకున్నాను. ఆ స్క్రిప్టుని మూలంలోని నవలలను తులనాత్మకంగా పరిశీలించాను. నవలలోని అంశాలను యథాతథంగా ఏమైనా తీసుకున్నారా లేదా అనే అంశాలని పరిశీలించాను. శ్రవ్య కావ్యం శ్రవ్య నాటకంగా మారినప్పుడు పాటించవలసిన లక్షణాలను వివిధ సిద్ధాంతాల గ్రంథాల ఆధారంగా విశ్లేషించాను. దీనితో పాటు ఆ లక్షణాలకు ఒదగని వాటికి వారు చేసిన ప్రయోగాలను గుర్తించాను. ఇలా తులనాత్మక విశ్లేషణ పద్ధతి (Comparative Analysis) లో పూర్తిచేశాను.

**పూర్వ పరిశోధనలు:**

నవలల మీద , నాటకాల మీద అనేక పరిశోధనలు జరిగాయి. నాకు తెలిసినంతవరకు రేడియో నాటకాలుగా మారిన నవలల మీద పరిశోధన జరగలేదు. గణపతి, వేయిపడగలు నవలలు శ్రవ్యనాటకాలుగా మారిన తర్వాత వాటిని రేడియో నాటకాల దృష్ట్యా ఎవరూ పరిశోధన చేయలేదు. అందువల్ల ప్రప్రథమంగా వీటిమీద పరిశోధన చేయడం ద్వారా కొన్ని శిల్ప పరమైన అంశాలను తెలిసే అవకాశం ఉందనుకుంటున్నాను.

**ఫలితాంశాలు:**

''రేడియో నాటకాలుగా మారిన గణపతి, వేయిపడగలు నవలలు– విమర్శనాత్మక పరిశీలన'' అనే అంశంపై పరిశోధన చేశాను. గణపతి,వేయిపడగల రేడియో నాటకాలలో వచ్చిన మార్పుల్ని, ధ్వని విశేషాలను పాత్ర చిత్రణలోనూ, పాత్ర సంభాషణల్లోనూ వచ్చిన మార్పుల్ని తులనాత్మకంగా పరిశీలించాను. ఈ నేపథ్యంలోనే ఈ పరిశోధనను అధ్యయన సౌలభ్యం కోసం సిద్ధాంత గ్రంథాన్ని ప్రధానంగా ఆరు అధ్యాయాలుగా విభజించాను.

మొదటి అధ్యాయం **''చిలకమర్తి లక్ష్మీనరసింహం – విశ్వనాథ సత్యనారాయణల సాహిత్య కృషి''** ఈ అధ్యాయంలో చిలకమర్తి, విశ్వనాథ సత్యనారాయణ జీవిత వివరాలను తెలిపాను. ఇందులో ప్రధానంగా వారి

విద్యాభ్యాసం, వారు జీవితాలలో ఎదుర్కున్న ఒడిదుడుకులు, వారు పొందిన అవార్డులు, వారు పొందిన గౌరవాలను సంక్షిప్తంగా వివరించాను.

నాటక సాహిత్యంలోనూ, నవలా సాహిత్యంలోనూ ఒకరిద్దరికి ప్రత్యేక స్థానం ఉంది. చిలకమర్తి వారి ద్రౌపది పరిణయం, గయోపాఖ్యానం, పార్వతీ పరిణయం వంటి ప్రసిద్ధ నాటకాలను పరిచయం చేశాను. అలాగే విశ్వనాథ సత్యనారాయణ ధన్య కైలాసం,నర్తనశాల,వేనరాజు వంటి నాటకాలను సంక్షిప్తంగా వివరించాను. ఆ నాటక ప్రాముఖ్యతను వివరించాను. ఈ నాటకాలపై వచ్చిన ప్రముఖుల అభిప్రాయాలను తెలిపాను. అలాగే చిలకమర్తి నవలల్లో రామచంద్ర విజయం, రాజారత్నం, సౌందర్యతిలక(చారిత్రక నవల)లోని ఇతివృత్తాన్ని వివరించాను. విశ్వనాథ వారి *ఏకవీర, దేవతల యుద్ధం, హాహాహూహూ* మొదలైన నవలలను పరిచయం చేశాను.

నా పరిశోధనలో రేడియోనాటకాలుగా ప్రసారమైన గణపతి, వేయిపడగలు నవలలను తీసుకున్నాను. కనుక ఈ రచనల నవల మూలరచయితలైన చిలకమర్తి లక్ష్మీనరసింహం, విశ్వనాథ సత్యనారాయణగారలు నవలా సాహిత్యంలో చేసినటువంటి కృషిని ఈ అధ్యాయంలో వివరించాను.

రెండవ అధ్యాయం‘‘**దృశ్య,శ్రవ్య నాటక వికాసం గణపతి, వేయిపడగల నవలలు పరిచయం**’’ ఈ అధ్యాయంలో నాటకాన్ని నిర్వచించి నాటకం ఎక్కడ నుండి అభివృద్ధి చెందింది దాని పుట్టు పూర్వోత్తరాలను తెలియజేశాను. ఈ నేపథ్యంలో పౌరాణిక, చారిత్రక, ప్రచార,మనస్తత్త్వ నిరూపణ, విషాద రూపకాలను పరిచయం చేశాను. ప్రస్తుత కాలంలో రేడియో నాటకాలు ఎంతవరకు ప్రాముఖ్యతను సంతరించుకున్నాయో వివరించాను. రేడియో నాటకాల చరిత్రను విశ్లేషించాను. శ్రవ్యనాటకాలు అందరికి ఆమోదయోగ్యంగానూ ఆనందాన్ని అందించేవిగానూ ఉన్నాయి. అయితే శ్రవ్యనాటక లక్షణాలు, పరిమితులు తెలుసుకున్నప్పుడే శ్రవ్యనాటకం చక్కగా రూపుదిద్దుకుంటుంది. కావున శ్రవ్యనాటకానికి ఉండవలసిన పరిమితులను, రేడియో నాటకీకరణ విధానాన్ని ఈ అధ్యాయంలో వివరించాను. గణపతి, వేయిపడగల నవలలను పరిచయం చేశాను.

మూడవ అధ్యాయం **'గణపతి, వేయిపడగల నవలలు ఇతివృత్త పరిచయం'** ఈ అధ్యాయంలో ఇతివృత్తం అంటే ఏమిటో పరిచయం చేసి గణపతి,వేయిపడగల నవలల నిర్మాణ వైఖరిని వివరించాను. గణపతి ,వేయిపడగలు ఇతివృత్తాలను పరిచయం చేశాను. కథా సారాంశాలను పరిచయం చేసేటప్పుడు గణపతి చేష్టల్ని ఆయా సందర్భాలను అనుసరించి వివరించాను. గణపతి నవల రాయడానికి గల కారణాలను, ధన సంపాదన కోసం గంగాధరుని ప్రయత్నం, గణపతి జననం,గణపతి గిరజాల కోసం పడే పాట్లు, గణపతికి కోటు తొడుక్కోవాలనే ఆశ, ఇలా గణపతి ఆయా సన్నివేశాలలో పాత్రలతో సంభాషించిన తీరు అతని ప్రవర్తనను సవివరంగా పేర్కొన్నాను. అలాగే వేయిపడగల నవలలోని కథా సారాంశాన్ని సుబ్బన్నపేట వృత్తాంతం, జమిందారు కోట యొక్క వివరాలు,కృష్ణమనాయుడి ఉదార స్వభావం, ధర్మారావు దారిద్ర్యం, రంగారావు పట్టాభిషేకం, ధర్మారావు వివాహం,ఇలాంటి విషయాలన్ని సంక్షిప్తంగా ఈ అధ్యాయంలో వివరించాను.

నాల్గవ అధ్యాయం ''**రేడియో నాటకీకరణ విధాన పరిశీలన–శ్రవ్యనాటక లక్షణ సమన్వయం.**'' గణపతి, వేయిపడగల రేడియో నాటకాల భాగాలను తెలిపాను. గణపతి గంట సేపు నాటకం, వేయిపడగలు ధారావాహికంగా ప్రసారమయ్యింది వీటిని వివరించి తెలిపాను. నాటకంలో అంక, రంగ విభజనలు సూచిస్తారు. కాని రేడియో నాటకంలో అలా విభజించడం వీలుకాదు కనుక సంభాషణ పూర్తయిన తర్వాతనో, లేదా తర్వాతి సంభాషణ రాబోతుండగానో సంగీత విరామాన్ని సూచిస్తారు. అలాగే నేపథ్య సంగీతాన్ని ఎక్కడ ఉపయోగించారో వివరించాను.

ఈ అధ్యాయంలో రేడియో నాటకీకరణ ఏవిధంగా జరిగింది. శ్రవ్యనాటకానికి ఉండవలసిన ముఖ్య లక్షణాలను వివరించాను. శ్రవ్య నాటక లక్షణాలను పేర్కొని ఆ లక్షణాలు గణపతి, వేయిపడగల నవలల్లో ఏ సన్నివేశాలలో అన్వయమవుతాయో వివరించాను. అలాగే గణపతి నవల హాస్య నవల అందువలన రేడియోలో హాస్య నాటకంగానే ప్రసారం చేశారు కనుక గణపతి నవల యొక్క ప్రాధాన్యతను వివరించాను హాస్యనాటక లక్షణాలను పేర్కొని వాటిని గణపతి రేడియో నాటకానికి అన్వయించి విశ్లేషించి వివరించాను. అలాగే శ్రోత రేడియో నాటకం వింటున్నప్పుడు

శ్రోతకు కలిగే అనుభూతుల్ని తెలిపాను. అలాగే నవలల్లో చెప్పిన విధానాన్ని రేడియో నాటకంలో శ్రోత వినడానికి అనువుగా ఏ విధమైన ధ్వని సంకేతాలను ఉపయోగించారో వివరించాను. నవల చదివేటప్పుడు పాఠకుడు పొందే అనుభూతి నాటకం వింటున్నప్పుడు ఆ అనుభూతి కలుగుతుందా లేదా అని ఒక శ్రోతగా నేను పొందిన అనుభూతిని వివరించాను. గణపతి,వేయిపడగలు నవలలోని వర్ణనలను, పాత్రల మనోభావాలను రేడియో నాటకం వింటున్న శ్రోతకు ఏవిధంగా అందించారు. వంటి అంశాలన్ని ఈ అధ్యాయంలో వివరించాను.

గణపతి రేడియో నాటకంలో వేషగతమైన హాస్యం సన్నివేశాలలో ఉపయోగించారు. చేష్టాగతమైన హాస్యం, మాటల ద్వారా కలిగే హాస్యం ఇలా హాస్య లక్షణాలను గణపతి ప్రవర్తనలో ఏ సన్నివేశంలో ఏ పాత్ర సంభాషణ ద్వారా అన్వయించబడ్డాయో వివరించాను. రేడియో నాటకంలోనూ గణపతి రూపురేఖలను శ్రోతకు అర్థంకావడానికి బడిలోని పిల్లవాడిచేత వర్ణింపచేయడం గుఱ్ఱం అని తెలియడానికి గుఱ్ఱం చేసే శబ్దాలను శ్రోతకు ఏవిధమైన ధ్వనితో వినిపించారు. గణపతికి గాడిదను ఎక్కాలనే కోరికతో, గుఱ్ఱానికి గాడిదకు తారతమ్యాన్ని తెలుపుతూ కలిగినవాడు గుఱ్ఱాన్ని లేనివాడు గాడిదను ఎక్కతాడని పైగా అన్నివిధాలా గాడిదే శ్రేష్ఠమైందని గాడిద గొప్పతనాన్ని రంగడు తో వివరించే సందర్భంలో గాడిద అరుపులను స్పష్టంగా శ్రోతకు తెలియజేసిన విధానాన్ని గుర్తించి పేర్కొన్నాను. అలాగే వేయిపడగలలో చినుకుల శబ్దాలను, మంత్రాలు చదివేటప్పుడు, గంటల శబ్దం వచ్చినప్పుడు అది దేవాలయ వాతావరణమని శ్రోత గ్రహించేలా నాటకం మలచిన తీరును వివరించాను. సర్పం వచ్చిందని తెలియడానికి నాగస్వరం, ఏనుగు ఘీంకారం యొక్క శబ్దాలను వినిపించడం, ఇలాంటి శబ్దాల ద్వారా రేడియో నాటకంలో జరిగే ప్రతి విషయాన్ని శ్రోత సులభంగా గ్రహించగలుగుతాడు వాటిని దృష్టిలో పెట్టుకుని దృశ్యనాటకాన్ని చూసినంత అనుభూతిని రేడియో నాటకం వినే శ్రోతకు కలగాలని రేడియో నాటకంలో జరిగే ప్రతి ధ్వనిని , పాత్రలు వారి హావభావాలను వ్యక్తీకరించిన విధానాన్ని శ్రోత ఏ విధంగా గ్రహించగలుగుతాడో విశ్లేషించి వివరించాను.

**ఐదవ అధ్యాయం ''గణపతి, వేయిపడగలు, రేడియో నాటకీకరణ: పాత్ర పోషణ''** ఈ అధ్యాయంలో పాత్ర చిత్రణ అంటే ఏమిటో వివరించాను. గణపతి, వేయిపడగలు రేడియో నాటకంలోని ప్రధాన పాత్రలను పేర్కొన్నాను. పాత్రల మనోభావాలను, వారు సంభాషించిన తీరు వంటి అంశాలన్ని ఈ అధ్యాయంలో తెలిపాను.

గణపతి రేడియో నాటకంలో గణపతి, సింగమ్మ, నాగన్న మాచమ్మ, రంగన్న, గరుడాచలం, మహదేవయ్య శాస్త్రి, పాత్రలను, వేయిపడగల రేడియో నాటకంలో గణాచారి, ధర్మారావు, అరుంధతి, రామేశ్వర శాస్త్రి, సావిత్రమ్మ, గోపన్న, కృష్ణమనాయుడు, రుక్మిణమ్మ, రంగారావు, గిరిక, హరప్పనాయుడు, పసరిక, రామేశ్వరం, మంగమ్మ, జోస్యులు వంటి ముఖ్య పాత్రలను సంక్షిప్తంగా వివరించాను.

ఆరవ అధ్యాయం ***''రేడియో నాటకీకరణ మార్పులు-చేర్పులు విమర్శనాత్మక పరిశీలన''*** ఈ అధ్యాయంలో గణపతి, వేయిపడగల నవలలోని వర్ణనలోను సంభాషణ విధానంలోనూ సన్నివేశ చిత్రీకరణలోనూ వచ్చిన మార్పుల్ని, చేర్పుల్ని వివరించాను. గణపతి, వేయిపడగల రేడియో నాటకంలోని కులవ్యవస్థను, విమర్శనాత్మక అంశాలను, భాషా పదాలను, సామెతలను నా దృష్టికి వచ్చినంతవరకు వివరించాను.

గణపతి, వేయిపడగల నవలలో చిత్రీకరించిన విధానం రేడియోనాటకాలుగా మారినప్పుడు ఆయా సన్నివేశాలలోనూ, సంభాషణలోనూ ఎటువంటి మార్పులు చేశారు అనేదాన్ని మీద దృష్టి కేంద్రీకరించి వివరించాను. నవలలో ఉన్న సన్నివేశాలు రేడియో నాటకంలో రక్తికట్టించడానికి చమత్కారమైన సంభాషణలతో వ్యక్త పరచడం నేను గమనించాను.

నవలలో గణపతి కృష్ణ వేషం వేసినప్పుడు అతను స్టేజి మీద భయంతో ఉంటాడు. అతని పేరు కృష్ణుడని చెప్పడానికి బదులు నా పేరు గణపతి అని చెప్పడంతో అక్కడ హాస్యం పుడుతుంది. ఇదే సన్నివేశాన్ని నాటకంలో గణపతి కృష్ణవేషం వేసి స్టేజి మీదకు వచ్చి నిద్రపోతాడు పక్కనున్న రంగన్న అతి కష్టం మీద నిద్రలేపుతాడు. ఆ నిద్ర మత్తులో తాను కృష్ణుడని చెప్పడానికి బదులు తన పేరు 'గణపతి' అని ఊరు 'మందపల్లి' అని చెప్పిన సమాధానాలు అందరికి నవ్వు

పుట్టిస్తాయి. ఈ విధమైన చిన్న చిన్న మార్పులను గమనించి ఈ అధ్యాయంలో వివరించాను. వేయిపడగల నవలలో తక్కువగా కనబడిన పాత్రలను నాటకంలో వారి పాత్ర సంభాషణ ఎక్కువగా కనబడటం గమనించాను. ఉదాహరణకు గోపన్న పాత్ర సంభాషణ నవలలో తక్కువగా కనబడుతుంది. నాటకంలో రామేశ్వర శాస్త్రి,కృష్ణమనాయుడితో గోపన్న పాత్ర సంభాషణ విస్తారంగా ఉండడం గమనించాను. ఇటువంటి మార్పులను, చేర్పులను క్షుణ్ణంగా పరిశీలించి ఈ అధ్యాయంలో వివరించాను.

చివరిలో నా పరిశోధన పరిధులను వివరిస్తూనే, నా అవగాహన మేరకు భవిష్యత్తులో చేయదగిన పరిశోధనాంశాలను సూచించాను.

మొదటి అధ్యాయం

# చిలకమర్తి లక్ష్మీనరసింహం, విశ్వనాథ సత్యనారాయణల సాహిత్య కృషి

నా పరిశోధనాంశం *'రేడియో నాటకాలుగా మారిన గణపతి, వేయిపడగల నవలలు–విమర్శనాత్మక పరిశీలన'* అందువలన గణపతి, వేయిపడగల రచయితలు చిలకమర్తి, విశ్వనాథలు కాబట్టి సాహిత్యానికి వారు చేసిన కృషిని తెలుసుకోవాల్సిన అవసరం ఉందనిపించింది. అందువలన ఈ అధ్యాయంలో ముందుగా సాహిత్యం గురించీ, తర్వాత చిలకమర్తి, విశ్వనాథ జీవిత వివరాలను సంక్షిప్తంగా పరిచయం చేసి నాటక రంగంలో, నవలా రంగంలో వారు చేసిన కృషిని ఈ అధ్యాయంలో తెలియజేస్తాను.

సాహిత్యం అంటే పాఠకులకు జ్ఞాన సముపార్జనను చేకూర్చేది. హితోపదేశంతో కూడిన సాహిత్యం పాఠకుల చిత్త వృత్తుల మీద ప్రభావం చూపి వారిని సన్మార్గంలో నడిపించడానికి తోడ్పడుతుంది. సాహిత్యం అనేది ఒక సంప్రదాయం. సంప్రదాయమంటే సంక్రమించడం అనాది కాలం నుండి సాహిత్యం తర తరాల సామాజిక విశేషాలను అందింపజేస్తూ తనకంటూ ఒక ప్రత్యేకతను నిలుపుకుంది. ఈ సాహిత్యాన్ని ఆసరాగా తీసుకుని, రచయితలు, రచయిత్రులు తమ ప్రతిభా పాటవాలతో రచనల ద్వారా తెలుగు సాహిత్యానికి మెరుగులు దిద్దారు. ఇటువంటి సాహిత్యాన్ని సఫలీకృతం చేసిన వారిలో చిలకమర్తి లక్ష్మీనరసింహం, విశ్వనాథ సత్యనారాయణలను ముఖ్యంగా పేర్కొన వచ్చు. వీరు ఆదర్శవంతమైన జీవితాలను గడుపుతూ పాఠకుల హృదయాలలో చిర స్థానాన్ని సంపాదించుకున్నారు. ''సహితస్య భావః సాహిత్యమ్'' సాహిత్యం ధర్మాది సకల శాస్త్ర రహస్యములతో సహితమైనది. ప్రకృతి సత్యమును సౌందర్యవంతం చేసి ఆనంద

పర్యవసానంగా చిత్రించేది సాహిత్యము''[1]సరిగ్గా పై నిర్వచనానికి అనుగుణంగా చిలకమర్తి, విశ్వనాథ సత్యనారాయణ. వీరు తమ రచనలలో జీవిత సత్యాలను వెల్లడించారు. సాహిత్య ప్రయోజనాన్ని పాఠకలోకానికి చాటిచెప్పిన వ్యక్తులుగా వీరు పేరు గడించారు.

### 1.1.**చిలకమర్తి – జీవితం**(1867–1945):

''పశ్చిమ గోదావరి జిల్లా ఖండ వల్లి గ్రామంలో 1867 సెప్టెంబర్ 26 న చిలకమర్తి జన్మించారు. ఆయన తల్లిదండ్రులు రత్నమ్మ, వెంకయ్యలు వీరు మొదట పెట్టిన పేరు పున్నయ్య ఆ తర్వాత లక్ష్మీనరసింహం అని పిలిచేవారు అదే స్థిరపడిపోయింది. లక్ష్మీనరసింహం చదువు వీరవాసరం, కొండపల్లి, తణుకు, నర్సాపురం పాఠశాలల్లో సాగింది. రాజమండ్రిలో 1886 లో మెట్రిక్యులేషన్ ఉత్తీర్ణులయ్యారు. 1892లో ప్రథమ శాస్త్ర పరీక్షలో ఉత్తీర్ణులు కాలేక చదువు విరమించుకొని ఉపాధ్యాయ వృత్తిలో రాజమండ్రిలో స్థిరపడ్డారు. కందుకూరి వీరేశలింగం అభిమానిగా సంఘ సంస్కరణకు తన వంతు చర్యలు చేపట్టారు. భరత ఖండంబు చక్కని పాడి ఆవు.....'' అనే పద్యం ద్వారా దేశభక్తి గీతాలకు ఆయన పాదులు వేశారు. దళితుల కోసం 1907 లో 'రామ మోహన పాఠశాల' ను ఆర్యాపురంలో అగ్ర వర్ణాల వారు నివసించే ప్రాంతంలో ప్రారంభించారు. అలాగే వయోజనుల కోసం 'వివేకానంద రాత్రి పాఠశాలను 1916లో స్థాపించారు.

టంగుటూరి ప్రకాశం పంతులు గురువు గారైన ఇమ్మానేని హనుమంతరావు నాయుడు స్థాపించిన హిందూ నాటక సమాజానికి నాటక రచయితగా చిలకమర్తి వారు సహకరించేవారు. ధవళేశ్వరంలో తొలిసారిగా చిలకమర్తివారు అష్టావధానాన్ని నిర్వహించారు. 1889లో ఆయన తొలి నాటకం 'కీచక వధ' రాశారు. ఆ తర్వాత ద్రౌపది పరిణయం, శ్రీరామ జననం, గయోపాఖ్యానం, పారిజాతాపహరణం, నల చరిత్ర, సీతారామ కళ్యాణం, మొదలైన నాటకాలు రాశారు. 1920 లో సత్యవోలు గున్నేశ్వర రావు ప్రోత్సహించడంతో చిలకమర్తి వారు పద్యనాటకాలు రాయ సాగారు. గయోపాఖ్యానంలో అప్పుడు పద్యాలు చొప్పించారు. పలు సంస్కృత నాటకాలను చిలకమర్తి వారు ఆంధ్రీకరించారు. పార్వతీ పరిణయం

---

[1]నాగయ్య, జి. తెలుగు సాహిత్య సమీక్ష,పుట:04.

ఆయన తొలి ఆంధ్రీకరణ ఆ తర్వాత భాసుని నాటకాలను తెలుగు చేసి ప్రచురించారు. చిలకమర్తి వారికి మొదట్లో రేచీకటి ఉండేది క్రమేపి 1910 నాటికి పగలు పూట చూపు కూడా పోయింది. చింతామణి పత్రిక నిర్వహించిన నవలల పోటీల్లో వరుసగా మూడేళ్లు చిలకమర్తి వారి నవలలు 'హేమలత' 'సౌందర్య తిలక' 'అహల్యాబాయ్' ప్రథమ బహుమతులు అందుకున్నాయి.

తెలుగు సాహిత్యంలో అజరామరమైన హాస్య నవల 'గణపతి' చిలకమర్తివారి సృష్టే. చిలకమర్తి వారు 'సరస్వతి' 'మనోరమ' 'దేశమాత' పత్రికలు స్థాపించి సంపాదకులుగా వ్యవహరించారు. 1911లో తెలుగుదేశంలో వ్యాపించిన వ్యావహారిక, గ్రాంథిక భాష ఉద్యమాలలో చిలకమర్తి వారు గ్రాంథిక భాష వైపు మొగ్గుచూపారు. 1922 లో ఋగ్వేదంలోని ఒక మండలాన్ని ఆయన తెలుగు చేశారు. 1928 మార్చి11 న చిలకమర్తి వారి షష్ఠి పూర్తి మహోత్సవం జరిగింది.

అప్పుడు ఈయన రచనలు పది సంపుటాలుగా ప్రచురించారు. 'ఆంధ్ర స్కాట్' గా విఖ్యాతుడైన చిలకమర్తి లక్ష్మీనరసింహం నవలలు, నాటకాలు, ప్రహసనాలు మొత్తం 96 రచించారు. 1934లో ఆంధ్ర కళా పరిషత్తు చిలకమర్తి వారిని' కళా ప్రపూర్ణ' బిరుదుతో సత్కరించింది. 1944లో ఆంధ్ర అభ్యుదయ రచయితల సంఘం చిలకమర్తి లక్ష్మీనరసింహం స్వీయచరిత్రను ప్రచురించింది. 1945 ఏప్రిల్ 17 న ఈ ప్రజ్ఞా నిధి పశ్చిమ గోదావరి జిల్లా కాకర గ్రామంలో స్వర్గస్థులయ్యారు.'' పై వివరాలన్నిబి.వి.వి.ఎస్. ఎస్. కామేశ్వరరావు chilakamarthi.wordpress.com లో పొందుపరిచారు.[2] చిలకమర్తివారి జీవిత వివరాలను గమనిస్తే చిలకమర్తి వారు ఎంతటి ఆదర్శప్రాయులో తెలుస్తుంది. ఒక రచన యొక్క తీరు తెన్నులను బట్టి రచయిత వ్యక్తిత్వాన్ని కొంతవరకు అంచనా వేయవచ్చు. చిలకమర్తి వారు చేసిన సాహిత్య సేవలోనే అతని వ్యక్తిత్వం ఎటువంటిదో అర్థమవుతుంది.

### 1.2. విశ్వనాథ – జీవితం(1895-1976):

'ఆంధ్రదేశంలోని కృష్ణా మండలంలో నందమూరు గ్రామంలో విశ్వనాథ సత్యనారాయణ 1895 సెప్టెంబర్ 10 వ తేదిన జన్మించారు. విశ్వనాథ వారి తల్లిదండ్రులు పార్వతీ శోభనాద్రులు. విశ్వనాథ విద్యాభ్యాసం బందరులో జరిగింది.

[2] chilakamarthi.wordpress.com

త్రివిక్రమ రామారావు చెళ్ళపిళ్ళ వేంకట శాస్త్రి గుంటూరు విరూపాక్ష పీఠాధిపతులు కళ్యాణ నంద భారతీ స్వామివారూ వేదాంతంలో , సాహిత్యంలోనూ విశ్వనాథ గురువులే. 1917 నాటికి ఆంధ్రోద్యమ ప్రాబల్యంతో ఆంధ్ర పౌరుషం వచ్చింది. 1920 నాటికి ఇంచుమించుగా ఒక నవల (అంతరాత్మ), ఒక నాటకం (ధన్య కైలాసం) రచించారు. బాల మిత్రుడు కొడాలి ఆంజనేయులుతో జంట కవిగా ఆయన తొలినాళ్లలోనే రచనలు చేశారు. సాహితీ సమితిలో చేరి కాల్పనికోద్యమ సాహిత్యాన్ని సృష్టించారు. గిరి కుమారుని ప్రేమగీతాలు, కిన్నెరసాని పాటలు, వేనరాజు, మా స్వామి, అనార్కలి (1920-30) ఆ కాలంలో రచించిన ప్రముఖ రచనలు.1932 లో విశ్వనాథ మొదటి భార్య వరలక్ష్మీమరణించింది. ఆయన దుఃఖంలో మునిగిపోయారు. అయినా వెంటనే తేరుకుని ఒక వైపు 'వేయిపడగలు', మరో వైపు 'శ్రీమద్రామాయణ కల్పవృక్షం' రెండు ఇతిహాసాల రచన సాగింది. వేయిపడగలు సుమారు నెలరోజుల్లో పూర్తయినా శ్రీమద్రామాయణ కల్పవృక్షం 1961 దాకా (దాదాపు 28 సంవత్సరాలు సాగింది) రచిస్తూ వచ్చారు.

ఆయన సాహిత్య సృజన 1946 లో ఆయన శరీరాన్ని విడిచే దాకా అవిశ్రాంతంగా సాగుతూనే వచ్చింది. కవిత్వ మార్గంలో కావ్యాలు, ఖండ కావ్యాలు, ముక్తకాలు, ఉదాహరణము, శతకాలు, ప్రబంధాలు, శ్రీమద్రామాయణ కల్పవృక్ష రూపంగా ఇతిహాసం ఇలా విస్తారమూ, వైవిధ్య భరితమైన రచనలు చేశారు. దేశి పద్ధతిలో విశ్వనాథ మధ్యాక్కరలు, కిన్నెరసాని పాటలు, కోకిలమ్మ పెళ్ళి , పాము పాట, ఇంకా ఎన్నో వాసిలోను, రాశిలోనూ అత్యంత ప్రతిభాకాంతుల్ని చిందించే ఈ కవితా సృష్టి కనీసం 25 వేల పద్యాలకు తగ్గి ఉండదు. అలాగే ఆయన గద్య రచన విస్తృతమైందే 62 నవలలు, 10 కి పైగా రూపకాలు, 10 కి పైగా విమర్శా గ్రంథాలు, వ్యాసాలు, ప్రసంగాలు ఎన్నో వచన రచనలో సాధారణంగా ఆయన చెప్తూ ఉండగా ఎవరో వ్రాసిందే. ఆయన చెపుతూ ఉన్న వేగాన్ని ఆ వేగాన్ని అందిపుచ్చుకున్న లేఖకుడు రాయాల్సిందే. విశ్వనాథను ఆంధ్ర సారస్వత ప్రపంచం కవి సమ్రాట్టుగా కీర్తించింది. ఆంధ్రప్రదేశ్ సాహిత్య అకాడమికి విశిష్ట సభ్యులుగా, ఉపాధ్యక్షులుగా ఉన్నారు. కేంద్ర సాహిత్య అకాడమి ఫెలోగా ఆయనను గౌరవించింది. తెలుగులో

తొలిసారిగా జ్ఞానపీఠ అవార్డు అందుకున్నారు.''[3]వీరి రచనలలో భారతీయ నాగరికత మౌలికంగా వ్యక్తమవుతుంది. అయినప్పటికి ఆంధ్రదేశాన్ని, ఆంధ్ర జాతిని, ఆంధ్రుల ఆచార వ్యవహారాలను తమ రచనలకు ఉచ్ఛ్వాస, నిశ్వాస ప్రాయంగా చేసిన వారిలో శ్రీనాథుని తర్వాత 'విశ్వనాథనే చెప్పాలి.[4] విశ్వనాథ సత్యనారాయణ గురించిన వివరాలను పరిశీలిస్తే సాహిత్య ప్రపంచానికి ఆయన చేసిన సేవ ఎటువంటిదో తెలుస్తుంది.

### 1.3. **నాటక సాహిత్యంలో చిలకమర్తి – విశ్వనాథల కృషి:**

తెలుగు సాహిత్యంలో నాటకానికి విశేషమైన స్థానం ఉంది. నేను నాటక సాహిత్యాన్ని రెండవ అధ్యాయంలో పరిచయం చేశాను. ఇక్కడ చిలకమర్తి నాటక కథా సారాంశాలను పేర్కొంటున్నాను.

### **1.3.1. చిలకమర్తి నాటకాలు – సంక్షిప్త పరిచయం:**

నాటక సాహిత్యంలో చిలకమర్తికి అగ్ర స్థానం ఉంది. ఈయన రాసిన నాటకాలను ఈ క్రింది పరిచయం చేస్తున్నాను.

### 1.3..2.**ద్రౌపది పరిణయం(1960)**:

ఇందులోని కథా సారాంశాన్ని పరిశీలిస్తే ఈ నాటక ప్రారంభంలో నాంది శ్లోకం ఉంటుంది. నాంది శ్లోకం తర్వాత సూత్రధారుడు, నటి ప్రవేశిస్తారు. వారి సంభాషణ రూపంలో అంధుడైన చిలకమర్తి లక్ష్మీనరసింహం పంతులు గారు ఈ నాటకాన్ని కూర్చారని తెలుస్తుంది. సూచన ప్రాయంగా ద్రౌపది ఐదుగురు భర్తలను పొందిన విషయాన్ని అంధుడైన ధృతరాష్ట్రుడు యోగ్యుడైన సుతున్ని యువరాజుగా చేయడానికి ఇష్టపడుతున్నాడని ఇలా కథలోని ప్రధానమైన విషయాన్ని ప్రస్తావన రూపంలో సూచన ప్రాయంగా తెలియజేయబడుతుంది. ఐదు అంకాలతో ఈ నాటకం కొనసాగుతుంది.ఈ నాటకంలోని కథా వస్తువు ప్రఖ్యాతమైందే కాని ధృతరాష్ట్రుడు ధర్మరాజును యువరాజును చేయడానికి సమ్మతించడం దానికి విదురుడు సంతోషిస్తాడు. కాని దుర్యోధనుడు పాండవులను వారణావతానికి వెళ్లిపోవాలని లేదంటే నేను మరణిస్తానని బెదిరిస్తాడు. దానితో ధృతరాష్ట్రుడు తన

---

[3]సుప్రసన్నా చార్య, కోవెల. విశ్వనాథ సత్యనారాయణ, పుట:2,3,4.

[4]శ్యామలాదేవి, దిట్టకవి (చిరువోలు), విశ్వనాథ వారి నవలలో ముఖ్య స్త్రీ పాత్ర చిత్రణ(సి.వ్యా), పుట:2.

వంశం ఎక్కడ నిర్వంశం అవుతుందోనని దుర్యోధనుని కోరికమేర పాండవులను వారణావతానికి పంపుతానంటాడు. ఆ విధంగానే ధర్మరాజు వారి కుటుంబ సమేతంగా వారణావతానికి వెళ్తారు. దుర్యోధనుని ఆజ్ఞ ప్రకారం పురోచనుడు లాక్షా గృహాన్ని తైలంతో నిర్మించాడు. పాండవులు ఆ నివాసంలోకి ప్రవేశిస్తారు. లాక్షా గృహాన్ని దుర్యోధనుడు దగులబెట్టించే ప్రయత్నం చేస్తున్నాడని విదురుడు ఖనికుడు ద్వారా పాండవులకు కబురు పంపిస్తాడు. ఖనికుడు ఆ గృహంలో మహా బిలము తవ్వి ఆ రంధ్రము అరణ్యములోకి ప్రవేశించేట్లు ఏర్పాటు చేస్తానన్నాడు. ఆ విధంగా వారు లక్క ఇల్లు తగలబడినప్పుడు ప్రాణాలతో బయటపడ్తారు. ఈ క్రమంలోనే భీముడు హిడింబను వివాహం చేసుకోవటం జరుగుతుంది. పాండవులు బ్రాహ్మణ వేష రూపులై ఏక చక్ర పురంలో నివసించడం భీముడు బకాసురుని చంపడం, బ్రాహ్మణ వేషధారియై ఉన్న అర్జునుడు మత్స్య యంత్రాన్ని కొట్టి ద్రౌపదిని వరిస్తాడు. ఇంటికి వెళ్లి అర్జునుడు ఫలము తీసుకుని వచ్చాను అనగానే కుంతి చూడకుండానే ఐదుగురిని పంచుకోమంటుంది. ద్రౌపది ఐదుగురిని వరించడం ఎలా సాధ్యమని ద్రుపదుడు సంకోచిస్తుండగా వేదవ్యాసుడు ద్రౌపది యొక్క పూర్వ వృత్తాంతం తెలపగా అంగీకరిస్తాడు. ద్రౌపదితో పాండవుల వివాహం ఘనంగా నిర్వహిస్తారు. నాటకం చివర ధర్మారాజు కృష్ణున్ని తనకు ఒక వరం కావాలని కోరుతాడు. కృష్ణుడు కోరుకోమనగా ధర్మరాజు లక్ష్మీనిలయంతో నా గృహం ఎప్పుడూ అభివృద్ధి చెందుతుండాలని, ఈ భూమి యందు ధర్మం నిత్యం ఎప్పుడు నిలిచి ఉండాలని పద్య రూపంలో తన కోరికను తెలపగా శ్రీకృష్ణుడు తథాస్తు అనడంతో అందరూ నిష్క్రమిస్తారు. నాటకం పూర్తవుతుంది. మాలిని వృత్తంలో ధర్మరాజు చెప్పిన పద్యమే ఈ నాటకానికి భరతవాక్యమని తెలుస్తుంది.[5]

ఈ నాటకంలో మొదట ధృతరాష్ట్రుడు ధర్మరాజును యువరాజును చేస్తే బాగుంటుందనే ప్రజల అభిప్రాయానికి సంతోషిస్తాడు. ఇలా తన సంతోషాన్ని వ్యక్తం చేయడం ధృతరాష్ట్రుని సహజ ధర్మాన్ని వ్యక్తం చేసినట్లుగా నాటకంలో చిత్రీకరించబడింది. అంతలోనే తన నిర్ణయం వలన దుర్యోధనుడు ఏ ఆపదలు తలపెడతాడని సందేహంతోనూ ఉంటాడు. ఇలా నాటక ప్రారంభంలోనే ధృతరాష్ట్రుని

[5]లక్ష్మి నరసింహం, చిలకమర్తి. ద్రౌపది పరిణయం(1960).

మానసిక సంఘర్షణ మొదలవుతుందని అర్థమవుతుంది. ఈ నాటకంలో వచనం ఎక్కువగా ఉంటుంది. ఈ వచనం ఆలంకారికంగా, సమాసాలతో కూడి ఉంది. చిలకమర్తి మొదటి నాటకమైన కీచక వధలో మొదటి అంకంలో కఠిన పదాలు, కఠిన సమాసాలు ప్రయోగించారు. తర్వాత అది సులభ శైలిలో రచించారు.[6]

### 1.3.3. గయోపాఖ్యానం(1955):

ఈ నాటకం చిలకమర్తి  వారి పౌరాణిక నాటకాలలో ప్రసిద్ధి చెందిన నాటకం. ఈ నాటకం నాంది ప్రస్తావనలతో కొనసాగుతుంది. ప్రస్తావనలో నటి, సూత్రధారుడు సంభాషణ ఉంటుంది. ఈ నాటకానికి కథా నాయకుడు శ్రీకృష్ణుడు ఇతను యమునా నది తీరమందు సత్యభామ, రుక్మిణి, కౌశికులకు కృష్ణుడు తన  శైశవ దశ విశేషాలను వివరిస్తాడు. సంధ్యా వందనం సమిపించడంతో యమునా నదిలో శ్రీకృష్ణుడు సూర్య భగవానునికి అర్ఘ్యం సమర్పించే సమయంలో అతని చేతిలో ఉమ్మి పడుతుంది. శ్రీకృష్ణుడు ఆగ్రహిస్తాడు. బలరాముడు శ్రీకృష్ణుని ఆగ్రహానికి ఆశ్చర్యపోతాడు. యమునా నది ద్వారా శ్రీకృష్ణుని చేతిలో ఉమ్మి వేసింది నిషధగిరి పై నున్న మణి పురాన్ని ఏలే గంధర్వుడు గయుడు అని తెలుసుకుంటాడు. అతన్ని నేను తప్పక వధించాలని శ్రీకృష్ణుడు పలుకుతాడు.

ఈ విషయం ఇంకా తెలియని గయుడు తను ఆకాశ మార్గంలో ప్రయాణించిన విశేషాలను భార్య చిత్రరేఖకు వివరిస్తాడు. గయుని భద్ర గజము మరణించడంతో చిత్రరేఖ కీడు ఏదో జరుగబోతుందని తన భయాన్ని గయునికి వ్యక్తం చేస్తుంది. ఆకాశవాణి నుండి గయుడు తన మరణ వార్తను విని భయపడతాడు. ఆకాశవాణి మాటల్లోని అంతరార్థం ఏమిటని తెలుసుకుని బాధపడ్తాడు. కృష్ణుని మూలంగానే గయుని ప్రాణానికి ఆపద కలుగుతుందని తెలిసినా బ్రహ్మ, శంకరులు సహితం అతనికి ప్రాణ భయంనుండి తప్పించలేకపోతారు. నారదుడు దైత్యవనంలో ఉన్న అర్జునుని మొదట శరణు వేడి అతను అభయం ఇవ్వగానే నీ  విషయం తెలుపమని గయునికి సలహా ఇస్తాడు. గయుడు అలాగే చేస్తాడు. అర్జునుడు విషయం తెలుసుకోకుండా గయునికి అభయం

---

[6]భారతి, ముక్తేవి. చిలకమర్తి సాహిత్య సేవ, పుట:112.

ఇస్తాడు. కాని అర్జునుడు శ్రీ కృష్ణునితో నే వైరం కలిగిందని తెలుసుకుని బాధపడ్తాడు. శ్రీ కృష్ణుడు అక్రూరున్ని రాయబారం పంపి గయున్ని వదలమని చెప్తాడు. పాండవులు ఆర్తితో శరణువేడిన వారిని వదలలేమని కబురుపంపుతాడు. చివరకు సుభద్ర రాయబారం కూడా అర్జునుని దగ్గర విఫలమవుతుంది. శ్రీకృష్ణార్జునుల మధ్య యుద్ధం జరుగుతుంది. ఈ భీకర సమరం వలన లోకానికి నష్టం వాటిల్లుతుందని శంకరుడు శ్రీకృష్ణార్జునలను శాంతింప చేస్తాడు. శ్రీకృష్ణుడు గయున్ని క్షమించి ప్రాణదానం చేస్తాడు.[7]

ఇది గయోపాఖ్యానం నాటకంలోని ప్రధాన ఇతివృత్తం. ఈ నాటక ప్రారంభంలో కౌశికుడు, హంసవదిక(రుక్మిణి చెలికత్తె) మధ్య హాస్యం చోటుచేసుకుంటుంది. ఈ పాత్రలే కాకుండా బలరాముడు, సాత్యకి, పుష్పదంతుడు, బ్రహ్మ, శంకరుడు, నారదుడు, పాండవులు, అక్రూరుడు వంటి అనేక పాత్రలతో నాటకాన్ని రసవత్తరంగా తీర్చిదిద్దిన ఘనత చిలకమర్తి వారికి దక్కుతుంది.

''*చిలకమర్తి వారి నాటకాన్ని ఇమ్మానేని హనుమంతరావు గారి ప్రోత్సాహంతో 1889 డిసెంబర్ నెలలో రచించారు. దాని ప్రథమ ప్రదర్శనం 1890 ఏప్రిల్ లో జరిగింది.*''[8] గయోపాఖ్యానంలోని ముఖ్యమైన కథాంశం ఆత్మీయుల మధ్య అంతఃకలహం. దగ్గర వారు తగాద పడితే చుట్టూ లోకం ఎంతో ఆసక్తిని ప్రకటించడం లోక సహజం ఈ సమాజ సమాజాసక్తియే ఈ నాటకంలోని కథమీద అంతగా తెలుగుదేశంలో అభిమానాన్ని రూపుకట్టించింది.[9]

### 1.3.4..పార్వతి పరిణయం(1919):

ఈ నాటకంలో కథానాయకుడు శంకరుడు కథానాయిక పార్వతి. నాంది శ్లోకానంతరం సూత్రధారుడు పరమేశ్వరునకు నమస్కారం చేసి నటితో సంభాషిస్తాడు. వీరి సంభాషణలో బాణుడు సంస్కృతంలో రచించిన పార్వతీ పరిణయ నాటకాన్ని చిలకమర్తి వారు రస పుష్టిని కలిగించడం కోసం ఆంధ్రీకరించారని తెలుస్తుంది. ఇదంతా నాటక లక్షణాల్లో ఒకటైన ప్రస్తావనతో

---

[7]లక్ష్మి నరసింహం, చిలకమర్తి. గయోపాఖ్యానం.

[8]భారతి, ముక్తేవి. చిలకమర్తి సాహిత్య సేవ, పుట:33..

[9]భారతి, ముక్తేవి. చిలకమర్తి సాహిత్య సేవ, పుట:34.

కూడుకుని ఉంటుంది. ఈ ప్రస్తావనలోనే నటితో సూత్రధారుడు పార్వతీ పరిణయానికి నారదుడు బీజ ప్రయత్నం చేస్తున్నాడని ఉంటుంది. ఇది ఐదు అంకాల నాటకం.

ఆకాశవాణి రూపంలో ముందుగానే నారదుడు ప్రవేశిస్తున్నాడని తెలుపుతారు. నారదుడు భూలోకానికి వచ్చి దైవ కార్యం నెరవేర్చే భాగ్యం తనకు దక్కిందని వస్తాడు. ఆ మాటతోనే పార్వతీ పరిణయానికి నారదుడు బీజం వేయడానికి వస్తున్నాడని పాఠకులకు అర్థమవుతుంది. నాటకంలో నారదుడు పుర ప్రవేశం చేసే సమయంలో పర్వత రాజు  మేనకతో కూడి ఆలోచిస్తున్నాడని తెలియగానే తన కార్యానికి ఇదే మంచి సమయమని నడుస్తాడు. రచయిత మాటల ద్వారా పాత్రల అభినయ విశేషాలు పాఠకులు గ్రహిస్తారు.హిమవంతుడు పాత్ర ప్రవేశించి పార్వతి దేవి పెళ్ళి ఈడుకు వచ్చిందని ఆమె రూపాన్ని ఎదుగుదలను హిమవంతుడు వర్ణిస్తాడు. మేనక కూడా సంభాషిస్తుంది. వీరి మాటలలోనే నారదుడు వచ్చాడని తెలుస్తుంది. అతనిని గౌరవిస్తారు.

పార్వతి వివాహ విషయమై హిమవంతుడు మాట్లాడగా నారదుడు పరమేశ్వరుని పూజింపమని చెప్పి తనలో విత్తనం నాటబడింది చేయదగిన పనిని సూచించానని అనుకుని హిమవంతుని దగ్గర సెలవు తీసుకుని వెళ్ళిపోతాడు. హిమవంతుడు మనసులో నారదుని సూచన తన కూతురుని పరమేశ్వరునికిచ్చి వివాహం చేయించమనే అర్థాన్ని సూచిస్తుంది అనుకుని బయటకు మేనకతో శివున్ని పార్వతి పూజించే ఏర్పాట్లు చేయమంటాడు.

వాసంతిక అనే వన దేవతను నందీశ్వరుడు పరమేశ్వరుని పూజకు పూలు తీసుకురమ్మని  ఆకాశ మార్గాన పిలుపు రావడంతో వాసంతిక బయలుదేరుతుంది. ఈమెకు రంభ ఎదురవుతుంది వీరిద్దరి సంభాషణలో రంభ తారకాసురునికి భయపడి అప్సరసలు అంతా మేరు పర్వతాల గుహలలో తలదాచుకున్నారని తాను మాత్రం నలకూబరుని (కుబేరుని కొడుకు) వదలక అతని కోసం వెళ్తున్నానని చెప్తుంది. వీరి మాటల్లోనే పార్వతి దేవి పరమేశ్వర అనుగ్రహం కోసం తపస్సు చేస్తుందని తెలుపబడుతుంది. వీరి మాటలు విష్కంభంతో కూడుకుని ఉంటాయి. తర్వాత మహేంద్రుడు ప్రవేశిస్తాడు. దేవనందితో ఒక మహా కార్యం ఆలోచించాలి

బృహస్పతిని తప్ప ఎవరిని రానీయ వద్దని చెప్తాడు. వెంటనే బృహస్పతి ప్రవేశిస్తాడు. వీరి దగ్గరకు దేవలుడు ప్రవేశించి మహేంద్రునితో తారకాసుర దుష్ట చేష్టలను వివరిస్తాడు. ఈ విషయమై బృహస్పతి మహేంద్రునితో కుమారస్వామి చేతిలో తప్ప ఎవరి చేతిలోనూ తారకాసురుడు చావడని చెప్తాడు. దానికి ఉపాయాన్ని ఆలోచిస్తారు. పార్వతి పరమేశ్వరుల వివాహానికి కాముడిని నియమిస్తాడు. కాముడు చేయవలసిన కార్యాన్ని గురించి మహేంద్రుడు, బృహస్పతి వివరిస్తారు. కాముడు సంకోచంతోనే దైవ కార్యం జరుగుతుందని సంతోషించినా మనసులో ఎక్కడో కొంత భయంతోనే ఉంటాడు.

కాముడు చేసే పనులను నారదుడు తిరస్కరణీ విద్యచేత గమనించి మహేంద్రునికి, బృహస్పతికి కాముడు పుష్ప బాణం విసరడం, శివుడు అతనిని భస్మం చేయడం, రతి దేవి మూర్ఛిల్లడం విషయాలన్ని తెలియజేస్తాడు. ఇంతలో రంభ మహేంద్రుడి వద్దకు ప్రవేశించి కాముడి దహన విషయం అందరూ చెప్పుకుంటున్నారని పార్వతి పరమేశ్వరుల వివాహం గురించి మేనక హిమవంతుల అభిప్రాయాలను తెలుపుతుంది.

శివుని ఆజ్ఞ ప్రకారం నందీశ్వరుడు ముని వేషంలో వచ్చి పార్వతి చెలికత్తెలు జయ, విజయ ద్వారా పార్వతి మనోచిత్తం ఏ విధంగా ఉందో పరమేశ్వరుడిపై ఆమెకు గల భక్తి ఎటువంటిదో తెలుసుకుంటాడు. తర్వాత వైష్టకుని వేషంలో శంకరుడు పార్వతిని పరిక్షించాలనుకుంటాడు. వేషధారణలో ఉన్న శివునికి జయ, విజయలు సపర్యలు చేస్తారు. పార్వతి తపస్సు గురించి తెలుసుకుంటాడు. తర్వాత పార్వతి, పరమేశ్వరుల వివాహం నిశ్చయించబడటం హిమవంతుడు శిలాధరుని సహాయంతో నగరాన్ని అలంకరింప చేస్తాడు. పార్వతి, శంకరుల వివాహానికి దేవతలంతా వస్తారు. బృహస్పతి ఆధ్వర్యంలో వివాహం చక్కగా జరుగుతుంది. నారదుని కోరిక ప్రకారం శివుడు మన్మథునికి తిరిగి రూపాన్ని ప్రసాదిస్తాడు మన్మథుడు రతి దేవితో కలిసి సుఖంగా ఉంటాడు. శంకరుడు హిమవంతుని ఏమైనా కోరుకోమనగా సకల మనోరథములు సిద్ధించిన వారికి ఏమి కోరికలు ఉంటాయి

అనడంతో భరత వాక్యంతో ఒక శ్లోకం ఉంటుంది. ఈ నాటకం పూర్తవుతుంది.[10]ఈ నాటకంలో నారదుడు కాముడు చేసిన కార్యం గురించి మహేంద్రునికి చెప్పేటప్పుడు మహేంద్రుడు తరువాత ఏమైంది అని తెలుసుకోవడానికి సంభాషణ బదులు 'తరువాత తరువాత ' అని పలుమార్లు అంటాడు. అలాగే కౌశికి హిమవంతునికి పార్వతి పరికర్మను వివరించే సందర్భంలో హిమవంతుడు 'తరువాత తరువాత' అని పలుమార్లు అంటాడు. ఆ పదానికి బదులు వారి సంభాషణ వచన రూపంలోనైనా చెప్పి ఉంటే బాగుండేది.

చిలకమర్తి వారు చేసిన సంస్కృతానువాదం అభినవ బాణభట్టు వ్రాసిన 'పార్వతి పరిణయం' అని శ్రీహర్షుని ఆస్థానంలో ఉన్న బాణుడు కాదని అద్దంకి రాజధానిగా చేసి పాకనాడును పాలించిన వేమారెడ్డి ఆస్థాన కవి అని చిలకమర్తికి తెలియలేదు. బాణుడు 'హర్ష చరిత్ర' రాసినట్లే ఈయన కూడా తన పోషకుడైన వేమ రాజును గురించి వేమభూపాలియమనే వచన కావ్యాన్ని సంస్కృతంలో రాశాడు. ఈ నాటకాన్ని కూడా బాణుడే రాశాడన్న భ్రమతో నేను దీనిని ఆంధ్రీకరించాను కాని అభినవ బాణ భట్టుండే రచయిత అని మొదటనే తెలసిన పక్షమున ఈ ప్రయత్నము నుండి మరలి ఉంటానని పంతులు గారే చెప్పుకున్నారని మొదలి నాగభూషణ శర్మ 'చిలకమర్తి లక్ష్మీనరసింహం' అనే గ్రంథంలో తెలిపారు.[11] చిలకమర్తి వారు నాటక రంగానికి చేసిన కృషిని పరిశీలిస్తే 1889 వ సంవత్సరం జనవరి నెలలో 'కీచక వధ' రచనకు  దానితోపాటు తమ నాటక రచనా వ్యాసంగానికి శ్రీకారం చుట్టారు.[12]ఈ మాటను పరిశీలిస్తే చిలకమర్తి వారి మొదటి నాటకం 'కీచక వధ' అని తెలుస్తుంది.

చిలకమర్తి వారి రెండవ నాటకం 'ద్రౌపది పరిణయం', హనుమంతరావు గారి ప్రేరణతోనే చిలకమర్తి వారు' గయోపాఖ్యానం' 'ద్రౌపది పరిణయం', 'పారిజాతాపహరణం', 'ప్రసన్నయాదవం', 'ప్రహ్లాద చరిత్రము', 'చతుర చంద్రహాసము', 'తిలోత్తమ' మొదలైనవి రచించారు.[13]

---

[10]లక్ష్మి నరసింహం, చిలకమర్తి. పార్వతి పరిణయం.

[11]నాగభూషణ శర్మ, మొదలి. చిలకమర్తి లక్ష్మి నరసింహం, పుట:67.

[12]నాగభూషణ శర్మ, మొదలి. చిలకమర్తి లక్ష్మి నరసింహం, పుట:37.

[13] భారతి, ముక్తేవి. చిలకమర్తి సాహిత్య సేవ, పుట:32.

## 1.4. విశ్వనాథ నాటకాలు – సంక్షిప్త పరిచయం:

ఏ ప్రక్రియైన బంగారం చేయగల సిద్ధహస్తుడు విశ్వనాథ, నాటక సాహిత్యంలో ఈయనకు ప్రత్యేక స్థానం ఉంది. ఈయన రాసిన నాటకాలలో కొన్నింటిని ఈ క్రింది పరిచయం చేస్తున్నాను.

### 1.4.1. ధన్య కైలాసం(1937):

ఈ నాటకాన్ని పరిశీలిస్తే నాంది శ్లోకంతో నాటకం ప్రారంభమవుతుంది. తర్వాత ఒక సూత్రధారుడు ప్రవేశించి భగవంతుడైన భరతాచార్యుడు నేడు ఒక కొత్త నాటకం సంకల్పించాడు  అదిగో గీత ఆరంభించారు అని చెప్పి వెళ్ళిపోతాడు. తర్వాత ప్రథమాంకం ప్రారంభమవుతుంది. అందులో భిక్షకుడు ప్రవేశించి కామ క్రోధాదులచేత జనులు నియమము లేక పామరులై చెడిపోతారు ప్రజలకు ఎక్కువ రోజులు బతుకుతాము అనే కోరిక ఉంది. మృత్యువును కనుగొన్నారో లేదో చెప్పి వెళ్ళిపోతాడు.

ఈ నాటక ప్రారంభంలో భోగేశ్వరుడు చిత్రలత వెంట పరిగెస్తుంటాడు. ఆమెను పొందాలనే కోరికతో ఉంటాడు. రత్నగిరి పాత్ర ద్వారా భోగేశ్వరుడు ధనాంగన మీద ఆసక్తితో తిరుగుతున్నాడు ఇక్కడ భోగేశ్వరుని భార్య భాగీరథి నిద్ర లేక సంసారం గురించి ఆలోచిస్తుందని తెలుస్తుంది. రత్నగిరి ద్వారానే భోగేశ్వరుడు భోగము దానిని తరుముకుంటూ పోయేది భాగీరథి చూసిందని భోగేశ్వరునితో చెప్తుంది. ఇంతలో భిక్షకుడు కామ క్రోధాలచేత భగవంతున్ని మరచిపోతున్నారని పాట పాడతాడు. భోగేశ్వరుడు నా ధనమంతా రాగలతిక  ఇంట్లో ఉందని ఆ బిచ్చగాడిపై ఒక ఉత్తరీయం చేసి అతన్ని చూస్తూ వెళ్ళిపోతాడు. చిత్రలత ప్రవేశించి భోగేశ్వరుని వలలో పడ వేయుటకు ప్రయత్నిస్తుంది. దానికి అడ్డంగా ఉన్న రాగ లతికను ఎలాగైనా పంపించాలని  ఆలోచిస్తుంది. భోగేశ్వరుడు రత్నగిరికి తన భార్య భాగీరథికి సంబంధముందని అనుమానిస్తాడు. కొట్టబోతాడు. చిత్రలత కంకటుడి ద్వారా భోగేశ్వరుడు నిరుపేదలకు భూమి, ధనాన్ని పంచడం తెలుసుకుని చిత్రలత బాధపడుతుంది. నాకు రావాల్సిన ధనమంతా వృథా అయిపోతుంది ఎలాగైనా భోగేశ్వరుని నా వలలో పడేయాలని ఆలోచిస్తుంది. కంకటుడి ద్వారా భాగీరథి

మనసు ఎటువంటిదో తెలుసుకుంటుంది. అతని కుటుంబ వివరాలన్ని కంకటుని ద్వారానే తెలుసుకుంటుంది.

భోగేశ్వరుడు తనను అందరూ అంబారిపై ఊరేగిస్తున్నప్పుడు భాగీరథి చూసిన చూపులు అతను భాగీరథి విషయంలో పొరబడ్డానని అనుకుంటూనే చిత్రలత ఇంటికి వెళ్తాడు. రత్నగిరిని కూడా అవమానించినందులకు బాధపడ్డాడు. ఇంతలో చిత్రలత అతనిని పలుకరిస్తుంది. భోగేశ్వరుడు చిత్రలతతో కొంత సంభాషణ జరుపుతాడు. చిత్రలత ఒక ఉత్తరం రాసి కంకటుడికిచ్చి రత్నగిరికి ఇమ్మంటుంది. అందులో రత్నగిరి ఉద్యానవనానికి వస్తే భోగేశ్వరుని దగ్గర తీసుకున్న ధనాన్ని ఇచ్చేస్తానని అంటుంది. ఈ ఉత్తరం విషయం తెలియని భోగేశ్వరుడు చిత్రలత మాట ప్రకారం భాగీరథిని ఆమెకు పరిచయం చేయాలని ఉద్యానవనాన్ని స్థానంగా ఏర్పరుచుకుంటారు. అక్కడికి ముందుగానే భోగేశ్వరుడు , చిత్రలత ఉంటారు. తర్వాత రత్నగిరి , భాగీరథి ప్రవేశిస్తారు. అంతకుముందే భార్యమీద అనుమానమున్న భోగేశ్వరుడు. వారి రాకతో కోపోద్రిక్తుడవుతాడు. ఈ నేపథ్యంలోనే రత్నగిరిని చంపేస్తాడు. తర్వాత రత్నగిరి తల్లి భాగీరథి మాటల్లో భోగేశ్వరుడు ఇంత పని చేశాడని చెప్పడంతో భోగేశ్వరుడే రత్నగిరిని చంపేసినట్లుగా తెలుస్తుంది. ఈ క్రమంలోనే భాగీరథిని చంపుతాడు. తన కూతుర్ని మాత్రం అతనికి కనబడనీయదు చిత్రలతతో భోగేశ్వరుడు భాగీరథిని కూడా చంపాననగా చిత్రలత నువ్వు కాదు నేను అని ఆమె మరణిస్తుంది. ఇంతటికి కారణమైన భోగేశ్వరుడు తనలో తాను భాగీరథి ఇట్లయినది, చిత్రలత పశ్చాత్తాపంతో మరణించింది, రాగలతిక, రత్నగిరులు పోయారు తన కూతురు రాజేశ్వరి ఏమైందో తెలీదు. భాగీరథి కూతురు రహస్యం చెప్పనేలేదు కంకటుడి పారిపోయాడు. దిక్కులేనివాడినైనాను అయినా మృత్యువు మాత్రం రాలేదని బాధపడ్డాడు. మోహావేశంలో తాను చేసిన తప్పును తెలుసుకుంటాడు. నాటకంలో అప్పుడప్పుడు తత్త్వ విషయాలు చెప్పే భిక్షకుడు ఎవరో కాదని తన అంతరాత్మేనని అదే పరమాత్మేనని భోగేశ్వరుని మాటల ద్వారానే తెలుస్తుంది. మోహాంధకారంలో ఉన్న భోగేశ్వరునికి ఆ తత్త్వ విషయాలు చివరలో బోధపడుతాయి. వారణాసిని చూసి అదే కైలాసం నేనే పరమాత్మను అనుకుంటాడు

భరత వాక్యంతో నాటకం ముగుస్తుంది.[14]ఈ నాటకంలో భోగేశ్వరుడు చిత్రలతతో మాట్లాడేటప్పుడు ''సంసార భారం నా మీద పడింది మా భాగీరథి(భార్య) పిల్లల తల్లి అయింది. ఆమె దగ్గర తర్వాత ప్రేమ రసమే కాని శృంగార రసం కనబడలేదు. అప్పుడే శృంగార రస ఫల వాంఛ రాగ లతికా బహుశాఖలకెగబ్రాకితి, ఇప్పుడు చిత్రలత''[15]

ఈ మాటల వలన భార్య ప్రేమకన్నా శృంగారమే సుఖానిస్తుందని భావించి భోగేశ్వరుడు అప్పుడు రాగ లతికను, ఇప్పుడు చిత్రలత దగ్గర ఆ సుఖానందాన్ని పొందుతున్నాడని చెప్తాడు. దీనినే అదృష్టంగా భావిస్తాడు. కాని దీని వలన కలిగిన సుఖం వలన అది ఎన్ని అనర్థాలకు దారి తీస్తుందో చివర గ్రహించి మోహం వెంటబడి ధర్మము నశింపచేసితిని అనుకుంటాడు. నాటకంలో కామ క్రోధాదులకు లోనైన వ్యక్తి చిత్త వృత్తులను రచయిత చక్కగా వివరించారు.

### 1.4.2.నర్తనశాల(కీచక వధ)(1955):

నాందీ శ్లోకం తరువాత సూత్రధారుడు ప్రవేశించి నాటక ప్రారంభంలో ఎవరు ప్రవేశిస్తారో సూచనప్రాయంగా తెరచాటున తెలియజేస్తాడు. ఇది తొమ్మిది అంకముల నాటకం. నాటక ప్రారంభంలోనే కీచకుడు ప్రవేశించి తను సుధేష్ణతోబుట్టువని, పేరు సింహబలుడని తాను పరిచయం చేసుకుని ఎదుట ఉన్న వ్యక్తి పేరు అడుగుతాడు. నేను వచ్చి సంవత్సరం అవుతుంది. నేను నిన్ను ఎప్పుడు చూడలేదు కాని నిన్ను చూసినంతనే మాట్లాడలనిపిస్తుంది. మా అక్క నీ చేత ఏ పనులు చేయిస్తుంది. ఎన్నాళ్ల నుండి ఇక్కడున్నావు అని అడుగుతుండగానే ద్రౌపది వెళ్ళిపోతుంది. సుధేష్ణ ప్రవేశిస్తుంది. సుధేష్ణ కీచకుని యోగక్షేమాలను అడుగుతుంటే కీచకుడు ద్రౌపది గురించి వివరాలు అడుగుతుంటాడు. ద్రౌపది పరిచారిక ద్వారా కీచక వృత్తాంతం తెలుసుకుంటుంది. దుర్యోధనునికి ఇతనికి మంచి పోలిక ఉంది అంటుంది. కీచకుడు ఉత్తరను పలుకరించిన తర్వాత సుధేష్ణతో మరలా ద్రౌపది ప్రస్తావన తీసుకువస్తాడు. ఆమె సైరంధ్రిగా ఇక్కడ తలదాచుకోడానికి వచ్చింది నీ మనసును అదుపులో పెట్టుకోవాలని ఆమెకు ఐదుగురు గంధర్వులు భర్తలుగా ఉన్నారని సుధేష్ణ చెప్తుంది.

---

[14]సత్యనారాయణ, విశ్వనాథ. ధన్య కైలాసం.

[15]సత్యనారాయణ, విశ్వనాథ. ధన్య కైలాసం, పుట:30.

అయినా కీచకుని మనసు మారదు. ఒకనాడు ద్రౌపదిని పరాభవించే ప్రయత్నం చేస్తాడు. ఆ విషయం సుధేష్ణతో చెప్పగా ఆమె నేను అతనిని మందలిస్తాను ఈ విషయం అంతఃపురంలో ఎక్కడా చెప్పవద్దని బతిమాలుతుంది. వల్లకీ అనే పరిచారిక ద్వారా కీచకునికి ద్రౌపది అసలు పేరు మాలిని అని తెలుస్తుంది. సైరంధ్రిని కీచకుని దగ్గరకు పంపుటకు పల్లకి ఒక ఉపాయాన్ని కీచకునికి తెలుపుతుంది. సుధేష్ణ మదిరంటే ఇష్టమని అది మీ దగ్గర ఉందని నాకు వేరే పని ఉన్నదని చెప్పి పంపిస్తానంటుంది. సైరంధ్రికి పౌరషం వచ్చేటట్లు పల్లకీ మాట్లాడుతుంది. సైరంధ్రితో పల్లికి సుధేష్ణ కీచకుని ఇంటికి వెళ్ళి మదిర తెమ్మంటుందని చెప్తుంది. ద్రౌపది నమ్మదు ఈ విషయం సుధేష్ణతోనే అడగాలని వెళ్తుంది. సుధేష్ణ నిద్ర మత్తులోనే వల్లకి మదిర తీసుకొచ్చావా అని కలవరించడంతో సైరంధ్రి ఆమె తీసుకురమ్మంటుందని నిశ్చయించుకుంటుంది. ఈ లోపు కీచకుడు తన స్నేహితుడు శారద్వతుడితో కాలక్షేపం చేస్తాడు. తెల్లారే సమయానికి ద్రౌపది కీచకుని ఇంటికి వెళ్తుంది. కీచకుడు మదిరను వేరే పరిచారకునితో పంపించి ద్రౌపదిని పట్టుకొనబోవును ఆమె పరిగెత్తుతూ వెళ్తుంది. ఉత్తర కీచకుడు ద్రౌపదిని పరిగెత్తుకు రావడం చూసి కంకభట్టు ఎంత కష్టం వచ్చినా నలుగురు లోకి రాకూడదంటాడు. తర్వాత ఉత్తర, సుధేష్ణ , ద్రౌపది సంభాషణలో కీచకుని ఇంటికి ద్రౌపది వెళ్ళునట్లు చేసినది వల్లకీ అని సుధేష్ణ గ్రహిస్తుంది. వల్లకీని అంతఃపురంలో చోటులేదని పంపించేస్తుంది.

ఉత్తర ద్రౌపదిని కీచకుడు తరుముకుని వచ్చినప్పటినుండి ముభావంగా ఉంటుంది. నర్తనశాలవైపు వెళ్ళనంటుంది. వలలుడని గంధర్వుడుగా భావిస్తుంది. తంత్రీపాలుడు ప్రవేశిస్తాడు. అతను ఉత్తరతో గంధర్వులను చూశానని ఈ రోజు రాత్రి నర్తనశాలలో వారికి విరోధులకు యుద్ధం జరుగుతుందని చెప్తాడు. ద్రౌపది కీచకుడు దగ్గర ప్రియమైన దానిగా నటించి నర్తనశాలకు సంకేతంగా చెప్తుంది. నల్ల దుస్తులు ధరించమంటుంది ఎందుకంటే చీకటిలో కలసి పోవాలిగా అంటుంది. చివరకు భీముడు స్త్రీ వేషధారియై కీచకుడితో కాసేపు ముచ్చటిస్తాడు. తర్వాత కీచకుడు భీముడని తెలుసుకుని నా కోసం స్త్రీ వేషంలో వచ్చినావా పౌరషమేటికి? అంటాడు భీముడు ఓరి దుష్టుడా అనడంతోనే నాటకం ముగుస్తుంది. సమయజ్ఞుడు ప్రవేశించి

భరతవాక్యం పలుకుతాడు.[16] తిక్కన భారతంలో సుధేష్ణ స్వయంగా ద్రౌపదిని మదిర తెమ్మని కీచకుని ఇంటికి పంపిస్తుంది. ఇందులో ఒక సాటి ఆడదాని మీద ఉండవలసిన ప్రేమాభిమానాలు సుధేష్ణ ద్రౌపది మీద చూపుతుంది. ద్రౌపదిని కీచకుని ఇంటికి పంపించిన వల్లకి మోసాలు తెలుసుకుని ఆమెను అంతఃపురం నుండి వెలివేస్తుంది. అంతేకాకుండా ఈ నాటకంలో కీచకుని నోటి వెంట నుండి నేను చేసిన పుణ్య కార్యాలు ఈ మహాపాప రాశిలో మునిగిపోయాయి వంటి మాటలు రావడం నేను గమనించాను.

### 1.4.3..వేనరాజు(1930):

నాంది శ్లోకంతో నాటకం ప్రారంభమవుతుంది నాంది చివర కుశీలవుడు, మారీషుడు, లవంగిక సంభాషణ ఉంటుంది. మారిషుని మాటల్లో నాటకంలో వేనరాజు యొక్క స్వభావం ఎట్టిదో తెలుపబడుతుంది. అలాగే నేడు పాత సంప్రదాయాలకు స్వస్తి పలికి ఆధునిక పద్ధతుల్నే ప్రేక్షకులు కోరుకుంటారనే అర్థం మారిషుని పాత్రద్వారా సూచన ప్రాయంగా చెప్పించడం గమనించాలి. ఇది పది అంకముల నాటకం ఇందులోని ప్రధాన ఇతివృత్తాన్ని గమనిస్తే

మొదటి అంకం ప్రారంభం నుండే గౌతముడు వేనుని సంభాషణ ఉంటుంది. స్నేహితుడైన గౌతముడు వేనుని వివాహం చేసుకోమనగా తాను వివాహానికి వ్యతిరేకమని ఈ వివాహ వ్యవస్థ ఉండబట్టే వ్యభిచారితనం ప్రబలిందని పాపపుణ్యాలు మనం తెచ్చుకున్నవే అంటాడు. ఇలా నాటకాంతం సంఘ వ్యతిరేకమైన భావాలతో ధర్మ విరుద్ధంగా వేనుడు ప్రవర్తిస్తూ ప్రజలకు తన సిద్ధాంతాల ద్వారా అనేక కష్టాలకు గురి చేస్తాడు. తనకు ఎదురు వచ్చిన వారందరిని శిక్షిస్తాడు. చివరకు తల్లిదండ్రులు అంగరాజు, సునీతను బంధిస్తాడు. ఇతడు సౌందర్యాన్ని ఆరాధించేవాడు అదే సత్యమని భావించేవాడు, గౌతముడు మగవాడైనా అతని సౌందర్యానికి ముగ్ధుడవుతాడు. వేనుడికి  ఈ నాటకంలో భగవంతుని మీద , పిశాచాల మీద నమ్మకం ఉండదు. నాస్తికుడిలాగా ప్రవర్తిస్తాడు. గౌతముని పాత్ర ద్వారా తాత్విక, దైవ సంబంధించిన విషయాలన్ని తెలుపబడుతాయి.

[16]సత్యనారాయణ, విశ్వనాథ. నర్తనశాల(కీచకవధ).

వేనున్ని ప్రశంసించిన కురవందినిని చంపిస్తాడు ఎందుకంటే పొగడ్త కూడా అతని సిద్ధాంతాల ప్రకారం ఉండాలనుకుంటాడు. వేనునికి పృథువు మొదట చెల్లెలుగా ఉంటుంది. చివర పురుష రూపాన్ని ధరిస్తుంది. ఇటువంటి వేషధారణను రచయిత నాటకంలో చూపించాడు. వేనుడు చివరకు తన తప్పులు తెలుసుకుని తనకు తానే శిక్షించుకుంటాడు. పృథువే తర్వాత రాజ్యాన్ని పరిపాలించేది మహారాజు కూడా పృథువే అంటాడు. తండ్రి అంగ రాజును క్షమించమంటాడు. తల్లి సునీథ తను చేసిన ఘోర కృత్యాలను చూడలేక ఆత్మహత్య చేసుకుందని తెలుసుకుని వేనుడు మూర్ఛిల్లుతాడు. నాటకం చివర భూదేవి మాటల్లో వేనుని వంటి చెడ్డ మతాలు వస్తూ ఉంటాయి పోతూ ఉంటాయి. అని చెప్పిన మాటల్లో అధర్మమనేది సమూలంగా నాశనం చేయలేము అనే భావన కలుగజేశాడు రచయిత.[17] ఈ నాటకంలో మొత్తం పది అంకాలు ఉంటాయి. ఇందులో ప్రధాన పాత్ర వేనుడు. *''వేనరాజు' 1933, 1934 లలో రాయబడింది. ఇది వేయిపడగల రచనా కాలం. భాగవతంలోని మూల కథను ఎంచుకున్నారు. కేవలం ప్రధానమైన వేనుని పేరు, అతని కొన్ని లక్షణాలు, కొన్ని సంఘటనలు మాత్రమే ఛాయామాత్రంగా గ్రహించి స్వకపోల కల్పితమైన పది అంకాల గొప్ప నాటకంగా మలిచారు విశ్వనాథ''*[18] నాటకంలో వేనుడు, గౌతముడు, అంగరాజు, పృథుడు, కౌషీతకుడు, ద్యౌషీతకుడు, వినీత భట్టు, శ్రీధరుడు, వంటి అనేక ప్రధాన, అప్రధాన పాత్రలతో పది అంకాల నాటకంగా చక్కగా తీర్చిదిద్దారు.

వేనరాజు రచనా కాలం నాటికి మన దేశానికి స్వాతంత్ర్యం రాలేదు. స్వాత్రంత్ర్య పోరాటం సాగుతున్నది. ఆంగ్లేయుల పాలన వల్ల దేశంలో అనేక రంగాలలో చెప్పుకోదగిన మార్పులు వచ్చాయి. విశ్వనాథ తన ఆంధ్ర ప్రాంతంలో కూడా ఆంగ్లేయుల పాలన వల్ల గ్రామీణ వ్యవస్థ నుండి నగర వ్యవస్థ వరకు అన్నీ సమూలమైన మార్పులు జరుగుతున్నాయి. ఆ మార్పుల వల్ల నశిస్తున్న పూర్వ సంస్కృతిని చూసి విశ్వనాథ భరించలేకపోయారు. వేయిపడగలు నవలలో అంతా ఆ విషాదమే మనకు కనిపిస్తుంది. దాదాపు అదే కాలంలో వేనరాజు రచించబడింది.

---

[17]సత్యనారాయణ, విశ్వనాథ, వేనరాజు.

[18]కొండలరావు, వెల్చాల.(సం),జయంతి త్రైమాసిక పత్రిక, సంచిక, 2-3,సంపుటి-10,పుట:66.

వేనరాజు నాటకంలో కూడా ఈ సామాజిక మార్పుల ప్రభావం స్పష్టంగా కనిపిస్తుంది. వివాహ వ్యవస్థ, కుటుంబ వ్యవస్థ, పరిపాలనా వ్యవస్థ, సంగీత సాహిత్య కళారంగాలు అన్ని అంతకు ముందు ఈ సమాజానికి గర్వంగా భావించే పద్ధతుల్ని తప్పులుగా మారిపోతూ పాశ్చాత్య దేశపు పోకడలు నవీనమైనవిగా, విలువైన విగా భావింపబడుతున్న కాలం అది. ఈ కాలపు చిత్రీకరణ అంతా వేనరాజు నాటకంలో వ్యంగ్యంగా ప్రదర్శించబడుతుంది.[19] అని విశ్వనాథ సత్యనారాయణ ''వేనరాజు నాటకం- ధర్మ పరిరక్షణ'' అనే వ్యాసంలో గంద్రలక్ష్మణరావు తెలిపారు. ఈయన తెలిపిన విధంగానే ఆయా పాత్రలద్వారా ఆనాటి సమాజంలో ఉన్న పద్ధతులకు, సంప్రదాయాలకు, నేటి ఆధునికతకు మధ్య జరిగే సంఘర్షణలను, కళా పోషణ మరుగై పోవడాన్ని మున్నగు ఎన్నో అంశాలు ఈ నాటకంలో చిత్రించబడ్డాయి. ఈ నాటకాలే కాక విశ్వనాథ సత్యనారాయణ సంస్కృతంలో గుప్త పాశుపతం మొదలుకొని తెలుగులో పౌరాణిక నాటకాలైన నర్తనశాల, వేనరాజు, సౌప్తిక ప్రళయము, కావ్య వేద హరిశ్చంద్ర చారిత్రక నాటకాలైన త్రిశూలం, అనార్కలి, సాంఘిక నాటకాలైన ధన్య కైలాసం, లోపల బయట, సత్యాగ్రహం, అంతా నాటకమే, ప్రవాహము, తల్లి లేని పిల్ల, ఆకాశరాజు. రాజకీయ నాటకాలైన అవతార పరివర్తనము, భస్మాసురచయనము వంటి తెలుగు నాటకాలు రచించారు.[20]

### 1.5. నవలా సాహిత్యంలో చిలకమర్తి- విశ్వనాథల కృషి:

తెలుగు సాహిత్యంలో నవలా యుగం క్రీ.శ 19 వ శతాబ్దం ఉత్తర భాగంలో ప్రారంభమైనట్టు ప్రముఖులు పేర్కొన్నారు. నవలా విషయానికి వస్తే ''ఇంగ్లీషు భాషా సాహిత్యంలోని నావల్(Novel) అనే వచన సాహిత్య ప్రక్రియ ప్రేరణగా 19 వ శతాబ్ది చివరి భాగంలో తెలుగులో నవల అవతరించింది''[21] అని నవలా వికాసం అనే వ్యాసంలో కాత్యాయని విద్మహే తెలిపారు.నవల సమాజ కాలానికి అనుగుణంగా వాస్తవిక పరిస్థితులకు దగ్గరగా ఉంటుంది. సమకాలీన సమాజ జీవిత విధానాన్ని చిత్రీకరిస్తూ నవలలు వెలువడ్డాయి. ముఖ్యంగా మధ్యతరగతి జీవితాలలోకి వాస్తవికతను సాంఘికాభివృద్ధి వలన జనించిన సమస్యలను దృష్టిలో పెట్టుకుని

---

[19]కొండలరావు, వెల్చాల.(సం),జయంతి త్రైమాసికపత్రిక, సంచిక, 2-3,సంపుటి-10,పుట:67.

[20]కొండలరావు ,వెల్చాల.(సం),జయంతి త్రైమాసికపత్రిక, సంచిక, 2-3,సంపుటి-10,పుట:65.

[21]కొండలరావు, వెల్చాల.(సం),జయంతి త్రైమాసికపత్రిక, సంచిక, 3,సంపుటి-12,పుట:11.

నవలలు రాశారు. నవలకు ఉన్న నిర్వచనాలను పరిశీలిస్తే రచనా కాలమందలి వాస్తవాలను, జీవితాచార వ్యవహారాలను చిత్రించేదే నవల అని బొడ్డపాటి వేంకట కుటుంబరావు 'ఆంధ్ర నవలా పరిణామం' అనే గ్రంథంలో తెలిపారు.[22]''సాంఘిక జీవితానికి ప్రతిబింబంగా వ్యక్తుల జీవిత గమనాన్ని చిత్రిస్తూ జనుల ఆచార వ్యవహారాలను వ్యక్తీకరించే గద్య ప్రబంధం నవల''[23] ''యదార్థ జీవితములు వాస్తవిక చిత్రణము గల గద్య రూపక కథా సాహిత్యము నవల''[24]

తొలి తెలుగు నవల విషయానికి వస్తే దీని మీద చర్చోపచర్చలు జరిగి చివరకు కందుకూరి రాసిన రాజశేఖర చరిత్రనే మొదటి నవలగా అనేకమంది అభిప్రాయపడ్డారు. తొలి నవల ఏది అంటే చాలా పేర్లు వినిపిస్తున్నాయి.

''1. 1867 లో వచ్చిన కొక్కొండ వెంకటరత్నం పంతులు రాసిన మహాశ్వేత.

2. 1872 లో వచ్చిన నరహరిగోపాలకృష్ణమ శెట్టి రాసిన శ్రీరంగరాజచరిత్ర.

3. 1878 లో వచ్చిన కందుకూరి వీరేశలింగం పంతులు రాసిన 'రాజశేఖర చరిత్ర' వీటితో పాటు నల్గొండ జిల్లావాసి తడక మళ్ల కృష్ణారావు రాసిన 'కంబ కంధర చరిత్ర'(1864) ఇటీవల వెలుగులోకి వచ్చింది.

నవల స్వరూప స్వభావాలను దృష్టిలో ఉంచుకుని రాజశేఖర చరిత్రను తొలి నవలగా మన విమర్శకుల్లో చాలామంది గుర్తించారు.''[25] అని 'మన నవలా సాహిత్యం' అనే వ్యాసంలో వెల్చాల కొండలరావు వివరించారు.'' నరహరి గోపాల కృష్ణమ శెట్టి అనే ఆయన 1872లో 'శ్రీరంగరాజ చరిత్రము'(దీనికే సోనాబాయి పరిణయము అన్న పేరు కూడా ఉంది) అన్న పేరుతో ఒక 'నవీన ప్రబంధం' రచించాడు. ఆ తర్వాత ఆరేళ్ళకి(1878) కందుకూరి వీరేశలింగం పంతులు గారు 'రాజశేఖర చరిత్రము' అన్న 'వచన ప్రబంధం' రాసి (వివేక చంద్రిక' అన్నది దీనికి మరోపేరు) తాను నడిపే 'వివేక వర్ధని' పత్రికలో సీరియల్ గా ప్రచురించారు. మరో

22 వేంకట కుటుంబరావు, బొడ్డపాటి. ఆంధ్ర నవలా పరిణామం, పుట: 102.

23నాగభూషణ శర్మ, మొదలి. తెలుగు నవలా వికాసం, పుట:14.

24వేంకటేశ్వర్లు, పుల్లాబోట్ల. తెలుగు నవలా సాహిత్య వికాసం,పుట:3.

25కొండలరావు, వెల్చాల.(సం),జయంతి త్రైమాసికపత్రిక, సంచిక, 3,సంపుటి–12,పుట:05.

రెండేళ్లకు(1880) ఇది పుస్తక రూపంలో వచ్చింది. తెలుగులో మొదటి నవల రంగరాజచరిత్రమా, రాజశేఖర చరిత్రమా అన్న విషయం గురించి సాహితీ విమర్శకులు, పరిశోధకులు, పండితులు ఇప్పటికే చాలా విస్తృతంగా చర్చించారు. ఈ విధమైన పరిశీలనలూ పరిశోధనలూ జరిపిన వారిలో నూటికి ముప్పాతిక మంది మొట్టమొదటి తెలుగు నవల అనదగ్గది రాజశేఖర చరిత్రే అని తేల్చారు. అని 'నూరేళ్ళ...తెలుగు నవల' అనే వ్యాసంలో డి. వెంకట్రామయ్య తెలిపారు.[26] ఇలా రాజశేఖర చరిత్ర తర్వాత తెలుగు నవలా సాహిత్యంలో నవలలు విస్తృతంగా రాయబడ్డాయి.

## 1.6.. చిలకమర్తి నవలలు– సంక్షిప్త పరిచయం:

తెలుగు నవలా సాహిత్యంలో చిలకమర్తి వారికి ప్రత్యేక స్థానం ఉంది. ఈయన సంఘ సంస్కరణతో నవలలు రాశాడు. అలాగే చారిత్రక, పౌరాణిక నవలలను కూడా రాశాడు.

### 1.6.1..రామచంద్ర విజయం(1986):

ఇందులోని ప్రధాన పాత్ర రామచంద్రుడు. ఇతను అమలాపురంలో విశ్వనాథ శాస్త్రుల వారి వద్ద విద్యనభ్యసించడానికి వచ్చానని శోభనాచలంతో చెప్తాడు. శోభనాచలం రామచంద్రునికి తల్లిదండ్రులు లేరని తెలిసి అతనిని మోసపూర్వకంగా అనేక మాటలతో తన ఇంటి వద్ద ఉంచి అతని దగ్గరున్న మురుగులు, కమ్మలు అమ్మించి ఆ డబ్బంతా అప్పు పేరుతో కాజేస్తాడు. తర్వాత రామచంద్ర రాజు ఎన్నిసార్లు తన అప్పు ఇవ్వమని అడిగినా ఇవ్వడు. విశ్వనాథ శాస్త్రులు రామచంద్రుని విద్యా కౌశలాన్ని మెచ్చుకుంటాడు. గతిలేక ఉన్న రామచంద్రునిని శరభరాజు తన ఇంట్లోనే స్థానమిస్తాడు. ఇది ఓర్వలేని శరభరాజు దూరపు బంధువు వెంకటరత్నం అతనిని ఇంటనుండి వెళ్ళగొట్టించే ప్రయత్నాలు చేస్తాడు. రామచంద్రరాజు వెంకట రత్నం ద్వారా ఎన్నో అవమానాలు ఎదుర్కొంటాడు. వెంకటరత్నం సూర్యనారాయణ అను అతనిని రామచంద్రునికి పరిచయం చేసి సూర్యనారాయణ దగ్గరున్న నగలను అమ్మింపచేయాలని చెప్తాడు. రామచంద్రుడు అలాగే చేసి డబ్బు ఇప్పిస్తాడు. తర్వాత

---

[26]కొండలరావు, వెల్చాల.(సం),జయంతి త్రైమాసికపత్రిక,సంచిక-3,సంపుటి-12,పుట:07.

దీనిని ఉపయోగించుకుని వెంకటరత్నం రామచంద్రుడు దొంగ నగలు అమ్మింపచేసి డబ్బులు తీసుకున్నాడనే ఆరోపణకు లోనయ్యేటట్టు చేస్తాడు. ఇది నిజమనుకుని శరభరాజు అతనిని వెళ్ళి పొమ్మంటాడు. ఆపద సమయంలో శరభరాజు కొడుకు రాజ గోపాలం రామచంద్రరాజుకు తోడుగా ఉంటాడు. రామచంద్రరాజు తనకు గొప్ప అవమానం ఈ అమలాపురంలో కలిగిందని ముక్తేశ్వరానికి వెళ్ళదలుస్తాడు. ఇది తెలుసుకున్న వెంకటరత్నం, శోభనాచలం అతనిని కొట్టే ప్రయత్నాలు చేయగా శోభనాచలానికి పాము కరుస్తుంది. రామచంద్రుడు తనకు ప్రాణాపాయం ఉందని తెలసి వేరే బ్రాహ్మణ వేషంలో తిరుగుతూ శోభనాచలాన్ని చూసి అతనికి వైద్యం చేసి ప్రాణాలు కాపాడి వెళ్ళిపోతాడు. శోభనాచలం విషయం తెలుసుకుని రామచంద్రున్ని ఎన్ని కష్టాలు పెట్టినా నాకు ప్రాణదానం చేశాడని బాధపడ్తాడు. రామచంద్రుడు ఎట్టకేలకు ముక్తేశ్వరం అక్కడి నుండి కోటిపల్లికి చేరి శంకరరావు దగ్గర ఉద్యోగం చేస్తాడు. అక్కడ కూడా ఇతని పని తనానికి ఓర్వలేని వారుంటారు. ఇంతలో శరభరాజు వేరే పనిమీద వెళ్తూ వెంకటరత్నం, శోభనాచలం మాట్లాడుకునే మాటలు విని రామచంద్రుడు నిర్దోషి అని భావించి తనను ఇంటనుండి వెళ్లగొట్టినందుకు చాలా విచారపడి తన కుమార్తె పార్వతిని రామచంద్రునకు ఇచ్చి వివాహం చేయడానికి నిశ్చయించి ముహూర్తం పెట్టించి రామచంద్రుడున్న ఊరికి వెళ్ళి తనను క్షమింపమని అడుగుతాడు. పార్వతి విషయం తెలియజేస్తాడు. రామచంద్రునికి ఇంత గొప్ప సంబంధం వచ్చిందని ఓర్వలేని అతని పినతండ్రి కొన్ని మాయ మాటలు చెప్పి వేరే వివాహానికి సిద్దం చేయిస్తాడు. రాజ గోపాలం అడ్డుపడతాడు. రామచంద్రుడు నిజం తెలుసుకుని పార్వతినే వివాహమాడుతాడు. పార్వతి, రామచంద్రుడు కోటి పల్లిలోనే కాపురం ఉంటూ సుఖంగా జీవిస్తారు.[27]ఈ విధంగా రామచంద్రుడు ఎన్నో కష్టాలను ఓర్చి అతని సుగుణత్వమే అతని విజయానికి కారణమవడం చేత ఈ నవలకు ఈ పేరు సార్థకమైందని భావిస్తున్నాను. అలాగే పశ్చాత్తాపాలు, ఓర్వలేనితనం ఇందులో కనబడతాయి. ‘‘రామచంద్ర విజయము’ చిలకమర్తి వారి

---

[27]లక్ష్మి నరసింహం, చిలకమర్తి, రామచంద్ర విజయం.

నవలలో మొట్ట మొదటిది కందుకూరి వీరేశలింగం పంతులు గారు రాసిన 'రాజశేఖర చరిత్ర' ను ఆదర్శంగా స్వీకరించి రాయబడిన నవల.''[28]

### 1.6.2.రాజారత్నం(1987):

ఈ నవలలో రాజా రత్నం అందగత్తె, చదువుకున్నది, తెలివైనది. భాగవత ఘట్టాలను చదువుతూ రామనాథ శాస్త్రి దగ్గర సందేహాలు తీర్చుకుంటూ తండ్రి రామలింగ స్వామికి వినిపిస్తూ ఉండేది. ఈమెకు చదువుకున్న వాడికే ఇచ్చి వివాహం చేయాలని, రామలింగ స్వామి, ఇతని కొడుకు కేశవ రాజు నిశ్చయించుకుంటారు. శంకర రాజు కొడుకు జగన్నాథరావుకి ఇచ్చి వివాహం చేయదలుస్తారు. కాని శంకర రాజు కట్నానికి ఆశపడేవాడు జగన్నాథ రావు ఎలాగైనా రాజా రత్నాన్నే వివాహం చేసుకోదలచి కేశవ రాజుతో కలసి పురుషోత్తముని దగ్గర జగన్నాథరావు హామిపత్రంతో డబ్బు అప్పు తీసుకుంటాడు. ఈ డబ్బును రామలింగ స్వామి శంకర రాజుకు కట్నంగా ఇచ్చి రాజా రత్నం, జగన్నాథరావు కి వివాహం జరిపిస్తాడు. పురుషోత్తమ రావు మరణించడం చేత అతని మేనమామ జగన్నాథరావు ఇచ్చిన హామి పత్రాన్ని చూసి అప్పు రాబట్టే ప్రయత్నంలో జగన్నాథరావుకి సమన్లు జారీ చేస్తాడు. ఈ విషయం తెలుసుకున్న శంకర రాజు తన కొడుకు చేసిన పనికి కోపపడుతూ ఆ డబ్బంతా తానే చెల్లిస్తాడు. అప్పటి నుండి శంకర రాజుకి ఎలాగైనా కొడుకును తన అధీనంలో పెట్టుకోవాలని, పోయిన డబ్బును తిరిగి రాబట్టాలని, రామలింగ స్వామి కుటుంబాన్ని అవమానంపాలు చేయాలని ఆలోచించడం మొదలు పెట్టాడు. ఈ క్రమంలోనే జగన్నాథరావుకి తెలియకుండా శంకర రాజు, గోవింద రాయుడు సహాయంతో రఘుపతిగారి సంబంధాన్ని కుదుర్చుకుని కట్నం డబ్బుల్ని ముందుగానే తీసుకుంటాడు. శంకర రాజు తన భార్యను జగన్నాథరావు చదువుకుంటున్న మద్రాసు నగరానికి పంపి కొడుకు మరో వివాహానికి ఒప్పుకునేట్లు చేయమంటాడు. తల్లి నిర్బంధం చేత జగన్నాథ రావు ఇష్టంలేక పోయినా మరో వివాహానికి ఒప్పుకుంటాడు. ఈ విషయం తెలుసుకున్న కేశవ రాజు జగన్నాథ రావులో మార్పు వచ్చే విధంగా ఒక లేఖ రాసి పంపుతాడు. జగన్నాథరావుకి తన తండ్రి చేయుచున్న రెండో వివాహం మొదటి నుండి ఇష్టం లేక పోవడం చేత, కేశవ

---

[28]నాగభూషణ శర్మ, మొదలి. చిలకమర్తి లక్ష్మినరసింహం,పుట:12.

రాజు ఉత్తరంలో రాసిన మాటలు అతనిలో పరివర్తనం కలుగు చేయుటచేత జగన్నాథ రావు ఈ వివాహాన్ని ఎలా తప్పించాలని ఆలోచిస్తాడు. ఇంతలో గుంటూరులో ఉన్న స్నేహితుడు సూర్యనారాయణ రావు భార్య మరణించిందని తెలిసి అతన్ని ఓదార్చడానికి తండ్రి అనుమతి లేకున్నా వెళ్తాడు. రఘుపతిగారి సంబంధాన్ని సూర్య నారాయణరావుని చేసుకోమంటాడు. జగన్నాథ రావు వెంటనే తన తండ్రి చేసిన పనులను తాను నిర్ణయించిన సంబంధాన్ని గురించి రఘుపతిగారికి ఉత్తరం రాస్తాడు. రఘుపతిగారు జగన్నాథ రావు మంచితనాన్ని మెచ్చుకుని సూర్యనారాయణ రావుని అల్లున్ని చేసుకొనుటకు నిశ్చయిస్తారు. జగన్నాథ రావు ఎవరికి తెలియనివ్వ వద్దని సూర్యనారాయణ రావు దగ్గర కొంత డబ్బు తీసుకుని హైదరాబాదుకు వెళ్తాడు. శంకర రాజు తన కొడుకు చేసిన పనికి అతన్ని తిడుతూ గోవింద రాయుడి సలహా మేరకు రాజా రత్నాన్ని తన ఇంటికి తీసుకువస్తాడు. కేశవ రాజు, మంగమ్మ(రాజా రత్నం తల్లి) పిల్ల సంతోషంగా ఉందని జగన్నాథ రావు పేరు మీద గోవింద రాయుడు రాసిన ఉత్తరాన్ని చూసి జగన్నాథ రావు త్వరలోనే ఇక్కడకు వస్తాడని తెలిసి వారు వారి ఇంటికి వెళ్ళిపోతారు.

శంకర రాజు, గోవింద రాయుడు రాజా రత్నానికి విషమిచ్చి చంపే ప్రయత్నంలో ఆవు పెరుగు లో విషం కలుపుతారు. ఈ విషయం తెలియని శంకర రాజు భార్య ఆ పెరుగుని శంకర రాజుకి, గోవింద రాయుడికి వడ్డిస్తుంది. దానితో వారు మనం చేసి తప్పులకు మనమే శిక్ష అనుభవిస్తున్నామని అనుకుంటూ మరణిస్తారు. ఈ విషయం కేశవ రాజు జగన్నాథరావుకి కబురు పంపించగా వస్తాడు, తన తండ్రి కుట్రను గ్రహించి విచారిస్తాడు. తర్వాత చదువు పూర్తి చేసుకుని డిప్యూటి తాహసిల్దారుగా ఉద్యోగం సంపాదించి రాజరత్నంతో సుఖంగా జీవిస్తాడు. చివర రచయిత ఆశ చేత ఇతరులకు హాని కలిగించే వాడు తానే నాశనమైపోతాడని ఉపదేశాన్ని ఇవ్వడంతో నవల పూర్తవుతుంది.[29]

అయితే నవలకు రాజా రత్నం అని పేరు పెట్టారు కాని ఆ పాత్ర ఇందులో ఎక్కువగా కనబడదు. ఈమె వివాహానికి చేసిన అప్పుకోసం, దాన్ని తీర్చడంలో ఏర్పడిన స్పర్థలతోనూ నవల కొనసాగుతుంది.ఈ నవలలో వరకట్న సమస్య

[29]లక్ష్మీ నరసింహం, చిలకమర్తి. రాజా రత్నం

అంటరానితనం కూడా కొంత చిత్రీకరించబడింది. బహుశా ఆనాటి పరిస్థితులు ఈ విధంగా ఉన్నాయని రచయిత చెప్పి ఉండవచ్చునని నేను భావిస్తున్నాను. ఈ నవలలో ఒకచోట కేశవ రాజు చదువుకోవడానికి ఊరికి బయలుదేరినప్పుడు తల్లి అప్పడాలు, వడియాలు మున్నగు ఆహారపదార్థాలు ఇస్తుంది. తినే వస్తువులు కనుక అవి శూద్రులు పట్టుకోకూడదు అని తండ్రి ఆ ఆహారపదార్థాల డబ్బాను తానే స్వయంగా పట్టుకుని కొడుకుకు ఇచ్చి పడవ ఎక్కిస్తాడు.[30]ఈ సన్నివేశంలో అంటరానితనం కనబడుతుంది. చిలకమర్తి వారు ఆ కాలపు స్థితిగతులు ఎలా ఉన్నాయో ప్రజల ఆలోచనా తీరు ఏవిధంగా కొనసాగిందో తెలియజేయడం కోసం ఇటువంటి సన్నివేశాలను చిత్రీకరించి ఉంటారు.

### 1.6.3..సౌందర్య తిలక(1994):

ఈ నవలలోని కథను పరిశీలిస్తే రోహణకుడు పూలచెండులో ఒక దివ్య కుసుమం ఉందని దానిని సౌందర్య తిలకకు ఇమ్మని నాగ వల్లకి ఇస్తాడు. ఆమె ఒక ముసలి వానికి సహాయం చేయు పనిలో పడి ఆ పూల చెండును ఎవరికో అమ్మివేస్తుంది. ఆ పూల చెండు లో కళానందుడు సౌందర్య తిలకను ఉద్దేశించి రాసిన ఉత్తరం ఉంటుంది. ఈ పూల చెండు జయసేనుని ఇంట్లో ఉండడం. దానితో జయసేనుడు భార్య తారామతి, తారామతి చెలికత్తె రాజ లేఖ చదువుతారు. సన్నిహితుని ఇంటనుండి వచ్చిన జయసేనుడు ఉత్తరం చూసి అందులో ఉన్న విషయం తన భార్యను ఉద్ధేశించిందేనని అనుమానపడి మనస్తాపానికి గురవుతాడు. రణార్ణవుడు, నాగవల్లితో సౌందర్య తిలక తనను వరించేలా చేయమని అడుగుతాడు. నాగవల్లి సౌందర్య తిలకకు జరిగిన వృత్తాంతమంతా చెప్తుంది. సౌందర్య తిలక చెలికత్తె రాగలతిక నాగవల్లిని ఉత్తరాన్ని పోగొట్టినందుకు తిడుతుంది. ఒకసారి జయసేనుడ్ని పలుకరించడానికి వచ్చిన రణార్ణవునకు ఆ ఉత్తరం దొరుకుతుంది. ఆ ఉత్తరంలో మన రాజ్యలక్ష్మికి వైధవ్యమును, మనకు కళ్యాణమును ఒకే ముహూర్తంలో జయసేనుడు కృష్ణుని చెంత చేరి తనకు ఆపద కలుగజేయదానికి ప్రయత్నిస్తున్నాడని అతనిని అనుమానించి తన స్నేహితుడు విజయ సేనుని కుమారుడు జయసేనుడు ఎంత పనిచేశాడని అతనిని బంధిస్తాడు.

---

[30]లక్ష్మీనరసింహం,చిలకమర్తి.రాజారత్నం,పుట:66

ఇది ఇలా ఉండగా కళానందుడు కృష్ణుని దగ్గరకు వెళ్ళి తాను విక్రమవర్మ పుత్రుడునని, తన తండ్రికి జరాసంధునికి గల స్నేహాన్ని తెలియజేస్తాడు. జరాసంధుడు, రణార్ణవుడు వంటి దుష్టులకు తాను దూరంగా ఉన్నానని చెప్తాడు. అలాగే తాను సౌందర్య తిలకను ప్రేమించిన సంగతి, రణార్ణవుడు సౌందర్య తిలక మీద మనసు పడిన విషయం అన్ని చెప్పి తనను రక్షింపమని వేడుకుంటాడు. కృష్ణుడు అర్జునుని వైపు చూసి ఇది మనకు శుభసూచకంగానే తోస్తుందని చెప్తాడు. అర్జునుడు, కృష్ణునితో ధర్మరాజు తలపెట్టే రాజసూయ యాగానికి సహకరించమని చెప్పి వెళ్ళిపోతాడు. కొంత కాలం తర్వాత కృష్ణుడు కళానందున్ని ధర్మరాజు దగ్గరకు రాయబారిగా పంపుతూ రాజసూయ యాగం నాడే జరాసంధుని వధ జరుగుతుందని కొన్ని రాజనీతి విషయాలు చెప్పి పంపిస్తాడు.

కళానందుడు అతని సేవకుడు శ్రావణునితో కలసి బయలుదేరుతారు. మాటలలో పడి దారి తప్పుతారు అది మాదిగ పల్లి అని తెలుసుకుని వేరే గ్రామానికి చేరుకునే మార్గంలో కళానందుడు మూర్ఛపోతాడు. శ్రావణుడు నది దగ్గరకు వెళ్ళి నీళ్ళు తెచ్చేసరికి కళానందుడు కనిపించడు. శ్రావణుడు అతను మరణించాడేమోనని బాధపడుతుండగా కపాలమాల అనే రాక్షసుడు శ్రావణుడు జరాసంధుని మనిషేనని ఆ అరణ్యానికి రాజైన జ్వాలా జిహ్వుని దగ్గరకు తీసుకెళ్తాడు. శ్రావణుడు అక్కడ రాక్షసుల చేత పెంచబడిన ఇందుమతి వృత్తాంతాన్ని తెలుసుకుని ఆమెను తప్పించే ప్రయత్నంలో కరభముని ఆశ్రమం చేరుతారు. ఇందుమతి అక్కడ క్షేమంగా ఉంటుంది. శ్రావణుడు మరలా రాక్షసుల చేత చిక్కి ఇందుమతి ఎక్కడుందో చెప్పకపోవడంతో వారి చేతిలో మరణిస్తాడు. శిశుపాలుడు వేటకు వెళ్ళి కరభమహాముని ఇంట్లో తలదాచుకున్న ఇందుమతిని చూసి ముని ఇంట్లో లేకపోవడంతో ఆమెను తన అంతఃపురానికి తీసుకువెళ్ళిపోతాడు. అంతకు ముందే శిశుపాలుడు కళానందున్ని బంధించి ఉంటాడు. రణార్ణవుడు కేతకీదళములోని అక్షరాలు ఎవరివో తెలుసుకోవడానికి యోగిని రూపంలో ఉన్న నాగవల్లిని సమీపిస్తాడు. నాగవల్లి ఆ ఉత్తరాన్ని చూసి అతనికి తెరచాటు నుండే ఏదో విధంగా రణార్ణవుడిని పంపించేసి ఆ లేఖ సౌందర్య తిలకకు అందేట్లు చేస్తుంది. అందులోని విషయాన్ని గ్రహించిన సౌందర్య తిలక సంతోషిస్తుంది.

శ్రీ కృష్ణుడు ధర్మరాజు వద్దకు రాయబారిగా వెళ్ళిన కళానందుడు శిశుపాలుని చేతిలో బంధించబడ్డాడని తెలుసుకుంటాడు. వాసుదేవుడు జాతవేదున్ని అతనికి సహాయంగా వేగులవాడు కౌశలకుని పంపుతారు. వీరు పన్నిన ఉపాయం చేత కళానందున్ని, ఇందుమతిని శిశుపాలుని బారి నుండి తప్పిస్తారు. కళానందుడు కృష్ణున్ని చేరుకోగా అతను చెప్పిన ఉపాయం ప్రకారం మారువేషంలో కోరకకాణభూతుల సహాయంతో గిరివ్రజ పురం ప్రవేశించి సౌందర్య తిలకను కలుసుకుంటాడు. ఎక్కదున్నాడో తెలుసుకుని బంధిస్తాడు. అంతకుముందే సౌందర్య తిలక, ఈమె తండ్రి చంద్రపాలుడు జరాసంధుని దగ్గర బంధీయై ఉంటారు. వీరంతా వాసుదేవుని రాక కోసం ఎదురుచూస్తుంటారు.

జరాసంధుని కొడుకు సహదేవుడు తండ్రితో నీవు అధర్మ కార్యాలు చేస్తున్నానని, నిరపరాధులను బంధించావని ఇది తప్పని మాట్లాడుతాడు. జరాసంధుడు వాటిని పట్టించుకోడు. కృష్ణుడు, భీముడు ప్రవేశిస్తారు. భీముడికి జరాసంధునికి మల్ల యుద్ధం ఏర్పరచడం, జరాసంధుడు మరణించడం కృష్ణుని మాట ప్రకారం సహదేవుడు బంధీయై ఉన్న వారందరిని విడిచి పెడ్తాడు. కళానందుడు, సౌందర్య తిలక వివాహం తన అంత:పురంలోనే ఏర్పాటు చేస్తాడు. కళానందుని ద్వారా జయసేనుడు కేతకీ దళ వృత్తాంతం తెలుసుకుని భార్య తారామతిని క్షమించమని కోరి ఆమెను దగ్గరకు తీసుకుని సంతోషంగా ఉంటారు. జరాసంధుని ఉంపుడుగత్తె కుమారుడు అయిన రణార్ణవుడు తనకు కృష్ణుని వలన ఏ ఆపద కలుగుతుందోనని భయపడుతుంటాడు. సహదేవునితో తనకు అర్థరాజ్యమిమ్మని లేద మంత్రి పదవినైనా ఇమ్మని కోరగా సహదేవుడు అతనిని తిట్టి నువ్వు బతికి ఉండడమే ఎక్కువని ఇక్కడ నుంచి వెళ్ళిపోమంటాడు. ధర్మరాజు వద్ద క్షేమంగా ఉన్న ఇందుమతికి, ప్రద్యుమ్నుని స్నేహితుడు యశోధరునికి కృష్ణుడు దగ్గరుండి వివాహం జరిపిస్తాడు. శిశుపాలున్ని వధిస్తాడు. ధర్మరాజు రాజసూయ యాగానంతరం సంతోషంగా తన ప్రజా పాలనను కొనసాగిస్తాడు. ఇంతటితో నవల పూర్తవుతుంది.[31]ఈ నవలలో ఒక సందర్భంలో కళానందుడు, శ్రావణుడు దారి తప్పి మాదిగ పల్లి ప్రవేశిస్తారు. అక్కడ వారి మాటల్లో వేదాధ్యయనం చేసిన కర్మనిష్టుడగు

[31]లక్ష్మి నరసింహం, చిలకమర్తి, సౌందర్య తిలక.

ఉత్తమ బ్రాహ్మణునికి చండాలవాటి యందు నోటికి అన్నము నీరు ఎట్లు పోవునని ఆ గ్రామం విడిచి వేరే గ్రామం దగ్గరలో ఎక్కడుందని తెలుసుకుని బయలుదేరుతారు.[32]

ఇక్కడ రచయిత మాదిగ కులస్థుల పేరు తేవడం ఆనాటి కాలంలో ఆ పరిస్థితులు తక్కువ జాతి వారిని ఏ విధంగా భావిస్తున్నారో తెలియజేయడానికి పై మాటలను పాత్రల ద్వారా చెప్పించాడేమోనని నా అభిప్రాయం. చిలకమర్తి వారు సౌందర్య తిలక అనే పేరుతో ఈ పౌరాణిక నవలను రాశారు. ఇందులో ప్రసిద్ధమైన కథగా జరాసంధవధను, ధర్మరాజు రాజసూయ యాగం చేయటం మున్నగునవి చెప్పుకోవచ్చు. తక్కిన వృత్తాంతమంతయు కల్పితంగా ఉందని అర్థమవుతుంది. అయినప్పటికి నవల ప్రారంభంనుండి చివరి వరకు ఆసక్తితో చదవాలనే తపన పాఠకులకు కలుగుతుంది. ఇందులోని ప్రధాన కథ కళానందుడు, సౌందర్య తిలక వివాహం, జరాసంధుని వధ, ఇందుమతి, యశోధరుని వివాహం మొదలైన కథలు ఆసక్తికరంగా ఉన్నాయి. ఈ నవలలో రెండు భాగాలున్నాయి. మొదటి భాగంలో ఇరవై మూడు ప్రకరణాలు, రెండవ భాగంలో ఇరవై రెండు ప్రకరణాలతో ఈ నవల చక్కగా రచించబడింది.''ఈ నవల పౌరాణిక నవల అని అన్నా ఇందులో కల్పితమైన కథల వలన దీనికి ఆ పేరు ఎంతవరకు సార్థకమన్నది ఆలోచించాలి. పౌరాణికాంశాన్ని సంధించి నాలుగు కథలను అమర్చారు చిలకమర్తి . అందుకే దీన్ని పౌరాణిక నవల అనడం ఉచితం కాదని 'ఆంధ్ర నవలా పరిణామంలో' బి.వి కుటుంబరావు వివరించారు.[33]

పై పేర్కొన్న నవలలే గాక చిలకమర్తి వారి ననలలు సాంఘిక, చారిత్రక, పౌరాణిక, నవలలుగా విభజించబడ్డాయి. రామచంద్ర విజయం, గణపతి, రాజా రత్నం, విజయలక్ష్మి, దుందుభి అనేవి సాంఘిక నవలలు. హేమలత, అహల్యాబాయి, కర్పూర మంజరి, మణి మంజరి, కృష్ణవేణి, శాపము, సువర్ణ గుప్తుడు అనేవి చారిత్రక నవలలు. సౌందర్య తిలక అనేది పౌరాణిక నవలలు[34]ఈ విధంగా చిలకమర్తి వారు నవలా సాహిత్యంలో ఉన్నతస్థానాన్ని సంపాదించుకున్నారు.

---

[32]లక్ష్మినరసింహం,చిలకమర్తి,సౌందర్యతిలక,పుట:78.

[33]భారతి, ముక్తేవి. చిలకమర్తి సాహిత్యసేవ,పుట:220.

[34]భారతి ,ముక్తేవి. చిలకమర్తి సాహిత్యసేవ,పుట:182..

## 1.7. విశ్వనాథ నవలలు– సంక్షిప్త పరిచయం:

విశ్వనాథ వారు నవలా సాహిత్యంలో సామాజిక విషయాలను పొందుపరిచాడు. వాస్తవిక చిత్రణను పాఠకులకు అందించాడు.

### 1.7.1. ఏకవీర(1925):

ఈ నవలలో వీర భూపతి, కుట్టాన్ సేతుపతి మంచి స్నేహితులు వీర భూపతి ఏకవీర ను, కుట్టాన్ సేతుపతి, మీనాక్షిని ప్రేమిస్తారు. కాని పెద్దల ఆజ్ఞను మీరలేక వీర భూపతి, మీనాక్షికి, కుట్టాన్ సేతుపతికి ఏకవీరతో వివాహం జరుగుతుంది. ఈ విషయం వీర భూపతి, కుట్టాన్ సేతుపతికి ఒకరి ప్రియురాళ్లను మరొకరు వివాహం చేసుకున్న సంగతి తెలియదు. నవల ప్రారంభంనుండి వీర భూపతి, కుట్టాన్ సేతు పతిని ప్రియురాలిని మరచి భార్యను ప్రేమించ మంటాడు. కుట్టాన్ అది తన వల్ల కావడం లేదని చెప్తాడు. ఏకవీర మాత్రం తాను చూసిన వ్యక్తి(వీర భూపతి) రూపాన్ని మరచి కుట్టాన్ సేతుపతికి దగ్గర కావాలని ప్రయత్నించినా ఫలితముండదు. వీర భూపతి ఏకవీర ను మనసులో రానీయక మీనాక్షిని దగ్గరకు తీసుకుందామంటే మీనాక్షి వేదాంతాలు, సిద్ధాంతాలు మాట్లాడుతూ భార్యగా అన్ని సేవలు మాత్రమే చేస్తాను గాని సంతానం పొందాలనే ఆశ లేదంటూ భర్తను దూరంగా పెడుతుంది. కుట్టాన్ సేతుపతి వీర భూపతి భార్య తాను ప్రేమించిన మీనాక్షి అని తెలుసుకుని మొదట బాధపడినా వీర భూపతి ఇంటికి వెళ్ళి అతనికి విషయమంతా చెప్పి తాను మీనాక్షిని సోదరి ప్రేమతో చూస్తున్నానని ఇంతకంటే మరో దురుద్దేశం నాకు లేదని చెప్తాడు. చివరకు ఏకవీర ను చూసిన వీర భూపతి ఆమెను గాఢంగా వాటేసుకొంటాడు. తర్వాత తాను తన స్నేహితుని భార్యను అలా కౌగిలించుకున్నానని బాధపడ్డాడు. కుట్టాన్ సేతుపతి తన భార్యకు మీనాక్షి గురించి చెప్పి ఏకవీర ను స్వచ్ఛమైన హృదయంతో ఆమెను ప్రేమించాలని వస్తాడు. అప్పటికే వీర భూపతి కౌగిలింతను అనుభవించిన ఏకవీర నదివైపు వెళ్లడం కుట్టాన్ సేతుపతి ఆమెను వెంబడించడం, వీర భూపతి సన్యాసి రూపంలో కనబడటం జరుగుతుంది. ఏకవీర ప్రాణత్యాగం చేసుకుంటుంది. ఇది ఇందులోని ప్రధాన ఇతివృత్తం. ఈ నవలలో కుట్టాన్ సేతుపతి తండ్రి ఉదయన్ సేతుపతి ఇతడు ముద్దు కృష్ణప్ప నాయక

మహారాజు గారి ప్రధాన మంత్రులలో ఒకడు కస్తూరి రంగప్పనాయుడు, మధుర నాయకుల రాజ్యంలో ప్రధాన సేనాపతి. విశ్వనాథ నాయకుని మనుమడు వీరప్ప నాయుడు. వీరభద్ర భట్టరు కుట్టాన్ సేతుపతికి మంచి చెడ్డలు చూసేవాడు. ఇంకా తిరుమల నాయకుడు, మున్నగు చారిత్రక పురుషుల పేర్లను సూచించడం మూలంగానూ, మధుర నాయకుల పరిపాలనా విధానాన్ని ఈ నవలలో వర్ణించడం చేతను కొన్ని చారిత్రక సంఘటనలు ఇందులో చోటుచేసుకోవడం చేతను ఏకవీర నవలను చారిత్రక నవలగా పేరుపొందిందని తెలస్తుంది.[35]

''కాల్పనికోద్యమ ప్రభావమున జనించిన నవల ఏకవీర. రమణీయతను, స్పృహనీయతను హృదయోద్వేగమును మాత్రమే కాక మనస్వితను కూడా కాల్పనిక సాహిత్యమున ప్రధానం కావించుకున్న సాహిత్యోద్యమము. 'ఏకవీర' నవల సార్వకాలీనతను సాధించిందని విమర్శకుల అభిప్రాయం. 'ఏకవీర' అందు అనేక ప్రత్యేకతలను గమనింపవచ్చును. కథాకథనము, పాత్ర చిత్రణము, సాంఘికాచార వ్యవహారములు రాజకీయ వ్యవస్థ, ఆర్థిక పరిస్థితులు ఇట్టి విషయాలను మించి పాత్రల అంతస్తత్వపరిశీలనకు ఈ నవల ఖ్యాతి కాంచింది. మనో విశ్లేషణాత్మకమయిన నవలలో ఏకవీర ప్రముఖమైందని దిట్టకవి శ్యామలాదేవి 'విశ్వనాథ వారి నవలలో ముఖ్య స్త్రీ పాత్ర చిత్రణము' అనే సిద్ధాంత వ్యాసంలో తెలిపారు.[36]

పై విషయాలను గమనిస్తే దిట్టకవి శ్యామలాదేవి 'ఏకవీర' నవలను మనో విశ్లేషణాత్మక నవలగా భావించింది. ఇందుకు కారణం ఆ నవలలోని పాత్రల మనసులలో ఏర్పడిన సంఘర్షణలను ఆధారంగా చేసుకుని ఈ నవలను మనో విశ్లేషణాత్మక నవలగా భావించిందని నేను అభిప్రాయపడుతున్నాను.

''ముద్దు కృష్ణప్ప నాయకుడు మధురను పాలించింది. పదిహేడవ శతాబ్దం మొట్ట మొదటి పది సంవత్సరాలు ఆ కాలంలో మొదలైన కథ ఆ తరువాత ముద్దు వీరప్ప నాయకుడు పాలించిన పది పన్నెండేళ్లలో మొదటి కొంత కాలం జరిగి ముగిసింది. మధుర ను రాజధానిగా దక్షిణ దేశాన్ని పాలించిన తెలుగు నాయకుల

---

[35]సత్యనారాయణ, విశ్వనాథ, ఏకవీర.

[36]శ్యామలాదేవి, దిట్టకవి. విశ్వనాథ నవలలో ముఖ్య స్త్రీ పాత్రచిత్రణము(సి.వ్యా),పుట:237.

చరిత్ర వెలుగులోకి వచ్చింది. 1924 వ సంవత్సరంలో మద్రాసు విశ్వవిద్యాలయం చారిత్రక విభాగము మధుర నాయక రాజుల చరిత్రమును ప్రచురించింది. విశ్వనాథ వారి ఈ నవలలోని కథకు ఆ గ్రంథమే ఆధారమో ఏమో చూడాలి అని కేతవరపు రామ కోటిశాస్త్రి 'విశ్వనాథ వైఖరి'[37] అనే గ్రంథంలో వివరించారు.

## 1.7.2.దేవతల యుద్ధం(1942):

ఈ నవలలో శాస్త్రులు నీలకంఠం శాస్త్రి ఇంటికి వస్తాడు. అతనికి మడి ఆచారాల మీద ఆసక్తి ఎక్కువ. నీలకంఠ శాస్త్రికి, ఇతని భార్య సరోజకు పట్టింపు లేదు. ఆ రోజు మాత్రం శాస్త్రుల గారి కోసం సరోజ మడి కట్టుకుని ఉండి వంట చేస్తుంది. అతనికి ఇద్దరు మగపిల్లలు, ఇద్దరు ఆడపిల్లలు వారి తల్లిదండ్రుల వద్ద చనువెక్కువ. వారేమో మడి కట్టుకున్నారు. శాస్త్రుల వారి ముందు వారిని దగ్గరకు రానీయకుండా ఉండడానికి నానా అవస్థలు పడ్డారు. తర్వాత నీలకంఠశాస్త్రి జమిందారి దగ్గర దివానుగా పనిచేస్తుంటాడు. జమిందారు ప్రార్థనా మతాన్ని ఏర్పరుచుకుంటాడు ఆ మతంలో నీలకంఠశాస్త్రి అప్పుడప్పుడూ కలుస్తుంటాడు. జమిందారి భార్యకు జబ్బు చేస్తుంది. ఆ జబ్బు తగ్గాలంటే జమిందారి తల్లి వేంకటేశ్వరునికి మొక్కుకోమంటుంది. జమిందారుకి ఇష్టం లేకపోయినా ఆమె చెప్పినట్టు చేస్తాడు.

ఈ జమిందారు వంశం నిలబడడానికి పూర్వం వీరి పూర్వీకుల కోటమీదకు పక్క జమిందారులు దాడి చేసి అందరిని చంపేస్తారు. ఆ సమయంలో మూడేళ్ల జమిందారి కొడుకును ఒక బ్రాహ్మణుడు నా బిడ్డ అని చెప్పడంతో ఆ పిల్లవాడు బతికాడు. కొంతకాలానికి ఈ పిల్లవాడు జమిందారి బిడ్డ అని నిరూపింపజేసి జమిందారి వంశాన్ని నిలబెడతాడు. అప్పటి నుండి ఈ జమిందారు వంశంలోని అందరూ ఆ బ్రాహ్మణులకు కట్నాలు వగైరా పంపిస్తుండేవారు. అలా ఈ జమిందారి నిలబడింది. ఇప్పుడు జమిందారు ఆ బ్రాహ్మణులు తన మతంలో చేరలేదనేది ఒక్కటే కాని రాజ ఆచారాలు మాత్రం వారికి లభించేవి. జమిందారి గారి పూర్వులలో రామ శాస్త్రులు వారికి పౌరోహితులుగా, దివానుగా ఉండేవారు. జమిందారు గారి ఆస్తి

---

[37]రామకోటి శాస్త్రి, కేతవరపు. విశ్వనాథ వైఖరి, పుట:206.

విషయానికి సంబంధించిన కొన్ని ముఖ్య పత్రాలు రామ శాస్త్రులు దాచిపెట్టడం వలన ఆ జమిందారికి ఆయనంటే అభిమానం ఏర్పడింది. రామ శాస్త్రులు బతికినంత కాలం ఆ పత్రాలు ఆయన దగ్గరే ఉన్నాయి. అతను చనిపోవడంతో ఇప్పటి జమిందారు అతని కొడుకు సోమేశ్వరానికి పాతిక రూపాయల ఉద్యోగం ఇచ్చాడు. ఈ జమిందారి మతంలో దైవ సంబంధ విషయాలు లేకపోయినా సంఘ సంస్కార విలువలు ఉండడం చేత సోమేశ్వరాన్ని హరిజన బాలికను వివాహం చేసుకోమంటాడు. కాని అతను తన తల్లి ప్రకారం వివాహం చేసుకోవడం చేత జమిందారికి కోపం వస్తుంది. సోమేశ్వరం కోటలోనికి పోవడం మానేశాడు. సోమేశ్వరానికి ఆదాయం లేదు, ఇంటి బాధ్యత ఎక్కువైంది. వేరే దగ్గర ఉద్యోగం చేస్తున్నా అతనికి ముగ్గురు అక్కలు, ఇద్దరు చెల్లెళ్లు ఉన్నారు. చెల్లెళ్ల వివాహం అక్క గార్ల కూతుళ్ల వివాహం చేసే బాధ్యత కూడా ఇతని పై పడుతుంది. సోమేశ్వరం చెల్లెలు నిరంజని జమిందారికి తెలియకుండా కోటలోని రాణి గార్లను కలుసుకుని కొన్ని వస్తువులు పట్టుకువెళ్తుండేది. ఈ నిరంజనిని అప్పుడప్పుడు వేంకటేశ్వర స్వామి ఆవహిస్తుంటాడు. జమిందారు నిరంజనిని సోమేశ్వరం ఒక ముసలి వానికిచ్చి వివాహం చేస్తాడు జమిందారు ఈ విషయం తెలుసుకుంటాడు.

జమిందారి వారసులలో ఒకడైన బుచ్చిబాబు సోమేశ్వరాన్ని పలుకరిస్తాడు. పాతిక రూపాయలు సాయం చేస్తానంటే తన తండ్రి పరువు పోతుందని స్వీకరించడు. జమిందారు వీరు మాట్లాడిన మాటలు ఏమిటో  పొరుగింటి వారిని పంపించి ఆ మాటలు అతను సరిగ్గా చెప్పక పోవడంతో జమిందారు అపార్థం చేసుకుంటాడు. నీలకంఠ శాస్త్రుల ఆలోచన ప్రకారం సోమేశ్వరుని ఇంట ఉన్న పత్రాలు దొంగలించడానికి దొంగల్ని నియమిస్తాడు. సోమేశ్వరం విషయం గ్రహించి తానే స్వయంగా కోటకెళ్ళి ఆ పత్రాలు జమిందారికి ఇచ్చేస్తాడు. ఈ దొంగతనం వ్యవహారం జమిందారే చేయించారని ఊరంతా తెలుస్తుంది. వారిలో రంగ రాజయ్య గుమస్తాకూడా ఉన్నాడని అనుకుంటాడు. ఇతనంటే రాజుగారికి చాలా ఇష్టం నిరంజనికి  కూతురు పుడుతుంది ఆమె పేరు నీల, భర్త చనిపోవడంతో నిరంజని సోమేశ్వరం ఇంట్లోనే ఉంటుంది. నీల జమిందారి ఇంటికి వెళ్లడం అలవాటు చేసుకుంది. పెద్ద, చిన్న రాణి గార్లకు చాలా కబుర్లు చెప్తుంది. అవి జమిందారి

కూతురు భూదేవి కి నచ్చవు. నీలకు శిలారు అనే మూగ పిల్లవానితో స్నేహం ఉంటుంది. తనకు వచ్చిన కలలు ఆ పిల్లవాడికి చెప్తుంది. ఆ కలలో హనుమంతుడికి, తెల్ల దుస్తులు ధరించి దొరలుగా సిగరెట్టు కాలుస్తున్న అతనికి మధ్య యుద్ధం జరిగినట్లు ఉంటుంది. జమిందారు పెద్ద బావి త్రవ్వించారు బావిలో నీరు ఇండ్లలోకి చేరి మోకాళ్ళదాకా వచ్చేస్తుంటే దైవం అంటే పడని జమిందారు బ్రాహ్మణులు, తల్లి, భార్య చెప్పిన ప్రకారంగా జపాలు, హోమాలు జరిపిస్తాడు. ఒక వేళ మంత్రాలకు శక్తి ఉందేమోనని కార్యక్రమాలను మౌనంగా చూస్తుంటాడు. నీరు తగ్గుతుంది కాని జమిందారి వ్యాఖ్యానాలు యథాప్రకారంగానే సాగాయి. మొక్కు తీర్చమంటే కోపపడతాడు.

భూదేవి మద్రాసు పోవాలని పట్టు పట్టడంతో తండ్రి కూతుళ్లు మద్రాసుకు పోయి వచ్చి కొన్ని కొత్త అలవాట్లు నేర్చుకుంటారు. పార్టీలు చేయడం, బ్యాట్ మింటన్ ఆడటం లాంటివి. కూతురు నగలు తీసేసి జుట్టు క్రాప్ చేయించడం వంటి కొత్త పద్ధతులకు అలవాటు పడుతుంది. చీరకట్టడం మనేస్తుంది. చివరకు జమిందారి మద్రాసులోనే కూతురుకి వివాహం జరిపించాడు. చిన్న రాణి, పెద్ద రాణి ఊళ్లో ఉన్న సమయంలో జమిందారు మద్రాసులో పరకాంతకు అలవాటు పడ్డాడు. చిన్న రాణి దేవుణ్ణి నమ్ముకుంటే ఇలా చేశాడని అనుకుంటుంది. నీల కంఠ శాస్త్రి కొడుకు స్వామి కి పిచ్చి ఉంటుంది. సోమేశ్వరుని సలహా మేరకు జపాలు చేయించడం చేత స్వామికి పిచ్చి తగ్గుతుంది. నీలకంఠశాస్త్రి తన కొడుకు స్వామిని నీలకు ఇచ్చి వివాహం చేస్తాడు.[38]ఈ నవలంతా పూర్వపు ఆచారాలు, పూర్వపు దేవతలు, ఆధునిక ఆచారాలు, అధునాతన మతాల మధ్య జరిగే సంఘర్షణలాగా ఉంటుంది. కథ జరుగుతూనే ఉంటుంది. రచయిత చెప్పదలచుకున్న భావాలు పాత్రల మనో భావాలను వెల్లడిస్తూ అనేక విషయాలను మనకు అందిస్తాడు. ఆధ్యాత్మిక భావాలు, సంఘ సంస్కరణ భావాలు ఇందులో చిత్రీకరించబడ్డాయి.

### 1.7.3.హాహాహూహూ(1930):

[38]సత్యనారాయణ, విశ్వనాథ, దేవతల యుద్ధం.

ఈ నవలలో లండన్ ట్రాఫాల్గర్ వద్ద గుఱ్ఱం తల మనిషి ఆకారంలో పడి ఉన్న గంధర్వ రూపాన్ని అక్కడి వారందరూ ఒక జంతువుగా భావిస్తారు. ఆ గంధర్వున్ని వింతగా చూస్తూ ఉంటారు. ఆ గంధర్వ వేషధారణ విచిత్రంగా ఉంటుంది. ఒకడేమో ఈ జంతువు తనకు దొరికితే లండన్ జూలో పెట్టించి బహుమానం పొందేవాడేనని అనుకుంటాడు మరొకరు ఫ్రెంచి, ఆఫ్రికా దేశస్థులు ఎవరో దీనిని విమానంలో తీసుకుపోతుంటే అక్కడినుంచి పడిపోయిందేమో అంటాడు. హిందూ దేశంలో ఈ మృగాన్ని ఎవరో పెంచి ఉంటారు అనగా దానికి ఇంగ్లీషు వాడు ఆ దేశంలో మనుషులే మృగాలు వాళ్ళు మృగాలను పెంచడమెందుకు అన్నాడు అందరూ నవ్వుతారు.

కొంతసేపటికి లండన్ లోని అధికారులు, జంతుప్రదర్శనల వారు, మేయరు వస్తారు. పోలీసులు తుపాకితో ఆ గంధర్వుని చుట్టూ మూగుతారు. అతన్ని వందమంది పట్టుకెళ్లి ఒక బోనులో సంకెళ్ళతో బంధిస్తారు. కొన్ని రోజులకు గంధర్వుడు కదలడం, మాట్లాడటం ప్రారంభిస్తుంది. అతని మాటలు సంస్కృతంలో ఉండడం చేత ఎవరికి అర్థం కాదు. అతను సైగల ద్వారా నీరు కావాలని చెప్పి నీటితో స్నానం చేసి జపాలు చేసుకుంటాడు. అతని ప్రవర్తన ఎవరికి అర్థం కాదు. అనేకమంది భాషావేత్తలు, పశుశాస్త్ర వేత్తలు, జర్మని శాస్త్రవేత్తలు, సంస్కృత పండితులు అతని గురించి చాలా చర్చిస్తారు. మొదట పండితులు దాని సంగతులను తెలుసుకోవడానికి సంస్కృత భాషలోనే ఎక్కడ్నుంచి వచ్చారు, మీ పేరేమిటి? మీకు సంస్కృతం ఎలా వచ్చు అని అడుగగా అతను తనకు ఏమి జ్ఞాపకం లేదని మా దేశంలో సంస్కృతం మాట్లాడుతారని కాని ఏ దేశమో గుర్తుకురావడం లేదని చెప్తాడు. పండితులు సంస్కృత అనువాద రూపంలో పండితుల సహాయంతో జర్మని, ఫ్రెంచి వాళ్ళు ప్రశ్నలు అతనిని అడుగుతారు ఒక పండితుడు మీ పేరు హాహాహూహూ అనగా అతను ఆశ్చర్యంగా చూస్తాడు. అందరూ అదే పేరుతో పిలవడం ప్రారంభించారు. వారిలో గంధర్వుల వేషధారణ ఎలా ఉంటుందో పండితులు వివరించి చెప్తారు. జర్మని భాషావేత్తలు, ఫ్రెంచి పశు శాస్త్రవేత్తలు ఆ మనిషి ఎలా మాట్లాడుతాడని దాని నోటి నుండి ధ్వని ఎలా వస్తుందని పరిశీలించే క్రమంలో పండితులతో చర్చ ప్రారంభిస్తారు. ఈ క్రమంలో దానికి మత్తు మందు

ఇవ్వాలని ప్రయత్నించినా ఫలితం ఉండదు. అతను స్పృహలో ఉండగానే మెదడును కోసి పరిక్షించాలనుకున్నారు. హాహాహూహూతో నేరుగా మాట్లాడడానికి సిద్ధమయ్యారు. పండితులు, హాహాహూహూ మాటల్లో భాష ఎక్కడ్నుంచి పుట్టింది మున్నగు విషయాలు చర్చల్లోకి వస్తాయి. పండితులు అతనితో జర్మని, ఫ్రెంచి శాస్త్రవేత్తలు మీకు స్మృతి లేకుండా చేసి మీ మెదడును పరిశీలిస్తారనగా అతను ఇటువంటి చిలిపి ఊహలు మీకు ఎలా పుడతాయో నేను కూడా మీ మెదడులో పరిశీలిద్దాం అనుకుంటున్నాను. అనడంతో ఎవరికీ ఏమి చేయాలో అర్థం కాదు. అతనితో చర్చలు లాభం లేదని తుపాకీలతో కాలుస్తారు. కాని అతనికి  ఏమి కాక పోగా అతని రెక్కల బలానికి ఇనుప సంకెళ్లు పడిపోతాయి తర్వాత నుంచి అతన్ని ఎవరూ బంధించరు. స్వేచ్ఛగా లండన్ నగరం అంతా తిరుగుతాడు.

బిషప్పు వారు వచ్చి అతనితో మతాన్ని గురించి ప్రస్తావిస్తారు. హాహాహూహూ మాత్రం వాళ్ళను విచిత్రంగా చూసి సామాన్యులకు మతం లేదు మహర్షులకే మతం ఉంటుంది. అంటూ మతాన్ని ఉద్దేశించి మాట్లాడుతాడు. కొంతకాలానికి హాహాహూహూ గురించి ప్రపంచమంతా తెలుస్తుంది. హిందూదేశంలో వాళ్ళు ఎవరో గంధర్వుడు శాపవశాన వచ్చాడని భావిస్తారు. చైనా, జపాన్ దేశాల వాళ్ళు వాళ్ళ పురాణాలలోని వ్యక్తుల్ని ఇతనికి ఆపాదించి మాట్లాడుకుంటారు. జర్మని సంగీత పండితుడు పియానో వాయిస్తుంటే గంధర్వుడు అందుకుని సంగీతం వాయించడం మొదలు పెడ్తాడు. అది తంబూరగా మారిపోవడం అందరని ఆశ్చర్య పరిచింది. ఒక పండితుడి చేతికి గంధర్వుడు ఒక కాగితం ఇచ్చి తంబూరా వాయించుకుంటూ వెళ్లిపోతాడు. ఆ కాగితంలో గంధర్వుడు జంతుప్రదర్శన శాల సందర్శించినప్పుడు అవన్నీ ఇతన్ని చూసి కేకలు వేయడం, పరిగెత్తడం, గెంతడం చేశాయి. అది వాటి సహజత్వం. మనిషి కృత్రిమ జ్ఞానంతో నష్టపోతున్నాడని తెలియజేస్తాడు. అక్కడున్న వారిని ఉద్దేశించి ఇంత కన్నా చిలిపి ప్రాణులను నేనెప్పుడూ చూడలేదని ఈ విషయం నేను గంధర్వ లోకంలో చెప్తానని అంటాడు. ఇంతటితో నవల పూర్తవుతుంది.[39]

---

[39]సత్యనారాయణ, విశ్వనాథ. హాహాహూహూ.

మొత్తంగా ఈ నవలంతా మనిషి తన సహజమైన లక్షణాలను కోల్పోయి కృత్రిమత్వం కోసం ఆరాటపడుతూ వారి వ్యక్తిత్వాన్ని కోల్పోతున్నారని, జంతువులకున్న సహజ గుణాలు మానవులకు లేకుండా పోయాయనే విషయాన్ని తెలియజేసినట్లనిపిస్తుంది.ఈ నవలలో హిందూదేశంలో ఈ మృగాన్ని ఎవళ్ళో పెంచి ఉంటారు అని ఒక వ్యక్తి అనగా ఇంగ్లీషు తనమంతా మొగంలో ఉట్టిపడే ఒకడు హిందూ దేశంలో మనుష్యులే మృగాలు వాళ్ళు మృగాలను పెంచటం ఎందుకు అంటాడు[40]

అప్పట్లో మనం ఇంగ్లీషు వారి చేత పాలించబడే వాళ్లం. వాళ్ళు మనల్ని ఏవిధంగా చూసేవారో ఈ మాటలను బట్టి అర్థమవుతుంది. మరోచోట మతం గురించి చెప్తూ సామాన్యులకు మతం లేదు మహర్షులకే మతం ఉంటుంది. ఒకానొక మహర్షి చెప్పిన మతం నందు ఒకనికి విశ్వాసం ఉంటుంది. అల్పుని విశ్వాసం అల్పమైంది.[41] మత వ్యవస్థ నశించాలి సమానత్వం రావాలి అనే భావం ఈ మాటల్లో స్ఫురిస్తుంది. పై నవలలే కాకుండా విశ్వనాథ వారు అనేక నవలలు రాశారు. నవలా సాహిత్యంలో విశ్వనాథ కృషి అపారమైనది విశ్వనాథ వారి నవలలను క్రింది విధంగా వర్గీకరించవచ్చు. విశ్వనాథ వారి నవలలన్నింటినీ స్థూలంగా మూడు విధాలుగా విభజించవచ్చు. అవి సాంస్కృతిక నవలలు, సాంఘిక నవలలు, చారిత్రక నవలలు అని చారిత్రక నవలల్లో ఆంధ్ర చరిత్ర, దాక్షిణాత్య చరిత్ర, భారత చరిత్ర అని కాశ్మీరు చరిత్ర, నేపాలు చరిత్ర మొదలైన వాటికి సంబంధించినవిగా పేర్కొనవచ్చు.

1. సాంస్కృతిక నవలలు: అంతరాత్మ (1917), మూడు తరాలు (1932), హాహాహూహూ (1932).
2. సాంఘిక నవలలు: వేయిపడగలు (1934), దేవతల యుద్ధం (1942), వీర వల్లడు (1936), మాబాబు (1932), చెలియలి కట్ట (1932), స్వర్గానికి నిచ్చెనలు (1948), పునర్జన్మ (1964),తెరచి రాజు (1954), నీల పెండ్లి (1962), పరీక్ష (1949), శార్వం నుండి శార్వరి దాకా(1962).

[40]సత్యనారాయణ,విశ్వనాథ.హాహాహూహూ.పుట:06.

[41]సత్యనారాయణ,విశ్వనాథ.హాహాహూహూ.పుట:69.

బాణావతి(1964), కుణాలుని శాపం(1948), విష్ణుశర్మ ఇంగ్లీషు చదువు(1961), మ్రోయు తుమ్మెద(1960),

3. ఆంధ్ర చారిత్రక నవలలు : వీరపూజ (1948), చందవోయి రాణి (1970–71), ధర్మ చక్రము(1945),కలిమి చెట్టు(1943), ప్రళయ నాయుడు (1947), బద్దన్నసేనాని (1947).
4. దాక్షిణాత్య చారిత్రక నవలలు: ఏకవీర (1925), స్నేహ ఫలము (1948).
5. భారత చరిత్రకు సంబంధించిన నవలలు: వీటినే పురాణ వైర గ్రంథమాల అంటారు. భగవంతుని మీద పగ (1958), నాస్తిక ధూమము (1958), ధూమ రేఖ (1959), పులి ముగ్గు (1960), చంద్రగుప్తుని స్వప్నము (1960), నందో రాజ భవిష్యతి (1963), అశ్వమేధము (1960), నివేదిత (1963), హెలీనా (1963), వేదవతి (1963), నాగసేనుడు (1961), అమృత వల్లి(1960).
6. కాశ్మీరు చరిత్రకు సంబంధించిన నవలలు: యశోవతి (1965), మిహరకులుడు (1964), కవలలు (1965), పాతి పెట్టిన నాణెములు (1965), భ్రమర వాసిని (1965), సంజీవ కరణి (1965).
7. నేపాల్ చరిత్రకు పంబంధించిన నవలలు: దిండు కింద పోక చెక్క(1964), దూత మేఘము (1964), లలితా పట్టపు రాణి (1964), దంతపు దువ్వెన(1964).
8. రాజకీయ సంబంధించిన నవలలు: పులుల సత్యాగ్రహం(1948), సముద్రపు దిబ్బ(1960), వల్లభ మంత్రి(1958), దమయంతీ స్వయం వరం(1961).
9. సంగీత సంబంధించిన నవలలు: మ్రోయు తుమ్మెద (1960).
10. సాంస్కృతిక భౌగోళిక నవలలు: ఆఱు నదులు(1964),

ఈ నవల వర్గీకరణను 'నవలా సాహిత్య జగన్నిర్మాత విశ్వనాథ' అనే వ్యాసంలో ఎస్. గంగప్ప పేర్కొన్నారు.[42]

---

[42]కొండలరావు, వెల్చాల, జయంతి (త్రైమాసిక పత్రిక), సంపుటి:6, సంచిక:2, పుట:28,29.

ఈ అధ్యాయంలో చిలకమర్తి లక్ష్మీనరసింహం, విశ్వనాథ సత్యనారాయణ జీవిత వివరాలను తెలిపాను. గణపతి, వేయిపడగలు రేడియో నాటకాలుగా మలచారు. ఈ నవలల యొక్క మూల రచయితలు చిలకమర్తి, విశ్వనాథలు. కాబట్టి వారి నాటకాలను, నవలలను ఈ అధ్యాయంలో కొంత వరకు పరిచయం చేశాను. తర్వాతి అధ్యాయంలో నాటక సాహిత్యాన్ని, రేడియో నాటకాల చరిత్రను వివరిస్తాను.

రెండవ అధ్యాయం

# దృశ్య, శ్రవ్య నాటక వికాసం – గణపతి, వేయిపడగల నవలలు పరిచయం

నా పరిశోధనాంశం 'రేడియో నాటకాలుగా మారిన గణపతి , వేయిపడగల నవలలు విమర్శనాత్మక పరిశీలన' అందువలన రేడియో నాటకాలుగా నాటక సాహిత్య నేపథ్యాన్ని ముందుగా తెలుసుకోవాల్సిన అవసరం ఉందనుకుంటున్నాను. దశ విధ రూపకాలలో నాటకం ఒకటి. ఆ నాటకం ప్రజలకు చేరడానికి ఆకాశవాణి కేంద్రాలు కొన్ని మార్పులు, చేర్పులు చేసి శ్రోతలకు బాగా అర్థమయ్యే ట్లు ప్రసారం చేస్తున్నాయి. దాన్నే మనం రేడియో నాటకం అంటున్నాం.

రేడియో నాటకం అచిర కాలంలోనే ఒక ప్రత్యేక అస్తిత్వం కల ప్రక్రియగా రూపుదిద్దుకుంది. రేడియో నాటకాన్ని శ్రోత మన నేత్రంతోనే చూసి ఊహించుకోవాలి. నటుల గొంతుల వైవిధ్యం, సంగీతం, శబ్ద వైవిధ్యం, ధ్వనులు ఇవి అన్ని రేడియో నాటకానికి ఒక విధమైన తక్షణతను కలుగజేస్తున్నాయి.[1]

సాహిత్య పరిభాషలో రేడియో నాటకాన్ని శ్రవ్యనాటకం అంటారు. శ్రవ్యనాటకంలో సంభాషణ పటుత్వం, సంభాషణలలో వెలితిలేని వేగం, విషయ స్పష్టత, రసాభినయం, వాచకం, గొంతు మార్పిడి, మాధుర్యం ద్వారా శ్రోతల్ని మెప్పించ కలిగేదే శ్రవ్యనాటకం.[2] కాని ముద్రితమైన నాటకం కూడా శ్రవ్యనాటకంలో ఒక భాగంగా భావించే వీలుంది. కానీ, చదివే శ్రవ్యనాటకానికీ, వినే శ్రవ్యనాటకానికి కొంత తేడా ఉంది. అందువల్ల నేను రేడియో నాటకంగానే నా పరిశోధనాంశంలో స్వీకరించాను.

---

[1]నాగభూషణశర్మ, మొదలి. నాటక శిల్పం,పుట:235.

[2]అనంత పద్మ నాభరావు, ఆర్. రేడియో నాటకాలు చారిత్రక పరిశీలన, పుట:50.

గణపతి నవలను చిలకమర్తి లక్ష్మీనరసింహం 1917 సంవత్సరంలో రాశారు. నేను విశాలాంధ్ర పబ్లిషింగ్ ప్రచురణ సంస్థ వారి ఐదవ ముద్రణను ఈ పరిశీలనాంశంలో పరిశోధనకు స్వీకరించాను. అయితే, గణపతి నవల 1967 ఏప్రిల్ 16 న మధ్యాహ్నం 3 గంటలకు ఆకాశవాణి విజయవాడ కేంద్రం నుండి ప్రసారం చేశారు. ఇది గంట సేపు నాటకం.

వేయిపడగల నవలను విశ్వనాథ సత్యనారాయణ 1934 లో రాశారు. 1937 నుండి 1938 వరకు ఆంధ్రపత్రిక సచిత్ర వారపత్రికలో ధారావాహికంగా ముద్రితమయ్యింది. అయితే పుస్తక రూపంలో1939 లో వెలువడింది. ఇది పి. వి. నరసింహారావుగారు సహస్ర ఫణ్ పేరుతోహిందీలోకి1968లో అనువదించారు. తరువాత అనేక భారతీయ భాషల్లోకి అనువాదమయ్యింది. తెలుగు వేయిపడగల నవల 21 వ ముద్రణ నాటికి అనగా 2006 అక్టోబర్ నాటికి లక్ష ప్రతులు పూర్తయినట్లు విశ్వనాథ పావని శాస్త్రి పేర్కొన్నారు.[3] నేను నా పరిశోధనకు 2014 డిసెంబర్ లో వచ్చిన 27 వ ముద్రణను స్వీకరించాను.

వేయిపడగలు నవల రేడియో నాటకంగా ఆకాశవాణి హైదరాబాద్ కేంద్రం 2013 జులై 20 వ తేది  నుండి 23 శనివారాలు వరుసగా ఉదయం 7.15 నుండి 7.45 సమయం వరకు రేడియో నాటకంగా ప్రసారమయ్యింది.

ఇంత ప్రసిద్ధి చెందిన గణపతి, వేయిపడగల నవలలు రేడియో నాటకాలుగా మారేటప్పుడు ఎలాంటి మార్పులు చేర్పులకు గురయ్యాయో తెలియాలంటే నాటక వికాసం, లక్షణాలు అలాగే రేడియో నాటక చరిత్ర వాటి పూర్వాపరాలు పరిశీలించాల్సిన అవసరం ఉంది. అందువలన మౌలిక అంశాలను ఈ అధ్యాయంలో వివరిస్తాను.

భారతీయ నాటక చరిత్ర చాలా ప్రాచీనమైంది. అయినా తెలుగు నాటకం మాత్రం ఆధునిక యుగానికి చెందింది. మనుషుల సంబంధాలను, సంభాషణలను, హావభావ విన్యాసాలను కలగలుపుతున్న సాహితీ ప్రక్రియ నాటకం. చరిత్ర ప్రారంభ యుగానికే నాటకం ఒక ప్రత్యేక సాహిత్య ప్రక్రియగా సాంకేతిక నిర్మాణంతో అభివృద్ధి చెందింది. సామాజిక రాజకీయ సాంస్కృతిక వాతావరణం మారుతున్న కొద్ది శ్రవ్య

[3]సత్యనారాయణ, విశ్వనాథ, వేయిపడగలు, ఒక మాట.

కావ్యం ప్రాముఖ్యతను సంతరించుకుంది. దృశ్య కావ్యం చూడటానికి యోగ్యమైంది.[4]

| శ్రవ్యాంశాలు | | దృశ్యాంశాలు | |
|---|---|---|---|
| | వాచికం(నటుడి వాచిక విధానమంతా ఇందులో భాగమే) | | బంధాలు |
| | స్వరం | | రంగ పరికరాలు |
| | గానం | | హస్త పరికరాలు |
| | వాద్య సంగీతం | | కాంతి సాధనాలు |
| | నేపథ్య ధ్వనులు | | ఆహార్యం |
| | నేపథ్య సంగీతం | | దుస్తులు |
| | నేపథ్య వాద్య సంగీతం | | పాత్రలగతి విన్యాసం |

ప్రాచీన కాలం నుండి నాటకం హృదయానందభరితులను చేయడమే కాకుండా విజ్ఞాన  సంపదను అందిస్తూ నేటికీ తనదైన ఠీవి ప్రదర్శిస్తూనే ఉంది. దురాచారాలను రూపుమాపడానికి, సంఘ సంస్కరణ చేయడానికి ప్రజలను చైతన్యవంతులుగా తీర్చిదిద్దడానికి ఉపయోగపడే గొప్ప ప్రక్రియ నాటకం ఎందరో మహాకవులు ఈ నాటక సాహిత్యాన్ని ఆదరించి నాటకీయ విలువలను, నాటకరంగంలోని మాధుర్యాన్ని మనకందించారు.

నాటకంలో సాహిత్య ప్రమాణంతో పాటు సమాజ జీవన ప్రతిరూపం కూడా ఉంటుంది. నాటక విజయాన్ని ప్రధానంగా ఈ సామాజిక జీవన స్థాయితోనే బేరీజు వేసుకోవడం జరుగుతుంది. ఉత్తమ నాటక ఎంపికకు ఈ సామాజిక ప్రతిరూప సాంద్రతే ప్రధానపాత్ర వహిస్తుంది. అంటే నాటకం శుద్ధ సాహితీ మూర్తిగానే కాక,

[4]తెలుగు సాహిత్య విమర్శ దర్శనం, తెలుగు విశ్వవిద్యాలయం, సంపుటి –11, పుట:222.

ప్రజలను వెన్నంటి వచ్చే జన జీవన ప్రతిబింబ చైతన్య స్ఫూర్తిగా కూడా దర్శనమవుతూ ఉంటుంది.[5]

పై మాటలన్ని నాటకం యొక్క విశిష్టతను తెలియజేయడమే కాక నాటకం మన జీవన గమనాన్ని నిర్దేశిస్తుంది. చైతన్య స్ఫూర్తిని ప్రజలలో నింపి వారికి కొత్త జీవితాన్ని అందివ్వగల సామర్థ్యం నాటకానికే ఉంది అనే భావం స్ఫురిస్తుంది.

### 2.1. నాటకం నిర్వచనం:

నాట్యము ప్రదర్శన ప్రధానమవడం చేత దృశ్య కావ్యం, ప్రేక్ష కావ్యం, ప్రేక్ష, ప్రేక్షణీయం అనే పదాలు వ్యవహారంలోకి వచ్చాయి. 'నాటకము' దశ విధ రూపకాలలో ఉత్తమమైన రూపకం. అతి ప్రధానమైన రూపక భేదానికి పేరు అయిన ఈ 'నాటక' పదము నాట్యమను అర్థమందు, నాట్యశాస్త్రంలో అను ప్రయుక్తమై ఉంది. తెలుగులో ప్రప్రథమంగా రూపక లక్షణాన్ని రాసిన చిత్ర కవి పెద్దనార్యుడు(క్రీ.శ.1550 ప్రాంతం) తన 'లక్షణ సార సంగ్రహం' లో రూపకాలన్నింటినీ నాటక పదముతో వ్యవహరించి ఉన్నాడు. ఉదాహరణగా ప్రకరణ నాటకం, వ్యాయోగ నాటకం మొదలగునవి. నేడు 'నాటకమనే' పదం రూపక సామాన్యంగా లోకంలో రూఢమై ఉంది.[6]

పై నిర్వచనంలో నాట్యమనే అర్థంలో నాటక పదాన్ని నాట్య శాస్త్రంలో ఉపయోగించడం రూపకం అనే పదానికి పర్యాయ పదంగా 'నాటకం' అనేది లోక వ్యవహారంలో ప్రయోగించబడటం వంటి విషయాలు పై నిర్వచనాన్ని చూస్తే అర్థమవుతుంది.

"డ్రామా(drama) అనే పదము గ్రీకు భాషా పదము 'A thing done' అని దీనికి అర్థం. గ్రీకు కాలము నుండి ఇంచుమించుగా 18 వ శతాబ్ది వరకు 'డ్రామా' అను పదము 'పాశ్చాత్యులందరు వాడెడి వారు. పిమ్మట 'ప్లే'(Play) అనే పదము కూడా వ్యవహారమునా ప్రసిద్ధి చెందింది.

Stage, Theatre అనే పదాలు కూడా మనం నేడు ఎక్కువగా వాడుచున్నాము. Stage అనగా రంగస్థలం అని అర్థం. ఇంకను సూటిగా

---

[5]రమణ, పి. వి. పాశ్చాత్య నాటకం తెలుగు నాటకం పై ప్రభావం,పుట:83.

[6]అప్పారావు, పి. యస్ .ఆర్ .తెలుగు నాటక వికాసం,పుట:15.

చెప్పవలెనన్నచో రూపక ప్రదర్శనము కొరకు తదనుకూలముగా అలంకరించబడిన రంగస్థలము అని అర్థం. ఇంక Theatre అను పదము చాలా విశాలమైన అర్థము కలది. నాట్య శాల అనే అర్థమునే కాక, ప్రదర్శనమునకు సంబంధించిన సర్వ కార్య కలాపములను ఈ పదము వ్యక్తంచేయుచున్నది''[7]

ఈ నాటక నిర్వచనానికి సంబంధించిన పై వివరాలన్ని నాటక పదం ఎలా ఎక్కడ ఏ విధంగా ప్రయోగించబడింది వంటి విషయాలను స్పష్టం చేస్తుంది.

నాటకానికి రూపం సమగ్రంగా ఉన్నా, స్వభావంలో అంతస్సూత్రంగా సాగి వచ్చే సమస్యా ప్రస్తావనం, సందేశం గాఢంగా అభివ్యక్తం కానప్పుడు నాటకానికి చిరంజీవత్వం లభించదు. నాటకం సమకాలీన సమస్యాత్మకమై ఉంటూ సార్వకాలిక సందేశాన్ని కూడా తనలో ఇముడ్చుకో కలిగి ఉండాలి[8]

పి. వి. రమణ నాటకాన్ని గురించి చెప్పిన ఈ మాటలలో నాటకం ఆనందం కోసమే కాకుండా జన జీవనంలో జరుగుతున్న మార్పులను గుర్తించేలా ఉండాలి. ప్రజా సమస్యలను పరిష్కరించే విధంగా, సందేశాత్మకంగా నాటకం ఉండాలంటాడు.

ఇప్పుడు నాటక లక్షణాలను కొంత వివరించి తర్వాత తెలుగు నాటకం ఏ విధంగా పరిణామం పొందిందో తెలియజేస్తాను.

## 2.2. నాటక లక్షణాలు:

నాటకం విజయవంతం కావడానికి నాటకానికి కొన్ని లక్షణాలను వివరించారు పూర్వీకులు. భరతముని తన నాట్యశాస్త్రంలో రూపక లక్షణాలను వివరిస్తూ నాటకం ఎలా ఉండాలో చెప్పారు.

1. నాటకంలో వస్తువు ప్రఖ్యాతంగా ఉండాలి.
2. నాయకుడు ఉదాత్తుడై ప్రసిద్ధుడై ఉండాలి.
3. రాజర్షి వంశ చరిత్రం అభి వర్ణించబడాలి.
4. నాయకుడు దివ్యుడుకాని, దివ్యాదివ్యుడు కాని అయి ఉండాలి.
5. నాటకం ధర్మార్థ కామ మోక్ష ప్రదాయినిగా ఉండాలి.
6. సంపత్ సమృద్ధి విలాసాది గుణాత్మకమై ఉండాలి.

---

[7]అప్పారావు, పి. యస్ .ఆర్. తెలుగు నాటక వికాసం,పుట:16,17.

[8]రమణ, పి. వి. పాశ్చాత్య సాంఘిక నాటకం తెలుగు నాటకంపై ప్రభావం,పుట:84.

7. అయిదు మొదలు పది అంకాలు వరకు ఉండాలి.

8. శృంగార వీర రసాదుల్లో ఒకటి అంగి రసం(ప్రధాన రసం)గా ఉండాలి.

9. నానా రస భావయుక్తం కావాలి

10. సుఖదు:ఖాలు సమ్మిశ్రం కావాలి"[9] ఇవి నాటకంలో తప్పక ఉండాలి.

ఈ లక్షణాలను గమనిస్తే నాటకం నిజజీవితంలోని సంఘటనలకు దగ్గరగా, ఉదాత్తమైనవిగా తీర్చిదిద్దబడాలి. నవ రసాలకు స్థానమిస్తూ ప్రేక్షకులకు ఆనందాన్ని రసానుభూతిని కలిగించేదిగా నాటకం ప్రదర్శించబడాలి అనే విషయం అర్థమవుతుంది.

## 2.3. తెలుగు నాటక వికాసం:

భారతదేశంలో ఆంగ్లేయుల పరిపాలన వలన మనకు కలిగిన నష్టాల మాట ఎలా ఉన్నా, కలిగిన కొన్ని లాభాలను మనం తిరస్కరించలేము. వాటిలో విద్యా వ్యాప్తి ఒకటి ప్రధానంగా పేర్కొనదగింది. చదువుల పట్ల ముఖ్యంగా ఇంగ్లీషు భాష పట్ల ప్రజలలో వ్యామోహం హెచ్చింది. ఇంగ్లీషు భాష ద్వారా పాశ్చాత్యుల సంస్కృతి సాహిత్యం వారి ఆలోచనా రీతులను అవగాహన చేసుకున్న విద్యావంతులు నూతన భావ సంఘర్షణకు లోనయ్యారు. పాత పద్ధతులతో ఛాందస భావాలతో విసిగెత్తిపోయి. ప్రతి రంగంలోను నూతన విధానం కోసం అన్వేషించసాగారు. ఆ అన్వేషణ ఫలితంగా మనదేశంలో వివిధ రంగాలలో నూతన చైతన్యం వెల్లివిరిసింది. ఈ చైతన్యం తెలుగు సాహిత్యంలో కూడా అనేక నూతన ప్రక్రియలకు దారి చూపింది. తెలుగు సాహిత్య జగత్తులో అది వరకు లేని నవల, నాటకం, వ్యాసం, ఖండ కావ్యం, ఆత్మకథ, మొదలైన ఎన్నో కొత్త ప్రక్రియలు ఆవిర్భవించాయి. ఈ ప్రేరణతోనే తెలుగు సాహిత్యరంగంలో మొట్టమొదటి తెలుగు నాటకం వెలుగు చూసింది.[10]

ఈ మాటలలో ఆంగ్లేయుల పరిపాలనలో భారతీయులు ఎన్ని కష్టాలు పడినా వారు విద్యారంగంలో కృషి చేసిన విధానం మాత్రం భారతీయుల మనసుల్లో గాఢంగా నాటుకుంది. పాత పద్ధతులను, మూఢనమ్మకాలను వీటినన్నింటిని వదలి విద్యవైపు మొగ్గుచూపారు. ఇలా నెమ్మదిగా ఆ చైతన్యం తెలుగు సాహిత్యంలోకి

---

[9]వెంకటాచార్యులు, కొట్టే, సంప్రదాయక నాటక సౌరభాలు, పుట:2.

[10]సుబ్బరామిరెడ్డి, గండవరం. ఆధునిక తెలుగు నాటకం, పుట:10.

ప్రవేశించి అనేక ప్రక్రియలకు దారితీసిందని అందులో నాటక ప్రక్రియ మొదటగా ప్రజలకు పరిచయమైందని అర్థమవుతుంది.

పి.యస్. ఆర్. అప్పారావు తెలుగు నాటక వికాసంలో రూపక రచన తెలుగులో రెండు కాలాలలో రెండు మార్గాలుగా సాగిందని వివరించారు. ''తెలుగు సాహిత్యం ఆరంభమైన తొలి రోజుల నుండి ఇంచుమించుగా 1860 వరకు ఒక కాలము, ఇది యక్షగాన నాటకముల కాలము. 1860 నుండి 1960 వరకు ఒక కాలం ఇది మార్గ రూపక రచనా కాలము.''[11]

ఈ విషయాన్ని గమనిస్తే తెలుగు నాటకం ఏ విధంగా పరిణమించిందో అర్థమవుతుంది. మొదట యక్షగాన నాటకాలుగా మార్గ రూపక రచనలుగా ప్రారంభమైందని తెలుస్తుంది.

ఆధునిక నాటక రంగాన్ని పరిశీలిస్తే తెలుగులో 'మంజరీ మధుకరీయం' అనే నాటకంతో 1860 ప్రాంతంలో కోరాడ రామచంద్రశాస్త్రి(1816-1900) మొదటిసారిగా నాటక రచనా ప్రక్రియకు శ్రీకారం చుట్టారు. అయినప్పటికి తెలుగుదేశాన ధార్వాడ నాటక సమాజం వాళ్ళు తమ నాటకాలను ప్రదర్శించే దాక తెలుగు నాటక ప్రయోగం మీద ఎవరికి దృష్టి మళ్లలేదు. ధార్వాడ సమాజాల వారి ప్రదర్శనలతో ప్రేరణ పొంది నాటక ప్రదర్శనకి మొదటిసారిగా ప్రయత్నం చేసిన వారు కందుకూరి వీరేశలింగం పంతులు 1880 ప్రాంతాల 'వ్యవహార ధర్మ బోధిని' పేరుతో అప్పటి న్యాయవాదుల లంచగొండితనం మీద విసుర్లతో ఒక ప్రహసనాన్ని రాసి మిత్రుల అండదండలతో తన విద్యార్థుల చేత రాజమండ్రి బాలికల పాఠశాల ఆవరణలో మొదటిసారి ప్రదర్శింప చేశారు వీరేశలింగం పంతులు.[12]

ఈ వివరాలు మొదట నాటక రచన ఎవరితో ప్రారంభమైందో తెలుపుతూ నాటక ప్రదర్శనకు శ్రీకారంచుట్టి ప్రదర్శింప చేసిన వారు కందుకూరి వీరేశలింగం పంతులే అని వారికి ప్రేరణ ధార్వాడ నాటక సమాజం అని తెలుస్తుంది.

---

[11]అప్పారావు, పి. యస్. ఆర్. తెలుగు నాటక వికాసం,పుట:464.

8. జయప్రభ, నాలుగో గోడ, తెలుగులో ఆధునిక నాటకం,పుట:9

ఇదే సమయంలో *"1880ప్రాంతాలలోనే స్వతంత్రమైన సాంఘిక ఇతివృత్తాన్ని ఎన్నుకుని వావిలాల వాసుదేవశాస్త్రి బ్రాహ్మణ వర్గాలలో ఉన్న వైదిక , నియోగి ,తగువులాటల మీద 'నందక రాజ్యం' అనే నాటకాన్ని రాశారు అప్పటి దాక తెలుగులో రాయబడ్డ నాటకాలన్ని సంస్కృత నాటకాల అనువాదాలే కొద్దో గొప్ప ఆంగ్ల నాటకానువాదాలు కూడా అప్పుడప్పుడే మొదలవుతున్నాయి. ఇలాంటి పరిస్థితుల్లో తెలుగులో 31 స్వతంత్ర వచన నాటకాలను రాసిన వారు కొండు బొట్ల సుబ్రహ్మణ్యశాస్త్రి.1883లో వేణి సంహారం నాటకాన్ని రాసి 'హిందూ నాటకోజ్జీవక సమాజం' అనే పేరుతో నాటక సమాజాన్ని స్థాపించిన వారు వడ్డాది సుబ్బారాయుడు 1884 ప్రాంతాలలోనే బందరులోని నేషనల్ థియోట్రికల్ సొసైటి వారి కోసం తెలుగులోను, హిందీలోనూ ఎన్నో నాటకాలు రాసి నాటకాలలో పాటలను ప్రవేశ పెట్టిన వారు నాందెడ్ల పురుషోత్తమ కవి. 1887 ప్రాంతాలలోని 'సరస వినోదిని 'సభ అనే సమాజాన్ని మొదలుపెట్టి బళ్ళారి ప్రాంతంలో ఉద్యమ వేగంతో నాటక రచనలో ప్రదర్శనలో ఎన్నో మార్పులు తెచ్చిన వారు తెలుగులో నాటక పితామహుడిగా పేరు గాంచిన ధర్మవరం రామ కృష్ణమాచార్యులు వారు మొదటిసారిగా విషాదాంత రూపకం రచనకు నాంది పలికారు. చిలకమర్తి గయోపాఖ్యానం, తిరుపతి వేంకట కవుల పాండవోద్యోగ విజయాలు, విపరీతమైన ప్రజాదరణ పొంది పద్యనాటకాలకు ఉత్తేజాన్నిచ్చాయి."*[13]

పై మాటలలో తెలుగులో 'నందక రాజ్యం' నాటకం వెలువడిన తర్వాత ఈ నాటకానికి ముందున్న వాటిని సంస్కృత నాటకాలకు అనువాదంగా రాయబడ్డాయని తెలుస్తుంది. వావిలాల వాసుదేవశాస్త్రి ఎన్నుకున్న ఇతివృత్తాన్ని బట్టి స్వతంత్ర నాటకంగా ఈ రచన చేసినట్లు అర్థమవుతుంది. అతని తరువాత మరి కొంతమంది ప్రముఖులు స్వతంత్ర నాటకాలు రాయడానికి ,నాటక సమాజాలను స్థాపించడానికి, నాటకాలలో పాటలను ప్రవేశపెట్టే పద్ధతిని కూడా అలవరచుకున్నారని తెలుస్తుంది. తెలుగుదేశాన నాటక ప్రదర్శనలు వేగవంతంగా సాగాక తెలుగుదేశంలో పలు ప్రాంతాలలో నాటక సమాజాలు ఏర్పడి నాటకాలు ఆడడానికి పూనుకున్నాయి.

---

[13]జయప్రభ, నాలుగో గోడ, తెలుగులో ఆధునిక నాటకం, పుటం10,11.

స్వతంత్ర నాటకాలు తెలుగులో వివిధ రకాలుగా వెలువడ్డాయి. వాటి వివరాలలోకి వెళితే పి.యస్. ఆర్. అప్పారావు స్వతంత్ర రూపకాలను పౌరాణిక రూపకాలు, సాంఘిక రూపకాలు, సంఘ సంస్కార రూపకాలు, రాజకీయ రూపకాలు లేద ప్రచార రూపకాలు, సంఘ తిరస్కార రూపకాలు, ప్రహసనాలు మొదలైనవిగా విభజించి చర్చించాడు. వాటిలో కొన్నింటిని ఈ క్రింది పరిశీలిద్దాం.

### 2.3.1. పౌరాణిక రూపకాలు:

ఇందులో పురాణ, ఇతిహాసాదులలోని కథలను స్వీకరించి వాటిని నాటకాలుగా ప్రదర్శింప చేసుకోవడం ఈ కోవకు చెందుతాయి. వాటిని భారతంలోని కథను స్వీకరించి ప్రదర్శిస్తే భారత నాటకాలని, అలాగే రామాయణ నాటకాలని, భాగవత నాటకాలుగా ప్రదర్శితమవుతాయి.

ఆధునిక కాలాన తెలుగు భాషలో తొలి రూపకమగు 'మంజరీ మధుకరీయము' స్వతంత్ర పౌరాణిక రూపకంగా గుర్తించాము. తర్వాత కందుకూరి వారు 1885 –86 లో ప్రహ్లాద, దక్షిణ గోగ్రహణము, సత్య హరిశ్చంద్ర అనే మూడు స్వతంత్ర పౌరాణిక నాటకాలను రచించారు. 1886 లో ధర్మవరము వారి 'చిత్రనళీయము' వెలువడింది. తర్వాత సుసర్ల వారి 'పాండవ అజ్ఞాత వాసం' తోలేటి వారి హరిశ్చంద్ర, చిలకమర్తి వారి 'కీచక వధ' మొదలగునవి వెలువడ్డాయి.[14]

ఇలా పౌరాణిక నాటకాలు ఇప్పటికి ప్రజాదరణ పొందుతునే ఉన్నాయి. పురాణాల, ఇతిహాసాలు నుండి కథను స్వీకరించి ప్రదర్శింపబడిన నాటకాలు నేటి తరానికి విజ్ఞాన సంపదను ప్రాచీన కావ్యాలపట్ల అవగాహనను కలుగజేస్తాయి అనడంలో అతిశయోక్తి లేదు.

### 2.3.2. సాంఘిక రూపకములు:

సంఘ సంస్కరణ కోసం సమాజంలో జరుగుతున్న దురాచారాలను అధికారుల ఆధిపత్యం వంటి విషయాలను దృష్టిలో ఉంచుకుని ఈ సాంఘిక రూపకములు వెలువడ్డాయి. ఇవి కల్పితమైనవి.

---

[14]అప్పారావు ,పి .యస్. ఆర్ .తెలుగు నాటక వికాసం,పుట:474.

ఆధునిక కాలంలో, తొలి తెలుగు సాంఘిక రూపకం వావిలాల వారి 'నందక రాజ్యం'(1880) ఇందులో నాటి బ్రాహ్మణులలోని నియోగి వైదిక శాఖల వారి విరోధాలు, అధికారుల దౌర్జన్యాలు విపులంగా వర్ణించబడ్డాయి.. తర్వాత పేర్కొనదగిన కందుకూరి వారి బ్రాహ్మవివాహం, వ్యవహార ధర్మ బోధిని, వివేక దీపికలు(1880), వ్యవహార ధర్మ బోధిని ప్రదర్శన భాగ్యం పొందిన తొలి తెలుగు రూపకంగా ప్రసిద్ధి పొందింది. వాటిని నాటకాలనడం కంటే ప్రహసనాలని అనడమే సమంజసము. అటు పిమ్మట పేర్కొనదగినవి. సాంఖ్యాయన శర్మగారి 'మనోరమ'(1875) వల్లూరి వారి 'సాగరిక'(1897) ఈ రచనల మీద ఆంగ్ల రూపక ప్రభావము స్పష్టంగా కనబడుతుంది. నాటికి , నేటికిని అద్వితీయ సాంఘిక రూపకముగా ఎన్నబడుచున్న 'కన్యాశుల్కం' 1892 ప్రాంతంలో రచించబడి వెలువడింది. తర్వాత పానుగంటి వారి 'కంఠాభరణం' పేర్కొనదగింది[15]

పైన పేర్కొన్నవే గాక తర్వాతి కాలమున రైతులు, కార్మికుల సమస్యలపై ఎన్నో రూపకాలు వెలువడ్డాయి.

*''సంఘ సంస్కరణ అభిలాష అయిన పాకాల వెంకట రాజమన్నారుగారు 1930లో 'తప్పెవరిది' అనే పేరుతో ఒక సాంఘిక నాటకాన్ని రాశారు. అలాగే ప్రేమ పెళ్ళిళ్ళు ఆదర్శప్రాయంగా ఉంటాయని శ్రీ పి. వి. రంగరామ్ గారు 'దంపతుల నాటకం' రాశారు. 1921 ప్రాంతంలో 'రామరాజు పుండరీకాక్షుడు' 'గాంధీ విజయం' నాటకం రాశాడు. ఈ శతాబ్దిలో రచించిన ఏకైక సాంఘిక నాటకం 'కలియుగ భారతం'(1936) రసపుష్టిగల రూపకం. అలాగే మల్లాది అవధానిగారి 'గాలివాన' ఇందులో స్త్రీకి ఆర్థిక స్వాతంత్ర్యం అవసరమని ఉద్బోధించారు. పానుగంటి లక్ష్మి నరసింహం గారి 'రాతి స్తంభం' టేకుమళ్ళ కామేశ్వర రావు గారి 'కోపదారి మొగుడు' పోరంకి వెంకట సుబ్బారావు గారి 'తారుమారు' మొదలైన సాంఘిక నాటకాలు ప్రదర్శనా రీత్యా పేర్కొనదగినవి''.*[16]

[15]అప్పారావు, పి. యస్. ఆర్. తెలుగు నాటక వికాసం,పుట:475,476.

[16]సుబ్బరామిరెడ్డి, గండవరం. ఆధునిక తెలుగు నాటకం. పుట:22.

పైన తెలిపిన నాటకాలన్ని సమాజ పరంగా రాసినవే అందులో భార్య భర్తల మధ్య అనురాగం ఆదర్శంగా ఉండాలని .రాసిన నాటకాలు, స్త్రీలకు స్వేచ్ఛ కలిగించాలని చెప్పే నాటకాలు మున్నగు నాటకాలు పేర్కొనదగినవి.

### 2.3.3.చారిత్రక రూపకాలు:

పూర్వం జరిగిన విషయాలను తెలియజేస్తూ మన జాతి గౌరవాన్ని నిలబెట్టేది చరిత్ర. స్వాతంత్ర్య వీరులు మన దేశాన్ని కాపాడుకోవడం కోసం ధైర్యసాహసాలు ప్రదర్శించిన వారికి చరిత్రలో ఉన్నత స్థానం ఉంటుంది. అటువంటి వారి పోరాటాలు భావితరానికి అవసరం. వారు తమ జీవితాలలో ప్రదర్శించిన సాహసాలను నాటక రూపంలో ప్రదర్శించబడుతూ చారిత్రక రూపకాలుగా పేరు పొందాయి.

*"1897 లో రెండు ఉత్తమ స్వతంత్ర చారిత్రక రూపకాలు వచ్చాయి.1. వేదం వారి 'ప్రతాప రుద్రీయం' 2. వనప్పాకం శ్రీనివాసాచార్యులు గారి 'శివాజి' మొదటిది తెలుగు వానికి సంబంధించినది. రెండోది మహారాష్ట్ర చరిత్రకు సంబంధించింది. అటు తర్వాత హెచ్. కృష్ణమూర్తి గారి 'పెనుగొండ దుర్గము' పేర్కొనదగింది. 1899లో వెలువడిన కాళ్లకూరి వారి 'రంగరాయ కదన సమవాకారం' ఇది ప్రాబంధిక శైలిలో రచింపబడింది"*[17]

పై చారిత్రక రూపకాలలో ప్రతాపరుద్రీయం, శివాజి పెనుగొండ దుర్గము వంటి ప్రముఖుల గురించి ప్రముఖ స్థలాల గురించిన చారిత్రక విషయాలను తెలియజేస్తాయి.

*"1906 –1925 కాలములో సుప్రసిద్ద కవులు పలువురు చారిత్రక నాటకములు రాసిరి. ఆ నాటకాలన్ని సుప్రసిద్ధములై. రంగస్థల విజయమును కూడా పొందెను. ఇట్టి వానిలో ముఖ్యంగా పేర్కొనదగినవి కోలాచలం వారి 'రామరాజు చరిత్రం'(1907), శ్రీపాదవారి 'బొబ్బిలి యుద్ధ నాటకం'(1910), బాలాంత్రపు వేంకటరావుగారి 'యాచశూరేంద్ర విజయము(1910). ధర్మవరం గోపాలాచార్యులు గారి 'రామదాసు'(1920) మొదలగునవి"*[18]

---

[17]అప్పారావు, పి. యస్. ఆర్. తెలుగు నాటక వికాసం,పుట:479.

[18]అప్పారావు, పి. యస్. ఆర్.. తెలుగు నాటక వికాసం,పుట:479.

ఇవన్ని చారిత్రక రూపకాలుగా ప్రసిద్ధి చెందినవే కాకుండా లోకజ్ఞానాన్ని కలుగజేస్తూ మన సంస్కృతి, మన దేశం పట్ల మనకుండాల్సిన బాధ్యతను తెలియజేస్తున్నాయి.

### 2.3.4. ప్రచార రూపకాలు:

సమాజానికి ఇవ్వవలసిన సందేశాన్ని నాటక రూపంలో తెలియజేయడం ప్రచార రూపకంగా చెప్పవచ్చు ఉద్యమాలను దృష్టిలో ఉంచుకొని ప్రచార సాధనాలుగా నాటకాలు వెలువడ్డాయి.

గురజాడ వారు విజయనగరం మహారాజా వారి ఉద్యమానికి లక్ష్యంగా 'కన్యాశుల్కం' ను రచించి తద్దురాచార నిర్మూలనానికి తోడ్పడినారు. 1890 తర్వాతనే ఉద్యమాల ప్రచారార్థము నాటకాలు బయలుదేరినవి. 'కన్యాశుల్కం' మనోరమ', 'సాగరిక' ప్రభృతులు ఇట్టివే[19] అని చెప్పడంలో నాటకాల ద్వారా కూడా సమాజగతిని మార్చవచ్చు. ప్రజలను ఆలోచింపచేసి వారిలో చైతన్య దీప్తులను వెలిగించవచ్చు అనే విషయం అర్థమవుతుంది.

ప్రచార నాటకాలలో ముఖ్యంగా పేర్కొనాల్సినవి దేశభక్తి నాటకాలు, కేవల రాజకీయ ప్రచార నాటకాలు, మత సిద్ధాంత బోధలకు సంబంధించిన నాటకాలు మొదలగునవి స్వాతంత్ర్యోద్యమం కారణంగా సమకాలిక వృత్తములే నాటకీకరింపబడుట పరిశీలించ వచ్చును దామరాజువారి 'అలీ' ప్రభృతుల నిర్బంధం' గ్రంథి వెంకట సుబ్బారాయ గుప్త గారి 'ఆంధ్రమాత' (1921) మొదలగునవి ఇందులకు ఉదాహరణ[20]

### 2.3.5. మనస్తత్వ నిరూపణ రూపకాలు:

ఈ ప్రపంచంలో వివిధ రకాల మనస్తత్వాలతో ప్రజలు జీవిస్తున్నారు. ఎదుటివారి ఉన్నతిని సహించలేకపోవడం ఒకరి మనస్తత్వం అయితే మరొకరు తన స్వార్థం కోసం ఎదుటి వారిని కష్టపెట్టడం మరొకరి మనస్తత్వం. తాను ఏమిచేయలేక ఏమీ సాధించలేక పోతున్నానని కుమిలిపోవడం మరొకరి మనస్తత్వం ఇటువంటి

---

[19]అప్పారావు,పి.యస్.ఆర్..తెలుగు నాటక వికాసం,పుట:480.

[20]అప్పారావు,పి.యస్.ఆర్..తెలుగు నాటక వికాసం,పుట:480.

మనస్తత్వాలు ఉన్న సమాజంలో తమవంతు కృషి చేయడానికి రచయితలు నాటకాల ద్వారా సందేశాన్ని అందిస్తున్నారు.

కేవల మనస్తత్వ నిరూపక రూపకాలు తెలుగులో అంతగా కనబడవు. ఆయా కాలాలయందు అక్కడక్కడ ఇట్టి ప్రయత్నాలు కనబడగలవు. సంతానం లేని ఒక స్త్రీ తన భర్తని వేరొక వివాహం చేసుకోమని వేధించి స్వయంగా తానే శుభకార్యమును నిర్వర్తించి, తర్వాత తన భర్త తన చేతుల నుండి పారిపోయెనని కలవరపడి. సవతి జీవితాన్ని దుఃఖమయం చేసే వరకు తన ముగ్గురి మరణానికి కారణమైన ఒక స్త్రీ మనస్తత్వాన్ని పానుగంటి లక్ష్మీ నరసింహారావు గారు 'సరోజిని'(1930) అనే నాటకంలో నిపుణంగా చిత్రించారు. బహుశ తెలుగులోకి ప్రథమ మనస్తత్వ నిరూపణ రూపకమిదే కావచ్చును. తర్వాత కాళ్లకూరి గోపాలరావుగారి 'వాల్మీకి'(1932) ఈ జాతి నాటకాలలో ముఖ్యంగా పేర్కొనదగిన రచన. తర్వాత చలంగారి 'భానుమతి' ఉత్తమమైన మనస్తత్వ నిరూపక రచన. ఇంకా నాటకాలలో బుచ్చిబాబు గారి ఆత్మవంచన ఉత్తమమైన మనస్తత్వ నిరూపక రచన'[21]

ఈ మనస్తత్వ రూపక రచనలో సాగిన ఈ నాటకాలు మనస్తత్వాన్ని అలాగే వివిధ వ్యక్తుల చిత్త వృత్తులను వివరించడమే కాకుండా సరైన ఆలోచన ధోరణి లేకపోతే మానసిక ఆవేదనకు గురై తాను బాధపడటమో, ఎదుటివారిని బాధ పెట్టడమో జరుగుతుంది. ఈ విషయాలు మనస్తత్వ నిరూపణ రూపకాలలో కనబడుతుంది.

### 2.3.6. విషాద రూపకాలు:

నాటక ప్రారంభం నుండి చివరి వరకు పాత్రల సంభాషణల్లోను, సన్నివేశాలలోను విషాదం చోటు చేసుకున్నట్లైతే వాటిని విషాద రూపకాలుగా చెప్పవచ్చు. ఇటువంటి నాటకాలు చాలా అరుదు.

నాటకమంతా విషాద పూరితంగా ఉంటుంది. ప్రారంభించినది మొదలు పంచమాంకం వరకును మానవుల లోపాలను వారి దుష్కార్యాలను వారి వలన సంభవించే ఆపదలను నాటకానికి కథా భాగాలుగా ఏర్పడును.[22]అని సారస్వత

---

[21]అప్పారావు, పి.యస్. ఆర్. .తెలుగు నాటక వికాసం,పుట:481.

[22]అప్పలస్వామి, పురి పండా. సారస్వత వ్యాసములు, పుట:343.

వ్యాసములలో 'ఆంధ్ర విషాద నాటకం' అనే వ్యాసంలో శ్రీతణికెళ్ళ వీరభద్రుడు తెలిపారు. ఈ మాటలలో మానవులు చేసే తప్పుల వలనో. లేదా ఎదుటివారి మీద ప్రతీకారం తీర్చుకునే సమయంలోనో వారి వలన కలిగిన కష్టాలు విషాద రూపకాలలో ప్రధాన భాగాలుగా ఉంటాయి అని తెలుస్తుంది.

''*ధర్మవరం రామకృష్ణమాచార్యునిచే రచియింపబడిన 'సారంగధరము' తప్ప మన ఆంధ్రభాషయందు విషాదరూపకమను నామానికి తగిన వేఱొండు నాటకము కానరాదు. ఈ విషాద సారంగధరము బహు విధముల ఆంగ్లభాషయందలి దుఃఖ రూపకములను పోలియున్నది. ఆంగ్లమున షేక్స్పియర్ అను కవి సార్వభౌముడు 'హామ్ లెట్', 'ఒథెల్లో' 'మేక్ బెత్' లియర్' మొదలగు నాటకాలను రచించెను.*''[23]పై విషయాలు ధర్మవరం రామకృష్ణమాచార్యునిచే విషాద సారంగధర ఆంగ్ల రూపకాలతో పోలి ఉండడం చేత విషాద సారంగధరకు అవి ప్రేరణగా నిలిచాయని తెలుస్తుంది.

మరొక సందర్భంలో విషాద నాటకాల గురించి తెలియజేస్తూ శ్రీ తణికెళ్ళ వీరభద్రుడు ఈ విధంగా రాస్తాడు. విషాద నాటకాల వలన లాభం లేదని వాదించడం గొప్ప పొరబాటు మనకు నిజంగా నీతి బోధించుటకుచితమిదియే దానియందు మానవుని యావజ్జీవమును చిత్రించుటకు వాని కష్టసుఖాలను మన కళ్ల ఎదుట చూపడానికి వీలవుతుంది. మానవ హృద్యమందు తీగెలన్నింటినీ వాయించడానికి అవకాశం ఈ కావ్యంలో ఉన్నట్లు మరి ఎక్కడా కనిపించదు.[24] అని తెలియజేయడంలో జీవితంలో దుఃఖం కలిగితేనే సుఖం యొక్క విలువ తెలుస్తుంది. అని సంతోషాలకే ప్రాముఖ్యత ఇచ్చే మనుషులు కష్ట నష్టాలకు కుంగిపోకుండా వాటిని కూడా అనుభవించి ఓర్చుకోగల శక్తి మన సొంతమైతే సమస్యలను తేలికగా పరిష్కరించుకోవచ్చు. అనే భావం వ్యక్తమవుతోంది. మనసులోని బాధలన్నిటి ప్రతిరూపంగా ఈ విషాద నాటకాలు రూపుదిద్దుకున్నాయని తెలుస్తుంది. ఈ విధంగా తెలుగు నాటకం వివిధ రూపాలుగా రూపాంతరం చెంది. తెలుగు సాహిత్య ప్రియుల హృదయాలలో మంచి స్థానాన్ని సంపాదించుకుంది.

---

[23]అప్పలస్వామి, పురి పండా. సారస్వత వ్యాసములు, పుట:344,345.

[24]అప్పలస్వామి, పురి పండా, సారస్వత వ్యాసములు, పుట:358.

## 2.4.రేడియోనాటకాల చరిత్ర:

రేడియో నాటకాలు(శ్రవ్యనాటకాలు) కేవలం వినడం ద్వారా మాత్రమే ఆనందాన్ని కలిగిస్తాయి. రేడియో నాటకాలను వినేటప్పుడు రేడియోలో చెప్పే ప్రతి సన్నివేశ ప్రదర్శన మనం ఊహించుకుని ప్రత్యక్షానుభూతిని పొందుతాం. ప్రత్యక్షంగా చూడడం ద్వారా ఆ అనుభూతిని అంతగా పొందలేము. ఆనాటి నుండి ఈ నాటి వరకు రేడియో ద్వారా వినే ఏ కార్యక్రమమైనా ప్రజలను అలరింపచేస్తూనే ఉంది. అందులో ముఖ్యంగా రేడియో నాటకాలను కూడా చెప్పవచ్చు.

రేడియో నాటకం కనిపించదు వినిపిస్తుంది. కేవలం ధ్వని ప్రధానం. అందువల్ల రేడియో నాటకానికి చాలా కొరతలున్నాయి. స్టేజి మీద కనిపించే , వినిపించే సమస్తాన్ని ఒక్క ధ్వని మాధ్యమం ద్వారానే రేడియోలో ప్రస్ఫుటం చేయాలి. దీనిని Sound play అన్నారందుకే Blind Man Theatre అన్నాడొక విమర్శకుడు అంధ విద్యార్థులకు నాటకం సుబోధకం చేసేలా ప్రదర్శించడమే శ్రవ్యనాటక సాహసం[25]

అప్పట్లో పల్లె జీవితాలలో ఆనందాన్నిచ్చే సాధనం రేడియో ఆ రేడియోలో వచ్చే నాటకాలు అందులోని పద్యాలు వారి విజ్ఞానాభివృద్ధికి సోపానాలు. చదువు రాని వారు రామాయణ, భారత, భాగవత పద్యాలు అందులోని విషయం ఏమిటో గ్రహించలేరు. అటువంటి వారు సహితం సాహిత్యం మీద ఒక అవగాహనకు రాగలుగుతున్నారంటే అందులో రేడియో నాటకాల ప్రభావం కూడా ఎంతైనా ఉంది.

''*రూపకము విధిగా ప్రేక్ష్యము లేద ప్రదర్శన ప్రధానము అనెడి సిద్ధాంతమునకు అపవాదము 'శ్రవ్య రేడియో రూపకము'. ప్రదర్శనమునకనుపయుక్తములైన నాటకములను 'శ్రవ్య రూపకములు'(Closet dramas or literary plays) అనుట పరిపాటి''*[26]అని చెప్పటంలో దృశ్య రూపకాలకు పూర్తి భిన్నమైన ప్రక్రియగా శ్రవ్య రూపకం అని అర్థమవుతుంది.

పి.యస్. ఆర్. అప్పారావు రేడియో నాటక ప్రస్తావనలో కొన్ని విషయాలను తెలియజేస్తాడు. 'ఒక చూపులో ఒక కదలికలో కొన్ని ఒక అంగ విన్యాసంలో రంగ

---

[25]అనంత పద్మ నాభరావు, ఆర్. రేడియో నాటకాలు చారిత్రక పరిశీలన, పుట:30

[26]అప్పారావు, పి.యస్. ఆర్. తెలుగు నాటక వికాసం, పుట:496.

స్థలమందు నటుడు చూపే హావభావాలన్నీ శ్రవ్య రూపక నటుల వాచకం మూలంగానే స్పష్టములు కావలసియున్నవి కాగా శ్రవ్య రూపకాలయందు సంభాషణలు రచయిత శక్తికి గీటురాళ్ళు అన్నమాట. రచనలో కవివలెనే ప్రయోగమందు బహు శ్రద్ధాళువులు కావలసి ఉంది. అంతే కాదు శ్రోతలు కూడా చాలా శ్రద్ధ వహించాల్సియుంది. వినిపించిన ప్రతి మాటను శబ్దాన్ని వాని హెచ్చుతగ్గులను బట్టి చక్కగా శ్రోతలు గ్రహించ కలిగినప్పుడే ఆ రూపక ప్రసారం జయప్రదం కాగలదు.[27]

ఈ వివరాలు శ్రవ్యనాటక లక్షణాలుగా కనబడుతున్నాయి. శ్రవ్య రూపకాలలో పాటించవలసిన మెలకువలను. సంభాషణల తీరు ఏవిధంగా ఉండాలి. వేటి పై శ్రద్ధ వహించాలి మున్నగు విషయాలను దృష్టిలో ఉంచుకున్నప్పుడే శ్రవ్య రూపకాలు విజయవంతమవుతాయని అర్థమవుతుంది.

‘‘రేడియో నాటకం కేవలం శ్రవ్యం, మన ప్రాచీనులు దృశ్య నాటకాలకు ప్రాధాన్యం ఇచ్చారు. వాటి లక్షణాలను ఏర్పరిచారు. కేవలం శ్రవ్యనాటకాలు రేడియో వ్యాప్తిలోకి వచ్చిన తర్వాత ప్రాచుర్యంలోకి వచ్చాయి. రేడియో నాటకం 1922లో మొట్ట మొదటిసారి ప్రసారం అయ్యింది. రేడియో కోసం ప్రత్యేకంగా రాయబడిన నాటకం ‘The truth about Father Christmas’ క్రిస్టమస్ సందర్భంగా బాలల కోసం ప్రత్యేకంగా తయారుచేశారు. లండన్ స్టూడియో వారు 1922 క్రిస్టమస్ కు దీన్ని ప్రచారం చేశారు.’’[28]

ఈ విషయాన్నిబట్టి 1922 లో క్రిస్టమస్ సందర్భంగా బాలల కోసం ప్రత్యేకమైన కార్యక్రమంగా రూపు దిద్దుకున్న నాటకం రేడియో కోసం రాసిన నాటకంగా మాత్రమే ప్రసారం అయ్యింది. కాని అందులో అసలైన శ్రవ్యనాటకంగా రూపు దిద్దుకోలేదని అర్థమవుతుంది.

**2.5. రేడియో నాటకాల విభజన:**

రేడియో నాటకం అంధులు కూడా ఆస్వాదించగల గొప్ప ప్రక్రియ. రేడియోలో ఆధునిక శాస్త్ర సాంకేతిక ప్రయోగాలద్వారా ఎన్నో శబ్దాలు ఉత్పత్తి చేయ

---

[27]అప్పారావు, పి.యస్. ఆర్. తెలుగు నాటక వికాసం, పుట:497.

[28]అనంత పద్మ నాభరావు, ఆర్. రేడియో నాటకాలు చారిత్రక పరిశీలన,పుట:29.

కలుగుతారు. రంగస్థలం మీద సృష్టించలేని శబ్దాలను కూడా సృష్టించవచ్చు.[29]ఒకే సన్నివేశంలో పక్షుల ధ్వనులను, అటు సాంస్కృతిక కార్యక్రమాలను చొప్పించగల సామర్థ్యం రేడియో నాటకానికి ఉంది. నవలలు, రంగస్థల నాటకాలు రేడియో నాటకాలుగా మారాయి. వాటిని తెలుసుకోవాల్సిన అవసరం ఉంది.

### 2.5.1. రంగస్థల నాటకాలు– రేడియో అనుసరణ:

రంగస్థల నాటకాలు రేడియో అనుసరణకు ఎంతగానో తోడ్పడ్డాయి. *"ఆంగ్లంలోని షేక్సిపియర్ నాటకాలకు రేడియో అనుసరణలు చాలా తెలుగులోకి వచ్చాయి. అలాంటి వాటిలో కృష్ణ తులాభారం, కృష్ణరాయ బారం, రుక్మిణి కళ్యాణం, హరిశ్చంద్ర, వేంకటేశ్వర మహాత్మ్యం వంటి నాటకాలు కొద్దిపాటి మార్పులతో రేడియోలో ప్రసారమయ్యాయి."*[30]ఈ విషయాలను గమనిస్తే పురాణాలకు సంబంధించిన ఇతివృత్తాలను రంగస్థల నాటకాలుగా తర్వాత రేడియో నాటకాలుగా ప్రసారం చేశారని తెలుస్తుంది.

పానుగంటి లక్ష్మి నరసింహారావు పాదుకా పట్టాభిషేకం స్టేజి నాటకంగా బహుళ ప్రచారంలోకి వచ్చింది. రాముని పట్టాభిషేక వృత్తాంతం ఇందులోని కథ. రేడియో నాటకంగా దీనిని రామమోహనరావు తయారుచేశారు.[31] ఇతిహాసమైన రామాయణంలోని వృత్తాంతాన్ని రంగస్థల నాటకంగానూ రేడియో నాటకంగానూ మలిచారు. బందా కనక లింగేశ్వర రావు నిర్వహణలో కొన్ని నాటకాలు ప్రసారమయ్యాయి. వాటిలో ప్రధానమైనది 'అనార్కలి' ఈ నాటకం చారిత్రక నేపథ్యంలో సాగింది. ముద్దు కృష్ణప్ప గారి తొలి తెలుగు నాటకం అనార్కలి. ఈ నాటకంలోని ఇతివృత్తాన్ని రేడియో నాటకంగా మలిచారు. ఇందులో దేవదాసు ఒక కోవకు చెందిన ప్రణయ గాథ సలిం యువరాజు. రాజ్య పట్టాభిషిక్తుడు కావలసినవాడు. తాను ప్రేమించిన అనార్కలి కోసం ప్రాణత్యాగం చేసి రాజ త్యాగం చేయడానికి సంసిద్ధతను వ్యక్తం చేశాడు. దృశ్య రూపకంగా ఇది రస పుష్టిని కలిగించింది. శ్రవ్య కావ్యంగా దీనిని మలచడానికి నిర్వహణా నైపుణ్యం కావాలి.

[29]అనంత పద్మ నాభరావు, ఆర్. రేడియో నాటకాలు చారిత్రక పరిశీలన,పుట:90.

[30]అనంత పద్మ నాభరావు, ఆర్. రేడియో నాటకాలు చారిత్రక పరిశీలన,పుట:82.

[31]అనంత పద్మ నాభరావు, ఆర్. రేడియో నాటకాలు చారిత్రక పరిశీలన,పుట:79.

ఊటుకూరి సత్యనారాయణ రావు రచనను గంట నాటకంగా ,బందాకనకలింగేశ్వర రావు ప్రాణం పోశారు.[32]

బందా కనక లింగేశ్వర రావు నిర్వహణలోనే వేదం వేంకటరాయశాస్త్రి గారి ప్రతాపరుద్రీయం, బొబ్బిలి యుద్ధం, వంటివి రంగ స్థల నాటకాలుగా ప్రాచుర్యం పొందాయి. ప్రతాప రుద్రీయంలో పేరి గాని పాత్ర సజీవ పాత్ర, బొబ్బిలి యుద్ధం ఆంధ్ర పౌరుషానికి మారుపేరు. బొబ్బిలి వీరుల సాహస గాథను దృశ్య నాటకంగా వేదం వారు రూపకల్పన చేశారు. వాటిని బందా వారు రేడియో అనుసరణ నిర్వహించి కృతార్థులయ్యారు.[33]

**2.5.2.నవలలు – రేడియో అనుసరణ:**

నవలలను రేడియో నాటకాలుగా రాయడం సామర్థ్యంతోనూ, కష్టంతోనూ కూడిన పని కష్టాన్ని కూడా ఇష్ట సాధ్యం చేయవచ్చునని బందా కనక లింగేశ్వరరావు నిరూపించారు. వీరి నిర్వహణలో వచ్చిన నవలలను కొంత పరిచయం చేస్తాను.

చిలకమర్తి లక్ష్మి నరసింహం ప్రహసన కర్తగా ఆద్యతనాంధ్ర ప్రపంచంలో పేరు పొందారు. వీరి 'గణపతి' నవల హాస్య నవలగా ప్రజలకు ఎంతో చేరువైంది. చదువు రాని, చదువుకోని వాజమ్మ గణపతి, అతని నిర్వాకంలో జరిగిన కథా గమనమే గణపతి నవలగా రూపొందింది. దీనికి రేడియో అనుసరణగా బందా కనక లింగేశ్వరా రావు నిర్వహణలో (1967)లో ప్రసారం చేశారు. గణపతి పాత్రగా నండూరి సుబ్బారావు అద్భుతంగా నటించారు.[34] ఇలాగే విశ్వనాథ సత్యనారాయణ రాసిన వేయిపడగల నవల బహుళ ప్రచారం పొందింది. దీనిని దిట్టకవి శ్యామల దేవి రేడియో అనుసరణ చేశారు. దీని నిర్వహణ సరోజని నిర్మల.

పోలా ప్రగ్గడ సత్యనారాయణ రేడియో అనుసరణ చేసిన నాటకాలు. అడివి బాపిరాజుగారి జాజి మల్లి చారిత్రక నవలను రేడియో అనుసరణ చేశారు. అలాగే మొక్కపాటి నరసింహశాస్త్రి బారిష్టర్ పార్వతీశం, 8 భాగాలుగా ప్రసారం చేశారు. పోలాప్రగడ సత్యనారాయణ తన స్వీయ నవలలు విజయాంబిక, మనసిచ్చి చూడు, చదువుకున్న మారాజులు, నవోదయం, వంటి వాటిని కూడా రేడియో అనుసరణ

[32]అనంత పద్మ నాభరావు, ఆర్. రేడియో నాటకాలు చారిత్రక పరిశీలన,పుట:76.

[33]అనంత పద్మ నాభరావు, ఆర్. రేడియో నాటకాలు చారిత్రక పరిశీలన,పుట:76.

[34]అనంత పద్మ నాభరావు, ఆర్. రేడియో నాటకాలు చారిత్రక పరిశీలన,పుట:76.

చేశారు. ఇవే కాకుండా చాలా నవలలను రేడియో అనుసరణ చేశారు వాటిలో కొన్నింటిని మాత్రం పేర్కొన్నాను.

''రేడియోలో ప్రసారం చేయబడిన తొలి తెలుగు రూపకం ముద్దుకృష్ణగారి 'అనార్కలి'(1937) ఇందు దేవులపల్లి కృష్ణశాస్త్రిగారి పాటలు జోడించబడినవి. నాడు, సలీం పాత్రను పఠించిన వారు కూడా కృష్ణశాస్త్రి గారే శ్రవ్య రూపక రచనలో ప్రసిద్ధులు, నిష్ణాతులు అయిన వారు పలువురు కలరు. శ్రవ్య రూపక రచనలో అగ్రతాంబూలాన్నందవలసిన వారు వింజమూరు శివరామారావుగారు. వీరు సుమారు వేయి శ్రవ్య రూపకములను రచించియున్నారన్నచో అతిశయోక్తి కాదు. కేవలం శ్రవ్య రూపకాలనే వ్రాసి క్రొత్త క్రొత్త ప్రయోగములు చేసినవారు కొడవటిగంటి కుటుంబరావుగారు 'భార్య రూపవతి', 'కొరరాని కొయ్య' మొదలగు వారి రచనలు ప్రసిద్ధం. ఉత్తమ శ్రవ్య రూపక రచయితలలో శ్రీయుతులు గోరాశాస్త్రి (కొమ్మ సంపెంగ, ఆనంద నిలయం మొదలైనవి) జల సూత్రం రుక్మిణి నాథ శాస్త్రి, జనమంచి రామకృష్ణ, అమరేంద్ర, దాశరథి, శ్రీవాత్సవ, బుచ్చిబాబు, నాగభూషణ్ ప్రభృతులు ముఖ్యంగా పేర్కొనవలసిన వారు అమరేంద్ర గారు టాగూర్ రచనలను తెలుగులోనికి తెచ్చినవారు శ్రీ నాగభూషణ్ గారు. రేడియో నాటకాల పోటీలలో బహుమతినందుకున్నారు.. 'కల కాపురం' 'వడ్డించిన విస్తరి' మొదలైనవి వీరి ప్రసిద్ధ రచనలు''[35]తొలి తెలుగు రూపకం మొదలుకొని మహాకవులు శ్రవ్య రూపకాలను ఆదరిస్తూ పల్లెటూళ్ళ ప్రజానీకానికి విజ్ఞాన సంపదను అందించడానికి రేడియో నాటకాలను గొప్ప సాధనాలుగా ఎంచుకున్నారని తెలుస్తుంది. నేటికి రేడియో నాటకాల ద్వారా విజ్ఞాన సంపదను అందిస్తూనే ఉన్నారు.

**2.6.శ్రవ్యరూపకములు– పరిమితులు:**

శ్రవ్య రూపకాలకు కొన్ని పరిమితులు అవసరం పరిమితులు శ్రవ్య రూపకాలను చక్కని దిశలో సాగేవిధంగా తోడ్పడతాయి. వాటిని గురించి 1960 సంవత్సరంలో శ్రవ్యనాటక రచన గురించి రేడియో అన్నయ్య ఏడిద కామేశ్వరరావుగారు కొన్ని మార్గదర్శక సూత్రాలు చెప్పారు. అవి

1. సంభాషణలు అర్థ యుక్తంగా చిన్న విగా ఉండాలి.

---

[35]అప్పారావు, పి. యస్. ఆర్. తెలుగు నాటక వికాసం, పుట:498.

2. కథను సంభాషణల ద్వారా నడిపించాలి

3. చమత్కారం ఉండాలి.

4. నిర్ధారిత ప్రసార సమయం (15ని//లు, 30ని//, 60ని//లు) లోపల నాటకం పూర్తయి పోవాలి.

5. ప్రసార సమయం కన్నా రెండు నిమిషాలు తక్కువ ఉంటే నాటక వివరాలు ప్రకటించే వీలుంటుంది.

6. సందర్భానుసారం నాటకాన్ని అంకాలుగా విభజించుకోవాలి

7. విరామం, సంగీతం, సూచనలు ఇవ్వాలి.

8. నాటకంలో ఏ సంభాషణా కులమతాలకు సంబంధించి ఉండకూడదు.

9. వ్యాపార వస్తువుల పేర్లు ఉండకూడదు.

ఉదా// అమృతాంజన్, విక్స్ లాంటి మందుల పేర్లు రాయకూడదు.

10.ప్రభుత్వ విధానాలను విమర్శించే విగా సంభాషణలు ఉండకూడదు.

11. ప్రత్యక్షంగా లేక పరోక్షంగా ఏ వ్యక్తిని ఉద్దేశించి రాయకూడదు.[36]

ఇలాంటి సూచనలు, జాగ్రత్తలు వారు చెప్పడం జరిగింది. వీటిని పాడించినట్లయితే నాటకం ప్రజలకు ఆనందాన్ని కలిగిస్తుంది. విసుగు , నిరాశ చెందకుండా శ్రవ్యానందాన్ని పొందగలుగుతాం. మారుతున్న కాలానికి అనుగుణంగా రేడియో కూడా ఈ ఆధునిక ప్రపంచంలో సాంకేతికంగా అభివృద్ధి చెందింది.

‘‘తెలుగులో రేడియో నాటక చరిత్ర 56 సంవత్సరాల పై బడింది. మద్రాసు కేంద్రంలో ప్రారంభమైన తెలుగు రేడియో నాటకం గత ఆరు దశాబ్దాల్లో సాంకేతిక పరంగాను, ఇతివృత్త స్వీకరణలోను, ప్రయోగ నైపుణ్యంలోను విభిన్న పోకడలు పోయింది. తొలి రోజుల్లో ‘లైవ్’ నాటకాలు చేసేవారు. ఆ తర్వాత గ్రామ ఫోన్ రికార్డులు కట్ చేసేవారు. తర్వాత స్పూల్ టైప్ రికార్డింగ్ తర్వాత సి. డి. లు కట్ చేసే స్థితికి చేరుకుంది. డబ్బింగ్లు, ఎడిటింగ్ లకు, నిప్పాన్ మిషన్ల స్థాయి నుంచి MELTRON రికార్డర్లు వాడే దశ వచ్చింది. ఇప్పుడు కంప్యూటర్ సాయంతో 14 ట్రాక్స్ రికార్డింగు, ఆన్ లైన్ ఎడిటింగ్ సాధ్యమవుతుంది. లైబ్రరీలో ఉన్న సౌండ్ ఎఫెక్ట్స్ మీద ఆధారపడనక్కర లేకుండా కంప్యూటర్ సౌండ్ ఎఫెక్ట్స్ మిక్స్

[36]రవీంద్ర త్రివిక్రమ్, కాటూరి. తెలుగులో శ్రవ్యనాటకాలు, పుట:26.

చేసుకోవచ్చు. ట్రాక్ రికార్డింగ్ చేసుకుని తర్వాత సంభాషణలు కలుపుకోవచ్చు. సాంకేతికంగా చాలా మార్పులు వచ్చాయి.''[37]ఈ మాటల్ని రేడియో నాటకం సాంకేతిక పరికరాలతో, కొత్త ధోరణిలో ముందుకు సాగుతుంది. సాంకేతిక పరంగా వచ్చిన మార్పుల వలన కలిగే ప్రయోజనాలు ఏమిటో తెలుస్తుంది.

## 2.7. రేడియో నాటకీకరణ:

ప్రముఖులైన కవులు రచించిన కథల్ని కాని, మాటల్ని కాని సినిమాలుగా, రేడియో నాటకాలుగా చిత్రీకరిస్తున్నారు. ఉదాహరణకు కన్యాశుల్కం నాటకం సినిమా గాను, వానినే రేడియో నాటకం గాను చిత్రించడం జరిగింది.

## 2.7.1. నాటకాలు: రేడియో నాటకాలు: భేద సాదృశ్యాలు

నాటకాలకు రేడియో నాటకాలకు ఎంతో భేదముంది వాటిని ఈ క్రింద పట్టిక ద్వారా తెలుపుతున్నాను.

| | నాటకాలు | | రేడియో నాటకాలు |
|---|---|---|---|
| 1. | నాటకం దృశ్యమైంది | | రేడియో నాటకం శ్రవ్యమైంది |
| 2. | నాటక ప్రదర్శనకు తెర ఉంటుంది | | దీనికి తెర అవసరం లేదు |
| 3. | నాటక ప్రదర్శనకు రంగస్థలం కావాలి | | రేడియో నాటకానికి రేడియో సెట్ ఉంటే చాలు. |
| 4. | వేషధారణ చిత్రకళ, శిల్పకళ, రంగాలంకరణ అవసరం | | సంభాషణ చాతుర్యమే ప్రధానం |

ఇవే కాకుండా నాటక ప్రదర్శన దేశవ్యాప్తంగా ప్రదర్శించాలంటే ఎంతో కాలం పడుతుంది. కాని రేడియో ద్వారా ఒక నాటకాన్ని కాని ఒక పాటను కాని రేడియో సెట్ ఉన్న ప్రతి వ్యక్తి విని సంతృప్తి పడగలడు. రేడియో నాటకీకరణ దీనినే ''రేడియో అనుసరణ అని కూడా అంటారు. ప్రసిద్ధమైన కథల్ని నవలల్ని ఆకాశవాణి శ్రవ్యనాటకాలుగా ప్రసారం చేయడం బందా వారి కాలంలోనే ప్రారంభించారు. ఆ

[37].అనంత పద్మ నాభరావు. రేడియో నాటకాలు చారిత్రక పరిశీలన, పుట:37.

క్రమంలోనే ఆకాశవాణి నిలయ విద్వాంసుల చేత అనుభవజ్ఞుల చేత నాటకీకరణలు చేయిస్తుండేవారు. మహీధర రామమోహనరావు గారి 'కొల్లాయి గడితేనేమి' చాలా ప్రసిద్ధ నవల టి. వి సీరియల్ గా కూడా ప్రసారమైంది. దాన్ని రేడియోలో నాటకంగా ప్రసారం చేయాలని శ్రీ పాండురంగ సంకల్పించారు.''[38]

గణపతి, వేయిపడగలు నవలలు ఒక ప్రత్యేక విజ్ఞాన సాధనమని చెప్పవచ్చు. ఈ రేడియోను 1901 లో మార్కొని అనే శాస్త్రవేత్త కనుగొన్నారు. కనుగొన్న 3 దశాబ్దాలలోనే భారతదేశంలోకి వచ్చి తెలుగు నాటకాలను కూడా ప్రదర్శించడం గమనించవచ్చు. దూర ప్రదేశాలలోని సమాచారం తెలుసుకోవడానికి ప్రత్యక్షంగా వెళ్ళడం కుదిరే ది కాదు ఇప్పుడున్న రవాణా వ్యవస్థ లేదు, టెలివిజన్స్ లేవు అటువంటి సమయంలో రేడియో ప్రచార సాధనంగా ప్రజలకు ఉపయోగపడింది.

**2.8. గణపతి వేయిపడగల నవలలు పరిచయం:**

గణపతి నవలను చిలకమర్తి లక్ష్మి నరసింహం 1917లో రాశాడు. ఈ నవలలోని ప్రధాన పాత్ర గణపతి. ఈ నవల ప్రారంభం నుండి చివరి వరకు గణపతి పనులవలన, మాటల వలన, హాస్యం చోటు చేసుకుంటుంది. అప్పుడప్పుడు గణపతి చెప్పే సమాధానాలు పాఠకులకు ఇతను జ్ఞానా, అజ్ఞానా అనే టువంటి సందేహాలు కూడా ఏర్పడతాయి. మొత్తం మీద ఈ నవలను హాస్యపూరకంగానే కాకుండా సాంఘికాంశాలను చిత్రీకరించారు.

హాస్య సాహిత్య నిర్మాతగా చిలకమర్తివారికి స్థానం కల్పించిన వాటిలో 'గణపతి' ఒకటి ఇది సాంఘిక నవలగానే కాక హాస్య నవలగా కూడా ప్రసిద్ధికెక్కింది. గణపతిలో ఇతివృత్తం ఆంధ్ర జీవితానికి అత్యంత సన్నిహితమైంది. గోదావరి కృష్ణా ప్రాంతాల ఒకనాటి తెలుగు ప్రజలకు వారి సాంఘికాచారాలకు దర్పణమిది. విద్య విహీనుడై, బంధు జనాదరణ లేని నిర్భాగ్యుడై, ఆనాడు సంఘంలో బహుళ ప్రచారంలో నున్న మేజువాణిలాంటి దురాచారాలపై షోకులపై మోజు వదులుకోలేక సతమతమయ్యే గణపతిని, ఆ లోపాల్ని సమర్థించడానికి పాటుపడే గణపతి తల్లి పడే పాట్లను శవ వాహకుల స్వార్థపరత్వాన్ని నిరక్షరాస్యులైనా ఉపాధ్యాయ పదవికి తయారయ్యే బడిపంతుళ్ళను కడుపుబ్బా నవ్వు పుట్టించే సన్నివేశాలతో 'గణపతి' లో

[38]రవీంద్ర త్రివిక్రమ్, కాటూరి. తెలుగులో శ్రవ్యనాటకాలు,పుట:45.

చిలకమర్తివారు పాఠకలోకానికి అందించారు. అందువల్లనే నాటికి నేటికి తెలుగు హాస్య సాహిత్యంలో చిలకమర్తివారి గణపతి అగ్రస్థానాన్ని వహించి నిల్చింది.[39] అని వై. వి. రమణ 'ఆధునికాంధ్ర సాహితీ నిర్మాతలు– చిలకమర్తి లక్ష్మి నరసింహం' అనే గ్రంథంలో వివరించారు.

వేయిపడగలు నవలను విశ్వనాథ సత్య నారాయణ 1934లో రచించారు. ఈ నవలలో మూడు తరాల యొక్క చరిత్రను చిత్రీకరించారు. ఇందులో ఆధ్యాత్మికతను, స్వాతంత్ర్య పరిస్థితులను వివరించారు. వేయిపడగలు 80 ఏళ్ల క్రితం రచించబడినా, ఈనాటికి బహుళంగా చదువబడుతూ చర్చించబడుతుంది, వ్యాఖ్యానించబడుతుంది. సజీవంగా సాహిత్యరంగంలో నిలబడి ఉంది. ఇన్నాళ్లలో లక్ష పైగా ప్రతులు వెలువడటం, అవిచ్ఛిన్నంగా పాఠకులు ఆసక్తి చూపుతూ ఉండటం, మరే నవల విషయంలోనూ ఉన్నట్లుగా కనపడదు. ఈ నవల ఒక విస్తృతమైన మానుష ప్రపంచాన్ని ప్రకృతిని, చరాచర జగత్తును తనలో ఐక్యం చేసుకుంది. అని వేయిపడగలు ఎందుకు చదవాలి? అనే వ్యాసంలో సుప్రసన్నా చార్య తెలిపారు.[40]

ఈ విధంగా తెలుగు నాటకం ప్రదర్శన రూపంగానే కాకుండా పుస్తక రూపంలోనూ వెలువడ్డాయి. ఆ తర్వాత ఆ నాటకంలోని ఇతివృత్తాలను పరిశీలించినప్పుడు కొన్ని ప్రయోగాత్మక నాటకాలు వచ్చాయి. అవే కాకుండా కావ్యాలు, సంస్కృత కావ్యాలలో గల ఇతివృత్తాలను తీసుకొని నాటకాలుగా రాశారు. పౌరాణిక నాటకాల తర్వాత ప్రజల ఆదరణలోకి వచ్చిన సాంఘిక నాటకాలు వివిధ నవలల నుండి ఇతివృత్తాన్ని స్వీకరించి నాటకాలుగా రాసిన వారు ఉన్నారు. అలాగే పురాణ, ఇతిహాసాలకు సంబంధించిన ఇతివృత్తాలను తీసుకుని నాటకాలుగా, రేడియో నాటకాలుగా మలిచినవారు ఉన్నారు. దీనిలో భాగంగానే విశ్వనాథ వారి వేయిపడగలు, చిలకమర్తి వారి గణపతి నవలలు రేడియో నాటకాలుగా మారడం జరిగింది. వీటిని రాబోయే అధ్యాయాలలో వివరిస్తాను. తర్వాత అధ్యాయంలో గణపతి, వేయిపడగల ఇతివృత్తాలను పరిచయం చేస్తాను.

---

[39]భారతి, ముక్తేవి. చిలకమర్తి సాహిత్య సేవ ,పుట:191.

[40]కొండలరావు, వెల్చాల. విశ్వనాథ 'వేయిపడగలులోని కొన్ని ముఖ్యాంశాలు విశ్వనాథ గురించి కొందరు ప్రముఖుల భావాలు(సంకలనం),పుట:5.

మూడవ అధ్యాయం

# గణపతి, వేయిపడగల నవలలు: ఇతివృత్త పరిచయం

నా పరిశోధనాంశం 'రేడియో నాటకాలుగా మారిన గణపతి,వేయిపడగల నవలలు: విమర్శనాత్మక పరిశీలన' గణపతి, వేయిపడగలు నవలలు రేడియో నాటకాలుగా మారాయి రేడియో నాటకాలుగా మారినప్పుడు కథా సారాంశంలో ఏమైనా మార్పులు జరిగాయా? మూలం చెడకుండా కథను నడిపించారా లేదా అనే విషయాలు తెలుసుకోవడానికి ఈ నవలల ఇతివృత్త సారాంశాలను తెలుసుకోవాల్సిన అవసరం ఉందనిపించింది ఈ అధ్యాయంలో గణపతి, వేయిపడగల నవలల ఇతివృత్తాలను వివరిస్తున్నాను.

## 3.1. ఇతివృత్తం:

నవలలో ఇతివృత్తం అత్యంత ప్రాముఖ్యం కలిగింది ఇతివృత్త నిర్మాణాన్నిబట్టి ఆ నవల యొక్క గొప్పతనాన్ని అంచనావేయవచ్చు. రచయిత ఇతివృత్త నిర్మాణ నైపుణ్యంతోనే పాఠకులకు ఆసక్తిని అభిరుచిని కలిగించగలడు. మానవుని మనుగడంతా ఇతివృత్తంలోనే నిక్షిప్తమై ఉంటుంది. పాత్రల యొక్క సంభాషణ వారు చేయు పనులు అన్ని ఇతివృత్తం ద్వారానే వ్యక్తమవుతాయి.

''*కథా వస్తువును నాటకంగా మలిచే నిర్మాణ క్రమాన్ని ఇతివృత్తం అంటారు. ఎన్నుకున్న సన్నివేశాలను క్రమబద్ధంగా, విస్మయాత్మకంగా, ఉత్కంఠ భరితంగా నిబంధించేది ఇతివృత్తం.*''[1]

'' *ఇతివృత్తంతు కావ్యస్య శరీరం పరికల్పితమ్ అని భరతమహర్షి,The plot, then is the first principle as it were the soul of tragedy character holds the second place' అని అరిస్టాటిల్ పండితుడు 'Poetics' లోను ప్రవచించి ఉండటం గమనించదగ్గ అంశాలు*''[2]ఈ విషయాలను గమనిస్తే

[1]నాగభూషణశర్మ, మొదలి. నాటక శిల్పం.పుట:69.

[2]గంగప్ప,ఎస్. వేయిపడగలు– విశ్లేషణాత్మక విమర్శ, పుట:39.

ఇతివృత్తం అంటే ప్రధానమైన కథ, కావ్యానికి శరీరం వంటిదని, పథక రచన అనేది ఇతివృత్త నిర్మాణానికి మొదటి స్థానం కల్పించడం, ఈతి బాధలకు సంబంధించినటువంటి రూపకల్పన ఇతివృత్తానికి ద్వితీయ స్థానంగా చెప్పడం గోచరిస్తుంది.'*కథ చెప్పే పద్ధతిని కథా కథనం అంటారు. కొన్ని పాత్రలు, కొన్ని సన్నివేశాల ద్వారా ఆటంకాలను అధిగమిస్తూ తమ లక్ష్యాలను సాధించడం కథకు ఆలంబనం. ఒక కథలో జరిగే అన్ని సంఘటనలను నాటకంలో ఇమడ్చడం కష్టం.''*[3]

### 3.2. 'గణపతి' నవల – ఇతివృత్త నిర్మాణ వైఖరి:

హాస్య నవలగా గణపతి ఎంతో ప్రాముఖ్యతను సంతరించుకుంది. చిలకమర్తి లక్ష్మి నరసింహం ఈ నవలను 1917 సంవత్సరంలో రాశారు. ఈ నవలలోని కథాకథనం , సన్నివేశాలు. ఆనాటి కాలంలో బాల్యవివాహాల వ్యవస్థ మూఢవిశ్వాసం వంటి విషయాలను ప్రధానంగా బ్రాహ్మణుల జీవన విధానాన్ని తెలియజేస్తుంది. ఈ గణపతి నవల హాస్య ధోరణిలో సాగిన రచన అయినా ఆ హాస్య సన్నివేశాలు, పాత్రల సంభాషణలలోని ఆంతర్యాన్ని గ్రహిస్తే మానవుని వ్యక్తిత్వం వ్యక్తమవుతుంది.

దేశ గతిని బాగుచేయడానికి ప్రజల ఆలోచనలలో మార్పు తేవడానికి ఎందరో మహాకవులు ఎన్నో రచనలు రాశారు. రాస్తూనే ఉన్నారు. అయితే రాసే పద్ధతిలో కొత్తదనం ఉంటే ఆ విషయాలను పాఠకులు ఆసక్తితో గ్రహిస్తారు. అటువంటి ఆలోచన చిలకమర్తి వారు చేశారేమో హాస్య రసాన్ని నవలలో జోడించి చదువరులను ఆనందింపచేయడమే కాక ఆలోచింపచేసే విధంగా ఈ నవలను రూపుదిద్దాడు.*''గణపతి నవల హాస్య ప్రధానమై ఆనాటి అగ్రవర్ణముల స్థితిగతులను చక్కగా వివరిస్తుంది. కథా కథన నైపుణి ప్రసన్న మధురమైన శైలి సునితమైన హాస్యధోరణి చదువరులను ఆకర్షించు గుణములు''*[4]ఇవన్నీ చిలకమర్తి ప్రతిభకు నిదర్శనం. అని జి. నాగయ్య తెలిపారు.

'గణపతి' నవలలో ప్రధాన పాత్ర గణపతి . ఇతని ఆకారం, మరగుజ్జుతనం, అన్ని అవలక్షణాల స్వరూపం గణపతి. ఇతని పూర్వీకులు కంటె ఎక్కువ

---

[3]నాగభూషణ శర్మ,మొదలి. నాటక శిల్పం. పుట: 70.

[4]నాగయ్య,తెలుగు సాహిత్య సమీక్ష, పుట:811,812.

అవలక్షణాలు గణపతి పాత్రలో కనిపిస్తాయి. గణపతి బ్రాహ్మణ కుటుంబానికి చెందిన వాడైనా ఆ వంశంలోని ఆచారవ్యవహారాలకు అతీతంగా ప్రవర్తించటం ఆయా సందర్భాలలో వ్యక్తమవుతుంది. గణపతి బ్రాహ్మణ వంశంలో పుట్టి గాడిదనెక్కడం గణపతి మేనమామకు చెప్పరాని కోపం వస్తుంది. అయితే వసుదేవుడంతటి వాడు గాడిద కాళ్లు పట్టుకున్నాడు. నేను దర్జాగా గాడిదనెక్కి ఊరేగాను. అని సమాధానమిస్తాడు. ఇలా తాను చేసే ప్రతిది ఇతరులకు తప్పుగా అనిపించినా వాటిని సమర్థించుకునే జ్ఞానం గణపతికి పుష్కలంగా ఉంటుంది.

పాత సంప్రదాయాలకు మూఢవిశ్వాసాలకు అడ్డుకట్ట వేయడమే అనే భావం ఆయా సన్నివేశాలలో స్ఫురిస్తుంది. పాత ఆలోచనలకు స్వస్తి చెప్పి కొత్త విధానానికి మార్గం చూపే విధంగా అనేక పాత్రలు వారి సంభాషణ వారి అలవాటులు, వ్యక్తిత్వాలు స్పష్టం చేస్తాయనడంలో అతిశయోక్తి లేదు.

### 3.3.. గణపతి నవల – ఇతివృత్తం:

''శుక్లాం బరధరం....'' ప్రార్థనతో నవల ప్రారంభమవుతుంది అయితే పాండిత్యం గల ఒక బుద్ధిమంతుడు ఈ శ్లోకానికి ఉన్న అర్థాన్ని మార్చి చమత్కారంగా గాడిదనుద్దేశించి విపరీతార్థంతో చెప్తాడు. గణపతి స్వామికి ఉన్న చాలా లక్షణాలు నవలలోని గణపతికి కలవు. మరగుజ్జురూపం, బుంగముఖం లక్షణాలతో ఈ నవలలో కనబడతాడు గణపతి. ఇతనికి ఈ పేరు ఎలా పెట్టారో తెలీదు. వారి పూర్వీకులు ఎవరైనా ఆ పేరుతో ఉండవచ్చు. లేదా అతని ఆకారాన్ని, బుంగముఖాన్ని, బొజ్జను చూసి ఆ పేరు పెట్టి ఉండవచ్చు. వేదవ్యాసునిలాంటి వానికి ఈ చరిత్రను చూస్తే ఆ మహాభారతం. పురాణాలు రాసే పని తప్పిఉండేది అంటాడు రచయిత.

### 3.3.1. గణపతి నవల– కారణాలు:

రచయితకు ఈ నవలలోని చరిత్ర ఎలా లభించిందో తెలియజేస్తాడు. అతని స్వప్నంలో కనబడిన వృత్తాంతాన్ని గణపతి నవలగా తీర్చిదిద్దాడు. ఆ కలలో వచ్చిన వ్యక్తి తన వృత్తాంతం రాయకపోతే మిమ్మల్ని దెయ్యమై పీడిస్తానని బెదిరిస్తాడు. కాని రచయిత వాటిని నమ్మడు. విచిత్రంగా వచ్చిన ఆ కల బాగుందని తనదైన రీతిలో గణపతి నవల రాయడానికి పూనుకున్నాడు. ఇది మొదటి కారణం భాషాభిమానం

రెండవ కారణం, చమత్కారమైన, వినోదమైన రచన చేయదలచడం మూడవ కారణం. కలలో దైవం కనిపించి రచనలు చేయమని ఆజ్ఞాపించబడిన వారిలో తిక్కన, శ్రీ కృష్ణదేవరాయులను ఉదాహరణగా తెలియజేస్తాడు రచయిత.

### 3.3.2.గణపతి పూర్వీకుల చరిత్ర:

కథా విషయానికి వస్తే గణపతి వారిది బ్రహ్మ వంశం ఈ వంశంలో ఒక శాఖ పప్పుభొట్ల వారుగా ప్రసిద్ధికెక్కిరి. వీరికి ఈ పేరు రావడానికి గల కారణం గణపతి పూర్వులలో ఒకడు పందెం వేసి కందిపప్పును వండించుకుని తానొక్కడే తిని బహుమానం సంపాదించడం చేత ఈ పేరు సార్థకమైనది.

గోదావరి తీరమందున్న మందపల్లి గ్రామం యొక్క ప్రశస్తిని గణపతి పూర్వులు నక్కపల్లి నుండి మందపల్లి చేరడానికి కారణాలు వివరించబడింది. గణపతికి ఏడు పురుషాంతరముల వారు మందపల్లిలో ఉన్నారు. గణపతికి ఎనిమిదవ పురుషుడు నక్క పల్లిలో నివాసముండి ఒక సందర్భంలో భార్యను కోపించి సన్యాసం స్వీకరించాడని తెలుసుకొని అతనికి భిక్షవేయడం మాని వేయడంలో సన్యాసి వేషం తీసేసి భార్యను బతిమాలుకుని గృహస్థుడైనాడు. అక్కడున్న వారు వీరిని బాధించడం చేత మందపల్లి చేరాడు.

### 3.3.3. గణపతి పూర్వీకుల వృత్తి:

గణపతి పూర్వులు వారి భుజబలంచేత దక్కించుకున్నదే స్థిరాస్తిగా ఉండేది. పప్పుభొట్లవారికి మందపల్లి వాసులు తమ సొత్తు ఇవ్వడానికి ఇష్టం లేకపోయినను వారి భుజబలం, వాగ్బలం చేత గెలువలేక మందపల్లి నివాసులు ఊరకుండవలసిన వారైరి. ఎవరూ దొంగలించబడని వీరు ఆస్తి భిక్షాటనం. వ్యవసాయం, భాషాపరిజ్ఞానం వంటివి సంపాదించుకొని కష్టపడటం కంటే భిక్షమునే వృత్తిగా చేసుకుని జీవించటం సులభమని భావించేవారు. గణపతి పూర్వులలో అతని పితామహుని చరిత్ర తప్ప తక్కిన వారివి లభించలేదు. అతని పితామహుని పేరు పాపయ్య ఇతను షట్ కర్మలలో ఐదింటిని వదిలి దానాన్ని మాత్రం స్వీకరించాడు. ఇతను కూడా దానాలు చేస్తాడు. అవి పితృదానం, తన మిత్రులకు పొగ చుట్టల దానం. తద్దినాలకు పెళ్లిళ్ళకు భోక్తగా వెళ్ళడం ఇతని వృత్తి. పాపయ్య కొన్ని బిరుదులను తనకు తగిలించుకొని పురోహితులుగా పోయి తక్కినవారి వలె తనను

సత్కరించాలని కోరతాడు. దానికి వారు తిరస్కరిస్తే పెళ్లి పందిరి పీకి నాలుగు శాపనార్థాలు తిట్టి వస్తాడు. ఇలా పాపయ్య ఆహార, ధన సంపాదన చేస్తాడు. వివాహం కాలేదన్న బాధ ఉండటం చేత ధనాభివృద్ధి చేయాలని పునహాకు వెళ్తాడు. అక్కడ తాననుకున్న వాతావరణం లేకపోవడం చేత బతుకుతెరువు కోసం శవాలను కాల్చే పనికి పూనుకొని ఎక్కువ ధనార్జన చేస్తాడు. అరవై ఏండ్ల పాపయ్య అన్నంభొట్ల అన్నప్పగారు కోరిన విధంగా ధనమిచ్చి పన్నిండేళ్ళ పిచ్చమ్మను వివాహం చేసుకొని మందపల్లిలో కాపురముంటాడు.

### 3.3.4. బాల్యవివాహం:

పాపయ్య ఇంట్లోనే తన మామ అన్నంభొట్ల అప్పన్న వారి కుటుంబం చాలా కాలం నివసించడం చేత అతనికి కష్టమై తన మామను ఇంటి నుండి వెళ్ళగొట్టే ప్రయత్నం చేస్తాడు. దానికి ఆగ్రహించిన అన్నప్ప గారు అర్ధరాత్రి వేళనే తన కూతురిని తీసుకొని స్వగృహానికి వెళ్ళిపోతాడు. కొన్ని రోజుల తర్వాత అన్నప్ప కూతురు పిచ్చమ్మ పెద్దమనిషైంది. పాపయ్య సీతారామయ్యను రాయబారానికి పంపించి తన మామ కోరిక ప్రకారం మూడు వందల రూపాయలు ఇచ్చాడు. కార్యం పూర్తయ్యింది. కొంతకాలానికి పిచ్చమ్మకు మగ శిశువు జన్మించాడు. అ పిల్లవాడికి గంగాధరుడు అని పేరు పెట్టారు. అన్నప్ప తిరిగి స్వగృహానకి ప్రయాణమయ్యే సమయాన పాపయ్య మరణించడంతో అతను మందపల్లిలోనే ఉండిపోయాడు.

అన్నప్ప పాపయ్య అప్పు ఇచ్చిన మాట తెలుసుకొని పిచ్చమ్మ చేత పెట్టి తాళాలు తీసుకొని పత్రాలను బాకీదారుల దగ్గరకు తీసుకువెళ్ళి డబ్బులు తీసుకొని పత్రాలను చింపివేసెను. తన కూతురి కుటుంబాన్ని ఆ డబ్బుతో కొంత కాలం పోషించి తన కూతురికి వంద రూపాయలు అప్పు ఇప్పించి తనకు భారం కాకూడదని స్వగృహానికి వెళ్తాడు. అప్పటి నుండి మరలా మందపల్లి రావడానికి తీరికలేకుండా ఉండిపోయాడు. పిచ్చమ్మ తన తండ్రి కోసం ఎదురుచూసేది లేక ఇల్లు అమ్ముకునే పరిస్థితి ఏర్పడింది.

### 3.3.5.గంగాధరం చేసే పని:

పిచ్చమ్మ ఎక్కడా నివాసం ఉండడానికి దొరకక ఏనుగుమహాల్ చేరింది. ఏడేండ్ల తన కుమారుడు గంగాధరానికి ఉపనయనం చేయించే స్తోమత లేక

ఎవరిచేతనో జంధ్యం వేయించి ఉపనయనం అయిపోయిందని భావించింది. గంగాధరుడు భిక్షాటనను ప్రారంభించాడు. మధుకర వృత్తిచేత, తనను, తల్లిని పోషించుకుంటున్నాడు. కొంత కాలం తర్వాత గంగాధరాన్ని బ్రాహ్మణార్థానికి, శుభకార్యాలకు పిలువక పోవడంతో కాకినాడకు తన తల్లిని తీసుకొని బయలుదేరుతాడు. అక్కడ నీటి కష్టాలు ఉండటం చేత తానే నీటి కావడిలో నీరు మోస్తూ భోజనం పెట్టమని వారికి నియమం ఏర్పరచి జీవనం సాగిస్తున్నాడు. సింహాచలమనే వేశ్యకు ఖర్చుపెడతాడు. ఆమె వ్యక్తిగత పనులన్ని వంటలు, బట్టలుతకడం అన్ని తానే చేసేవాడు.

### 3.3.6. సంపాదన కోసం గంగాధరుని ప్రయత్నం:

ఒక వైశ్యుడు ఇంట్లో వివాహం జరిగెను. వారు లక్షాధిపతులు వారు బ్రాహ్మణులకు ఎక్కువగా దానాలు ఇస్తుండేవాడు. ఆ విషయం పురవాసులు గంగాధరునికి చెప్పకపోవడంతో అతను ఈ పురవాసులు కృతఘ్నులని ఊహిస్తాడు. వేషధారణను మార్చి కానుకలు అందుకొనిన ఒక బ్రాహ్మణుడుని చూసి ఇటువంటి ఉపాయం తనకు ఎవరూ చెప్పనందుకు కోపపడతాడు. ఎవరి సిఫారుసు దొరకకపోవడంతో తానే స్వయంగా సంభావన తీసుకోవాలని అనుకుంటాడు. వివాహం  కాకపోవుటచే తక్కువ సంభావన కలిగినందుకు దు:ఖించాడు. సింహాచలం దగ్గరకు ధనం తీసుకొని వెళ్లకపోతే తాను రానీయదని భావించి తాను వేషధారణను మార్చి మరోసారి సంభావనకై గోడదూకి వెళ్ళాలనుకుని చేయి విరిగి కిందపడటంతో అది తగ్గడానికి ఆరుమాసాలు పట్టింది. కావడి మోసే స్థితిలో లేకపోవడంతో తనను పోషించుకోవడం ఎలా అని బాధపడుచుండగా ఆ ఊరి పురోహితుల నిర్ణయం ప్రకారం అన్ని ప్రచ్ఛాదనములు, తిలదానములు పట్టుచుండిన ఒక బ్రాహ్మణుడు మరణించగా అతని స్థానంలో గంగాధరుడుని నియమిస్తారు. దీనితో గంగాధరునికి లెక్కలేనన్ని ధాన్యములు, కూరగాయలు, బియ్యం, వస్తుండేవి. అవి ఎక్కువై దానాలు కూడా చేసేవాడు. అలా వచ్చిన ధనాన్ని ఒక భాగం తన శరీర పోషణకు, ఒక భాగం తల్లికి, ఒక భాగం సింహాచలానికి ఒక భాగం జూదానికి ఖర్చుపెట్టేవాడు.  కొంతకాలానికి సింహాచలం మరణించడంతో దు:ఖపడి తానే స్వయంగా ఉత్తర క్రియలు జరిపిస్తాడు. మరి కొంత కాలానికి  వివాహం

చేసుకోవడానికి నిశ్చయించుకుని దానికి అడ్డంగా ఉన్న జూదపు అలవాటును ఎలా మానుకోవాలో ఆలోచిస్తాడు. ఇంతలో జగన్నాయక పురం కాకినాడకు కొంత దూరంలో ఉంది. అక్కడ వీరు జూదమాడుతుంటాడు. గంగాధరుడు ఒకసారి జూదమాడడానికి వెళ్తాడు. అక్కడకి పొరుగూరు నుండి ఒక కాపు వచ్చి ఐదు వందల రూపాయలు గెల్చుకుని మరలా ఆడమంటే ఆడనందుకు గంగాధరంతో ఉన్న మిగతా వారు కాపును చంపేస్తారు. గంగాధరునికి ఈ సంఘటనతో వణికి పోతాడు. వీరినంతా పోలీసులు అరెస్టుచేయగా లంచం ఇవ్వడంతో వీరిని వదిలి పెట్టేస్తారు. గంగాధరుడు జూదాన్ని మానుకుంటాడు.

### 3.3.7.గణపతి జననం:

మందపల్లి నివాసుడైన కోట కోనప్ప బ్రాహ్మణుడు నాలుగు వందల రూపాయలు తీసుకుని గంగాధరునికి తన కూతురునిచ్చి వివాహం జరిపించెను. ఆమె పేరు సింగమ్మ. పదమూడవ ఏట పెద్దమనిషయ్యింది. 53 సంవత్సరలైన గంగాధరునికి ఆమెకు కార్యం జరిపించారు. మామగారి ప్రోత్సాహంతో మందపల్లిలో ఒక ఇల్లు కొని అందులో ప్రవేశించాడు. అక్కడ వారికి నాలుగేళ్ల తర్వాత పప్పుభొట్ల వారి వంశంలో గణపతి జన్మించెను.

గణపతి జన్మించిన మూడు నెలలకు గంగాధరుని తల్లి పిచ్చమ్మ మరణించింది. దానికి కారణం గణపతి పుట్టిన నక్షత్రం కారణంగా ఇలా జరిగిందని జాతకం చూపించదలచి జోగావధానులు దగ్గరకు వెళ్తాడు. పిల్లవాడి తిథి నక్షత్రం చెప్పమంటే గంగాధరుడు తనకు జ్ఞాపకం లేదని కొన్ని సంఘటనలను ఉదాహరించి ఆ రోజున పుట్టాడని చెప్తాడు. చివరకు జాతక వివరాలు తెలుసుకొని అతడు అదృష్టవంతుడని పంతులు చెప్పడంతో సంతోషిస్తాడు. పంతులు చెప్పిన మాట కొంత నిజమయ్యింది. , కొంత అబద్ధమైంది. గణపతికి మేనమామ గంగాధరునికి అంత్యక్రియలు జరిపించాడు. కొంతకాలం తన ఇంటనే గణపతి అతని తల్లి సింగమ్మను పోషించారు.

### 3.3.8. గణపతి అల్లరి:

గణపతి విద్యాభ్యాసం తర్వాత ఉపనయనం కార్యక్రమాలు జరిగాయి. గణపతిని బడికి పంపించడం చాలా కష్టపడవలసి వచ్చేది. బలవంతంగా బడికి

వెళ్ళేవాడు. ఏదో సాకు చెప్పి బడికి వెళ్ళడం మానుకునే వాడు ఒకసారి బావిలో రాయివేసి తన స్నేహితుడి చేత తాను బావిలో పడ్డానని చెప్పమంటాడు. వాడు అలాగే చేయగా మేనమామ , సింగమ్మ బాధపడ్తారు. బావినంతా వెదకినా గణపతి దొరకక పోవటం చేత ఇదంతా గణపతి చేసిన పనే అని తెలిసి మేనమామ కోపపడి సింగమ్మతో మీ అబ్బాయి ఆగడాలను నేను భరించలేను ఇంతవరకు నేను మిమ్మల్ని పోషించాను ఇక నా వల్ల కాదు అనగా సింగమ్మ దు:ఖపడుతుంది. దాన్ని చూసి వాడు అల్లరి చేస్తే శిక్షిస్తాను అనగా సింగమ్మ ఒప్పుకుంటుంది.

గణపతి అల్లరి ఎక్కువవడంతో మేనమామ బండకు కట్టేస్తాడు తన స్నేహితుల ద్వారా విడిపించుకుని ఇంటికి రాకుండా ఉంటాడు. కనబడినప్పుడు మేనమామ దగ్గర తన్నులు తింటాడు. ఇలా ఉండగా గణపతికి పది సంవత్సరాల వయసు వచ్చింది. పేకాట, దొంగతనాలు మున్నగు వ్యసనాలకు బానిసవుతాడు. గణపతికి చిన్ననాటి నుండి గుర్రం ఎక్కవలెనన్న కోరికతో ఉండేవాడు. గుఱ్ఱానికి, గాడిదకు గల భేదాన్ని బేరీజు వేసుకొని గాడిదే అన్నింటి కంటే మేలని భావించి చాకలి వాడి సహాయంతో అతనికి ఊరగాయలు, పచ్చళ్ళు, చుట్టలు, ఆశ చూపి గాడిదను గుఱ్ఱం లాగా అలంకరించి ఎక్కి ఊరేగుతాడు. అందరూ అతనిని విడ్డూరంగా చూస్తారు. పిల్లల కేరింతలకు భయపడి గాడిద పరుగెత్తగా చాకలివాడు అడ్డురావడంతో గణపతి కిందపడలేదు కాని జరిగిన వృత్తాంతం వినిన మేనమామ గణపతిని తరుముకుంటాడు. గణపతి మేనమామ స్నేహితుడు గణపతిని మందలించగా గణపతి గాడిదయొక్క వైభవాన్ని తెలియజేస్తాడు. తన మేనమామను గుఱ్ఱం కొనివ్వమని చెప్పండి గాడిదనెక్కడం మానేస్తాను అంటాడు. అతనికి ప్రత్యుత్తరం ఇవ్వలేక అతని వాక్చాతుర్యాన్ని మెచ్చుకుని వెళ్ళిపోతారు.

### 3.3.9.అబద్దాలతో గడిపిన గణపతి:

గణపతి ఇంటికి రాకపోవడంతో తల్లి వాడి దగ్గరకు వెళ్ళి చివాట్లుపెట్టి ఇంటికి రమ్మనగా గణపతి మేనమామ తనను కొట్టనని వర్తమానం పంపిస్తే వస్తానంటాడు. ఆ విషయం తల్లి అన్నకి చెప్పగా గణపతిని బుద్ధిగా నడుచుకోమని వెధవ వేషాలు వేయకుండా ఉన్నట్లయితే ఇంటికి రమ్మని చెప్తాడు. గణపతి రెండు రోజులు

మేనమామ దగ్గర భయ భక్తులతో ఉంటాడు. స్నేహితుల అరుపులు విని మరలా అల్లరి ప్రారంభిస్తాడు.

మామిడి తోటలకు వెళ్ళి రాళ్లు విసిరి యజమాని వచ్చే సమయానికి పారిపోవటం, ముసలవ్వల ఇళ్లమీద రాళ్ల వాన కురిపించటం భారత రణమందు అర్జునుడు కురిపించిన బాణాల పరంపరను పోలి ఉంటుంది. పాలంటే ఇష్టం కావడం చేత పాలుకొనే డబ్బు లేకపోవడంతో దారిన పోయే ఆవులను, మేకలను పట్టుకుని పాలు పిదికి త్రాగేవాడు గణపతికి పద్నాలుగు సంవత్సరాలు వచ్చాయి. ధనం సంపాదించే మార్గంలో పొరుగూరికి పోయి తండ్రి చనిపోయాడని ఒకసారి, తిరుపతి వేంకటేశ్వరుని గుడికి వెళ్ళాలని ఒకసారి చెప్తూ ధనార్జన చేసి సంపాదించినదంతా అప్పులకు తన తిండికి సరిపోతుంది. నిజం తెలుసుకున్న గ్రామస్థులు గణపతికి సహాయం చేయడం మానేస్తాడు. దీనితో గణపతి శ్రాద్ధ భోజనానికి సిద్ధపడతాడు.

### 3.3.10.గణపతి గిరజాలకోసం పడే పాట్లు:

గణపతి తన స్నేహితుడి వివాహ సందర్భమున రాజమహేంద్రవరానికి వెళ్తాడు. అక్కడున్న బాలికలు  గిరజాలను(జుట్టును) చూసి తాను గిరజాలను పెట్టుకోవడానికి ఒక మంగలిని పిలిపించి పిల్లజుట్టు తీయించి గిరజాలు పెట్టుకుంటాడు.  అది చూసిన వారంతా నవ్వుచూ ఆనందంతో ఉంటారు. జుట్టు పెరగడానికి ఒక యువకుడు ఉపాయం చెప్పగా కాగడాలను వెలిగించడానికి తెచ్చిన ఆముదాన్ని దొంగతనంగా తీసుకొని తలకు రాస్తూండేవాడు. అందరిని జుట్టు పెరిగిందా లేదా అని అడుగుతుండేవాడు. చాకలివాండ్రకు గణపతి దొంగతనంగా ఆముదం తీసుకోవడం తెలియడంతో వారికి  కొంత ధనమిచ్చాడు. అయినా ఆ విషయం అందరికి తెల్లారే సరికి తెలిసిపోవడంతో గణపతిని ఆటపట్టించడం, చతురోక్తులు  వేసేవారు. గణపతి అందరికి నిజం తెలిసిపోయిందని అనుకుని మౌనంగా ఉంటాడు. అలాగే గణపతి తన చెప్పులు తీసేసి, ముచ్చెలో, చదావులో తొడగాలని అనుకుంటాడు. తన దగ్గర ధనం లేకపోవడంతో ఆ పెళ్ళికి వచ్చిన ఒక వైశ్య కుమారుని చెప్పులను దొంగలిస్తాడు.

### 3.3.11.గణపతికి కోటు తొడుక్కోవాలనే ఆశ:

గణపతికి కోటు తొడుక్కోవాలనే కోరిక కూడా అక్కడే పుట్టెను. దానికి కావలసిన ప్రయత్నాలు చేసినా కుదరక పోవడంతో దాని గురించి ఆలోచిస్తూ నిద్రపోతాడు. గణపతి తన స్నేహితుడి వివాహానంతరం ఇంటికి చేరుకున్నాడు. ఇంట్లో ఉన్న బిందెను అమ్మి తనకు కోటు గుడ్డలు ఇప్పించమని తల్లిని అడుగుతాడు. ఆమె మీ మేనత్త ఉండగా అది జరగదు మేనత్త పుట్టింటికి వెళ్ళిన తర్వాత కోటుకుట్టిస్తానని చెప్తుంది.

పక్క ఊరిలో బ్రాహ్మణార్థం జరుగుతుండగా గణపతి మరి కొంతమంది బ్రాహ్మణులను పిలుచుకొని వెళ్తాడు. వారందరికీ సంభావనకై కోటులు యిప్పించమని అడుగమని చెప్తాడు. వారు సరేనంటారు సంభావన ఇచ్చే వ్యక్తి కోటులు కాకినాడ నుండి తెప్పీయాలి తర్వాత రోజు తీసుకోమని చెప్పడంతో గణపతి వారి బృందం సంతోషిస్తారు.

గణపతి అతని బృందం ఒక చోట చేరి మాట్లాడుకుంటూ ఉన్నారు. గణపతి యజమాని మన కాళ్ల బేరానికి వచ్చాడని ఎవరికి ఏ రంగు కోటు బాగుంటుందో ఊహించుకుని వాటి గురించి కలలు కంటూ నిద్రపోతాడు. మరునాడు గణపతికి ఆకలి ఎక్కువవడంతో తన తల్లికి సన్నిహితంగా ఉండే ముసలావిడ దగ్గరకు వెళ్ళి తన గురించి చెప్తాడు. ఆమె రొట్టెను కాల్చడం చూసి ఆమె నీళ్ళకు బయటకు వెళ్ళినప్పుడు ఆ రొట్టె ముక్క కొంచెం కొరికి ఆమె రాగానే కుక్క ముట్టుకుందని చెప్పి ఆమె మైలు పడకుండా మూకుడిని గోమయంతో శుద్ధిచేసి రొట్టెను తీసుకెళ్ళి తన స్నేహితులకు తెలియకుండా తింటాడు.. యజమాని గణపతిని పిలిపించి తన దగ్గర సైను గుడ్డలే ఉన్నాయి. తీసుకుంటారా లేదా అని అడుగుతాడు. దానికి గణపతి ఒప్పుకోకుండా శాపనార్థాలు పెట్టగా యజమాని గణపతిని బంధించి కొట్టిస్తాడు. బతిమాలుకోగా కొన్ని మంచి మాటలు చెప్పి పంపిస్తాడు. ఈ వివరాలు గణపతి తన స్నేహితులకు తెలియకుండా జాగ్రత్తపడతాడు. అందరూ సైను గుడ్డలే పంచుకుంటారు అది గాక గణపతి తనను యజమాని చేతులు పట్టుకుని బతిమిలాడి తనకు కోటులు తెచ్చియిచ్చే స్తోమత లేదని అప్పులున్నాయని పలికాడని చెప్తాడు. ఇతని మిత్రులంతా అదే నిజమనుకుని సర్దుకుంటారు.

### 3.3.12.మేనత్త మేనమామలతో గణపతి ప్రవర్తన:

గంగమ్మ (గణపతి మేనత్త) గర్భం ధరిస్తుంది. సింగమ్మ గంగమ్మకు ఆడపిల్ల కలగాలని కోరుకుంటుంది. గంగమ్మకు ఆడపిల్ల పుడ్తుంది. సింగమ్మ అప్పటి నుండి లేని ప్రేమను ఒలకబోస్తూ గంగమ్మను కాలుకదపనీయకుండా అన్ని పనులు తానే చేస్తుంది. పిల్ల నెత్తుకునే బాధ్యతను గణపతికివ్వగా ఇటువంటి పనులు చిరాకుగా భావించి ఎత్తుకున్న ప్రతిసారీ ఆ పిల్లను గిల్లుతాడు. ఈ విషయం తెలుసుకున్న గంగమ్మ ప్రశ్నించగా గణపతి ఏవో కారణాలు చెప్పి తప్పించుకుంటాడు. సింగమ్మ కూడా గణపతినే సమర్థిస్తుంది.

నాగన్న (గణపతి మేనమామ) సింగమ్మను తీసుకొని పని మీద కోటిపల్లికి వెళ్తారు. గణపతిని తన మేనత్తకు తోడుగా ఉండమని చెప్పి వెళ్తారు. గణపతి తన మేనత్తను అవమానపరచాలని నిశ్చయించుకుంటాడు. గణపతికి గంగమ్మ విస్తరి నిండా అన్నం వడ్డించడంతో బయట వెళ్ళే వారిని పిలిపించి మందలింపచేస్తాడు. మరొకసారి గణపతి ఇంటికి రాకపోవడంతో ఆమె అన్నం వండదు. దానికి రచ్చ చేస్తాడు. ఒకసారి కొంచెం అన్నం పెట్టి అడిగినప్పుడు మరలా పెట్టవచ్చునని ఊరుకోగా గణపతి దానిని తప్పుగా భావించి బంధువులందరిని పిలిపిస్తాడు. ఇలా పరాభవించబడిన ఆమె దు:ఖంతో ఉంటుంది. తన భర్త రాగానే జరిగిన విషయాలను చెప్తుంది. గణపతి తల్లి సింగమ్మ మాత్రం నమ్మదు. గణపతి తన మేనమామాకు భయపడి ఇంటికి వెళ్ళడు. అది తెలుసుకున్న సింగమ్మ గణపతి దగ్గరకు వెళ్తుంది.

గణపతి ఇంటినుండి వెళ్ళిపోదాం అనగా తల్లి మీ మేనమామతో కొన్ని పనులున్నాయి. అతనికి పిల్ల ఉంది ఆ పిల్లను మనం చేసుకోవాలి మనం వెళ్ళకపోతే పని చెడిపోతుందని చెప్పగా గణపతి సరే అని తన ఇంట దొంగ చాటుగా వచ్చి అన్నం తినడం, అలా కొన్ని రోజుల తర్వాత మేనమామకు కనిపిస్తూ సాధారణంగానే ఎప్పటిలాగే ఉండెను. మేనమామ కోపం తగ్గించుకున్నాడు.

గణపతి మేనమామ నాగన్నకు అప్పుల భారం ఎక్కువైంది. తన మేనల్లుడు ఇంటియందే ఉండటంతో ఆదాయం కంటే ఖర్చు ఎక్కువయ్యింది. అప్పు బాధ ఎక్కువైందని బాధపడుతుంటే భార్య గంగమ్మ అతనితో మీరు బాధపడకండి మా పినతల్లి కొడుకు రాయప్పకు మన బుచ్చినిచ్చి వివాహం జరిపించండి వారి దగ్గర

నుండి కొంత ధనాన్ని తీసుకుని మీ అప్పులు తీర్చుకోండి అని సలహాఇస్తుంది. నాగన్నకు ఆ సలహాకు సంతోషించినా తన చెల్లెలు కిచ్చిన మాట గురించి ఆలోచిస్తాడు. చివరకు అంగీకరించి వారిని పిలిపిస్తాడు. రాయప్ప ఇచ్చిన డబ్బుతో నాగన్న అప్పులు తీర్చుకుంటాడు. ఈ విషయం తెలుసుకున్న సింగమ్మ ఊరందరిని పిలిచి గొడవచేస్తుంది. తన సోదరుడు  నాగన్న భార్య మాటలు విని చెడిపోయాడని పలు విధాల బాధపడుతూ అందరిని తిడుతుంది. గంగమ్మ, సింగమ్మ మధ్య వాగ్వివాదం చోటు చేసుకుంటుంది. నాగన్న కోపించి సింగమ్మను ఇంటి నుంచి వెళ్ళిపోమంటాడు. గణపతి ఎదురు తిరగలేక తన తల్లిని ఈ ఇంట్లో ఉండకూడదు పదా అని ఇద్దరూ కలసి ముసలమ్మ ఇంటికి వెళ్తారు.

### 3.3.13.పొట్టకూటికోసం భిక్షమెత్తిన సింగమ్మ:

ముసలమ్మ వారికి తిండిపెట్టే స్తోమత లేక ఉపాయం చెప్తుంది. దాని ప్రకారం గణపతి తల్లి భిక్షాటనను ప్రారంభిస్తుంది. గణపతి దర్జాగా తిరుగుతూ తల్లి తెచ్చే పదార్థాలతో పుష్టిగా తినేవాడు ఇతని వ్యవహారాన్ని కొంతమంది  ప్రశ్నించగా  తాను భిక్షాటన చేయడం మొదలుపెడతాడు. ఇలా వారు తమను తాము పోషించుకుంటున్నారు.

### 3.3.14.గణపతి వివాహ ప్రస్తావన:

బుచ్చమ్మ(నాగన్న కూతురు)కు వివాహం జరగకుండా చూడాలని అనేక ఉపాయాలు ఆలోచించడం మొదలుపెడతారు. నాగన్నకు పొలం విషయంలో మనస్పర్థలు వచ్చి విరోధిగా మారిన పుల్లయ్యను సహాయాన్ని కోరుతారు. పుల్లయ్య పగ తీర్చుకునే సమయమొచ్చిందని తెలుసుకుని గణపతికి ఆ పిల్లతో వివాహం జరిపించే  ఉపాయం చెప్తాడు. ఆ ప్రకారంగా వానపల్లి గ్రామానికి వెళ్ళి పుల్లయ్య అక్కడ దేవాలయాన్ని, పురోహితున్ని, కన్యాదాత ప్రదాతలను ముహుర్తంను సిద్ధం చేయించెను. పుల్లయ్య బుచ్చమ్మకు తినే పదార్థాలు ఆశ చూపి ఆ పిల్లనెత్తుకుని వానపల్లి చేరుతాడు. అక్కడ పురోహితుడు మహదేవశాస్త్రి ఇంట్లోనే గణపతి పెండ్లికుమారుడిగా తయారవుతాడు. నిద్రనుండి లేచిన బుచ్చమ్మ అమ్మ కోసం ఏడుస్తుంది. భజంత్రీలతో ఆ ఏడుపు ఎవరికి వినబడకుండా ఉండునట్లు చేసి పాప మరలా నిద్రకుపక్రమించడంతో గణపతి తాళికట్టి వివాహం పూర్తిచేసుకున్నాడు.

నాగన్న, గంగమ్మ బుచ్చమ్మ కోసం వెదకి అలసిపోయి నిద్రిస్తున్న సమయంలో పుల్లయ్య వారింటి అరుగు మీద బుచ్చమ్మ ను వదలి వెళ్ళిపోతాడు. బుచ్చమ్మ ఏడుపు విని బయటకు వచ్చిన నాగన్న , గంగమ్మ జరిగిన విషయాన్ని గ్రహించి గణపతి మూలంగానే ఇదంతా జరిగిందని తెలుసుకుంటారు. నాగన్న గణపతి కనబడితే ప్రాణం తీస్తానని కోపంతో మాట్లాడుతాడు. వీరి మాటలన్ని చాటుగా వింటున్న సింగమ్మ పుల్లయ్యతో తన కొడుకును కాపాడే బాధ్యత నీదే అని చెప్పి కొడుకుని చూడటానికి వానపల్లి వెళ్తుంది. గణపతి ప్రాణాలతో ఉంటే చాలు ఎక్కడైనా బ్రతకవచ్చని భవిష్యత్తు గురించి ఆలోచిస్తారు. కాని స్పష్టంగా నిర్ణయించుకోలేకపోతారు.

### 3.3.15.బడిపంతులుగా గణపతి:

పుల్లయ్య సహాయంతో ఏనుగుమహాల్ నుండి సామానులు తెప్పించుకుని మహదేవశాస్త్రి నివాసంలో తలదాచుకుంటారు. మహదేవశాస్త్రి ఆ ఊరి ప్రజలందరి దగ్గర నుండి ధాన్యం ఇచ్చే ఏర్పాటు చేయించడమే కాక గణపతి చేత పాఠశాలను పెట్టిస్తాడు. కర్ర తీసుకుని బడిలోకి పంతులుగా ప్రవేశించిన గణపతంటే పిల్లలందరికి భయం. చదువు చెప్పేవాడు కాదు పై తరగతుల వారిని కింది తరగతుల వారికి నియమించి చదువు చెప్పించేవాడు. ప్రశ్నలడిగినా, అడిగినదానికి సమాధానం చెప్పకపోయినా, కొట్టేవాడు ఇలా ప్రతి దానికి కారణాలు లేకుండానే పిల్లల్ని కొట్టేవాడు. వేరే బడినుండి ఒక విద్యార్థి వచ్చి గణపతిని దాశరథి శతకంలోని ‘‘ శ్రీ రఘురామ చారు తులసీధామ’ అనే పద్యానికి అర్థం చెప్పమంటాడు. గణపతి దానికి చమత్కారంగా రాముల వారికి పైత్యం చేయడం చేత కరివేపాకు దొరకక తులసీదళాలతో చారు చేసుకున్నాడు. ఇలా తనకు తోచిన అర్థం చెప్పడంతో అందరూ నవ్వుకుంటారు. గణపతి పిల్లలందరికి జ్వరం ఎందుకు వస్తుంది. ఉరుములు, మెరుపులు, పిడుగులు వాటి వృత్తాంతాన్ని తనకు తోచిన విధంగా తన జ్ఞానాన్ని ఉపయోగించి చమత్కారంగా సమాధానాలు చెప్పేవాడు. పంతులు కొట్టకుండా ఉండుటకు పిల్లలందరూ వారి ఇంట్లోని వస్తువులను గణపతికి ఇస్తుండేవారు. వారిని గణపతి ఏమి అనడు తేలేనవారిని శిక్షిస్తాడు. అంతకు ముందు బడికి రాని కొందరు

అల్లరి పిల్ల వాళ్ళు గణపతికి శిష్యులుగా చేరుతారు. వారి అల్లరి వలన గణపతి ఒక పిల్ల వానిని దండిస్తాడు. ఆ పిల్లవాడు చనిపోయినట్టు నటిస్తాడు.

గణపతి భయంతో పారిపోయి మహదేవశాస్త్రి ఇంట్లో అటకమీద నిద్రపోతుంటాడు. మహదేవశాస్త్రి భార్య ఆవకాయ కోసం అటక మీదకు ఎక్కగా మొదట పందికొక్కని భయపడి వెలుతురులో చూసి గణపతిని చూసి అందరిని పిలిపిస్తుంది. ఆవకాయ మైలుపడిందని తిడ్తుంది. గణపతిని, సింగమ్మను తన ఇంట్లో నుంచి వెళ్ళిపోమంటుంది.

### 3.3.16.గణపతి కుంభకర్ణుని నిద్ర:

గణపతికి ఇంట్లో నిద్రపట్టక బయట అరుగు మీద తన శిష్యులతో పడుకుంటాడు. ఆ శిష్యులు ఏదైనా చమత్కారం చేయదలచి ఒక పాడిని ఏర్పరిచి దాని మీద గణపతిని పడుకోబెట్టి స్మశానం దగ్గర విడిచిపెడతారు. తెల్లారేసరికి కాపలా ఉండి ఇంటికి వెళ్లిపోతారు. తెల్లారే సమయానికి అక్కడ గుంపులుగా జనం చేరి గణపతి చనిపోయాడని మాట్లాడుకుంటారు. అది విని మహదేవశాస్త్రి, గణపతి తల్లి అక్కడకు వస్తారు. జనం పలు రకాలుగా మాట్లాడుకుంటున్నారు. చనిపోలేదని కొంతమంది కొన ఊపిరితో ఉన్నాడని, ఇలా వారికి తోచినట్లు మాట్లాడుకుంటారు. సూర్యకిరణాలు గణపతి మీద పడటంతో మేల్కొని భయం, ఆశ్చర్యం రెండు కలగి ఇక్కడకు ఎలా వచ్చానని అనుకుంటాడు. ఇంటి దగ్గర ఇది ఎలా జరిగిందని శిష్యులను ప్రశ్నించగా దెయ్యం ఆ పని చేసిందని జవాబిస్తారు. గణపతి నమ్ముతాడు. అలాగే మరోసారి గణపతి నిద్రలో ఉన్నప్పుడు అతని జుట్టుకు, ఇంటి పై కప్పుకు కలిపి తాడు కడతారు మెలకవ వచ్చిన గణపతికి భయాందోళనను కలిగి దెయ్యాల పనే ఇదని అనుకుంటాడు. ఒకసారి ఇల్లు తగలబడుతున్నా నిద్రలేవడు. ఇలా గణపతి నిద్ర ఎంత గాఢమైందో అర్థమవుతుంది.

### 3.3.17. నటుడుగా గణపతి:

గణపతి చేష్టలు చూచి నవ్వదలచిన వారు నవ్వుతారు, వినోదం కాలక్షేపం చేయదలచిన వారు మాత్రమే అతని దగ్గరకు వస్తూ ఉండేవారు. తమ పిల్లలకు చదువు రాకపోవడంతో మరో ఊరి నుండి పంతుల్ని తీసుకువచ్చి చదువు చెప్పిస్తారు. గణపతి దగ్గరకు పిల్లలు రాకపోవటంతో వేరే వృత్తిని ఎన్నుకోవడానికి ఆలోచిస్తాడు.

ఆ ఊరిలో భాగవతులు నాటకం వేయడాన్ని చూసి ఆ నాటకంలో సత్యభామ వేషంలో ఉన్న వేశ్యాంగన గరుడా చలంతో పరిచయం పెంచుకుని తాను కృష్ణుని వేషం వేస్తానని వారికి చెప్పి వారితో పాటు పలెవెల గ్రామానికి వెళ్తాడు. అక్కడి వారికంతా గరుడా చలానికి తాను మగడనని చెప్తాడు. కృష్ణుడు వేషం వేసుకుని సభ మీదకు వచ్చిన గణపతికి భయంతో చెమటలు పడ్తాయి. చెప్పదలచిన మాటలన్ని మరచిపోతాడు. హాస్యగాడు కృష్ణుని చూచి మాధవా మీదేయురని అడుగగా ద్వారకా పురమని చెప్పడానికి బదులు మందపల్లి అని సమాధానం చెప్పడంతో సభాసదులందరూ నవ్వుతారు. నాటకం చెడిపోయిందని గరుడా చలం గణపతిని పంపించేస్తుంది.

### 3.3.18. వంటవాడుగా గణపతి:

ఇన్స్ పెక్టర్ ఇంట్లో వంటవాడిగా చేరుతాడు. పని మీద వేరే ఊరు వెళ్ళినప్పుడు గణపతి వంట సామగ్రిలో గరిటెలు మరచిపోతాడు. అన్నం వండటం చేతకాక నానా తిప్పలు పడతాడు. గరిటెకు బదులు వేప పుల్లను ఉపయోగిస్తాడు. ఆకలితో ఉన్న ఇన్స్ పెక్టర్ ఆ వంటను చూసి బాధ, కోపం రెండు వస్తాయి. గణపతికి రెండు రూపాయలు ఇచ్చి పంపించేస్తాడు.

### 3.3.19. గణపతి చిలిపి చేష్టలు:

వానపల్లిలో కొత్తగా వచ్చిన ఉపాధ్యాయుడికి వ్యాధి కారణం చేత చనిపోతాడు. గణపతిని మరలా బడి పెట్టమని ఆ ఊరి వారు కోరుకుంటారు. గణపతి ఒక పెద్ద ఇంట్లో చేరుతాడు. కొంత మంది శిష్యులను తన దగ్గర ఉంచుకునే వాడు. ఆ ఇంట్లో కొబ్బరి చెట్లలో ఎలుకల బెడదను పోగొట్టడానికి గణపతి ఒక పిల్లిని తెప్పించి చెట్టుపైన దాని గొంతుకు తాడు వేసి చెట్టుకు కట్టేస్తాడు. ఎలుకలు లేవు కాని పిల్లి మాత్రం ఉరి వేసుకున్నట్టు వ్రేలాడటం చూసి గణపతి భయపడతాడు. ఈ దోష నివారణకు మహదేవశాస్త్రి ఊరిలో వారి దగ్గర చందాలు వసూలు చేసి బంగారు పిల్లిని మాత్రం చేయించకుండా వారిని మభ్యపెడ్తాడు. గణపతి శిష్యులు పొద్దున్నే నిద్రలేవడానికి గడియారం బదులు కోడిని తెచ్చిపెడ్తారు. గణపతికి దాని వలన వచ్చే లాభాలు గ్రహించి సంతోషిస్తాడు. అది పిల్లి నోటబడి చనిపోవడంతో గణపతి

నిద్రాహారాలు మాని బాధపడ్తాడు. తల్లి అడ్డు వస్తే తన వల్లే ఇదంతా జరిగిందని తిడ్తాడు.

### 3.3.20. గణపతి వివాహ ప్రస్తావన:

గణపతి తనకు వివాహం కాలేదని చేసుకున్న వివాహం అలా చెడిపోయిందని బాధపడుతుంటాడు. బుచ్చమ్మకు వేరే వివాహం చేసెను. గణపతి దాని కంటె మంచి సంబంధం  చేసుకుని నా మేనమామకు చూపిస్తానంటాడు.  సింగమ్మ తన కుమారుని వివాహ ప్రస్తావన ఆ ఊరి వారందరికి చెప్పి సహాయం చేయమంటుంది. వారు  సరేనంటారు.

### 3.3.21. సింగమ్మ మరణం:

గణపతి శిష్యబృందం గణపతిని పల్లకిలో ఊరేగిస్తారు. ఊరు ఊరంతా ఆ ఉత్సవం చూడటానికి వస్తారు. గణపతి వేషధారణ అతని హావభావాలు అందరిని అలరిస్తాయి. ఇలా ఉండగా సింగమ్మ తన కుమారుడికి పిచ్చి పట్టిందని బలవంతంగా గణపతికి తల వెంట్రుకలు తీయించి నిమ్మకాయ పులుసు నీళ్ళు  పోసి వందల కొద్ది బిందెల నీళ్ళు గణపతి మీద కుమ్మరింప చేస్తుంది. గణపతి ఈ పని తన తల్లే చేయించి ఉంటుందని అవకాశం కోసం ఎదురు చూసి మహదేవశాస్త్రి ఇంట్లో తలదాచుకున్న సింగమ్మను పిలిపించి ఆమెకు ఆ విధంగానే చేస్తాడు. ఈ సంఘటనతో తల్లి కొడుకులు మాట్లాడుకోవడం మానేస్తారు. సింగమ్మ ఆ ఊరిలో తీర్థ యాత్రలకు వెళ్ళే వారితో వారికి  సహాయం చేయడానికి  వారితో పాటు వెళ్ళిపోతుంది. అక్కడే మరణిస్తుంది. ఆ రోజుల్లో రైలు ప్రయాణాలు లేకపోవడంతో గణపతికి ఈ విషయం తెలియదు. మహదేవశాస్త్రి భార్య వచ్చి ఆ విషయం చెప్పే లోగా అతను ఆ ఊరి నుండి వెళ్ళిపోతాడు. అందుచేత తల్లికి ఏ కార్యక్రమం నిర్వహించకుండా పోయింది.

### 3.3.22. భయంతో అదృశ్యమైన గణపతి:

గణపతి బ్రాహ్మణార్థములకు పోయి చందాలు తీసుకుంటూ వివాహంకోసం ధనాన్ని పోగు చేసుకుంటాడు. ఒకసారి మహదేవశాస్త్రి  వర్తమానం పంపించి గణపతిని పిలిపించి ఒక సంబంధాన్ని కుదిర్చి పెళ్ళి చేసెను. పెళ్ళి అయిన మరు క్షణం పోలీసులు రావడంతో ఆడ పెళ్ళి వారు మోసం  చేసి ధనాన్ని దోచుకుంటారని

వారు చెప్పేవన్ని అబద్ధాలని తెలుస్తుంది. గణపతి చేసుకున్న అమ్మాయి కూడా సాతాని కూతురని తెలుస్తుంది. ప్రధాన నిందుతుడైన భైరవదీక్షుతుల్ని పోలిసులు అరెస్ట్ చేస్తారు. గణపతి పోలిసుల రాకతో ఈ వివాహం తన ప్రాణం మీదకు వచ్చిందని దొడ్డిదారిన ఎక్కడికో పారిపోతాడు. అలా పారిపోయిన గణపతి ఎక్కడా కనబడదు దీనితో గణపతి నవల పూర్తవుతుంది.

ఈ విధంగా గణపతి నవల హాస్యభరితంగా సాగుతుంది. మందపల్లి తూర్పుగోదావరి జిల్లాలో ఉంది. అక్కడ శనేశ్వరాలయం ఉంది. దాన్ని స్ఫురింపచేస్తూ శని పట్టిన వంశంగా గణపతి వంశాన్ని నక్కపల్లి నుండి మంద పల్లికి చేరుకున్నారని చెప్పారు. ఆ శని గణపతి వంశం వరకు వెంటాడుతూనే ఉంది. కొంతమంది ఏ పని పట్ల అంకిత భావం ప్రదర్శించకుండా సులభంగా బతిమాలనుకునే వాళ్ళని అధిక్షేపిస్తూ ఈ నవలలో ఈ కథను రచయిత తీర్చిదిద్దాడు. నవలలో ప్రధాన పాత్ర గణపతి అయినప్పటికి మేనమామ, మేనత్త, తల్లి తండ్రి శిష్యులు వివిధ సన్నివేశాలలో ప్రాధాన్యం వహించారు. కాబట్టి ఈ నవలను నాటకంగా రాయడానికి చాలా సౌలభ్యం ఉండే అవకాశం ఉంది. దీన్ని రాబోయే అధ్యాయంలో తెలుసుకుందాం.

ఈ తెలుసుకునే ముందు నా పరిశోధనాంశంలోని మరో నవల విశ్వనాథ వారి వేయిపడగలు కథా సారాంశాన్ని కూడా వివరిస్తాను.

### 3.4. వేయిపడగలు – ఇతివృత్త నిర్మాణ వైఖరి:

వేయిపడగల లోని ఇతివృత్తం ప్రాచీన కాలం నాటి సంప్రదాయాలు ఆచారవ్యవహారాలను, ఆధునిక కాలంలోని సాంఘిక పరిస్థితులను ప్రజల జీవనంలోని మార్పులను తెలియజేస్తాయి. అంతేకాకుండా స్వాతంత్ర్యం కాలం నాటి పరిస్థితులు సహాయ నిరాకరణోద్యమాలు వంటి విషయాలన్ని ఈ నవలలోని ఇతివృత్తంలో చోటుచేసుకున్నాయి.

వేయిపడగల నవలలో విశ్వనాథ పావని శాస్త్రి ఒక మాట(ముందు మాట) లో ఈ విధంగా తెలిపారు. 1934 లో తన తండ్రి (విశ్వనాథ సత్యనారాయణ) ఆశువుగా చెబుతూ ఉండగా తన పిన తండ్రి వెంకటేశ్వర్లు రాశారు దీనిని 29 రోజుల్లో 999 అర టావుల మీద వ్రాశారు. ఇది ఆంధ్ర విశ్వవిద్యాలయం వారు

ప్రకటించిన పోటికి రాయబడి బహుమతినందుకుంది. 1937-38సంవత్సరంలో ఆంధ్రపత్రిక సుచిత్ర వార పత్రికలో ధారావాహికంగా ప్రచురించబడింది. స్వర్ణోత్సవ సందర్భాన్ని పురస్కరించుకుని 1987-88లలో తిరిగి ఆంధ్రపత్రికలోనే ధారావాహికంగా ప్రచురించబడింది.[5]

ఈ నవలలోని పాత్రలు, సన్నివేశాలు చాలా వరకు విశ్వనాథ సత్యనారాయణ జీవితంలో జరిగినవే. ''శత వసంత సాహితీ మంజీరాలు ఆంధ్రప్రదేశ్ గ్రంథాలను సంఘం ప్రచురణలో ప్రసాదరాయ కులపతి వేయిపడగలు గురించిన ఉపన్యాసం పేర్కొనబడింది. అందులో ఈ నవలలోని కొన్ని ఊరి పేర్లు,మనుషుల పేర్లు నిజ జీవితంలో ఉన్న వాటినే పేర్లు మార్చి రచయిత రాస్తాడు. వాటిలో

సుబ్బన్న పేట- నందమూరు, తోట వల్లూరు

వేణు గోపాల స్వామి ఆలయం- విశ్వేశ్వర స్వామి ఆలయం

కృష్ణమనాయుడు- నూజివీడు జమిందారు ధర్మ అప్పారావు, రంగయ్య అప్పారావు.

రామేశ్వర శాస్త్రి- విశ్వనాథ తండ్రి శోభనాద్రి

ప్రధానపాత్ర ధర్మారావు- విశ్వనాథ సత్యనారాయణే

సూర్య పతి- కొల్లహర సూరయ్య చౌదరి

కుమార స్వామి- కృష్ణాజిల్లా కపిలేశ్వర పురం కరణం అగస్త్య రాజు రాఘవరావు.

కేశవరావు — కొంపెల్ల హనుమంతరావు

రుక్మిణమ్మ రావు- ముట్నూరి కృష్ణారావు శ్రీమతి

నాయరు — బందరులోని ఒక కిళ్ళీ కొట్టు ఓనరు.

ఈ వివరాలే కాకుండా వేయిపడగల నవల రాయడానికి గల కారణాన్ని తెలియజేస్తూ Wikipedia లో ఈ విధంగా ఉంది. గుంటూరు ఏ. సి కాలేజిలో మత సంబంధమైన వ్యాఖ్యకు సంబంధించిన వివాదంలో విశ్వనాథ తన ఉద్యోగాన్ని వదులుకోవలసి వచ్చింది. ఆ ఉద్యోగం పోయి మరొక ఉద్యోగంలో చేరని దశలో ఈ నవల రాయబడింది. నవలలో చెప్పబడిన ధార్మిక సాహిత్య వాద

---

[5]సత్యనారాయణ,విశ్వనాథ. వేయిపడగలు, ఒక మాట(ముందు మాట).

ప్రతివాదాలు విశ్వనాథ జీవితంలో ఇతరులతో జరిగిన విభేదాలను చాలా వరకు ప్రతిబింబిస్తాయి. ఈ విషయాలను పరిశీలిస్తే రచయిత తన జీవితంలో తాను ఎదుర్కొన్న పరిస్థితులను, తన చుట్టూ ఉన్న అప్పటి వాతావరణాన్ని క్షుణ్ణంగా పరిశీలించి వేయిపడగలు నవల రాయడం నవలా సాహిత్యంలో ఒక అద్భుతమైన నవలగా రూపుదిద్దుకుందని నేను అభిప్రాయపడుతున్నాను.

### 3.5. వేయిపడగలు నవల– ఇతి వృత్తం:

కథా విషయానికి వస్తే '*వేయిపడగల పాము విప్పారు కొని వచ్చి*

*కాటందుకున్నది కలలోన రాజును* అని పాట పాడుకుంటూ గణాచారి వేప మండలు చేత పట్టుకుని ప్రవేశించడంతో నవల ప్రారంభమవుతుంది.

### 3.5.1. సుబ్బన్న పేట వృత్తాంతం:

మూడు వందల సంవత్సరాల క్రింద సుబ్బన్న పేట ఒక అరణ్య ప్రాంతంగా ఉండేది. ఆ అరణ్యంలో ఒక చిన్న పల్లె ఉండేది ఆ పల్లెలో అందరూ పేద వాళ్ళే ఒక కాపు కట్టెలు అమ్ముకుంటూ. ఒక ఆవును పెట్టుకుని అది ఇచ్చే పాలతో జీవనం సాగిస్తున్నాడు. కొద్ది రోజులకే ఆవు ప్రొద్దుపోక ముందే ఇంటికి వస్తుంది. పొదుగు చిక్కిపోయి ఉండడం గమనించిన కాపు భార్య కాపుకు చెప్తుంది. కాపు ఎందుకు ఇలా జరుగుతుందని ఒకనాడు ఆవు వెంటనే ఉండి చాటుగా ఆవే పుట్టలో పాలు పోసేది చూస్తాడు. ఆ పుట్టలో నుండి దివ్య సర్పం పాలు త్రాగడం చూస్తాడు. ఆ పాముకు రెండు, నాలుగు తలలుగా ఉండడం చూసి మూర్ఛపోతాడు. ఆ రోజు కాపు కలలో సుబ్రహ్మణ్యేశ్వర స్వామి కలలో కనబడి తనకు దేవాలయం కట్టించమని కోరుతాడు. తనకు ఆర్థిక స్తోమత లేనందువల్ల ఏమి చేయాలో తోచని స్థితిలో ఉంటాడు. ఆ ఊరు వారికే కాకుండా ప్రక్క ఊర్లకు సుబ్రహ్మణ్యేశ్వర స్వామి మహాత్మ్యం తెలుస్తుంది. అలా తెలుసుకున్న ఒక బ్రాహ్మణుడు తనకు సంతాన భాగ్యం కలిగించమని మ్రొక్కు కుంటాడు. అతని కోరిక నెరవేరడంతో తాననుకున్న ప్రకారంగా తన ఆస్తినంతా తీసుకుని సుబ్బన్న పేటకు వచ్చి సుబ్రహ్మణ్యేశ్వర ఆలయం కట్టడానికి పూనుకుంటాడు. ఆ బ్రాహ్మణున్ని కలవడానికి వీరన్న నాయుడు(జమిందారు) వచ్చి ఆ బ్రాహ్మణుని కోట కట్టడానికి సలహా అడుగుతాడు. దానికి ఆ బ్రాహ్మణుడు

ఆలయం ప్రక్కనే కట్టమని చెప్పడంతో ఆలయం , కోట రెండు ఒకేసారి నిర్మించబడతాయి. బ్రాహ్మణుడు కాశి నుండి శివలింగాన్ని తీసుకొచ్చి నాగేశ్వరస్వామి పేరుతో ప్రతిష్ఠ చేస్తాడు. జమిందారు విష్ణు భక్తుడు కావడంతో వేణుగోపాల స్వామి గుడిని కట్టిస్తాడు.

సుబ్రహ్మణ్యేశ్వర స్వామి పలికిన పలుకులు గణాచారి ముఖమున రాబోయే ఆపదలను చెప్తూ ఉంటుంది. ఆమె మాటను అందరూ వాస్తవంగా నమ్మేవారు. కొంతకాలానికి వీరన్న నాయుడు మరణించి అతని కొడుకు నాగన్న నాయుడు రాజ్యానికి వస్తాడు. దేవాలయ నిర్మాణానికి కారణమైన బ్రాహ్మణుడు చనిపోయి అతని కొడుకు నాగేశ్వరశాస్త్రి పెత్తందారిగా ఉంటాడు. పాత గణాచారి గతించి ఆమె అన్న కూతురు గణాచారిగా ప్రవేశించి సుబ్బన్న పేటకు ఆపదలు రాబోతున్నాయని చెప్తుంది. ధర్మారావును చూసి వేయిపడగల పాము...' అనే పాట పాడుతుంది.

### 3.5.2. కృష్ణమనాయుని పరిపాలన:

వేయిపడగల నవలకు ధర్మారావు కథానాయకుడు ఇతని భార్య అరుంధతి. ధర్మారావు తండ్రి రామేశ్వర శాస్త్రి ఇతను నాగేశ్వరశాస్త్రికి ఐదవ తరం వాడు. కృష్ణమ నాయుడు సుబ్బన్న పేటకు జమిందారిగా ఉన్నప్పుడు ఇతని (కృష్ణమనాయుడు) పాలనలో ప్రజలను కన్న బిడ్డల వలె పరిపాలించే వాడు. ఉదార స్వభావం కలవాడు పండితులను, కవులను పోషించేవాడు. బ్రాహ్మణోత్తములను, గాయకులకు అందరికి సన్నిధానంగా ఉండేది కోట. ఈ శోభ అంతా కృష్ణమ నాయని చివరి రోజుల్లో శోభను కోల్పోయాయి. రామేశ్వర శాస్త్రి గారి తండ్రి నారాయణ శాస్త్రి జమిందారులకు మంత్రిత్వం చేశారు. తర్వాత కృష్ణమ నాయుడుకు రామేశ్వర శాస్త్రి దివానుగా ఉన్నాడు.

### 3.5.3.రామేశ్వర శాస్త్రి వృత్తాంతం:

రామేశ్వర శాస్త్రి దివానుగా ఉన్న రోజుల్లో అన్ని వ్యవహారాలు చూసుకునేవాడు. రామేశ్వర శాస్త్రి ఏ పని తలపెట్టినా జమిందారు అడ్డుపడేవాడు కాదు. రామేశ్వర శాస్త్రి సావిత్రమ్మ అనే బ్రాహ్మణ స్త్రీని, రంగాజమ్మ అనే క్షత్రియ స్త్రీని, హైమావతి అనే వైశ్య స్త్రీని, మంగ అనే శూద్ర స్త్రీని వివాహమాడుతాడు రత్నగిరి అనే ఆమెను ఉంచుకుంటాడు. ఇన్ని వివాహాలు చేసుకున్నా ఇవన్ని అతని మంచితనంలో

కరిగిపోయేవి. రామేశ్వర శాస్త్రికి చివరి రోజులు అప్పుల బాధతో కష్టంగా మారిపోయింది. ఇతని దయా దాక్షిణ్యాలతో బతికిన వారు ఇప్పుడు అప్పు పేరుతో పీడిస్తున్నారు. వారిలో నాగన్న శెట్టి, శ్రీరాములు ముఖ్యులు. బంధువుల నుండి కూడా ఎటువంటి సహాయం అందదు. కృష్ణమనాయుడు ముసలి వాడవడంతో ఇతని బాధ్యతలు కొడుకు రంగారావు చూసుకునేవాడు. ఇతనికి రామేశ్వర శాస్త్రి అంటే గిట్టదు. సహాయం వచ్చే మార్గాలు లేకపోవడంతో బాధపడుతూ నాగేశ్వరస్వామిని దర్శించుకుని అక్కడున్న కళ్యాణ మంటపంలో మరణిస్తాడు. అప్పుడు ధర్మారావుకి పదహారు సంవత్సరములు. రామేశ్వర శాస్త్రి మరణ వార్త వినిన కృష్ణమనాయుడు రామేశ్వర శాస్త్రి కర్మకాండలు దగ్గరుండి జరిపిస్తాడు. ధర్మారావు ఇంటి దగ్గరున్న బంధువులు తమకు మర్యాద సరిగ్గా జరగలేదని ధర్మారావుతో గొడవపడి వెళ్ళిపోతారు.

### 3.5.4.ధర్మరావు ఆర్థిక పరిస్థితి – కృష్ణమనాయుడి సహాయం:

ధర్మారావుకి ఇల్లు గడవడం కష్టంగా ఉందని కృష్ణమనాయుడికి రాసి పంపించే ప్రయత్నం చేసి దానిని అవమానంగా భావించి ఆ ప్రయత్నాన్ని మానుకుంటాడు. కాని జమిందారు సేవకుడు గోపన్న మాత్రం కృష్ణమనాయుడికి ధర్మారావు గురించి చెప్తూ అతని ప్రస్తుత పరిస్థితి గురించి తెలుపుతాడు. కృష్ణమనాయుడు రామేశ్వర శాస్త్రి ఆస్తులను అమ్మి బాకీదారులకు చెల్లిస్తాడు. ఇంటి అప్పు మిగిలిపోతుంది. నాగన్న శెట్టి ఇల్లును వదలడానికి ఒప్పుకోకపోవడంతో అతనికి ఐదువేలు ఇచ్చి ధర్మారావు  పేరు మీద రాయిస్తాడు. అప్పుల బాధ తప్పుతుంది. ధర్మారావు చదువును ప్రోత్సహిస్తాడు కృష్ణమనాయుడు. ఇలా ఉండగా ధర్మారావు బందరులో బి. ఎ. మొదటి సంవత్సరం చదువుతున్న రోజుల్లో కృష్ణమనాయుడు మరణిస్తాడు. అతనిని చూచుటకు వెళ్ళిన ధర్మారావును ఎవరూ పలుకరించలేదు. ధర్మారావుకు మరలా పూర్వపు రోజులు వచ్చాయి. కాని అప్పు బాధ లేదు. ఇల్లు ఒక్కటే మిగిలింది. అరుంధతి పెద్దమనిషయ్యిందని తెలుస్తుంది. ధర్మారావు కార్యం కోసం వంద రూపాయల అప్పు కోసం నాగన్న శెట్టి దగ్గరకు వెళ్తే అతను వాయిదా వేస్తాడు. రంగాజమ్మ కొంత పొలం కలిగిన మనిషి ఈ విషయం సావిత్రమ్మ ద్వారా తెలుసుకుని ధర్మారావుకు తెలియకుండా అప్పు వచ్చేట్లు చేస్తుంది.

ధర్మారావు బంధువులందర్నీ పిలుస్తాడు. గిరిక(దేవదాసి) అరుంధతికి ఉంగరం కానుకగా ఇవ్వమని ధర్మారావుకిస్తుంది.

### 3.5.5.సుబ్బన్న పేటకు అరుంధతి రాక:

ధర్మారావు తన వారితో అరుంధతి నివాసమున్న రంగాపురం వెళ్తారు. సావిత్రమ్మ తెచ్చిన చీర అరుంధతి తల్లి నాగమ్మకు నచ్చక గొడవ చేస్తుంది. సావిత్రమ్మ తిరిగి తన ఊరికి వెళ్ళడానికి సిద్ధపడితే అక్కడి వారంతా ఆపుతారు. అరుంధతి తల్లిదండ్రులు నాగమ్మ, గంగాధరం ధర్మారావు కుటుంబం గురించి మంచి విషయాలు చెప్పకపోవడంతో అరుంధతి శోభన సమయంలో రెండు రోజులు దూరంగా ఉంటుంది. రాజ్యలక్ష్మమ్మ చెప్పిన మాటలతో ప్రేరణ పొంది మూడవ రాత్రి ధర్మారావుకి దగ్గరవుతుంది. సుబ్బన్న పేటకు అరుంధతి వెళ్ళినప్పుడు అక్కడున్న వారంతా ధర్మారావు గురించి పొగుడ్తుంటే అరుంధతి ఆశ్చర్యపోతుంది, ఆనందం వేస్తుంది. రంగాజమ్మ అరుంధతికి చీరను కానుకగా ఇస్తుంది. తర్వాత రత్నగిరి ఈమె కూతురు దేవదాసి(గిరిక) గురించి తెలుసుకుని అరుంధతి పరిహసిస్తుంది. దానికి ధర్మారావుకి కోపం వస్తుంది. రామేశ్వర శాస్త్రి గురించి అరుంధతి తప్పుగా అనుకున్నందుకు వారింట్లో సర్పం కనబడుతుంది. ధర్మారావు మా ఇలవేల్పు సుబ్రహ్మణ్యేశ్వర స్వామి ఇంటికి వచ్చాడని చెప్పి నమస్కరిస్తారు. పాము వెళ్ళిపోతుంది.

### 3.5.6. రంగారావు పట్టాభిషేకం:

ఇది ఇలా ఉండగా రంగారావు అధికారంలోకి వచ్చాక శిస్తు వసూలు చేయడంలో కఠినంగా వ్యవహరించేవారు. కృష్ణమనాయుడు రామేశ్వర శాస్త్రిని దివానుగా చేసిన తర్వాత ఇతని స్థానంలో హరిహరనాథరావుని దివానుగా పెడ్తాడు. ఇప్పుడు రంగారావు హరిహరనాథరావుని స్థానంలో నాగేశ్వరరావును దివానుగా నియమిస్తాడు. రంగారావు పెద్దతల్లి కుమారులు రాధ కృష్ణయ్య, రామేశ్వరం గారు మేనత్త కొడుకు సర్వా రాయుడు వారికి కృష్ణమనాయుడు తన ఆస్థానంలో స్థానం కల్పించలేదు. ఇప్పుడు రంగారావు పట్టాభిషేక సమయంలో ఆటంకం కలుగుతుంది. రంగారావు ఇతని పెదతల్లి కొడుకులు అంతా సమావేశమై గణాచారి చెప్పిన మాటల గురించి రంగారావు తనకలలోవచ్చిన వేయి తలల పాము గురించి

చర్చించుకుంటారు. పట్టాభిషేకం జరిగిన రోజున రత్నగిరి నృత్య ప్రదర్శన జరిగింది. రామేశ్వరం రత్నగిరి కూతుర్ని దేవదాసిని బలవంతంగా పిలిపించి నృత్యం చేయించాలని చూడగా ధర్మారావు అది జరగనీయడు. రంగారావు జరిగిన సంఘటనలను అవమానంగా భావించి దీనికి కారణం రామేశ్వరం అని అతనిని నిందిస్తాడు.

రంగారావు చెన్నపురికి బయలుదేరి వెళ్తాడు. బంధువులందరూ వారి ఊర్లకు వెళ్ళినా రామేశ్వరం మాత్రం అక్కడే ఉండి ధర్మారావు, రత్నగిరిపైన కక్ష పెంచుకుని ఎలాగైనా వారిని అవమానపరచాలని చూసినా అతను కృష్ణమనాయుడి భార్య రుక్మిణమ్మ చేతిలో చివాట్లు తింటాడు.

### 3.5.7.ధర్మరావింటికి రుక్మిణమ్మ :

రుక్మిణమ్మ ధర్మారావుని పిలిపించి భాగవతం చదివించుకుంటుంది. సాయంత్రం రుక్మిణమ్మ దేవాలయానికి వెళ్ళి అక్కడున్న ధర్మారావును, దేవదాసిని చూసి మొదట అనుమానించినా వారి సంభాషణ ద్వారా వారి మధ్య గల సంబంధం ఎటువంటిదో గ్రహించి సంతోషిస్తుంది. కొన్ని రోజుల తర్వాత ధర్మారావు భార్య అరుంధతి విషయం తెలుసుకుని రుక్మిణమ్మ తానే స్వయంగా ధర్మారావింటికి వెళ్ళి అరుంధతికి చంద్రహారాన్ని బహుమతిగా ఇస్తుంది. అరుంధతి పుట్టింటికి వెళ్ళే సమయం రావడంతో ధర్మారావును వదలి వెళ్ళుట బాధను కలిగిస్తుంది.

### 3.5.8 ధర్మారావు చదువు సాహిత్య చర్చ:

రుక్మిణమ్మ ధర్మారావును తిరిగి చదువును కొనసాగించమని దానికి కావలసిన డబ్బును ఏర్పాటు చేస్తుంది. ఆ ప్రకారంగానే ధర్మారావు గుంటూరు కళాశాలలో చేరాడు. అక్కడ భారతం చదివుతాడుడు అందులోని ఘట్టాలు, వర్ణనలు, సంభాషణలు అతనిని ఆకర్షిస్తాయి. తర్వాత ధర్మారావు కళాపూర్ణోదయం, ప్రభావతి ప్రద్యుమ్నం మధ్య భేదాలను రస భావాలను చర్చించుకుంటాడు. ప్రభావతి ప్రద్యుమ్నంను మెచ్చుకుంటాడు.

ఆశీర్వాదమనే క్రైస్తవ విద్యార్థికి ధర్మారావుకి మధ్య సృష్టికి ఎవరు గొప్పవాడు అనే విషయంలో చర్చోపచర్చలు జరుగుతాయి. ధర్మారావు వాదన అందరికి నచ్చుతుంది. మరోసారి పాత్య గ్రంథంలో పాశ్చాత్య నాగరికత గురించి విరుద్ధంగా

రాసి ఉండడంతో హిందువులకు, క్రైస్తవుల మధ్య వాగ్వివాదం జరుగుతుంది. ధర్మారావు దానిని నివారిస్తాడు.

ధర్మరావు బందరులో చదువుకునే రోజుల్లో ధర్మారావు , రాఘవరావు, కిరీటిరావు, సూర్య పతి స్నేహితులు. నాటకాలకు కలిసి తిరిగే వాళ్ళు ఇప్పుడు వారిలో ఒకరు రాఘవరావు గుంటూరులో ఉన్న ధర్మారావును కలుసుకుని కొండవీడు ప్రాంతానికి వెళ్తారు. ఆ ప్రదేశంలోని తారాబురాజు, మిరియాల తాఖతు, నేతి కొట్టు, కత్తుల బావి వాటి చరిత్రను గుర్తుచేసుకుంటారు. రాఘవరావు శ్రీనాథుడి తరపున, ధర్మారావు ఎఱ్ఱాప్రగ్గడ తరపున వాదించుకుంటారు. అది ధర్మారావుని రాఘవరావు కొట్టే స్థితికి వస్తుంది. కొంత సమయం తర్వాత ఇద్దరూ సర్దుకుంటారు.

### 3.5.9.ధర్మారావుకి రామచంద్రరాజు పరిచయం:

కొద్దిరోజుల తర్వాత సత్యవతి శాకుంతల నాటకానికి తన స్నేహితులను ఆహ్వానిస్తాడు. నాటకం చివరి వరకు ధర్మారావు నాటకాన్ని విమర్శిస్తాడు. సూర్య పతికి నాటక ఉత్సాహం తగ్గిపోయింది. ధర్మారావు తిరిగి సుబ్బన్న పేటకు వెళ్ళే మార్గంలో చాలా సంవత్సరాల క్రింద తుని పారిపోయి తిరిగి వస్తున్న రంగాజమ్మ కుమారుడు రామచంద్రరాజు పరిచయమవుతాడు. రామచంద్రరాజు భార్య రత్నగిరి చూస్తాడు. వీరంతా రంగాజమ్మ అనారోగ్యంతో ఉండగా ఆమెను పలుకరిస్తారు. కొద్ది రోజులకి రంగాజమ్మ మరణిస్తుంది.

### 3.5.10. ధర్మారావు గుంటూరు ప్రవేశం– దారిద్ర్యం:

రంగాపురం వెళ్ళి ధర్మారావు అరుంధతిని తీసుకువస్తాడు. అరుంధతి, గిరికి, రత్నగిరి వీరి స్నేహం బలపడుతుంది. ఈ సారి ధర్మారావు తన తల్లిని భార్యను తీసుకుని గుంటూరికి వెళ్తాడు. రాణిగారు నెలకు ఇచ్చే డబ్బులతో అక్కడ ఒక అద్దె ఇల్లు తీసుకుని జీవిస్తున్నాడు. ఆ ధనం సరిపోక పోవడంతో ఆర్థిక ఇబ్బందులు ఎక్కువై ఒక పూట భోజనంతో జీవిస్తున్నారు.

### 3.5.11.ధర్మరావుకి కోట ప్రవేశానికి నిరాకరణ:

కొంతకాలం తర్వాత రాణిగారి దగ్గర నుండి డబ్బు రాకపోవడంతో అంగడి యజమాని నాయరు దగ్గర కొంత ధనాన్ని అప్పు తీసుకుని సుబ్బన్న పేటకు వెళ్తాడు. రాణిగారికి బాగ లేదని తెలిసి  పలకరించడానికి వెళ్తే వెళ్ళడానికి వీలు లేకుండా

రామేశ్వరం, సర్వా రాయుడు అడ్డుపడ్తారు.. ఇక చేసేదేమి లేక సూర్య పతి దగ్గరకు వెళ్ళి అతనిచ్చిన వంద రూపాయలు తీసుకుని ఇంటికి వెళ్తాడు. తిరిగి సుబ్బన్న పేటలోనే నివాసముండడానికి నిశ్చయించుకుంటాడు.

### 3.5.12.కిరీటి శశిరేఖల వివాహం:

కొద్దిరోజుల తర్వాత మరలా ధర్మారావు , సూర్య పతి, రాఘవరావు, కిరీటిరావు బెజవాడలోని సంగీత కచేరికి వెళ్తారు. అక్కడ ధర్మారావుకి కిరీటి ద్వారా రాధాపతి పరిచయమవుతాడు. ధర్మారావుకి కిరీటిరావు తన మేనమామ డిప్యూటి కలెక్టర్ కూతురు శశిరేఖను ప్రేమించిన విషయాన్ని, తన మామ అంగీకరించక పోవడాన్ని తెలియజేస్తాడు. కొంత కాలానికి కిరీటిరావు ధర్మారావు ఇంటి వద్దనే ఉండి చదువుకుంటాడు. వీరి మాటల సందర్భంలో ధర్మారావు కిరీటికి తన శిష్యుడు కుమారస్వామి గురించి ఇతను శ్యామల అనే అమ్మాయిని ప్రేమించడం గురించి తెలుపుతారు. అలాగే శ్యామల తల్లి పంకజమ్మ తండ్రి రామిరెడ్డి గురించి తెలియజేస్తారు. పంకజమ్మ తల్లిదండ్రులు కైలాస పతి ఇతను చిన్నప్పుడే క్రైస్తవమతం స్వీకరించిన విషయం ఇతనితో పాటు భార్య రోహిణమ్మ క్రైస్తవమతంలో చేరినట్లు చెప్తాడు. మరలా కొంతకాలానికి క్రైస్తవ మతం వీడి బ్రాహ్మణులుగానే ఉండడానికి నిశ్చయించి చివరకు ఆర్య సమాజంలో చేరుతారని ధర్మారావు కిరీటికి తెలియజేస్తాడు. కిరీటి కళాశాల సెలవులలో ఊరికి వెళ్ళి ధర్మారావుకి ఆహ్వానం పంపుతాడు. అక్కడ కిరీటి శశిరేఖతో వివాహం జరుగుతుంది.

### 3.5.13.రుక్మిణమ్మ సరోజని దేవి మరణం:

గణాచారి కోట ముందు నిలుచుంది. ఎవరూ పలుకరించలేదు తర్వాత సరోజని దేవి ఆమెను లోపలకి పిలిపించగా గణాచారి రాణి చనిపోవునని చెప్తుంది. ధర్మారావు విని బాధపడ్తాడు. పెద్ద రాణి రుక్మిణమ్మ ఆరోగ్యం బాగా లేదు. సరోజని దేవి ఎన్నిసార్లు తన భర్త రంగారావుకి కబురంపినా అతను రాడు. చివరకు దైన్య స్థితిలో ఉన్న ఆమెను చూసి బాధపడ్తాడు. సరోజని దేవి కొడుకు హరప్ప నాయుని పిలిపించి ధర్మారావు దగ్గర చదువుకోమంటుంది. ఆ పిల్లవాడు సరేనంటాడు. రుక్మిణమ్మ, సరోజని దేవి వరుసగా మరణిస్తారు.

### 3.5.14. హరప్ప విద్యాభ్యాసం:

హరప్ప నాయుడు ధర్మారావును పరిచయం చేసుకుని చదువు చెప్పించుకుంటాడు. రంగారావు హరప్ప నాయుడికి ఇంగ్లీష్ నేర్పడానికి ఈట్సన్ అనే వ్యక్తిని నియమిస్తాడు. ఇతను క్రైస్తవ మతం గురించి ధర్మారావు హిందూ మతాన్ని గురించి బోధిస్తారు. రంగారావు 'సుసాని' అనే ఇంగ్లీషు ఆమెను వివాహం చేసుకుంటాడు. ఆమె తన పేరును శశిని గా మార్చుకుంటుంది. ఊరి వారందరికి ఏమి తోచదు ఈ విషయం హరప్ప రంగన్న ద్వారా తెలుసుకుంటాడు. హరప్ప నాయుడికి పుష్కరాల వైభవాన్ని తెలిపి ధర్మారావు పుష్కరాలకు వెళ్తాడు. అక్కడ సూర్య పతి ధర్మారావుకి పశుపతిని పరిచయం చేస్తాడు. పశుపతి భార్య అనసూయ వారు 'ఉండి' లో తమ ఇంట్లో ధర్మారావుకి రాచమర్యాదలు చేస్తారు. ధర్మారావు తిరిగి సుబ్బన్న పేటకు వస్తాడు.

### 3.5.15.సుబ్బన్న పేటలో జాతీయ కళాశాల స్థాపన:

రంగారావు సుబ్బన్న పేటలో పురపాలక సంఘం ఏర్పాటు చేయడానికి సిద్ధపడ్తాడు. గ్రామాన్ని కొన్ని విభాగాలుగా విభజించి ఒక్కో భాగానికి ఒక్కొక్కరిని అధ్యక్షున్ని చేస్తారు. చంద్రా రెడ్డి సభాధిపతిగా ఉన్నాడు. దివాను నాగేశ్వరరావు కాలేజి స్థాపనకై ఆలోచించడం మొదలు పెడ్తాడు. గాంధీ సహాయ నిరాకరణ ఉద్యమం నడుపుతున్న రోజుల్లో సుబ్బన్న పేటలో కేశవరావు జాతీయ కళాశాలను స్థాపించాడు. విరాళాలతో ఆ కళాశాల చక్కగా సాగుతుంది. ధర్మారావుకి ఆ కళాశాలలో పని చేయాలని ఉన్నా ఆర్థిక స్తోమత లేనందువల్ల అక్కడ పని చేయలేకపోతాడు.

### 3.5.16.కేశవరావు మరణం:

కేశవరావు కళాశాల ఉత్సవాలు ప్రతి సంవత్సరం దసరాకు జరిపిస్తాడు. అనేక ప్రాంతాల సంగీత కళాకారులను నాటకం వేయువారిని, కవులకు ఆహ్వానం పంపుతాడు. సుబ్బన్న పేటలో ఉన్న వారంతా ఆ ఉత్సవాలను చూస్తారు. హరప్ప నాయుడు తన తండ్రి వద్దన్నా ధర్మారావుతో కలసి ఆ ఉత్సవాలలో పాల్గొంటాడు. ఉత్సవాల తర్వాత కొద్ది రోజులకు కేశవరావు అనారోగ్యంతో మరణిస్తాడు. జాతీయ కళాశాలకు విరాళాలు వచ్చే మార్గాలు లేకుండాపోయాయి.

### 3.5.17..పాలనా సంఘ సభ్యుల ఎన్నిక:

కేశవరావు పాలనా సంఘానికి ఐదుగురు సభ్యులను ఏర్పాటు చేశాడు. వానిలో జమిందారు, చంద్రా రెడ్డి, రామచంద్రరాజు, కేశవరావు అధీకృత సంఘానికి ప్రతినిధి ఒకడు. ఎప్పుడూ పాలనా సంఘంలో ఉండాలి కేశవరావు మరణించాక కేశవరావు పినతల్లి కుమారుడు నారాయణరావు కళాశాల ప్రధానోపాధ్యాయుడుగా ఉంటాడు. సంస్కృతం బోధించడానికి శఠగోపాచారి, తెలుగుకు రామ శాస్త్రి అనే పండితుడు కొద్దికాలం ఉండి వెళ్ళిపోతాడు. చిన్న పిల్లకు పాఠం చెప్పడానికి సూర్యనారాయణ జీతం మీద పాఠాలు చెప్పేవారు.

సుబ్బన్న పేటలో జమిందారి కళాశాల ఒకటి ప్రారంభమైంది. ఉపకారవేతనాలు అందించడంతో చాలామంది విద్యార్థులు చేరుతున్నారు. పాలనా సంఘంలో నాగేశ్వరరావును వేద్దామని చంద్రా రెడ్డి నిర్ణయిస్తాడు. రామచంద్రరాజు ఇష్టపడడు. జమిందారు  పాలనా సంఘానికి రాకపోవడంతో రాజుగారి పోషకుడు రాధ కృష్ణయ్య చంద్రా రెడ్డి, రామచంద్రరాజు, నాగేశ్వరరావు అధీకృత సంఘానికి ప్రతినిధి. పాలనా సంఘం ఏర్పాటయ్యింది. కళాశాలలో కొత్త మార్పులు చేశారు. ధర్మారావు ముప్పైరూపాయల జీతంతో రామ శాస్త్రి స్థానంలో వస్తాడు. దసరా ఉత్సవాలకు చందా కోసం ధర్మారావు గుంటూరు పోయాడు. అలాగే నరసారావు పేటలో ఉన్న రాఘవరావుని కలుసుకున్నాడు.

### 3.5.18.చంద్రారెడ్డికి దివ్య సర్ప దర్శనం:

పురపాలక సంఘానికి భవనం ఏర్పాటయ్యింది. గవర్నర్ ని ఆహ్వానించారు. శుభశూచకంగా గణాచారి వేప మండ భవనం ఎదురుగా వదలి వెళ్ళుతుంది. చంద్రా రెడ్డి దానిని కాలితో తోసేస్తాడు. అతనికి ముల్లు గుచ్చుకున్నట్లవుతుంది. కొంతకాలం వరకు ఆ బాధ తగ్గదు పొలాలలో చంద్రా రెడ్డికి నాలుగు తలలు ఉన్న దివ్య సర్పం కనబడుతుంది. నిశ్చేష్టుడై నిలబడిపోతాడు. దానిని కొట్టాలనుకుని కొట్టలేదు. ఇంతలో ఎవరో చంద్రా రెడ్డిని పిలవడంతో పాము తోటలోకి వెళ్ళిపోతుంది. చంద్రా రెడ్డి ఊపిరి పీల్చుకుని  భయపడుతూనే ఇంటికి వెళ్ళిపోతాడు.

### 3.5.19.జాతీయ కళాశాల అధ్యక్షుడుగా శివరావు:

ఎన్నికల సమయంలో చంద్రా రెడ్డి రామేశ్వరం పోటీ పడ్తారు. చంద్రా రెడ్డి గెలుస్తాడు. మరలా కొంతకాలానికి అధ్యక్ష పదవి ఎన్నికలు వచ్చాయి. ఈసారి రామేశ్వరం గెలుస్తాడు. జాతీయ కళాశాలకు చంద్రా రెడ్డి స్థానంలో శివరావు అధ్యక్షుడిగా వస్తాడు. శివరావు ఆ కళాశాలకు గ్రంథాలయాన్ని నిర్మిస్తాడు. శివరావు ధర్మారావుతో పరిచయం పెంచుకుంటాడు. ఇది ఇలా ఉండగా జమిందారి కళాశాలలో ప్రథమాధ్యక్షుడు రామారావును తొలగించి యూరప్ దొర ఈట్సన్ నియమిస్తాడు. హరప్ప ఇతని దగ్గర విద్యను మానేసి జాతీయ కళాశాలలో శివరావు వద్ద చరిత్ర, అర్థశాస్త్రం చదువుతాడు.

### 3.5.20.జోస్యుల మరణం:

రామేశ్వరం సినిమాహాలు వలన లాభం పొందుతూ తాలూకా బోర్డు ప్రెసిడెంట్ గా తనిఖీలు చేయిస్తూ అధికార గర్వంతో ఉంటాడు. ఈ నేపథ్యంలో రంగాపురంలో తనిఖీలు నిర్వహించే సమయంలో రామేశ్వరానికి జోస్యులను ఉపాధ్యాయుడు తన ఇంట సర్వ మర్యాదలు చేస్తాడు. రామేశ్వరం జోస్యుల భార్య మంగ మీద మోజు పడ్తాడు. త్వరలో జోస్యులు సుబ్బన్న పేటకు బదిలి అవుతాడు. అక్కడ జోస్యులకు తెలియకుండా రామేశ్వరం మంగకు కానుకలు ఇస్తూ లోబరుచుకుంటాడు. ఇది తెలుసుకున్న జోస్యులు ఆ అవమానం భరించలేక మంగతో రామేశ్వరం గురించి చెప్పి జాగ్రత్తగా ఉండమని కొన్ని మాటలు చెప్పి వెళ్ళిపోతాడు. అలా వెళ్ళిపోయిన జోస్యులకు ఏ దారి తోచక తిరుగుతుంటే రామేశ్వరం, చలపతి కనబడతారు. జోస్యులు రామేశ్వరాన్ని కొట్టబోయి కిందపడి తిరిగి లేచి వెళుతున్న సమయంలో రామేశ్వరం చలపతిని జోస్యులను కొట్టమంటాడు. ఆ దెబ్బలకు జోస్యులు చనిపోతాడు.

### 3.5.21.రామేశ్వరం జైలు శిక్ష:

కొద్ది రోజులకే రామేశ్వరం దొంగ కరెన్సీ నోట్ల విషయంలో అరెస్ట్ చేయబడి శిక్ష అనుభవిస్తాడు. ఇతనితో  పాటు జోస్యుల మరణం విషయంలో చలపతికి శిక్ష పడుతుంది. రంగారావు జామీను కోసం  ప్రయత్నించినా లాభం లేకుండాపోతుంది.

రామేశ్వరం ఆస్తిని అనుభవిస్తున్న మంగమ్మ కూడా సహాయం చేయదు. జైలులో ఉన్న రామేశ్వరాన్ని ధర్మారావు చూస్తాడు.

### 3.5.22.ధర్మారావు,గణాచారి సంభాషణ:

ధర్మారావు, గణాచారి సుబ్బన్న పేట అంతరించి పోవడానికి పది సంవత్సరాలే ఉన్నాయని మాట్లాడుకుంటారు. నాగేశ్వరస్వామి గురించి మాట్లాడుతూ స్వామికి రెండు పడగలే మిగిలాయని బాధపడ్తారు. హరప్ప ప్రాచీన సంప్రదాయాలను అనుసరించి నడచుకునేవాడు వేణుగోపాల స్వామికి ఉత్సవాలు జరపాలని అనుకుంటాడు.

### 3.5.23. రంగారావు కలలో సర్ప దర్శనం:

రంగారావును కలలో సరోజని దేవి ఒంటి నిండా సర్పాలున్నట్లు, నాగేశ్వరరావును సర్పాలు కరచినట్లు, వేణుగోపాల స్వామి సర్పాలను మెడలో హారాలుగా వేసుకుని ఉన్నట్లు కలలు వస్తాయి. ఇలా కలలు రావడం వలన తనకు ఏమి ప్రయోజనం అని అనుకుంటాడు.

### 3.5.24.ధర్మారావు అరుంధతి కి మగ బిడ్డ జన్మించడం:

కిరీటి, శశిరేఖ ధర్మారావింటికి వస్తారు. అక్కడ కిరీటికి ధర్మారావు సుబ్రహ్మణ్యేశ్వర స్వామి గురించి, సుబ్బన్న పేటకు ఆ పేరు  ఎలా వచ్చిందో చెప్తాడు. హరప్పకు కిరీటి పరిచయమవుతాడు. అరుంధతికి పిల్లవాడు పుడతాడు. రామేశ్వర శాస్త్రి అని ఆ పిల్లవాడికి పేరు పెడతారు.

### 3.5.25.ఆంధ్రపండిత పదవికి అభ్యర్థిగా ధర్మారావు:

రాఘవరావు సహాయనిరాకరణోద్యమం కారణంగా జైలుకు వెళ్ళి విడుదలై వచ్చి మద్యపాన నిషేధోద్యమంలో భాగంగా సుబ్బన్న పేటకు వచ్చి ప్రచారం చేస్తాడు. అతనికి తోడుగా ధర్మరావు ఉంటాడు. మంగమ్మ ఇంట్లో రాధాపతి ఉండడాన్ని చూసి రాధాపతి ఇక్కడకు రావడానికి గల కారణాలను పంకజమ్మ ద్వారా తెలుసుకుంటాడు. ధర్మారావు జాతీయ కళాశాలలో ఉద్యోగం మానేసి రాజ గారి కాలేజిలో ఆంధ్ర పండిత పదవికై అభ్యర్థి అవుతాడు.

### 3.5.26. కుమారస్వామి ధర్మారావుని ఇంటికి ఆహ్వానించడం:

ధర్మారావుకి చెంగల్రావు పరిచయమవుతాడు. కుమారస్వామి చక్రవర్తి ద్వారా తన వివాహం జరగదేమోనని ధర్మారావు సహాయం కోరుతాడు. అతని కోరిక ప్రకారం ధర్మరావు కుమారస్వామి ఇంటికి వెళ్తాడు. అక్కడ శ్యామల కుమారస్వామి వివాహ ప్రస్తావన తీసుకువస్తాడు. చక్రవర్తికి అది నచ్చదు. రాధాపతి, ధర్మారావు వివాహ వ్యవస్థ గురించి వాదించుకుంటారు. వారి వాదన వారి మాటలు సాహిత్యంలోకి ప్రవేశిస్తాయి. ధర్మారావు చెప్పేది చక్రవర్తికి చాదస్తంగా అనిపిస్తుంది.

### 3.5.27. చిన్న అరుంధతి ప్రవేశం:

ధర్మారావు, అరుంధతి పశుపతి ఇంటికి వెళ్తారు. పశుపతి కూతురు పేరు కూడా అరుంధతి. ఈమె క్రైస్తవ పాఠశాలలో చదువుతుంటుంది. ఆడపిల్లలు క్రైస్తవ పాఠశాలలో చదివించరాదని ధర్మారావు పశుపతితో అంటాడు. ఆ పాఠశాలలో చదివితే మన సంప్రదాయాలు, పురాణ కథలు లాంటివి బోధించరు. పైగా చిన్నప్పటి నుండే ఆంగ్లం అంటే పిల్లలకు భారమవుతుందని వివరిస్తాడు.

### 3.5.28.సుబ్బన్న పేటలో సారంగధర నాటకం వేయడం:

సుబ్బన్న పేటలో సారంగధర నాటకం వేయబడుతుంది. అందులో రంగావధాని సారంగధర పాత్రను, మంగమ్మ చిత్రాంగి పాత్రను పోషిస్తారు. ధర్మారావు ఆ నాటకాన్ని విమర్శిస్తాడు. పూర్వపు నాటకాలకు, నేటి నాటకాలకు గల వ్యత్యాసాలను కుమారస్వామికి వివరిస్తాడు. వేషధారణలోను, అభినయంలోనూ చాలా మార్పులు వచ్చాయి అంటాడు. నాటకం అయిన తర్వాత ఇంటికి వెళ్ళిన ధర్మారావు కలలో వేయిపడగల సర్పం కనిపిస్తుంది.

### 3.5.29.సుబ్బన్న పేటలో నూతన మార్పులు:

పురపాలక సంఘ సమావేశం జరుగుతుంది. విద్యుద్దీపాలు , కుళాయిలకు నాలుగు లక్షలు అప్పు తెచ్చి వేయిస్తున్నారు దానిని రామచంద్రరాజు, కబీరు వ్యతిరేకించారు. తక్కిన వారు అంగీకరించారు. గణాచారి ఎండిన వేప మండలను తీసుకుని ఊరంతా వేస్తుంది. చంద్రా రెడ్డి ఆమెను హేళన చేస్తాడు. చంద్రా రెడ్డి విద్యుద్దీపాలు కొరకు కుళాయిలు వేయించడానికి ఇంగ్లాండ్ నుండి పరికరాలు తెప్పించాడు. నూతులన్ని మూతబడ్డాయి. విద్యుద్దీపాలు కొరకు మహావృక్షాలన్ని నేల

కూలాయి. కుళాయి నీటి కోసం అందరూ క్యూ పాటించవలసిన పరిస్థితి ఏర్పడింది. లాంతరు దీపాల కంటే ఘోరంగా విద్యుద్దీపాలు వెలుగుతున్నాయి. ఇలా సుబ్బన్న పేట రూపురేఖలు మారాయి.

### 3.5.30.మహిళా మండలి ఏర్పాటు:

కాపు కుటుంబంలో కొన్ని మార్పులు వచ్చాయి. గణాచారి అన్న భార్య రంగమ్మ ఆధునిక స్త్రీ వలె ఉంటుంది. ఆచారాలలో మార్పులు వస్తాయి. సుబ్బన్న పేటకు కొత్త డాక్టర్ రావడం డాక్టర్ భార్యతో కలసి రంగమ్మ అధ్యక్షురాలుగా మహిళా మండలి ఏర్పాటు చేస్తారు. అందులో సీతారామమ్మ కార్య దర్శినిగా, పంకజమ్మ ,శ్యామల, మంగమ్మ డా//భార్య ఇందిరా భాయి నలభైమంది సభ్యులున్నారు. చందాలు వసూలు చేస్తూ టెన్నిస్, బ్యాడ్మింటన్ వంటి ఆటలను ప్రవేశపెట్టారు. వీరంతా కలసి స్త్రీ స్వాతంత్ర్యం గురించి చర్చించుకుంటారు. అలాగే బాల్యవివాహాల గురించి విధవా వివాహం గురించి చర్చిస్తారు.

### 3.5.31.సుసాని ఇంగ్లాండ్ ప్రయాణం:

సుసాని ఇంగ్లాండ్ కు వెళ్ళిన తర్వాత రంగారావు ఆమెను సింహళం వరకు విడిచిపెట్టి తిరిగి వచ్చే సమయంలో బియాట్రీస్ అనే ఆమెను రంగారావు వివాహం చేసుకుంటాడు. కోటకు తీసుకువస్తాడు. అప్పుడు కాని ఆమెకు సుసాని విషయం తెలియదు. తరువాత సుసాని ఈ విషయం తెలుసుకుని వస్తుంది. రంగారావు అనారోగ్యం పాలవుతాడు. బియాట్రీస్ కు కొంత ధనమిచ్చి పంపించేస్తాడు. సుసాని సంతోషిస్తుంది. ఈమె రంగారావు దగ్గర నుండి ధనాన్ని ఆభరణాలను చేజిక్కించుకుని ఇంగ్లాండ్ వెళ్ళడానికి సిద్ధపడుతుంది. హరప్ప ఈమెను తన తల్లి నాయనమ్మ ఆభరణాలు విడిచిపెట్టి తక్కినవి తీసుకుని పొమ్మంటాడు. ఆమె సరేనంటుంది. నాగేశ్వరరావు సుశానికి తెలియకుండా ఆమె దగ్గరున్న ఆభరణాలు అపహరిస్తాడు. ఈ విషయం సుసాని ప్రయాణ మార్గ మధ్యలో తెలుసుకుంటుంది. తన దగ్గర ఉన్న పది లక్షలతో సర్దుకుంటుంది.

### 3.5.32.హరప్ప పనితీరు:

రంగారావు ఆరోగ్యం క్షీణిస్తుంది. ఇతని అధికారాన్ని క్రమక్రమంగా హరప్ప స్వీకరించి పనులను చక్కబెడుతున్నాడు. ధర్మారావు, హరప్ప కలసి రంగారావుకి

రాజశేఖర శాస్త్రి అనే తెలుగు వైద్యున్ని పిలిపించి వైద్యం చేయిస్తాడు. హరప్ప కళాశాలను మూయడానికి ప్రయత్నాలు చేస్తాడు. నాగేశ్వరరావు తాను చేసే ప్రతి పనిలో హరప్ప అడ్డు వస్తున్నాడని దివానుకు రాజీనామా చేస్తాడు. ఆ ఉద్యోగంలో ధర్మారావును నియమిస్తాడు.

### 3.5.33.రాఘవరావు భార్య మరణం:

ధర్మారావు స్నేహితుడు రాఘవరావు భార్య మశూచి వ్యాధితో మరణించడంతో ఆమెను మోయడానికి, దహన సంస్కారాలు చేయడానికి ఎవరూ ముందుకు రాకపోవడంతో ధర్మరావు, సూర్య పతి ఇద్దరు కలసి దగ్గరుండి ఆ కార్యక్రమాలు జరిపిస్తారు.

### 3.5.34.కుమారస్వామి ఉద్యోగాన్ని వదలటం:

కుమారస్వామికి, శ్యామలకు వివాహానంతరం ఒక కొడుకు పుడ్తాడు ఉద్యోగం కూడా అప్పుడే వస్తుంది. ఆ పిల్లవాడికి ధర్మారావు అని పేరు పెడతాడు. తెలుగు ఉపాధ్యాయుడుగా ఉన్న కుమారస్వామి క్రైస్తవ కళాశాల అవడం చేత అక్కడ అవమానపడతాడు. ఇతని ఉపన్యాసాలు గిట్టని వారు అతని మీద చాడీలు చెప్పి ఉద్యోగం నుండి తొలగిస్తారు. ధర్మారావు సలహా మేరకు కుమారస్వామి వామన రావు దగ్గర పత్రికా లయంలో చేరుతాడు. అక్కడ తాననుకున్న వాతావరణం లేకపోవటం వామన రావు పనులు అతనికి నచ్చక చివరకు ఆ ఉద్యోగం కూడా వదులుకుంటాడు.

### 3.5.35.వేణుగోపాలుని గిరిక ఐక్యమవడం:

వేణుగోపాల స్వామి వారి కళ్యాణ ఉత్సవాలకు ధర్మారావు తన బంధువులను స్నేహితులను పిలుస్తాడు. స్వామి వారి ఉత్సవాలు ప్రారంభమయ్యాయి. హరప్ప తన తాతల కాలం నాటి సంప్రదాయాలను పాటిస్తూ ఉత్సవం జరుపుతాడు. దేవదాసి స్వామి అవతారానికి తగ్గట్టు నాట్యము, భోగప్ప శాస్త్రి సంభాషణ,. రత్నగిరి వీణ ఇలా ప్రతి సాయంత్రం  ఉండేది. స్వామి అవతారాలన్నింటిలోని ఘట్టాలను నృత్య రూపంలో దేవదాసి చేస్తుంది. నృత్యం అయిన వెంటనే స్మృతి కోల్పోతుంది. తన్మయత్వంతో స్వామిని దర్శిస్తుంది. ఉత్సవాలు జరుగుతున్న రోజులు భోగప్ప జపమాచరించి జప ఫలితాన్ని దేవదాసికి ధారపోస్తారు. కుమారస్వామి, మంగమ్మ

భూప్రదక్షణలు చేసి దేవదాసికి ఆ ఫలితాన్ని ధారపోస్తారు చివరకు దేవదాసి కృష్ణుని ఘట్టాలను నాట్యం చేస్తూ స్వామి కళ్యాణం పూర్తయిన వెంటనే స్వామిలో ఐక్యమైపోతుంది.

### 3.5.36. గోపన్న మరణం:

కృష్ణమనాయుడు మరణానంతరం ఏమి తోచని స్థితిలో వెళ్ళిపోయిన గోపన్న సుబ్బన్న పేటకు తిరిగి వస్తాడు. అతనికి అంతా కొత్తగా అనిపిస్తుంది. గిరిక విషయం తెలుసుకుంటాడు. ధర్మారావు కొడుకును చూస్తాడు. చివరకు ధర్మారావుని కలుసుకుని తన చివరి కోరికగా కోట అంతా తిరిగి హరప్ప నాయుడ్ని రంగారావుని చూసి తనువు చాలిస్తాడు.

### 3.5.37.మంగమ్మ ప్రాయశ్చిత్తం– మరణం:

మంగమ్మ ప్రాయశ్చిత్తం చేసుకోదలచి తన ఆస్తిలో నలభై వేలు కుమారస్వామికి మరికొంత ధనం గోపాలస్వామి ఉత్సవాలకు, సినిమాహాలు స్థలంలో ధర్మారావు వేదపాఠశాల పెట్టించడానికి రిజిస్టర్ చేయిస్తుంది. రత్నగిరి , కబీరునకు తన పది ఎకరాల స్థలాన్ని కూడా స్వామి కార్యానికి రాస్తుంది. కుమారస్వామికి ఈ విషయాలన్ని చెప్తుంది.

రంగావధాని నుండి మంగమ్మకు ఒక ఉత్తరం వస్తుంది. అందులో చెంగల్రావు వ్యక్తిత్వం గురించి, రాధాపతి మరణం గురించిన విషయాలు ఉంటాయి. అప్పటి నుండి కుమారస్వామి మంగమ్మకు చెంగల్రావు నుండి ప్రమాదం జరగకుండా ఉండాలని కాపలా కాస్తాడు. ఒక రోజు నిద్రచేత కుమారస్వామి తన ఇంటి వద్దనే ఉండడంతో చెంగల్రావు ఇదే అదనుగా మంగమ్మను చంపేస్తాడు. పోలిసులు అతన్ని అరెస్ట్ చేస్తాడు. కుమారస్వామి , శ్యామల చాలా బాధపడ్తారు. కుమారస్వామి మంగమ్మకు దగ్గరుండి కర్మకాండలు చేయిస్తాడు.

### 3.5.38.అరుంధతి మరణం:

అరుంధతికి ఎంత వైద్యం చేయించినా ఆరోగ్యం కుదుటపడలేదు. ఆమె కోరిక ప్రకారం ధర్మారావు రంగాపురం వెళ్ళి రంగాజమ్మ ఇచ్చిన చీరను తీసుకువస్తాడు. అరుంధతి ఆ చీరను కట్టుకుంటుంది ఆ రోజు రాత్రే ఆమె మరణిస్తుంది. ధర్మారావు బాధపడ్డాడు.

### 3.5.39. హరప్ప యోగ మరణం:

రంగారావు ఆరోగ్యం కుదుటపడింది. హరప్ప తన అధికారమంతా రంగారావుకి తిరిగి ఇచ్చేస్తాడు. హరప్ప ధర్మారావుతో కలసి మాఘ స్నానాలు ఆచరించి మనసులో ఆధ్యాత్మిక భావాన్ని నింపుకుని యోగ మరణం చెందుతాడు.

### 3.5.40.రంగారావులో పరివర్తన – మరణం:

రంగారావు నాగేశ్వరరావు చేసిన అక్రమాలను గుర్తు చేసుకుంటాడు ఒక పిల్ల వానిని దత్తత తీసుకుని ఈ పిల్లవానితో పాటు ధర్మారావు కొడుకుకి కుమారస్వామి దగ్గర చదువు చెప్పిస్తాడు.

### 3.5.41. పసరిక మరణం:

చంద్రా రెడ్డి కొడుకు గోపాలకృష్ణారెడ్డిలో ఆధునిక లక్షణాలు కనబడతాయి ఇతనితో పసరిక స్నేహం చేస్తూ తన సహజ పాము లక్షణాలను విడిచి పెడ్తాడు. దీనితో అతనికి సర్పాలకు, పక్షులకు స్నేహం పోతుంది. పసరిక పాముచేత కరిపించుకుని మరణిస్తాడు. ధర్మారావు పసరిక చనిపోవడాన్ని చూసి అందరూ పోతున్నారు. నేను చూడరానిది ఏమున్నది ఇక పదిహేను దినములలో సర్వం పోతున్నది అంటాడు. గణాచారి పసరికను ఉద్దేశించి పాట పాడుతుంది.

### 3.5.42.గణాచారి మరణం:

గణాచారి ఉన్న గృహంతోపాటు చాలా ఇల్లు తగలబడి పోతాయి. దానితో పాటు గుండేరు వరద వచ్చి మొత్తం కొట్టుకుపోతుంది. రైల్వేస్టేషన్ గట్లు పడిపోయాయి. విద్యుద్దీపస్తంభాలు పడిపోయాయి. ఈ వరదతో కొత్తగా వచ్చిన పట్టణమంతా నశించిపోయింది. గణాచారికి ధర్మారావే దహన సంస్కారములు చేయిస్తాడు. సుబ్బన్న పేట పేరు బదులు 'సుభాన్ పేట' అని రాసి ఉండడం ధర్మారావు గమనిస్తాడు.

### 3.5.43.ధర్మరావుతో చిన్న అరుంధతి ప్రస్తావన:

ధర్మారావు పశుపతి ఇంటికి వెళ్తాడు. పశుపతి ముభావంగా ఉంటాడు. పశుపతి కూతురు చిన్న అరుంధతి ధర్మారావుని తప్ప వేరే వివాహం చేసుకోనని

చెప్తుంది. ఈ విషయం తోటమాలి నాగభూషణం ద్వారా తెలుసుకున్న ధర్మరావు ఏమి మాట్లాడక అయిష్టంగానే ఇంటికి వెళ్ళిపోతాడు.

### 3.5.44.ధర్మరావు – చిన్న అరుంధతి వివాహం:

కోటలో ధర్మారావు దివాను కావడంచేత శిస్తును చక్కగా వసూలు చేసేవాడు. తనకు నచ్చనిది ఆ కోటలో కనబడితే దానిని నివారిస్తాడు. రంగారావు ఏమి అనేవాడు కాదు కుమారస్వామి చేత ఇంగ్లీషు చెప్పించడం గమనించి దానిని మానిపిస్తాడు. సంక్రాంతి పండుగకు ధర్మారావు బంధువుల్ని, స్నేహితుల్ని పిలుస్తాడు. కిరీటి ధర్మారావుతో చిన్న అరుంధతి గురించి మాట్లాడితే ధర్మారావు అతని మాటలను నిరాకరిస్తాడు. పశుపతి వెంటనే రావాలని ధర్మరావుకి ఉత్తరం పంపుతాడు. ధర్మారావు పట్టించుకోడు ధర్మారావు కొడుకుకు కలలో అమ్మ మరలా బ్రతికిందని చెప్తాడు. ధర్మారావు ఆలోచిస్తాడు. చిన్న అరుంధతి పరిస్థితి విషమంగా ఉండటంతో ధర్మారావు బయలుదేరి వెళ్తాడు. పశుపతి ధర్మారావుని క్షమించమంటాడు. చిన్న అరుంధతి, ధర్మారావు మాట్లాడుకునే సమయంలో ధర్మారావుకి తన అరుంధతియే మరలా తిరిగి వచ్చిందని ఊహిస్తాడు. వీరి వివాహం జరుగుతుంది ధర్మారావుకు , అరుంధతికి కార్యం నిర్వహిస్తారు. కార్యక్రమాలన్నీ పూర్తయినాయి. ధర్మారావు గతించిన కాలం గురించి ఆలోచిస్తూ ఉన్నాడు. పాత దంతా  పోయి క్రొత్త దనం వచ్చింది. కృష్ణమనాయుడు ప్రభువు పోయిన వెంటనే సంపద అంతా నటులకు, కులటులకుపోయింది. ధర్మార్థకామ మోక్ష హేతువులైన విద్యలు నశించాయి. స్వామి వేయిపడగలు పోయాయి. రాణి అనే పేరు లేకుండా రుక్మిణమ్మ రావు, సరోజని దేవి పోయారు. కేశవరావు మరణంతో విద్యాసంస్థకే లోటు కలిగింది. గోపన్న మరణంతో దేవుడే కనిపించకుండా పోయాడని తోస్తుంది. గణాచారి గతించింది ఇంకేమి మిగిలింది అని ధర్మారావు అనుకుంటూ ఉండగా అరుంధతి ధర్మారావుతో నేను మిగిలాను అంటుంది. ధర్మారావు అవును నీవు మిగిలావు, నా అదృష్టం నీవు మిగిలావు అనుకోవటంతో నవల ముగుస్తుంది.

ఈ నవలంతా ప్రౌఢమైన శైలితో ఉండడం చేత పాఠకులకు వర్ణనల విషయంలోనూ, పద సంబంధ విషయంలోనూ కొంత ఇబ్బంది కలిగించినా జాగ్రత్తగా పరిశీలిస్తే వారి సందేహాలు నివృతమవుతాయి. ఈ నవల ఆకాశవాణిలో

నాటకంగా రావడం వలన ప్రజలకు ఈ నవలలోని విషయాలను తెలుసుకోగలిగే అవకాశం లభించినట్లైంది.

పైన తెలిపిన గణపతి, వేయిపడగలు నవలలోని ఇతివృత్తాన్ని పరిశీలించినట్లైతే ఈ రెండు నవలలు గ్రాంథిక భాషలో ఉన్నాయి. గణపతి నవల హాస్యధోరణిలో సమాజంలోని స్థితిగతులను తెలియజేస్తుంది. వేయిపడగల నవలలోనూ సమాజ చిత్రణతో పాటు స్వాతంత్ర్యోద్యమ పరిస్థితులు ఈ నవలలో చోటుచేసుకున్నాయి. అలాగే జమిందారీ వ్యవస్థ వారి పరిపాలనను ఇందులో పొందుపరచబడ్డాయి. అయితే ఈ రెండింటి నవలలో మాత్రం ఆనాటి బాల్య వివాహాలను మూఢనమ్మకాల వంటి సాంఘిక దురాచారాలను చూపడం కనిపిస్తుంది.

ఈ కథలను రేడియో నాటకాలుగా మారినప్పుడు చేసిన మార్పుల్ని, చేర్పుల్ని గుర్తించడానికి రాబోయే అధ్యాయాలలో పరిశీలిస్తాను. గణపతి, వేయిపడగలు రేడియో నాటకాలుగా మారాయి. ఈ రెండు నాటకాలలో రేడియో నాటక లక్షణాలు ఎంత వరకు ఇమిడాయో తర్వాతి అధ్యాయంలో వివరిస్తాను.

నాల్గవ అధ్యాయం

# రేడియో నాటకీకరణ విధానం–

# శ్రవ్య నాటక లక్షణ సమన్వయం

గణపతి, వేయిపడగలు రేడియో నాటకాలుగా మలిచి ప్రసారం చేశారు. అయితే వీటిలో రేడియో నాటక లక్షణాలు ప్రతిఫలించా యో లేదా తెలుసుకోవాల్సిన అవసరం ఉందనిపించింది. అలాగే హాస్యనాటక, రేడియో నాటక లక్షణాలను పేర్కొని గణపతి, వేయిపడగలు రేడియో నాటకాలకు అన్వయం చేస్తున్నాను. రేడియో నాటకం వింటున్నప్పుడు ఒక శ్రోతగా నేను పొందిన అనుభూతిని ఈ అధ్యాయంలో వివరిస్తున్నాను.

ప్రసార సాధనాలలో రేడియో అతిముఖ్యమైంది. టెలివిజన్, ఇంటర్నెట్, ప్రజలందరికి ఈ నాడు ఉన్నాయేమో కాని నాటి నుంచి రేడియోనే అందుబాటులో ఉండేది. అయినా ఈనాడు కూడా రేడియోకి ఆదరణ తగ్గిందని నేను అనుకోవడం లేదు. కొన్ని గ్రామాలలో టెలివిజన్, ఇంటర్నెట్ లాంటివి ఇప్పటికి రాలేదు. వీరందరికి కూడా రేడియోనే అతి ముఖ్య సాధనం ఎన్నో సంస్కృతిక కార్యక్రమాలు ప్రజలకు చేరవేసే విజ్ఞాన సాధనం రేడియో.

ఈ రేడియోను 1895లో మార్కొని కనిపెట్టాడు.ఈయన ఇటలీ దేశస్థుడు. భారతదేశంలో రేడియో ప్రసారం 1924 లో ప్రారంభమైంది. ప్రపంచ వ్యాప్తంగా రేడియో కార్యక్రమాలను Voice of America ప్రసారం చేస్తుంది. బ్రిటీష్ కాస్టింగ్ కార్పోరేషన్ నలభై భాషల్లో ఇరవై నాలుగు గంటలు వార్తలను ప్రసరం చేస్తుంది. ప్రపంచం మొత్తం మీద 8 కోట్ల మందికి పైగా శ్రోతలు ఈ కార్యక్రమాలను వింటున్నారు[1]

[1]శ్రీనివాస రెడ్డి, ఎల్,సి. సాహితి సౌరభం(తెలుగు పాఠ్యపుస్తకం),పుట: 113.త

ఈ రేడియోలో వార్తలు, సభలు, సమావేశాలు, ప్రముఖ వ్యక్తుల పరిచయాలు, వ్యవసాయ కార్యక్రమాలు, హరికథలు, బుర్రకథ ఇలా వివిధ కార్యక్రమాలన్ని ప్రసారమవుతాయి. ఇలా సాంప్రదాయ సాంస్కృతిక విలువలకు అద్దం పట్టేవే ఈ రేడియో కార్యక్రమాలు.

## 4.1. రేడియో నాటకీకరణ:

నవలలు నాటకాలు ఉద్భవించిన కాలంతో పోలిస్తే రేడియో నాటక కాలం తక్కువే. నవలలు, నాటకాలు వచ్చినప్పుడు రేడియో లేదు తదనంతర కాలంలో రేడియో పుట్టిన మూడు దశాబ్దాలకి భారతదేశంలోకి ప్రవేశించింది.

రేడియోనాటక ప్రసారాలకు వయసు తక్కువ రంగస్థలంమీద నాటకం ఆవిర్భవించి నూటక పాతికేళ్ళు దాటిపోతే రేడియోలో నాటక ప్రసారాలు ప్రారంభమై 65 ఏళ్ళు మాత్రమే కావొస్తుంది. అయితే సేవా పరంగా ఇంత తక్కువ వ్యవధిలో ఎంతో ప్రయోజన కార్యక్రమాల్ని రూపొందించిన ఘనత రేడియోకే చెందుతుందని శ్రీ జీడిగుంట రామచంద్రమూర్తి 'తెలుగు లో రేడియోనాటక రచన' అనే వ్యాసంలో తెలిపారు[2].

మొదట నాటకాలను శ్రవ్య నాటకాలుగా మారుస్తూ రేడియోలో ప్రసారం చేయడం ద్వారా ప్రజలకు అత్యంత వినోద విజ్ఞాన సాధనమని నిరూపించుకుంది. రేడియో. కనుక తర్వాతి కాలంలో నవలలు కూడా శ్రవ్యనాటకంగా మార్చడం జరిగింది. నవలను విద్యావంతులు మాత్రమే చదవగలిగే అవకాశం ఉంటుంది. కాని అదే రేడియోనాటకంగా మారిస్తే ప్రజలకు చేరువవుతుంది.

ఇలా రేడియో నాటకీకరణ మలచేటప్పుడు కొన్ని సృజనాత్మక పద్ధతులను దృష్టిలో పెట్టుకోవాలి.శ్రవ్యనాటకాలలో కథా వస్తువు ప్రధానం కథా వస్తువు బలంగా ఉన్నప్పుడే శ్రవ్యనాటకం చక్కగా రూపుదిద్దుకుంటుంది. నటీ నటులు వారి సంభాషణద్వారానే శ్రోతలను రక్తికట్టించాలి ఎందుకంటే సంభాషణ ద్వారానే కథ నడిపించాలి. కథ పౌరాణికమైనా, చారిత్రకమైన, సాంఘికమైన నిర్దిష్టంగా ఉండాలి. పరిమితి వ్యవధిలో ఒదిగిపోవాలి. స్పష్టత ఉండాలి. శ్రోతలు కథను సులభంగా అర్థం చేసుకునేలా ఉండాలి. శ్రవ్యనాటకంలో అన్ని బాగుండి కథా వస్తువు మంచిది కాకపోతే పేలవంగా ఉంటుంది. శ్రవ్యనాటకాలలో నటించే వ్యక్తులకు సంగీతం తెలిస్తే చాలదు గొంతు బావుండాలి. గొంతు బావుంటే చాలదు సంగీతం తెలియాలి శ్రవ్యనాటకం అంతే.

---

[2]మూర్తి,డి.ఎస్.ఎన్. తెలుగు నాటక సాహిత్యం,వివిధ రీతులు– పరిణామాలు,పుట:198.

అన్ని సమానంగా సమకూరాలి. రచన గొప్పగా ఉంటే సరిపోదు నటీ నటులు అంకిత భావంతో నటించాలి. అప్పుడే శ్రోత ఆనందిస్తాడు. రచయిత రసానుభూతి చెందుతూ సంభాషణలు రాయాలి. మనసులో ఇతివృత్తాన్ని గుర్తుపెట్టకోవాలి. సమయ పరిమితిని గమనిస్తుండాలి ఇవన్ని దృష్టిలో ఉంచుకుంటూ రాసినప్పుడు ఒక మంచి శ్రవ్యనాటకం తయారవుతుంది.[3] ఈ అంశాలను అనుసరిస్తూ రేడియో నాటకీకరణ చేస్తే సఫలికృతమవుతుంది అనడంలో అతిశయోక్తి లేదు.

### 4.2. శ్రవ్యనాటక ముఖ్యాంశాలు:

శ్రవ్యనాటకంలో ముఖ్యంగా పాత్రధారులు లేక నటీ నటులు ఆయాసన్నివేశాలకు, ఆయాసంభాషణలలో చక్కటి ఉచ్ఛారణతో శ్రోతను ఆకట్టుకోవాలి. శ్రోత మనసును రంజింప చేయగలగాలి.రేడియో నాటకంలో ఒక పాత్రధారి సంభాషణ చెప్తుంటే అతని హావభావాలు ఎలా ఉన్నాయో అతని వయసు ఏ పాటి ఉంటుందో లాంటి అంశాలన్ని శ్రోత తన మనో నేత్రాలతో చూడగలగాలి. ఒక్క మాటలో చెప్పాలంటే రేడియో నాటకం వినిపిస్తూ, కనిపించాల. దృశ్యనాటకం కనిపిస్తూ వినిపించాలి[4]. ఇలా చేసినప్పుడే శ్రోత ఆహ్లాదాన్ని పొంది నాటకంలో పారవశ్యాన్ని పొందగలడు.

### 4.3. రేడియో నాటక ప్రసారాలు– గణపతి, వేయిపడగలు:

నవలలు ప్రచురణలో దొరుకుతాయి వాటి సమస్య లేదు కాని రేడియోలో నాటకాలుగా ప్రసారమయనప్పుడు వాటిని సేకరించుకోవడం చాలా కష్టమైన పని ఆకాశవాణి కేంద్రానికి వెళ్ళి అడిగితే వాటిని బయటకు ఇవ్వమని కొన్ని సాంకేతిక అనుమతులు కావాలంటారు. అందువల్ల వాటిని సేకరించడం కష్టమైనా వాటిని సంపాదించాను. కొన్ని భాగాలను రేడియోలో ప్రసారమవుతున్నప్పుడు రికార్డు చేసుకున్నాను. మరి కొన్ని భాగాలను ఆన్ లైన్ నుండి సేకరించుకున్నాను.

“1950-80 మూడు దశకాలలో ఐదు కేంద్రాలు తెలుగు కార్యక్రమాలు ప్రసారం చేస్తున్నాయి. మదరాసు నుండి కొన్ని తెలుగు కార్యక్రమాలు, విజయవాడ, హైదరాబాదు, కడప, విశాఖపట్నం కేంద్రాలు తెలుగు ప్రసారాలు విస్తృతంగా చేస్తున్నాయి. దిగ్గజాల వంటి పండితులు ఆయా కేంద్రాలలో ప్రయోక్తులుగా కార్యక్రమ

---

[3]రవీంద్రత్రివిక్రమ్,కాటూరి.తెలుగులో శ్రవ్యనాటకాలు, పుట:42,43.

[4]మూర్తి,డి.ఎస్.ఎన్. తెలుగు నాటక చరిత్ర వివిద రీతులు– పరిణామాలు, పుట:199.

నిర్వాహకులుగా పనిచేస్తూ ఎన్నో ప్రసార ప్రయోగాలు చేశారు.[5] రోజురోజుకు ఈ కార్యక్రమాలు దినదినాభివృద్ధి చెందుతూ ఇటువంటి కార్యక్రమాలలో శ్రవ్యనాటకాలను ప్రసారం చేయడంలో విజయవంతమైంది.

నవలను నాటకీకరించి శ్రవ్యనాటకాలుగా మార్చి ధారావాహిక నాటకాలుగా ప్రసారం చేశారు. వేయిపడగలు ధారావాహికంగా జులై 20 2013 నుంచి వరుసగా 23 శనివారాలు ఉదయం 7.15 నుంచి 7.45 వరకు ప్రసారమయ్యింది. గణపతి గంట నాటకం 1967 ఏప్రిల్ 16 న మధ్యాహ్నం మూడు గంటలకు విజయవాడ కేంద్రం నుండి ప్రసారమయ్యింది.

''*హైదరాబాదులో 1933 సంవత్సరంలో ప్రైవేటు రేడియో కేంద్రం పని చేస్తుండేది. 1935 లో హైదరాబాద్ ప్రభుత్వం దానిని స్వాధీనం చేసుకుంది. దాని పేరు డెక్కన్ రేడియోగా మార్చారు. ఆకాశవాణి హైదరాబాదు కేంద్రంగా 1-4-1950 న ప్రసారాలు ప్రారంభించింది. అంటే విజయవాడ ఆకాశవాణి కేంద్రం(1-12-48) ప్రారంభించిన సుమారు రెండు సంవత్సరాల తర్వాతనే ఆకాశవాణి హైదరాబాద్ కేంద్రం ప్రారంభమయ్యింది.*''[6] ఈ విధంగా ప్రారంభమైన హైదరాబాద్ కేంద్రం వివిధ కార్యక్రమాలతో శ్రోతలను అలరిస్తూ ప్రాధాన్యతను సంతరించుకుంటూ వస్తుంది.

### 4.4. హాస్యరచనగా 'గణపతి':

చిలకమర్తి లక్ష్మీనరసింహంకి దృష్టిలోపం ఉన్నప్పటికి ఈయన నవలా సాహిత్యంలోనూ, నాటక సాహిత్యంలోనూ తెలుగు రంగంలో ఎనలేని కృషిని చేశాడు. గణపతి నవలను హాస్యనవలగా చిత్రీకరించారు. దీనిని రేడియో నాటకీకరణగా తర్వాతి కవులు మార్చి రేడియోలో ప్రసారం చేశారు. అయితే సహజంగా చిలకమర్తి లక్ష్మీనరసింహం ఏదైనా రచన చేసేటప్పుడు నాకనిపించిన మేరకు ఒక పాఠకుడిగానో శ్రోతగానో అనుభూతి చెందుతూ రాస్తాడనుకుంటాను. సరిగ్గా 'గణపతి' ఇటువంటిదే.

''తెలుగులో హాస్యరస ప్రధానమైన నవలలో దీనికోస్థానం ఉంది. అంతకు పూర్వం వచ్చిన వీరేశలింగం పంతులు గారి 'సత్యరాజ పూర్వ దేశ యాత్రలు' లో

---

[5]అనంత పద్మనాభరావు, ఆర్. రేడియో నాటకాలు చారిత్రక పరిశీలన,పుట:47.

[6] [6]రవీంద్ర త్రివిక్రమ్,కాటూరి. తెలుగులో శ్రవ్యనాటకాలు,పుట:13.

హాస్యం, వ్యంగ్యం మిళితమై ఉన్నాయి. 'గణపతి' తెలుగులో వచ్చిన మొదటి సంపూర్ణమైన హాస్యాత్మక నవల అని చెప్పుకోవచ్చు.''[7]

హాస్య నవలల్లో మొదటి స్థానాన్ని ఆక్రమించే రచన 'గణపతి' గణపతి పూర్వీకుల నుండి గణపతి తాత, గణపతి తండ్రి, గణపతి వీరు ముగ్గురు కూడా భిన్న కోణాలలో హాస్యాన్ని అందించారు. పాఠకులకి, ఇక గణపతి గురించి చెప్పవలసిన పనిలేదు. ప్రతి మాటలోనూ, అతను చేసే ప్రతి పనిలోను హాస్యంతో కూడుకుని ఉంటాయి.హాస్యనవలల్లో గణపతి నవల ప్రథమ స్థానాన్ని పొందింది. అజ్ఞానం,అహంకారం, అనారికత్వం, పేదరికం, ఇవి విడివిడిగా భరింప శక్యం కానివి ఈ నాలుగు లక్షణాలు మూసపోయిన వ్యక్తి గణపతి. ఆ పాత్రను తీర్చిదిద్దడంలో కృతకృత్యులయ్యారు.[8]

### 4.5. శ్రవ్యనాటకంగా 'గణపతి':

'గణపతి' నవలను శ్రవ్యనాటకంగా మార్చారు. ఈ నవల మొత్తం గంట వ్యవధిలో కూర్చారు.*రంగస్థలం మీద 2 గంటల వ్యవధికి వచ్చేవాటిని నాటకాలుగానూ, గంటలోపు వ్యవధి గల వాటిని నాటికలుగాను ఎలా పరిగణిస్తున్నామో, రేడియోలో గంట వ్యవధికి ప్రసారమయ్యే వాటిని నాటకాలుగాను, అరగంట, పావుగంట వ్యవధికి వచ్చేవాటిని నాటికలుగానూ పరిగణిస్తున్నా'*[9]

గణపతి శ్రవ్యనాటకంగా రేడియోలు ప్రసారమయ్యింది.నవలను నాటకంగా రేడియోకి అనుసరణ చేయడం కత్తిమీద సాములాంటిది. నవలలో ప్రధానంగా ఉండే ఇతివృత్తానికి అనువుగా సంభాషణలతో, సన్నివేశాలతో నాటకం రక్తికట్టించాలి. సుదీర్ఘమైన నవలను 60 నిమిషాల వ్యవధిలో రేడియోనాటకంగా మలచగల సామర్థ్యం ,సాధికారికత ఉండాలి. అందులో సుప్రసిద్ధమైన నవల చదివిన పాఠకులకు ఎక్కడా లోటు కనిపించకుండా నాటకం వినిపించాలి. అందుకు తీగపై నడిచే దొమ్మరిసాని నైపుణ్యం కావాలి. రేడియో కేవలం శ్రవ్యమాధ్యమం దానిని దృష్టిలో పెట్టుకుని గణపతి పాత్రను శ్రోతల కళ్ళకు కట్టేలా చేయగలగాలి.[10] ఈ విధమైన సూచనలు దృష్టిలో

---

[7]నాగభూషణ శర్మ, మొదలి.చిలకమర్తి లక్ష్మినరసింహం,పుట:13.

[8]అనంత పద్మనాభరావు,ఆర్. రేడియో నాటకాలు చారిత్రక పరిశీలన, పుట:46

[9]మూర్తి,డి.ఎస్.ఎన్.తెలుగు నాటక చరిత్ర –వివిధ రీతులు –పరిణామాలు,పుట:199.

[10]అనంత పద్మనాభరావు, ఆర్. రేడియోనాటకాలు – చారిత్రక పరిశీలన,పుట:46.

పెట్టుకుని చేసినప్పుడు శ్రోత అందులో ఆనందాన్ని పొందుతూ ఆసక్తిని పెంచుకోగలుగుతాడు.

### 4.6. గణపతి రేడియో నాటకం – హాస్య లక్షణాలు:

సృష్టిలో నవ్వకలిగే ప్రాణి మానవుడొక్కడే తన సంతోషాన్ని వ్యక్తం చేయగల శక్తి మానవుడికే ఉంది . నేడు ఆధునిక పద్ధతులతో సతమతమవుతున్న మానవుడు శారీరకంగానూ, మానసికంగానూ అలసట పొందుతున్నాడు. ఆ అలసట నుండి ఉపశమనం పొందడానికి, హృదయాహ్లాదాన్ని, సంతోషాన్ని కలిగించేది హాస్యం ఒక్కటే. మునిమాణిక్యం నరసింహారావు 'మనహాస్యం' అనే పుస్తకంలో హాస్య లక్షణాలను ఈ క్రింది విధంగా తెలిపారు.

1.వేషగత హాస్యం, 2.చేష్టాగత హాస్యం, 3.వాగ్గత హాస్యం

4.అసహజత్వం, 5.ఆశ్చర్యం , 6.సందర్భ శుద్ధిలేకపోవడం

7.అప్రియమును ప్రియముగా మలచుట, 8.అతిశయోక్తి.[11]

### 4.6.1. వేషగత హాస్యం:

హాస్యం పుట్టడానికి ముఖ్యంగా మూడు మార్గాలున్నాయి. వికృతమైన ఆకారం, వేషము, వికృతమైన చేష్టలు, వికృతమైన భాష. వీటి వలన హాస్యం పుడుతుంది. అంటే హాస్యం వేషగతం, చేష్టాగతం, భాషాగతం, అని మూడు విధాలు. వేషం వలన, చేష్టల వలన పుట్టే హాస్యం బాహ్యాంగాలకు సంబంధించింది. భావంలో ఉండే వికృతివలన పుట్టే హాస్యం ఆంతరంగిక విషయం. భావంలో కలిగే వికృతిని ప్రదర్శించడానికి భాష అవసరం. వికృతమైన వేషం వలన చేష్టల వలన నవ్వించడం సులభం.[12] ఈ విషయాన్ని బట్టి వేషధారణలోనూ మనం చేసే పనుల్లోనూ, మనం మాట్లాడే మాటల్లోనూ, బహిర్గతంగా, అంతర్గతంగా హాస్యం దాగి ఉంటుంది. గణపతి రేడియో నాటకంలో ప్రారంభంలోనే గణపతిని చూసి బడిలోని పిల్లలు కేకలు వేయడం, ఆ గణపతి రూపాన్ని వివిధ జంతువుల రూపంగా భావించడంలోనూ, గణపతి రూపురేఖలు వర్ణించిన తీరు. వారు వ్యక్తీకరించిన విధానం ప్రతి మాటకు హాస్యం పుట్టుకువస్తుంది. ఈ సన్నివేశాన్ని గమనిస్తే వికృతి ఆకారం వలన కలిగిన హాస్యం ఇందులో కనబడుతుంది.

---

[11]నరసింహారావు, మునిమాణిక్యం. మన హాస్యం,పుట: 5 –22.

[12]నరసింహారావు, మునిమాణిక్యం. మన హాస్యం, పుట:5.

గణపతి గాడిదను ఎక్కాలని నిశ్చయించుకుని రంగన్న సహాయంతో గాడిదను ఎక్కి దర్జాగా కూర్చుని రంగన్న ద్వారా తలపాగ, కట్టుకుని, నడుముకు ఎఱ్ఱగళ్ళ రుమాలు కట్టుకుని, నిప్పుతెప్పించుకుని చుట్ట వెలిగించి గాడిద మీద గుఱ్ఱపు స్వారి చేస్తాడు. ఇదంతా వేషాగతమైన హాస్యంగా ఉంటుంది. పిల్లలందరూ గణపతి గాడు గాడిదనెక్కి ఊరేగుతున్నాడురో అని నవ్వుతారు. ఇందులోనూ వేషాగతమైన హాస్యం కనబడుతుంది.

రంగడు కృష్ణవేషం వేసేవాడు వచ్చాడని గరుడాచలంతో చెప్పమనగా రంగడు వచ్చి గరుడాచలంతో చెప్తాడు. గరుడాచలం గణపతిని చూసి వీడా కృష్ణవేషం, ఓరి వీడి మొహం ఈడ్చ మెల్లకన్ను, మోరిచేతులు, దొడ్డి కాళ్ళు, గుంటు మొహం, వామనావతారం. కాటిక రంగు అని గణపతి రూపాన్ని తనలో అనుకుంటుంది. ఈ సన్నివేశంలో గణపతి ఆకారాన్ని వర్ణించిన తీరులో వేషగత హాస్యం ఉంది.

### 4.6.2. చేష్టగత హాస్యం:

వికృతమైన చేష్టల వలన హాస్యం పుడుతుంది. పాఠశాలల్లో విద్యార్థులు గురవులను ఏడిపించడం, చండ ప్రచండుడైన ఉపాధ్యాయున్ని పిల్లలు అల్లరి పనులతో అట పట్టించడం. చేష్టాగత హాస్యం కిందకి వస్తాయి.

గణపతి రేడియో నాటకంలో అటువంటి సన్నివేశాలు మనకు కనబడుతాయి. గణపతి చేష్టల్ని గణపతి మేనమామ సింగమ్మకు చెబుతూ నిన్న రాత్రి తిమ్మావజ్ఝల వారి దొడ్లో కొబ్బరి చెట్టెక్కి పిందెలతో సహా బోండాలన్ని రాల్చి పారేసింది ఎవరనుకున్నావ్ మన ప్రబుద్ధుడే. దానికి సమాధానంగా సింగమ్మ ఊరంతా ఎలుకలు పోగైనాయి అవే కొట్టేశాయేమో అంటుంది. అలాగే కరణం గారి వేరు శెనగ చేలు పాడుచేసి కాయలు కాజేసుకు పోయాడంట అని చెప్పగా దానికి ఇంకో కారణం చెప్తూ సింగమ్మ తమ్ముడోయ్ సర్కారు చాటింపు విన్నావా ఊళ్ళోకి ఎలుకలు గుంపులు గుంపులుగా వచ్చి పడ్డాయట, ఏ మొక్కను బడితే ఆ మొక్కను మొదళ్ళో కొట్టి పారేస్తున్నాయట అంటుంది. ఈ సంభాషణలో గణపతి చేష్టలను మేనమామ నాగన్న చెప్తాడు. గణపతి పనులలో చేష్టాగత హాస్యం చోటుచేసుకుంది. గాడిదనెక్కిన గణపతి ఊరంతా ఊరేగుతుంటే గాడిదకు పెట్టిన కళ్ళాన్ని అది కొరికేస్తుంది గాడిద పరుగులు

తీస్తుంది. గణపతి కింద పడుతాడు చుట్టు పక్కల పిల్లలందరు అతని పనులకు గణపతికి జరిగిన అవమానానికి నవ్వుకుంటారు.

### 4.6.3.ఆశ్చర్యం:

ఒక కథగాని ఒక ఉపన్యాసాన్ని కాని వింటున్నప్పుడు దాని పర్యవసానం ఇలా ఉంటుందని మన ఊహకు తడుతుంది. కథాంతంలో మనం అనుకున్న దానికి భిన్నంగా గాని, జరిగితే మనకు ఆశ్చర్యం కలుగుతుంది. గణపతి చేసే పనులకు కోపించిన నాగన్న వాడు కనబడితే చీరేస్తాను అంటాడు దానికి సింగమ్మ వాడు చిన్నవాడని చెప్తుంది. దానికి నాగన్న మైనార్టి కూడా తీరింది ఇంకా చిన్నతనమా అంటూ ఆశ్చర్యాన్ని వ్యక్తం చేస్తాడు.

### 4.6.4. వ్యంగ్య హాస్యం:

చెప్పదలచుకున్న భావాలను ప్రత్యక్షంగా కాకుండా పరోక్షధోరణిలో వ్యంగ్యంగా చెప్పడం. ఆ చెప్పడం కూడా హేళనతోకూడి ఉంటే వ్యంగ్య హాస్యం పుడుతుంది.సింగమ్మ నాగన్నతో తమ్ముడూ నా పసిబిడ్డ కుక్కముట్టిన కూడు తింటాడా అనగా మాచమ్మ వ్యంగ్యంగా అబ్బా పసిబిడ్డ పసి బిడ్డకు 18 ఏళ్లు దాటాయిగా అంటూ హేళనతో కూడిన సమాధానం వలన హాస్యం పుడ్తుంది. ఇదంతా వ్యంగ్య ధోరణిలో సాగుతుంది.

### 4.6.5.అజ్ఞానం:

ఎదుటి వారి మాటలను గుడ్డిగా నమ్మి వారు చెప్పిన విధానాన్ని అనుసరించడం అజ్ఞానం దాని వలన హాస్యం కలుగుతుంది ఒక్కొక్కసారి నవ్వులు పాలు కావలసిన పరిస్థితులు ఏర్పడతాయి.

గణపతి నాటకంలో గణపతి అజ్ఞానం హాస్యాన్ని పండించేలా ఉంటుంది. రాజమహేంద్రవరం వెళ్ళిన గణపతి అక్కడ ధరించిన జరీపుటచడావులు, పునహాకోటు, తలకు ఆ గిరజాలు ఎంత బాగున్నాయి. అంటూ మురిసిపోవడమే కాకుండా తాను కూడా తన జుట్టును పెంచుకోవాలనే కోరికతో తన స్నేహితుడు చెప్పిన ప్రకారంగా గుండుగీయించుకుని ఎవరికి తెలియకుండా ఆముదం రుద్దుతూ జుట్టు పెంచడానికి నానా అవస్థలు పడుతాడు. తెల్లారేసరికి జుట్టు పెరగనందుకు

చింతిస్తాడు. అజ్ఞానం వలన కలిగిన ఈ హాస్య సన్నివేశం శ్రోతకు ఆనందాన్ని కలిగిస్తుంది.

అలాగే మరో సన్నివేశంలో సింగమ్మ కొబ్బరి చెట్టు పిందెలు ఎలుకలు కొట్టేస్తున్నాయి అనగా గణపతి నేను ఉపాయం చెప్తనంటాడు.పిల్లి మెడకు తాడు వేసి చెట్టుకు వేలాడదీస్తాడు మహదేవశాస్త్రి వచ్చి అడుగగా నేనే మామయ్య నాఉపాయం ఎలా ఉంది అంటూ సంతోషాన్ని వ్యక్తం చేస్తాడు. ఎలుకలు చావలేదు పిల్లి చచ్చిందని మహదేవశాస్త్రి అన్నప్పుడు హాస్యం పుడుతుంది. ఇక్కడ గణపతి తెలివితక్కువ పనుల వలన హాస్యం జనిస్తుంది.

### 4.6.6. గ్రస్తము:

గ్రస్తము అని ఒక భాషణం ఉంది. అది ఒక వర్ణముగాని, పదము కాని లోపించగా ఏర్పడ్డ వాక్యం. ఇటువంటి వాక్యాలలో వర్ణలోప, వర్ణాగమములచే శబ్దము వికృతమై నవ్వు పుట్టిస్తుంది. ఇది అస్పష్టోచ్చిత పద ప్రయోగంలో ఒక లక్షణం.[13]

గణపతి రేడియో నాటకంలో పై లక్షణానికి సరిపడ సన్నివేశాన్ని గమనిస్తే గణపతి బడికి వెళ్ళనని మారంచేసేటప్పుడు నేను బడికి యెళ్ళనే, అని కొంచెం చిన్నగా తర్వాత కొంచెం గట్టిగా స్వరం పెంచి నేను యెళ్ళనే అనడం యెళ్ళనే దగ్గర వకార స్థానంలో 'య' కారం ఉపయోగించడం. గ్రస్తము అనే లక్షణానికి చెందిందిగా నేను భావిస్తున్నాను.

### 4.6.7. కవిత్వంలో అనిర్వచనీయం:

అనుభూతి ప్రధానమైన కవిత్వం ఒకటుంది. ఆ రకం కవిత్వంలో కవి ఏమి చెబుతున్నాడు అనే విషయం తెలియకపోయినా పద్యం ఏదో బాగుంది అనే అనుభూతి కలుగుతుంది. ఇదే కవిత్వంలో అనిర్వచనీయం[14]

ఈ లక్షణాన్ని గణపతి రేడియో నాటకంలో పరిశీలిస్తే గణపతి బడిపంతులుగా ఉన్నప్పుడు భద్రాచలం అనే విద్యార్థిని పద్యం చదవమంటాడు. ఆ విద్యార్థి నాకు పద్యం తెలుసు అర్థం తెలీదు అనగా గణపతి నేను చెప్తానంటాడు . ఆ

---

[13]నరసింహారావు, మునిమాణిక్యం.మన హాస్యం,పుట:70.

[14]నరసింహారావు, మునిమాణిక్యం.మన హాస్యం,పుట:67.

పిల్లవాడు శ్రీ రఘురామ చారు అంటూ చదవడం మొదలుపెడతాడు దానికి గణపతి చమత్కారంగా రాముడికి పైత్యం చేసిందని కరివేపాకు కరువని తులసి ఆకులు వేసి రసం కాచుకున్నట్టు తనకు తోచిన అర్థాన్ని చెబుతాడు. ఈ లోపు సింగమ్మ ప్రవేశించి రసంలో ఎవరైన మిరియాలు , ధనియాలు, ఇంగువ, కొత్తిమీర వేసుకుంటారు కాని తులసి ఆకులు వేసుకుంటారా అనడంతో పిల్లలంతా నవ్వుతారు.

ఈ పద్యంలో పద్యవివరణ తెలియకపోయినా తోచిన నిరర్థకమైన అర్థాన్ని చెప్పడం హాస్యలక్షణాలలో 'కవిత్వంలో అనిర్వచనీయం' అనే లక్షణం ఇందులో ఇమిడి ఉంది.

### 4.6.8. సందర్భశుద్ధిలేకపోవడం:

సందర్భశుద్ధిలేని ప్రసంగాలలో ఉండే వికృతి నవ్వుకు కారణం అవుతుంది.[15]

సింగమ్మ గణపతి అది స్కూల్ అన్న సంగతి మరచిపోయి సింగమ్మకు భర్త గుర్తుకు వచ్చి ఏడవడం గణపతికూడా వాళ్ళమ్మను అనుసరిస్తూ నాన్నా....అని ఏడవడం పాటలో పల్లవికి...కోరస్ ఇచ్చినట్లుగా నాకనిపించింది. ఈ సన్నివేశంలో పై లక్షణం సరిపోతుంది.

### 4.7. గణపతి రేడియో నాటకం– హాస్య నాటక లక్షణాల సమన్వయం:

1.హాస్యనాటకం మనుషుల్లో ఉండే లోపాల్ని పెద్దవిగా చేసి చూపుతూ వాటిని అవహేళన చేస్తుంది.[16] సహజంగా మనిషిలో ఉండే లోపాల్ని ఎత్తిచూపడం అంటే అది వారి వ్యక్తిత్వాన్ని దెబ్బతీస్తుంది. కాని హాస్యనాటకాల్లో ఈ లక్షణం హాస్యం జనించేట్లు చేస్తుంది. హాస్యనాటక లక్షణాల్లో హేళన చేయడం ఒకటి రేడియో హాస్యనాటకంగా ప్రసారమయినప్పుడు ఎదుట వారి బహిఃరూపం వర్ణించేటప్పుడు లేదా వారి అంతర్గత స్వభావాన్ని వేరే పాత్ర ద్వారా వ్యక్తంచేసేటప్పుడు హాస్యం పుడుతుంది.

---

[15]నరసింహారావు,మునిమాణిక్యం.మనహాస్యం,పుట:21.

[16] [16]నాగభూషణ శర్మ, మొదలి.నాటక శిల్పం. పుట:191

'గణపతి' నవల హాస్యనాటకంగా శ్రోతలకు ఎంతో వినోదాన్ని అందించింది. ఈ నాటక ప్రారంభంలోనే పిల్లలు కొండముచ్చు అని ఎలుగుబంటి అని ఒక రూపాన్ని వారికి వారే వర్ణించుకునేటప్పుడు నవ్వు పుడుతుంది. అయితే వీరు మాట్లాడిన సంభాషణ అంతా ఒక పాత్ర రూపాన్ని వర్ణించడం అని తెలిసిన వెంటనే మరింత హాస్యం పుట్టుకు వస్తుంది. ఈ సన్నివేశంలో అంతా అవహేళన ఉన్నాఅది హాస్యపూర్వకంగానే సాగుతుంది.

2. హాస్య నాటకాలు సాంఘిక, ప్రవృత్తి చేష్టలని గురించి చెబుతాయి.[17]

హాస్యనాటకం చూస్తున్నప్పుడు లేద రేడియో నాటకంగా వింటున్నప్పుడు హాస్యదృష్టితోనే చూస్తాము. ఆ నాటకం యొక్క ప్రధాన ఉద్దేశం హాస్యం పండించడమే అయినా సాంఘిక పరమైన విషయాలు చోటుచేసుకున్నాయి.'గణపతి' రేడియో నాటకంలో గణపతి తన తాత ప్రవృత్తిని వివరించేది హాస్యంగా ఉంటుంది. సంఘంలో కాటికాపరి చేసే వృత్తిని గణపతి తాత పాపయ్య చేస్తాడు. ఇది సంఘ ప్రవృత్తికి సంబంధించిన హాస్యంగా నేను భావిస్తున్నాను. అలాగే గణపతి తండ్రి గంగాధరం నీటి కావడులు మోసే పని సంఘసంస్కారమే అయినా ఆ సన్నివేశాలలోనూ హాస్యం కనబడుతుంది.

3. ఒక వ్యక్తి సంఘ నియమాన్ని ఉల్లంఘిస్తే అతన్ని హేళన చేస్తూ అతని తప్పిదాన్ని ఎత్తి చూపి బాగు చేసుకునే మార్గాన్ని చూపుతుంది హాస్యనాటకం[18]

హాస్య నాటకాల్లో హాస్య నాయకుడు తన తప్పులను తాను తెలుసుకునే ప్రయత్నం చేయడు. హాస్యనాయకుడు ఎదుటివారి తప్పులను హేళన పూర్వకంగా చెప్పించడమో లేద ఇతర పాత్రల ద్వారా తాను అవమానింపబడటం ఇలాంటి ఘట్టాలలో హాస్యం స్ఫురిస్తుంది.గణపతి రేడియోనాటకంలో గణపతి సంఘ నియమాన్ని ఉల్లంఘించే ప్రయత్నం ప్రత్యక్షంగా చూపించకపోయినా సంభాషణ ద్వారా తెలుస్తుంది. గణపతి బుచ్చమ్మను ఎత్తుకు వచ్చి పెళ్ళిచేసుకోవడం, మరలా తిరిగి మేనమామ బుచ్చమ్మకు వేరే పెళ్లి చేయడం రేడియో నాటక పరిధిని దృష్టిలో పెట్టుకుని ఆ సన్నివేశాలను సంభాషణల్లో కుదించారు. అయినప్పటికి బాల్య

[17]నాగభూషణ శర్మ, మొదలి.నాటక శిల్పం. పుట:191

[18]నాగభూషణ శర్మ,మొదలి. నాటక శిల్పం,పుట:192.

వివాహం అనేది సంఘవ్యతిరేకమైనా గణపతి విషయంలో అది హాస్యజన్యమైన ఒక సంఘటనగా రూపుదిద్దుకుంది.

4. సాంఘిక మానవుడి నిత్యజీవన సరళి హాస్య నాటకాలలో ప్రధాన కథావస్తువు. మనిషి అట్టహాసంగా ఉండడం,అత్యాశకు పోవడం అతి మూర్ఖంగా ప్రవర్తించడం అతి తెలివి కలవాడిననుకుని గోతిలో పడడం ఇటువంటివన్ని మానవ ప్రవృత్తిలోని సాధారణ లోపాలు హాస్యనాటకానికి జీవం పోస్తాయి.[19]

పై లక్షణాలన్ని మనం 'గణపతి' రేడియో నాటకంలో చూస్తాం. గణపతి గాడిద నెక్కి ఊరేగించేటప్పుడు ఆ గాడిద పిల్లల కేకలు విని పరిగెత్తినప్పుడు గణపతి క్రిందపడడం, గణపతి కోరికమితిమీరింది కావున ఇలా పరాభవింపబడి అందరికి హాస్యాన్ని అందించాడు.

గణపతి తన తల్లిని అవమానించడానికి చాకలివాడు రంగన్నతో కలసి ఆమెకు బలవంతంగా గుండుగీయించి తలమీద నిమ్మరసం రుద్ది నూరు బిందెల నీళ్ళు పోయించడం గణపతి మూర్ఖత్వానికి నిదర్శనగా అనిపించినా అక్కడక్కడా హాస్య ధోరణిలోనే ఆ ఘట్టం సృష్టించబడుతుంది.గణపతి తానే తెలివైన వాడినని అనుకుంటూ చెట్లమీద ఉన్న ఎలుకలబెడదను తొలగించే ప్రయత్నంలో పిల్లిమెడకు తాడు వేసి చెట్టుపైన కట్టేయడం అది ఉరి తీసుకున్న దానిలా చనిపోవడం గణపతి అతి తెలివికి తెలివితక్కువతనానికి ప్రత్యక్షసాక్షిగా నిలుస్తాడు. ఇలా గణపతి నాటకంలో చిన్నచిన్న లోపాలు కూడా హాస్యాన్ని ఉద్భవింప చేస్తాయి.

5. అతి లేద అతిశయోక్తి సర్వసామాన్య లక్షణం.అతి భక్తి భావం, అతి స్వార్థం, అతి లోభత్వం, అతి ఆత్మవిశ్వాసం, అతి స్త్రీ లోలత్వం అతి అనుమానం చక్కని హాస్యనాటక వస్తువులుగా చూపబడ్డాయి.[20]

'గణపతి' రేడియో నాటకం గణపతి చేసే ప్రతిచేష్ట అతిగానే ఉంటుంది. గణపతి గరుడాచలంతో కలసి కృష్ణుడి వేషం వేయగలననే అతి ఆత్మవిశ్వాసమే నాటకం చెడిపోవడానికి కారణమయ్యి అందరిని నవ్వుల ప్రపంచంలోకి తీసుకువెళ్ళంది. గణపతి తానే పిల్లలకు సరియైన విద్యను నేర్పగలననే ధీమాతో వెళ్ళి

[19]నాగభూషణ శర్మ,మొదలి. నాటక శిల్పం,పుట:192.

[20]నాగభూషణ శర్మ,మొదలి. నాటక శిల్పం,పుట:194

పిల్లలకు ఏమి చెప్పకపోగా వారిని శిక్షిస్తాడు. పిల్లలు వేసే ప్రశ్నలకు తల, తోకలేని సమాధానాలు చెప్తూ వారిని దారి మళ్ళించేస్తాడు. హాస్యంగా సాగిన ఈ సన్నివేశాలన్ని శ్రోతలను అలరింపచేస్తాయి.

6. హాస్య నాటక భాషలో కనిపించే మరోలక్షణం పొడుపు కథలు, ద్వంద్వార్థాలు వచ్చేమాటలు, ఒక మాట మీద ఇద్దరు, లేద ముగ్గురు పాత్రలు చేసే చమత్కార సంభాషణ మాటలతో చేసే చమక్కులన్ని హాస్యం పండించడానికి దోహదం చేస్తాయి.[21]

గణపతి రేడియోనాటకంలో అక్కడక్కడ పై లక్షణాలను గమనించవచ్చు. గణపతి చేష్టలను అతని మేనమామ చెప్తుంటే గణపతి తల్లి సింగమ్మ గణపతిని సమర్థిస్తుంటుంది. ఆ సమయంలో గణపతి మేనమామ ఆమె చెప్పే సమాధానాలకు పొంతనలేదని పరోక్షంగా చెప్తున్నట్టు ''కార్తిక మాసంలో వచ్చిన వాన గాలికి చైత్ర మాసంలో చెట్లకాయలు రాల్తాయా'' అంటాడు. గణపతి, సింగమ్మ మేనమామ ఇంట్లోంచి వెళ్లిపోతూ వారు చిల్లుపడిన సామానులను తీసుకెళ్ళేటప్పుడు అవే పెద్ద ఆస్తిగా భావించి వాటినే తన మేనమామ కాజేసుకుంటున్నాడని ఆ కొంపే కాలుతుంది అని చెప్తాడు.

గణపతి తన గిరజాలను పెంచుకోవడానికి ఆముదం కోసం ప్రయత్నించే సమయంలో రంగన్న సహాయం తీసుకుంటాడు. అతనిని అరవ వద్దని అతనికి దొడ్డి సంభావన పావలా తీసుకోమని చెప్తాడు. ఇక్కడ గణపతి సంపాదించింది ఏమి లేకపోయినా అతనికి పావలా ఆశ చూపడం ఒకటైతే దొడ్డి సంభావన అనడంలో తాను తప్పు దోవలో వెళ్ళి సంపాదించిన సంభావన అనే అర్థం కూడా ఇక్కడ కలుగుతుంది. ఈ విధంగా హాస్యనాటక లక్షణాలు గణపతి రేడియో నాటకానికి సమన్వయించద్గాయి.

### 4.8. గణపతి రేడియో నాటకం – శ్రవ్యనాటక లక్షణాలు సమన్వయం:

### 1.ధ్వని:

[21]నాగభూషణ శర్మ,మొదలి. నాటక శిల్పం,పుట:196.

గణపతి బడిలో చేరే సందర్భంలో బడికి వెళ్ళనని మారంచేస్తుంటాడు ఆ సమయంలోనే చక్....చక్ మని శబ్దం వస్తుంది. ఆ చప్పుడు గుట్టం శబ్దం అని తెలియడానికి గణపతి పాత్రద్వారా తెలయబడుతుంది. శ్రవ్య నాటక లక్షణాల్లో ధ్వని అనేది ఒకటి అది ఈ గుట్టం చప్పుడు దగ్గర ఉత్పన్నమయ్యింది.

మరో సందర్భంలో గరుడాచలం దగ్గర కృష్ణవేషం వేయడానికి కుదిరినతర్వాత గణపతి సంతోషంతో నావేషం చూసుకో అని చిటికేస్తాడు. చిటిక శబ్దం వస్తుంది. ఇది ధ్వనికి సంకేతం.

**2. చమత్కారం:**

చమత్కారమైన మాటలతో శ్రోతలను అలరించడం. శ్రవ్యనాటక లక్షణం. గణపతి రేడియోనాటకంలో కృష్ణవేషంగా గరుడాచలం దగ్గర వేయడానికి కుదుర్చకుని తన వేషధారణ ఈ రాత్రికి పేలిపోతుంది అంటాడు. గరుడాచలం ఆ మాటను చమత్కారంగా తీసుకుని నీ వీపా నావీపుకూడానా అని అంటుంది. ఈ చిన్ని సంభాషణలో మాటల్లోని చమత్కారాన్ని శ్రోత ఆనందిస్తాడు.

**3. ఇతివృత్తాన్ని వాచ్యరూపంలో వ్యాఖ్యానించటం:**

నవలలో సన్నివేశాలు సుదీర్ఘంగా ఉంటాయి. వాటినన్నింటిని రేడియో నాటకంగా కుదించాలంటే చాలా సమయం పడుతుంది శ్రోత కూడా విసుగుచెందే అవకాశం ఉంది కాబట్టి వాటిని సంభాషణ ద్వారా చెప్పించడం రేడియో నాటకంలో కనబడుతుంది.

గణపతి బుచ్చితో జరిగిన వివాహాన్ని శ్రోతకు వినిపించకుండా వివాహానంతరం సింగమ్మ, గణపతి మహదేవశాస్త్రి ఇల్లు చేరుతారు. మహదేవశాస్త్రి పాత్ర ద్వారా గుట్టు చప్పుడు కాకుండా గణపతికి బుచ్చినిచ్చి పెళ్లి చేసినట్టు, నాగన్న బుచ్చి తాళి తెంపి మారు పెళ్లి చేశాడని తెలుస్తుంది. ఈ వృత్తాంతాన్నంతా వాచ్యరూపంలో వ్యాఖ్యానించడం ద్వారా శ్రోతకు తెలుస్తుంది. ఇతివృత్తాన్ని వాచ్య రూపంలో వ్యాఖ్యానించడం రేడియో లక్షణాల్లో ఒకటి.

**4.9. 'గణపతి' రేడియో నాటకం–శ్రోత అనుభూతి:**

**4.9.1.గణపతి పాత్ర బడి ప్రవేశం పిల్లల అల్లరి.**

'గణపతి' రేడియోనాటకంలో మొదట సంగీతం వచ్చి పిల్లల కేకలతో నాటకం ప్రారంభమవుతుంది. ఏమిట్రా కేకలు ఇల్లెగిరిపోయేట్టు . ఒరేయ్ నాగేశు ఎందుకురా కేకలు అని మాస్టారు అడుగగా ఒక పిల్లవాడు ఆడది...ఆడది కాదండి ముసలమ్మ అంటాడు పంతులు ఏడ్చావులే ముసలమ్మంటే ఆడది కాదా...అంటాడు. ముసలమ్మ కొండముచ్చును వెంటబెట్టుకుని మన ఇస్కూల్ కేసి వస్తుందని ఒకడు కాదు, కాదు ఎలుగు బంటిపిల్లఅని మరొక పిల్లవాడు. కొండముచ్చు కాదండి ఎలుగుబంటి పిల్లండి లేచి నుంచోని, రెండు కాళ్ళమీద నడిచొస్తుందండి అని ఇంకో విద్యార్థి అంటాడు. మొదట పిల్లవాడు అన్ని అబద్దాలండి సత్యప్రమాణంగా అది కొండముచ్చేనండి నల్లగా కక్కుగొట్టిన తిరగ్రాయిలాగా మోహం, ఒళ్ళంతా నూగు, జానెడెత్తునంత పొట్టి మరుగుజ్జుతనానికి తగిన బొజ్జ అవునురా నాగేశు ఎలుగుబంటి పిల్ల కాదురా కొండముచ్చే దానికి మెల్లకన్ను కూడా ఉందిరోయ్ ఆ నుదుట మీద చూశావా కందిగింజ కాయంత పురిపిరికాయ్ ఎగురుకుంటూ నడుస్తుందిరా ఆ ముసల్ది. దాన్ని చెయ్యిపట్టుకుని నడిపిస్తోంది. ఒక పిల్లవాడు మాస్టరుతో కొండముచ్చని ఈ కిటికీలోంచి చూడండి అంటాడు. మరోపిల్లవాడు కొండముచ్చుకు వేరుశనక్కాయలు తీసుకురానా అంటే పిల్లలు నవ్వుతారు. మాస్టరు కిటికిలోంచి చూచి అది కొండముచ్చుకాదురా మనిషే పిల్లవాడ్ని మనబళ్ళో చేర్చడానికి తల్లి వెంటబెట్టుకుని తీసుకువస్తుంది.

పిల్లవాడు అది ఖచ్చితంగా కొండముచ్చేనని అది మనిషైతే మా తోట్లో నుంచి పది అరటికాయలు తెచ్చిస్తానని మాస్టర్ తో అంటాడు. మాస్టరు ఒరేయ్ నాతోనే పందెమా నల్లగా ఉంటే మాత్రం కొండముచ్చు అనుకుంటావా పాపం కుర్రాడు అమ్మవారు పడ్డాడు కావాల్నో మొహమంతా మచ్చలు పడ్డాయి. కొంచెం దొడ్డి కాళ్ళే అనుకో మరుగుజ్జు వాడేమో అసలే దానికి తోడు బొజ్జ అయితే మాత్రం కొండముచ్చు అయిపోతాడా అని అంటాడు. పై మాటలు మాస్టరు పిల్లలకు వివరించే తీరు హేళనగా చెప్పడం తెలుస్తుంది. దీని వలన హాస్యం ఉద్భవిస్తుంది. ఇది పరోక్షంగా హేళనాగతమైన హాస్యంగా అనిపిస్తుంది.

సింగమ్మ మీరేనా పంతులుగారు........అనగా మాస్టరు వీడు మీ అబ్బాయేనా....పేరేంటి అని అడగ్గా నాపేరు గణపతండి అన్నప్పుడు పిల్లలు

నవ్వుతారు. మాస్టర్ సింగమ్మను గణపతి పేరును అడిగేటప్పుడు హాస్యాన్ని ఆపుకుని దీర్ఘంగా అడిగినట్టు తెలుస్తుంది. అంటే గణపతి ఆకారం హాస్యం పుట్టించే విధంగా ఉంది. కనుక మాస్టరు స్వరంలో కూడా తేడా వచ్చిఉంటుందని నాకనిపిస్తుంది.మాస్టరు హాస్యాన్ని ఆపుకోగలిగాడు కాని పిల్లలు ఆపుకోలేరు కాబట్టి పక పక నవ్వారు..నాది దేవుడు పేరు అని గణపతి అనగా ఏహేయ్ అని నవ్వుతూ ఒకడు విఘ్నేశ్వరుడని, రెండో పిల్లవాడు వినాయకుడని, మూడో పిల్లవాడు లంబోదరుడురా అని హేళన చేస్తారు. గణపతి దేవుడి పేరు నాది అనడంతో పిల్లలు వినాయక స్వామికున్న పేర్లను సూచిస్తూ శ్రోతకు హాస్యాన్ని అందిస్తారు.గణపతి మాస్టరుతో మరే.....మరే మా నాన్న పేరు గంగాధరం. అని చెప్పడంలో సిగ్గు పడుతున్నట్టుగా అనిపించింది.

మా తాత పప్పుభోట్ల పాపయ్య పెద్ద ఉద్యోగం చేశానంటాడు. సింగమ్మ మామగారిని పునహాలో ప్రతివారు వచ్చి వారిని చేతులు పట్టుకుని బతిమాలి మరీ తీసుకెళ్ళేవారు అనగా మాస్టరు అబ్బా అంత పెద్ద ఉద్యోగం ఏమిటమ్మా అని అడుగగా గణపతి ఏముంది చచ్చిపోయిన వాళ్ళని మోసుకెళ్ళేవాడు సరదాగా మాతాత అంటాడు. విద్యార్థులు నవ్వుతారు.

పెద్ద ఉద్యోగం అనగానే, కలెక్టరో, కమీషనర్ లాంటి ఉద్యోగం అనుకుంటారు. గణపతి చెప్పిన సమాధానం ఎటువంటి వారికైనా నవ్వు పుట్టుకొచ్చేలా అనిపిస్తుంది. ఇది భావంలో జనించిన హాస్యంగా కనబడుతుంది.మాస్టరు గణపతి పుట్టిన తేది అడగ్గా వాడికేం తెలుస్తుంది. నేను చెప్తా అని సింగమ్మ వెంకన్నపంతులు తల్లిగారి నెలమాసికం నాడు అని, మన ఊళ్ళోకి గౌడగేదెలు అమ్మడానికి వచ్చాయే సరిగ్గా అదే రోజునండి. ఏడ్చినట్టే ఉంది అని మాస్టర్ అనగా కంచర కామాక్షి పశువుల పాక దహనం కాలేదటండి ఆ రోజేగా......అనగా మాస్టరు నా పిండాకూడు అంటూ పోని మీ అబ్బయికి ఎన్నేళ్ళో చెప్పమ్మా అంటే ఎన్నో ఏళ్ళు కూడానా వడుగయ్యి ఎనిమిదేళ్ళయ్యింది.

ఈ సంభాషణలో గణపతి సమాధానాలే కాకుండా సింగమ్మ సమాధానాలు కూడా హాస్యాన్ని ఉద్భవింపచేస్తాయి. సింగమ్మ రాగాలు తీసుకుంటూ సమాధానం ఇవ్వడం అనేది హాస్యం రెట్టింపయ్యేలా ఉందని నాకనిపించింది.

గంటల శబ్దం వినిపిస్తుంది. మాస్టరు బడి అయిపోయింది అంటాడు. మాస్టర్ గణపతి అని పిలవగా గణపతి పలికే 'యా' అనే శబ్దం నంగిగా ఇష్టం లేని భావంతో పలికినట్టు తెలుస్తుంది. తర్వాత గణపతి వాళ్ళమ్మతో అమ్మా నాకీ బడొద్దే ఇక్కడ దెయ్యాలుంటాయ్ అంటూ ఏడుపు మొదలు పెడతాడు. ఆ ఏడుపు బడికి వెళ్ళడానికి తప్పించుకోవడానికి ఏడ్చే దొంగ ఏడుపు లాగా అనిపిస్తుంది. ఈ నటన వల్ల హాస్యం ఉట్టిపడుతుంది.

### 4.9.2.రొట్టెను దొంగలించిన గణపతి–అత్త ఎత్తిపొడుపు మాటలు:

నాగన్న,సింగమ్మ మాటల్లోకి మాచమ్మ ప్రవేశించి నీ కొడుక్కి అల్లరితోపాటు ఆకలి పెరుగుతుంది అనడంతో సింగమ్మ నీ చేతుల్తోనే గా వడ్డించింది. అర్ధసేరు తినేవాడు పావుసేరు తింటున్నాడు. అనగా మాచమ్మ అదా...అంటూ దీర్ఘం తీస్తూ మీ అబ్బాయే చెప్పాడు. దూరపుబంధువు ఒక ముసలమ్మ ఇంటికి వెళ్ళి ఆమె రొట్టెలు వేసుకుంటుంటే ఆ రొట్టెలను చూసి నోరూరి కుక్క తాకిందని చెప్పి తిని వచ్చాడంట ఇలా అనిన తర్వాత ఒక చిన్న శబ్దం సెకన్ శబ్దం వస్తుంది. దీని తర్వాత అమ్మమ్మ, గణపతి మాట్లాడే సంభాషణ వస్తుంది. మరలా వారి సంభాషణానంతరం చిన్న మ్యూజిక్ వస్తుంది. అది ఫ్లాష్ బాక్ ను సూచిస్తుంది. పై సంభాషణలో మాచమ్మ, సింగమ్మ మాటల్లో ఎత్తిపొడుపు మాటలలో హాస్యం కనబడుతుంది. హాస్యలక్షణాల్లో ఎత్తిపొడుపు లక్షణం ఒకటి ఆ లక్షణం ఇక్కడ కనబడుతుంది.

### 4.9.3.గాడిద పై ఊరేగింపు : సమర్థించుకున్న గణపతి:

సంగీత విరామానంతరం చలపాయ్ అనే పిల్లవాడు రంగన్నా మా గణపతి కనబడ్డాడా అని అడగ్గా రంగన్న ఎవరూ...అని రాగాలు తీస్తూ కొండముచ్చులాగుంటాడు. ఆ సింగమ్మ కొడుకేనా అనగా ఇక్కడ రాగాలు తీస్తూ రంగన్న గణపతి రూపాన్ని వెక్కిరిస్తున్నట్టుగా చెప్పడం వలన హాస్యం పుడుతుంది. 'మ్' అని చిన్న గాండ్రింపు శబ్దం రావడంతో అది గాడిద అని తెలుస్తుంది. బట్టల మూటలు గాడిద మీద వేస్తున్నట్టు రంగన్న పాత్ర ద్వారా శ్రోతకు తెలియ జేస్తాడు. తనలో తాను మెల్లగా మనసులో అనుకుంటున్నట్టుగా శ్రోతకు తెలియడానికి బానని ఏటు ఒడ్డున పెట్టైత్తే . దీన్ని గట్టుకాడకి ఎట్లా వచ్చింది అనుకుంటూ ఉండగా ఆ బాన మెల్లగా కదిలిపోతుందని రంగన్న కొంచెం అనుమానంగా దానినే చూస్తూ దీని

కింద ఎవరైనా ఉన్నారా అనుకుంటూ అమ్మబాబోయ్ కొండముచ్చు  అని పెద్దకేక వేస్తాడు. కేక వేయడంతో రంగన్న భయపడినట్టు శ్రోతకు తెలుస్తుంది. వెంటనే ఓరి సింగమ్మ కొడుకా నువ్వా అని బళ్ళోకెళ్ళకుండా బాన కింద దాక్కున్నావా కాళ్ళుకట్టేస్తానుండు అంటాడు. ఈ సన్నివేశంలో రంగన్న స్వరంలో భిన్న మార్పులు వినిపించడం హెచ్చు తగ్గు స్వరాలతో ఉంటుంది.

గణపతి నాకు గాడిద ఎక్కాలనుందని అడుగుతాడు. రంగన్న ఇదేమి ఆశయ్య. ఎవరైనా గుర్రాన్ని ఎక్కుతారు కాని గాడిదను ఎక్కుతారా అనగా గణపతి నేను కలెక్టర్ అయినాక ఎలాగో గుర్రాన్ని ఎక్కుతాననుకో ఇప్పుడు గుర్రంతో పోలిస్తే గాడిద ఖర్చు చాలా తక్కువని గాడిదనెక్కుతాడు. నేను కలెక్టర్ అయినాక గుర్రన్నెక్కుతాననుకో అనడంతో హాస్యం కనబడుతుంది.

సంగీత విరామం వస్తుంది. తర్వాత మరొక పాత్ర ప్రవేశిస్తున్నట్టు శ్రోతకు అర్థమవుతుంది. సింగమ్మ అయ్యో...అయ్యో నాయనా  సట్టేమైనా  బెణికిందా ...అయినా గాడిదనెందుకు ఎక్కావురా సిగ్గుచేటు కాదు మనకు....గణపతి అమ్మా.....అమ్మా...అని మూలుగుతూ అమ్మా....నీ వొట్టి పిచ్చిముండవు గాడిదనెక్కితే తప్పేంటి కలిగినవాడు గుర్రమెక్కుతాడు లేనివాడు గాడిదనెక్కుతాడు అని చెప్పి కొందరి దేవుళ్ళ వాహనాలను వివరించి చివరకు నా పేరే పెట్టుకున్న గణపతి దేవుని వాహనం పందికొక్కు అని అంటాడు.

ఈ సంభాషణలో అమ్మా...అమ్మా అని గణపతి మూలగడంతో గణపతికి చెప్పకనే అతనికి దెబ్బలు తగిలాయని శ్రోతకు తెలుస్తుంది. ఇక కలిగినవాడు గుర్రం, లేనివాడు గాడిద అనడం హాస్యంతోకూడిన వాక్యవిన్యాసం. ఇందులో కనబడింది. చివర నా పేరే పెట్టుకున్న గణపతి వాహనం పందికొక్కు అనడం ఇతను దేవుని కన్నా గొప్పవాడని అనేటటువంటి భావంతో గణపతి వివరించిన తీరు శ్రోతలకు వినోదాన్ని అందిస్తుంది. సమయస్ఫూర్తితో వ్యవహరించడంతో ఆ సమయోచిత పదజాలం హాస్యానికి కారణమయ్యింది.

గణపతి చెప్పిన సమాధానానికి సింగమ్మ పొంగిపోతూ మా నాయనే మా అమ్మే ఎంత చదువు చదివావు పురాణాలన్ని నీ నోట్లోనే ఉన్నాయి. అని సింగమ్మ

అనడం గణపతికే నవ్వువస్తుంది. ఇక శ్రోత కూడా ఆ హాస్యాన్ని ఆస్వాదిస్తాడు. గణపతి ఆ అట్టారా దారికి అనేమాట ఇతనిలో విషయం ఏమిలేకపోయినా ఇతని మాటలకే సింగమ్మ మురిసి పోయినట్టుగా దానికి గణపతి నవ్వినట్టుగా నాకనిపించింది. మాచమ్మ ద్వారా నాగన్నకు గణపతి గాడిదనెక్కి ఊరేగించినట్టుగా తెలపడంతో నాగన్న వస్తున్న విషయం సింగమ్మ గణపతికి చిన్నగా మామయ్య వస్తున్నాడు వెళ్ళిపో అంటుంది. గణపతి అమ్మో మామయ్యే అని భయపడుతూ వెళ్ళిపోతాడు. నాగన్న కోపంతో గాడిదనెక్కి ఊరేగాడు వాడిని చీరేస్తాను అని అరవగా సింగమ్మ నాకు ఒక్కగాను ఒక్క కొడుకురా వాణ్ణి చంపకు నాయనో దిక్కుమాలిన వాళ్ళంతా కళ్ళల్లో నిప్పులు పోసుకుంటున్నారని వాళ్ళు నాశనమైపోతారని అంటుంది. ఈ సంభాషణలో ఎత్తిపొడుపు, శాపనార్థాలు కనబడుతాయి. సింగమ్మ ఏడుపు కూడా ఒక నటనలాగా అనిపిస్తుంది.

### 4.9.4.గిరజాలు పెంచడానికి ప్రయత్నాలు చేస్తున్న గణపతి:

గణపతి ఎవరూ చూడకుండా ఆముదంతో మర్దన చేసుకోవాలని తనలో తాను అనుకుంటూ ఉండగా మర్దన చేస్తున్న శబ్దం వస్తుంది. ఆ శబ్దానికి రంగన్న కర్రేది, కుక్క వచ్చినట్లుంది. అనగానే గణపతి అరవబోకు నాకు దొడ్డి దారిన వచ్చిన సంపాదనలో పావలా పుచ్చుకో అంటాడు. ఈ సంభాషణలో కుక్క అనగానే ఫక్కున నవ్వు వస్తుంది. అప్పటికే గణపతి తనలో తాను అనుకుంటూ గిరజాలు రావడానికి తలకు మర్దన చేసుకుంటున్నట్లు గా తెలిసి ఉంటుంది. రంగన్న కుక్క వచ్చింది అనగానే గణపతినే కుక్క అనుకున్నట్లుగా అనిపించి నవ్వు వస్తుంది. ఈ సన్నివేశంలోనే గణపతి రాజమహేంద్రవరం వెళ్ళి వస్తున్నట్లు తెలుస్తుంది.

### 4.9.5.సింగమ్మ గణపతికి వివాహం చేసే ప్రయత్నం:

సంగీత విరామం వస్తుంది తర్వాత సింగమ్మ పాత్ర ప్రవేశిస్తుంది. సింగమ్మ నేను గంగాలమ్మకు ముడుపు కట్టుకోవడం వలనే నీకు ఆడపిల్ల కలిగింది. గణపతికిచ్చి పెళ్ళి చేయమనగా ఏం చూసి ఇవ్వాలి అని అంటాడు నాగన్న. సింగమ్మ వారం రోజులు చూడు వాడికి గిరజాలు పెరుగుతాయి. రాజమహేంద్రవరం నుంచి

చదావులు కూడా తెచ్చుకున్నాడు. ఇక పట్టు కోటు ఉంటే కలెకటేరుగా ఉంటాడు అని అంటుంది. ఇక్కడ సింగమ్మ మాటల్లో గిరజాలే ఆస్తి అనేటటువంటి భావం స్ఫురించడం శ్రోతకు నవ్వువస్తుంది.

సింగమ్మ మనబుజ్జి గణపతిని ఇష్టపడుతుంది కనక అడిగాను అని చెప్పగా నాగన్న ఏడాది పిల్లకు నీ బిడ్డ మీద మమకారమేమిటని అంటాడు. దీన్ని బట్టి శ్రోతకు గణపతికి, పాపకు వయసులోఉన్న వ్యత్యాసం నాగన్న ద్వారా తెలుస్తుంది. సింగమ్మ మాచమ్మతో ఎందుకే వాడిని ఆడిపోసుకుంటావ్ అని ఓపట్టుకోటు కొన్నడాంటే నువ్వే వాడ్ని చేసుకుంటావని అంటుంది. నాగన్న నీ దుంపతెగ నీకేం పోయేకాలమే నాపెళ్ళాన్ని చేసుకోమనడానికి అంటాడు . ఇక్కడ సింగమ్మ అమాయకత్వం, కొడుకు మీద ప్రేమ ఈ చిన్న సంభాషణలోనే శ్రోతకు తెలపడం వలన హాస్యం జనిస్తుంది.

సంగీత విరామం తర్వాత మాచమ్మ, నాగన్న సంభాషణలో మాచమ్మ మన బుచ్చిని గణపతికిస్తే నేను ఏనుయ్యో గొయ్యో చూసుకుంటానని అంటుంది. నాగన్న నేను మాత్రం కన్నబిడ్డ గొంతు కోస్తానా ఏదో సింగమ్మక్క ఏడుస్తుందని చూద్దాంలే అంటాడు. ఇక మాచమ్మ గణపతి అందంగా కూడా లేదు పైగా నల్లగా ఉంటాడు, చుట్టలు కాలుస్తాడు అని చెప్పి మొన్న ఏంజరిగిందంటే అనడంతో ఒక చిన్న టింగ్ అనే శబ్దం వస్తుంది. అర్ధరాత్రిలో గణపతి మాచమ్మను అన్నం పెట్టమంటాడు. ఆమె అబ్బా ఇంతటైమందని నిద్రలోంచి లేసి వడ్డించి తిన్న తర్వాత లోపల పడేయమనగా గణపతి నీ పని చెప్తా అంటూ బయట వెళ్ళి మహదేవశాస్త్రిని పిలిచి ఏనుగుకు పెట్టినట్లు పెట్టిందని అవమానపాలు చేస్తాడు. మరలా టింగ్ అనే శబ్దం వచ్చిన తర్వాత ఇలా చేశాడండి అనడం వలన ఇది ఫ్లాష్ బాక్ లాగా అనిపించింది. ఏం జరిగిందంటే అన్నప్పుడు వచ్చిన శబ్దం నుండి మరలా చిన్న శబ్దం వచ్చి ఇలా చేశాడండి అన్నప్పుడు వరకు మధ్యజరిగిన సంభాషణ ఫ్లాష్ బాక్ అని శ్రోతకు తెలుస్తుంది. పై సంభాషణలో స్వార్థం, అసూయ భావాలు వ్యక్తమవుతాయి.

సంగీత విరామం వస్తుంది. సింగమ్మ, గణపతి మహదేవశాస్త్రి ఇల్లుచేరుతారు. మహదేవశాస్త్రి పాత్రద్వారా గుట్టు చప్పుడు కాకుండా గణపతికి బుచ్చినిచ్చి పెళ్ళి చేసినట్టు, నాగన్న బుచ్చి తాళితెంపి మారుపెళ్ళి చేశాడని తెలుస్తుంది. ఈ

వృత్తాంతాన్నంతా వాచ్యరూపంలో వ్యాఖ్యానించడం ద్వారా శ్రోతకు తెలుస్తుంది. ఇతివృత్తాన్ని వాచ్యరూపంలో వ్యాఖ్యానించడం రేడియో లక్షణాల్లో ఒకటి.

### 4.9.6.గణపతి ఉద్యోగ ప్రయత్నాలు:

గణపతి గర్వంగా కొద్ది రోజుల్లో ఎలాంటి ఉద్యోగం చేస్తానో చూద్దువుగాని అంటాడు. గణపతి స్వరం ఆవేశంతో మాట్లాడుతున్నట్టు తెలుస్తుంది.గణపతికి మహదేవశాస్త్రి వంట మనిషిగా ఉద్యోగం చేరుస్తాను అంటున్నప్పుడే లొట్టలు వేస్తాడు గణపతి. సంగీత విరామం వస్తుంది. గణపతి వడ్డించేటప్పుడు ఓవర్ సీన్ ఏమిటి ఈ కూర అని అడగ్గా ఇదా ఉప్పులో పప్పు వేసి వండమన్నారు వండాను. ఉప్పులో పప్పుకాదు పప్పులో ఉప్పు వేయాలి అనడంతో నవ్వు వస్తుంది. ఏమిటింత చేదుగా ఉంది. ఈ పుల్ల ఏమిటి అని అడగ్గా అదా గరిట మరచిపోయాను చెట్టెక్కి పుల్లకోసి ఈ పుల్లతో కలియబెట్టాను అంటాడు. అది వేపపుల్లని అనగా వేపపుల్లతో పళ్ళుతోముకోరా , వేపపూవు తినడం లేదా అని తల తిక్క సమాధానాలతో శ్రోతలకు నవ్వువస్తుంది. గణపతి వంట మనిషి ఉద్యోగం మానేస్తాడు.

మహదేవయ్య పప్పుభొట్లవారింట్లో పుట్టినందుకు మీ అమ్మను దాటేయాలిగా అంటే గణపతి నేను మంచి ఉద్యోగం వెతుక్కున్నాను. గరుడాచలం పక్కన కృష్ణుడు వేషం వేసినవాడు నా బొందలాగా ఉన్నాడు. నేను గనక ఆ వేషం వేస్తే నా అందం, నాదర్జా ఎంత బాగుంటుంది. గోపికలంతా నా చుట్టూ మూగుతారు అంటాడు. దానికి మహదేవశాస్త్రి ఛీ...ఛీ గరుడాచలం పక్కన వేస్తావా అని ప్రశ్నించగా విష్ణుమూర్తి మోహినీ వేషం కట్టలేదా నేను వేస్తే తప్పేంటి అని సమర్థించుకుంటాడు. ఈ సన్నివేశంలో గణపతి ఆలోచనలకు నవ్వు వచ్చేలా ఉన్నా అంతో ఇంతో వాస్తవం లేకపోలేదు. అర్థవంతమైన వాక్యాలతో ఈ సంభాషణలో గణపతి సమర్థించుకోవడం కూడా అతను అజ్ఞాన,జ్ఞానా అనే శ్రోతలను అయోమయంలో పడేస్తుందని నా కనిపించింది. అర్థవంతమైన వాక్యాలతో చక్కటి సంభాషణను కుదించడం రేడియో లక్షణాలలో ఒకటి.

నేపథ్యసంగీతం వస్తుంది ఈ సంగీతం వింటూ ఇక నాటకం గురించిన ప్రస్తావన వస్తుందనే భావం కలుగుతుంది. రంగడు కృష్ణమూర్తి వచ్చాడు గరుడాచలంతో చెప్పమనగా రంగడు వచ్చి గరుడాచలంతో చెప్తాడు. గరుడాచలం

గణపతిని చూసి వీడా కృష్ణవేషం ఓరి వీడి మొహం ఈడ్చ, మెల్లకన్ను, మోరిచేతులు, దొడ్డికాళ్ళు, గుంటు మొహం వామనావతారం. కాటిక రంగు అయ్యో నాకర్మ కాల అని ఆమె స్వరం తగ్గించి మాట్లాడటంతో తనలో తాను అనుకుంటున్నట్టుగా శ్రోతకు తెలుస్తుంది. అయితే వీడు చక్కటి హాస్యానికి పనికి వస్తాడని భావించి మీరు దొరకడం నా అదృష్టం అని మధురమైన స్వరంతో గణపతికి చెప్పడంతో గణపతి ఉప్పొంగిపోతాడు గణపతి గరుడాచలాన్ని సంప్రదించకుండా నేనే కృష్ణుడు అని అనుకోవడం హాస్యాన్ని కలిగిస్తుంది. గణపతిని మెప్పించడానికి ఆమె లోపల ఇష్టంలేకపోయినా మీ అందమేమి మీ చందమేమి అంటూ గణపతిని ఆకట్టుకోవడంలో ఆమె చాకచక్యం తెలుస్తుంది.

నేపథ్య సంగీతం వస్తుంది. నాటకం ప్రారంభమైనట్టు సూచకగా ఈ నేపథ్య సంగీతం ఉంటుంది. తర్వాత గణపతి శ్లోకానికి అనుగుణంగా హార్మోని శబ్దం వస్తుంది. సత్యభామ వేషం వేసిన గరుడాచలం విరహాన్ని భరించలేకున్నాను కృష్ణుని తీసుకురండనగా గుర్.....గుర్...అనే శబ్దం వస్తుంది. ఈ లోపు రంగడు సింగమ్మ కొడుకా అని నిద్రలేపుతుంటాడు ఈ లోపు ప్రేక్షకులు ఏడి నీ కిష్టమూర్తి అని అనగానే సత్యభామ సమయస్ఫూర్తితో కృష్ణుడు రాత్రంతా గోపికలతో అలసిపోయి కునుకు తీస్తున్నాడేమో సమర్థించుకుని రంగన్నను మేల్కొల్పమని చెప్తుంది. కృష్ణుడు వేషం వేసిన గణపతి ఆవలిస్తూ లేవగా గరుడాచలం(సత్యభామ వేషం) మీ పేరేమిటి, మీ ఊరేమిటి ఈ సభాసదులకు కొంచెం వివరిస్తారా అనగానే గణపతి నా ఊరు మందపల్లి, నా పేరు గణపతి మా ఇంటి పేరు పప్పుభొట్ల వారు అనడంతో అందరూ నవ్వుతారు. నాటకం చెడుతుంది. గణపతి పారిపోతాడు. హ హహఅనే శబ్దంతో అందరూ నవ్వుకుంటారు. ఈ సంభాషణలో ఈ నాటకంలో గరుడాచలం కళ్ళకు కట్టేలా నాటకం రక్తికట్టించింది విరహంతో వేచిచూస్తున్నాను అనడం ఆమె మాట తీరులో, మీ పేరేమిటి, మీఊరేమిటి అనడంలోఆమె వాక్ సౌందర్యం కనిపించింది. గణపతి చెప్పిన సమాధానానికి హాస్యం కనబడుతుంది. గణపతి వలన నాటకం చెడిపోయినా గణపతి నిద్రపోతున్న గురక శబ్దాన్ని చక్కగా వ్యక్తీకరించడంతోనే శ్రోతకు హాస్యం పుట్టుకు వస్తుంది. ఇక్కడ గుర్ అనే శబ్దం ధ్వనికి సంకేతంగా ఉంది.

గణపతి శ్లోకంతో ప్రారంభమైన ఈ నాటకాన్ని ఈ గణపతి ద్వారా చెడిపోవడం హాస్యం తెప్పిస్తుంది.

సంగీత విరామానంతరం మహదేవశాస్త్రి ఊరిలో బడి లేక పిల్లలు చెడిపోతున్నారు. పిల్లలకు పాఠాలు చెప్పి దారిలో పెట్టమని చెప్పగా దానికి అంగీకరిస్తాడు గణపతి. సింగమ్మ పిల్లలని భయభక్తులతో ఉండేలా చూడమని సలహా ఇస్తుంది. గణపతి ఆడదానివి బయటకు వస్తావా పో అని కొట్టిన శబ్దం వస్తుంది. పిల్లలకు భయం పెట్టమంటే తల్లినే కొట్టి భయపడించడం నవ్వు తెప్పిస్తుంది.

### 4.9.7.తల్లిని బాధించిన గణపతి:

సంగీతవిరమానంతరం గణపతి రంగడు ఇటురా మా అమ్మకు పిచ్చెత్తింది కన్నతల్లి రుణం తీర్చుకోవాలనుకుంటున్నాను. కాళ్ళుచేతులు కట్టేసి, బుర్రమీద చురకత్తిపెట్టి మాడు చీరుస్తాను నువ్వు ఇదిగో నిమ్మకాయలు తెప్పించి ఆరే కొద్ది రుద్ది నూరు బిందెల నీళ్ళు పోయాలి. అనగా దానికి రంగన్న మొదట సంకోచంగా గణపతి నాకు కూడా బాధగా ఉందని ఏడుస్తాడు. ఆ ఏడుపు నటనగా అనిపిస్తుంది. శ్రోతకు రంగన్న అంగీకరించి సింగమ్మకు ఆ పని చేస్తాడు. గణపతి నన్ను ఇక ఎవరూ పట్టుకోలేరని వెళ్ళిపోతారు. ఇతరులను బాధించడంలో కూడా హాస్యం తెప్పించగలిగాడు గణపతి.

మహదేవయ్య సింగమ్మ కట్లు ఇప్పి గణపతి పిల్లవాడ్ని చావబాదినందుకు పిల్లవాడి తండ్రి గణపతిని వెతుక్కుంటూ వచ్చాడని అనగానే అప్పటి వరకు గణపతి తనను పరాభవించిన విషయాన్ని మరచిపోయి సింగమ్మ కొడుకు మీద ప్రేమతో నా కొడుకుని ఎలాగైనా బ్రతికించమని ఏడుస్తుంది. ఆమె మూర్ఖత్వం కూడా హాస్యాన్ని తెప్పించేలా ఉంటుంది.

బాధాకరమైన సంగీతం వస్తుంది. సింగమ్మ బాధతో అబ్బాయి జాడ ఏమైనా తెలిసిందా అని మహదేవన్నయ్యను అడుగగా చెరువులు, నూతులు వెతికాను. ఎక్కడా కనబడలేదనగా సింగమ్మ నాబిడ్డ లేకుండా ఎలా బ్రతకాలని విలపిస్తుంది.

### 4.9.8.పారిపోయిన గణపతి: కాశికి వెళ్ళిన సింగమ్మ:

మహదేవశాస్త్రి మడితోనే ఉన్నావుగా అటకమీదనున్న ఆవకాయ తీయమనగా సింగమ్మ పై కెక్కిన వెంటనే గుర్రుమని శబ్దం వస్తుంది అనగానే మహదేవశాస్త్రి

ఊరంతా కొండముచ్చులే అటకమీద చేరాయిలే అని అంటాడు. సింగమ్మకు గు్రు గు్రు మని నామీదే దూకడానికి వస్తుందని సచ్చానయ్యో అని భయపడుతూ చెప్తుంది. ఆమె చేతిలో ఉన్న కిరోసన్ బుడ్డితో ఇల్లు అంటుకుంటుంది. దీనితో మహదేవశాస్త్రి పాత్రద్వారా ఇల్లు తగల బడుతున్నట్టు కొండముచ్చు దూకి పారిపోతున్నట్టు కొండముచ్చు కాదు గణపతి అని తెలుస్తుంది. అందరి కేకలు వినబడుతాయి. ప్రాణాలతో బయటపడ్డాం పదా అని వెళ్ళిపోతారు.

మహదేవశాస్త్రి నా కొంపకాలిపోయింది అని బాధపడ్తుంటే సింగమ్మ నా కొడుకు నాకు లేకుండా పోయాడని బాధపడ్తుంది. మహదేవశాస్త్రి మేము కాశికి పోతున్నాము అనగానే గణపతి లేని బ్రతుకు నాకెందుకు నేను మీతోనే వచ్చేస్తాను అంటుంది. మహదేవశాస్త్రి ఋణానుబంధరూపేణ పశుపత్ని సుతారులు' పదండి అనడంతో నాటకం ముగుస్తుంది.

ఇక్కడ బాధాకరమైన సంగీతం రావడం సింగమ్మ గణపతి గురించి బాధపడటం నేపథ్య సంగీతంలాగా అనిపించింది. సింగమ్మ అటక మీదకెక్కిన వెంటనే గు్రు మని శబ్దం రావడంతోనే అతను గణపతే అయి ఉంటాడనే భావం సూచన ప్రాయంగా కన్నతల్లి నోటితోనే తెలుస్తుంది. మహదేవ శాస్త్రి ఆయన కొంప కాలిపోయిందని బాధపడ్తుంటే ఈమె నాకొడుకు కనిపించడంలేదని బాధపడడం హాస్యంగా ఉంటుంది. ఇది ఎలా ఉందంటే ఇల్లు తగలబడుతుందని ఒకడు బాధపడుతుంటే ఇంకొకడు చుట్టవెలిగించుకోవాలని అడిగినట్టుగా అనిపిస్తుంది. ఋణాను బంధరూపేణ అనడం నాటకానికి భరత వాక్యంగా నిలుస్తుంది.

## 4.10. శ్రవ్యనాటక లక్షణాలు:

శ్రవ్య నాటకాలను రచించేటప్పుడు ముఖ్యంగా కొన్ని లక్షణాలను దృష్టిలో పెట్టుకుని రాయాలి. శ్రవ్యనాటకమనేది కళ్ళతో చూడకపోయినా, అంధుడికి ఏవిధంగా అయితే దృశ్యాన్ని వ్యక్తీకరిస్తామో ఆ విధంగా కళ్ళముందు జరిగేటటువంటి అనుభూతిని కలుగజేస్తే నూటికి నూరు పాళ్ళు శ్రవ్య నాటకం నిలబడుతుంది.

- రేడియో అతి సన్నిహిత మాధ్యమం
- రేడియో నాటకం పరిధిలో పరిమితి చిన్నది.
- మామూలు నాటకంలాగా అంక రంగ విభజనలు ఉండవు.
- బహుపాత్రల ప్రత్యేక అస్తిత్వాన్ని నిరూపించడం కష్టం
- వాతావరణం చూపడంలో మెలకువ అవసరం
- శ్రవ్యేంద్రియ ప్రాముఖ్యాన్ని గుర్తించి అందుకు అనుగుణంగా శ్రవ్యనాటక ప్రసారాలు జరగాలి.
- రేడియో నాటకం ఆదర్శ నాటకం, మనోనాటకం
- ఇంటిలోపల, బయట, జరిగే సన్నివేశాలకు రేడియో నాటిక చక్కని మాధ్యమం
- ధ్వని విశేషాల ప్రాముఖ్యం
- వాచిక ప్రాధాన్యత
- రేడియో నాటకంలో సంగీత ప్రాధాన్యం.

ఈ లక్షణాలను మొదలి నాగభూషణశర్మ 'నాటక శిల్పం'లో వివరించారు.[22]

'' ప్రతి పాత్రలోకి పరకాయ ప్రవేశం చేయాలి.

ఊర్పులు, నిట్టూర్పులు, కోపాలు తాపాలు, ఆవేశకావేషాలు, అవసరమైన చోట తన గొంతులో పలికించగలగాలి''. అని డి.ఎస్.ఎన్ మూర్తి 'తెలుగు నాటక చరిత్ర వివిధ రీతులు– పరిణామాలు' అనే పుస్తకంలో వివరించారు.[23]

వాస్తవ భ్రాంతిని కల్పించుట కొరకు గాలి, వాన, రైలు, నడక, తలుపు చప్పుడు మొదలగు ధ్వనులను సమయోచితంగా కల్పించుట కూడా శ్రవ్య రూపక ప్రయోగమునకు వన్నెపెట్ట కలదు.[24]

## 4.11. వేయిపడగలు రేడియో నాటకం – శ్రవ్యనాటక లక్షణాల సమన్వయం:

### 1. రేడియో అతి సన్నిహిత మాధ్యమం[25]

---

[22]నాగభూషణ శర్మ,మొదలి. నాటక శిల్పం.పుట: 235–239.

[23]మూర్తి, డి.ఎస్.ఎన్. తెలుగు నాటక చరిత్ర వివిధ రీతులు – పరిణామాలు, పుట:204,205.

[24]శ్రీరామ అప్పారావు,పోణంగి, తెలుగు నాటక వికాసం.పుట:497

[25]నాగభూషణ శర్మ,మొదటి.నాటక శిల్పం.పుట: 236.

రేడియో నాటకం శ్రోత మనోభావాలకు దగ్గరగా ఉంటుంది. రేడియో నాటకంలో సంభాషణను వ్యక్తపరిచే తీరు వారి మాటలు, శ్రోతకు ఒక మిత్రుని వలె పక్క నుండి చెప్తున్నట్టు గ్రహిస్తాడు. పాత్ర సంతోషం వ్యక్తం చేస్తే శ్రోత చిరునవ్వుతో ఆ ఆనందాన్ని ఆస్వాదిస్తాడు. పాత్ర బిగ్గరగా ఏడిస్తే శ్రోత కళ్ళలోనూ నీళ్ళు కనబడుతాయి.

వేయిపడగలు రేడియో నాటకంలో రాణిగారు చనిపోయినప్పుడు దాసి ఏడ్చే ఏడుపు ఆమె స్వరం శ్రోత మనసులో స్పందన కలుగజేస్తుంది. అలాగే కిరీటి తన తల్లి చనిపోయిందనే బాధను వ్యక్తం చేస్తూ ఏడ్చేవిధానం అతను సొమ్మసిల్లి పడిపోవడం శ్రోతకు ఆత్రుతను కలుగజేస్తాయి. జమిందారుల గాంభీరత్వం వారి గొంతులోని స్పష్టతను శ్రోత చక్కగా ఆస్వాదించగలుగుతాడు. తాను జమిందారి ఠీవిని పొందాలనే స్పృహ శ్రోతలో ఉదయిస్తుంది.

### 2. రేడియో నాటకం పరిధిలో పరిమితిలో చిన్నది.[26]

రంగస్థల నాటకాల వ్యవధిలో పోలిస్తే రేడియో నాటకం సమయం తక్కువ రేడియో నాటకాలు గంట వ్యవధిలో సాగడం పరిపాటి అయితే పెద్ద నవలలను రేడియో నాటకంగా మార్చేటప్పుడు గంట సమయంలో ఇతివృత్తాన్నంతా కుదర్చడం చాలా కష్టమైన పని అందువలన సీరియల్ గా చేయడం శ్రేయస్కరం దీనినే ధారావాహిక నాటకంగా చెప్పవచ్చు.

వేయిపడగలు రేడియో నాటకం ధారావాహికంగా ప్రసారమయ్యింది. ఇతి వృత్తం చెడకుండా, శ్రోతల మనోభావాలను దెబ్బతీయకుండా వేయిపడగల నవలలోని వృత్తాంతాన్ని ప్రజలందరూ వినోదభరితంగానూ, అందులోని ధార్మికతను తెలుసుకునే విధంగానూ ఈ వేయిపడగల రేడియో నాటకం చక్కగా ఉపయోగపడుతుంది.

### 3. మాములు నాటకంలాగా అంక రంగ విభజనలు ఉండవు[27]

నాటకంలో అయితే అనేక రకాల సన్నివేశాలను, ఘట్టాలను, అంకాలుగానూ ,రంగ విభజనలుగా చేయడం పరిపాటి. రేడియో నాటకంలో ఆ సౌలభ్యం

[26]నాగభూషణ శర్మ,మొదటి.నాటక శిల్పం.పుట: 236.

[27]నాగభూషణ శర్మ,మొదటి.నాటక శిల్పం.పుట: 237.

లేకపోవడం కొంత ప్రజలకు విసుగు చెందించే విషయమే అయినా చాకచాక్యంగా అటువంటి లోటును తీర్చిదిద్దడానికి. రేడియో నాటకంలో నేపథ్యసంగీతంతోనూ, సంగీత విరామాలను ఏర్పరచడం జరుగుతుంది.

'వేయిపడగలు' రేడియో నాటకంగా వచ్చినప్పుడు అందులో అనేక సన్నివేశాలు ఉంటాయి. వాటిని విరామం లేకుండా ప్రసారం చేయడం ద్వారా శ్రోతలకు విసుగు, చిరాకు కలిగే అవకాశం ఉంది. రేడియో నాటకం వినడం అనేది శ్రోత ఆలోచనా విధానానికి చెందింది. కావున సన్నివేశాలకు, సన్నివేశాలకు మధ్య సంగీత విరామాన్ని సూచించడం మంచిది. ఈ వేయిపడగలు నాటకంలో జరగబోయే సంఘటనలను నేపథ్యసంగీతం ద్వారా తెలియజేయబడ్డాయి. ఇద్దరి పాత్రల సంభాషణలో ఒక వ్యక్తి స్వభావాన్ని తెలియజేసి మరలా ఇతర పాత్రలు ప్రవేశించే ముందు సంగీత విరామం రావడం గమనించాను.అంటే ఇందులో ప్రధానంగా అంక,రంగ విభజనలను సంగీత విరామంతో సూచించడం గమనించదగిన విషయం. ఈ వేయిపడగల నాటకంలో ప్రతి సన్నివేశానికి సంభాషణ అనంతరం సంగీత విరామం సూచించడం ఉంటుంది. ఒక్కోసారి ముందు పాత్రల సంభాషణలోని విషయం తర్వాత జరగబోయే సంఘటనలకు సంగీత విరామం సూచించబడ్డాయి.

వేయిపడగల నాటకం ప్రారంభంలోనే నాగస్వర సంగీతం, గుడిగంటలు, ఓంకారం వినబడుతాయి. ఏదో పాముకు సంబంధించింది. రాబోతుందని సూచనప్రాయంగా శ్రోతకు తెలుస్తుంది. గుడిగంటలు, ఓంకార ధ్వని రావడం ఇది దేవాలయం అనే భావం శ్రోతకు కలుగుతుంది. అనంతరం 'వేయిపడగల పాము విప్పారుకుని వచ్చి...'అనే పాట పాడుకుంటూ ఒక పాత్ర ప్రవేశిస్తుంది. నాటక ప్రారంభంలో నాగస్వర సంగీతం రావడం. ఇక్కడ 'వేయిపడగల పాము...'రావడం నేపథ్య సంగీతానికి ఇది సంకేతం అని నాకనిపించింది.

వీణతో కూడిన సంగీతం బాధాకరంతో కూడిన విధంగా వస్తుంది. ఇది చనిపోయిన వ్యక్తుల్ని సూచించే సంగీతంలాగా ఉంటుంది. బాబూ... ధర్మా అనడంతో ముక్కులు ఎగదీసినట్టు ఏడుస్తూ కృష్ణమనాయనింవారికి నమస్సులు అంటాడు. ధర్మారావు ఏడుస్తున్నట్టు తెలుస్తుంది.

ధర్మారావు ఏడుస్తుంటాడు, గోపన్న ఏడుస్తుంటాడు కృష్ణమనాయుడు వారిని ఓదారుస్తూనే ఏడుపుని ఆపుకుని ఓదార్చినట్టు అనిపిస్తుంది . రామేశ్వర శాస్త్రి చనిపోయాడని శ్రోతకు తెలస్తుంది.సంభాషణకు సంభాషణకు విరామ సంగీతం ఇవ్వడం ద్వారా శ్రోతలు ముందు సంభాషణ నుండి బయటకు వచ్చి తర్వాత సంభాషణ గురించి ఆలోచించడం మొదలు పెడతారు. శ్రోత విసుగు చెందకుండా ఉండడానికి కూడా ఈ సంగీతం శ్రవ్యమైనదిగా ఉంటుంది.

నాగన్నశెట్టితో కృష్ణమనాయుడు మాట్లాడుతూ రామేశ్వరశాస్త్రి నీకెంత బాకి అని అడిగి తెలుసుకుంటాడు. విరామ సంగీతం వస్తుంది ధర్మారావుకి ఉన్న అప్పులన్ని కృష్ణమనాయుడు తీర్చేసినట్లుగా గోపన్న ద్వారా తెలుస్తుంది. నాటకంలో అంకవిభజన ఉంటుంది. దానిని శ్రవ్యనాటకంలో సంగీత విరామంతో సూచించడం రేడియో నాటక లక్షణాల్లో ఒకటి. ఇక్కడ విరామ సంగీతం ముందు రామేశ్వర శాస్త్రి ఎంత బాకి అని కృష్ణమనాయుడు తెలుసుకోవడం అది జరిగిన అంకం చివరి భాగంలో ఉంటుంది. సంగీత విరామం తర్వాత రామేశ్వర శాస్త్రి అప్పులు తీరిపోయాయని తెలియజేయడం పూర్వ అంకంలోని చివరి మాట రాబోయే కథను సూచించినట్టు ఆ కథ తర్వాతి భాగంలో అప్పులు కట్టేయడం తెలుస్తుంది.

సంగీతవిరామం తర్వాత మేళం, మంత్రాలు, వినిపిస్తాయి. ఇది రాగానే గుడి వాతావరణం అని తెలుస్తుంది. కాని అది రంగారావు పట్టాభిషేక మహోత్సవం అని పాత్రల సంభాషణ ద్వారా తెలుస్తుంది. కాని లోతుగా పరిశీలిస్తే సంగీత విరామం ముందు సావిత్రమ్మ ఎప్పుడెప్పుడు రంగారావు కీరీటం ధరించేదా అని ఎదురుచూస్తున్నాడు అని ధర్మారావుతో అంటుంది. దీన్ని బట్టి రంగారావు పట్టాభిషేకం జరగబోతుందని సూచనప్రాయంగా తెలుస్తుంది సంగీత విరామం తర్వాత నిజంగానే పట్టాభిషేక మహోత్సవం జరుగుతుంది.

బాధను తెలిపేలా సంగీతం వస్తుంది. ఇక్కడ శ్రోతకు తర్వాత బాధాకరమైన సంగీతం వస్తుందని అర్థమవుతుంది. రంగాజమ్మ జబ్బుతో మంచం మీద పడినట్టు సావిత్రి ద్వారా తెలుస్తుంది

మరో సన్నివేశంలో భక్తి సంగీతం వస్తుంది. ఆ సంగీతం వస్తూనే రాబోయేది గిరిక గురించని తెలుస్తుంది. గిరిక తన్మయత్వంతో మాట్లాడుతున్నప్పుడు భక్తి

సంగీతం చిన్నగా వస్తూనే ఉంటుంది. ఆ మాటలు, ఆ సంగీతం రెండూ వింటున్నప్పుడు శ్రోత కూడా లీనమైపోయేటటువంటి అనుభూతి నాకు కలిగింది. ఆమె నిశ్చేష్టురాలై పోయినట్టుగా తెలుస్తుంది, వామన, పరుశురామ హస్తాలను చూపిస్తే ఇహలోకంలోకి వస్తుందని ధర్మారావు భోగప్పతో అంటాడు.

### 4. బహుపాత్రల ప్రత్యేక అస్తిత్వాన్ని నిరూపించడం కష్టం[28]

ఒక పెద్ద నవలను రేడియో నాటకంగా అనుసరిస్తున్నప్పుడు నవలలోని ప్రతి పాత్ర వ్యక్తిత్వాన్ని ప్రత్యేకంగా పరిచయం చేయడం లేదా ప్రతి పాత్రను ప్రవేశపెట్టడం చాలా కష్టం అందువలన రేడియో నాటకంలో ప్రధాన పాత్రలను పరిచయం చేస్తూ వాటి ద్వారానే నవలలో ఇమిడి ఉన్న చిన్నచిన్న పాత్రల పేర్లను సూచించడం లేదా వారి సంభాషణలలోనే ఇతర పాత్రల మనోభావాలను వ్యక్తం చేయడం జరుగుతుంది.

వేయిపడగల రేడియో నాటకంలో ఒక పాత్ర తక్కిన పాత్రలను పరిచయం చేయడంతో మిగిలిన పాత్రలు ప్రవేశించకపోయినా ఆ పాత్రల వివరాలు ఒక పాత్ర ద్వారా తెలిసిపోతాయి. మరలా తిరిగి ఇతర పాత్రలు ప్రవేశించినప్పుడు వారి సంభాషణ ఉంటుందే కాని వాని వ్యక్తిత్వ విషయాలు ప్రస్తావించబడవు ఇలా కొద్దిపాత్రలతో అనేకమంది పాత్రల వివరాలను సంభాషణ రూపంలో తెలపడం ద్వారా శ్రోత సందిగ్ధతకు అనుమానాలకు తావు లేకుండా విషయాన్ని ఆకళింపచేసుకుంటాడు.

ఉదాహరణకు వేయిపడగల రేడియో నాటకంలో ఇలాంటి మార్పులు ఉన్నాయి. వేయిపడగల నవలలోని రామేశ్వర శాస్త్రి సావిత్రమ్మ సంభాషణలలో రామేశ్వరశాస్త్రి వివాహం చేసుకున్న రంగాజమ్మ, హైమావతి, మంగ, రత్నగిరి వివరాలు ప్రస్తావించబడ్డాయి. మరలా ప్రత్యేకంగా ఈ పాత్రలు ప్రవేశించినప్పుడు వారి గురించి ప్రస్తావించవలసిన అవసరం లేకుండా ఉంటుంది. సావిత్రి, ధర్మరావు పాత్రల ద్వారా పసరిక వృత్తాంతాన్ని పరిచయం చేయడం ఇలాంటివి రేడియో నాటకానికి వన్నె తెచ్చేవే.

### 5.వాతావరణం చూపడంలో మెలకువ అవసరం[29]

---

[28] [28]నాగభూషణ శర్మ,మొదటి.నాటక శిల్పం.పుట: 237.

[29]నాగభూషణ శర్మ,మొదటి.నాటక శిల్పం.పుట: 237.

కేవలం చూడదగిన దృశ్యాలను రేడియో నాటకంలో వినిపించాలంటే అది నైపుణ్యంతో కూడిన విషయం సూత్రధారుడి ద్వారానో, లేద సంభాషణల ద్వారానో దృశ్యాలను శ్రోతల ముందు కదలాడే భావం స్ఫురింపచేయగలగాలి.

ఉదాహరణకు వేయిపడగల రేడియో నాటకంలో ప్రహ్లాద నాటకం వేసేటప్పుడు ఆ దృశ్య సన్నివేశాలను ధర్మారావు హరప్పకు వివరించే తీరు శ్రోత గ్రహించడానికే ధర్మారావు అలా ఆ ఘట్టాన్ని వర్ణిస్తున్నప్పుడు శ్రోతకు నిజంగా ఆ దృశ్యాన్ని తన కళ్ళముందు ప్రత్యక్షమవుతున్న అనుభూతి కలుగుతుంది.

### 6. శ్రవ్యేంద్రియ ప్రాముఖ్యాన్ని గుర్తించి అందుకు అను`గుణంగా శ్రవ్య నాటక ప్రసారాలు జరగాలి[30]

శ్రవ్య నాటకాన్ని రాసేటప్పుడు శ్రోత గ్రహించే విధానాన్ని దృష్టిలో పెట్టుకుని చేయాలి. లేదా రచయిత తాను ఒక శ్రోతయైతే ఏ విధంగా స్పందిస్తాడో, ఎలాంటి చోట్ల ఎలాంటి అనుభూతిని పొందుతాడో గమనించి ఆ విధంగా రేడియో నాటకాన్ని తీర్చిదిద్దాలి. చిటికేసే శబ్దం, అడుగులు వేస్తూ నడిచే శబ్దం, ఉరుములు, మెరుపుల శబ్దాలు ఇలా శబ్దాన్ని ఆశ్రయించుకునే శ్రోత విషయాన్ని గ్రహించగలడు కావున దానిని దృష్టిలో పెట్టుకుని శ్రవ్యనాటకాలు ప్రసారం చేయాలి.

వేయిపడగల నాటకంలో ఇలా శబ్దాన్ని గ్రహించి తెలుసుకునే అంశాలు చాలా ఉన్నాయి. ధర్మారావుకి దాహమయిన విషయాన్ని ఎక్కిళ్ళ శబ్దం ద్వారా, ధర్మరావు ఊహల్లో అరుంధతి మెదలడాన్ని ఒక స్త్రీ గొంతు నవ్వడం. ఆ నవ్వేటప్పుడు ఆ శబ్దం ఒక సాధారణంగా నవ్వేటప్పుడు కంటే ఇంకోరకమైన ధ్వని రూపంలో జనించడం ఇలాంటి సన్నివేశాలు శ్రోత శబ్దం ద్వారానే అనుకరించగలడు. అనుసరించగలడు.

### 7.రేడియో నాటకం ఆదర్శనాటకం, మనోనాటకం.[31]

నవలలో చదివేటప్పుడు ఒక పాఠకుడు పొందే అనుభూతి కంటే రేడియోనాటకం వినేటప్పుడు శ్రోత ఎక్కువ ఆనందాన్ని అనుభవించగలడు. నవలలో

---

[30]నాగభూషణ శర్మ,మొదటి.నాటక శిల్పం.పుట: 238.

[31]నాగభూషణ శర్మ,మొదటి.నాటక శిల్పం.పుట: 238.

రేఖామాత్రంగా ఉండే సన్నివేశాలను, రేడియో నాటకంలో కొంత విశ్లేషించి హితబోధచేస్తాయి. అనడంలో సందేహం లేదు.

వేయిపడగల నవల ఎంత సమాదరణ పొందిందో వేయిపడగల రేడియో నాటకం అంతకంటే ఎక్కువ ఆదర్శప్రాయంగా నిలుస్తుందనడంలో సందేహం లేదు. ఇందులో ధర్మారావు తక్కిన పాత్రలతో సన్నిహితంగా ఉంటూ హితబోధ చేయడం మనం గమనించవచ్చు.ధర్మారావు కృష్ణమనాయుడికి, రుక్మిణమ్మకు భాగవతం చెప్పేటప్పుడు, ధర్మారావు హరప్పకు ఉపాధ్యాయుడిలాగే కాక, ఆధ్యాత్మిక గురువుగా ఉండడం. సందర్భానుసారంగా మనిషి చేయవలసిన కర్మలను వివరించి చెప్పడం. ధర్మరావు గిరికకు భగవంతున్ని ఎలా వశపరచుకోవాలో సూచనలు ఇవ్వడంలోనూ సన్నహితత్వం, అతని స్నేహ భావం, వ్యక్తమవుతాయి. ధర్మారావు భార్య అరుంధతి దగ్గర స్నేహం ఆదర్శమైనదే. ఇలా రేడియో నాటకంలో ఒక ప్రధాన పాత్ర స్నేహ ధర్మాన్ని నిర్వర్తిస్తూ అందరికి హిత బోధ చేస్తూ వారి వారి జీవితాలకు సార్థకం చేకూర్చడమనేది రేడియో నాటకానికి ఉండవలసిన ప్రధాన లక్షణం

**8. ఇంటిలోపల, బయట జరిగే సన్నివేశాలకు రేడియో నాటకం చక్కని మాధ్యమం.**[32]

రేడియోనాటకంలో ఒక పాత్ర ఇంటిలో ఉన్నప్పుడు అక్కడి పరిస్థితులను బట్టి అతని స్వరం ఎలా ఉంటుంది. బయట పాత్రలతో మాట్లాడేటప్పుడు అతని విధానం ఎలా ఉంటుందో శ్రోత గమనించాలి. నవలలో పాత్రలు ఏంచేస్తున్నాయో పాఠకుడు చదవడం ద్వారా తెలుసుకోగలుగుతాడు. పాత్రలు ఏంచేస్తున్నాయో పాత్రలు మాట్లాడుకోవడం ద్వారా శ్రోత తెలుసుకుంటాడు.

వేయిపడగలు రేడియో నాటకంలో ధర్మారావు అరుంధతి మధ్య సరసమైన చేష్టలు వారి నవ్వులు ధర్మారావు ,అరుంధతిపై మజ్జిగ, పన్నీరు చిలకరించడం దానికి అరుంధతి సిగ్గుపడటం ఇవన్ని ఇంటిలోపల జరిగే ప్రియమైన సన్నివేశాలయినా వాటిని వింటున్నప్పుడు శ్రోత కూడా ఆ ప్రేమానుభూతిని పొందుతాడు. ఇక్కడ పాత్ర ఇంటిలోపల జరిగే విషయాలకు స్వేచ్ఛను కనబరిచినట్టు తెలస్తుంది.

ధర్మారావు, రామచంద్రరాజు కలసి బయటకు వెళ్ళినప్పుడు అక్కడ వారి సంభాషణ స్నేహ పూర్వకంగా ఉన్నా ఎక్కువ స్వేచ్ఛ కనబడదు.

---

[32]నాగభూషణ శర్మ,మొదటి.నాటక శిల్పం.పుట: 238..

## 9. ధ్వని విశేషాల ప్రాముఖ్యం.[33]

రేడియో నాటకంలో శబ్దాలు, ధ్వనులు ఉండడం ప్రధానం. అయితే అవి శ్రోత గ్రహించేలా ఉండాలి. తేలికగా అర్థం చేసుకునే విధంగా పొందుపరచాలి. అప్పుడే శ్రోత ఆ ధ్వనిలోని, శబ్దంలోని అంతరార్థాన్ని గ్రహించగలడు.విరామ సంగీతానంతరం మువ్వల చప్పుడు వచ్చిన వెంటనే ధర్మారావు అమ్మా గిరికా రా అని అంటాడు. ఈ మువ్వల ధ్వని గిరక రాకను సూచించినట్లు తెలుస్తుంది. గోపన్న,కృష్ణమనాయుడు సంభాషణల మధ్య ఏనుగు ఘీంకార ధ్వని వినిపిస్తుంది.

అరుంధతి కోపంగా ఉండేది చూసి ఎందుకయ్య అంత కోపంగా ఉండేది అనగా ధర్మరావు బొత్తిగా గౌరవమర్యాదలన్ని పోతున్నాయని అంటాడు. అరుంధతి చంద్రహారం కావలసిన వారున్నారు. వారికి ఇచ్చేస్తాను అనినవెంటనే శబ్దం వస్తుంది. ఆ శబ్దం ఏమిటని శ్రోతకు తెలియజేయడానికి అబ్బా చెంపమీద కొడతారా అని అరుంధతి పాత్ర ద్వారా తెలియజేస్తారు. అతని కోపానికి గల కారణం చంద్రహారమని శ్రోతకు అర్థమవుతుంది. ఈ శబ్దం ఏమిటో తెలియజేయడానికి ధర్మారావు కోపంగా ఉన్నటువంటి విధానం శ్రోతకు తెలుస్తుంది.

ధర్మారావు సూర్యపతిని అప్పడిగి మరలా తిరిగి ఇచ్చేస్తాను అన్నప్పుడు చిన్న శబ్దం వస్తుంది. అబ్బా ఏమిటి ఇంత దెబ్బ కొట్టావు అని ధర్మారావు అనడంతో స్నేహితుడు కావున అప్పు తిరిగి ఇచ్చేస్తాను అని అనడంతో కొట్టినట్టు శ్రోతకు తెలుస్తుంది. ఒక స్త్రీ ఈ రోజు గిరిక కాలికి గజ్జకట్టింది అనగానే చప్పట్ల శబ్దం వస్తుంది. ఇక నృత్యం చేయబోతున్నారనేటటువంటి భావం పుడుతుంది. వెంటనే నృత్య శబ్దం వస్తుంది మరలా చప్పట్ల శబ్దం వస్తుంది. అరుంధతి, ధర్మారావు గిరిక ఎంత బాగా నృత్యం చేసింది అనుకుంటారు. దీనితో శ్రోతకు గిరిక నృత్యం చేసిందని తెలుస్తుంది.

మేళం శబ్దం , నాట్యం ఆడుతున్నట్టు అనిపిస్తుంది. నాట్యం మధ్యలో శ్వాసతో కూడిన ఎక్కిళ్ళ శబ్దం వస్తుంది. ఏడవవద్దని వేణుగోపాల స్వామి దర్శనం తప్పకుండా ఉంటుందని భోగప్ప శాస్త్రి చెప్పి నాట్యం కొనసాగించమంటాడు. మరలా నాట్యం మొదలవుతుంది. మరలా గిరిక తన్మయత్వం చెంది ఉంటుంది. భోగప్ప శాస్త్రి

---

[33]నాగభూషణ శర్మ,మొదటి.నాటక శిల్పం.పుట: 239.

ఓదారుస్తూ ఉంటాడు. తర్వాత శంఖం ఉదే శబ్దం తర్వాత జేగంటలు , మంత్రాలు శబ్దాలు వినిపిస్తాయి.

పసరిక చంద్రారెడ్డి కొడుకు గోపాలకృష్ణారెడ్డితో స్నేహం చేసి సర్పాల దగ్గరకు అతన్ని తీసుకెళ్ళడం ఉంటుంది.ఆధునిక లక్షణాలు పసరికలో కనబడతాయి. రెండు మూడు సార్లు తుపాకి శబ్దం వస్తుంది. ధర్మారావు మాటల్లో కృష్ణారెడ్డి పిట్టల్ని, పాముల్ని కాలుస్తున్నట్టు కుమారస్వామితో చెప్తున్నట్టు తెలుస్తుంది.

వేయిపడగల రేడియో నాటకంలో రామేశ్వరం గిరికను అవమాన పరిచే క్రమంలో ఒక శబ్దం రావడం రామేశ్వరం అమ్మో అని పారిపోవడం.

## 10. వాచిక ప్రాధాన్యత.[34]

రంగస్థల నాటకాలలో కొన్ని సంభాషణలు లేకపోయినా వారి చేష్టల ద్వారా చూసి అర్థంచేసుకుంటాం. కాని రేడియో నాటకానికి వాచికం అనేది ప్రత్యేకతను సంతరించుకుంది. ఒక పాత్ర ఏం చేస్తుందో మరో పాత్ర ద్వారా చెప్పించడం. జరగబోవు సంఘటనలను పాత్ర తనలో తాను మాట్లాడుకోవడం జరిగిపోయిన విషయాలను గుర్తు చేసుకుని వాటిని సమర్థించుకోవడం. ఇవన్ని మాటల రూపంలోనే కొనసాగుతుంది.

ధర్మారావు, అరుంధతి అందాన్ని ఊహించుకోవడం మాటల ద్వారానే తెలుస్తాయి. కేశవరావు మరణానంతరం రాజ్యలక్ష్మమ్మ అతని భర్త పరిస్థితి ఎలా ఉందో ధర్మరావు, అరుంధతి పాత్రల సంభాషణ ద్వారా తెలపడం.

గిరిక వివాహాన్ని కేవలం సంభాషణ రూపంలోనే కాకుండా చక్కటి సంగీతం ద్వారా పాటపాడి వీనుల విందు చేయగల శక్తి కూడా వాచిక ప్రాధాన్యతను చోటుచేసుకుందని చెప్పవచ్చు మొత్తం మన ఊహల్లో మెదలాడే రహస్యభావాలన్ని వాచిక రూపంలో తీసుకు వచ్చే గొప్ప ప్రక్రియ రేడియో నాటక ప్రక్రియ అనడంలో అతిశయోక్తి లేదు.

## 11. రేడియో నాటకంలో సంగీత ప్రాధాన్యం.[35]

---

[34]నాగభూషణ శర్మ,మొదటి.నాటక శిల్పం.పుట: 239.

[35]నాగభూషణ శర్మ,మొదటి.నాటక శిల్పం.పుట: 239.

రేడియో నాటకంలో శబ్దం అతి ముఖ్యమైంది. అయితే ఆ శబ్దం శబ్ద రూపంలో కాకుండా సంగీత రూపంలో ఉంటే శ్రోతకు కాస్త ప్రశాంతతను చేకూర్చడమే కాకుండా ఆ సంగీత శబ్దం ద్వారా జరగబోవు సంభాషణ ఆనందకరమైనదా, లేదా బాధాకరమైనదా శ్రోత ముందుగా తెలుసుకునే ఆస్కారం ఉంటుంది. రంగాజమ్మ మరణానికి ముందు బాధాకరమైన సంగీతం వస్తుంది. ఆధ్యత్మకత సంభాషణ దేవాలయ వాతావరణం రాబోయే ముందు వేరే విధమైన సంగీతం వినబడటం ఇలా ఎన్నో సంగీతంలో భాగమైన పిల్లనగ్రోవి, వీణవాయిద్యాల శబ్దాలు వేయిపడగల రేడియో నాటకంలో శ్రోత గ్రహిస్తాడు.

### 12. రేడియో నాటకం శ్రోతల భావనా శక్తికి సంబంధించింది

రేడియోనాటకం ఆది నుండి అంతం వరకు శ్రోత గ్రహించే ప్రతి ధ్వని, బాధ, సంతోషం పాత్రల మనోభావాలు ప్రదర్శించే తీరు ఇవన్ని శ్రోత ఊహల్లో మెదులుతాయి. ఇది ఒక రకంగా శ్రోతకు ఏకాగ్రతను అందిస్తుంది.ఉదాహరణకు ఒక పాత్ర ఏడ్చినట్టు ఎక్కిళ్ళ శబ్దం గ్రహించడం ధర్మారావు తండ్రి మరణానంతరం, కృష్ణమనాయుడు మరణానంతరం అతను ఏడ్చే విధానం శ్రోత గ్రహించేలా ఉంటుంది. అలాగే వర్షం వచ్చినప్పుడు వాన చినుకుల శబ్దం, నీటి శబ్దం వినబడుతాయి. గిరిక వర్షంలో తడిచే సంఘటన మువ్వల సవ్వడి శబ్దం రావడం ఒక స్త్రీ పాత్ర అక్కడ ప్రవేశిస్తున్నట్టు తెలుస్తుంది. గంటలు మ్రోగడం, దేవాలయాన్ని సూచించడం, ఓంకార ధ్వని దేవాలయ ప్రాంగణంలో ఆధ్యాత్మిక సంభాషణ జరగబోతుందని ఇలా మనం గమనించవచ్చు.

### 13. ఊర్పులు, నిట్టూర్పులు, కోపాలు తాపాలు, ఆవేశకావేషాలు, అవసరమైన చోట తన గొంతులో పలికించగలగాలి''[36]

ధర్మారవుతో సావిత్రమ్మ తాను ఇంతకు ముందు చేసిన అన్నదానాలను శ్రోతకు అర్థమయ్యేలా వేలమందికి పెట్టిన చేయిరా ఇది ఇప్పుడు ఒక్క చుక్క నేతి చుక్క లేకుండా పోయింది ఎలా చిక్కిపోయావో చూడు అంటుంది. ఈ సంభాషణలో సావిత్రమ్మ నిట్టూర్పుతో దిగులు పడుతున్నటువంటి తన దీన స్థితిని చాలా చక్కగా వ్యక్తపరుస్తుంది. స్వరములో స్పష్టంగా ఉన్నత స్థానం నుంచి ఈ దీన స్థితికి

---

[36]మూర్తి, డి.ఎస్.ఎన్. తెలుగు నాటక చరిత్ర వివిధ రీతులు – పరిణామాలు, పుట:204,205

దిగజరినటువంటి విధానం గొంతులో అర్థమవుతుంది. ఇది శ్రోత కూడా బాగా గ్రహించడానికి వీలవుతుంది.

విరహాన్ని శ్వాస ద్వారా తెలపడం వేయిపడగల రేడియో నాటకంలో గమనించవచ్చు. ప్రేమానురాగాలకు సంబంధించిన సంగీత శబ్దం వస్తుంది. ఈ శబ్దం వింటుంటే రాబోయే సంభాషణ శ్రోతకు, ఆసక్తిని పెంచేటటువంటి భావం కలుగుతుంది. ధర్మారావు ప్రేమతో అరుంధతిని దగ్గరకు రమ్మని పిలుస్తాడు. తన పట్ల ఉన్న వాత్సల్యాన్ని వ్యక్తీకరిస్తాడు. తన విరహవేదనను తన సంభాషణలో వివరిస్తాడు. అరుంధతే తన ఊపిరిగా భావించడం అతను తీసుకునే శ్వాస శబ్దాన్ని స్పష్టంగా వ్యక్తీకరించాడు.

ధర్మారావు అరుంధతి ముచ్చటించుకునే సందర్భంలో అరుంధతి మీరు చదువుకోవడానికి  వెళ్తున్నారు కదా మా నాన్న నన్ను తీసుకోళ్తాడేమోనని దిగులు పడడం ఆమెగొంతులో స్వరంలో మార్పురావడం శ్రోతకు తెలుస్తుంది. ధర్మారావు కూడా మూడు రోజులు ఏడు జన్మలుగా ఉన్నాయని అంటూ ఇద్దరూ ప్రేమ విరహంలో మునిగిపోయేటటువంటి భావం స్ఫురిస్తుంది.

ధర్మారావు అరుంధతిని తీసుకురావడానికి వెళ్ళినప్పుడు అరుంధతి ముభావంగా ఉండడాన్ని గమనిస్తాడు. ధర్మారావు పలకరించగానే అరుంధతి తన ఇంట్లో అప్పటివరకు అనుభవించిన బాధ ఒక్కసారిగా దుఃఖంతో బయటకు వెల్లడించే విధంగా ఏడుస్తుంది. అరుంధతి అమ్మో అమ్మవస్తుంది అని ఆమె గొంతులో ఒక భయం ఉన్నట్లు శ్రోతకు తెలస్తుంది. దర్మారావు గంభీర స్వరంతో నా భార్యను నేను తీసుకెళ్ళడానికి వచ్చాను అంటాడు. వారిద్దరూ ప్రేమతో శృంగార మాటలు మాట్లాడుకుంటూ వెళ్తుంటారు. అరుంధతి మ్....అనే మూలుగు శబ్దం శృంగార నిట్టూర్పులాగా నాకనిపించింది.

గిరిక ధర్మారావింటికి వస్తుంది. ధర్మారావు , గిరిక సంభాషణ సాగుతుంది గిరిక స్వామి మీద ఉన్న విరహాన్ని మ్..అనడం, శ్వాస తీసుకోవడంలాంటివి కొన్ని శృంగార సంకేతాలన్ని ఆమెలోనుండి వ్యక్తపరచడం స్పష్టంగా అర్థమవుతుంది. స్వామి తనను ఇంకా వలచలేదని చిక్కినట్టే చిక్కి మాయమవుతున్నాడు అని ఆమె

ఏడుపు ఆమె శ్వాస ద్వారా బయటకు వస్తుంది. అవన్నీ కూడా భగవంతుని మీదనే ఉంటాయి.

''మ్...''అనడం, శ్వాసతీసుకోవడం అలాంటి శృంగార సంకేతాలు శ్రోతకు వినబడుతాయి. ఇవన్ని కూడా భగవంతుని మీద గిరిక కున్న విరహాన్ని సూచిస్తుంది.

కిరీటి ధర్మారావుకు నిద్రిస్తున్న తన ప్రేయసి రూపాన్ని వర్ణించేటప్పుడు తాను ఆ అనుభూతిని అనుభవించి చెప్తున్నట్టు విరహంతో కూడిన ఒక శ్వాసతో చెప్తున్నట్టు అనిపిస్తుంది. ఆ విరహం దుఃఖంగా మారడం శ్రోతకు తెలిసేటట్లు కిరీటి పాత్ర పోషించబడింది.

సరోజని దేవి అదిగో గణాచారి, అవిగో రావిమండలు, అదిగో నాన్న, హరప్ప వేణుగోపాలస్వామి అంటూ పెద్దగా శ్వాస తీసుకుంటూ మౌనం అయిపోతుంది ఊపిరిఆగిపోయినట్టు శ్రోతకు తెలుస్తుంది. వెంటనే రాజమ్మ ఏడుస్తుంది. దానితో సరోజనిదేవి చనిపోయిందని అర్థమవుతుంది.

చంద్రారెడ్డి గోరుచుట్టుమీద రోకటి పోటంటే ఇదే అని చెప్పడంతో శ్రోతకు ఏదో వ్యవహారంలో నష్టం వాటిల్లినట్లు శ్రోతకు బోధపడుతుంది. అతని మాటల్లో కూడా ఆవేశం స్ఫురిస్తుంది. ధర్మారావు దీనిని గమనించి చంద్రారెడ్డి ఈ వేళ చాలా ఆవేశంగా ఉన్నారు అంటాడు. వెంటనే నిట్టూర్పుతో చంద్రారెడ్డి ఏమి చెప్పను గత ఏడాది ఎనిమిది వేల పన్నువేశారని తన బాధను తెలుపుతాడు.

**14.వాస్తవ భ్రాంతిని కల్పించుట కొరకు గాలి, వాన, రైలు, నడక, తలుపు చప్పుడు మొదలగు ధ్వనులను సమయోచితంగా కల్పించుట కూడా శ్రవ్య రూపక ప్రయోగమునకు వన్నెపెట్ట కలదు.**

సంగీతానంతరం చప్పుడు వస్తుంది అది తలుపు కొట్టిన చప్పుడు లాగా అనిపిస్తుంది. ధర్మారావు అని పిలవగా వచ్చింది శివరావు అని తెలియజేయడానికి ధర్మారావు శివరావుగారా అని పలకరిస్తాడు. ఏమిటింత రాత్రి వేళ వచ్చారని అనడంతో బాగా చీకటి పడిన తర్వాత వచ్చాడని ధర్మారవు పాత్రద్వారా చెప్పించడం తెలుస్తుంది.

అమ్మకు బాగలేదని ఉత్తరం వచ్చిందని ధర్మారవుతో కిరీటి బాధపడుతున్నట్టు ఉంటుంది. తర్వాత కిరీటి తనలో తాను ఈ రైలు ఎప్పటికి వెడుతుందో అని అనుకుంటాడు. ఈ మాటను బట్టి అతను రైలులో వెళ్తున్నట్టు గమనించాను.

మరో సన్నివేశంలో రామేశ్వరం తరగతికి వచ్చాడని తెలిసినా జోస్యులు కుర్చిలోంచి లేవకుండా నిద్రపోతున్నాడని సహ ఉపాధ్యాయుల ద్వారా తెలుస్తుంది. జోస్యులు గురక శబ్దం, ఆవలింత ఎక్కువ చేయడం తెలుస్తుంది. నవ్వులు వినబడడంతో మిగతా వారు నవ్వుతున్నట్టు తెలుస్తుంది. ఈ నవ్వులు రామేశ్వరాన్ని చులకన చేయాలనే భావంతో జోస్యులు అలా చేసినట్టుగా నాకు అనిపించింది.

సంగీతం వస్తుంది తర్వాత నీటి శబ్దం రావడంతో వర్షం పడుతున్నట్టగా నాకనిపించింది. గిరిక పాత్ర ద్వారా ఈ వర్షం నన్ను తడిపేసింది అనడంతో వర్షం పడినట్టుగా శ్రోతకు తెలుస్తుంది.

**15.సంభాషణ చాతుర్యం:**

రాణి నీకు భాగవత పద్యాలు ఎవరు బోధించారని గిరికను అడుగగా అన్న ధర్మారావని సమాధానం చెప్తుంది. తర్వాత రాణిగారు నీకు ఆకలి వేస్తున్నట్టుంది అంటే గిరిక చిత్తం అమ్మగారు అంటుంది. మరి నన్ను దూరంగా చూడకు నీ పెద్దక్కననుకో  అనగా గిరిక గోపికకు, రాధకు రుక్మిణి పెద్దక్క అంటుంది. ఈ సంభాషణలో తప్పుకోండి రాణిగారు వస్తున్నారు అనడం అక్కడ ఉన్నది గిరిక అని తెలియదు రాణిగారు నీ పేరు గిరికే కదా అని పాత్రపేరు రాణి ద్వారా శ్రోతకు తెలియజేస్తారు.

ఆలయం ప్రవేశం చేసింది పెద్దరాణిగారా చినరాణిగారా అని తెలియదు కనుక గిరిక గోపికకు , రాధకు రుక్మిణి పెద్దక్క అనడం వచ్చిన పాత్ర రుక్మిణమ్మ అని చెప్పడం సూచిస్తుంది. శ్రవ్య నాటక లక్షణాల్లో సంభాషణా చాతుర్యం ఒకటి ఈ లక్షణం ఇక్కడ సరిపోతుంది.

అరుంధతి ,ధర్మారావు సంభాషణలో అరుంధతి పాత్ర ద్వారా మరబియ్యం వచ్చినట్లు శ్రోతకు తెలుస్తుంది. ఇక్కడ కొన్ని పోలికలు అరుంధతి మాటల్లో చమత్కారంగా ఉంటాయి. ధర్మారావు అన్నంలో పలుకు లేదుకదా అన్నప్పుడు

అరుంధతి పలుకులేదని నేను పలుకుచున్నాను. అని చమత్కారంగా మాట్లాడుతుంది. దానికి ధర్మారావు భలే ప్రాస వాడావే అంటూ నవ్వుకుంటారు.

పశుపతి అరుంధతి ఇంటికి వచ్చినప్పుడు పశుపతి అరుంధతితో మీ ఆయన మీద నా భార్య అనసూయ అలిగింది అమ్మాయి పుట్టగానే వస్తానని ఇంతవరకు రాలేదని కోపపడుతుంది.అందుకే వచ్చాను నాలుగు కడిగి వెడదామనుకున్నాను అంటాడు. ధర్మారావు వెంటనే ఆ అవకాశం మా ఆవిడ మీకు ఇవ్వదులే పొద్దున్నే అన్ని కడిగేసుకుంది అంటాడు ఇక్కడ చమత్కార సంభాషణను గమనించాను.

ధర్మారావు అరుంధతి సంభాషణలో ఉత్సవాలు చూడటానికి పసివాడిని అత్తయ్యదగ్గర పండబెట్టి వస్తాననగా ధర్మారావు నీ పసివాడ్ని అత్తయ్య దగ్గర పడుకోబెడుతావు నా పసివాడు నా ఉత్తరీయం వదలడు కదా అంటే అరుంధతి మా పసివాడంటే హరప్పనాయనింవారా అని అంటుంది. అలాగే అవునులే ఒక చేత్తో హరప్పనాయనింవారిని మరో చేత్తో గిరికను ఉద్దరిస్తున్నారు అనగా ధర్మారావు నవ్వుతూ ఆ ఇద్దర్ని ఉద్ధరిస్తున్న నన్ను నువ్వు ఉద్ధరించడంలా అంటాడు. ఈ సన్నివేశాలలోని సంభాషణ అంతా రేడియో నాటక లక్షణమైన చమత్కారంతో కూడి ఉంది.

**16.నేపథ్య ధ్వని:**

గోపన్న అక్కడి కబుర్లు ఇక్కడికి , ఇక్కడి కబుర్లు అక్కడికి మోసి మోసి నా వీపు వాచిపోతుంది. అనగా రామేశ్వరశాస్త్రి ఒక గుద్దు వేయని అంటూనే 'టప్' అనే ధ్వని వస్తుంది. ఇది నేపథ్య ధ్వనికి సంకేతం. అయ్యబాబోయ్ చంపేశారండి అనడంతో అ టప్ అనేశబ్దం గోపన్న వీపును రామేశ్వరశాస్త్రి దెబ్బవేసినట్టు తెలుస్తుంది. ఇక్కడ నేపథ్య ధ్వని అనేది రేడియోనాటక లక్షణాల్లో ఒకటి అది ఇక్కడ సరిపోతుంది.

అరుంధతి ధర్మారావుని స్నానానికి వెళ్ళమంటుంది. వీపురుద్దేవారు మడికట్టుకు కూచున్నారు అంటే నేను వస్తున్నానని అరుంధతి వస్తుంది. ధర్మారావు ముద్దుపెడతాడు 'ప్చ్' శబ్దం ద్వారా ముద్దుపెట్టిన శబ్దం వస్తుంది. ఇద్దరు శృంగారంలో మునిగిపోతారు.

**17.క్రియలను సంభాషణ ద్వారా తెలపడం:**

ఆరు నెలల విరామం తర్వాత రామేశ్వరశాస్త్రి కృష్ణమనాయుడు ఒకరినొకరు కౌగిలించుకున్నట్లుగా వారి సంభాషణల ద్వారానే శ్రోతకు తెలుపుతారు.

ధర్మారావు అరుంధతి రాసలీలలు, వారి సంభాషణ ఉంటుంది. ధర్మారావు మ్..మ్..అంటూ పుక్కిలించేటటువంటి శబ్దం స్పష్టంగా అర్థం అవుతుంది. ఏమి పుక్కిలించాడో అరుంధతి పాత్ర ద్వారా పన్నీరు పుక్కిలిస్తున్నారని తెలుపుతారు. అరుంధతి వెనుకకు, వెనుకకు వెళ్ళిపోతుంటే, ధర్మారావు రా ..రా అని ముందుకు లాక్కొని సరసం ఆడుతుంటారు. ఈ సంభాషణలో ధర్మారావు పరిగెత్తకు ఆగు , రా.. అని అనడంతో అరుంధతి వెనుకకు వెళ్ళిపోతుందని ధర్మారావు ద్వారా తెలియజేస్తాడు. తర్వాత అరుంధతిని పట్టుకుని సరసాలాడుతున్నప్పుడు శృంగార రాసక్రీడలు ఉంటాయి. ఇక్కడ శృంగార లక్షణం కనబడుతుంది.

గిరిక నాట్యం చేస్తున్నప్పుడు ప్రేక్షకులు వైపు చూడకుండా స్వామి వైపే చూస్తున్నట్టు, మంగళ హారతుల సమయానికి రత్నగిరి చేతిలోకి వాలిపోతున్నట్లు గిరికను ఓదార్చిన భోగప్పశాస్త్రి ధర్మారావుతో చెప్పడం వలన తెలుస్తుంది. గిరిక భగవంతుని వరించడం కోసం తాను పడుతున్నంత తపనంతా స్పష్టంగా తెలుస్తుంది.

**18.దీర్ఘసంభాషణలను తగ్గించి చెప్పడం:**

కొంచెం బాధ కొంచెం ఆధ్యత్మికతను కలిగిన సంగీతం వస్తుంది. ఇది రామేశ్వరశాస్త్రి కళ్యాణమండపానికి వెళ్ళిపోవడాన్ని సూచిస్తుంది. సావిత్రి, రామేశ్వరశాస్త్రి సంభాషణ చక్కటి పదాల కూర్పుతో సాగుతుంది. ఈ సంభాషణలలోనే రామేశ్వరశాస్త్రి వివాహాల గురించి వివరించడం, రంగాజమ్మ అందాన్ని గురించి వర్ణించడం కొడుకుల్ని ఏవిధంగా తీర్చిదిద్దాలో వివరించడం ఇక సావిత్రి మనస్తత్వాన్ని గ్రహించి పొగడి వేణుగోపాలస్వామి కళ్యాణమంటపానికి వెళ్ళడం ఇవన్ని తక్కువ సంభాషణ ద్వారా వ్యక్తపరుస్తారు. శ్రోత చూడలేదు కాబట్టి శ్రవ్యానందం కొరకు శ్రోతకు బోధపడేలా పాత్రల చేత మాట్లాడించడం ఈ లక్షణాలు ఈ సంభాషణలో గమనించాను.

**19.వందల సంవత్సరాల చరిత్రను వ్యాఖ్యాన రూపంలో తెలపడం:**

వేయిపడగల రేడియోనాటకంలో సుబ్బన్న పేట వృత్తాంతాన్ని గోపన్న , కృష్ణమనాయుడు సంభాషణ ద్వారా తెలియజేయడం. కృష్ణమ నాయుడు ధర్మారావు

పూర్వీకుల ఆలయ నిర్మాణ చరిత్రను వ్యాఖ్యానరూపంలో తెలియజేయడం. పై లక్షణానికి సరిపోతుంది.

**20.ముఖభావాలను సంభాషణ ద్వారా తెలపడం**:

ధర్మారావు, రాఘవ, కిరీటి, సూర్యం అందరూ కలుస్తారు. కిరీటి ప్రేమలో విఫలమైనట్టుగా ఉంటాడు. దీనిని శ్రోతకు తెలపడానికి ధర్మారావు పాత్ర ద్వారా నీ కళ్ళు చూస్తుంటే ఎవరినో ప్రేమించినట్టున్నావ్ నువ్వు ప్రేమలో విఫలమైనట్లుగా నాకనిపిస్తుంది. ఎవరామె అడగడంతో శ్రోతకు కిరీటి ముఖభావాలు ఎలా ఉన్నాయో చూడలేదు కావున అతని ముఖంలో కలిగిన కదలికల్ని ధర్మారావు పాత్ర ద్వారా బయటకు వ్యక్తం చేయడం శ్రోతకు తెలుస్తుంది.

చినరాణిగారు గోపిక అన్నారు గోపికంటే గిరికేనా అనగా వెంటనే గిరిక భావావేశంతో తన్మయత్వంతో ఏమిలేదు కదా వదినా అంటూ ఏడుస్తుంది. సరోజని ఉద్వేగంతో ఈమె దుఃఖానికి నేనే కారణం అయినట్టున్నాను నీవు నీ రూపు రేఖలు శంఖ చక్ర ముద్రలు వేయించనవసరం లేకుండా ఉన్నాయి. నువ్వు స్వామికి సమీపంలోనే ఉన్నావు చూడు అనగానే గిరిక అంత అదృష్టమా అంటూ గిరిక మరికొంత భావావేశానికి లోనవుతుంది. దానికి తగినట్టుగా ఆ సంభాషణకు ఆ సంగీతం చక్కగా కూర్చారు. ఇవి విన్నప్పుడు ఒళ్ళు పులకరించిన అనుభూతి కలుగుతుంది.

అన్నా అంటూ ఏడుపు వినబడుతుంది. అంతకుముందే పాత్రల గొంతు విన్నాం కాబట్టి ఆ గొంతు కిరీటిది అని తెలుస్తుంది. కిరీటి అమ్మకు బాగలేదని అంతకుముందే తెలుసుకావున ఇక్కడా వాళ్ళఅమ్మ చనిపోయిందని అర్థమవుతుంది. అమ్మ ప్రాణం పోయింది నా పెళ్ళి ఇంకెలా చూస్తుందని కిరీటి ఏడుస్తాడు. ధర్మారావు ఏమిటిది కిరీటి చలనం లేకుండా ఉన్నాడు. రాయి అయినాడు అనడంతో అతను నిశ్చేష్టుడైనట్టు తెలుస్తుంది.

**21.సైగలను పాత్రల ద్వారా చెప్పించడం:**

ఈల శబ్దం వస్తుంది. ఈ శబ్దం వింటూనే పసరిక అని గుర్తుకువస్తుంది. పసరిక భయపడుతున్నావ్ అని గణాచారిని చూశా ఆమె దూరం వెళ్ళిపోయిందిలే అని ధర్మారావు పాత్ర ద్వారా తెలియజేస్తాడు. ఎందుకు భయపడుతున్నాడో శ్రోతకు

తెలపడానికి గణాచారిని చూశా అని ధర్మారావు చెప్తాడు. ఇక్కడ ధర్మారావే ప్రశ్న వేసుకుని ధర్మరావే సమాధానం చెప్పుకుంటాడు. పసరికకు మాటలు రావు గనుక ఇది పసరిక హావభావాల్ని శ్రోతకు తెలపడానికి ధర్మారావు పాత్రద్వారా వ్యక్తీకరిస్తాడు.

**22.కుల మత ప్రస్తావన ఉండకూడదు**:

వేయిపడగల రేడియో నాటకంలో ఈ లక్షణం మనకు కనబడుతుంది. హరప్ప ధర్మారావుని క్రీస్తుగొప్ప, హరిశ్చంద్ర గొప్పా అని అడిగితే దానికి ధర్మారావు ఒకరి కాలంలో ఒకరు లేరు ఎవరికి వారే గొప్ప అని సమాధానం చెప్తాడు. శ్రవ్యలక్షణాలలో కుల మత ప్రస్తావన ఉండకూడదు బహుశా మత ప్రస్తావన తేకూడదు కనుక ధర్మారావు పాత్ర ద్వారా ఇటువంటి సమాధానం వస్తుంది. ఇది శ్రవ్య లక్షణాల్లో ఒకటి.

**23.సంభాషణల్లో సమయస్ఫూర్తి:**

అమ్మ మరణించడం, శశిరేఖ దక్కదు అనే బాధతో నిశ్చేష్టుడైన కిరీటిని స్పృహలోకి తీసుకురావడానికి అరుంధతి సమయస్ఫూర్తితో శశి వచ్చింది దామ్మా ఇవిగో నీళ్ళు కాళ్ళు కదుక్కోమా అనడంతో నా శశి వచ్చిందా అంటూ కిరీటి లేస్తాడు. ఇక్కడ నిజంగా శశిరేఖరాదు సమయ స్ఫూర్తితో వ్యవహరించడం వలన కిరీటి తేరుకుంటాడు. శ్రవ్యనాటక లక్షణాల్లో సంభాషణలో సమయస్ఫూర్తి అవసరం ఇక్కడ అరుంధతి పాత్ర సంభాషణ ద్వారా ఆ లక్షణం కనబడుతుంది.

## 4.12. వేయిపడగల రేడియో నాటకం శ్రోత అనుభూతి:

వేయిపడగల నవలను రేడియోనాటకీకరణగా మార్చారు. ఇది టి.వి.సీరియల్ లాగా ధారావాహికంగా ప్రసారమయిన రేడియో నాటకం. వేయి పడగలు రేడియోనాటకం వింటున్నప్పుడు శ్రోతగా నేను పొందిన అనుభూతిని ఈ క్రింది వివరిస్తున్నాను.

### 4.12.1.గణాచారి పాత్ర ప్రవేశం స్త్రీ సంభాషణ:

వేయిపడగల నాటకం ప్రారంభంలోనే నాగస్వర సంగీతం, గుడిగంటలు, ఓంకారం వినబడుతాయి. ఏదో పాముకు సంబంధించింది. రాబోతుందని సూచనప్రాయంగా శ్రోతకు తెలుస్తుంది. గుడిగంటలు, ఓంకార ధ్వని రావడం ఇది దేవాలయం అనే భావం శ్రోతకు కలుగుతుంది. అనంతరం 'వేయిపడగల పాము

విప్పారుకుని వచ్చి...'అనే పాట పాడుకుంటూ ఒక పాత్ర ప్రవేశిస్తుంది. నాటక ప్రారంభంలో నాగస్వర సంగీతం రావడం. ఇక్కడ 'వేయిపడగల పాము...'రావడం నేపథ్య సంగీతానికి ఇది సంకేతం అని అనిపిస్తుంది.

పిల్లలు అదిగో గణాచారి బయలుదేరి వెళ్తుంది అనడం స్త్రీ ల సంభాషణల్లో ఎటువైపు వెళ్తుందో సూచించడం, ఒక యువకుడు(వెంకన్న) పురాణం గుళ్ళోవిప్పు అనడంతో పైన గుడిగంటల ధ్వని ఓంకార శబ్దం వినిపించడం ఆమె గుడి నుండి బయలుదేరినట్టుగా తెలుస్తుంది.

'మ్...మ్..అంటూ హూంకరిస్తూ ఆహాహా....వంటి శబ్దాలు వినిపిస్తుంది. ఇది ఒక వ్యక్తికి ఏదో శక్తి ఆవరించినట్టుగా అనిపిస్తుంది. స్వరం హెచ్చు స్వరంతో ఉంటుంది. ఈ స్వరం ఆ పాత్రకు సరిగ్గా సరిపోయినట్టుగా ఉంది.

పిల్లలు ఒసే రమణీ అదిగో గణాచారి అనడంతో ఆమెపేరు గణాచారి అని తెలుస్తుంది.గణాచారి గురించి స్త్రీల సంభాషణల్లో స్త్రీలు గణాచారి ఎటు వైపు వెళ్తుందో మాట్లాడుకుంటూ ఉంటారు. ఒక వృద్ధురాలు ప్రవేశిస్తుంది. ఆమె వృద్ధురాలు అని తెలియడానికి ఆమె నోటితోనే తనకు డెబ్భై ఏళ్ళ పై మాటే అని అంటుంది. నేను చూడంగా ఈమె మూడోతరం గణాచారి అని ఒక చిన్ని వాక్యంలో గణాచారి వృత్తాంతం తెలిపారు.

### 4.12.2. గోపన్న కబుర్లు:

ఏమండోయ్...ఏమండోయ్ ...రామేశ్వరశాస్త్రి గారు అని ఒక వ్యక్తి పిలవగా తర్వాత రామేశ్వర శాస్త్రి ఏమిటి ఆ పొలి కేకలు గోపన్నా అనడంతోదూరంగా ఉన్న వ్యక్తిని మనం ఏవిధంగా పిలుస్తామో గోపన్న రామేశ్వరశాస్త్రిని  పిలిచినప్పుడు అటువంటి భావం శ్రోతకు కలుగుతుంది. గోపన్న అక్కడి కబుర్లు ఇక్కడికి , ఇక్కడి కబుర్లు అక్కడికి మోసి మోసి నా వీపు వాచిపోతుంది అంటాడు.

### 4.12.3. కృష్ణమనాయుని పాత్ర ఆలయ ప్రవేశం:

విరామ సంగీతం వస్తుంది. తర్వాత ఓంకారం, వేదమంత్రాలు వస్తాయి. అది దేవాలయం  అనే భావం కలుగుతుంది. కృష్ణమ నాయుడు విచ్చేస్తున్నట్లుగా ఒక వ్యక్తి ద్వారా తెలుస్తుంది. ఒక గంభీరమైన స్వరంతో ఏర్పాట్లన్ని సిద్ధమయ్యాయా....అంటాడు. ఆ స్వరం జమిందారిది అనే భావం కలుగుతుంది.

కృష్ణమనాయుడు పూజలైన తరువాత భగవత్ కైంకర్యంగా నాట్యం చేసేందుకు అనే సరికే ఒక వ్యక్తి అతని మాట పూర్తికాకుండానే అందుకుని రత్నగిరి అమ్మగారు వచ్చారు ఆ తెరచాటున అలంకారం సరిచూసుకుంటున్నారు అంటాడు.

కృష్ణమనాయుడు ఏమిటింత లోటు కనబడుతుంది అని అనగా ఒక పాత్ర ద్వారా దివాను రామేశ్వర శాస్త్రి గారు రాలేదని చెప్తాడు. కృష్ణమనాయుడు వెంటనే ఆహ్వానం పంపించండి అనగా ఆహ్వానం అందకముందే రామేశ్వరశాస్త్రి సతీ సమేతంగా విచ్చేస్తున్నట్టు గోపన్న ద్వారా శ్రోతకు తెలియజేస్తారు.

ఈ సంభాషణలో కృష్ణమనాయుడు ఆయన స్వరం గంభీరంగా ఉంది. ఆయన మాట్లాడిన విధానం అక్కడి ఏర్పాట్లను అడిగి తెలుసుకునే తీరు ఒక నాయక లక్షణాలు అతనిలో ఉన్నట్టుగా తెలుస్తుంది.

### 4.12.4.కృష్ణమనాయుని స్వభావం:

నాగన్నశెట్టి అప్పుకోసం తనకు రావలసిన రుణం కోసం వచ్చి ఉంటారని కృష్ణమనాయనింవారు కోపంగా వారిని హెచ్చరిస్తూ నీ డబ్బు రామేశ్వరశాస్త్రి ఏం పట్టుకు పోలేదు ఇక్కడ అబ్బాయిని ఇబ్బంది పెట్టాలని వచ్చారా నేను పిలిచినప్పుడు రండి అని గర్జించడం జమిందారితనాన్ని సూచించేదిగా ఉంది.

విరామ సంగీతానంతరం కృష్ణమనాయుడు. నాగన్నశెట్టి సంభాషణ ఉంటుంది. కృష్ణమనాయుడు  నాగన్నశెట్టి ఎందుకు వచ్చాడో తెలుసుకోకుండా మిగతా విషయాల గురించి మాట్లాడుకోవడం వ్యంగ్యంగా అతనిని హెచ్చరిస్తున్నట్టు అనిపించింది. ఎత్తిపొడుపు మాటలు మాట్లాడుతూ మాటలలో రామేశ్వరశాస్త్రి నీ కెంతబాకి అని అడిగి తెలుసుకుంటాడు. నాగన్నశెట్టి కొడుకు పెళ్ళి గురించి చెప్పబోతే అన్ని రేపే మాట్లాడుకుందామని అంటాడు. ధర్మారావుకి ఉన్న అప్పులన్ని కృష్ణమనాయుడు తీర్చేసినట్లుగా గోపన్న ద్వారా తెలుస్తుంది.

గుడిగంటలు రావడంతో దేవాలయం అని తెలుస్తుంది. వేదమంత్రాలు వినిపిస్తాయి. కృష్ణమ నాయుడు బాబు ధర్మారావు అని పిలుస్తాడు. ధర్మారావు వచ్చి కృష్ణమనాయుడితో మాట్లాడుతూ నేను ఈ సమయంలోనే దేవాలయానికి

వస్తుంటానంటాడు. వీరి సంభాషణ అంతా దేవాలయంలో జరుగుతుంది కావున వారు మాట్లాడుకున్నంత సేపు ఓం కార ధ్వని చిన్నగా వస్తుంటుంది.

### 4.12.5. కృష్ణమనాయుడు, ధర్మారావు సంభాషణ:

ధర్మారావు కృష్ణమనాయుడితో మీకు కలలో సుబ్రహ్మణ్యేశ్వర స్వామి సహస్ర ఫణాలతో దర్శనమిచ్చాడు కదా అని అడిగితే కృష్ణమనాయుడు నూటికి నూరు పాళ్ళు సత్యం అని చెప్తాడు. కృష్ణమనాయుని స్వప్నవృత్తాంతం ధర్మారావు గ్రహించడం ఇక్కడ సంకల్పసిద్ధి ఉన్న వ్యక్తిగా  అనిపిస్తాడు. కృష్ణమనాయుడు కూడా ధర్మారావుని అమార్త్యుడుగా ఈ సన్నివేశంలో పేర్కుంటాడు.

### 4.12.6. భయంతో రంగారావు:

పట్టాభిషేక సమయంలో ఎవరో పాము పాము అని అరిచారని రంగారావు అడుగ గారామేశ్వరం ధర్మారావు వచ్చి అల్లరి పాలు చేశాడేమో అని అంటాడు. సర్వారాయుడు గణాచారి వేయిపడగల పాము అంటూ పాట పాడుకుంటూ వచ్చింది ఇప్పుడు కిరీటం ధరించే సమయంలో ఎవరో పాము పాము అని అరిచారు అనగా రంగారావు తన కలలో వచ్చిన పాము విషయాన్ని తెలియజేస్తాడు. అలా తెలిపేటప్పుడు అతను భయంతో చెప్తున్నట్టు తెలియడానికి అతని గొంతు వణుకుతూ మాట్లాడినట్టు అర్థమవుతుంది.

### 4.12.7.సావిత్రమ్మ దుఃఖం:

ధర్మారావు అన్నములో తినడానికి ఏమున్నాయి. అనగానే సావిత్రమ్మ ఒక దిగులుతో ఉన్నట్టు తెలియజేయడానికి ఒక నిట్టూర్పుతో నాన్నా....ప్చ్..చుట్టు పక్కల అప్పులు తీసేసుకున్నామని, కొంత చిన్నగా ఊపిరి పీల్చి. బాధాకరమైన గొంతుతో ఈ రోజు ఉత్త చింత పండుతో పచ్చడి చేసినట్టు చెబుతుంది. నాయనా చేతిమీద నేచుక్క కూడా...అంటూ ఏడుపు గొంతుతో చెప్తుంది. ఆ విషయం శ్రోతకు అర్థం చేసుకోవడానికి స్వరం దుఃఖంతో కూడి ఉంటుంది. ధర్మారావు ఎక్కిళ్ళు వచ్చినట్టు చేయడం చేత ధర్మారావుకి ఎక్కిళ్ళు వచ్చాయని శ్రోతకు అర్థమవుతుంది.

### 4.12.8.ధర్మారావు ఊహల్లో అరుంధతి:

సావిత్రమ్మ ధర్మారావుతో అరుంధతి చక్కని చుక్క ఆమె వస్తే చాలు అష్టలక్ష్మలూ గృహప్రవేశం చేసినట్లేనని అంటుంది. వెంటనే ధర్మారావు ఊహల్లో అరుంధతి

మెదులుతుంది. ఆ విషయం శ్రోతకు తెలిసేలా అరుంధతి నవ్వుతున్నట్టు ఒక స్త్రీ కిల కిల నవ్వే శబ్దం వినిపిస్తుంది. ధర్మారావు ఆమె అందాన్ని తనలో పొగుడ్తున్నట్టు చిన్న స్వరంతో మనకు తెలియజేస్తాడు.

### 4.12.9. ధర్మారావు గిరిక సంభాషణ:

మువ్వల సవ్వడి రావడంతో గిరిక వస్తుందని శ్రోతకు అర్థమవుతుంది. సావిత్రమ్మ కూడా ధర్మారావుతో చెల్లెలు వస్తుందని అంటుంది. గిరిక ధర్మారావు ఆలయానికి వెళ్తారు. వారు నడుస్తున్న అడుగుల చప్పుడు బాగా వినబడుతుంది. గిరిక అన్నా వదినగారు వస్తున్నారని చెప్పిన మాటలో గిరిక వదిన వస్తుందనే ఆనందాన్ని ఆమెను చూడాలనే ఆత్రుతను చాలా చక్కగా వ్యక్తీకరించింది.

### 4.12.10. గంగాధర సోమాయజల ఇంటికి ధర్మారావు:

ప్రకృతి చిహ్నంగా, పల్లెటూరులోకి అడుగుపెట్టిన వాతావరణంతో కూడిన మ్యూజిక్ ఉంటుంది. ఎడ్లబండి గంటల సవ్వడితో రావడం చేత ఎడ్లబండే వస్తుందనే భావం శ్రోతకు కలుగుతుంది. ధర్మరావు కుటుంబం గంగాధరసోమయాజుల ఇంటికి వెళ్తారు. ఒక పాత్ర అదిగో గంగాధర సోమయాజుల ఇల్లు అనడంతో ధర్మారావు కుటుంబం గంగాధరసోమయాజుల ఇంటికి వచ్చినట్లు తెలుస్తుంది.

సాధారణంగా పల్లెటూరిలో సభలు సమావేశాలు. ఉత్సవాలు లేద జాతరలు జగబోయే ముందుగా దండోరా వినిపిస్తారు ఇక్కడ అదిగో గంగాధరసోమయాజుల ఇల్లహో....అనడం పల్లెటూరి వాతావరణాన్ని గుర్తు తెప్పించేలా ఉంది.

### 4.2.11.అరుధతి కాపురం:

సంగీత శబ్దం వచ్చి చిన్న చప్పుడు వస్తుంది శబ్దం తలుపు కొట్టిన శబ్దంలా ఉంటుంది. దానితో ఎవరో వస్తున్నట్టు శ్రోతకు తెలుస్తుంది. సావిత్రమ్మ రా చెల్లి రా అంటుంది. అయితే వచ్చిన పాత్ర ఎవరో తెలియజేయడానికి బాబు ధర్మా మీ పినతల్లి రంగాజి వచ్చిందని అంటుంది. బాబు కోడల్ని రమ్మను అనడంతో అరుంధతి కాపురానికి వచ్చినట్లుగా శ్రోతకు తెలుస్తుంది. సావిత్రమ్మ రంగాజమ్మను మీ అత్తగారని  అరుంధతికి పరిచయం చేస్తూ ఇంకా ఇద్దరు అత్తగార్లున్నారని చెప్తుండగానే రెండు పాత్రలు ప్రవేశిస్తాయి. వీరే మా అత్తగార్లని శ్రోతకు తెలియజేయడం కోసం సావిత్రమ్మ రా మంగా...రా..రత్నగిరి అని పేర్లను

సూచిస్తుంది. ఇక్కడ సావిత్రమ్మ అందరూ ఒకేచోట కూడాము ఆయన కూడా ఉంటే బాగుండునని ముక్కుతో ఎగపీలుస్తూ కన్నీరు పెడుతుంది. ఆ శబ్దం సావిత్రమ్మ కన్నీరు పెడుతుందని అర్థం అవుతుంది. ఈ కన్నీరు పెట్టిన విధానం శ్రోతకు కళ్ళకు కట్టినట్లుగా వ్యక్తం చేస్తుంది. అయితే వీరి ప్రస్తావనలో హైమవతి లేదు. రామేశ్వర శాస్త్రి చనిపోయినా అతని ప్రస్తావన వస్తుంది. కాని హైమవతిని చెప్పకపోవడం గమనార్హం.

రంగాజమ్మ ఏమిటి ఇంత సన్నగా ఉన్నావని అరుంధతిని అడిగితే అబ్బే ఏమిలేదని పైకి చిరునవ్వుతో అంటూ తన మనసులో గడుసుతనంతో ఇక్కడే కలివిడితనం తక్కువ అని అంటుంది. ఎవరికి వారు అంతామంచి వారే అని మనసులో అనుకునే విధానాన్ని స్వరం తగ్గించి చెప్పడం చక్కగా వ్యక్తీకరించింది.

ధర్మారావుతో అరుంధతి ఒంటరిగా ఉన్నప్పుడు మెల్లగా ఇంతమంది పిన తల్లులు ఎవరని ధర్మారావుని అడుగుతుంది. వాళ్ళు అత్తగారికి చెల్లెళ్ళా లేద మామగారి తమ్ముని భార్యలా అని ప్రశ్నిస్తే ధర్మారావు అమ్మకు చెల్లెళ్ళు లేరు నాన్నకు తమ్ముళ్ళు లేరు వారందర్నీ మా నాన్న వివాహం చేసుకున్నాడు అంటాడు. అరుంధతి పగులబడి నవ్వుతూ మామగారిని ఎగతాళి చేసే విధంగా నవ్వుతుంది. ఎగతాళి చేస్తున్నట్టు శ్రోతకు స్పష్టంగా తెలిసేవిధంగా అరుంధతి నవ్వడం గమనించాను. ధర్మారావు కోపంతో మా నాన్న గొప్పతనం మీ లాంటి దౌర్భాగ్యులకు ఏం తెలుస్తుంది అంటాడు. అరుంధతి మెల్లగా మనసులో ప్రతిది కోపమే నిన్న దేవదాసి, ఇప్పుడు రంగాజమ్మ ఇలా అనుకుంటూ ఉండగా అరుంధతి భయంతో కేక వేస్తుంది. ఏమైంది అంటే మాట వణుకుతూ పాము పాము అని వణుకుతూ ఉండడం ఆమె వ్యక్తం చేయడంలో వణుకుతూ అంటున్నట్టుగా ఆమె మాటల ద్వారా శ్రోతకు తెలుస్తుంది. ఆమె చెప్పిన విధానం రేడియో లక్షణాలలో ఒకటైన శ్రోత చూడడానికి అవకాశం ఉండదు. తన మాట ద్వారానే తెలపాలి. తను భయపడినట్టుగా గొంతు వణుకుతూ వచ్చినట్టుగా తన స్వరంతో వ్యక్తీకరించడం శ్రోతకు అర్థమవుతుంది. బుస్..బుస్...అనే శబ్దం రావడంతో అక్కడ పాముందని అర్థమవుతుంది. ఆమె ఆయాసపడుతూ భయపడడం శ్రోతకు తెలుస్తుంది.

అరుంధతి పుట్టింటికి వెళ్ళిన తర్వాత ధర్మారావు అరుంధతిని ఎప్పుడు మరలా మన ఇంటికి వస్తుందని అమ్మను అడగాలని అడగకుండా ఉంటాడు దానిని శ్రోతకు తెలియడానికి ధర్మారావు ఆగి ఆగి తడబడుతూ మొహమాటంతో అమ్మా అని పిలిచి అయితే అని ఆగిపోతాడు. సావిత్రి అయితే అంటే అడుగుతుంది. ఆ...ఆ...మీ తమ్ముడు సంగతులేంటి అని అడుగుతాడు ఇక్కడ శ్రోతకు ధర్మారావు అడిగేది అమ్మ తమ్ముడు గురించి కాదు అరుంధతి గురించని అర్థమవుతుంది. మొహమాట పడి అడగలేక మాట మార్చినట్టు శ్రోతకు అనిపిస్తుంది. ధర్మారావు భావాన్ని సావిత్రమ్మ గ్రహించి మాతమ్ముడు ఎలాగుంటే ఏమిటి అసలు సంగతి అరుంధతి అంటుంది.

అరుంధతిని ధర్మారావు ఇంటికి తీసుకురాగానే సావిత్రమ్మ అరుంధతిని చూసి అమ్మాయి ముఖం వాడినట్టు, బక్కచిక్కినట్టు ఆమె ఎన్నో కష్టాలు అనుభవించినట్టు సావిత్రి పాత్ర ద్వారా శ్రోతకు తెలియజేస్తారు. అరుంధతి పుట్టింట్లో పడిన కష్టాలన్ని తెలుసుకుని నిశ్చేష్టగా ఉంటుంది. ధర్మారావు ఓదారుస్తాడు అరుంధతి ఏడుపు ఆపుకోలేక బిగ్గరగా ఏడుస్తూ అక్కడ అనుభవించిన కష్టాలన్ని చెప్తుంది. ఆమె ఏడుస్తూ చెప్పిన విధానం నరకం నుండి బయటపడినట్టుగా శ్రోతకు అనిపిస్తుంది.

అరుంధతి, ధర్మారావుకి అన్నంలో మజ్జిగను అందించే సందర్భంలో ధర్మారావు అరుంధతి మీద మజ్జిగ చిలకరిస్తాడు. అరుంధతి ఎంగిలి అంటుంది. ధర్మారావు అట్లయితే ఒళ్ళంతా ఎంగిలే అంటాడు. కాదులేండి అమృతమే అని అరుంధతి చెప్పడం వారి శృంగార చేష్టలు శ్రోతకు కూడా ఒక అనుభూతి కలిగే విధంగా ఉంటుంది.

### 4.12.12. రంగాజమ్మ ఆరోగ్య స్థితి:

రంగాజమ్మకు ఆరోగ్యం బాగలేదని తెలిసిన సందర్భంలో రంగాజమ్మకు ఆయాసం ఎక్కువైందని ధర్మారావంటాడు. వెంటనే సావిత్రమ్మ తన బాధను వ్యక్తంచేయడానికి హా..పద..పద అంటుంది. ఈ మాట బాధను ,భయాన్ని కలుగజేస్తుంది. ఆ వ్యక్తికి ఎలా ఉందో ఏమైందో అన్న భావం శ్రోతకు స్ఫురిస్తుంది.

ధర్మారావు, సావిత్రమ్మ రామచంద్రారాజు ఇంటికి వస్తారు. ఏమైందో ఏమోనని కంగారుపడుతున్నట్టు రామచంద్రరాజు అతని గొంతులో వచ్చేటటువంటి స్వరాన్ని బట్టి అనిపిస్తుంది. ఇంతలో రంగాజమ్మ ఆయాసపడుతూనే బీరువా వైపు

సైగచేస్తుంది. ఇలా సైగ చేస్తుందని ధర్మారావు పాత్ర ద్వారా తెలియజేస్తారు. రంగాజమ్మకు  ఎక్కవ ఆయాసం అయిపోయి మాటలు వచ్చిరాక, గుక్కపట్టి, ఒక్కొక్క పదం పలకలేక పలకలేక పలుకుతూ ఆ చీర ఇమ్మని అదే అదే ఆ చీర కట్టుకుం.....అని పదం పూర్తి కాకుండానే మౌనం అయిపోతుంది. ఈ సన్నివేశం ఆమె ప్రాణం పోయే సమయాన్ని సూచిస్తూ ఆమె యొక్క ఊపిరి ఎలా ఆగిపోతుందో స్పష్టంగా వ్యక్తం చేశారు.

అమ్మ నాచేతిలోనే ఒదిగిపోయింది నేను దురదృష్టవంతుడ్నంటూ రామచంద్రరాజు విలపించిన బాధ ఆయన ఏడుపు శ్రోత గ్రహిస్తాడు. సావిత్రమ్మ అపరకర్మ పెళ్ళిలాగా చెయ్యి అన్నప్పుడు రామచంద్రరాజు అలాగే అలాగే..ఊరిలో ఎవరిని పొయ్యి ముట్టనివ్వను ఆ...అంటాడు. ఇది భావోద్వేగంతో అన్నట్టుగా శ్రోతకు తెలుస్తుంది.

### 4.12.13. గిరిక భక్తిభావం:

పిల్లనగ్రోవి శబ్దం వినిపించగానే వెంటనే శ్రోతకు దేవాలయం అనే భావం బోధపడుతుంది. తర్వాత మంత్రాలు వస్తాయి. గిరిక దేవాలయంలో పద్యం పాడుతుంది. ఇది మాత్రం గిరిక గొంతులా అనిపించదు. పద్యం అయిపోయిన తర్వాత ఆమె ఏడుపు మాత్రం గిరిక పాత్ర గొంతులాగే ఉంటుంది. పద్యంపాడి ఏడుస్తుంది. మరలా కాసేపటికి మరో పద్యం పాడుతుంది. అది కూడా గిరిక గొంతుకాదని అనిపిస్తుంది. గిరిక స్పృహ తప్పి పడిపోతుందని రధంతరి సంభాషణ ద్వారా తెలుస్తుంది. గిరిక ఇలా పడిపోయే విధానాన్ని ఉద్వేగాన్ని అరుంధతి పాత్ర ద్వారా తెలియజేస్తారు.

ఒక పిల్లనగ్రోవి శబ్దం వస్తుంది. రాబోయేది భక్తి భావాన్ని తెలియజేస్తుంది. గిరిక పాట రూపంలో కృష్ణుని వేడుకుంటుంది.

### 4.12.14.పాత్రల మానసిక సంఘర్షణ:

విరామసంగీతం వినిపిస్తుంది. ధర్మారావు యొక్క దారిద్ర్యం, దీనస్థితి, ధర్మారావు గద్గదికంగా అతని స్వరం ఉండడంతో అర్థమవుతుంది. అరుంధతి ధర్మారావుతో ఒంటి మీద ఏనగలు లేకుండా గాడిద హోదా ఎత్తినట్లు నా మెళ్ళో చంద్రహారం ఎందుకని అంటూ నేలమీద పడేస్తుంది. అప్పటి వరకు ప్రత్యక్షంగా

అరుంధతి, ధర్మారావుతో మాట్లాడుతుంది. ఆ తర్వాత సావిత్రమ్మ చంద్రహారాన్ని నేలమీద పడేశారే అని మనసులో అనుకుంటుంది.ధర్మారావు రాత్రి విసిరి పారేసిన హారం అరుంధతి మెళ్ళో ఎలా వచ్చిందని తన మనసులో అనుకుంటాడు. అరుంధతి అప్పుడే నిద్రలేసిన విధంగా అబ్బా హారం నా మెళ్ళోకి ఎలా వచ్చిందని తనలో అనుకుంటుంది. ఇలా ఎవరికి వారు తన మనసులో పడుతున్న సందేహాలను, సంఘర్షణను శ్రోతకు అర్థమయ్యేవిధంగా బాగా చిత్రీకరించారు.

చంద్రహారం విషయంలో అరుంధతికి ,ధర్మారావుకి మనస్పర్థలు ఏర్పడిన సందర్భంలో సావిత్రమ్మ చంద్రహారం కిందపడితే నేనే మెడలో వేశానని అంటుంది. అప్పుడు వీరిద్దరికి అసలు విషయం తెలుస్తుంది. అరుంధతి నా తప్పుకాదు అని సరదాగా ధర్మారావుని చెంపలేసుకోండి అంటుంది. ధర్మారావు అరుంధతి చెంపలు వేయబోతాడు అరుంధతి అబ్బా..నావి కావు నీవి అనడంతో ఇద్దరూ నవ్వుకుంటారు. ఇద్దరూ సరదాపడుతున్నట్టు శ్రోతకు బోధపడుతుంది.

### 4.12.15.ధర్మారావు అప్పు కోసం అన్వేషణ:

సుబ్బన్నపేటకు వెళ్ళడానికి డబ్బులేక ధర్మారావు ఎవరిని అడగాలని బయటకు వెళ్తుంటే రఘు అనే స్నేహితుడు ఎక్కడికి వెడుతున్నారని అడిగితే ఏం లేదు అని మరలా రఘూ...అంటూ కొంచెం తడబడుతూ సంశయంగా రెండు రూపాయలు కావాలంటాడు. నన్ను నమ్మి ఎవరైనా రెండురూపాయలు ఇస్తారా అని సందేహంగా అడుగుతాడు. అప్పుడు రఘు నాయరు పేరు చెప్పగా ధర్మారావు ఆయనా అని నీరసంగా అంటాడు. తనలో తాను అతని దగ్గర ఉంటే ఇస్తాడేమో కాని అడగాలంటే ఎలా ఒక వ్యాపారిని ఒక దివాన్ కుమారుడు అర్థించడమా? అంటూ ఆలోచిస్తూ ఉంటాడు.

ఈ సంభాషణలో ధర్మారావు తడబడుతూ సంశయంగా అడగడం, సందేహంగా మాట్లాడటం, నీరస స్వభావాన్నివ్యక్తం చేయడం తనలో తాను తన స్థితిని ఆలోచించడం ఇవన్నీ కూడా ధర్మారావు పాత్ర శ్రోతకు బోధపడేలా ఉంది.ధర్మారావు నాయరు కొట్టు దగ్గరకు వెళ్తాడు. నాయర్ని అడగలేక మొహమాటపడుతూ పది నిమిషాలు అలానే నిలుచుకుని ఉంటాడు అది నాయరు పాత్రద్వారా శ్రోతకు తెలియజేస్తాడు. నాయరు ధర్మారావును ఎందుకలా నిలుచుండి

పోయినావు అన్నప్పుడు ధర్మారావు ఆ...ఏమి లేదు..ఏమిలేదు...సరే..వస్తా అంటాడు. ఇక్కడ మనకు నాయరు ధర్మారావు యొక్క సమస్యను అర్థం చేసుకుంటున్నాడన్న భావం శ్రోతకు అర్థమవుతుంది. వెంటనే నాయరు డబ్బుఏమైనా కావాలా అంటాడు. దానికి  ధర్మారావు డబ్బా...అని కొంచెం సేపు ఆగడం అనేది అతనికి కావలసింది దొరికినట్టు అనిపిస్తుంది. వద్దులే అని కొంచెం దిగులుగా చెప్పి వెళ్ళిపోతాడు. నాయరు సరాసరి ధర్మారావింటికి వెళ్తాడు. ధర్మారావు మీరు మా ఇంటికి అని కొంచెం ఆశ్యర్యం, సందేహంగా అడిగినట్టు అర్థమవుతుంది. మీరు డబ్బు అడగడానికి ఇబ్బంది పడుతున్నారని అర్థమయ్యిందని డబ్బులిస్తాడు. ఇది నాయరు ధర్మారావుకు సహాయం చేస్తాడని శ్రోత ముందుగానే గ్రహించడానికి వీలుగా ఉంది.

### 4.12.16.రాజమ్మ పాత్ర ప్రవేశం:

ధర్మారావు సుబ్బన్నపేట కోటకు వచ్చి రాజమ్మా నేను రాణిగారిని చూడాలని అంటాడు. రాజమ్మ పాత్ర నవలలో లేదు కనుక నాటక సౌలభ్యం కోసం చిత్రీకరించారు. రాజమ్మ పాత్రద్వారా రామేశ్వరం ఇటువైపు గుడ్లురిమి చూస్తున్నట్టూ తెలియజేస్తారు.అప్పటికే శ్రోతకు రామేశ్వరం ధర్మారావుని అడ్డుకుంటాడనే భావం ముందుగానే స్ఫురిస్తుంది. రామేశ్వరం రాజమ్మతో ఎవరు రాజమ్మ అని అడిగితే ఆమె ధర్మారావు అనడంతో గంభీరంగా, కోపంతో ఆమె సొమ్ము తిన్నది చాలు ఇంక తినడానికి వీల్లేదని చెప్పు అని అంటాడు. ధర్మారావుకి ఇదే దివాను వంశానికి చివరి అనుబంధమేమోనని బాధపడ్తున్న విధానం శ్రోత గ్రహించగలడు.

### 4.12.17.గణాచారి కోటలోకి ప్రవేశం:

మరో సన్నివేశంలో మ్...మ్....అని మూలుగు శబ్దం వస్తుంది. గణాచారి వచ్చింది అనడానికి శ్రోతకు సంకేతం. కోట ముందు సగం రావిమండ, వేపమండ వేస్తుంది. సరోజినమ్మ నిన్ను పిలుస్తుందని పరిచారిక అంటుంది. గణాచారి అయ్యో రాణి చచ్చిపోతుంది అంటూ పూనకం వచ్చిన స్త్రీలు ఎలా ప్రవర్తిస్తారో ఇక్కడ గణాచారి మాటల్లో స్పష్టంగా కనబడుతుంది. ఆ స్వరంతోనే అయ్యో రాణి చచ్చిపోతుందంటూ ఏడుస్తుంది. ప్రత్యక్షంగా కళ్ళముందు శవాన్ని చూసి ఏడ్చినంత విధంగా ఆమె గొంతు ఉంటుందని నాకనిపించింది.

### 4.12.18.సరోజిని దేవి ఆలయ ప్రవేశం:

సంగీతం వస్తుంది. మంత్రాలు వినబడతాయి మరో సన్నివేశం గుడిలో జరగబోతుందని శ్రోతకు తెలుస్తుంది. చినరాణిగారు వస్తున్నారు తప్పుకోండి అని పూజారి అనగానే శ్రోతకు సరోజని దేవి దేవాలయానికి వచ్చినట్లుగా తెలుస్తుంది. ఆ దేవాలయంలో ముగ్గురుంటారు. ఒక స్త్రీ పాత్ర ఆ ముగ్గురూ తొలగిపోలేదని ప్రశ్నిస్తుంది.వారిలో ఒకరు గిరిక అయిఉంటుందని శ్రోత ఊహించగలడు మిగతా రెండు పాత్రలు ఎవరని సందేహం ఉంటుంది. కనుక వారి పేర్లు అరుంధతి, రథంతరి అని పూజారి సూచించడం జరిగింది.

సరోజనిదేవి వారి దగ్గరకు వెళ్ళి మీరు తెలుసుగాని మీపేర్లు తెలీదు అనగానే ఈమె పేరు ఏమిటి అనగానే గోపిక అంటారు. వెంటనే గిరికా ఏమిటి భావావేశం అంటుంది ఇక్కడ నుండి సంగీతం మొదలవుతుంది. గోపిక అనగానే భక్తితో ఉన్న భావావేశంతో పడబోతుంది. ఇది నేను పట్టుకోక పోతే బావిలో పడిపోదువని అరుంధతి పాత్ర ద్వారా చెప్పిస్తారు. రాణి ఇంతకు మీ పేరేమిటి అని అడుగగా నేను అరుంధతి అని అంటుంది.సరోజనిదేవి స్వయం పాకం ఇవ్వడానికి ఒక వృద్ధ బ్రాహ్మణున్ని పిలుస్తుంది. అతను వృద్ధుడు అని శ్రోతకు తెలియడానికి అతను చిన్నగా దగ్గుతూ ఆయాసపడుతూ పాత్ర ప్రవేశిస్తుంది.

### 4.12.19. సరోజని దేవి భర్త కోసం ఎదురుచూపులు:

రాణిగారు నీరసపడుతూ మూడురోజుల నుండి రాజుగారి కోసం ఎదురుచూస్తున్నాను. వస్తానని రాలేదు అన్నప్పుడు ఆమె గొంతులో ఆమెకు బాగా అలసటగా ఉన్నట్టు తెలుస్తుంది. అదే సమయంలో రంగారావు అనుకుంటూ ఉంటాడు. భర్తలని దైవంగా పూజించే భార్యల దగ్గర వారికి సుఖం ఉండదు అటువంటి భార్యల దగ్గరకి వచ్చేమి రాకేమి అని ఒక మేధావి ఎంత బాగా చెప్పాడో అని నవ్వుకుంటాడు.దీన్ని బట్టి రంగారావుకి సరోజనిదేవికి దగ్గరకు పోయే ఉద్దేశం ఉండదని పరోక్షంగా శ్రోతకు బోధపడుతుంది. రంగారావు ఇంటికి వచ్చినా రాణిగారిని చూడకుండా వెళ్ళిపోయినట్టు రాజమ్మ పాత్ర ద్వారా తెలుస్తుంది.

### 4.12.20. సరోజనిదేవి ఆఖరి మాటలు:

సరోజనిదేవి తన కొడుకు హరప్పనాయుడ్ని పిలిచి ధర్మారావు దగ్గరికి వెళ్ళి చదువుకోమంటుంది. ఇక్కడ ప్రేరేపించడం బుజ్జగించడం స్పష్టంగా తెలుస్తుంది.

చదువే నీకు తల్లిదండ్రులు అని చెప్పినప్పుడు ఏదో ఒక తీవ్ర బాధతో చెప్పినట్టు ఉంటుంది. ఇవి సరోజనిదేవి ఆఖరి మాటల్లాగా పరోక్షంగా అనిపిస్తాయి. అలాగే రాజమ్మతో నాచిన్ని కందుకు రాజవేషం వేయించమని కోరుకుంటుంది. ఇది ఆమె చివరి కోరికగా అనిపిస్తుంది.బాధాకరమైన సంగీతం వస్తుంది. తర్వాత రంగన్న రామేశ్వరంతో పెద్దరాణిగారు, చిన్నరాణిగారు ఇద్దరూ కన్నుమూశారని ఏడుస్తాడు. దీనితో ఇద్దరూ చనిపోయారని తెలుస్తుంది.

### 4.12.21.రాజమ్మ, రంగన్న సంభాషణ:.

విరామ సంగీతం తర్వాత రాజమ్మ, రంగన్న సంభాషణలలో జమిందారు విచారిస్తున్నాడని రంగన్నతో అంటుంది. రంగన్న నీకెలా తెలుసు అంటే ఇందాక చంద్రారెడ్డి గారు చూశాడంట నల్లకోటు వేసుకుని ఉన్నాడంట రంగన్న నల్లకోటు వేసుకుంటే విచారానికి గుర్తంట అని అంటుంది. దానికి రంగన్న బజార్లో ఉన్నప్పుడు నల్లకోటు, ఇంటికి రాగానే విప్పివేయడం అంటే విచారం కూడా అంతేనా అంటాడు. ఈ సంభాషణలో రంగారావు నటిస్తున్నట్టుగా శ్రోతకు పరోక్షంగా బోధపడుతుంది.

ఈ సంభాషణలోనే రాణిగారి మరణానంతరం దుఃఖంతో రంగారావు దేశాంతరాలు వెళ్ళిపోయారని జనులందరూ అనుకున్నారు కాని వెళ్ళింది అందుకు కాదు దొరసానిని తెచ్చుకోవడానికని తెలుస్తుంది. రాజమ్మ మా అమ్మగారు పోయిందే మేలు ఇవన్ని చూసి భరించలేకపోయేదని బాధపడుతూ రంగన్నకు చెబుతుంది. బాధగా చెప్పడం తెలుస్తుంది. రంగన్న రంగారావు ఉన్నప్పుడు మాత్రం రాణిగారి దగ్గరకు వచ్చారా ఏమిటి.నేను బ్రతిమిలాడినా చెప్పాపెట్టకుండా వెళ్ళిపోయాడు అని రంగన్న చెప్పడం శ్రోతకు రంగారావు వ్యక్తిత్వం అర్థమవుతుంది.

### 4.12.22.హరప్ప ధర్మారావు పరిచయం:

తర్వాత వాహన శబ్దం వస్తుంది. రంగన్న, హరప్ప బయటకు వెళ్ళినప్పుడు హరప్ప ధర్మారావును పరిచయం చేసుకుంటాడు. ధర్మారావు మొదట తను ఎవరో తెలియనప్పుడు ఎవరు అని గర్జించి తెలియగానే మర్యాదగా ప్రవర్తిస్తాడు. దీన్ని ధర్మారావు తాతగారిలాగా కార్య శూరుడని అనుకుంటాడు. హరప్ప మీ దగ్గర

చదువుకోమని చెప్పి అమ్మ చెన్నపట్నం వెళ్ళింది అని అంటాడు. హరప్పకు ధర్మారావు పాత్ర ద్వారా చినరాణి చనిపోయిన విషయం తెలీదని శ్రోతకు తెలుస్తుంది.

తర్వాత ధర్మారావు,హరప్పకు ముఖమంటపం దగ్గర్నుండి దేవాలయ స్వరూపాన్ని వివరిస్తుంటాడు. హరప్ప తన్మయత్వంతో అవన్ని వింటూ విలపిస్తూ ఉంటాడు. ఒక పక్క మెల్లగా గుడిగంటలు, ఓంకారం వస్తుంటుంది. గుడిలో ఉన్నటువంటి అనుభూతి శ్రోతలకు కలుగుతుంది.

మరోసన్నివేశంలొ హరప్ప ధర్మారావుతో కోటలో మేడ మీదకు వెళ్లి వెన్నెలను అన్నింటిని వర్ణిస్తుంటాడు. హరప్ప ధ్యానంలో ఉంటుండగానే ఓం అని ఫట్ అనే శబ్దం వస్తుంది. ధర్మారావు శివాశివా అంటాడు. తర్వాత రంగారావు మాటల ద్వారా హరప్ప యోగమరణం చెందినట్టుగా శ్రోతకు అనిపించింది.

### 4.12.23.పేరు లేని పాత్రల సంభాషణ:

ఒక పాత్ర ప్రవేశిస్తున్నాడని ఒక పాత్ర ద్వారా అదిగో పాలేరు పరిగెత్తకు వస్తున్నాడని ఒక పాత్ర ద్వారా తెలుస్తుంది. అతను పరిగెత్తిన విషయం అతను ఆయాస పడుతున్నట్టు ఉంటుంది. అతని మాట కూడా ఆయాసపడుతూ చెప్తున్నట్టు ఉంటుంది. పరిగెత్తుకురావడం శ్రోతకు వినిపించేలా ఉండడం నేను గమనించాను.

పాలేరు అయ్యా గణాచారి మన ఇంటి ముందు ఒక వేపమండ వేసిందని ఒకటవ పాత్ర , ఇంకోటి కోటముందు వేసింది అంటాడు ఆ ప్రదేశంలో ఉన్న రెండవ పాత్ర, అలాగా కోటలో ఏముంది అంటాడు మూడవ పాత్ర పురపాలక సంఘం వారు మేడ కట్టాలనుకుంటున్నారు అక్కడ ఒక వేపమండ వేసిందంటాడు. ఒకటవ పాత్ర మూడు వేపమండలు ఎక్కడ వేసిందో తెలిసింది నాలుగోమండ తెలయలేదు అనగా పాలేరు నాలుగో మండ ఊరవతల ఉన్న జమిందారి మేడ ముందు వేశారంట అని అంటాడు.

పై సంభాషణలో మూడు పాత్రల పేర్లు సూచించక పోవడం శ్రోతకు ఎవరు ఎవరితో చెప్తున్నారో అర్థం కావటం వంటి పరిస్థితి ఏర్పడిందని తెలుస్తుంది. అయితే భావాన్ని మాత్రం గ్రహించవచ్చు పేర్లు సూచించి ఉండుంటే బాగుండేది.

### 4.12.24. చంద్రారెడ్డి కాలు బాధ:

మరో సన్నివేశంలో నాగస్వరం వినిపిస్తుంది శ్రోతకు పసరికనో, సర్పమో వచ్చినటువంటి భావం వస్తుంది. గవర్నర్ సమక్షంలో గణాచారి ప్రవేశించినట్టు తెలుస్తుంది.గణాచారి అక్కడ వేపమండ వేసినట్టుగా ధర్మారావు చెప్తాడు. ధర్మారావు వెంటనే చంద్రారెడ్డిని కాలితో తోయకండి అని ఆత్రుతగా అంటున్నట్టు తెలుస్తుంది. అంతే కాకుండా చంద్రారెడ్డి కాలితో తోసిన విధానాన్ని ధర్మారావు పాత్ర ద్వారా తెలియజేస్తాడు. వెంటనే చంద్రారెడ్డి గొంతులో భయం, కలత ఉంటున్నట్టు అనిపిస్తుంది. ధర్మారావు ఏంటి చంద్రారెడ్డిగారు కాలు మాటిమాటికి చూసుకుంటున్నారు. కుంటుతున్నట్టున్నారు. అని అనడంతో వేపమండను తోసినందుకే ఇంతపనైందని అర్థం శ్రోతకు స్ఫురిస్తుంది.

సంగీతానంతరం చంద్రారెడ్డి పొలాల్లోకి వెళ్ళినప్పుడు నాగస్వరం వినబడుతుంది. తన కాళ్ళ దగ్గర ఏదో పోతున్నట్టు అంటాడు. వెంటనే పాము పాము అంటూ భయపడుతుంటాడు కాళ్ళు గజగజ వణుకుతున్నట్టు తానే వ్యక్తపరుస్తాడు. ఒకటి కాదురెండు కాదు నాలుగు పడగల పాము అంటూ నిశ్చేష్టుడు అయిపోతాడు. ఒక పాత్ర వచ్చి పిలిచినా పలుకడు చలనం లేకుండా నిలచిపోయారని శ్రోతకు తెలుస్తుంది.

### 4.12.25.గణాచారి పై చులకన భావంతో రామేశ్వరం:

గణాచారి హూంకరిస్తూ నల్లచీర కట్టుకుని వస్తుందని రామేశ్వరం ద్వారా తెలుస్తుంది. రామేశ్వరం గణాచారిని కొట్టబోతున్నట్టుగా అనిపిస్తుంది. చంద్రారెడ్డి ఆపి ఆమె కాళ్ళమీద పడమంటాడు. గంటలు మ్రోగడం ద్వారా దేవాలయమని తెలుస్తుంది. గణాచారి నీ వేయిపడగలు అలా ముడుచుకు పోతూ ఉంటే నేనేంచేశాను అంటూ భగవంతునికి విన్నపాలు చేసుకుంటుంది. మంత్రాలు వస్తాయి. చంద్రారెడ్డి గణాచారితో అందర్నీ క్షమించమని వేడుకుంటాడు.

ఈ సంభాషణలో వేయిపడగలు ఒక్కొక్కటి ముడుచుకు పోతున్నాయి. అనడంతో ఊరు కూడా నశించిపోతుందనే భావం శ్రోతకు స్ఫురిస్తుంది.

### 4.12.26.శివరావు ఆలోచనా విధానం:

శివరావు, ధర్మారావుతో మాట్లాడేటప్పుడు శివరావు భక్తితో తన్మయత్వం చెంది తనది పవిత్రమైన జీవితమని కృష్ణునిలో ఎందుకు ఐక్యం కాకూడదని అంటాడు

ఇలా మాట్లాడుతున్నప్పుడు శ్రోతకు నేనే గొప్పవాడినని తనకు తాను పొగుడ్తున్నట్టుగా అనిపిస్తుంది. ధర్మారావు కూడా శివరావు తనను తాను పొగుడుకుంటున్నాడని తన మనసులో అనుకుంటాడు. ఈ సంభాషణలో శివరావుకి గిరిక లక్షణాలు కొంత కనబడినట్టు శ్రోతకు బోధపడుతుంది.

### 4.12.27.మంగమ్మను లోబరుచుకున్న రామేశ్వరం:

మంగా అంటూ ఒక పాత్ర ప్రవేశిస్తాడు. సంభాషణను బట్టి మంగ భర్త అని తెలుస్తుంది.ఈ సంభాషణలో మంగ భర్త మంగతో ఇన్స్ పెక్షన్ కి వస్తున్నాడు వానికి వంటలు  చేయమని చెప్తాడు. ఇక్కడ ఇన్స్ పెక్షన్ కు వచ్చేది ఎవరిని సూచించలేదు పెద్ద జమిందార్లు అనడం వలన వచ్చేది రంగారావా లేక వారి కుటుంబ సభ్యుల్లో ఎవరైనానా అని అర్థం కాదు. వచ్చిన వ్యక్తి ఇక చాలు ఇక చాలు అని ఒక పాత్ర చెప్పడంతో అతని గొంతును బట్టి రామేశ్వరమని బోధపడుతుంది. అంతకుముందే ఆ పాత్ర పరిచయం ఉంది కనుక అతను రామేశ్వరం అని శ్రోతకు అర్థమవుతుంది. జోస్యులు (మంగ భర్త) స్కూల్ వరకు వెళ్ళి వస్తానని విశ్రాంతి తీసుకోండని రామేశ్వరానికి చెప్పి వెళ్తాడు. రామేశ్వరం దగ్గి నీళ్ళు అడుగుతాడు. ఆ దగ్గే విధానం నటన లాగా అనిపిస్తుంది. తర్వాత ఆమె ఛీ..ఛీ చెయ్యి వదలండి అనడంతో రామేశ్వరం ఆమె చెయ్యి పట్టుకున్నట్టు తెలుస్తుంది. అంతేకాకుండా పది రూపాయలు ఇస్తే నా ముఖాన పడేసింది జోస్యులతో చెప్తుందో ఏమోనని  లోపల భయపడుతూ బయటకు ధైర్యంగా ఉన్నట్లు అనిపిస్తుంది.

జోస్యులు రామేశ్వరం బాగా డబ్బున్న వాడని జమిందారు తర్వాత జమిందారంతటి వాడని, మరలా భోజనానికి వస్తాడని చెప్పగానే మంగ రామేశ్వరంతో మళ్ళీ రెండురోజుల్లో వస్తారా అని ఒక రకమైన ఆనందం ఆమె మాటల్లో కనబడుతుంది. సరే అయితే నేను సిద్దంగానే ఉంటా అన్నప్పుడు శ్రోతకు ఆమె రామేశ్వరానికి లొంగిపోయినట్లు అనే భావం స్ఫురిస్తుంది.

సంగీతానంతరం జోస్యులు నా ఉత్తరీయం కనబడలేదు నీ పెట్టెలో ఏమైనా కలిసిందేమో పెట్టి తాళాలు ఇవ్వు అని అడుగగా మంగమ్మ ఖంగారు భయం ఆమె మాటల్లో స్పష్టంగా తెలుస్తుంది. నాపెట్టెలో ఏమిలేదు అని చెప్పడం ఖంగారు పడుతూ చెప్తున్నట్లు గమనించాను. రామేశ్వరం వచ్చి బయట అరుగుమీద

పడుకుంటున్నావంటా ఉద్యోగంలో నుండి తీసేస్తానని కోపంగా జోస్యులతో అంటాడు. నేను చెప్పిన్నట్లు వింటే యాభైరూపాయలు ఎక్కువిస్తాను లోకులు ఛీఛీ అనుకుంటారనుకోకు నీ డబ్బుకి నా అధికారానికి వాళ్ళు భయపడుతూనే ఉంటారు అని చెప్పగా జోస్యులు ప్రయత్నిస్తాడని అంటారు. తర్వాత తనలో తాను డబ్బులిస్తాడంటా.....డబ్బెందుకు నా ప్రాణమే వద్దనుకుంటున్నాను అని తనలో దుఃఖాన్ని దిగమింగుకుని తనలోతాను కుమిలిపోతున్నట్టు నాకనిపించింది. జోస్యులు మంగతో మంగమ్మ నేను వారంలో చనిపోతాను రామేశ్వరాన్ని నువ్వు బుక్కా ఫకీర్ ను చేసి అన్ని లాక్కో నా పగ కోసం చెప్పట్లేదు. నీ మేలు కోసమే చెప్తున్నాను . కరిగిపోయే డబ్బుకోసం పవిత్రమైన నీ శీలాన్ని తాకట్టు పెట్టావు రేపందరు నిన్ను చెడిపోయిన ఆడదానివని ముద్రపడ్డావు. నిన్ను వదిలేస్తే నువ్వు ఎలా బ్రతుకుతావని చెప్తూ డబ్బుంటే ఆడిందే ఆట పాడిందే పాట అని అనుకుంటూ దూరంగా వెళ్ళిపోతున్నట్టు ఆ మాటల్లో అనిపించింది. ఏమిటి ఆ పరుగెత్తడం మళ్ళిరా.....రా అంటుంది. వెంటనే చావు సంగీతం వినిపిస్తుంది. మరలా జోస్యుల పాత్ర కనిపించదు.

### 4.12.28. ధర్మారావు స్వప్న వృత్తాంతం:

ధర్మారావుకి నిద్రలో కలవస్తుంది. దీనితో ధర్మారావు పసరిక, అరుంధతి రండి ,ఇక్కడకు రండి అని మూడుసార్లు పిలుస్తాడు. అది కల అని తెలియడం కొరకు కలవరిస్తున్నారేమో అని అరుంధతి అనడంతో శ్రోతకది కల అని తెలుస్తుంది ధర్మారావు ఇదంతా కలనా నిజమే అనిపించింది. నాకు సుబ్బన్న పేట ఊరు ఊరు ఆకాశంలోకి ఎగిరిపోతుంది కింద పసరిక అరుంధతి ఉన్నారు. ఆకాశంలో నా పక్కన గణాచారి ఉందని అంటాడు.

ఈ సంభాషణను బట్టి సుబ్బన్నపేట అంతరించిపోయే సమయం ఆసన్నమైనట్టుగా ఇక పసరిక అరుంధతి ఇక లేదనిఅనిపిస్తుంది.

### 4.12.29. రామేశ్వరం పై మంగమ్మ హేళనా భావం:

రామేశ్వరం మంగ సంభాషణలో మంగమ్మ వేళాకోలంగా మిమ్మల్ని జైల్లో పెట్టారంట కదా జమిందారి మీ తమ్ముడు బెయిల్ ఇప్పించారా ఆ చెప్పే విధానం వేళాకోలం ఆడుతున్నట్టు తెలుస్తుంది..

రామేశ్వరం నాలుగు వందలు కావాలని అడిగితే నా దగ్గరెక్కడుంది బ్యాంకులో వేసుకున్నా నువ్వు దొంగనోట్లు సృష్టిస్తున్నవు కాబట్టి ఆస్తి నాపేరు మీద రాశావు పల్లెటూరి పిల్లనని నన్నుమోసం చేశావు ఏడేండ్లు జైలు శిక్ష పడిందటగా బాగా ఏడువని అంటుంది. అని అనడంతో ఆమె భర్తపోతూ పోతూ రామేశ్వరాన్ని పగలు రాత్రి నీ వైపు తెప్పించుకుని దొరికినదంతా దోచేయ్ అని చివరిసారిగా చెప్పిన మాటలు తు.చ తప్పకుండా పాటించిందని తెలుస్తుంది. రామేశ్వరం ఈ రోజు దమ్మిడి కూడా లేకుండా అయిపోయిందని ఏడ్చినట్లుగా ఉంటుంది.

## 4.12.30. అరంధుతి అనారోగ్యంతో బాధపడటం:

అరుంధతి ఏడుపు వస్తుంది. ధర్మారావు ఏమిటి ఆ కన్నీళ్ళు అంటాడు. అరుంధతి నాకు కలలో సుబ్రహ్మణ్యేశ్వర స్వామి రెండు పడగలతో కనబడి ఒక తల మాయమైపోయి దాని కోసం వెదకితే వెనుక నుండి ఇంకో తల కనిపించింది. ముందు రెండు తలలు కనబడి ఒక తలమాయమైపోవడం వెనుక నుంచి ఇంకో తల రావడం ఏమిటని ఉన్నది మూడుతలలా కాని రెండుతలలా అంటూ విలపిస్తుంది ఆశ్చర్యంగా ధర్మారావు దీని అంతరార్థం ఏమిటని అనుకుంటూ ఈ స్వప్నం తెల్లవారుజామున వచ్చిందా అనగా అరుంధతి ఇంకో జాముంది లేండి అంటుంది. అనగా స్వప్న ఫలితం కొంత ఆలస్యం అవుతుందని ధర్మారావు అనుకోవడం ద్వారా తెలుస్తుంది. అరుంధతి నాకసలే ఓపిక తగ్గిపోతుంది. అంటుంది మందులు కూడా పని చేయడంలేదు అనడం ద్వారా అరుంధతి జీవితం ముగుస్తున్నట్టుగా అర్థమవుతుంది. తర్వాత పశుపతి కూతురు చిన్న అరుంధతిని బాగా చూసుకో అనడం పశుపతిలాంటి మామ ఉంటే నీకు ఆర్థిక స్థితి కూడా బాగుంటుందని బాధపడుతుంది. ఇంక ఆమె మీద ఆమెకు విశ్వాసం కోల్పోయి. చిన్న అరుంధతిని పెళ్ళి చేసుకోమనే భావం పరోక్షంగా అనిపించింది.సంగీతానంతరం అరుంధతిని రెండుమూడు సార్లు పిలిస్తే పలుకుతుంది.ఎక్కడో దూరంగా ఉండి పలికినట్టు అర్థమవుతుంది. ధర్మారావు కాకరపాదు నీడలో పడుకున్నావా అని చెప్పడంతో దానికి అరుంధతి పెరట్లోకి వచ్చి ఓపిక లేక ఇక్కడే కూర్చున్నానని అరుంధతి మాటల్లో రోగి మాట తీరు ఎలా ఉంటుందో అలా ఉంటుంది.

ఒక ఉత్సవ వాతావరణాన్ని తెలిపే విధంగా సంగీతం వస్తుంది. ధర్మారావింటికి బంధువులందరు వచ్చినట్టుగా తెలుస్తుంది. చిన్న అరుంధతిని పట్టుకుని పెద్ద అరుంధతి, బుజ్జగించడం, ముద్దులాడిన విధానం ఇలాంటివన్ని స్పష్టంగా తెలుస్తుంది. బాగలేనటువంటి అరుంధతి ఏదో సంతోషంతో తెలియరాని ఉత్సాహం ఆమెలో కలిగినట్టుగా తెలుస్తుంది.

ఈ సంభాషణలో చిన్న అరుంధతి గొంతు వినిపించదు ఆమె మాటలు కూడా ఉండుంటే బాగుండేది .అరుంధతి ధర్మారావుతో నాపై ఎంత ప్రేముందో చిన్న అరుంధతి పై కూడా అంతే ప్రేమ చూపాలి. నన్ను చూసినట్టు దాన్ని కూడా చూసుకోవాలి అంటుంది. ధర్మారావు నువ్వు నా అర్ధశరీరానివి నిన్నుచూసినట్లు దీన్ని ఎలా చూడాలో తెలీడం లేదు అంటాడు. తర్వాత అరుంధతి నేను పోయిన తర్వాత దీన్ని పెళ్ళి చేసుకోండని అనడం ఎవర్ని పెళ్లి చేసుకుంటావంటే మిమ్మల్నే చూపిస్తుంది. అనడంతో దాదాపు శ్రోతకు చిన్న అరుంధతిని పెళ్లి చేసుకుంటాడనే భావం వచ్చేలా చిత్రీకరించినట్టుగా ఉంది

అరుంధతికి వ్యాధి ఎక్కువై నీరసంగా మాట్లాడుతుంది. ధర్మారావు ఆమె బాధను చూడలేక ముఖానికి చేతులు అడ్డం పెట్టుకుని ఏడుస్తున్నట్టుగా అరుంధతి పాత్రద్వారా తెలుస్తుంది.ధర్మారావుని వైద్యుడు బయటకు పిలిచి ఏమిచెప్పాడని అడుగుతుంది. ధర్మారావు డబ్బులు పుచ్చుకోవడానికి మందులు ఎలా వాడాలో తెలపడానికి పిలిచాడని అరుంధతితో అంటాడు. నాకు అంతర్గతంగా ఆమె బతకదు అని చెప్పి వెళ్ళి ఉంటాడు అనే భావం స్ఫురిస్తుంది.

అరుంధతి ఏమిటండి జేబులో ఎత్తుగా ఉంది అని అడుగగా నువ్వుఉన్నావని అంటాడు ధర్మారావు ఇదిగో అంటూ చీరను చూపిస్తూ ఏకాదశి వెన్నెలలు, రంగాజమ్మ, రుక్మిణమ్మ, రావుగార్ల ఆత్మలు జ్యోతిరూపాలై మన ఇంటిచుట్టూ ఆవరించాయని అంటాడు. దానితో వారు ఈమెను తీసుకుపోవడానికి వచ్చినట్టు సూచనప్రాయంగా మనకు ధర్మారావు పాత్ర ద్వారా తెలుస్తుంది. అయితే ఇక్కడ అరుంధతికి కనబడాలి కాని ధర్మారావుకి కనబడటం అనే సందేహం శ్రోతకు ఏర్పడుతుంది.

### 4.12.31. రంగారావు సర్పదర్శనం:

రంగారావుకు ఒక పడగతో స్వామి దర్శనం ఇవ్వడం జరుగుతుంది. నేను తప్పుచేశానని పశ్చాత్తాప పడుతుంటాడు ఇంతలో ఎవరు నువ్వు అని ఆత్రుతంగా ఉద్వేగంతో సర్పాకృతిలో ఉన్నావు ఇప్పుడు బాలుడి వలె ఉన్నావు అంటాడు. నా పేరు రామేశ్వర శాస్త్రి అనగానే రంగారావు మీరంటే నాకు పడదు మీ కొడుకు నాకొడుకును చేరదీశాడు. నువ్వు చిన్న పిల్లవాడిలాగా ఉన్నావెందుకు అనగానే గుండెఝల్లుమంటుంది. తర్వాత రంగారావు తేరుకుని ఉన్న పిల్లవాడు ధర్మారావు కొడుకు రామేశ్వరశాస్త్రి అని తెలుస్తుంది శ్రోత అయోమయ స్థితికి వెళ్ళిపోయి ఒక భయం అనే స్వభావం కలిగి మళ్ళి సాధారణ స్థితికి చేరుకునే విధంగా ఈ సంభాషణ ఉన్నట్టుగా తీర్చిదిద్దారు..

### 4.12.32.గిరిక భగవంతునిలో ఐక్యమైపోవడం:

విరామసంగీతం తర్వాత గిరిక తన్మయత్వంతో వేణుగోపాల స్వామిని తలచుకుంటూ ఆగిపోవడం భోగప్పశాస్త్రి అయ్యో గిరికా.....గిరికా పడిపోతున్నావే గిరికా ధర్మారావుని పిలిచి అదిగో చూడండి గిరిక పడిపోతుంది. అంటాడు. ధర్మారావు కూడా ఆర్తితో ఆయాసంతో అది పడిపోవడం కాదు స్వామిలో ఐక్యమై పోవడం అంటాడు. గిరిక పాత్ర ముగిసినట్లు తెలుస్తుంది. ఆమె పడిపోయినప్పుడు భోగప్ప పడిన ఖంగారు ఆయన వ్యక్తంచేసిన తీరు దానికి  స్పందించి వ్యక్తీకరించిన ధర్మారావు తీరు ఒళ్ళు పులకరించేలా ఉంది.

### 4.12.33.పసరిక మరణం:

పసరికలో ఆధునిక లక్షణాలు గమనించిన ధర్మారావు పసరిక కోసం సర్పస్తుతి చేస్తానంటాడు. దీన్ని బట్టి పసరిక కాలం అయిపోతుందనే అనుమానం కలుగుతుంది. ప్రతి పాత్రను సూచనప్రాయంగా తెలియజేయడం ప్రధానంగా గమనిస్తున్నాను. ఇది కూడా ఒక సూచికలా అనిపించింది. మంగ ఏడుస్తుంది. ధర్మారావు ఆమెను ఓదారుస్తాడు. పాము కరవడం వల్ల పసరిక చనిపోయిందని ధర్మారావు పాత్ర ద్వారా శ్రోతకు తెలుస్తుంది.

## 4.12.34.ధర్మారావు చిన్న అరుంధతితో వివాహం:

పిల్లవాడు రామేశ్వరశాస్త్రి మా అమ్మ కలలో వచ్చింది నన్ను చదువుకోమని నేను మళ్ళీ వస్తానని చెప్పింది అని నువ్వు పెళ్ళిచేసుకోమంటాడు. తంతి వస్తుంది. ధర్మారావు చిన్న అరుంధతికి జబ్బు చేస్తే నేనేం చేయను అని కోపపడటం పేపర్ చింపిన శబ్దం స్పష్టంగా అర్థమవుతుంది. ఈ లోపు కుమారస్వామి వచ్చి ఇంకో తంతి వచ్చింది చిన్న అరుంధతికి సుస్తి తీవ్రమయిందట అంటూ సరే వెళ్తానంటాడు. ఈ లోపు బుస్ అనే శబ్దం తర్వాత నాగస్వరం వస్తుంది ధర్మారావు మాటల్లో రెండుతలల సుబ్రహ్మణ్యేశ్వరుడు కనిపిస్తాడు.ధర్మారావు పశుపతింటికి వెళ్తాడు చిన్న అరుంధతి ధర్మారావుని కలవరిస్తుంది. మందులు ఆమెకు పనిచేయడం లేదు ఆఖరికి వారుకూడా దిగిరాక తప్పలేదని ఒక వ్యక్తి చెప్తుంది. ఇక పశుపతి ధర్మారావుకి పెళ్ళి చేయడానికి సిద్ధపడ్డాడు. అని శ్రోతకు అర్థమవుతుంది. పశుపతి పశ్చాత్తాపంతో పెళ్ళి చేస్తాడు.

ధర్మారావు ఊహల్లో ఏమండి అని ఒక వైపు మరోవైపు పెద్ద అరుంధతి నవ్వుతున్నట్టు శబ్దం ఏదో ఆత్మ వచ్చి ధర్మారావుని పిలుస్తున్నట్టుగా నాకు అనిపించింది.ధర్మారావు చిన్న అరుంధతి స్పర్శ నా అరుంధతి లాగే ఉంది. నీకింత బలం ఎక్కడినుండి వచ్చింది అనడంతో చిన్న అరుంధతికి జబ్బు నయమైనట్టుగా తెలుస్తుంది. ఇక ఆమె పలికిన విధానం, నవ్వడం పెద్ద అరుంధతిలాగే అనిపించాయి. ధర్మారావు నేను మిగిలాను నువ్వు మిగిలావు అనడంతో ఇది నాటకానికి భరతవాక్యంగా అనిపిస్తుంది.

ఈ అధ్యాయంలో గణపతి, వేయిపడగలు రేడియో నాటకాలలో రేడియో నాటక లక్షణాల దృష్ట్యా కథ నడిచిందా లేదా రేడియోనాటక లక్షణాలు ఎంతవరకు ప్రతి ఫలించాయో ఇందులో పరిశీలించాను. గణపతి హాస్య నవల కాబట్టి దీనిని రేడియో నాటకంగా మలచిన తర్వాత ఇందులో హాస్య లక్షణాలను, హాస్యనాటక లక్షణాలను ఈ నాటకానికి అన్వయించాను. అలాగే రేడియో నాటక లక్షణాలను పేర్కొని గణపతి, వేయిపడగలలో ప్రతిఫలించిన విధానాన్ని తెలియజేశాను.

ఇక తర్వాత అధ్యాయంలో గణపతి, వేయిపడగల రేడియో నాటకాలలోని పాత్ర చిత్రణను వివరించి ఈ రేడియో నాటకాలలోపాల్గొన్న నటీ నటులను తెలియజేస్తాను

ఐదవ అధ్యాయం

# గణపతి, వేయిపడగలు : రేడియో నాటకీకరణ పాత్ర పోషణ

నవలలను రేడియో నాటకాలుగా మలిచినప్పుడు పాత్ర పోషణకు పెద్ద పీట వేయాలి. ఆయా పాత్రలు ఆయా సన్నివేశాలలో వారి హావభావాలను చక్కగా వ్యక్తీకరించాల్సి ఉంటుంది. కాబట్టి 'గణపతి, వేయిపడగలు రేడియో నాటకీకరణ పాత్ర పోషణ' అనే అధ్యాయాన్ని నా పరిశోధనాంశంలో చేర్చాను. ఇందులో పాత్ర చిత్రణను వివరించి గణపతి, వేయిపడగల రేడియో నాటకంలోని పాత్రలను, పాత్రధారులను తెలియజేస్తున్నాను.

**5.1.పాత్ర పోషణ:**

నవలలో రచయిత అంతర్లీనంగా పాత్రల మనోభావాలను వ్యక్తం చేస్తాడు. ఒక్కొక్కసారి రచయితే స్వయంగా కథను నడిపిస్తాడు. వర్ణనలు, పాత్రల చిత్త వృత్తులను తెలియజేయడానికి రచయితే స్వయంగా కథలో ప్రవేశించి ప్రస్తావిస్తాడు. కొన్ని సన్నివేశాలను పాత్రల చేత మాట్లాడిస్తాడు. ఇలా నవలకు పాఠకులకు అర్థమయ్యే విధంగా రూపు దిద్దుతాడు. అయితే పాఠకులకు అనడంచేత చదువుకున్న వారికి మాత్రమే అనే అర్థం స్ఫురిస్తుంది. అది నవల గ్రాంథికమైతే చదవడానికి కష్ట సాధ్యమవుతుంది. ఆ కథలోని సారాంశాన్ని పూర్తిగా ఆకళింపు చేసుకోలేదు. ఆనందాన్ని ఆస్వాదించలేడు. కఠిన తరంగా ఉన్న పదాలకు నిఘంటువులను చూసుకుంటూ అర్థం తెలుసుకుంటూ నవల ముగించేటప్పటికి నవలలోని కథాంశాన్ని పూర్తిగా అవగాహన చేసుకోకపోవడం జరుగుతుంది.

''*కవి సామాన్యంగా తనకు తెలిసిన జీవితాన్నే చిత్రించినప్పుడు అది సజీవమైన పాత్ర పోషణ అవుతుంది. పాత్రల సుఖ దు:ఖాలను తానుగా అనుభవించాలి. పాత్ర పోషణ కథకి, రసానికి సన్నివేశానికి సంబంధించిన సమన్వయానికి తోడ్పడుతుంది.*''[1]

---

[1]వేంకటేశ్వరరావు, దార్ల. జ్ఞానా నంద కవి ఆమ్రపాలి,పుట:23.

గణపతి, వేయిపడగల రేడియో నాటకంలో ప్రతి పాత్ర వారు పొందిన సుఖదుఃఖాలు వారి నటనలో జీవం పోసుకుని శ్రోతకు గొప్ప అనుభూతిని కలిగించాయి.

*"ఒక కథలోగాని, నాటకంలోగాని ఉన్న ఒక వ్యక్తి లక్షణాలను , ప్రవర్తనను నిర్దేశించే పదం 'పాత్ర' ఇంగ్లీష్ లో character అంటారు. ఒక వ్యక్తిని మిగిలిన వారి నుంచి వేరు చేసే ఆ వ్యక్తిలోని స్వరూప స్వభావ చేష్టాదులను వ్యక్తీకరించే లక్షణాల సంపుటీ కరణ పాత్ర ఈ మాట బాహ్య లక్షణాలను గురించే కాక, అంతకన్నా ఎక్కువగా ఆంతరంగిక, మానసిక, నైతిక లక్షణాలకే ప్రాముఖ్యం ఇస్తుంది."*[2]

గణపతి, వేయిపడగల రేడియో నాటకంలో వ్యక్తి స్వభావాలు వారి మానసిక చిత్రణ చక్కగా పోషించబడ్డాయి.

*"ఒక పాత్రను అర్థంచేసుకోవడానికి ప్రధానంగా పరిశీలించవలసింది ఆ పాత్ర నాటకాంతం ఏ విధంగా ఆవిష్కరించబడుతోందా లేదా అని పాత్రను ప్రేక్షకులకు తెలియచెప్పడానికి రచయితకు రెండు ప్రధాన పద్ధతులున్నాయి. ఒకటి మాటలు, రెండు చేతలు. ఒక్కొక్కప్పుడు పాత్రలు ఒక్కొక్క సన్నివేశంలో ఏ విధంగా ఉండాలో రచయితే మనకు చెప్తాడు. ఏ నాటకంలోనైనా పాత్రల మాటలు, చేతలే మనకు పాత్రల మనోగతాలని, తద్వారా ఆ పాత్రల వ్యక్తిత్వాన్ని తెలియజెప్పగలవు."*[3]

గణపతి, వేయిపడగలు రేడియో నాటకాలు కనుక అందులో జరిగే ప్రతి సన్నివేశం పాత్రల సంభాషణ ద్వారానే తెలుసుకోగలుగుతాము.

శిల్పము, వస్తువు, శైలి, మొదలైనవన్ని ఒకదానికొకటి ముడిపడి విడదీయరానంతగా కలసి పోవును. ఈ లక్షణాలన్నీ ఒకదానికొకటి పుష్టిని కలిగించుకుంటూ ఒకదాని వలన ఇంకొకటి సౌందర్యాన్ని ఆపాదించుకుని సాగిపోతూ ఏకైక ప్రవాహమై చిత్రమును ప్రతిబింబించును[4]

ఒక పాత్ర సహజంగా ఉందా లేదా అన్న విషయాన్ని నిర్ణయించుటకు ఆ పాత్ర యొక్క ప్రవర్తన భావములు, భాష పరిశీలించాలి ఒక సంఘటనమునకు ఆ

[2]నాగభూషణ శర్మ, మొదలి. నాటక శిల్పం,పుట:97.

[3]నాగభూషణ శర్మ, మొదలి. నాటక శిల్పం,పుట:98.

[4]శ్యామలాదేవి, దిట్టకవి. విశ్వనాథ నవలలో ముఖ్య స్త్రీ పాత్ర చిత్రణము,(సి.వ్యా)పుట:17.

వ్యక్తి ఎట్లు చెలించెను అన్న దానిపై ఈ విషయం ఆధారపడి ఉంది. జీవితంలో సుఖము కలిగినపుడు ఎటులున్నదో దుఃఖము సంప్రాప్తించినపుడు ఎలా ఉందో ఆ విషయమే సహజత్వం అసహజత్వ విషయాన్ని నిరూపణం చేస్తుంది[5].

గణపతి, వేయిపడగల నవలల్లోని వృత్తాంతాలు అందరిని ఆకర్షించిన ఒక మహత్కర నవలలుగా చెప్పవచ్చు. అయితే ఈ నవలలు గ్రాంథికంలో సాగాయి. పాఠకులు అర్థం చేసుకుని చదివినా కొంతమంది మాత్రం ఈ నవలలోని మాధుర్యాన్ని అనుభవించలేరు. ఆ లోటును తీర్చడానికి గణపతి, వేయిపడగలు రేడియో నాటకాలుగా ప్రసారమయ్యాయి. నవలలను ఈ నాటకాలను రెండింటిని పరిశీలించినప్పుడు నవలలోని రచయిత చెప్పిన భావాలన్ని నాటకంలో పాత్రల సంభాషణల్లో వెల్లడవుతాయి. అందుచేత రేడియో నాటకాలని శ్రోత ఆనందిస్తాడు. నవలలో చదివినదానికంటే రేడియో నాటకంలో కథను చమత్కారంగా తీర్చిదిద్దడం, పాత్రల హావభావాలను సంభాషణ ద్వారా వ్యక్తం చేయడం శ్రోతకు వీనులవిందుగా తోస్తుంది.

ఇక గణపతి, వేయిపడగలు రేడియో నాటకాలలోని పాత్రల విషయానికి వస్తే నవలలోను, నాటకంలోనూ పాత్రల స్వభావాలు ఒకే తీరులా ఉన్నా కొద్ది మార్పులు రేడియో నాటకంలో చోటుచేసుకున్నాయి.

గణపతి, వేయిపడగల రేడియో నాటకాలలోని ఆయా సన్నివేశాలలో చక్కటి సంభాషణతో రసానుభూతిని శ్రోతకు కలిగించే విధంగా పాత్ర పోషణ చేశారు.

### 5.2.గణపతి:రేడియో నాటకీకరణ :పాత్ర పోషణ:

గణపతి రేడియో నాటకంలో కొద్ది పాత్రల చేత కొన్ని మార్పులు, చేర్పులతో నాటకం ప్రారంభమవుతుంది. ఈ నాటకంలోని కొన్ని ముఖ్యమైన పాత్రలను ఈ క్రింది పేర్కుంటున్నాను.

### 5.2.1. గణపతి:

రేడియో నాటక ప్రారంభంలోనే గణపతి బడిలో చేర్చడానికి తల్లిని వెంటబెట్టుకుని తీసుకువస్తుంది. బడి పిల్లలందరు గణపతిని మనిషిగా కాకుండా

[5]శ్యామలాదేవి, దిట్టకవి. విశ్వనాథ నవలలో ముఖ్య స్త్రీ పాత్ర చిత్రణము,(సి.వ్యా)పుట:18.

కొండముచ్చుగా భావిస్తారు. ఇక్కడ నుంచే గణపతి చేష్టలే కాకుండా గణపతి రూపురేఖలు కూడా హాస్యాన్ని అందించే విధంగా గణపతి పాత్రను తీర్చిదిద్దినట్టుగా ఉంటుంది. ఇక బడిలో తన తల్లి మామగారు ఇంకా పెద్ద ఉద్యోగం చేశాడు. అని అన్నప్పుడు ఏమిటా ఉద్యోగమని మాస్టర్ అడుగుతాడు. దానికి గణపతి ఏముంది చనిపోయే వాళ్ళను సరదాగా మోసేవాడు అనడంతో ఇక్కడ నుండే గణపతి మాటలకు హాస్యం మొదలవుతుంది. తర్వాత గణపతి నేను బడికి వెళ్ళనే ఇక్కడ దయ్యాలుంటాయని ఏడుస్తుంటాడు. సింగమ్మ ఓదారుస్తూ నువ్వు బడికి వెళ్ళకపోతే మామయ్య కోపపడతాడని నువ్వు బడికి వెళ్ళి చదువుకుంటే నువ్వు కానిస్టేబో, కలకటేరో అయ్యి గుఱ్ఱం ఎక్కి ఊరేగించవచ్చు అని చెప్పడంతో గణపతి బడికి వెళ్ళడానికి ఒప్పుకున్నట్టు గా శ్రోతకు తెలుస్తుంది.

ఒక రోజు మేనత్త తనకు అన్నం వండిపెట్టిన విధానాన్ని దారిన పోయే మహదేవ శాస్త్రిని పిలిచి మేనత్తను అవమానిస్తుంటాడు. ఇలా తన ప్రతికూల పరిస్థితులను తనకు అనుకూలంగా మార్చుకునే వ్యక్తిగా కనపడ్తాడు. రంగన్న, సింగమ్మలు గాడిదనెక్కుతారా అని అడుగగా కలిగినవాడు గుర్రాన్ని లేనివాడు గాడిదను ఎక్కుతాడని సమాధానమిస్తూ అలాగే దేవతల వాహనాల పేర్లను సూచిస్తాడు.

ఇలా గణపతి ఉన్న దాంట్లో సర్దుకుపోవాలనే సందేశాన్ని శ్రోతకు కలుగజేస్తాడు. అదేవిధంగా అతను దేవతల వాహనాలను వివరించే తీరు తన తప్పిదాన్ని కప్పిపుచ్చుకునే జ్ఞానం, సామర్థ్యం పుష్కలంగా ఉంటుంది. గణపతి రాజమహేంద్రవరం వెళ్ళి పుటావు చడావులు తెల్లారేసరికి ఎలాగో సంపాదించుకోవచ్చు గిరజాలు ఎలా వస్తాయో తన స్నేహితుని ద్వారా ఉపాయాన్ని తెలుసుకుని గుండు గీయించుకుని ఆముదంతో మర్దన చేస్తాడు. పొద్దు పొడిచే లోపు వస్తాయని అనుకుంటాడు. ఇక్కడ గణపతి అజ్ఞానం స్పష్టంగా బయటపడుతుంది. గణపతి గరుడా చలం పక్కన కృష్ణ వేషం వేయడానికి వచ్చినప్పుడు గరుడా చలం అతని రూపురేఖలు వర్ణించేటప్పుడు వామనావతారంతో పోలుస్తుంది. అది గాక హాస్యగాడుగా అయితే పనికి వస్తాడు అనుకుంటుంది.

చివరకు గణపతి పిల్లవాణ్ణి కొట్టి అటకమీద దాక్కొని పారిపోయే క్రమంలో తన తల్లే(సింగమ్మ) కొండముచ్చని భావిస్తుంది. మహదేవశాస్త్రి కూడా ఆ కొండ ముచ్చే అని మొదట అని కాదు గణపతి పారిపోతున్నాడు అంటాడు. ఇక సింగమ్మ వాడెలాగో రాడు నేను మీతో కాశీకి వచ్చేస్తాను అనడంతో గణపతి పాత్ర ముగిసినట్లు తెలుస్తుంది.

అంటే గణపతి నాటకంలో మొదట కొండ ముచ్చు అవతారంలో దర్శనమిచ్చినట్టు తెలుస్తుంది. ఇలా హాస్యధోరణిలో సాగిపోతున్న జీవితం గరుడా చలం దగ్గర వామనావతారం ఇచ్చినట్లు తెలుస్తుంది. చివరకు గణపతి పాత్ర కొండ ముచ్చుగానే పరి సమాప్తమవుతుంది.

ఇలాంటి గణపతి పాత్ర ఒక సందర్భంలో జ్ఞానవంతుడుగా ఒక సందర్భంలో అజ్ఞానుడుగా, మరో సందర్భంలో అమాయకత్వంగా భిన్న రూపాలలో దర్శనమిచ్చి గణపతి జీవితం హాస్యాస్పదంగా సాగిపోతుంది.

నవలలో విస్తారంగా ఉన్న గణపతి పాత్రను నాటకంలో కొన్ని మార్పులతో చిన్నదిగా కుదించి నవలలో రచయిత చెప్పిన దాన్ని గణపతి సంభాషణల ద్వారా హాస్యాన్ని అందించి శ్రోతకు వినోదాన్ని సందేశాన్ని ఇచ్చి అన్ని విధాల న్యాయం చేశాడు.

ఈ విధంగా గణపతి పాత్రను నాటకంలో చక్కగా పోషించబడింది.

### 5.2.2. సింగమ్మ:

సింగమ్మ గణపతిని బడికి తీసుకురావడంతో సింగమ్మ పాత్ర ప్రారంభమవుతుంది. సింగమ్మ తన కొడుకును బడిలో చేర్చడానికి వెళ్ళినప్పుడు మాస్టరు పిల్లవాడు ఎప్పుడు పుట్టాడని అడుగగా సరైన సమాధానాలు ఇవ్వకుండా భిన్న సమాధానాలు ఇస్తుంది. దీన్ని బట్టి శ్రోతకు సింగమ్మ పాత్ర ఎటువంటిదో ఒక అంచనా వేయగలడు. మాస్టరు మీ వారి పేరు ఏమిటి అని అడిగినప్పుడు సింగమ్మ ఆయన పేరు నేను ఎలా చెప్పుదును అని పతి భక్తిని వ్యక్తం చేస్తూ సిగ్గు పడుతూ చెప్పరా మీ నాన్న పేరు అని ఆయన పోయారని బోరుమని ఏడుస్తుంది. ఆయనుంటే రెండు చేతుల్లా సంపాదించే వాడని ఏడుస్తుంటే ఆ ఏడుపుని గణపతి కూడా అనుసరిస్తాడు. ఇక్కడ ఆమె ఏడవ వలసిన సందర్భం లేదు కాని ఏడవడం ద్వారా

ఆమె అమాయకత్వం, అజ్ఞానం శ్రోతకు తెలుస్తుంది. నాగన్న గణపతి బడికి వెళ్ళకుండా గణపతి చేసే పనులను సింగమ్మకు చెప్పగా సింగమ్మ కొడుకును వెనకేసుకువస్తూ గణపతి చేసే పనులను సమర్థిస్తూ ఉంటుంది. పైగా పిల్లలందరూ కలసి తన కొడుకు గణపతిని చెడిపేస్తున్నట్టుగా పొంతన లేని సమాధానాలు నాగన్నకు చెప్తుంది. గణపతి గాడిదమీద ఊరేగించి కింద పడిన తర్వాత సింగమ్మ గణపతి చెప్పిన సమాధానాలను ఎంత చదువు చదివావు పురాణాలన్ని నీ నోట్లోనే ఉన్నాయి. నిన్ను మించిన వాడు ఇక లేదు అనే భావంతో ఉప్పొంగి పోతుంది.

సింగమ్మ మీ మామ కోపంతో వస్తున్నాడు పారిపోమని చెప్పి నాకు ఒక్కగానొక్క కొడుకు నాయినా వాడిని ఏమిచేయకు దిక్కుమాలిన కొంత మందికి వాడంటే పడటం లేదు. వాళ్ళు నాశనమైపోతారు. శాపనార్థాలు పెడుతూ ఎత్తిపొడుపు మాటలు మాట్లడుతుంది. సందర్భానుసారంగా సింగమ్మ కూడా తన కొడుకును తప్పించే సామర్థ్యం, నేర్పరితనం కలిగిందిగా కనబడుతుంది. ఇది తన కొడుకు మీద ఉన్న వాత్సల్యంగా భావిస్తున్నాను. చివరకు మహదేవ శాస్త్రితో కలిసి కాశీకి వెళ్తాను అనడంతో నాటకం ముగుస్తుంది. సింగమ్మ పాత్రను కూడా కొన్ని మార్పులు, చేర్పులు చేసి చిత్రీకరించారు. ఉదాహరణకు నవలలో సింగమ్మ రామేశ్వర యాత్రకు వెళ్తే నాటకంగా కాశీకి వెళ్ళినట్లుగా ఉంటుంది. నవలలో సింగమ్మ మరణిస్తుంది. నాటకంలో జీవించే ఉంటుంది.

### 5.2.3.నాగన్న:

సింగమ్మ తమ్ముడు గణపతి మేనమామ నాగన్నకు గణపతి చిన్నప్పటి నుంచే గణపతి చేష్టలు నచ్చేవి కావు. నాగన్న గణపతి చేసే పనులకు ఇబ్బంది పడుతూనే ఉంటాడు నాటకంలో గణపతి బడికి వెళ్ళను అని ఏడ్చినప్పుడు సింగమ్మ మీ మామయ్య కోపపడుతాడు అని అన్నప్పుడే గణపతి చేష్టలు నాగన్నకు నచ్చవు అని శ్రోతకు సూచన ప్రాయంగా తెలుస్తుంది.

గణపతి గాడిదమీద ఊరేగించిన విధానం మాచమ్మ ద్వారా నాగన్న తెలుసుకుని ఆగ్రహంతో గణపతి దగ్గరకు వెళ్తుండగా గణపతిని తప్పించేస్తుంది సింగమ్మ. తండ్రి లేని గణపతిని మేనమామ అతని బాధ్యత తన మీద వేసుకుని గణపతిని సరైన దారిలో పెట్టి గణపతిని అభివృద్ధిలో పెట్టాలని ప్రయత్నం

చేస్తుంటాడు. ఈ క్రమంలోనే గణపతిని దండించడానికి పూనుకుంటాడు. సింగమ్మ అడుగడుగునా అడ్డు పడుతుండడం నాగన్న సంభాషణ ద్వారానే శ్రోతకు తెలుస్తుంది. నాగన్న కూతుర్ని గణపతికి ఇవ్వలేదని సింగమ్మ మాచమ్మ పై విరుచుకుపడుతుంది. నాగన్న గణపతి, సింగమ్మను తన ఇంటి నుండి వెళ్ళి పోమంటాడు. ఇక్కడ నుండి నాటకంలో నాగన్న పాత్ర మళ్ళీ కనబడదు.

### 5.2.4.మాచమ్మ:

మాచమ్మ పేరుకు తగినట్టుగానే ఉంటుంది. అంటే ఆ విధంగా పాత్రను తీర్చిదిద్దారు. ఆమె మాట తీరు అలాగే ఉంటుంది. మాచమ్మ పాత్ర ప్రవేశంలోనే గణపతి మీద ఆగ్రహాన్ని వ్యక్తం చేస్తుంది. గణపతి ఆమెను బాగా ఇబ్బంది పెడుతున్నట్లుగా మంగమ్మ, నాగన్నల సంభాషణలో ప్రవేశించి చెప్తుంది. సింగమ్మ మాచమ్మ మీద కోపపడుతూ అర్ధసేరు తినే కొడుకు పావుసేరు  తింటున్నాడు. రాత్రి నీ చేతుల్తోనే వడ్డించావు చూశావు కదా అనగా వెంటనే మాచమ్మ అదా అని హేళనగా అంటూ ఒక దూరపు బంధువు ముసలమ్మ ఇంటికి వెళ్ళి కుక్క పేరు చెప్పుకుని బాగా తిన్నాడంటా అని ఫ్లాష్ బాక్ రూపంలో చెప్తుంది. మాచమ్మ ప్రతి మాట తన పేరుకు తగినట్టుగా పల్లెటూరి పడుచు యొక్క భావాలు స్పష్టంగా తెలుస్తుంది. తన పేరుకు తగినట్టుగా ఏ మాత్రం తీసిపోదు అనే భావం శ్రోతకు కలుగుతుంది. నా కర్మగాలా అనడాన్ని ఊత పదంగా వాడుతుంది. సింగమ్మ గణపతి చేష్టలను వెనకేసుకు వస్తూ పసివాడు అంటుంది. మాచమ్మ అవును మరి పసివాడికి 18 ఏళ్ళు నిండాయి గా అని మాచమ్మ వ్యంగ్యంగా మాట్లాడుతుంది. ఇలా ఈ పాత్ర నవలలో గంగమ్మ పేరుతో సూచించబడగా నాటకంలో మాచమ్మ గా మార్చబడి  ఈ విధంగా తీర్చిదిద్దబడింది.

### 5.2.5.రంగన్న(చాకలివాడు):

రంగన్న పాత్ర  నవలలో కన్నా నాటకంలో ఎక్కువ ప్రాధాన్యత ఇచ్చినట్టుగా తెలుస్తుంది. అదే కాకుండా నాటకంలో గణపతికి తోడుగా తను చేసే పనుల్లో సహాయ సహకారాలు అందిస్తుంటాడు. గణపతి యొక్క మాటలకు ముగ్ధుడై  అతను చేసే పనులలో పాలు పంచుకుంటాడు. ఉదాహరణకు గణపతి గాడిదను ఎక్కే సందర్భంలోనూ, గరుడా చలం దగ్గర గణపతి వేషం వేసే సందర్భంలోనూ గణపతికి

తోడుగానే ఉంటాడు. చివరకు సింగమ్మకు గుండు గీయించి నిమ్మకాయలు రుద్ది నూరు బిందెల నీళ్ళు పోసేటప్పుడు రంగన్న సహాయపడ్తాడు. ఈ సన్నివేశం తర్వాత రంగన్న పాత్ర అదృశ్యమవుతుంది.

**5.2.6. గరుడా చలం:**

నాటకానికి వన్నె తెచ్చి రక్తి కట్టించిన పాత్రగా గరుడా చలం పాత్ర తీర్చదిద్దబడింది గరుడా చలం పాత్ర పోషణలో తన సంభాషణ మాట తీరు గణపతినే కాక శ్రోతను కూడా ఆకట్టుకునే విధంగా ఉంటుంది.

**5.2.7. మహాదేవ శాస్త్రి:**

సింగమ్మను, గణపతిని నాగన్న వెళ్ళగొట్టినప్పుడు ఆశ్రయమిచ్చి ఆదుకున్నవాడుగా కనబడుతాడు. గణపతికి వంటవాడుగా బడి పంతులుగా కొన్ని ఉద్యోగాలు చూపించినప్పటికి వాటిని నిలుపుకోలేదు. చివరకు సింగమ్మ, గణపతికి ఆశ్రయమిచ్చినందుకు వారి మూలంగానే మహాదేవశాస్త్రి ఇల్లు తగలబడుతుంది. ‘అయ్యోపాపం అంటే ఆర్నెళ్ళ పాపం చుట్టుకుంటుంది’ అనే సామెతకు ఇది చక్కటి ఉదాహరణగా నాకనిపించింది. మహాదేవశాస్త్రి ఇక చేసేదేమిలేక కాశీకి ప్రయాణానికి సిద్ధమయ్యే సమయంలో ఋణానుబంధరూపేణ అనడంతో మహాదేవశాస్త్రి పాత్రతోనే నాటకం ముగుస్తుంది.

ఇవి నాటకంలోని ముఖ్య పాత్రలు ఈ విధంగా గణపతి రేడియో నాటకంలో పాత్ర పోషణ చేయబడింది.

**5.3. గణపతి రేడియో నాటకం లో నటించిన పాత్రలు పాత్రధారులు**:

గణపతి రేడియో నాటకం 16/04/1967 లోమధ్యాహ్నం 3 గంటలకు ప్రసారం చేశారు.

గణపతి నవలా మూలం – చిలకమర్తి లక్ష్మి నరసింహం

రేడియో అనుసరణ , నిర్వహణ – బందా కనక లింగేశ్వరరావు

పాత్రలు –పాత్రధారులు

గణపతి – నండూరి సుబ్బారావు

సింగమ్మ – పి. సీతారత్నం

పంతులు – శ్రీ పుచ్చా పూర్ణానందం

నాగేశు – చిరంజీవి భీమరాజు మోహన్

చలపాయ్ – శ్రీ కుటుంబరావు

నాగన్న – శ్రీ ఉప్పులూరు రాజారావు

రంగన్న – తందూరి వెంకటేశ్వర్లు

మాచమ్మ – ఎ. పూర్ణిమ

మహదేవయ్య – శిష్టా ఆంజనేయ శాస్త్రి

ఓవర్ సీస్ – సి. రామ మోహన రావు

గరుడా చలం – సంపూర్ణ రాజ్యలక్ష్మమ్మ

### 5.4. వేయిపడగలు– రేడియో నాటకీకరణ – పాత్ర పోషణ:

వేయిపడగలు రేడియో నాటకం సఫలీకృతం కావడానికి నవలను కొన్ని మార్పులు, చేర్పులు చేసి ధారావాహిక నాటకంగా రేడియోలో ప్రసారం చేశారు. ఈ నాటకంలో పోషించిన ముఖ్య పాత్రలను ఈ క్రింది పేర్కొంటున్నాను.

### 5.4.1. గణాచారి:

గణాచారి నవలలో వచ్చినట్టుగానే నాటకంలో కూడా వేయిపడగల పాము విప్పారుకుని వచ్చి కాటందుకున్నది కలలోన రాజును అని పాట పాడుకుంటూ ప్రవేశిస్తుంది. శుభ, అశుభ సూచకాలను వేప మండలు, రావి మండలు, మామిడి మండలతో సూచిస్తుంది. ఈ విషయం నాటక ప్రారంభంగా స్త్రీ సంభాషణ ద్వారా తెలుస్తుంది. వారి సంభాషణలోనే గణాచారి శుభసూచకంగా ఎక్కువగా మామిడి మండలు వేయక పోవడానికి గల కారణాలను ఒక ముసలావిడ చెప్తూ సంప్రదాయాలు నశించిపోతున్నాయి. శుచి శుభ్రం లేకుండా పోతుంది అంటుంది. ఈమె సంభాషణలోనే గణాచారి మూడవ తరంనాటిదని తెలుస్తుంది.

ధర్మారావే స్వయంగా గణాచారికి దివ్య శక్తులున్నాయని ఒక సందర్భంలో తెలియజేస్తాడు. చంద్రా రెడ్డి వేప మండను కాలితో తోసినప్పుడు కాలు భారం ఎక్కువై వైద్యుడికి చూపించుకుంటాడు. ఈ వైద్యుడు ద్వారానే గణాచారి వచ్చి మీ ఇంటిముందు రావి మండ, వేప మండ కలిపి వేసింది ఇక నీకు తగ్గిపోతుందని చెప్తాడు. గణాచారి వ్యక్తిత్వ విశేషాలు కూడా ఈ వైద్యుని ద్వారా కొంత

తెలియజేయబడుతాయి. స్వామి ఆలయానికి వెళ్ళి స్వామిని వేయిపడగలు ఏమయ్యాయని విలపిస్తుంది. చివరకు సాధారణ స్త్రీలాగా పిల్లవాడు రామేశ్వర శాస్త్రితో సంభాషించడంలోనూ, గోపన్న తిరిగి సుబ్బన్న పేటకు వచ్చినప్పుడు గణాచారి అతనిని గుర్తుపట్టడం ఆమె సంభాషణంతా సాధారణ వ్యక్తిలాగానే కనిపిస్తుంది. నాటక ప్రారంభంలో ఎక్కడా మాట్లాడని గణాచారి నాటక చివరలో ఇతర పాత్రలతో ఆమె సంభాషణ ఉంటుంది. కుమారస్వామి గణాచారి మేనల్లుడ్ని దీవించిందంట నీ కష్టాలు తీరాయి. నీకు ఆడపిల్ల పుడుతుంది. ఆ పిల్లకు పెళ్ళి చేయి అందట అనగా ధర్మారావు గణాచారి శకం అంతమైనట్లే అని అనడంతో గణాచారి అంతరించి పోతుందని అర్థమవుతుంది. పిల్లవాడు రామేశ్వర శాస్త్రి గణాచారితో ఎండలు వస్తున్నాయి. నీ ఇల్లు కాలిపోకుండా చూసుకో అంటాడు. గణాచారి ఎలా జరిగితే అలాగే జరుగుతుంది. అనడంతో గణాచారి పాత్ర మరలా కనిపించదు.

### 5.4.2.ధర్మారావు:

ధర్మారావు నవలలోనూ, నాటకంలోనూ ఒకే విధమైన చిత్త వృత్తిని కలిగి ఉంటాడు. వేయిపడగలు రేడియో నాటకంలో ధర్మారావు పాత్ర తండ్రి మరణించిన కారణంగా దుఃఖంతో కన్నీరు పెట్టుకుంటూ ప్రవేశిస్తాడు. ధర్మరావు యొక్క గుణ శీలత, వ్యక్తిత్వం, అతనికున్న అప్పుల గురించి గోపన్న కృష్ణమనాయునితో సంభాషించు సమయంలో వ్యక్తమవుతాయి. కృష్ణమనాయుడు అప్పుల బాధ తీర్చి తన ఇంటిని కాపాడినందుకు అతని గుణ శీలతను మెచ్చుకుంటాడు. గోపన్నకు కృతజ్ఞతలు తెలియజేస్తాడు.ఆ ఆనందంలో ధర్మారావు  గోపన్నను గిరగిరా తిప్పుతున్నట్టు శ్రోతకు తెలియజేస్తాడు. గిరిక చెల్లెలంటే అభిమానం కలవాడు. ఆమెతో సంభాషించిన ప్రతి సారి ఆమెను ఒక ఆధ్యాత్మిక ప్రపంచం వైపు తీసుకుని వెళ్ళేవాడు. వీరు కలిసిన ప్రతి సారి ఆధ్యాత్మిక భావాలు మనసులో నుండి పొంగుకొచ్చేవి. గిరిక మోక్షానికి ఆ కృష్ణపరమాత్మలో ఐక్యం కావడానికి ధర్మారావు ముఖ్య కారకుడుగా ఈ నాటకంలో కనిపిస్తాడు.

ఈ రేడియో నాటకంలోని ప్రతి పాత్ర ధర్మారావుకు ప్రత్యక్షంగానో, పరోక్షంగానో ఎదురు పడతాడు. కొన్ని పాత్రలు ఇతని వలన మోక్షాన్ని పొందుతాయి. కొన్ని పాత్రలు ఇతని లోని మంచితనాన్ని స్వీకరిస్తాయి. కొన్ని పాత్రలు ఇతనికి

వ్యతిరేక దిశలో నడచుకొని కష్టాలు పాలు కావడం కనబడుతుంది. ఉదాహరణకు, గిరిక, హరప్ప నాయుడు ఇతని ఉపదేశాల వలన దైవ మార్గాన్ని చేరుకుంటారు. మంగమ్మలాంటి వారు ధర్మారావు ధార్మికతను మెచ్చుకుంటూ అతని మంచితనానికి బానిసై దైవ కార్యాలకు పూనుకుంటుంది. రామేశ్వరం ధర్మారావుకి పూర్తి వ్యతిరేకంగా ఉంటాడు. అరుంధతితో సరసమాడుతున్నప్పుడు ధర్మారావు శృంగార విలాసుడుగా నాటకంలో కనపడ్తాడు. హరప్పకు చదువు చెప్పేటప్పుడు బృహస్పతి వంటి వాడుగా, గిరికకు ఆధ్యాత్మిక విషయాలను చెప్పునప్పుడు జ్ఞాన మార్గమునకు దారి చూపే జ్ఞానిగా కూడా ధర్మారావు ఈ నాటకంలో కనబడుతాడు.

తల్లిని పోగొట్టుకుని, ప్రేయసి కోసం ప్రేమ పిపాసుడై విలపిస్తున్న కిరీటికి ఒక అన్నగా అతనిని ఓదార్చిన తీరు అద్వితీయంగా ఉంటుంది. కిరీటిని ఓదార్చ కలిగాడు కాని అరుంధతి మరణించినప్పుడు ధర్మారావు ఉద్వేగాన్ని, దుఃఖాన్ని విన్న శ్రోత హృదయం చలించకుండా ఉండదు. ధర్మారావు ఎప్పుడైనా అరుంధతి మీద కోపపడినా అది తాత్కాలికంగానే కనిపిస్తూ ఉండేది. ధర్మారావు మనసులో అరుంధతిపై గల ప్రేమ అతని ఏడుపు అతని సంభాషణల్లో వ్యక్తీకరించిన తీరు ఎటువంటి శ్రోత హృదయాన్నైనా కరిగించగలదు. కాని నాయకుడు ధర్మారావు అనుకున్నప్పుడు నాయకుడు సుఖదుఃఖాలను సరిసమానంగా స్వీకరించగల ధృఢ నిశ్చయం కలవాడుగా ఉండాలి. కాని అరుంధతి మరణ విషయంలో తన నాయక లక్షణాన్ని కోల్పోయిన ట్లుగా నేను భావిస్తున్నాను.

చివరకు బాల్యవివాహాలను ప్రోత్సహించి పశుపతి పుత్రిక చిన్న అరుంధతిని వివాహమాడడంతో వేయిపడగల రేడియో నాటకం సంపూర్ణమవుతుంది.

### 5.4.3.అరుంధతి:

ధర్మారావుకి, అరుంధతికి కార్యం నిర్వహిస్తారు. మొదటిరాత్రి అరుంధతి ధర్మారావుతో మాటాడక మౌనం వహిస్తుంది. అరుంధతి అలా మౌనంతో ఉండడం ధర్మారావు మౌనం వీడవా ఏమిటి? అనడంతో తెలుస్తుంది. ఇలా అరుంధతి పాత్ర నాటకంలో ప్రవేశిస్తుంది. ధర్మారావు మీద మొదట సరైన అభిప్రాయం లేకపోవడం చేత రెండు రాత్రులు దూరంగా ఉంటుంది. రాజ్యలక్ష్మమ్మ చెప్పిన శృంగారోపదేశాన్ని అరుంధతి విన్న తర్వాత ధర్మారావుతో మూడవ రాత్రి శృంగారంలో పాల్గొని

అందులోని సౌఖ్యాన్ని అనుభవిస్తుంది. ఇటువంటి సౌఖ్యాన్ని అందించిన రాజ్య లక్ష్మమ్మను మరవలేను గాక మరవలేనని సాక్షాత్తు అరుంధతే చెప్తుంది. అప్పటి నుండి శృంగార విహారంలో జీవిస్తుంది. శ్రోత కూడా విరహంలో పడేలా అరుంధతి ధర్మారావు సంభాషణ ఉంటుంది. ఆనాటి నుండి అరుంధతి పతియే ప్రత్యక్షదైవంగా భావిస్తుంది. ధర్మారావు గురించి సుబ్బన్న పేటలో ధర్మారావు పిన తల్లుల మాటలు విని తన భర్త ఔదార్య గుణం ఏమిటో పూర్తిగా తెలుసుకుంటుంది. ధర్మారావుతో చమత్కారమైన సంభాషణతో మాట్లాడుతుంది. మొదట గిరిక మీద చులకన భావం కలిగినా ధర్మారావు బోధనలతనో దైవభక్తికి అరుంధతి తన్మయురాలౌతుంది. అటువంటి మరదలు తనకు దొరకడం అదృష్టంగా భావిస్తుంది. ధర్మారావు ప్రేమతో పాటు అతని దారిద్ర్యాన్ని కూడా పంచుకున్న మహా ఇల్లాలుగా అరుంధతి పాత్ర చిత్రీకరించబడింది. అరుంధతి ఆరోగ్యం రోజు రోజుకి క్షీణిస్తున్నా ధర్మారావు మీద అనురాగం మాత్రం అంతకంతకూ పెరుగుతునే ఉంటుంది. రాజ్య లక్ష్మమ్మ గారి పుణ్యంచేత తాను ధర్మారావుకి దగ్గరై సౌఖ్యానందాన్ని అనుభవిస్తున్నానని చెప్తుంది. కిరీటి బాధను చూడలేక అరుంధతి అతనిని ఎన్నో విధాల ఓదార్చే ప్రయత్నం చేస్తుంది. ధర్మారావుకి చిన్న అరుంధతిని తన లాగే చూసుకోమని చెప్తుంది. అరుంధతి బ్రతికుండగానే ధర్మారావుని మరో వివాహానికి ప్రోత్సహించే మాటలు అరుంధతి మరణానికి చేరువవుతున్నట్లు శ్రోత గ్రహిస్తాడు. మొదట మంగమ్మ వృత్తాంతాన్ని వినడానికే విసుగు చెందిన అరుంధతి చివర మంగమ్మ చేసే పనులను మెచ్చుకుంటుంది. ధర్మారావుని రంగాజమ్మ పెట్టిన చీరను తీసుకురమ్మని వేధించడంతో ధర్మారావు ఆమె కోరిక మేరకు చీరను తీసుకువస్తాడు. ఆ చీరను చూచినప్పుడు అరుంధతి పొందే ఆనందం ఆమె మాటలతో వ్యక్తంచేసిన తీరు చూస్తే ఆరోగ్యం క్షీణించి నీరస స్థితిలో ఉన్న ఆమె ఒక ఉదుటున లేచి ఆ చీరను చూసి పొంగిపోతుంది. అది ఆమె చివరి కోరిక తీరినందుకు పొందిన ఆనందమని శ్రోతకు అర్థమవుతుంది. అలా అరుంధతి తన కోరికలను నెరవేర్చుకుని అనారోగ్యంతో మరణిస్తుంది.

### 5.4.4.రామేశ్వర శాస్త్రి:

గోపన్న ఏవండోయ్ రామేశ్వర శాస్త్రిగారు అని పిలుస్తారు. రామేశ్వర శాస్త్రి ఊ ఏమిటా పొలికేకలు గోపన్నా అనడంతో రామేశ్వర శాస్త్రి పాత్ర నాటకంలో ప్రారంభమవుతుంది. నవలలో గోపన్న, రామేశ్వర శాస్త్రి సంభాషణ ఉండదు. నాటకాన్ని సంభాషణ ద్వారా రక్తి కట్టించడానికి గోపన్న, రామేశ్వర శాస్త్రి సంభాషణ నాటకంలో చోటుచేసుకుంటుంది. నవలలో రామేశ్వర శాస్త్రి సంభాషణ నాటకంలో చోటుచేసుకుంటుంది. నవలలో రామేశ్వర శాస్త్రి నాలుగు వర్ణాల వారిని వివాహం చేసుకోవడం, రత్నగిరిని ఉంచుకోవడం రచయిత చెప్పనటువంటి విషయాన్ని అంతకంటే ఎక్కువగా సంభాషణలో రామేశ్వర శాస్త్రి తాను ఆ వివాహాలు చేసుకోవడంలో గల ఆంతర్యాన్ని తెలియజేస్తాడు. పేరుకు కృష్ణమనాయుడు జమిందారి అయినా రామేశ్వర శాస్త్రి ఆజ్ఞ లేనిదే కృష్ణమనాయుడు కార్యక్రమాలను నిర్వహించడు. అంతటి గౌరవాన్ని పొందినవాడు రామేశ్వర శాస్త్రి. తన కొడుకు ధర్మారావుని ధర్మ స్వరూపుడుగా పేర్కొంటాడు. రామచంద్రరాజును అస్త్ర శస్త్ర పారంగతుడని చేయాలన్న కోరిక నెరవేరలేనందుకు బాధపడ్డాడు. తన గురించి తానే పొగుడుకుంటూ తనను చేపట్టిన స్త్రీలు మహా పతివ్రతలై లోకానికి ఆదర్శ మూర్తులై నారని గర్వపడతాడు. కాని అందులో వాస్తవం లేకపోలేదు.

చివరకు ఎన్నడు లేనంతగా సంతోషాన్ని బయటకు వ్యక్తం చేస్తూ తనకు మంచి భాగ్యాన్ని కలిగించినందుకు వేణుగోపాల స్వామికి కృతజ్ఞతలు చెప్పుకోవాలంటూ రాత్రి అవడం చేత కళ్యాణమంటపంలోనైనా తన విన్నపాలు తెలియజేయాలని వెళ్తాడు. ఇంతటితో ఈ పాత్ర ముగుస్తుంది. ఇతను మరణించిన విషయం తర్వాత జరగబోయే ధర్మారావు, కృష్ణమనాయుడు సంభాషణల్లో వారి దుఃఖంతో హావభావాలను వ్యక్తం చేయడంలో వెల్లడవుతుంది.

### 5.4.5.సావిత్రమ్మ:

నవలలో ఈమె పాత్ర ఎక్కువగా కనిపించదు. నవలలో సావిత్రి పాత్ర సంభాషణ తక్కువగా ఉన్న దాన్ని నాటకాన్ని ముందుకు నడిపించడానికి ఆ పాత్ర యొక్క సంభాషణ ఎక్కువగా చేసినట్టు నాకనిపించింది. రామేశ్వర శాస్త్రి నడి రాత్రి అవుతుంది, ఇప్పుడైనా నడుం వాల్చ రాదా అన్నప్పుడు సావిత్రి ఇదిగో అయిపోయింది

రేపు మడిబట్టలారేసుకుని పాల కుండలో మజ్జిగ చుక్క వేసి వచ్చేస్తా అనడంతో సావిత్రి పాత్ర నాటకంలో ప్రవేశిస్తుంది. సావిత్రమ్మ తన కోడలి రాక తనకు విశ్రాంతి ఇచ్చినట్టవుతుందని భావిస్తుంది. మొదట రామేశ్వర శాస్త్రితో అన్ని వివాహాలు చేసుకున్నారని ఒక పిల్లతో సరి పెట్టుకోలేరా అని తన అభిప్రాయాన్ని వ్యక్తం చేసినా తర్వాత రామేశ్వర శాస్త్రి ఇచ్చిన సమాధానాలతో కొంత ఊరట చెంది మంగమ్మను అసామాన్యురాలిగా అతనికి పుట్టిన పసరికను సుబ్రహ్మణ్యేశ్వరునిగా మెచ్చుకుంటుంది. తన సపత్నులందరి మీద తనకు గౌరవముందని, నాలాగే వారు మిమ్మల్ని నమ్ముకొచ్చారని వారి  పాతివ్రత్యాన్ని శిరోధార్యం చేసుకున్నారని అంటుంది. ఇక్కడ సావిత్రమ్మ తన సవతుల్ని పొగడడం అనేది నవలలో కనిపించక పోయినప్పటికి నాటకంలో సావిత్రమ్మను వ్యక్తిత్వం గల పాత్రగా తీర్చిదిద్దారు. పసరిక కనబడలేదని తెలిసినప్పుడు తన బిడ్డ లాగే భావించి చెప్పవచ్చు.

ధర్మారావుకి చింతపండు పచ్చడితో అన్నం పెట్టవలసి వచ్చినప్పుడు. ఇంటిలో తినడానికి కూడా వస్తువులు లేవని విలపించిన తీరు ఆమె దీనస్థితిని తెలియజేస్తుంది. కృష్ణమనాయుడు మరణించిన తర్వాత అతను పోయాడనే బాధకంటే రాణి రుక్మిణమ్మ ఎలా ఉందో ఆమెను పలకరించాలనే తపన సావిత్రమ్మ లో చూస్తుంటే సాటి స్త్రీపై గల అభిమానం కలిగిన అభిమానవంతురాలిగా సావిత్రమ్మ కనబడుతుంది. రామేశ్వర శాస్త్రి నాలుగు వర్ణాల వారిని వివాహం చేసుకుని నాలుగు కులాల వారిని ఏవిధంగా అయితే సమానంగా చూశాడో సావిత్రమ్మ కూడా రంగాజమ్మకు జబ్బు చేసినప్పుడు ఆమె ఇంటికి వెళ్ళి ఆమెకు సేవ చేయడంతో ఈమెకు కూడా రామేశ్వర శాస్త్రి భావాలు కొంత స్వీకరించినట్టు గా తెలుస్తుంది. ధర్మారావు నోటి వెంటే తన తల్లి రంగాజమ్మ, రామేశ్వర శాస్త్రి దాంపత్యం ఎంతో అద్వితీయమైనదని పొగడినట్టు గా రామచంద్రరాజుతో చెప్తాడు. దీన్ని బట్టి సావిత్రమ్మ ఔదార్యం మాత్సర్యం లేని మనిషిగా కూడా సావిత్రమ్మ దర్శనమిస్తుంది. అరుంధతి, ధర్మారావు దాంపత్యానికి మురిసిపోతుంది. అరుంధతి అనారోగ్యంతో ఉన్నప్పుడు రాజశేఖర శాస్త్రి వైద్యుడు ఆమెను పరిక్షించి పుట్టింటికి  తీసుకువెళ్ళమని ధర్మారావుతో అంటే వారికి మాకు రాకపోకలు లేవు అమ్మ(సావిత్రమ్మ)  కూడా

మంచాన పడి ఉంది. అనడంతో సావిత్రమ్మకు కూడా బాగ లేదన్న విషయం సూచనప్రాయంగా తెలుస్తుంది. తర్వాత ఎక్కడా ఆమె పాత్ర కనిపించదు.

ఈ నాటకంలో సావిత్రమ్మ ఎక్కువగా 'కాదా'...అని, ఊత పదంతో సంభాషిస్తుంది. ఉదాహరణకు 'ఇచ్చారు కాదా'...,'చేశారు కాదా'....,"వెళ్ళారు కాదా'........,'పెట్టారు కాదా'........'చేయించారు కాదా'.....అంటుంది.

### 5.4.6.గోపన్న:

నవలలో తక్కువగా ఉన్న గోపన్న పాత్ర నాటకంలో విస్తరింపచేసి ప్రాధాన్యతను కల్పించారు. నాటకంలో గోపన్న ప్రధాన పాత్రగా కనిపిస్తాడు. గోపన్న ఇతర పాత్రలతో సంభాషించడం తానే కథ కొంతవరకు ముందుకు నడుస్తుంది. ఉదాహరణకు గోపన్న రామేశ్వర శాస్త్రి సంభాషణలలో నాగేశ్వర స్వామి ధ్వజస్తంభానికి బంగారు తొడుగు వేయించడం, సత్యభామకు, రుక్మిణమ్మకు, వేణుగోపాల స్వామికి ఆభరణాలు చేయించడం రామేశ్వర శాస్త్రి దాన శౌర్యం వివరించబడతాయి. అలాగే దొంగగా ఉన్న గోపన్నకు జమిందారుగారు శిక్ష వేస్తే రామేశ్వర శాస్త్రిని కాపాడిన విషయం, రామేశ్వర శాస్త్రి దారిద్ర్య బాధచే బంధువుల ఇళ్లకు వెళితే అక్కడ వారు అవమానించబడినది. శాస్త్రిగారి అప్పుల విషయం, ధర్మారావు చదువు ప్రస్తావన. రామేశ్వర శాస్త్రి మరణానంతరం ధర్మారావుకి గోపన్న అప్పుల బాధను జమిందారు ద్వారా తొలగింపు చేయడం సుబ్బన్న పేట వృత్తాంతం. ఇవన్ని గోపన్న రామేశ్వర శాస్త్రి, ధర్మారావు, కృష్ణమనాయుడు పాత్రలతో సంభాషించడం ద్వారానే వ్యక్తం చేయబడతాయి. కథకు ప్రధానమైన వివరాలన్ని గోపన్న ద్వారా చెప్పించడం ద్వారా గోపన్న నాటకంలో ప్రధాన సూత్రధారిగా ఉన్నాడని తెలుస్తుంది. ధర్మారావే ఒక సందర్భంలో గోపన్న నువ్వు నాటక సూత్రధారివి అని అనడం చేత గోపన్న ఈ నాటకానికి సూత్రధారిగా శ్రోతకు బోధపడుతుంది.

కృష్ణమనాయుడు మరణించిన తర్వాత అదృశ్యమైన గోపన్న నాటకం చివరలో పిచ్చివాడిలాగా ప్రత్యక్షమై కోటలో భోజనం చేయాలనే చివరి కోరికతో వచ్చి కోటకు వెళ్తాడు. రంగారావు, హరప్ప, ధర్మారావులు సంభాషణ తర్వాత మరలా కనబడడు.

### 5.4.7.కృష్ణమ నాయుడు:

కృష్ణమనాయుడు దేవాలయానికి వచ్చి బ్రాహ్మణునితో గంభీరమైన స్వరంతో ఏర్పాట్లన్నీ పూర్తయ్యాయా అంటూ నాటకంలోకి ప్రవేశిస్తాడు. ఆ స్వర ఉచ్చారణ లోనే కృష్ణమనాయుడు ఒక దైవ కార్యాన్ని నిర్వహిస్తున్నట్టు ఆ కార్యక్రమాలన్నీ సరిగ్గా జరిగాయో లేదో విచారిస్తున్న తీరు హుందాతనంగా శ్రోతకు కనబడుతుంది. కృష్ణమనాయుడికి ధర్మారావు భాగవత పద్యాలను చదివి వినిపించే క్రమంలో సమయోచితమైన పద ప్రయోగాలు కూడా చేసేవాడు కృష్ణమనాయుడు భాగవత పద్యాలు వింటూ ఆ వేణుగోపాల స్వామిని మనసులో ముద్రించుకుని భక్తి పారవశ్యాన్ని ఆస్వాదించిన భక్తుడుగా కృష్ణమనాయుడు కనబడుతాడు.

కృష్ణమనాయుడి గంభీర స్వరం పెద్ద మనిషి లాగే ఉంటుంది. మాట్లాడే ప్రతి మాట ఇతరులకు ఆజ్ఞలను జారీచేసినట్టు ఆయన చెప్పిందే తథ్యంగా ఆయన ఏం చెబితే దానికి ఎదురు లేనట్టుగా శ్రోతకు గోచరిస్తుంది. నాటకంలో ప్రతి పాత్రకూడా కృష్ణమనాయుడువారు ఏం చెప్పినా అది సరైన ఆలోచనతో చెప్తాడు. అనే భావన కలిగి ఉంటారు. అందుకే నిజమైన జమిందారు కృష్ణమ నాయుడు వారే అని శ్రోత గ్రహిస్తాడు. నిస్వార్థపరుడు, నిజాయితీ పరుడు, ధైర్యవంతుడు కార్యశీలుడుగా కృష్ణమనాయుడి పాత్ర వ్యక్తమవుతుంది. కృష్ణమనాయుడి మాటలు శ్రోతకు కూడా సలహాలు ఇస్తున్నటువంటి భావం కలిగేలా చిత్రీకరించారు. ఆయన చెప్పిన ప్రతి మాటను అనుసరించాలి, ఆచరణలో పెట్టాలి అనే ఆలోచన శ్రోతకు కలుగుతుంది.

కృష్ణమనాయుడు రామేశ్వర శాస్త్రి మరణానంతరం, రామేశ్వర శాస్త్రి గారి అప్పులను తీర్చడంలో నాగన్న శెట్టితో చాకచక్యంగా మాట్లాడిన సంభాషణ సమయస్ఫూర్తితో వ్యవహరించినట్టుగా అర్థమవుతుంది. ఇలా కృష్ణమనాయుడు నాయకుడుగా, ధర్మారావుకు ఇల్లు నిలిపిన ధన్య జీవి అనే భావన శ్రోతకు కలుగుతుంది.

ఆఖరికి ప్రాణాలు కోల్పోయే సమయంలో తాను ఎంతో ముచ్చటపడి, వేటాడి, వెంటాడి తెచ్చుకున్న లక్ష్మణుడు అనే ఏనుగు గురించి ఆలోచిస్తాడు. కృష్ణమనాయుడికి మూగ జీవాలపై ఉన్న ప్రేమ కూడా వ్యక్తమవుతుంది. కృష్ణమనాయుడు తాను పోయిన తర్వాత లక్ష్మణుడు(ఏనుగు) ఏమవుతాడో అని

దిగులు పడతాడు. గోపన్న తో లక్ష్మణుడు నా ప్రాణం రా నేనుండగా దానికేమి కాకూడదు అంటాడు. ''స జాతో యావదాయుషం'' అని నిట్టూర్పుతో పలికిన మాట కృష్ణమనాయుడి చివర మాటగా నాటకంలో కనబడుతుంది. అతని పాత్ర మరణించినట్టు మాత్రం చూపించలేదు. తర్వాత జరగబోయే రాఘవరావు, ధర్మారావు సంభాషణల్లో అతని మరణం వెల్లడవుతుంది.

### 5.4.8. రుక్మిణమ్మ:

రుక్మిణమ్మ దేవాలయానికి వెళ్ళినప్పుడు గిరిక సంభాషణ ద్వారా అరుంధతి వచ్చిందని తెలుసుకుని ధర్మారావింటికి వెళ్ళి దంపతులను ఆశీర్వదించి అరుంధతికి చంద్రహారాన్ని బహుకరించి కృష్ణమనాయుని వారి బాధ్యతను అనగా ధర్మారావు చదువుకి ప్రోత్సహించి కావలసిన ఆర్థిక సాయం చేస్తుంది.

### 5.4.9.రంగారావు:

ధర్మారావు కృష్ణమనాయుడు మరణానంతరం ఇంటికి వచ్చి సావిత్రమ్మ తో ఇప్పుడు చిన్న ప్రభువుల మాటేమిటి అని అడుగగా సావిత్రమ్మ రంగారావు ఎప్పుడెప్పుడు కిరీటం ధరిద్దామా అన్నట్లు ఉన్నాడు. అనడంతో రంగారావు పాత్ర పరోక్షంగా ప్రవేశించినట్లు తెలుస్తుంది. తర్వాత బ్రాహ్మణుడు అయ్యా రాజావారు శ్రీ శ్రీశ్రీ రంగ నాయనింవారు  అని వేదాశీర్వచనం చేయడంతో రంగారావు పాత్ర ప్రవేశిస్తుంది. ఇతను తన తండ్రి గుణాలకు వ్యతిరేకంగా ఉన్నట్టు ఇతని మాటల ద్వారా అతని పనుల ద్వారా శ్రోతకు తెలుస్తుంది. జమిందారీ లక్షణాలు ఎక్కువగా ఇతనిలో కనబడవు. చెన్నపట్నంలోనే ఎక్కువగా ఉండడానికి ఇష్టపడ్తాడు. సరోజిని దేవి అనారోగ్యంతో ఉన్నా చూడడానికైనా వెళ్ళడు. అది గాక ఎవరో చెప్పిన మాటలను గుర్తుచేసుకుంటూ పతియే దైవంగా భావించే భార్యల దగ్గర సౌఖ్యం లేదనుకుంటాడు. ధర్మారావు మీద అయిష్టా భావాన్ని కలిగి ఉంటాడు. అయినప్పటికి హరప్ప ధర్మారావు వద్దనే చదువుకుంటానంటే పిల్లవాడి ఇష్ట ప్రకారమే కానివ్వండి అని చెప్తాడు. సుశాని లాంటి వాళ్ళను వివాహం చేసుకోవడం పాశ్చాత్య సంప్రదాయానికి విలువనిచ్చిన వ్యక్తిగా శ్రోతకు అర్థమవుతుంది. రంగారావు అనారోగ్యం పాలైనప్పుడు తాను చేసిన తప్పేంటో తెలుసుకుంటాడు. తన కొడుకు యోగ మరణం పొందిన పిదప తన పుత్రుడు ఎంతటి అదృష్టవంతుడోనని

తలచుకుంటాడు. అతనిలో కలిగిన పశ్చాత్తాపం కారణంగానే ధర్మారావుని పిలిపించి ధర్మారావు కొడుకు రామేశ్వర శాస్త్రికి, తాను దత్తతగా వేరే పిల్ల వాడ్ని తీసుకుని హరప్ప అని నామకరణం చేసి అతనికి కలిపి చదువు చెప్పిస్తానంటాడు. రామేశ్వర శాస్త్రిని నా నెత్తిమీద పెట్టుకుని  చూసుకుంటానంటాడు. దీని తర్వాత ఇతని పాత్ర కనబడదు.

### 5.4.9.1. గిరిక:

ఆలయంలో ధర్మారావు, గిరిక దైవ సంబంధిత విషయాలు మాట్లాడుకునే సందర్భంలో గిరిక ధర్మారావుని శైవుణ్ణి పూజించాలా? విష్ణువునా అన్నా అని అడుగుతుంది. ఇక్కడ నుండి గిరిక పాత్ర ప్రవేశిస్తుంది. భగవంతుని వలచిన కన్యగా గిరిక కనబడుతుంది. ఈమె పాత్ర ప్రవేశించిన సన్నివేశాల్ని ఈమె భగవంతుని మీద విరహంతో మాట్లాడిన మాటలుగానో, ఈమెను గోపికగా భావించి అరుంధతి, రథంతరి. ఆటపట్టించడమో ఉంటుంది. కృష్ణ రూపాన్ని తన మనసులో అణువణువునా స్పృశించి కృష్ణుని లో ఐక్యమై పోవాలన్న గిరిక తపన శ్రోత మనసును భగవంతుని మీద నిమగ్నమై ఉంచుతుందనడంలో అతిశయోక్తి లేదు.

గిరిక పాత్రే కాదు ఆమె స్వరం అత్యంత మధురంగా శ్రోతను ఆకట్టుకుంటుంది. ఆమె గాన సౌందర్యానికి ముగ్ధులై చలించని శ్రోత ఉండదు. గిరిక భక్తి తత్వానికి రాణులంతా దాసోహం అనడానికైనా సిద్ధపడుతారు. అందుకే రుక్మిణమ్మ ధర్మారావుతో గిరిక లాగా నన్ను కూడా భక్తురాలిని చెయ్యి అంటుంది. నాటకంలోని పాత్రలే కాదు ఆమె వాక్ సౌందర్యాన్ని ఆస్వాదిస్తున్న ప్రతి శ్రోత హృదయం భక్తి అనే స్వర్గవీధులలో విహరించాల్సిందే గిరికకున్న భక్త్యావేశంతోకూడిన సంభాషణ శ్రోతకు కళ్లకు కట్టినట్లు చిత్రీకరించారు. నాటకంలో గిరిక వర్షానికి తడుచుకుంటూ అరుంధతి ఇంటికి వస్తుంది. అరుంధతి చీరను తెచ్చివ్వగా కట్టుకుని వదినా నేను కట్టిన చీర మరలా నువ్వు కట్టుకుంటావా అని అడిగినప్పుడు అరుంధతి ఎందుకు కట్టుకోనూ నువ్వు సాక్షాత్తు దేవతా మూర్తివి అంటుంది. నాటకంలోని పాత్రలకే కాదు శ్రోతకు కూడా ఆమె దివి నుండి దిగి వచ్చిన దేవతా మూర్తి లాగే గోచరిస్తుంది.

ధర్మారావు గిరిక ఇచ్చిన ఉంగరం అరుంధతికి ఇచ్చినప్పుడు ఆ ఉంగరం ఇచ్చింది గిరిక అని తెలియగానే తేలిక భావంతో మాట్లాడుతుంది. అప్పుడు ధర్మారావు బురదలో పుట్టిన పద్మం లాగా గిరిక ఎంతో పవిత్రురాలని ధర్మారావు చెప్పడంతో అరుంధతి కూడా ఆమె గురించి వింటూనే భగవంతున్నే వరిస్తుందేమో అని అరుంధతి సంశయం చివరకు నిజమవుతుంది.

రామేశ్వరం గిరిక వెనుక పడినా వేణుగోపాలస్వామి నుండి తన మనసును చలింపచేయని గొప్ప అంకిత భావం కలిగిన వ్యక్తిగా గిరిక కనబడుతుంది. దేవదాసి అంటే చులకన భావం, అసహ్యం ఉన్న వ్యక్తులకు దేవదాసి అంటే ఏమిటో అందులోని పరమార్థం ఏమిటో తెలియజేసిన వ్యక్తి గిరిక. రాణి రుక్మిణమ్మ ద్వారానే అరుంధతితో మాట్లాడేటప్పుడు ఇదొక తులసీ వనం ఆ వనంలో గిరిక ఒక గోదాదేవి అంటుంది. దీన్ని బట్టి గిరిక భూలోక దేవతగా శ్రోతకు గోచరిస్తుంది.

గిరిక దశావతారాలను నృత్య రూపంలో ప్రదర్శించినప్పుడు శ్రోత ప్రత్యక్షంగా చూడలేని లోపాన్ని అధిగమింపచేసే విధంగా గిరిక సంభాషణ భోగప్ప శాస్త్రి ఆమె మాటలకు ఇచ్చిన సమాధానాలు దివ్యానుభూతిని కలిగిస్తాయి. చివరకు గిరిక వేణుగోపాలా.....అంటూ ఏడుస్తూ పలకడం భోగప్ప గిరిక పడిపోతుందని తెలపగా ధర్మారావు ఆమె పడిపోవడం లేదు ఆ కృష్ణపరమాత్మలో లీనమై పోతుందని తెలియజేయడంతో గిరిక పాత్ర పరి సమాప్తమవుతుంది.

గిరిక పాత్ర పరిసమాప్తమైనా గిరిక ముద్రింపచేసిన భక్తి భావాలు శ్రోత మనసును మరో మార్గం వైపు చెదరనీయవు వేరే పాత్ర వేరే సంభాషణ వస్తున్నప్పటికి గిరిక తన్మయత్వాన్ని అందిపుచ్చుకున్న శ్రోత మనసు తాదాత్మ్యం పొందడంతో తర్వాత సంభాషణను వినడానికి కొంత సమయం పడుతుంది.

### 5.4.9.2. హరప్పనాయుడు:

సరోజిని దేవి మరణం ఆసన్నమయ్యే సమయంలో తన పుత్రుడైన హరప్పను పిలుస్తుంది. ఇక్కడ నుండి హరప్ప పాత్ర మొదలవుతుంది. సరోజని దేవి హరప్పకు సాంప్రదాయమైన రాజ వేషం ధరింపచేసి, ధర్మారావు వద్దనే చదువుకోమని చెప్తుంది. ఈ మాటలను హరప్ప నాటకాంతం తు. చ తప్పకుండా పాటిస్తాడు. ఆమె మరణించిన తర్వాత హరప్ప ధర్మారావు ఎవరో రంగన్న ద్వారా తెలుసుకుని

ధర్మారావుని చదువు చెప్పమని బలవంత పెడతారు. ధర్మారావుకి అయిష్టంగానే ఉన్నా హరప్ప చదువుకోవాలనే పట్టుదలను చూసి ధర్మారావు కోటకు వెళ్ళి హరప్పకు ప్రతిరోజు చదువు చెప్తాడు. ధర్మారావు చెప్పిన ప్రతి విషయాన్ని ఆకళింపు చేసుకుని వాటిని శిరసావహించడానికి సన్నద్ధమవుతాడు. ధర్మారావు సాంగత్యం వలన, ఆయన పాఠాల వలన ప్రేరణ పొందిన హరప్ప తన తల్లికి కర్మలు చేయిస్తాడు. ఉదార స్వభావంతో ధర్మారావుకి ఆర్థిక విషయంలోనే చేదోడు, వాదోడుగా ఉంటాడు. తన తల్లి వేసిన వేషధారణను నిత్యం అలాగే వేసుకుంటూ రాజసం ఉట్టిపడేలా జీవనాన్ని కొనసాగిస్తాడు. దీని ద్వారా హరప్పకు తల్లిమీద ఉన్న ప్రేమ ఆప్యాయతలు వ్యక్తమవుతాయి. శశిని గురించి తెలుసుకున్న హరప్ప తన తల్లి స్థానంలో ఇంకొకరు రావడం సహించలేని స్వభావం కలవాడుగా ఉంటాడు. తన తండ్రి చేష్టలకు మాత్రం హరప్ప ఎప్పుడూ వ్యతిరేకంగానే ఉంటాడు.

ధర్మారావు స్నేహం వలన హరప్ప ప్రహ్లాద నాటకానికి వెళ్ళినప్పుడు హరప్ప ఆ నాటకాన్ని ఆద్యంతం ఏకాగ్రతతో తిలకిస్తాడు. రంగారావు ఆలోచనా తీరు కంటే హరప్ప భావనా బలం ఎంతో గొప్పదిగా కనిపిస్తుంది. హరప్ప మాఘ స్నానాలు ఆచరించడం. దేవాలయ దర్శనం చేయడం అతనిలో ఏదో అతీతమైన శక్తి అతనిలో ప్రవేశించినట్టు అతని ప్రవర్తనలో వ్యక్తమవుతుంది. ధర్మారావు నేను నిన్ను పాడు చేశాను అన్నప్పుడు హరప్ప లేదు నేను మంచి మార్గాన్నే ఎంచుకున్నాను. అంటాడు. హరప్ప యౌవనంలో ఉన్నా సంసార బంధాలమీద ఆసక్తి చూపని విరాగిగా కనబడుతాడు. ఆ వైరాగ్యమే వేణుగోపాలస్వామి ఉత్సవాలు వైకుంఠాన్ని తలపించేలా ఏర్పాటుచేస్తాడు. ఒక రకంగా ఇతని మూలంగానే గిరిక భగవంతుని లో ఐక్యత పొందకలిగిందనే భావం కూడా శ్రోతకు స్ఫురిస్తుంది.

తండ్రి అనారోగ్యం పాలైనప్పుడు జమిందారిగా కొన్ని రోజులు పరిపాలిస్తాడు. ఆ పరిపాలన కాలంలో హరప్ప హుందాతనం బయటపడుతుంది. నాగేశ్వరరావు లాంటి వారి అన్యాయాలకు అడ్డుకట్ట వేస్తాడు. ఇతని నాయకత్వం తనకు లాభం లేదని నాగేశ్వరరావు దివాను ఉద్యోగానికి రాజీనామా చేస్తాడు. తండ్రి ఆరోగ్యం కుదుటపడగానే మరలా ఆధ్యాత్మిక ప్రపంచంవైపు పరుగులు తీస్తాడు. అటు

జమిందారీ తత్త్వాన్ని ఇటు ఆధ్యాత్మికతను తనలో మమైక్యం చేసుకున్న గొప్పవాడుగా హరప్ప కనబడుతాడు.

### 5.4.9.3.పసరిక:

సావిత్రమ్మ మంగకు పుట్టిన పసరికను సుబ్రహ్మణ్యేశ్వర రూపాన్ని పొందాడు. పైర్లు పచ్చగా ఉన్నన్నాళ్ళు వాడు, వాడు పచ్చగా ఉన్నన్నాళ్ళు పైర్లు పచ్చగా ఉంటాయండి అనడంతో పసరిక రూపురేఖలు పాము ఆకారాన్ని పోలి ఉంటాయని శ్రోతకు అర్థమవుతుంది. ఇలా పరోక్షంగా ప్రవేశించిన పసరిక పాత్ర ఆయా సందర్భాల్లో సైగల ద్వారా ధర్మారావుతో సంభాషిస్తాడు. పసరిక సైగలు మనకు అర్థం కావడానికి ధర్మారావే అతను ఏమి మాట్లాడుతున్నాడో శ్రోతకు వివరిస్తాడు. చంద్రా రెడ్డితో ధర్మారావు నేను గణాచారి, పసరిక ఒకరినొకరు ఎదురుపడి మాట్లాడుకోలేక పోయినా ఒకరి భావాలు ఒకరికి తెలుస్తాయంటాడు.

ధర్మారావుకు రామేశ్వర శాస్త్రి(ధర్మారావుకు పుట్టిన పిల్లవాడికి పెట్టిన పేరు) పుట్టినప్పుడు పసరిక ఆనందాన్ని వ్యక్తం చేసినట్లు ధర్మారావు సంభాషణ ద్వారానే తెలుస్తుంది. చివరకు పసరిక గోపాల కృష్ణారెడ్డితో కలసి తన సహజ లక్షణాల్ని కోల్పోవడాన్ని అతను మరణించి మనిషిగా మారాడని ధర్మారావు సంభాషణ ద్వారానే తెలుస్తుంది. మొత్తంమీద పసరిక కు సంబంధించిన విషయాలన్నీ కూడా ధర్మారావు పాత్ర ద్వారానే వెల్లడవుతాయి.

### 5.2.9.4.రామేశ్వరం:

రంగారావు పట్టాభిషేకంలో ఎవరో పామని అరచారు అని అడుగగా రామేశ్వరం ధర్మారావు ఏమన్నా పట్టాభిషేకానికి వచ్చెనా అనడంతో ఇతని పాత్ర ప్రవేశిస్తుంది. ధర్మారావంటే గిట్టని వాడు. గణాచారి గురించి హేళన చేస్తాడు. రత్నగిరిని ముసలి దాని క్రింద లెక్క కడ్తాడు. తన నోటి వెంట నుండే రత్నగిరి కూతుర్ని గిరిక ను తీసుకువచ్చే ప్రయత్నం చేసి విఫలుడవుతాడు. మొదట రత్నగిరిని ముసలిదాని లాగా లెక్కగట్టినా తర్వాత మనసులో రత్నగిరి ఎంత అందంగా నాట్యం చేసిందో. ఆమె కూతురు ఇంకెలా ఉంటుందో ఆమె సొగసు ఆమె నాట్యం ఇంకెంత రమ్యంగా ఉంటుందో అంటు మోహపరవశుడై పోతాడు. దీన్ని బట్టే రామేశ్వరం స్త్రీ లోలత్వం కలవాడని అర్థమవుతుంది. ఇటువంటి కోరికలే గిరిక నడిచి వెళుతుంటే

ఆమె నడకను, ఆమె సౌందర్యాన్ని వర్ణిస్తాడు. తన కోరిక తీర్చమని పరోక్షంగా హెచ్చరించినట్టు అతని మాటలు ఉంటాయి. గిరికకు భక్తి తత్త్వాన్ని అర్థంచేసుకుని మూర్ఖుడు కావునే గిరిక తాను వేణు గోపాలుడికి మనసిచ్చానంటే వెర్రి నవ్వులు నవ్వుతాడు. సినిమా హాలు కట్టించి ధనార్జన చేస్తాడు. తాలూకా బోర్డు ప్రెసిడెంట్ గా ఎన్నికయినప్పుడు తన పెత్తనం చెలాయిస్తాడు. జోస్యులకు సన్నిహితంగానే ఉంటూనే అతని భార్యకు ధనాన్ని ఎరగా వేస్తాడు. మంగ మొదట అతనిని చీదరించినా అతని దగ్గర ఎంతో ధనముందనే చిన్న ఆశతో రామేశ్వరం వశమై పోతుంది. దాని కారణంగా జోస్యులు సుబ్బన్న పేటకు బదిలి అవుతాడు. రామేశ్వరం గుట్టుగా సంసారం చేసుకునే వారిని చెడగొట్టే దుర్మార్గుడుగా శ్రోతకు బోధపడుతుంది. జోస్యులు మంగమ్మ, రామేశ్వరం వలలో పడిందని తెలసి ఆమెకు మంచి మాటలు చెప్పి వెళ్ళిపోతాడు. మంగమ్మ తన భర్త చెప్పినట్టే రామేశ్వరం ఆస్తిని తన సొంతం చేసుకుంటుంది. దొంగ నోట్ల విషయంలో అరస్టయిన రామేశ్వరాన్ని చూసి హేళన చేస్తుంది. రామేశ్వరం ఇదంతా నాకర్మేనని నేను నమ్మిన వాళ్ళు నన్ను మోసం చేశారని ముఖ్యంగా మంగమ్మను ఉద్దేశించి అనుకోవడంతో ఇతని పాత్ర మరలా కనబడదు.

### 5.4.9.5.మంగమ్మ:

జోస్యుల భార్య మంగమ్మ. జోస్యులు మంగా ఈ రోజు ఇన్స్ పెక్షన్ కు వస్తున్నారు. అటువంటి జమిందారులు మన బోటిగాళ్ళ ఇళ్లకు రమ్మన్నా రారు అనగా మంగమ్మ మరి వస్తున్నారుగా అనడంతో ఈమె పాత్ర ప్రవేశిస్తుంది. ఈమె ఒక పల్లెటూరి పడుచులా మొదట అమాయకంగా కనబడినా తన జీవితంలో జరిగే ఎన్నో పరిణామాలు కారణంగా చివర గడుసు తనంగా మారుతుంది. రామేశ్వరానికి ఆస్తి ఉందని భర్త జోస్యులు ద్వారా తెలుసుకుని రామేశ్వరం మాటలకు లొంగిపోతుంది. జోస్యులు వీరి విషయం తెలుసుకుని ఇంటినుండి వెళ్ళిపోయినప్పుడు అతను చెప్పిన మాటలు ఆమెను కొంత సంకోచంలో పడేసినా అందులోని అంతరార్థాన్ని చివర తెలుసుకుని ప్రవర్తిస్తుంది. తర్వాత ఈమెలో కలిగిన పరివర్తనం కారణంగానే రామేశ్వరం డబ్బు కావాలని వచ్చినప్పుడు తన దగ్గర లేవంటుంది. అతనికి జైలు శిక్ష పడిందని తెలియగానే తగిన శాస్తి జరిగిందని నేరుగా

రామేశ్వరంతోనే అంటుంది. చివరకు తన ఆస్తిని కుమారస్వామికి, దేవుని ఉత్సవాలు జరిపించడానికి రాస్తుంది. ఈమె మార్పుకు అరుంధతి కూడా సంతోషపడి ఈమెలో కలిగిన మార్పును వేమన స్త్రీ రూపంతో అవతరించినట్టుగా మంగమ్మను ఉద్దేశించి అంటుంది. కుమారస్వామి ధర్మారావుతో ఘోరం జరిగిపోయింది మంగమ్మా ఇక మనకు లేదు అనడంతో మంగమ్మ చనిపోయినట్టు తెలుస్తుంది.

### 5.4.9.6.జోస్యులు:

రామేశ్వరం తన స్కూల్‌కి ఇన్స్‌పెక్షన్‌గా వస్తున్నాడని తెలిసి మంగతో మంచి రకరకాల వంటలు చేయమని చెప్పడంతో ఇతని పాత్ర ప్రవేశిస్తుంది. ఇతను తన ఉద్యోగ ధర్మం నిర్వర్తించడంలో నిజాయితీ కలవాడని తెలుస్తుంది. తన ఇంటికి భోజనానికి వచ్చిన రామేశ్వరం చూపులు తన భార్య మంగమ్మ మీద పడ్డాయని తెలసి కూడా అందులోని అంతరార్థాన్ని తన ఇంట విశ్రాంతి తీసుకోమని తను స్కూల్‌కి బయలుదేరుతాడు. కాని అతని నమ్మకం నిలువ లేకపోయిందని తెలుసుకుని బాధపడ్తాడు. మంగమ్మ రామేశ్వరం వ్యవహారం అందరూ చెప్పుకుని నవ్వుకుంటుంటే ఎవర్ని ఏమి చేయలేని స్థితిలో ఉండిపోతాడు. ఇతని పాత్ర ఇతని సంభాషణ విన్న శ్రోతకు జోస్యుల మీద జాలి కలుగుతుంది. చివరకు చేసేదేమి లేక మంగతో రామేశ్వరాన్ని కీలుబొమ్మను చేసి ఆడించు డబ్బుంటే నువ్వు ఆడిందే ఆట పాడిందే పాట అంటూ వెళ్ళిపోతాడు. మరలా నాటకంలో ఎక్కడా కనిపించడు.

### 5.5.వేయిపడగలు రేడియో నాటకంలో నటించిన పాత్రలు పాత్రధారులు:

వేయిపడగలు రేడియో నాటకం జులై 7, 2013 నుండి ప్రతి శనివారం ఉదయం7.15 నుండి7.45 వరకు23 వారాలు ప్రసారం అయ్యింది. అయితే మొదటి భాగంలో పరిచయ కార్యక్రమాలను ప్రసారం చేశారు. చివరి భాగంలో ముగింపు కార్యక్రమాలను ప్రసారం చేశారు. ఈ రెండు భాగాలను తీసేస్తే మిగిలిన ఇరవై ఒక్క భాగాలలో నాటకాన్ని ప్రసారం చేశారు.

| | | |
|---|---|---|
| నవలా మూలం | – | విశ్వనాథ సత్యనారాయణ |
| రేడియో నాటకీకరణ | – | దిట్టకవి శ్యామలా దేవి |
| నిర్వహణ | – | యళ్ళం రాజు సరోజ నిర్మల |
| పాత్రలు | – | పాత్రధారులు |

| | | |
|---|---|---|
| కృష్ణమ నాయని వారు | – | శ్రీ బి .అమరేంద్ర |
| రామేశ్వర శాస్త్రి | – | శ్రీ ఎస్. ఎస్. వాజ్ పేయ్ |
| గోపన్న | – | శ్రీ సి. హెచ్. సురేంద్ర రాజు |
| యువకుడు | – | శ్రీ వై. మల్లికార్జున |
| సావిత్రి | – | శ్రీమతి కె. ఇందిర |
| గణాచారి | – | వై. సరోజ నిర్మల |
| అమ్మలక్కలు | | శ్రీమతులు వి. ఎన్. సీతా రామం, |
| | | కె. పరిమళ, టి. పద్మావతి |
| ధర్మారావు | – | శ్రీ యు. సుబ్బరాయ శర్మ |
| రాఘవరావు | – | శ్రీ పి. వి. ఎల్. నరసింహరావు |
| నాగన్న శేటు | – | శ్రీ జి. పెరుమాళ్లు |
| గిరిక | – | శ్రీమతి జి. శిల్ప |
| రాణి రుక్మిణమ్మ రావు | – | శ్రీమతి బి. ఎన్. సీతా కుమారి |
| రంగారావు | – | శ్రీ టి. వి. ఎ. ఎస్. శర్మ |
| సర్వా రాయుడు | – | శ్రీ బి. హెచ్. వేణుగోపాలరావు |
| రామేశ్వరం | – | శ్రీ వై. వి. ఎస్. ఎన్. పాత్రో |
| అరుంధతి | – | శ్రీమతి ఎ. వసంత లక్ష్మి |
| రాజ్య లక్ష్మమ్మ | – | శ్రీమతి డి. వసుంధరా దేవి |
| రంగాజమ్మ | – | శ్రీమతి ఎమ్. నిర్మల |
| రథంతరి | – | శ్రీమతి కె. పరిమళ |
| కిరీటి | – | శ్రీ కృష్ణార్జున రావు వెన్న |
| సూర్య పతి | – | శ్రీ అరవింద్ |
| సరోజని దేవి | – | శ్రీమతి తురగా పద్మావతి |
| హరప్ప | – | శ్రీ పూజిత్ |
| రంగన్న | – | ధీరబాంధవాచారి |
| శశిని | – | శ్రీమతి కె. పరిమళ |
| చంద్రా రెడ్డి | – | శ్రీ కృష్ణార్జున రావు వెన్న |

| | | |
|---|---|---|
| శివరావు | – | శ్రీ శ్రీనివాస విఠల్ |
| కేశవరావు | – | శ్రీ బి. హెచ్. వేణుగోపాల్ రావు |
| జోస్యులు | – | శ్రీ సి. హెచ్. సురేంద్ర రాజు |
| మంగమ్మ | – | శ్రీమతి ఎమ్. కృష్ణకుమారి |
| కుమారస్వామి | – | శ్రీ వై. మల్లికార్జున |
| శ్యామల | – | శ్రీమతి కె. మాధవి. |
| పశుపతి | – | శ్రీ కె. శరత్ చంద్రా రెడ్డి |
| తోటమాలి(నాగభూషణం) | – | శ్రీ మాచూరి వేంకటేశ్వర రావు |
| భోగప్ప | – | శ్రీ ఎన్. ధీరబాంధవా చారి |
| చిన్న రామేశ్వర శాస్త్రి | – | శ్రీ. ఎమ్. ఉదయ్ కమల్ |

పాత్ర చిత్రణ విషయానికి వస్తే వేయి పడగలలో ఏ పాత్రకా పాత్ర నాటకానికి రక్తి కట్టించేలా చిత్రీకరించారు. నాటకంలో ఒకటి రెండు పాత్రలకు శ్రోత అవగాహన చేసుకోవడానికి పేర్లు సూచించడం జరిగింది. ప్రధాన పాత్రలను యథాతథంగా నాటకీకరణ చేశారు. నవల చదవడానికన్నా నాటకం వింటుంటే ఇంకా వినాలనే ఆసక్తి కలుగుతుంది. ఎవరికి వారే ఆ పాత్రలలో ఒదిగిపోయి నటించారు అనడానికన్నా జీవించారు అనడమే బాగుంటుంది. ఈ విధంగా పాత్రలను పాత్రధారులను తీర్చిదిద్దారు.

తర్వాతి అధ్యాయంలో గణపతి, వేయిపడగల రేడియో నాటకీకరణలో జరిగిన మార్పులు, చేర్పులను విమర్శనాత్మకంగా వివరిస్తాను.

ఆరవ అధ్యాయం

# రేడియో నాటకీకరణ,మార్పులు,చేర్పులు: విమర్శనాత్మక పరిశీలన

గణపతి, వేయిపడగలు రేడియో నాటకాలలో పాత్రలలోనూ, సన్నివేశాలలోనూ, సంభాషణలలోనూ, మార్పులు, చేర్పులు చోటుచేసుకున్నాయి. కాబట్టి నేను వాటిని దృష్టిలో పెట్టుకుని ఎటువంటి మార్పులు జరిగాయో పాఠకులకు తెలుసుకోవడానికి వీలుగా ఈ అధ్యాయంలో ఆయా సన్నివేశాలలో జరిగిన మార్పుల్ని, విశ్లేషణాత్మకంగా వివరిస్తున్నాను.

తెలుగు సాహిత్యంలో నవలకు ఒక ప్రత్యేక స్థానం ఉంది అయితే అది చదువుకున్న వారికి మాత్రమే ఉపయోగపడే ప్రక్రియ దాన్ని ప్రజలు కూడా తెలుసుకోవడానికి వీలుగా నవలలను సినిమాలు, నాటకాలు, శ్రవ్యనాటకాలుగా మారుస్తున్నారు. ఈ ప్రక్రియా ఈ విధానంలో సినిమాలుగా మారడంలో ఎక్కువగా కనిపిస్తుంది. కాని నవల రేడియో నాటకంగా మలచడం ద్వారా ప్రక్రియే మారిపోతుంది. నవల రేడియో నాటకంగా మారేటప్పుడు అనుసరిస్తున్న సృజనాత్మక పద్ధతులను వివరిస్తున్నాను. నవలలో రచయితకున్నంత స్వేచ్ఛ నాటక రచనలో ఉండదు. ఉత్తమ పురుషలో  పాత్రల చేత మాట్లాడించడం. పాత్రోచితమైన భాషను వాడటం సంభాషణలలో చాతుర్యం ప్రదర్శించడం రంగ విభజన మొదలైనవి నాటకంలో ప్రధానం మాటల ద్వారా దృశ్యాన్ని శ్రోతకు చూపించాలి.

నవల నాటకంగా మారినప్పుడు పరిమితులకు లోబడి ఉంటుంది. వీటిలో దృశ్య, శ్రవ్య నాటకాలు(రేడియో నాటకాలు) ఉన్నాయి. నవలలు రేడియో నాటకాలుగా మారినప్పుడు వాటిలో ఉన్న పాత్ర పోషణ సంభాషణలోనూ, శిల్పంలోనూ భేదం ఉంటుంది. వీటి మధ్య ఉన్న వైవిధ్యాన్ని వివరిస్తున్నాను. నవలలో ఉన్న విస్తృత పాత్ర చిత్రణ నాటకంలో ఉండడానికి వీలుండదు. నవలలో ఉన్న వర్ణనలు, నాటకంలో వచ్చేసరికి సంక్షిప్తం చేయాలి. సంభాషణలోను, శిల్పంలోనూ మార్పులు చేయవలసి ఉంటుంది. గణపతి, వేయిపడగలు నవలలు రేడియో

నాటకాలుగా మారినప్పుడు వాటిలో వైవిధ్యం ఉందని గమనించి ఈ అధ్యాయంలో వివరిస్తున్నాను.

### 6.1.‘ గణపతి’ రేడియో నాటకీకరణ మార్పులు చేర్పులు:

గణపతి నవలను రేడియో నాటకంగా ఆకాశవాణి ప్రసారం చేసింది. ఇది గంటసేపు నాటకం. ఈ నాటకాన్ని ‘గణపతి’ నవలను పరిశీలించినట్లయితే అనేక భేదాలు కొన్ని మార్పులు కనిపిస్తాయి. నవలలో గణపతి పూర్వీకుల చరిత్రలను వారి జీవన విధానాన్ని వివరించారు. నాటకంలో వారి ప్రస్తావన లేదు. మాటల సందర్భంలో ప్రారంభంలో గణపతి తాత పేరు, గణపతి తండ్రి పేరును మాత్రం తెలిపారు.

### 6.1.1.గణపతి పాత్ర ప్రవేశంలో మార్పులు:

నవలలో ఎనిమిదవ ప్రకరణం నుండి గణపతి పాత్ర ప్రవేశిస్తుంది. నవలలో గణపతి పుట్టడంతో గంగాధరుని తల్లి పిచ్చమ్మ చనిపోతుంది. దానితో పంతులుగారి దగ్గరకు వెళ్ళి తన బిడ్డ జాతకం చూపించే సందర్భంలో పంతులు గణపతి ఏ రోజున జన్మించాడు. అనగా గంగాధరుడు సరైన రోజు గుర్తులేదని దానికి కొన్ని సందర్భాలను సంఘటనలను వివరించి దాని ప్రకారంగా తన బిడ్డ ఏ రోజు పుట్టాడో నిర్ణయించుకోమంటారు. ఆ సమాధానాలకు శాస్త్రి విసుగు చెందుతాడు ఇతని సలహా మేరకు గంగాధరుడు శాస్త్రిగారికి మూడు రూపాయలు చెల్లించి వెంకన్న పంతులుగారి మరణ దినం అతని కుమారున్ని అడిగి తెలుసుకుని వచ్చి చెప్తాడు.

నాటక ప్రారంభంలో గణపతిని వాళ్ళ అమ్మ బడికి తీసుకురావడం. బడిలోని పిల్లలందరూ కొండముచ్చని హేళన చేయడంతో ప్రారంభమవుతుంది. ఇందులో గణపతి పుట్టిన తేది, వివరాలు బడి పంతులు అడుగగా తల్లియైన సింగమ్మ గణపతి పుట్టిన సందర్భాలను వివరిస్తుంది. విసుగు చెందిన బడి పంతులు కనీసం ఎన్ని సంవత్సరాలు అని అడిగితే ఉపనయనం అయ్యి ఎనిమిది ఏళ్ళైందని చెప్తుంది.

నవలలో గణపతి నాన్న తన కొడుకు జాతకం తెలుసుకునే సందర్భంలో పుట్టిన తేది తెలియకుండా కొన్ని సంగతులను ఆధారం చేసుకుని చెప్తాడు. ఇదే విషయం నాటకంలో సింగమ్మ కొడుకును బడిలో చేర్పించే సమయంలో సింగమ్మ బడి పంతులకు చెప్తుంది. ఇది నాటకంలో వచ్చిన మార్పు.

### 6.1.2.నాగన్న, సింగమ్మ సంభాషణలో మార్పులు:

నవలలో గణపతి బడికి వెళ్లకుండా ఉండడానికి నానా వేషాలు వేసేవాడు. ఆ వేషాలు భరించలేక మేనమామ తిడుతుంటాడు. సింగమ్మ తన కొడుకు వేషాలు భరించలేని వైనా ఒక్కగానొక్క కొడుకు అవడం చేత ఏమి అనలేకపోతుంది అల్లరి చేస్తే కొట్టమని కూడా చెప్తుంది.

నాటకంలో గణపతి మేనమామ గణపతి చేసే అల్లరి పనులు చెప్తూ ఉంటే సింగమ్మ వీటినన్నింటిని ఏదో సాకు చెప్తూ కొడుకును వెనకేసుకు వస్తుంది. మేనమామ గణపతి పెద్ద రెడ్డిగారి తోటలో పిల్లల్ని వెంటబెట్టుకెళ్ళి మామిడి కాయల్ని రాల్చేశాడట అంటే తల్లి ఛీ.....ఛీ మొన్నటి గాలికి అవే రాలిపోయాయేమో అని అంటుంది. మేనమామ ఆమె మాటకు సమాధానం ఇస్తూ కార్తీక మాసంలో వచ్చిన వాన గాలికి చైత్ర మాసంలో చెట్ల కాయలు రాల్తాయా అని సామెతతో సమాధానం చెప్తాడు. ఇది నవలలో ఉండదు. అలాగే కొబ్బరి చెట్లెక్కి పిందెలు రాల్చేశాడన్నప్పుడు ఊరంతా ఉడుతలు పోగైనాయి అవే కొట్టేశాయని కరణంగారి వేరుశనగ చేలు పాడుచేసి కాయలు కాజేసుకు పోయాడంటా అంటే ఊళ్ళోకి గుంపులు, గుంపులుగా ఎలుకలు వచ్చాయని అవే పాడు చేసుంటాయని సింగమ్మ తన కొడుకును వెనకేసుకొస్తూ కారణాలు చెప్తుంది. ఇదంతా నవలలో ఉండదు.

### 6.1.3. గణపతి– గాడిద పై ఊరేగింపు సన్నివేశంలో జరిగిన మార్పులు:

నవలలో గణపతి గుర్రాన్ని ఎక్కాలన్నా కోరికతో ఉంటాడు. గుర్రాన్ని ఎక్కడం సాధ్యం కాదని తెలిసి దానికి మారుగా గాడిదను ఎందుకు ఎక్కకూడదని తన మనసులో గాడిదకు, గుర్రానికి గల భేదాలను ఊహించి గాడిదే ఎన్నో విధాల మేలని నిశ్చయించుకుని చాకలి వాడింటికి వెళ్ళి చుట్ట ముక్క ఇచ్చి తినుబండారాలను తెచ్చిపెడ్తానని ఆశచూపి చాకలివాడి సహాయంతో గాడిదనెక్కి ఊరేగుతాడు. ఎదుట వాళ్ళ మామయ్య చూసిన వెంటనే ఎంతో శ్రమతో ,ఆత్రుతతో గాడిద మీద నుంచి దిగి పరిగిస్తాడు. నవలలో దేవతల వాహనాల పేర్లను రచయిత చెప్తాడు.

నాటకంలో బడికి రాని గణపతిని అతని స్నేహితుడు వెతుకుతూ చాకలి వాడితో గణపతి కనబడితే అతని కాళ్లు చేతులు కట్టి పంతులు దగ్గరకు తీసుకురమ్మని చెప్పి వెళ్ళిపోతాడు. చాకలివాడు రంగ బుట్ట కింద ఉన్న గణపతిని గమనించి అలాగే

కట్టేస్తాడు. గణపతి అతడికి అనేక తిండి పదార్థాలు, పిండి వంటలు, డబ్బులు ఆశచూపి కట్లు విడిపించుకుని చాకలివాడి సహాయంతో గాడిదనెక్కి ఊరేగిస్తుంటే వారి స్నేహితులందరూ నవ్వుకుంటారు గాడిద పరిగెత్తే సమయంలో గణపతి కిందపడతాడు. ఆ విషయం పిల్లలు గణపతి ఇంట్లో చెప్తారు. గణపతి మేనమామకు అతని భార్య మాచమ్మ చెప్తే గాని తెలియదు. తల్లి గాడిదను ఎందుకు ఎక్కావురా అంటే దేవతల వాహనాలను ఉదాహరణగా చెప్తాడు. వారి కంటే నేనేం తక్కువ అని సమాధానం చెప్తాడు.

నవలలో గణపతి మేనమామను చూడగానే గాడిదను దిగి పరిగిస్తాడు. నాటకంలో గాడిదమీద నుండి కింద పడిపోవడం జరుగుతుంది. ఈ విషయం నవలలో మేనమామ ప్రత్యక్షంగా చూస్తాడు. నాటకంలో భార్యద్వారా తెలుసుకున్నట్లు చిత్రీకరించారు. ఇది ఒక మార్పు.

సింగమ్మ గాడిదనెక్కావా అన్నప్పుడు వసుదేవుడంతటివాడు గాడిద కాళ్లు పట్టుకోగా నేను గాడిదనెక్కితే తప్పేంటి అంటాడు. దేవతలకున్న వాహనాలన్నింటినీ ఉదాహరణగా చూపడంలో ప్రదర్శించిన గణపతికున్న జ్ఞానాన్ని అంచనా వేయడానికి సాధ్యం కాదు. గణపతికి ఇంతటి జ్ఞానమా, ఇంతటి తెలివితేటలా అన్న ప్రశ్న ఉదయిస్తుంది. ఈ సంభాషణలో , సమయస్ఫూర్తితో వ్యవహరించడం కనబడుతుంది.

**6.1.4.గణపతి గిరజాలు పెంచే ప్రయత్నం– సన్నివేశంలో మార్పు:**

నవలలో గణపతి పై జార్ల జోడును తనకు ఇప్పించమని తన స్నేహితుడైన పెళ్లి కొడుకును అడుగుతాడు. అది కుదరక పోవడం చేత వాటిని దొంగతనం చేస్తాడు. నాటకంలో స్నేహితుడు నాగేశు తో గిరజాలు ఎలాగైనా తెల్లారేసరికి జరీచడావులు సంపాదించుకోవచ్చు గిరజాలు ఎలా పెరిగాయి అనడంతోనే పరోక్షంగా శ్రోతకు దొంగతనం చేస్తాడు అనే భావం స్ఫురిస్తుంది. నవలలో దొంగతనం చేసినట్టు చూపబడుతుంది. నాటకంలో దొంగతనం చేసినట్టు చూపకపోయినా గణపతి సంభాషణలో పరోక్షంగా దొంగతనం చేస్తాడని శ్రోతకు బోధపడుతుంది.

నవలలో గణపతి తన మిత్రుని వివాహం కోసం రాజమహేంద్రవరం వెళ్ళి అక్కడున్న వారిని వారికున్న గిరజాలను చూసి తనకు అలాంటి గిరజాలు ఉంటే

బాగుండునని దానికి తగిన ఉపాయం ఆలోచించి మంగలి వానిచే గుండు గీయించుకుని పెళ్ళికి వచ్చే ఆడవారినందరిని సంపెంగ నూనెను అడిగి గిరజాలు పెరుగడానికి సాధన చేస్తూ ఉండగా ఒక అల్లరి పిల్లవాడు ఆముదం రాయమని చెప్తాడు. అప్పటి నుండి గణపతి అందరూ నిద్రపోయే సమయంలో చాకలివాడు కాగడాల కోసం ఇత్తడి సిద్ధులలో దాచుకున్న ఆముదాన్ని తీసుకుని దొంగతనంగా తలకు రాసుకునేవాడు. ఒకసారి గణపతి చాకలివాడికి పట్టుబడగా అతనికి సంభావన ఇచ్చి నలుగురికి చెప్ప వద్దంటాడు. తెల్లారేసరికి ఆ విషయం అందరికి తెలిసిపోయి గణపతిని ఎగతాళి మాటలు మాట్లాడినా అది గ్రహించలేక రహస్యం బయటపడలేదనే అనుకుంటాడు.

నాటకంలో గణపతి తన గిరజాలు పెరిగే ఉపాయం తన స్నేహితుడు చెప్పగా విని వాడు చెప్పినట్టే భజంత్రీ వాడి చేత గుండు గీయించుకుని ఎవరికి తెలియకుండా ఆముదం రాసుకుంటుంటే అది గమనించిన చాకలివాడికి గణపతి పావలా ఇస్తాడు. చాకలి వాడు కూడా గణపతికి సహకరిస్తాడు.

నవలలో గణపతి తన గిరజాలు పెంచుకోవడానికి ఆడవాళ్ళందరిని సంపెంగ నూనెను అడుగుతుంటాడు. ఇది నాటకంలో ఉండదు. పైగా తాను ఆముదం దొంగతనంగా రాసుకునే విషయాన్ని చాకలి వాడు బట్టబయలు చేస్తాడు. నాటకంలో చాకలివాడే ఈ విషయంలో సహకరించి నట్టుగా ఉంటుంది.

నవలలో రాజమహేంద్రవరంలో గణపతి తన స్నేహితుని పెళ్ళికి వెళ్ళినట్లు ఉంటుంది. కాని స్నేహితుడి పేరును సూచించలేదు. నాటకంలో తన స్నేహితుడి పేరు చలపాయ్ అని గణపతి అతని మరొక స్నేహితుడు సంభాషణ ద్వారా తెలుస్తుంది.

నవలలో సింగమ్మ రాజమహేంద్రవరం నుండి గణపతి తెచ్చుకున్న పుటావు చడావులు ఎక్కడ్నుండి వచ్చాయని దొంగతనమేమైన చేశావా అలా చేస్తే చెప్పునాయన ఎవరిది వారికి ఇచ్చేస్తాము అని అడుగగా గణపతి దొరికింది దొంగ వస్తువవుతుందా వీధిలో మనం వెళ్ళేటప్పుడు ఏ వస్తువైనా దొరకవచ్చు అది మనదవుతుందా కాదా అలాగే నాకు ఈ జోడు దొరికింది. ఒకరి చేతిలో ఉండగా నేను లాక్కోలేదు. నా పుణ్యం వలన దొరికిందంటూ సమాధానం చెప్తాడు. అలాగే నేను కోటు తొడుక్కుని గిరజాలు దువ్వుకుని, ముచ్చెలు తొడుక్కుని బెత్తం చేత

పెట్టుకుని బయలుదేరినానంటే ఎర్ర తలపాగా వాళ్ళు అందరూ వీడెవడురా డిప్టికలెక్టురులాగా ఉన్నాడని తోక తెంచుకుని పోగలరు అంటాడు.

నాటకంలో సింగమ్మ తమ్ముడి కూతురికి తన కొడుకునిచ్చి పెళ్ళి చేయమను సందర్భంలో గణపతి గురించి చెప్తూ అతడికి కొద్ది రోజుల్లో గిరజాలు ఎదుగుతున్నాయి. ఇంతకంటే ఏమి కావాలి రాజ మహేంద్ర వరం నుండి పుటావు చడావులు కూడా తెచ్చుకున్నాడు. ఒక పట్టు కోటు ఉంటే వాడు కలెక్టరులా ఉంటాడని చెప్తుంది.

నవలలో గణపతే తాను డిప్టి కలెక్టర్ లాగా ఉంటానని చెప్పుకోగా నాటకంలో సింగమ్మ మా వాడు కలెక్టర్ లాగా ఉంటాడని చెప్తుంది. ఇది ఒక మార్పు

### 6.1.5.గణపతి భోజన వేళలో వచ్చిన మార్పు:

నవలలో గణపతి తల్లి, మేనమామ ఊళ్ళో లేనప్పుడు గంగమ్మను పరాభవింపదలుస్తాడు. గణపతికి ఎక్కువ అన్నం పెట్టినా , తక్కువ అన్నం పెట్టినా దారిన పోయే వారిని పిలిచి అల్లరి చేస్తాడు.

నాటకంలోనూ ఈ సన్నివేశం ఉన్నప్పటికి గణపతికి మాచమ్మ అన్నం ఎక్కువ వడ్డించిందని మహదేవ శాస్త్రులను పిలిచి మాచమ్మ ను అల్లరి చేస్తాడు. ఇదంతా నాటకంలో మాచమ్మ నాగన్నకు ప్లాష్ బ్యాక్ గా చెప్తున్నప్పుడు వివరించిన సంభాషణ అలాగే ఈ సన్నివేశంలో మహదేవశాస్త్రి ప్రవేశం నవలలో ఉండదు.

నవలలో గణపతి మేనత్త గర్భం దాల్చింది మొదలు ఆడపిల్ల పుట్టిన తర్వాత సింగమ్మ తనకు కోడలు పుట్టిందని అంతకు ముందు లేని ప్రేమానురాగాలు పంచడం, కంటికి రెప్పలా కాపాడుతుంది. గణపతికి ఆ పిల్లను చేసుకోవడం ఇష్టమే కాని ఎత్తుకుని ఆటపాటలు చూడటం తనకు నిద్రాభంగం కలుగుతుందని ఎత్తుకున్న ప్రతి సారి ఆ పిల్లను గిల్లి ఏడిపించే వాడు. దానితో అతనిని ఎత్తుకోమని చెప్పడం మనేశారు. మేనత్త గణపతి ఈ పిల్లను గిల్లి ఏడిపించే వాడు అని అంటుంది. దానికి సింగమ్మ సమర్థిస్తూ దానికి మగడంటే సిగ్గు అందుకే గణపతి ఎత్తుకున్న ప్రతి సారి ఏడుస్తుందని నువ్వు కావాలని ఆ పిల్లను వాడికి ఇవ్వకుండా చేయాలని చూస్తున్నావా అంటుంది. దానితో ఒకరికి ఒకరికి మాట మాట పెరగడం ఇంటి యజమాని వారిని నివారించడం జరుగుతుంది.

నాటకంలో సింగమ్మ  సంభాషణ ద్వారా మాచమ్మ కు మూడు మాసాలని తెలుస్తుంది. సింగమ్మ, నాగన్న సంభాషణ ద్వారా మాచమ్మ కు ఆడపిల్ల పుట్టిందని అర్థమవుతుంది.

నవలలో గణపతి మేనత్త గర్భం దాల్చిన దగ్గర నుండి బిడ్డ పుట్టడం ఆ పిల్లను గణపతి ఏడ్పించడం ఆ విషయంలో సింగమ్మ మేనత్తకు తగాదా ఏర్పడటం వంటివి ఉన్నాయి. నాటకంలో మాట సందర్భంలో మాత్రమే మేనత్తకు ఆడపిల్ల అని తెలుస్తుంది. గణపతి  ఆ పిల్లను ఏడిపించడం లాంటివి ఇందులో ఉండవు.

నవలలో మేనత్త గణపతిని పిల్లనెత్తుకోమంటే ఆ పిల్లను గిల్లి ఏడిపిస్తాడు. అనగా సింగమ్మ మా వాడు దాని మగడు కనుక సిగ్గుపడుతుందని దేవుడు వారిద్దరినీ మగడు పెండ్లాలుగా నిశ్చయించినప్పుడు సిగ్గు తనంతటే వస్తుందని చెప్తుంది.

నాటకంలో పై సంభాషణ వచ్చినప్పుడు సింగమ్మ తమ్ముడితో మాచమ్మ ఈ సంబంధం తప్పించాలని చూస్తుంది. బ్రహ్మదేవుడు వాళ్ళు పుట్టక ముందే ఆయన పెళ్ళి చేసి తర్వాత భూమ్మీద పడేస్తారంట అంటుంది. దానికి మాచమ్మ అయ్యో పెళ్ళేం కర్మ వదినా విడాకులు కూడా అప్పుడే ఇచ్చి పంపిస్తాడంట అంటుంది.

నవలలోని సంభాషణ నాటకంలో చాలా చమత్కారంగా సంభాషణ ద్వారా చెప్పించడం ఇక్కడ గమనించవచ్చు. మాచమ్మ మాటలు  కథకు సూచన ప్రాయంగా ఉంటాయి. తర్వాతి సంభాషణలో గణపతి మేనమామ కూతురిని లేవదీసుకొచ్చి వివాహం చేసుకోవడం నాగన్న మళ్ళీ  రాయప్ప తో తన కూతురి తాళి తెంచి వివాహం చేయడం జరుగుతుంది. కాబట్టి నాటకంలో జరగబోయే కథను మాచమ్మ ద్వారా సూచన ప్రాయంగా శ్రోతకు అందించినట్టు తెలుస్తుంది.

నవలలో గణపతి మేనమామ తన కుమార్తెను రాయప్పకు ఇస్తుందన్న సంగతి తన తోబుట్టువు సింగమ్మకు తెలియనివ్వరు. సింగమ్మే అనుమానపడి నిజం తెలుసుకుని పక్కనున్న వారిని పిలిచి గోల చేస్తుంది. సింగమ్మ రాయప్ప ను , ఆడపడుచును, అన్నయ్యను తన నోటికి వచ్చినట్లు తిడుతుంది. ఆ ఇంట్లోంచి గణపతి ఒక క్షణం కూడా ఉండకూడదని తన తల్లిని తీసుకుని వెళ్ళిపోతాడు.

నాటకంలో సింగమ్మ తన తమ్ముడు. మాచమ్మ ఇద్దరూ మాట్లాడుకునే మాటలు విని మాచమ్మ ను నిలువునా నా కొంప తీయాలని చూస్తున్నావు కదా

అంటూ చుట్టూ ఉన్నవాళ్ళను పిలిచి రచ్చ చేస్తుంది. ఆ ఇంట్లో ఉన్న కోడ్ ఊడిపోయిన నులక మంచం, అంచూడిపోయిన చెల్లి చెంబు, తుప్పుపట్టిన రేకు కిరసనాయలు డబ్బా, మూత పోయిన సీస కాయ వంటి వస్తువులను తీసుకుని వెళ్ళిపోతారు.

నవలలో మేనమామ తన కూతురుకు రాయప్ప వివాహ విషయ వ్యవహారాలు రహస్యంగా తన చెల్లెలు కు, గణపతికి తెలియకుండా చేస్తారు. వీళ్ళ వ్యవహారాలు చూసి అనుమానపడి సింగమ్మ విషయం తెలుసుకుంటుంది. నాటకంలో అయితే సింగమ్మ తన తమ్ముడు తన ఆడపడుచు మాట్లాడుకునే మాటలు చాటుగా విని విషయం తెలుసుకున్నట్టుగా పై సన్నివేశాలను చూస్తే అర్థమవుతుంది.

నవలలో గణపతి మేనమామ ఇంట్లోంచి వెళ్లిపోండి మీ సామానులు ఏమున్నాయో తీసుకుపోండి అని మాత్రం చెప్తాడు. కాని వారు వెంటనే వారి సామానులు తీసుకుని వెళ్లకుండా మహదేవశాస్త్రి ఇంట్లో తలదాచుకున్న తర్వాత పుల్లయ్య ద్వారా తెప్పించుకుంటారు.

నాటకంలో హాస్యం పండించడానికి గణపతి మేనమామ ఇంటినుండి వెళ్ళేటప్పుడే నా ఆస్తి నా కిమ్మని చెప్పి కోడ్ ఊడి పోయిన నులక మంచం వంటి సామానులను తీసుకు వెళ్తారు.

నాటకంలోనే గణపతి వారి ఆస్తిని తీసుకు వెళ్ళేటప్పుడు ఇంత ఆస్తిని కాజేయాలనుకుంటున్నారా అంటూ ఏ కొంపలో నిప్పుంటే ఆ కొంపే కాలుతుందని సామెత రూపంలో సమాధానమిస్తాడు. ఇది నవలలో కనిపించదు.

నవలలో బుచ్చి కి పెళ్ళి నిశ్చయమైన ముందు రోజు గణపతి, తల్లికి ఎవరికి తెలియకుండా నాగన్న(మేనమామ) స్నేహితుడు పుల్లయ్య సహాయ సహకారాలతో ఆ పిల్లను ఎత్తుకు వచ్చి దొంగ వివాహం చేసుకోవడం మరునాడు ఉదయం ఆ విషయం తెలుసుకున్న నాగన్న దాని మెళ్ళో తాళిని తెంచి వేరే వివాహం చేయడం జరుగుతుంది.

నాటకంలో సింగమ్మ, మహదేవశాస్త్రి సంభాషణలో వ్యాఖ్యాన రూపంలో గణపతికి, బుచ్చమ్మకు వివాహం జరిగినట్టు చూపించలేదు కాని వారికి పెళ్ళిచేసినట్లు

తిరిగి గణపతి మేనమామ బుచ్చిని రాయప్పకు ఇచ్చి మళ్ళీ పెళ్లి చేసినట్లు తెలుస్తుంది. ఇది నాటకంలోని మార్పు.

### 6.1.6.గణపతి అమాయకత్వంలో జరిగిన మార్పులు:

నవలలో గణపతి కొబ్బరి చెట్టు మీద ఉన్న ఎలుకలు బెడదను పోగొట్టడానికి పిల్లి మెడకు తాడు వేసి శిష్యుల చేత కొబ్బరి చెట్టు ఎక్కింపచేసి పైన కట్టించాడు. గణపతి తన తెలివితేటల గురించి మాట్లాడుతూ 'తెలివి తేటలుండాలి కాని ఏళ్ళుండగానే సరిపోతోందా డబ్బుండగానే సరిపోతోందా అంటాడు. నాటకంలో తల్లి సింగమ్మ గణపతితో ఎలుకల బెడదను తొలగించే ఉపాయం చెప్పమనగా గణపతి అలాగే ఆలోచిస్తానంటాడు. మహదేవశాస్త్రి వచ్చి పిల్లిని ఎవరమ్మా కొబ్బరి చెట్టుకు వేలాడదీశారు అనడంతో గణపతి ఆలోచించిన ఉపాయం ఏమిటో శ్రోతకు అర్థమవుతుంది. తాను చేసిన పనిని సమర్థించుకుంటూ మహదేవ శాస్త్రితో ఉపాయం ఉండాలి మామయ్య ఉపాయం లేని వాడ్ని ఊళ్ళో నుండి వెళ్ళగొట్టమన్నాడు అంటాడు. మహదేవయ్య ఎలుకలు చావ లేదు పిల్లి చచ్చిందని అంటాడు దీనితో గణపతి తెలివితేటలు ఎలా ఉంటాయో శ్రోతకు తెలుస్తుంది.

### 6.1.7.గణపతి వంట పని– మార్పు:

నవలలో గణపతి తన మిత్రుల సలహా మేరకు లోకల్ ఫండ్ ఇన్స్ పెక్టర్ గారి ఇంట వంట బ్రాహ్మణుడుగా కుదురుతాడు. నాటకంలో మహదేవశాస్త్రి చెప్పిన ప్రకారం ఓవర్ సీన్ ఇంట వంట బ్రాహ్మణుడుగా మహదేవశాస్త్రి కుదిర్చి నట్టుగా మార్పు చేశారు.

ఓవర్ సీన్ గణపతిని వంట అయ్యిందా అని అడిగినప్పుడు ఎసరు పెట్టానని సమాధానం చెప్తాడు. ఓవర్ సీన్ నేను వెళ్ళేముందు ఎసరు పెట్టావే ఇంకా అన్నం కాలేదా అని అడగ్గా వేశాను, వండాను తిన్నాను. మళ్ళీ పెట్టాను. తాను తిని ఒకరికి పెట్టమన్నారు శాస్త్రంలో అంటాడు. అలాగే ఓవర్ సీన్ ఈ కూర ఏమిటి చేదుగా ఉంది ఆ కూరలో పుల్లేమిటి అని అడుగగా అదా గరిట మరచిపోయాను చెట్టెక్కి పుల్ల కోసి ఈ పుల్లతో కలియబెట్టాను అంటాడు. అది వేప పుల్ల అనగా ఏ వేప పుల్లతో పల్లుతోముకోరా వేప పువ్వు తినడం లేదా అని అతను చెప్పిన సమాధానాలు

హాస్యంగా ఉన్నా అందులో గణపతి సమయస్ఫూర్తిని మెచ్చుకోక తప్పదని అనిపిస్తుంది.

ఇక్కడ గణపతి తాను తిని ఒకరికి పెట్టమన్నారు శాస్త్రంలో అనే మాటలో చాలా అర్థం ఉంది. శాస్త్రాలను కూడా వల్లెవేసిన పండితుడుగా కనబడినట్టు అనిపిస్తాడు.

### 6.1.8.గణపతి నాటక సమయంలో జరిగిన మార్పు:

గణపతి ఊరిలో వారు గణపతి వేసే నాటకం చూడటానికి వస్తారు. అందరిని చూచి గణపతికి చెమటలు పడతాయి తన కథా భాగం ఏమాత్రం గుర్తుకు రాదు. తన స్నేహితుల ముందు అవమానం కలుగుతుందని గుర్తు తెచ్చుకోవాలని ప్రయత్నం చేస్తాడు. అంతలో హాస్యగాడు కృష్ణ వేషం వేసుకున్న గణపతిని కొంచెం కదిపి మాట్లాడించాలని మాధవా మనది ఏ ఊరని అడుగగా కృష్ణ వేషంలో ఉన్న గణపతి ద్వారకా పురం అని చెప్పవలసిన అతను తనది మందపల్లి కదరా తెలియనివానివలె అడుగుతావేంటిరా అని సమాధానం చెప్పగా అందరూ నవ్వుతారు. నాటకం చెడిపోయిందని గరుడా చలం గణపతిని వెళ్ళిపోమంటుంది.

నాటకంలో గరుడా చలం భామ వేషంలో భాగవతం నాటకం వేయడం చూసిన గణపతి, తాను గరుడా చలం పక్కన కృష్ణ వేషం వేయాలని రంగా అనే చాకలివాడి సహాయంతో నాటకం వేయడానికి సిద్ధపడతాడు. నాటక మాడే సమయంలో అతడు నిద్రపోతాడు. ఎవరు పిలిచినా లేవడు చివరకు లేసిన తర్వాత గరుడా చలం కృష్ణ వేషం వేసుకున్న గణపతితో నీ పేరేమి, నీ ఊరేమి ప్రేక్షకులకు వివరిస్తారా అనగా నిద్ర మత్తులో ఉన్న గణపతి నా పేరు గణపతి. ఊరు పేరు మందపల్లి ఇంటి పేరు పప్పుభొట్ల వారని చెప్పడంతో ప్రేక్షకులంతా నవ్వుకుంటారు. నాటకం చెడిపోయిందని గరుడా చలం గణపతిని కొట్టబోతే పారిపోతాడు.

నవలలో జనులను చూసి తడబాటుతో సరైన సమాధానం చెప్పలేక పోతాడు. నాటకంలో అదే సన్నివేశం ప్రదర్శించేటప్పుడు గణపతి నిద్రపోయినట్టు ఆ నిద్ర మత్తులో సరైన సమాధానం చెప్పనట్టుగా చిత్రీకరించారు. ఇక్కడ గణపతి నాటకంలో నిద్ర పోవడం నవలలో కనిపించదు.

నవలలో హాస్యగాడు కృష్ణ వేషంలో ఉన్న గణపతి నీపేరేమిటని అడుగుతాడు. ఇక్కడ నవలలో హాస్యగాడు అడుగుతాడు. నాటకంలో గరుడా చలమే స్వయంగా పేరును ఊరును సభాసదులకు వివరించమని అడుగుతుంది.

**6.1.9.మితిమీరిన గణపతి ప్రవర్తనలో మార్పులు:**

నవలలో తల్లి కుమారుని వివాహ ప్రస్తావన తీసుకురాగా గణపతి ఆమెను తిట్టి కొట్టును. ఆ విషయం సింగమ్మ ఇరుగు పొరుగుతో చెప్పగా వారు గణపతికి పిచ్చి పట్టిందని గణపతికి కత్తి గాట్లు వేయించి, నిమ్మ పులుసు రుద్ది వంద బిందెల నీళ్లు పోసిన గాని పిచ్చి కుదరదు అనగా ఆమె అలాగే చేస్తుంది. గణపతి ఈ పని తన తల్లే చేయించి ఉంటుందనుకొని ఆమెకు నాలాగే తగిన శాస్త్రి చేయాలని ఆమె నిద్రపోతున్న సమయంలో పదిమంది విద్యార్థుల సహాయంతో మంగలి వానితో గుండు గీయించి తనకు జరిగినట్లుగానే తల్లికి చేయించాడు. అప్పటి నుండి తల్లి కొడుకులు వేరు వేరుగా ఉంటారు.

నాటకంలో చివరలో బడి పంతులుగా కుదిరిన గణపతి ఒక విద్యార్థిని పద్యం చదవమంటాడు. ఆ పద్యానికి అర్థం మాత్రం విద్యార్థి చెప్పలేదు దానికి అర్థం గణపతి తనకు తోచినట్టుగా చెప్తాడు. శ్రీరాముల వారు చారు తులసీధామ అనగానే శ్రీరాములకి పైత్యంగా ఉందని కరివేపాకు లేకపోవడం చేత తులసి దళంతో చారు కాయిపించుకున్నాడని చెప్పగా రాముడేంటి చారు కాయిపించుకోవడమేంటి తులసి ఆకులు వేయడమేంటని సింగమ్మ అంటుంది. దానితో పిల్లలు నవ్వుతారు. దానిని అవమానంగా భావించిన గణపతి పిల్లల్ని చావబాదుతాడు. తన తల్లికి తగిన బుద్ధిచెప్పాలని అనుకుంటాడు. రంగతో తన తల్లికి పిచ్చి పట్టిందని చెప్పి ఆమె పాటలు పాడుకుంటుండగా ఆమెకు బలవంతంగా కాళ్లు చేతులు కట్టేసి గుండు గీయించి నిమ్మకాయలు రుద్ధి వంద బిందెల నీళ్ళు పోయిస్తాడు.

నవలలోని పై సన్నివేశం నాటకంలో ఈ విధంగా మార్చబడింది. నాటకంలో రంగ సహాయంతో తల్లిని పరాభవిస్తే నవలలో విద్యార్థుల సహాయంతో తల్లికి గుండు గీయిస్తాడు.

నవలలో నాటకంలోను పై సన్నివేశాలను చూస్తే నవలలో తల్లి మొదట తన కొడుకుకు పిచ్చి పట్టిందని, తర్వాత గణపతి తన తల్లికి పిచ్చి పట్టిందని శిక్షలు

ఒకిరినొకరు విధించుకుంటారు. నాటకంలో గణపతి పద్యానికి అర్థం చెప్పగా తల్లి హేళన చేసినందుకు తగిన శాస్తి చేయించడం మనం గమనించవచ్చు. నవలలో ఒకరినొకరు గుండు గీయించుకుని శిక్షలు విధించుకుంటారు నాటకంలో ఈ శిక్ష సింగమ్మకు మాత్రమే ఉంటుంది. కాని గణపతికి చేసినట్టు ఉండదు.

### 6.1.10. గణపతి పారిపోవడం లో జరిగిన మార్పు:

నవలలో అల్లరి విద్యార్థులు గణపతిని ఆటపట్టించాలనుకుంటారు. గణపతి ఒక విద్యార్థిని కోపంతో కొడతాడు. ఆ పిల్లవాడు చనిపోయినట్టు నటిస్తాడు. గణపతి ఆ పిల్లవాడు నిజంగానే చనిపోయాడేమోనని భయంతో మహదేవశాస్త్రి ఇంటిలో అటకమీద నిద్రపోతాడు. మహదేవశాస్త్రి భార్య ఆవకాయ కోసం అటకమీద కెక్కి చేయిపెట్టగా మెత్తని శరీరం తగలడంచేత కొండముచ్చని భయపడి కిందపడుతుంది. ధైర్యం గల ఒకడు అటకమీద కెక్కి కొండ ముచ్చు కాదని, గణపతి అని నిర్ధారణ చేస్తాడు. మహదేవశాస్త్రి తల్లి ఆవకాయ మైలపడిందని తిడుతుంది. సింగమ్మ మీ ఇంట్లో ఉండబట్టే ఇలా జరిగిందని అనగా మహదేవశాస్త్రి వాళ్ళను ఇంట్లో నుంచి వెళ్ళిపోమంటాడు.

నాటకంలో పిల్లవాడిని బాదడం చేత అతని తండ్రి గణపతి కోసం వెదుకుతున్నాడని తెలిసి అటకమీద చేరి నిద్రపోతుంటాడు. సింగమ్మ, మహదేవ శాస్త్రికి గణపతి జాడ తెలీదు. సింగమ్మను, మహదేవశాస్త్రి మడి కట్టుకున్నావుగా అటకమీద ఆవకాయ తీయమనగా గణపతిని కొండముచ్చని భావించి భయపడి నిచ్చెనమీద నుండి  పడబోయి చేతిలో ఉన్న దీపపు బుడ్డీతో ఇల్లు అంటుకుంటుంది. గణపతి పారిపోతాడు. మరలా నాటకంలో కనబడదు. సింగమ్మ మహదేవ శాస్త్రితో పాటు కాశికి వెళ్తానంటుంది. మహదేవశాస్త్రి ఋణాను బంధ రూపేణ  అనడంతో నాటకం పూర్తవుతుంది.

నవలలో సింగమ్మ రామేశ్వర యాత్రకు వెళ్ళి శ్రీ కుంభకోణ క్షేత్రంలో మరణిస్తుంది. నాటకంలో సింగమ్మ మరణించినట్లు చూపలేదు. నవలలో గణపతికి వివాహం అవడం, పిల్లనిచ్చిన తండ్రి మోసగాడని, అతనికి జైలు శిక్ష విధించడం వంటి అంశాలన్ని నాటకంలో చూపలేదు. పైగా నాటకంలో మహదేవశాస్త్రి ఇల్లు

తగలబడుతుంది. గణపతి పారిపోతాడు. మహదేవశాస్త్రి తోపాటు సింగమ్మ కాశికి వెళ్తుంది.

నవలలోని ఘట్టాలను నాటకంలో ముందు వెనుకలుగా ప్రదర్శించబడ్డాయి. నవలలోని చాలా అంశాలు నాటకంలో లేవు. నాటకంలో చాకలివాడు రంగ సహాయం ఎక్కువగా తీసుకుంటాడు. ఇంచుమించు నాటకం చివరి వరకు చాకలి వాడు పాత్ర ఉంటుంది. వినే వారికి విసుగు నిరాశ కలగకుండా రేడియో నాటకంలో సరాసరి గణపతి ప్రస్తావన నుండే నాటకం ప్రారంభించారు. కొన్ని సన్నివేశాలను పరిహరించారు. నవలలో అక్కడక్కడ పురాణ సంబంధ విషయాలు రచయిత సందర్భానుసారంగా రాశాడు. చాలా వరకు నాటకంలో ఉండవు.

గణపతి నవలలోని పాత్రలకు రేడియోలోని గణపతి నాటకంలోని పాత్రలకు వ్యత్యాసం ఉంది. నవల అనేకమైన ప్రధాన పాత్రలతో , సహాయక పాత్రలతో కూడి ఉంది. నాటకం కొద్ది పాత్రలతో మాత్రమే ప్రదర్శితమవుతుంది. నవలలో సింగమ్మకు అన్నగా ఉన్న నాగన్న నాటకంలో తమ్ముడుగా కనబడుతాడు. నవలలో నాగన్న భార్య పేరు గంగమ్మ అని ఉండగా నాటకంలో మాచమ్మ గా మార్చారు. తక్కిన పాత్రలెన్ని యధాతథంగానే ఉన్నాయి. గణపతి పాత్రను నవలలోనూ, నాటకంలోనూ హాస్యపూరకంగానే చిత్రించారు

### 6.2.వేయిపడగలు రేడియో నాటకీకరణ మార్పులు– చేర్పులు:

వేయిపడగల నవలను రేడియో నాటకంగా ఆకాశవాణి ప్రసారం చేసింది. ఇది రోజుకి అరగంట చప్పున 23 వారాలు సాగిన నాటకం. అయితే దీనిని ఒకసారి ప్రసారం చేస్తే వినడానికి సాధ్యం కాదు కాబట్టి టి. వి. సీరియల్ లాగ ధారావాహికంగా రేడియోలో ప్రసారం చేశారు. ఈ నాటకం నవలలో ఉన్నటువంటి కొన్ని సన్నివేశాలను, కొన్ని సంఘటనలను కొన్ని పాత్రలను మార్పులు చేసి సుదీర్ఘ సంభాషణలను తగ్గించడం ఇలాంటి మార్పులను చేశారు. ఇక నాటకంలో కాని నవలలో కాని గణాచారి ప్రవేశంతోనే ప్రారంభమవుతుంది.

### 6.2.1.గణాచారి ప్రవేశం:

వేయిపడగలు నవలలో గణాచారి వేయిపడగల పాము ........అంటూ పాటను పాడుకుంటూ చేతిలో వేప మండ పట్టుకుని ఊగులాడుతూ పరిగిస్తూ

వెళ్తుంటే ఈమె వెంట పిల్లలు పరుగులు తీస్తారు. గణాచారి గురించి ఆ ఊరిలో కొంతమంది పెద్దలు రావి చెట్టు కింద కూర్చొని మాట్లాడుకుంటారు.

రేడియో నాటకీకరణలో గణాచారి వస్తుంటే పిల్లలు ఒకరినొకరు పిలుచుకుని గణాచారి వెంట పరిగెస్తారు. ఆ పిల్లల్లో ఒకరి పేరు రమణి అని పేరును సూచిస్తారు. ఈ రమణి అనే పేరు నవలలో ఉండదు. గణాచారి గురించి ముగ్గురు స్త్రీలు మాట్లాడుకుంటారు. ఈ స్త్రీ సంభాషణ నాటకంలో మాత్రం ఉంటుంది. నవలలో ఉండదు. వారి మాటల్లోనే ఒక పెద్దామె గణాచారి మూడవ తరంనాటిదని తెలుపుతుంది. గణాచారి మామిడి మండను పట్టుకుంటే శుభశూచకమని, వేప మండ పట్టుకుని దానిని ఎవరి ఇంట వేస్తే వారికి మూడు నెలల్లో ఆపద కలుగుతుందని చెప్పుకుంటారు. పెద్దామె ఎక్కడ చూసినా అన్యాయాలు శుచి, శుభ్రం లేకుండా పోతున్నాయని అంటుంది. దీన్ని బట్టి స్వార్థ పూరితమైన సమాజం ఏర్పడుతుందని, ఇంతకు ముందున్న మంచి విధానాలన్ని నశించి పోతున్నట్టుగా తెలుస్తుంది. మామిడి మండ వేసిన సందర్భం ధర్మారావు పెళ్ళికి ముందు వేసిందని మాట్లాడుకుంటారు.

ఒక యువకుడు గణాచారిని చూసి హేళన చేయడం నవలలోనూ, రేడియో నాటకంలోనూ కనిపిస్తుంది. అయితే నాటకంలో ఆ యువకుడి పేరు వెంకన్న అని పేరును సూచించారు. ఈ పాత్ర నవలలో కూడా ఉంటుంది. పేరును మాత్రం సూచించలేదు. నాటకంలో సూచించారు. ఒక స్త్రీ ఆ యువకుడ్ని వారించడం జరుగుతుంది.

నవలలో గణాచారి పురపాలక సంఘం ఏర్పాటయిన తర్వాత వేప మండలు పుచ్చుకుని బయలుదేరి ఏఏ ప్రాంతాలలో విడుస్తుందో రచయిత చెప్తున్నట్టు ఉంటుంది. రేడియో నాటకం సంభాషణలతోనే జరగాలి కాబట్టి పై నవలలోని విషయాలను చంద్రా రెడ్డి, పాలేరు, పిల్లలు మరో వ్యక్తి ఇలా అనేక పాత్రల సంభాషణ పూర్వకంగా తెలియజేయబడుతాయి.

నవలలో గణాచారి వేసిన వేప మండను చంద్రా రెడ్డి కాలితో తోస్తాడు దానికి కాలు నొప్పితో బాధపడ్డాడు. ఎంతమంది వైద్యులకు చూపించినా తగ్గదు గణాచారి

తెల్ల చీర ధరించి ఎండిన వేప మండను, రావి మండతో కలిపి కట్టి తెచ్చి, చంద్రా రెడ్డి ఇంటి ముందు వేయగా అప్పుడు అతని కాలు నొప్పి నెమ్మదిస్తుంది.

నాటకంలో శ్రోతకు వివరంగా తెలియజేయడం కోసం వైద్యుడు, చంద్రా రెడ్డి మధ్య సంభాషణ జరుగుతుంది. వైద్యుడు ద్వారా గణాచారి వ్యక్తిత్వం గురించి వివరిస్తాడు. అలాగే గణాచారి వేప మండ, రావి మండ కలిపి ఇంటి ముందు వేసింది. ఇక మీకు నొప్పి తగ్గుతుందని చెప్తాడు. వీరి సంభాషణ నవలలో ఉండదు. ఇది నాటకంలో చేర్చిన మార్పు.

నవలలో గణాచారి నిద్రపోతున్న పాకకు నిప్పంటుకోవడంతో అందరూ గణాచారి మరణించిందని అనుకుంటారు కాని ఆమె మరణించిన విషయాన్ని ఖచ్చితంగా తెలపరు. నాటకంలో గణాచారి పిల్లవాడు రామేశ్వర శాస్త్రి సంభాషణలో రామేశ్వర శాస్త్రి గణాచారితో వానలు పోతే ఎండలు వస్తాయిగా, ఎండలు వస్తే ఇళ్లు తగలబడిపోతాయంట నీ పాకకు నిప్పు అంటకుండా చూసుకోమంటాడు. గణాచారి ఎలా జరిగితే అలా జరుగుతుందని అనడంతో మరలా గణాచారి పాత్ర నాటకంలో కనిపించదు. శ్రోత ఆమె మాట్లాడిన ఆ మాటే చివరి మాటగా గ్రహిస్తాడు.

### 6.2.2. రామేశ్వర శాస్త్రి – సావిత్రమ్మ సంభాషణల్లో మార్పు:

నాటకంలో రామేశ్వర శాస్త్రి, సావిత్రమ్మ సంభాషణ ఉంటుంది. భార్యా భర్తల మధ్య ప్రేమానురాగాలు స్పష్టంగా గోచరిస్తుంది. అయితే సావిత్రమ్మ ఒక సందర్భంలో మీకు బహు భార్యత్వం అంటే భలే మోజు అంటే మరి దానికి రామేశ్వర శాస్త్రి నేను వర్ణవ్యవస్థను రూపుమాపడానికే క్షత్రియ కన్య రంగాజమ్మ, వైశ్య స్త్రీ హైమావతి, శూద్రురాలు మంగ ను వివాహం చేసుకున్నాను ఈ వర్ణవ్యవస్థను రూపుమాపే సంభాషణ నవలలో కంటే రేడియో నాటకీకరణలో స్పష్టంగా, తెలియజేస్తాడు.

రామేశ్వర శాస్త్రి, సావిత్రి సంభాషణలలో, రామేశ్వర శాస్త్రి రసస్ఫూర్తికి లోనై ఆ రసరాజు వేణుగోపాల స్వామిని దర్శించుకోడానికి ఆనందంతో బయలుదేరుతాడు. సావిత్రమ్మ నేను వస్తాను అని ఎంత బతిమిలాడినా ఆయన ఒక్కడే వెళ్తాడు. గుడిలోని కళ్యాణమంటపంలో ప్రాణాలు విడుస్తాడు.

నవలలో శాస్త్రి జీవితకాలమంతా ఆయనకు ఎదురు చెప్పని ఆయన ధర్మపత్ని కూడా చివరకు లోకువయ్యింది. పిల్లలకు ఏమి లేకుండా చేసాడని ఆమెకు దుఃఖం కలుగుతుంది. ఆ దుఃఖం అప్పుడప్పుడు భర్తమీద కోపంగా పరిణమిస్తుంది.[1]

ఇటువంటి కోపం, దుఃఖం రామేశ్వర శాస్త్రి పై సావిత్రమ్మకు కలిగినట్లు కనబడుతుంది. ఇదే నాటకంలో ఇలా ఉండదు. రామేశ్వర శాస్త్రిపై ప్రేమానురాగాలే తప్ప మరొకటి కనబడదు. ఇది నాటకంలో వచ్చిన స్వల్ప మార్పు నవలలో రామేశ్వర శాస్త్రి పై కలిగినటువంటి భావాల్ని నాటకంలో యధాతథంగా పెట్టి ఉంటే బాగుండేదని అనుకుంటున్నాను. ఎందుకంటే శ్రోత విస్తారమైన నవలను చదవడం కంటే రేడియో నాటకాన్ని వినాలనే అభిమానులకు యదార్థ కథను తెలుసుకోవాలని ఉంటుంది. నాటకంలో అన్ని సన్నివేశాలను పొందు పరచటం సాధ్యం కాదు కనుక. ఒకటి, రెండు చిన్న సన్నివేశాలుగా ఉంటే బాగుండేది.

నవలలో రామేశ్వర శాస్త్రి, సావిత్రి సంభాషణ కనబడదు నాటకంలో వారి మధ్య ప్రేమానురాగాలతనో కూడిన సంభాషణ ఉంటుంది. బహుశా నాటకీకరణలో వచ్చిన సంభాషణ నేటి దంపతులు ఎలా ఉండాలో సూచించడానికి ఈ సంభాషణలో మార్పు చేసినట్టుగా తెలుస్తుంది.

నాటకంలో రామేశ్వర శాస్త్రి మాటల్లో సావిత్రి తనపై కోపపడినట్లు చెప్తాడు. దానికి సమాధానంగా సావిత్రి తనపై ప్రేమ ఎక్కడ తగ్గిపోతుందనే అనుమానం వలనే అలా చేశానని అయినా మీకు వండిపెట్టే భాగ్యం మాత్రం నాకే దక్కిందని తృప్తిపడతాను అంటుంది. అంటే ఇక్కడ సహజంగా భార్య భర్త ప్రేమ తనకు ఒక్కటే దక్కాలనే స్వార్థం ఉంటుందనిపించినా అది ఆమెకున్న ప్రేమను వ్యక్తం చేస్తుంది. కాబట్టి ఇది స్వార్థంగా అనిపించలేదు.

నవలలో గమనిస్తే రామేశ్వర శాస్త్రిపై సావిత్రికి కొంతచులకన భావం, దుఃఖం, కోపం అన్ని కలుగుతాయి. దీనికి గల కారణాన్ని చూస్తే రామేశ్వర శాస్త్రి దాన ధర్మాలతో ఇంటికి, తన పిల్లలకు రేపు ఏమి మిగలకుండా చేశాడనేది ఆమెకు గల కోపానికి బాధకు కారణమవుతుంది. ఇక్కడ సావిత్రిలో స్వార్థం కనబడుతుంది.

---

[1] సత్యనారాయణ, విశ్వనాథ, వేయిపడగలు, పుట:19.

నవలలో శాస్త్రి మంగ ను తన ఇంట్లోనే ఉండి పొమ్మంటాడు అప్పటికి సావిత్రమ్మ కాపురానికి వస్తుంది. ఆమె పెద్ద కూతురు హైమవతికి ఏడాది పిల్ల ఆమెకు శాస్త్రి ఈ పెళ్లిళ్లు చేసుకోవడం నచ్చదు మంగ ను ఇంట్లో ఉండనిచ్చేది కాదు మంగ పడే బాధలను చూడలేక శాస్త్రి ఆమెకు వేరే ఇల్లు వేసి అన్యాయం ఎందుకని ఆమెకు పది ఎకరాలు ఆమెకు రాసి ఇస్తాడు.[2]

ఈ మాటలలో సావిత్రమ్మకు రామేశ్వర శాస్త్రి అలా వివాహాలు చేసుకోవడం ఇష్టముండదు. పైగా శూద్రరాలు మంగ ను తన ఇంట ఉండడం ఆమె అసలు సహించలేకపోతుంది. అయితే నాటకంలో రామేశ్వర శాస్త్రి వివాహాల గురించి సావిత్రి, రామేశ్వర శాస్త్రిని ఈ విధంగా ప్రశ్నిస్తుంది. మరో నలుగురు సపత్నుల్ని నాకు తోడుగా తెచ్చారు. బహు భార్యత్వం అంటే మీకు బహు మోజు మీ ధర్మ బుద్ధి అప్పుడే ఏమయ్యింది. చంద్రుడిలో మచ్చలాగా ఈ వివాహాలు మిగిలి పోవా? అంటుంది. ఇలా చెప్పడంలో ధర్మ బుద్ధి గల రామేశ్వర శాస్త్రికి ఈ వివాహాలు అతని వ్యక్తిత్వాన్ని దెబ్బతీస్తాయి అని సావిత్రి భావించడంలో ఆమెలో భర్తమీద ప్రేమ, ఇటు కొంత అసూయ కనబడుతుంది. మొదట నాటకంలో ఇలా భావించినా తరువాత సపత్నులు మీద గౌరవాన్ని వారి పిల్లల మీద అభిమానాన్ని వ్యక్తం చేస్తుంది. ముఖ్యంగా రత్నగిరి కూతురు గిరిక ను రామేశ్వర శాస్త్రి తపస్సు అనే వృక్షానికి కాచిన మధుర ఫలమని చెప్తుంది. రామేశ్వర శాస్త్రి జన్మ పునీతం కావడానికి గిరిక జన్మ కు కారణమైనట్టు గా చెప్తుంది. ఈ మాటలు నవలలో కనిపించవు.

### 6.2.3.కృష్ణమనాయుని ప్రవేశం– సంభాషణలో మార్పు:

నవలలో 'మహా రాజ శ్రీ మన్ని సుల్తాన్ సుబ్బన్న పేట.....కృష్ణమ నాయని వారు' అనే మాటలు ధర్మారావు కృష్ణమ నాయని కి ఉత్తరం రాసేటప్పుడు తన విన్నపాలను తెలియజేసే సమయంలో జమిందారికి గౌరవపూర్వకంగా రాసిన మాటలుగా ఉంటాయి.

నాటకంలో ధర్మారావు తండ్రి మరణానంతరం జమిందారికి ఒక ఉత్తరం రాసి గోపన్నకిచ్చి దానిని మరలా గౌరవానికి భంగం కలుగుతుందని భావించి ఆ ఉత్తరాన్ని వెనక్కు తీసుకుంటాడు ఈ విషయాలన్ని గోపన్న, కృష్ణమనాయుని వారి

[2] సత్యనారాయణ,విశ్వనాథ,వేయిపడగలు.పుట:43.

సంభాషణలలో తెలుస్తుంది. గోపన్న మాటల ద్వారా ధర్మారావు ఉత్తరంలో రాసిన విషయాన్ని ధర్మారావు కష్టాన్ని గ్రహించి కృష్ణమనాయుడు తన గురించి చెప్పుకుంటూ 'మహారాజశ్రీ మన్నె సుల్తాన్ సుబ్బన్న పేట పరగణా జమిందారులు మహా ప్రభువులు కృష్ణమనాయుని వారు అని చెప్పి దివాను కుటుంబాన్ని ఆదుకోలేకపోయానని బాధపడ్డాడు. ఇక్కడ కృష్ణమనాయుడు తాను సుబ్బన్న పేటకు జమిందారునని తానే చెప్పుకోవడం కనబడుతుంది. ఇది ఒక మార్పు.

నాటకంలో కృష్ణమనాయుడు రామేశ్వర శాస్త్రి అప్పులను తీర్చడానికి ఆలోచిస్తున్న సమయంలో నాగన్న శేటు జమిందారి గారి దగ్గరకు తన కుమారుని పెండ్లి విషయమై వస్తాడు. కాని జమిందారు నాగన్నశేటుని 'గారు' అని సంబోధించడం ద్వారా కృష్ణమనాయుడు తనపై కోపంగా ఉన్నట్టుగా గ్రహిస్తాడు. జమిందారి ఆలోచన ధర్మారావుని అప్పు బాధనుండి బయటపడేస్తే గాని తన గురించి ఆలోచించడు అన్న విషయాన్ని గ్రహిస్తాడు.

నవలలో ఈ సన్నివేశం ఉన్నా 'గారు' అని కృష్ణమనాయుడు నాగన్న శేటుని సంబోధించడం ఉండదు. తాను వచ్చిన కార్యం ఏమిటని జమిందారు అడుగుతారని ఎదురు చూస్తాడు. రాజు లొటపిటల గురించి, గడ్డి పురుగుల గురించి ప్రస్తావన చేసినప్పుడు రాజుగారి భావం ఏమిటో గ్రహించ లేకపోతాడు. మిగతా బాకీదారులను పిలిపించమని జమిందారు చెప్పినప్పుడు నాగన్న శేటు ఆపని చేస్తాడు. నాటకంలో కృష్ణమనాయుడి అంతరార్థాన్ని నాగన్న శెట్టి గ్రహించినట్టుగా చిత్రీకరించారు. నవలలో ఈ సన్నివేశం ఉన్నప్పటికి కృష్ణమనాయుని అంతరార్థాన్ని గ్రహించలేరు.

### 6.2.4. రామేశ్వర శాస్త్రి గోపన్న సంభాషణ:

గోపన్న , రామేశ్వర శాస్త్రి సంభాషణలో గోపన్న దొంగ అయిన తనను జమిందారి ఇంట్లో ఒక నమ్మకస్తుడైన సేవకుడుగా మార్చడం దానికి గల కారణమైన రామేశ్వర శాస్త్రికి కృతజ్ఞతా భావంతో చెప్పుకుని బాధపడ్డాడు. ఆ సమయంలోనే జమిందారు గారిని, శ్రీకృష్ణదేవరాయులతోనూ, రామేశ్వర శాస్త్రిని తిమ్మరసుల వారితో నూ పోలుస్తాడు రామేశ్వర శాస్త్రి తిమ్మరసుల లాగానే రాజుకి ఇప్పుడు కాని వాడినయ్యాను. అని బాధపడ్డాడు.

ఇక్కడ చారిత్రక పురుషులను తీసుకురావడంలో గల కారణాలను అందులోని ఆంతర్యాన్ని గమనిస్తే 'రాయల కుమార్తె తిరుమలాంబ ఆరవీటి కామరాజును పెళ్లాడింది. ఇతన్నే అళియ రామ రాయులు అనేవారు రాయల ఏకైక పుత్రుడు తిరుమలుడు పసివాడు. రాయలు వృద్ధుడైన కొద్ది వారసత్వ సమస్య తలెత్తి ఉంటుంది. అంతీపురం బహుశా రామరాజును బలపరచగా తుళువ వంశం పట్ల విశ్వాసపాత్రుడైన తిమ్మరసు మంత్రి మొదలగువారు కృష్ణమ రాయల తమ్ముడు అచ్యుత రాయులని బలపరచి ఉంటాడు. ఇంతలో తిరుమలుడు మరణించాడు అతన్ని హత్యచేశారని ఆ కుట్రలో తిమ్మరసు కు జోక్యం ఉందని తిమ్మరసు గుడ్లు పీకించి రాయలు బంధి చేశాడు.[3]

ఎలాగైతే శ్రీకృష్ణ దేవ రాయులు, తిమ్మరసులమధ్య అవాంతరాలు ఏర్పడ్డాయో ఆ విధంగానే ఇక్కడ జరగడంతో ఆ పోలిక పోల్చినట్లుగా అనిపించింది. ఈ సంభాషణ నవలలో ఉండదు.

### 6.2.5. కృష్ణమనాయుడు–రామేశ్వర శాస్త్రి కలయిక:

నవలలో జమిందారు గారికి, రామేశ్వర శాస్త్రికి మాట పట్టింపు వచ్చి మాట్లాడుకోరు. కొన్ని సంవత్సరాల తర్వాత దేవాలయ సంప్రోక్షణ సమయం వస్తుంది. కృష్ణమనాయుడు, పూజారులు, గాయకులు ,వాద్యగాంద్రు అందరూ వచ్చారు. కాని అనుమతి కోసం అందరూ ఎదురుచూస్తున్నారు. జమిందారుగారు మౌనం వహిస్తాడు. బ్రాహ్మణుడు ధైర్యం చేసి అడుగగా రామేశ్వర శాస్త్రిని పిలుచుకుని రమ్మంటాడు. అలాగే చేస్తారు కాని రామేశ్వర శాస్త్రి జమిందారు గారే వచ్చి పిలిస్తే గాని రానంటాడు. జమిందారే స్వయంగా వెళ్లి రామేశ్వర శాస్త్రిని ఆహ్వానిస్తే అప్పుడు వస్తాడు.

కాని నాటకంలో ఆలయ సంప్రోక్షణ సమయంలో అన్ని ఏర్పాట్లు పూర్తయ్యాయి. కాని ఏదో లోటు కనిపిస్తుంది. అనడంతో బ్రాహ్మణుడు రామేశ్వర శాస్త్రి రాలేదు అంటాడు. జమిందారు బ్రాహ్మణుని రామేశ్వర శాస్త్రిని పిలుచు కు రమ్మంటాడు. వారు రామేశ్వర శాస్త్రిని పిలుచుకు రావడానికి వెళ్లే సమయంలో రామేశ్వర శాస్త్రే అక్కడకు విచ్చేస్తాడు. రామేశ్వర శాస్త్రికి, అతని భార్యకు

---

[3] హనుమంతరావు, బి.ఎస్.ఎల్. ఆంధ్రుల చరిత్ర,పుట:303.

కృష్ణమనాయుడు మేళ తాళాలతో స్వాగతం పలుకుతాడు. రామేశ్వర శాస్త్రే కృష్ణమ నాయుడ్ని కౌగిలించుకుంటాడు. ఇలా వారు కలిసి పోతారు. ఇది నవలలో కన్పించదు పైగా నవలలో వీరి మధ్య మాట పట్టింపు ఆరు సంవత్సరాలని ఉండగా నాటకంలో ఆరు నెలలుగా ఉంటుంది. ఇది నాటకంలో వచ్చిన మార్పు.

### 6.2.6.సన్నివేశ కల్పనలో మార్పు:

నాటకంలో రామేశ్వర శాస్త్రి స్వామివారికి ఖద్దరు వస్త్రాలతో వేణు గోపాలుని అలంకరించ మనటం, కృష్ణమనాయుడు తాను స్వామివారికి నవరత్నాలు తాపించిన పట్టు వస్త్రాలను చేయించి మంగళగిరి నుండి తెప్పించిన దాని కంటే రామేశ్వర శాస్త్రి మాటకే విలువనిచ్చి అతని మాటే వేదంగా భావించి ఖద్దరు వస్త్రాలనే స్వామివారికి అలంకరింప చేస్తాడు. ఈ సన్నివేశం నవలలో కనిపించదు.

ఈ నాటకంలో పై సన్నివేశాన్నిబట్టి భగవంతుడికి భక్తి భావమే సరైన అలంకారమని భక్తితో ఏది సమర్పించినా స్వామి వారు స్వీకరిస్తారని అర్థమవుతుంది. ఖద్దరు అంటే భారతదేశంలో మగ్గం ద్వారా తయారు చేసే నూలు వస్త్రం. ఇది సంప్రదాయానికి ప్రతీక అ సంప్రదాయం మాసిపోకూడదనే నాటకంలో స్వామివారికి ఖద్దరు వస్త్రాలతో అలంకరించారని తెలుస్తుంది. అది కాకుండా స్వతంత్ర పోరాట యోధులు ఖద్దరు వస్త్రాలనే ధరించారు. దేశభక్తి కూడా ఇందులో నిక్షిప్తమై ఉందని నేను అభిప్రాయపడుతున్నాను.

ఈ నాటకంలో ధర్మారావు గోపన్న తో నాగన్న శెట్టి అప్పులు తీరిపోయాయని, ప్రభువుల వారు ఈ నాగన్న పామును బుట్టలో పెట్టాశారన్న మాటే గా అంటాడు. దానికి గోపన్న ఆ బుట్టలో పెట్టడం కాదు 'తెల్ల ఉసిరిక చెట్టును మీ ఇంటి ముందు నాటేశాడు.' అంటాడు.

పై మాటలు నవలలో కనిపించవు. నాటకంలోని ఈ విషయాన్ని గమనిస్తే నాగన్న పేరు పామును సూచిస్తుంది. జమిందారు ఈ నాగన్న ను తన అధీనంలో పెట్టుకోవడమనేది పామును బుట్టలో పెట్టేశాడు అనే అర్థాన్నిస్తుంది.

గోపన్న పామును బుట్టలో పెట్టడం కాదు తెల్ల ఉసిరిక చెట్టునే మీ ఇంటి ముందు నాటేశారు. అన్నప్పుడు ''సహజంగా తెల్ల ఉసిరిక చెట్టు ఎక్కడ ఉంటే

అక్కడికి పాములు రావు''[4] ఇక ధర్మారావింటికి కూడా నాగన్న లాంటి వారు రారని ధర్మారావు జోలికి పోరనే భావం స్ఫురిస్తుంది.

నాటకంలో కృష్ణమనాయుడు, ధర్మారావు సంభాషణల్లో భక్తి జ్ఞానాలు దైవానుగ్రహం వలనే కలుగుతాయని ఇలా ఆధ్యాత్మిక సంబంధ విషయాలు మాట్లాడుతుంటే గోపన్న చావడం వంటివి వింటుంటే చెప్పలేని భయం కలుగుతుందని చెప్తాడు. దానికి సమాధానంగా కృష్ణమనాయుడు ఒక కథను చెప్తాడు. ఒక నూతిమీద నులక మంచం వేసుకుని అవ్వ బొంత కుట్టుకుంటుంటే సూది నూతిలో పడిపోయిందట అని చెప్తుండగా గోపన్న నవ్వి ఆ కథ నాకు తెలుసు ఏం చేసినా ఊ అన్నా, వస్తుందన్నా ,రాదన్నా, ఏమన్నా ఆ సూది రాదు. అంతే గా అంటాడు వీరి మాటలను ధర్మారావు విని అలాగే ఈ చావు పుట్టుకలు కూడా భయపడినా, ఏం ఫరవాలేదనుకున్నా, స్వామి నీ ఇష్టం వచ్చినట్లు చెయ్యి అన్నా అది అలా జరిగిపోతుంది అంటాడు. ఈ సంభాషణ నవలలో ఉండదు. ఈ విషయాలను నాటకంలో పొందుపరచడం చేత ఆత్మహత్య చేసుకునే వారికి. చావంటే భయం కలిగిన వారికి ఒక ధైర్యాన్ని కలిగిస్తుందని తెలుస్తుంది. మనం ఎన్ని ప్రయత్నాలు చేసినా చావును ఆహ్వానించలేము. చావు వచ్చినప్పుడు మనం తప్పించుకోవాలన్నా సాధ్యపడదు. అందుకని చావు పుట్టుకుల గురించి ఆలోచించడం మానేసి ప్రస్తుత మన కర్తవ్యమేమిటో తెలుసుకుని మసలడం ప్రధానం అని తెలుస్తుంది.

నవలలో రామేశ్వర శాస్త్రి ఆలయంలో ధ్వజస్తంభానికి ఇత్తడి తొడుగు బదులు బంగారు తొడుగు వేయించడం వేణుగోపాలస్వామికి బంగారపు మై మెరుపు వేయించడం, సత్యభామా దేవికి వేయి రూపాయలు వెల గల మాణిక్యం పొదగిన ముక్కుపుడక చేయించడం వంటివి చేయిస్తాడు.

నాటకంలో గోపన్న, రామేశ్వర శాస్త్రి సంభాషణ ద్వారా రామేశ్వర శాస్త్రి ఆలయంలో తాను చేసిన మార్పులను నవలలో లాగానే చేయించారు కాని కొన్నింటిని విడిచి పెట్టారు. నవలలో సత్యభామకు మాత్రమే ఆభరణ చేయించగా నాటకంలో రుక్మిణమ్మకు కూడా రత్నాల జుంకాలు చేయించినట్లు ఉంది. ఇది నవలలో కనబడదు.  నవలలో రుక్మిణమ్మను వదలి సత్యభామను మాత్రమే

[4] ముఖాముఖి, దిట్టకవి శ్యామలాదేవి.

పేర్కొనడం వెలితిగా భావించి స్వామివారికి ఇరువురూ సమానమే అన్నట్లు రుక్మిణమ్మకు కూడా నగ చేయించడం అనేది సమానత్వానికి కారణ హేతువుగా ఈ నాటకంలో కనబడుతుంది. ఇది నాటకంలో జరిగిన మార్పు.

నాటకంలో గోపన్న, రామేశ్వర శాస్త్రి సంభాషణలలో గోపన్న రామేశ్వర శాస్త్రి దాన గుణాన్ని పొగడ్తాడు. దానికి రామేశ్వర శాస్త్రి నువ్వీ మాటలు చెప్తుంటే ఆ దేవుడికే ప్రభూ నీకు నాలుగు చేతులున్నాయి. నీ వాహనం ఇది నీ అందం అంతా నీ కరుణ ఎంత, నువ్వింత వాడివి, నువ్వింత వాడివి, నువ్వు ప్రహ్లాదుని కటాక్షించడమే కాదు సాక్షాత్తు రాక్షసుడైన హిరణ్యకశిపుడంటే నీకు ఎంత ప్రీతి, పరమ పావనమైన నీ ఒళ్లో కూర్చోపెట్టుకుని వాడికి అద్భుతమైన మరణాన్ని ప్రసాదించావు అని ఆయనకున్న నామాలను, గుణాలను, ఆయనకే అప్ప చెప్తునట్లుందిరా అంటాడు. ఈ మాటలు నవలలో ఉండవు అలాగే పురాణ విషయం తీసుకురావడం శత్రువుని కూడా మిత్రునిగా భావించి తన సన్నిధికి చేర్చుకున్న భగవంతుడిలాగా ఇక్కడ రామేశ్వర శాస్త్రి కనబడుతాడు. ఈ విషయాన్ని రామేశ్వర శాస్త్రి మాటల్లోనే చెప్పించడం కనబడుతుంది.

నాటకంలో దేవాలయంలో కృష్ణమనాయుడికి ధర్మారావు కనబడటం దైవ సంకల్పంగా భావిస్తాడు. వారి మధ్య సంభాషణలో కృష్ణమనాయుడు నేను నీకు ప్రభువును కాను నీ తండ్రి స్నేహితుడ్ని అనుకో లేద పెద తండ్రిననుకో రాచరికాలే పోయాయి ఇక రాచమర్యాదలు ఎందుకు అంటాడు. ఇలా నాటకంలో రాచరికాలే పోయాయి రాచమర్యాదలు ఎందుకని కృష్ణమనాయుడు అనడం చేత అప్పటికే రాచరిక వ్యవస్థ కనుమరుగై పోతుందని భవిష్యత్ కాలంలో కూడా జమిందారి వ్యవస్థ పూర్తిగా నశించిపోతుందని వ్యక్తం చేసినట్లు తెలుస్తుంది. కృష్ణమనాయుడు, ధర్మారావు దేవాలయ దర్శనం చేయడం నవలలోనూ, నాటకంలోనూ ఉంటుంది. పై సంభాషణ మాత్రం నవలలో ఉండదు.

నవలలో కృష్ణమనాయుడు, ధర్మారావు నాగన్న శెట్టి కుమారుని వివాహానికి వెళ్తారు. అక్కడ కృష్ణమనాయుడు, నాగన్న శెట్టి దగ్గర మాట తీసుకుని ధర్మారావు ఇల్లును ఐదు వేల రూపాయలు ఇవ్వడానికి నాగన్న శెట్టిని సమ్మతింప చేసి ఇల్లు అప్పుల వాళ్లపాలు కాకుండా కాపాడుతాడు. ఈ సన్నివేశం నవలలోనూ,

నాటకంలోనూ ఉంటుంది. అయితే నాటకంలో కృష్ణమనాయుడు అకస్మాత్తుగా నాగన్న శెట్టిని అడగడం, కృష్ణమనాయుడు ధర్మారావు ఇంటిని కాపాడిన విధానానికి ధర్మరావు విస్మయం చెందుతాడు. అలా చెందిన ధర్మారావుతో కృష్ణమనాయుడు ఇలా అంటాడు ధర్మరావు విస్తుపోకు వీరిని ఎలా బిగించాలో అలా బిగించాలి. బంధు, మిత్రులు భార్యా పిల్లల మధ్య ఇచ్చిన మాట కాదనడు. జమిందారు పెళ్లికి వస్తే పరపతి పెరుగుతుందనుకున్నవాడు. ఇప్పుడు అన్నమాట నిలబెట్టుకున్నందుకు పరపతి పెరిగిపోతుంది. నాగన్నకేమి అన్యాయం జరిగిపోలేదు. ఇది యుక్తి, మోసం కాదు అతనికేమి నష్టం లేదు. ఇప్పుడా పెళ్లి కొడుకు మన కోటలోని ఏనుగు అంబారి ఎక్కి ఊరేగుతాడు. తండ్రి తన పరపతి పెరిగిపోయిందని ఏనుగెక్కినంత సంబర పడిపోతాడు. మా రామేశ్వర శాస్త్రి ఇల్లు నిలిపానని ఈ జమిందారికి ఏనుగెక్కినట్లే ఆనందంగా ఉంటుంది. అంటాడు.

ఈ మాటలను పరిశీలిస్తే రాజు ఎవరిని ఏ సమయంలో ఎలా తన దారికి తెచ్చుకోవాలో తెలిసిన యుక్తి, తెలివితేటలు కలిగి ఉంటాడు. అటువంటి రాజోపాయాన్ని ఇక్కడ కృష్ణమనాయుడు ప్రయోగించాడు. సాధారణంగా ప్రతి వ్యక్తికి గౌరవ మర్యాదలు ఉంటాయి. అందులో నలుగురిలో ఇచ్చిన మాటను తప్పక నిలబెట్టుకుంటారు. ఇటువంటి ఆలోచన చేసిన కృష్ణమనాయుడు నాగన్న శెట్టి కొడుకు వివాహ సమయంలో నాగన్న శెట్టి దగ్గర మాట తీసుకుని ధర్మారావు ఇల్లును విడిపించాడు. ఇక్కడ జమిందారు సమయస్ఫూర్తితో వ్యవహరించినట్టుగా అర్థమవుతుంది. అలాగే ఎవరికైనా సంతోషం కలిగితే ఏనుగెక్కినంత ఆనందం కలుగుతుంది. ఆ మాటలే ఇక్కడ కృష్ణమనాయుడు, నాగన్న శెట్టి కొడుకు పెళ్లి కొడుకుగా ఏనుగెక్కినంత ఊరేగితే నాగన్న శెట్టి ఏనుగెక్కినంత సంతోషాన్ని వ్యక్తం చేస్తాడు. ఇతరులకు సహాయం చేయడంలోని మాధుర్యాన్ని అనుభవిస్తాడు. ఇలా నవలలో లేని దాన్ని నాటకంలో చిత్రీకరించడం ఒక మార్పు.

నాటకంలో కృష్ణమనాయుడు మరణం ఆసన్నం అయ్యే సమయంలో తాను ఎంతో ప్రేమగా పెంచుకున్న లక్ష్మణుడనే ఏనుగును తలచుకుంటాడు. నేను లేకపోతే అది ఎలా ఉంటుందోనని బాధపడ్తాడు. నేను బ్రతికినంతకాలం దానికి ఏమి

కాకూడదని భావిస్తాడు. రంగారావుకి ఏనుగంటే గిట్టదని దానికి సేవలు చేయడం చిరాకుగా భావిస్తాడు. ఇది నాటకంలో ఉంటుంది నవలలో ఉండదు.

నవలలో కృష్ణమనాయుడి మరణ వార్త ధర్మారావే స్వయంగా పత్రికలో చూసి తెలుసుకుంటాడు. నాటకంలో రాఘవ కృష్ణమనాయుడి మరణ వార్త పత్రికలో చదివి ధర్మారావుకి చూపినట్లు మార్పు జరిగింది.

### 6.2.7 ధర్మారావు హరప్ప సంభాషణ:

నవలలో హరప్పకు ధర్మారావు చదువు చెప్పుట సహించలేని రామేశ్వరం చెన్నపురిలో ఉన్న రంగారావుకి ఉత్తరం రాస్తాడు. రంగారావు పిల్లవాడి ప్రకారమే సాగనివ్వు అనగా రామేశ్వరం నిరుత్సాహపడ్తాడు.

ఈ చిన్ని సన్నివేశాన్ని నాటకంలో పెంచి సంభాషణ ద్వారా చెప్పిస్తారు. రంగన్న రామేశ్వరంతో హరప్ప చదువుకుంటానని మారం చేస్తున్నాడని భోజనం కూడా చేయడం లేదని చెప్తాడు. తర్వాత రామేశ్వరం ధర్మారావు కోటకి రావడం ఇష్టం లేకపోయినా కాస్త నిరుత్సాహంగా కొంచెం కోపంతో చేసేదేమి లేక రంగన్నతో ధర్మారావుని వెంటనే రమ్మని చెప్పి వెళ్తాడు. ఇది నవలలో ఉండదు. ఇది నాటకంలో చేర్చిన మార్పు.

నాటకంలో ధర్మారావు హరప్పకు చదువు చెప్పడానికి వస్తాడు. గణపతి ప్రార్థనతో ప్రారంభిస్తాం అని చెప్పడంతో హరప్ప నాకు తుండము ఏక దంతము వచ్చని చెప్పగా ధర్మారావు అలా ఉచ్చరించకూడదు తొండమునేక దంతము అనాలి అంటాడు. తర్వాత ధర్మారావు వక్ర తుండా అని మొదలు పెడితే హరప్ప వక్ర తొండ అనగానే ధర్మారావు సంస్కృతంలో ఉన్న పదాలను తెలుగులో ఎలా ఉచ్చరించాలో వివరణ ఇస్తాడు. ఇదంతా నవలలో ఉండదు. ఇది నాటకంలో చేర్చిన మార్పు.

నవలలో ధర్మారావు, హరప్ప సంభాషణలో  హరప్ప 'ఎచ్చటబుట్టినెచటికి నేగుట నైజము ప్రాణికోటి కిన్' అనే  దానికి అర్థం అడిగితే ధర్మారావు పంచాగ్నులు (లోకము, పర్జన్యుడు, పృథివి, పురుషుడు, స్త్రీ) గురించి, 'సజాతో యావదాయుషం జీవతి' మున్నగు విషయాలన్ని వివరించి చెప్తాడు. నవలలో ఉన్న ఈ విషయాలు నాటకంలో ధర్మారావు కృష్ణమనాయుడికి వివరించినట్లుగా ఉంటుంది. ఇలా మార్పు చేశారు.

నవలలో దేవదాసి, ధర్మారావు ఆలయమునకు వెళ్లినప్పుడు గుడి ముందు ఆబోతు పండుకుని ఉంటుంది. దాని యొక్క దీనావస్థను రచయిత వర్ణిస్తాడు. నాటకంలో ఆబోతు యొక్క కష్టాలను ధర్మారావు హరప్పకు వివరిస్తాడు.

నాటకంలో ధర్మారావు, హరప్ప సంభాషణలో కేశవరావు అన్ని కార్యక్రమాలు చేయడానికి ధనం ఎక్కడి నుండి వస్తుంది. అని హరప్ప అడుగగా, ధర్మారావు అనేకమంది త్యాగం చేయడం వలన వస్తుంది అంటాడు. వెంటనే హరప్ప 'త్యాగేకేనైవ అమృత్వ మానసుః' అని చెప్పి ఇది మా అమ్మ చెప్పిందని త్యాగం వలన మర్త్యుడు అమర్త్యుడు అవుతాడు అని అమర్త్యుడంటే దైవత్వం అని చెప్తాడు. ఈ మాట నవలలో ఉండదు. నవల కంటే రేడియో నాటకం ఆసక్తితో వినే ఎంతోమంది ప్రజలు త్యాగ బలం యొక్క గొప్పతనం తెలియజేయడానికే ఈ విధమైన మార్పు చేశారని తెలుస్తుంది. పైగా రేడియో నాటక లక్షణాలలో ఇతి వృత్తం సందేశాత్మకంగా ఉండాలి. కాబట్టి అక్కడక్కడ మూల కథ చెడిపోకుండా ఇటువంటి సందేశాలను అందిస్తున్నారని తెలుస్తుంది.

నవలలో హరప్ప తల్లికి కర్మలు చేయించి అశౌచం నుండి బయట పడినట్టు, గంధం, కుంకుమ బొట్టు ధరించినట్టు రచయిత చెప్తాడు. ఈ విషయాన్ని నాటకంలో కొంత విశ్లేషించి కొన్ని మార్పులతో సంభాషణ ఉంటుంది. హరప్ప మాతృ ప్రేమను ధర్మారావు పొగడి నుదుట ధరిస్తున్న గంధం గురించి వివరిస్తాడు. గంధం నుదుట ధరిస్తే ఆ ప్రదేశం చల్లదనంతో ఉంటుందని  కుంకుమ, గంధం నుదుట పెట్టడం వలన కలిగే ఉపయోగాలను వివరిస్తాడు. ఈ విషయాలు నవలలో కనబడవు.

### 6.2.8. పసరిక ప్రవేశం – సంభాషణ:

నవలలో ధర్మారావుకి పసరిక ఎదురైన  దగ్గర నుండి ధర్మారావు పసరికను ఆశీర్వదించడం వెంటనే తీతువు పిట్ట కూయడం ధర్మారావు దానిని అపశకునంగా భావించడం ఉంటుంది. కాని నాటకంలో ధర్మారావు, సావిత్రి సంభాషణలలో పై విషయాలన్ని తెలుపబడుతాయి. పైగా సావిత్రి తీతువు పిట్ట కూయడం మంచిది కాదని పసరిక కోసం గా అతన్ని చల్లగా చూడమని పుట్టలో పాలు పోస్తానంటుంది. సావిత్రి ధర్మారావు సంభాషణలో సావిత్రి, పసరిక గురించి దిగులు పడటం

మంగమ్మకు పసరిక ఒక్కడే కొడుకు వాడి మీదే మంగకు ప్రాణం అని విచారించడం ఇలాంటి మాటలు నవలలో కనబడవు. నాటకంలో మాత్రమే చిత్రీకరించారు.

నవలలో ధర్మారావు రంగాజమ్మను పలుకరించి వెళ్ళేటప్పుడు మార్గ మధ్యలో రామేశ్వర  శాస్త్రి వివాహ ప్రస్తావనను ఊహించుకుంటూ పసరిక గురించి ఆలోచిస్తూ 'వాడంతే పైరు పచ్చగా వాడుగా పుట్టెను. వానికి పైరుకి సంబంధం వాడే పైరు, పైరే వాడు అని ధర్మారావు ఊహించుకుంటాడు. ఇదే విషయాల్ని నాటకంలో సావిత్రి, రామేశ్వర శాస్త్రితో పసరిక గురించి చెప్తూ ఆ పిల్లవాన్ని సుబ్రహ్మణ్యేశ్వర స్వామి అంశంగా భావిస్తుంది. వాడు పైర పచ్చ పైర్లు పచ్చగా ఉన్నన్నాళ్లు వాడు, వాడు పచ్చగా ఉన్నన్నాళ్లు పైర్లు పచ్చగా ఉంటాయి అంటుంది. నవలలో ధర్మారావు ఆలోచనలలో తెలుపబడిన విషయాలన్ని నాటకంలో సావిత్రి ద్వారా తెలిపినట్టు మార్పు జరిగింది.

నవలలో మంగకు పుట్టిన పిల్లవాన్ని గురించి నలుగురు నాలుగు రకాలుగా మాట్లాడుకుంటారు. అందరు పాము పిల్ల పుట్టిందని అనుకుంటారు. కొంత మంది నవ్వుకుంటారు మరి కొందరు కులాభిమానం గల కాపు పడుచులు కులం చెడిన దీనికి మంచి పరాభవం జరిగిందని అనుకుంటారు.

ఇందులో ఒక కులం ఆ కులంలోని వారినే హేళన చేయడమనేది కులానికి ప్రాధాన్యతను ఇవ్వడంగా కనబడుతుంది. కాని వ్యక్తి గౌరవానికి ప్రాముఖ్యతను కలిగించలేదని అర్థమవుతుంది. అయితే నాటకంలో రామేశ్వర శాస్త్రి, సావిత్రి సంభాషణలో సావిత్రి, మంగమ్మ గురించి చెబుతూ ఆ మంగమ్మ సామాన్యురాలా (కాదని అర్థం) సుబ్రహ్మణ్యేశ్వర రూపాన్ని కడుపున మోసింది. వాడికి మీరు పసరిక అని సరైన నామకరణం చేశారు. అంటుంది.

ఈ మాట నవలలో కనిపించక పోయినప్పటికి నవలలో మంగ కుల హీనురాలని వారి కులస్తులచే చెప్పబడింది. పైగా పసరికను చూసి అందరూ పాము ఆకారమని మాట్లాడుతారు నాటకంలో సావిత్రి చేత ఆమె సామాన్యురాలు కాదని అంటే అసామాన్యురాలిగా మంగ చిత్రించబడింది. ఇది ఒక మార్పు.

నవలలో రుక్మిణమ్మ రావు(కృష్ణమనాయుని భార్య) భర్త చనిపోయినప్పటికీ నుండి ఆమె గదిలోనే ఉంటుంది. ఆమె గురించి ఎక్కువ ప్రస్తావన ఉండదు.

### 6.2.9. రుక్మిణమ్మ ప్రవేశం– సంభాషణలో మార్పు:

నాటకంలో సావిత్రమ్మ, ధర్మారావు సంభాషణ ద్వారా ధర్మారావు రుక్మిణమ్మ గురించి ఇలా చెప్తాడు. అమ్మా.. రాణిగారు పూర్వపు కాలపు రాణి వాసపు స్త్రీలాగానే ఉంటారు. ఆ గాంభీర్యం ఆ వర్చస్సు ఆమెలో కనబడుతాయి. మేము మాట్లాడుకొనేటప్పుడు పరదా దగ్గరకు వచ్చి చిరునవ్వుతో నన్ను చూస్తే ఆనందం కలిగేది ఒక చూపుతో ఎంతో ఆప్యాయతను కురిపించేది మహారాణి రుక్మిణమ్మ రాణి వాసపు తుది మెరుపమ్మా ఆవిడ అని అంటాడు.

పూర్వపు రోజులలో అంతఃపుర స్త్రీలకు ఒక ప్రత్యేకమైన భవనాన్ని ఏర్పాటు చేసేవారు. ఆమె గదిలోకి భర్త అయినా సరే అనుమతి తీసుకోవాల్సిందే అటువంటి వాతావరణం నాటకంలోని ఈ సంభాషణ ద్వారా వ్యక్తమవుతుంది. పరదా చాటు నుంచే రాణిగారు ధర్మారావు యొక్క మాటలను విని ప్రేరణ పొందిన ఆమె కృష్ణమనాయుడు మరణానంతరం ధర్మారావు వద్ద భాగవతం చదివించు కోవడానికి సిద్ధపడుతుంది. నాటకంలో ఈ విధంగా మార్పు చేశారు.

నవలలో రాణి ఏకాదశి ఉపవాసం ఉంటుంది. ధర్మారావు తెలుసు కనుక భాగవతం చెప్పించు కోవడానికి అతనికి కబురు పంపిస్తుంది. ధర్మారావుకి వెళ్లాలా వద్దా అని ఆలోచిస్తూనే వెళ్తాడు. అలా బయలుదేరిన అతనికి కబీరు కనబడుతాడు ఇలా నవల చదవగానే పాఠకుడు జరిగే విషయం చదువుతున్నప్పుడే తెలిసిపోతుంది. ఇదంతా నవలలో రచయిత చెప్తున్నట్టు ఉంటుంది.

నాటకంలో రాణిగారు ధర్మారావుకి కబురు పంపారని సావిత్రమ్మ తెలపగా ధర్మారావు ఆమెను రాజమ్మ అని పలుకరిస్తాడు. రాజమ్మ పేరును నవలలో సూచించలేదు. అయితే నవలలో రచయిత చెప్పిన దాన్ని నాటకంలో పరిచారిక అయిన రాజమ్మ ద్వారా తెలియజేసినట్టు గా మార్పు చేశారు. బహుశా శ్రోత అయోమయ స్థితిలోకి పోకుండా పేరును సూచించినట్టు గా తెలుస్తుంది.

రాణిగారు సావిత్రమ్మ ఇంటికి వచ్చి అరుంధతిని చూస్తుంది. ఆమెకు గిరిక గురించి చెప్తూ ఇది ఒక తులసీ వనం ఆ వనంలో ఆమె ఒక గోదాదేవి అని చెప్తుంది. ఈ మాట నవలలో ఉండదు.

నాటకంలో రాణి ధర్మారావు రాకను గమనించి రా....రా... మీ ఇల్లాలిని చూసిపోదామని వచ్చాను అని చెప్తుంది. అప్పుడు ధర్మరావు అమ్మా ‘ భాగీరథి పిచ్చుక గూటి మీదకు ప్రవహించింది అంటాడు. ఈ మాట నవలలో ఉండదు. భాగీరథి అంటే గంగానది చాలా పవిత్రమైన నది పాపాత్ములను సైతం పుణ్యాత్ములుగా మార్చే శక్తి గంగానదికి ఉంది. రాణిగారు ధర్మారావింటికి రావడమనే ది అది ఒక గొప్పదైన విషయంగా ధర్మారావు భావించడాన్ని తమ వంటి పేదవారింటికి రావడం వారి అదృష్టంగా భావిస్తారు. అలాగే రాణిగారి ఔదార్యం కూడా తెలుస్తుంది.

### 6.2.10. గిరిక ప్రవేశం – సంభాషణల్లో మార్పు:

నవలలో గిరిక శివుడు సేవనీయుడా? విష్ణువు సేవనీయుడా? అన్న ప్రశ్నకు సమాధానంగా ధర్మారావు లీలా కుశులు పాడిరి సంసారే కిం సంసారం? అని సంస్కృతంలో ఉన్న శ్లోకాన్ని నాటకంలో తెలుగులో అర్థ వివరణ చేశారు. నవలలో సంస్కృతంలో ఉన్న శ్లోకాన్ని నాటకంలో యథాతథంగా వ్యవహారభాషలో నాటకంలో వివరించారు ఇది శ్రోతకు అర్థం కావడం కోసం ఇలా మార్పు చేయబడింది.

నవలలో ధర్మారావు, గిరిక, ఆలయానికి వెళ్లినట్టు మాత్రం ఉంటుంది. వారి మధ్య ఆధ్యాత్మిక సంభాషణ ఏమి జరుగదు అరుంధతికి గిరిక ఇచ్చిన ఉంగరం ధర్మారావు తీసుకుంటాడు. నాటకంలో ధర్మారావు ,గిరిక సంభాషణ సుదీర్ఘంగా సాగుతుంది. గిరిక వేణుగోపాలుని తన దగ్గర చేర్చడానికి ధర్మారావుని మధ్యవర్తిత్వం వహించమంటుంది. అదే క్రమంలో రంగాజమ్మ, అరుంధతి సౌందర్య వంతులని ధర్మారావు మాటల్లో తెలపగా గిరిక తన అందం గురించి ధర్మారావుని చెప్పమంటుంది. అతను భగవంతుని చూసిన గిరిక కన్నులు రాధామాధవుల రస కేళి విలాసాలుగా మిలమిలలాడుతాయని భగవదంకితమైన ఆమె రూపం దివ్య రూపంగా ధర్మారావు చెప్తాడు. ఈ సంభాషణంతా నవలలో ఉండదు.

నవలలో రాణిగారు ఏదైనా చెప్తున్నప్పుడు చిత్తం అనాలని గిరికకు తెలియదని రచయిత చెప్తాడు. దీన్ని నాటకంలో పూజారి ద్వారా గిరికకు చిత్తం అనాలని చెప్పించారు.

### 6.2.11. ధర్మారావు ఆర్థిక స్థితి– సంభాషణ మార్పు

సావిత్రమ్మ నాగన్న శెట్టి దగ్గర డబ్బు అందలేదని రంగాజమ్మకు చెప్పానని ధర్మారావుతో అంటుంది. దానికి ధర్మారావు మన కష్టాలు అందరికి చెప్పడం ఎందుకు పంటి బిగువుని మనమే భరించాలి అని ధర్మారావు చెప్పడం నవలలో ఉండదు.

ధర్మారావు చెప్పిన పై మాటను గమనిస్తే ఒకరి కష్టాలు మరొకరికి చెప్పడం ద్వారా ఎదుటి వారికి చులకన భావం వచ్చే అవకాశం ఉంటుంది. అందుకే మన ఇబ్బందులు ఇంటి వరకే దాచనీయాలి బయటకు పోకూడదనే భావం పై మాట ద్వారా తెలుస్తుంది.

నవలలో రచయిత సావిత్రమ్మ మనస్తత్వాన్ని తెలియజేస్తూ ఆది వారము నాడు అందలము, సోమవారము నాడు జోలె మనిషి సావిత్రి అని చెప్తాడు. నాటకంలో ఇదే సామెత ధర్మారావు సావిత్రితో డబ్బును జాగ్రత్త చేయమని చెప్పే సందర్భంలో అంటాడు.

నవలలో ధర్మారావు తన భార్య, తల్లితో గుంటూరులో నివసించడం, ధర్మారావుకి కలరా వ్యాపించడం వారి దారిద్ర్యమంతా రచయితే పాఠకుడు కి వివరిస్తాడు. నాటకంలో ధర్మారావు అరుంధతి సంభాషణల్లో వారు అనుభవిస్తున్న దారిద్ర్యాన్ని గురించి మాట్లాడుతూనే ధర్మారావుకి ఇన్ ఫ్లూయింజా జ్వరం వచ్చిందని వారి సంభాషణల్లో తెలుస్తుంది. నవలలో కలరా అని ఉంటే నాటకంలో ఇన్ ఫ్లూయింజా జ్వరంగా మార్చారు.

నవలలో ధర్మారావు సుబ్బన్న పేటకు వెళ్లడానికి రెండు రూపాయలు కావాలి ఎవరిస్తారని అనుకుంటూ నాయరు గురించి ఆలోచిస్తాడు. అతని దగ్గరకు వెళ్లి అడగాలా వద్దా అని సంకోచంతో పరిపరి విధాల ఆలోచించడం, నాయరు గుణ గణాలు అన్ని రచయిత చెప్తుంటే పాఠకుడు చదివి అర్థంచేసుకుంటాడు. కాని నాటకంలో సంభాషణే ప్రధానం కావున నాటకంలో ధర్మారావు సుబ్బన్న పేటకు వెళ్లాలని ఆలోచిస్తున్న సమయంలో అతడి స్నేహితుడి పాత్ర రాఘవరావుని రఘు పేరుతో ప్రవేశపెడతారు. రఘు సంభాషణ ద్వారానే నాయరు గుణ గణాలు వ్యక్తిత్వం చెప్పబడ్డాయి. అలాగే వీరి సంభాషణల్లోనే ధర్మారావు, రాఘవ రావు అప్పు

అడుగడానికి వెళితే నాయరు కొట్టులో ఉండడు. దానికి ధర్మారావు జేబులో డబ్బుంటుంది కాని ఇచ్చే చెయ్యి ఉండొద్దు అంటాడు ఇది నవలలో కనిపించదు.

నాటకంలో ఆ వాక్యాన్ని పరిశీలిస్తే ధనవంతులు ఆస్తిని కూడబెట్టుకుంటారు కాని ఇచ్చే మనస్తత్వం ఉండదు. దాని వలన ఎవరికి ఉపయోగం లేకుండా ధనం వృథా అయిపోతుంది. ఇక్కడ నాయరు ఇచ్చే మనస్తత్వం కలవాడు. కాని వీరు వచ్చే సమయానికి లేకపోవడంతో తన దురదృష్టంగా ధర్మారావు భావించుకుని ఆమాట అంటున్నట్లు తెలుస్తుంది.

నవలలో నాయరు ధర్మారావుకి తన దగ్గర రెండు రూపాయలే ఉన్నాయని ఇస్తాడు. నాటకంలో ధర్మారావు రెండు రూపాయలు చాలు అనగా నాయరు పది రూపాయలు ఇస్తాడు.

నవలలో ధర్మారావు నాయరుకు బాకీ తీర్చదలచి వెళ్లిన అతనికి నాయరు తీర్థ యాత్రలకు వెళ్లాడని దుకాణదారుని ద్వారా తెలుసుకుంటాడు. నాటకంలో ఇదే సన్నివేశం వస్తుంది. దుకాణాదారుని బదులు రాఘవరావు ద్వారా నాయరు ఎక్కడికి వెళ్లాడనే విషయం ధర్మారావు తెలుసుకుంటాడు.

నవలలో ధర్మారావు ఊహల్లో తన ఇంటి పరిస్థితి సుబ్బన్న పేట ప్రస్తుత స్థితిని, బియ్యం బస్తా ధర పెరగి పోవడం ఇల్లు గడుచుట కష్టంగా ఉందని రచయిత తెలుపుతాడు. నాటకంలో ధర్మారావు , అరుంధతి, సావిత్రమ్మ పాత్రల సంభాషణలో వారున్న పరిస్థితిని వివరిస్తాడు. ఇది సంభాషణలో వచ్చిన మార్పు.

### 6.2.12. రాజ్యలక్ష్మమ్మ శృంగారోపదేశం– మార్పు:

నవలలో రాజ్యలక్ష్మమ్మ అరుంధతి మూడవ రాత్రి కార్యానికి జడ వేస్తూ ఆమె అబ్బాయిని కొడతావేమో జాగ్రత్త అని ఇలా కొన్ని చమత్కారాలు ఆడడంతో అరుంధతి గడచిన రెండు రాత్రుల కంటే మూడవ రోజు సంతోషాన్ని కనబరుస్తుంది.

నాటకంలో రాజ్యలక్ష్మమ్మ అరుంధతి మధ్య సంభాషణ ఉంటుంది. రాజ్యలక్ష్మమ్మ భార్య భర్తల మధ్య గల అనురాగ సంబంధాలు ఎలా ఉంటాయో భర్తను తన వశం చేసుకోవడానికి శృంగార సమయమే అనుకూలమైందని ఇలా కొన్ని శృంగారోపదేశాలు చేయడంతో అరుంధతి తన తప్పు తెలుసుకుంటుంది. దానికి రాజ్యలక్ష్మమ్మ మీరింక అరుంధతి, వశిష్టులే అని చెప్తుంది. ఇంత సంభాషణ

నవలలో ఉండదు. రెండు రాత్రులు భర్తను దగ్గరకు రానీయని అరుంధతిని ప్రేరేపించడంలో శృంగారోపదేశాన్ని చేసి కీలక పాత్ర వహించినట్టు గా రాజ్యలక్ష్మమ్మ నిలుస్తుంది.

రాజ్యలక్ష్మమ్మ మీరింక అరుంధతి, వశిష్టులే అని చెప్పడంలో అంతరార్థం అరుంధతి మహా పతివ్రత భారత పురాణాలలో వశిష్ట మహాముని భార్య. పెళ్లి శుభకార్యం జరిగిన తర్వాత అరుంధతి నక్షత్రాన్ని చూస్తే వారి సంసారం చక్కగా సాగుతుందని ఒక నమ్మకం కూడా ప్రజలలో ఉంది. అంతటి పాతివ్రత్యాన్ని సంపాదించిన అరుంధతి వశిష్ట మహర్షికి అనుకూల వతి, భర్త సేవలో తన జీవితాన్ని పండించుకున్న పతివ్రత నాటకంలో అరుంధతి, ధర్మారావులు అంతటి గౌరవాన్ని పొందాలని రాజ్యలక్ష్మమ్మ పాత్ర ద్వారా శ్రోతకు వినిపించారు.

### 6.2.13. అరుంధతి , ధర్మారావు– సంభాషణ:

నవలలో గిరిక అరుంధతికి కానుకగా ఇచ్చిన ఉంగరాన్ని ధర్మారావు అరుంధతికి ఇస్తాడు. అరుంధతి గిరిక గురించి తప్పుగా భావిస్తుంది. ధర్మారావు భోగాంగనకు, వారంగనలకు గల భేదం తెలిపి గిరిక దైవసానిధ్యానికి పరిమితమైన వ్యక్తి అని చెప్తాడు.

నాటకంలో ఇదే సన్నివేశం ఎదురైనప్పుడు గిరిక స్వభావాన్ని తెలియజేయడానికి లక్ష్మీదేవి బురదలో పుట్టినా పద్మంలో పుట్ట లేదా పద్మానికి మించిన పువ్వు దేవతార్చనకు వేరేది ఉందా అలాగే గిరిక కూడా భగవంతుడికే తను ఆత్మార్పణం చేయడానికి పుట్టిన పవిత్రురాలు అని తెలియజేస్తాడు. ఈ నాటకంలో ఉన్న ఈ పోలిక నవలలో కనబడదు. అది గాక ఈ మాటలు విన్న అరుంధతి మనసు ప్రశాంతతను కలిగి ఉంటుంది. అటువంటి భగవంతుని ప్రేమించిన కన్యకు తాను వదిన అవుతున్నందుకు సంతోషాన్ని వ్యక్తం చేస్తుంది.

నవలలో అరుంధతి, ధర్మారావు తో రంగాజమ్మ మీకు తల్లా? లేక ఈ ఊరు రాణినా? అని అడుగుతుంది. నాటకంలో ఇదే ప్రశ్న రంగాజమ్మ మీ అమ్మగారి చెల్లెలా? లేక మీ తండ్రిగారి తమ్ముని భార్యా? అని నవలలో ఉన్న సంభాషణ నాటకీకరణలో ఈ విధంగా మార్చారు.

నవలలో ధర్మారావు అరుంధతికి చదవడానికి గుంటూరుకి వెళ్తున్నానని చెప్పి వెళ్తాడు. అతను గుంటూరులో చదువుతున్నట్టు రచయిత మనకు తెలియజేస్తాడు. ఈ క్రమంలో ధర్మారావు కళాశాలలో సంస్కృత శాఖ తీసుకుని సావిత్ర్యోపాఖ్యానం చదువుతాడు. 'యముడంద్రు ....అనే పద్యం చదివి సావిత్రి, యమధర్మరాజుల సంభాషణకు ముగ్ధుడవుతాడు సావిత్రి వాక్చాతుర్యాన్ని మెచ్చుకుంటాడు.

నాటకంలో ఒక సంగీతానంతరం ధర్మారావు అరుంధతి సంభాషణల్లో సావిత్రి యొక్క పాతివ్రత్యాన్ని ఆమె యొక్క గొప్పతనం, స్త్రీ జాతికే ఆమె ఆదర్శం అని తెలుపుతాడు. అరుంధతి సావిత్రిని మేధోవంతురాలు అంటారా? పతివ్రత అంటారా? అని ప్రశ్నించగా ధర్మరావు పుట్టుకతో మేధస్సును సంస్కారంతో పాతివ్రత్యాన్ని జయించిందని సమాధానమిస్తాడు. ఇలా వారి సంభాషణానంతరం ధర్మారావు గుంటూరులో చదువుకుంటున్నట్టు ధర్మారావు పాత్ర ద్వారానే తెలుస్తుంది. ఇంత విశ్లేషణతో కూడిన సంభాషణ నవలలో ఉండదు.

నవలలో అరుంధతి తన పుట్టింటిలో తను పడిన కష్టాలన్నింటినీ ధర్మారావుకి వివరించిన తర్వాత చాలా రోజుల తర్వాత వారి కలయిక ఎలా ఉంటుందో ఒకరినొకరు మనసుల్లో చెలరేగే ప్రేమ కలతలను వారి హృదయ స్థితిని వర్ణిస్తాడు. వేలయేండ్లు తపస్సు చేసింది భగీరథుడు, ఫలితం మాత్రం శివుడిది అన్నట్లు ధర్మారావుకి అరుంధతి అలా దొరికిందని రచయిత చెప్తాడు. అయితే పాఠకుడు ఈ వర్ణనంతా విని అర్థం చేసుకోవడానికి సమయం పడుతుంది.

నాటకంలో ధర్మారావు, అరుంధతి సంభాషణల్లో వారికి కలిగే మన్మథావస్థలు శ్రోతల మనసులు దోచే విధంగా వారి సరసమైన మాటలు ఆకర్షిస్తాయి. పాత్రల సంభాషణల పరంపరలు శ్రోత హృదయానికి తాకుతున్నట్లు ఒక ఆనందానుభూతిని పొందుతాడు.

నవలలో ధర్మారావు 'ఆముక్తమాల్యద' పుస్తకం తెరచి చదువుతుంటాడు అరుంధతి ధర్మారావు పలకరింపు కోసం ఎదురు చూసి ఇబ్బందిగా భావించి అతని చేతి లోని పుస్తకాన్ని లాక్కుంటుంది. ఆ క్షణంలో ధర్మారావు చూసిన చూపులు ఆమెకు కొత్తగా అనిపించి పుస్తకం అతని చేతుల్లోనే పెట్టి పుస్తకాన్ని సవతిగా భావించి దాని గురించి ఆలోచిస్తూ నిద్రపోతుంది.

నాటకంలోని ఈ సన్నివేశం అత్యంత మధుర సంభాషణతో సాగుతుంది. నవలలో ధర్మారావు కనులతో అరుంధతిని ఆ క్షణం తిరస్కరించిన భావాన్ని నాటకంలో అరుంధతి, ధర్మారావుల సంభాషణలో చోటుచేసుకుంటుంది. నవలలో అరుంధతి మనసులో అంకురించిన భావాలు నాటకంలో బయటకు వ్యక్తమవుతాయి. నవలలో తనను గౌరవింపకుండా చేసిన సవతి గురించి అరుంధతి ఆలోచిస్తూ నిద్రపోతుంది. నాటకంలో ధర్మారావుతో ఇలా అంటుంది. ఆవిడ గారు ఇప్పటికి వదిలారన్న మాట నేనెక్కువా ఆమెక్కువా అని ఆలోచిస్తుంటే నిద్రపట్టేసింది. అనగా ధర్మారావు ఆవిడా ఎవరో అర్థం కాక మరలా అడిగితే ఆవిడ పేరేమిటి నా సపత్ని. అది పుస్తకమని ధర్మారావు గ్రహిస్తాడు. ఇద్దరూ నవ్వుకుంటారు. ఇది నవలలో పాఠకుడికి కదిలించని భావాలు ఏవో వీరి సంభాణల్లో శ్రోత మనసును కదిలిస్తాయి.

నవలలో ధర్మారావు అన్నం తినడానికి సిద్ధమతున్నప్పుడు అన్నంలో పలుకు లేదు కదా....అని అరుంధతిని అడుగుతాడు. ఈ విషయాన్ని చమత్కారంగా నాటకంలో ధర్మారావు అడిగినప్పుడు అరుంధతి పలుకు లేదని పలుకుచున్నాను. అని అంటుంది. ఇక్కడ ఒక పదానికి అనేక అర్థాలు ఇచ్చేది శ్లేష కాబట్టి ఆ మాటను అందుకున్న ధర్మారావు అరుంధతిని భలే శ్లేష వాడావే అని అంటాడు. ఇది నాటకంలో చేర్చిన ఒక చిన్న మార్పు.

నవలలో రాజ్యలక్ష్మమ్మ కొడుకు కేశవరావు పోయిన తర్వాత ఆమె పరిస్థితి ఎంత దయనీయంగా మారిందో రచయిత తెలియజేస్తాడు. నాటకంలో ధర్మారావు అరుంధతితో రాజ్యలక్ష్మమ్మ మన దాంపత్య ధర్మానికి ఎంతో మేలు చేసిందని ఆమె కారణంగా ఈనాడు ఈ అమర సౌఖ్యాన్నంచులు చూస్తున్నానని  చెప్తాడు. దానికి అరుంధతి, ఆ మాట అనాల్సింది నేను. ఆమె లేకపోతే ఒక ధర్మ మహా సౌధాన్ని కోల్పోయే దాన్ని అంటుంది. ఈ సంభాషణ నవలలో కనబడదు.

నవలలో ధర్మారావు ఆలస్యంగా ఇంటికి రావడం అరుంధతి మందలించడం సర్వ సాధారణ విషయంగా ఉంటుంది. ఈ సన్నివేశాన్ని నాటకంలో చమత్కారవంతంగా తీర్చిదిద్దారు. అరుంధతి అప్పుడే వచ్చారే కుమారస్వామి ఇల్లు మిమ్మల్ని వదల లేదా అంటే ధర్మారావు నా భార్య నన్ను బతకనీయదు మళ్లీ వస్తాను ఇప్పటికి వదులు అంటే మరీ బిగుసుకుపోయిందది అంటాడు. దానికి అరుంధతి

ఏమిటి ఇల్లా? అని చెప్పడం వలన ఇల్లు ధర్మారావుని వదలలేదని ఒక అర్థం. కుమారస్వామి కుటుంబీకులు అతనిని వదలలేదని మరో అర్థంతో చక్కని సంభాషణా చాతుర్యం ఈ మాటల్లో స్ఫురించింది.

ఈ సంభాషణలోనే ధర్మారావు కుమారస్వామి ఇంట్లో కొత్త పురాణం తెలుసా అనగా అరుంధతి ఆ పురాణాలన్ని నాకెందుకు లెండి పిల్లవాడు నన్ను వదలడం లేదు అని చెప్పి మరలా కాసేపు తర్వాత చెప్పండి మీ స్కంధ పురాణం అంటుంది. ధర్మారావుకి  కూడా ఏమిటబ్బా అని మొదట సందేహించి తర్వాత కుమారస్వామి గురించా అని తెలుసుకుంటాడు.

ఇక్కడ శ్రోతకు కూడా స్కంధ పురాణం అనగానే కుమారస్వామి ఇంట జరిగే వృత్తాంతంగా అనిపించదు. అష్టాదశ పురాణాలలోని స్కంధ పురాణంగా అనిపిస్తుంది. నిజానికి 'స్కంధుడు అంటే కుమారస్వామి దైవ తత్వాలను ఉపదేశించడం చేత దీనికి ఆ పేరు వచ్చింది.[5]

ఈ వివరణను పరిశీలిస్తే స్కంధుడు అంటే కుమారస్వామి అని అర్థం తెలిసిన వ్యక్తికి వెంటనే అందులోని భావాన్ని గ్రహించి ఆనందిస్తాడు.

నాటకంలో ధర్మారావు అరుంధతి సంభాషణలో మంగమ్మ ప్రస్తావన వస్తుంది. ఆమె తను తప్పు చేశానని పశ్చాత్తాప పడుతున్న విషయం ధర్మారావు ద్వారా తెలుస్తుంది. అరుంధతి కూడా వేమన స్త్రీ రూప మెత్తాడు అనుకుందాం. తప్పు తెలుసుకున్న వాళ్లు ధన్యులు పుణ్యక్షేత్రాలలో అపరాధ క్షమాపణలు చెప్పుకుంటుంది అంటుంది. మంగమ్మను వేమన రూపంతో పోల్చడం నవలలో ఉండదు.

ఈ సంభాషణలో మంగమ్మను వేమన రూపంతో పోల్చడంలోని ఆంతర్యాన్ని పరిశీలిస్తే వేమన గురించిన జీవిత సత్యాలను తెలుసుకోవాల్సిన అవసరం ఉంది. 'విశ్వద అను వేశ్య వ్యామోహంలో మునిగిన వేమన ఆమె మెప్పు కోసం నవాబులకు కప్పంగా పంపవలసిన ధనాన్ని అన్నగారికి చెప్పకుండా వాడేస్తాడు. తత్ఫలితంగా అన్నగారిని బంధించి ఆదోనిలో ఖైదు చేస్తాడు. అన్నగారిని విడిపించడానికి అభి రామయ్య సహకారంతో 'వరుస వేది' విద్య ద్వారా బంగారాన్ని తయారుచేయ ప్రయత్నించి విఫలుడవుతాడు. వేమన, ఇదే సమయంలో అటు తండ్రి ఖైదు పాలయ్యి,

---

[5] వ్యాస సాహితీ సంహిత, ఉపన్యాస వ్యాస మంజరి, పుట:161.

ఇటు పిన తండ్రి వేమన కనిపించడం లేదన్న బెంగతో మంచం పట్టి మరణిస్తుంది అన్న కుమార్తె. అంతటి విషాదంలో ఉన్న వేమనను మార్చదలచిన విశ్వద వదిన ముక్కెరను అడిగి తెమ్మని ప్రోత్సహిస్తుంది.

ఆనాటి స్త్రీలకు ముక్కెర శీలంతో సమానం వేమన కోరిక వెనుక విశ్వద ఉద్ధేశాన్ని గ్రహించిన అతని వదినగారు తాను వివస్త్ర అయి స్త్రీ శీలముతో సరి సమానమైన ముక్కెరను అతనినే స్వయంగా తీసుకోమంటుంది. కన్న తల్లిలా భావిస్తున్న వదినను చూడగానే వేమన దిగ్భ్రాంతుడై జ్ఞానముదయించి వైరాగ్యం లోప డి ఇంటిని, బంధువులను విషయ వాంఛను విసర్జించి యోగిగా మారిపోతాడు.[6]

నాటకంలో మంగమ్మ జీవితం కూడా అలాగే ఉందనే అభిప్రాయాన్ని అరుంధతి వెల్లడిస్తుంది. మంగమ్మ మొదట తన దోవలో వెళ్లినా చివరకు పశ్చాత్తాప హృదయంతో మంచి కార్యక్రమాలు చేస్తుంది. ఆస్తినంతా కుమారస్వామికి, దేవాలయ ఉత్సవాలకు రాయడం ఆమెలో పరివర్తన కలిగిందని తెలుస్తుంది.

### 6.2.14. రామచంద్ర రాజు ప్రవేశం – సంభాషణల్లో మార్పులు:

రామచంద్ర రాజు తల్లి రంగాజమ్మ చనిపోయిన దుఃఖంలో ఉన్నప్పుడు నవలలోనూ, నాటకంలోనూ రెండింటి లోనూ ధర్మారావు ఓదారుస్తాడు. నాటకంలో రామచంద్ర రాజు, ధర్మారావు సంభాషణల్లో ధర్మారావు తన తల్లి(సావిత్రమ్మ) రంగాజమ్మను సవతి అని అనుకోకుండా అహంకారం కూడా విడిచి, రామేశ్వర శాస్త్రి, రంగాజమ్మ దంపతులు అపురూపమైన అనురాగ బంధం కలిగిన వారు అన్నది అంటాడు. ఇది నాటకంలో చేర్చిన మార్పు. ఈ సంభాషణ నవలలో కనిపించదు. అయితే నాటకంలో సావిత్రమ్మ కూడా ధర్మారావుతో పాటు ఓదారుస్తుంది. సావిత్రమ్మ రామచంద్రరాజును ఓదార్చినట్టు నవలలో ఉండదు. ఇంకా సావిత్రమ్మ రంగాజమ్మ గురించి బాధపడతూ ఏడుస్తూ ఉంటుంది. ఆమె ఇంతగా తపించడం, ఏడ్వటం, బాధపడటం నవలలో కనిపించదు.

### 6.2.15. సరోజనీ దేవి ప్రవేశం–సన్నివేశంలో మార్పు:

నవలలో రంగారావు సరోజని దేవి దగ్గరకు వెళ్లి ఆమె ఆరోగ్య పరిస్థితిని పరామర్శించినట్లు ఉంటుంది. తర్వాత సరోజని దేవి హరప్ప నాయుని కి రాజ వేషం

---

[6] 6 వెంకట లక్ష్మి నరసింహారావు, తాడంకి, వేమన పద్య రత్నావళి ,పీఠిక.

వేసి ధర్మారావు వద్ద చదువుకోమని చెప్తుంది. నాటకంలో హరప్పకు సరోజని దేవి ధర్మారావు గురించి చెప్తుంది. అది గాక రంగారావుకు కబురు పంపితే ఆమెకు బాగలేదని చీదరించుకుంటాడే కాని ఆమె గదికి వెళ్లినట్లు ఉండదు. ఇది నాటకంలో చేసిన మార్పు.

నాటకంలో రాజమ్మ, రంగన్న సంభాషణలో సరోజని దేవి పతిని దైవంగా భావించడాన్ని రంగారావు ఒక్కసారైనా ఆమె గదికి వెళ్లకపోవడాన్ని, అరుంధతి, రథంతరి, గిరిక ను రాణి సరోజని దేవి లక్ష్మి, సరస్వతి, పార్వతిగా భావిస్తుందని వారి సంభాషణ ద్వారా తెలుస్తుంది.

నవలలో రాజమ్మ ,రంగన్న పాత్రలు మాట్లాడుకోవడం ఉండదు. నవలలో గిరిక ను లక్ష్మిగా భావించి వాణి, పార్వతిల చేత కొలవబడుతున్న లక్ష్మిగా గిరిక ను భావిస్తుంది. ఇది నాటకంలో చేర్చిన మార్పు.

నవలలో ఒక దాసి ద్వారా పెద్ద రాణి, చిన్న రాణి చనిపోయారని తెలపగా దీన్ని నాటకంలో రంగన్న పాత్ర ద్వారా తెలియజేస్తారు.

### 6.2.16. కళాశాల ఉత్సవాల్లో మార్పులు

నవలలో కేశవరావు జాతీయ కళాశాల ఉత్సవాలు ఏర్పాటు చేయిస్తాడు. ఆ ఉత్సవాల్లో నిర్వహించబోయే కార్యక్రమాలను వారి పేర్లను , వారి వివరాలను రచయిత పాఠకుడికి వివరిస్తాడు. నాటకంలో కేశవరావు, చంద్రా రెడ్డి సంభాషణలో కేశవరావే స్వయంగా తను చేపట్టబోయే కార్యక్రమాలను తెలియజేస్తాడు.

నవలలో నాటకంలోనూ భోగి పండగ నాడు ఉత్సవాలు ప్రారంభమవుతాయి. నవలలో కూచిపూడి నాట్యం చేసేవారు అర్ధనారీశ్వర నాటకాన్ని ప్రారంభిస్తాడు. వారి ఆకృతిని, ఆ నాట్య వర్ణనను రచయిత ఎక్కువ వర్ణనలతో వివరిస్తాడు. పాఠకుడు ఆ వర్ణనను అర్థంచేసుకోవడానికి కొంత సమయం పడుతుంది.

నాటకంలో కూచిపూడి వారు అర్థ నారీశ్వర నాట్యం మొదలవుతుందని ఒక పాత్ర ద్వారా తెలియజేస్తారు. తర్వాత వెంటనే తాళాలు, మేళాలు, నాట్య సందడి అంతా శ్రోతకు ఒక మహదానంద సీమలోకి ప్రవేశించినట్లు అనుభవిస్తాడు. అటువంటి స్థితికి హరప్ప లోనవడం ధర్మారావు పక్కనే ఉండి అతనికి ధైర్యం చెబుతూ భగవంతున్ని ప్రార్థించుకోండని చెప్తాడు. వీరి సంభాషణ నవలలో ఉండదు.

అర్ధనారీశ్వర నాట్యానంతరం మంగళం, శుభ మంగళం పాటతో ఆ నాటకం పూర్తయినట్లు తెలియజేస్తారు.

నవలలో ప్రహ్లాద నాటకం ఏవిధంగా జరుగుతుందో పాఠకుడు చదివి తెలుసుకుంటాడు. కాని అది అంతగా హృదయాన్ని తాకినట్టు అనిపించదు. నాటకంలో హరప్పకు ధర్మారావు ప్రహ్లాద నాటకంలోని సన్నివేశాలను వివరించే తీరు. వారి మాటల్లోని మాధుర్యం శ్రోతకు భక్తి పారవశ్యాన్ని కలుగజేస్తుంది. హరప్ప, గిరిక, ఆ నృసింహావతారానికి ముగ్ధులై పోయే విధానం వింటుంటే శ్రోత మనసుకూడా అటువంటి స్థితికి లోనై పోతాడు అనడంలో సందేహం లేదు.

ఒక నవలను, నాటకాన్ని చదువుతున్నప్పుడు కలిగే రసానుభూతి కంటే ఆ నాటకాన్ని రేడియో ప్రసారాల ద్వారా వింటున్నప్పుడు కలిగే సౌఖ్యం, ఆనందం ఎంతో బాగుంటుంది.

నవలలో రామేశ్వరం గిరికను వెంబడించినప్పుడు రామేశ్వరం ఆమె వయసు పదిహేడేండ్లని నీకు కన్నెరికం ఎవరిచ్చారని హేళనగా మాట్లాడుతాడు. గిరిక వేణుగోపాల స్వామి పేరు చెప్తుంది. రామేశ్వరం నవ్వుతాడు. ఆకాశం నుండి పెద్ద ధ్వని వచ్చి రామేశ్వరం పారిపోతాడు. ఇదే సన్నివేశం నాటకంలో ఈ విధంగా వర్ణించబడింది.

### 6.2.17.వర్ణనలో మార్పు:

నాటకంలో రామేశ్వరం గిరికను చూసి ఆమె హొయలను వర్ణిస్తాడు. ఆమె తలవంచుకుని నడుస్తుంటే ఆమె చూపులు తన వైపు ప్రసరింప చేయమని ఆమె పరుగును ఇంద్ర రథంతోనూ పోలుస్తాడు. ఆమె వేగాన్ని అందిపుచ్చుకున్న రామేశ్వరం గిరిక నిలబడగానే నువ్వు ఎవరినైనా వలచావా అంటే వేణుగోపాల స్వామి పేరు చెప్తుంది. దానికి రామేశ్వరం హేళనగా నవ్వుతాడు. పిడుగుపడినంత ధ్వని రావడం. రామేశ్వరం అమ్మో అని భయపడటం జరుగుతుంది.

నవలలోనూ, నాటకంలోనూ, ఇదే సంభాషణ యథాతథంగా ఉన్నా నాటకంలో కొంత వర్ణన చేసి చూపడం జరుగుతుంది.

లోకంలో ఎవరైనా విలాసంగా నడిస్తే నాటకమనుకుంటున్నాడు కాబోలు అని వెక్కిరించడమో ఆమె నడిస్తే అందంగా ఉంటుందని మెచ్చుకోవడమో చేస్తాము

ఆనందానికి కోపాన్ని, దుఃఖాన్ని కాని పట్టజాలనప్పుడు చిన్నవారే కాదు పెద్దలు కూడా చిత్రములైన అంగ విన్యాసాలు చూపుతుంటారు.[7]

పై విషయాన్ని నాటకంలో పరిశీలిస్తే రామేశ్వరం గిరిక రాకను కోట మలుపులో మల్లె తోట లాగ ఎదురొచ్చావనడం, ఆమె నడకను, నేల చూపులు మాని నా వైపు ఒక విసరరాదే అన్నప్పుడు ఆమె చూసిన విధానాన్ని, ఆమె పరుగులు పెడుతుంటే ఇంద్ర రథంలాగా ఆ పరుగులేమిటని కాలు నేలమీద ఆన్చకుండా నడిచే గిరిక సొగసేమిటని ఇలా వర్ణిస్తాడు.

### 6.2.18.రామేశ్వరం గణాచారిని అవమానించడం– సన్నివేశంలో మార్పులు:

నవలలో రామేశ్వరం గణాచారిని కొట్టబోవడం గణాచారి సుబ్రహ్మణ్యేశ్వర స్వామి ఆలయంలోకి ప్రవేశించటం ఉంటుంది.

నాటకంలోనూ ఆ సన్నివేశం ఉంటుంది. నవలలో లేని కొంత సంభాషణ కూడా నాటకంలో చోటుచేసుకుంటుంది. రామేశ్వరం గణాచారిని చూసి ఆవేశంతో ఆమె జుట్టు పట్టుకోబోతాడు .ఇంతలో చంద్రా రెడ్డి వచ్చి రామేశ్వరాన్ని వారించడమే కాకుండా గణాచారి జుట్టు శివ జటాజూటాలతో పోలుస్తాడు. సుబ్రహ్మణ్యేశ్వరునిగా వేయి పడగలకి అవి నాలుకలు అంటాడు. రామేశ్వరం చేసే చెడ్డ పనులకు అమాయకులు బలవుతారని అంటాడు. ఇవన్ని నవలలో కనిపించవు. అలాగే గణాచారి స్వామి ఆలయంలోకి ప్రవేశించి స్వామికి తన బాధను విన్నవించుకొనేటప్పుడు అసతోమా సద్గమయా, తమసోమా జ్యోతిర్గమయా అని అంటుంది. ఇది నవలలో కనబడదు. అంటే ఈ మాటలను నాటకంలో ప్రవేశపెట్టడంలోని ఆంతర్యాన్ని గమనిస్తే అజ్ఞానంలో కొట్టుమిట్టాడుతున్న మానవుడికి ఏ మార్గం అవసరమో ఏ మార్గంలో వెళితే అజ్ఞాన చీకట్లు తొలగుతాయో చెప్పడం కోసం అసతోమా సద్గమయా తమసోమా జ్యోతిర్గమయా, మృత్యోర్మా అమృతంగమయా అనే మాటలు గణాచారి పాత్ర ద్వారా తెలియజేసినట్లు తెలుస్తుంది. గణాచారి దగ్గరకు చంద్రా రెడ్డి వచ్చి రామేశ్వరం తరపున క్షమాపణలు చెప్పుకోవడం నవలలో ఉండదు.

---

[7] అప్పారావు, పి. యస్. ఆర్. తెలుగు నాటక వికాసం, పుట:22.

నవలలో గణాచారి, ధర్మారావు ఒకరినొకరు ఎదురుపడి ఒకరి కళ్లల్లో ఒకరి కన్నుల వెంట నీరు కారడం పతనమవుతున్న విలువలు, నూతన మార్పుల వలన కలిగే కష్టాలు, ఎండిపోతున్న పంట చేలలు ఇవన్ని వారు మాట్లాడుకోలేక పోయినా వాటి గురించిన బాధ వారిలో ఉన్నట్లు పాఠకుడికి అర్థమవుతుంది.

నవలలోని ఆ దృశ్యాన్ని నాటకంలో శ్రోతకు తెలియజేయడం కోసం, ధర్మారావు ,చంద్రా రెడ్డి సంభాషణ ఉంటుంది. ఈ సంభాషణలో చంద్రా రెడ్డి, గణాచారి, ధర్మారావు కలయిక రెండు దివ్య శక్తులలాగా భవిష్యత్తులో జరగబోయే ఎన్నో విషయాలకు వారు రూపకల్పన చేస్తున్నట్లు చెప్తాడు. ఇది నవలలో ఉండదు. ఆ దృశ్యాన్ని చూసిన చంద్రా రెడ్డికి ధర్మారావు తాను గణాచారి కలిసినప్పుడు మాటల రూపంలో కాకుండా ఆంతరంగిక విషయాలు బయటపడే విధంగా ఉన్నవారి హావభావాలను ధర్మారావు ఇది దేవ రహస్యం అంటాడు. గణాచారి, పసరిక, ధర్మారావు వారిలో వారు కలుసుకోకపోయినా ఒకరి భావాలు ఒకరికి అర్థమవుతాయి అంటాడు. ఈ మాటలు కూడా నవలలో కనిపించవు ఇది నాటకంలో చేర్చిన మార్పు.

పాతకాలంలో ఋషులకు దివ్య దృష్టి ఉంటుంది. జరగబోయే సంఘటనలను ముందుగా గ్రహించే శక్తి వారికి ఉంటుంది. అది వారు చేసే తపః ఫలానికి ఉన్న శక్తి. ఇక్కడ నాటకంలో పై సంభాషణను గమనిస్తే గణాచారికి అటువంటి దివ్యదృష్టి కలిగి ఉన్నట్లు ధర్మారావుకి గణాచారి యొక్క ఆంతరంగిక భావాలు గ్రహించే సంకల్ప సిద్ధి ఉన్నట్లు తెలుస్తుంది.

నాటకంలో ధర్మారావు, చంద్రా రెడ్డి సంభాషణలోనే చంద్రా రెడ్డి చుట్టు పక్కల, పల్లెల నుండి సైకిళ్ళ వాళ్ళు తెచ్చి నీళ్ళ పాలు పోస్తున్నారు అంటాడు. ఈ మాట నవలలో ఉండదు. ఇది నాటకంలో చేర్చిన మార్పు.

ఇందులోని విషయాన్ని గమనిస్తే ధర్మం స్వచ్ఛమైన పాలులాగా తెల్లగా ఉండవల్సింది. నీళ్ళు కలిపిన పాలులాగా స్వచ్ఛత కోల్పోయి. నీరుగారి పోతుంది. అనే భావం స్ఫురించినట్లు నాకు అర్థమవుతుంది.

### 6.2.19.శివరావు, ధర్మారావు సంభాషణలో మార్పు:

నవలలో శివరావు ధర్మారావుని కృష్ణ కర్ణామృతంలోని ఒక శ్లోకాన్ని చదువమంటాడు. ధర్మారావు 'అపి జనుషి పరస్మినాత్మ పుణ్యైభవేయం......అనే శ్లోకాన్ని ఆలపిస్తాడు.

నాటకంలో కూడా శివరావు కోరిక ప్రకారం ధర్మారావు ఒక శ్లోకం పాడతాడు.' వందే శంభుఉమాపతిం సురుగురుం వందే జగత్కారణం.....' ఈ శ్లోకాన్ని పాడ్తాడు. ఈ శ్లోకం నవలలో ఉండదు. ఇలా శ్లోకంలో మార్పు రావడానికి గల కారణాన్ని ఆలోచిస్తే నవలలో ఉండే శ్లోకం కొంత క్లిష్టమైన పదాలతో కూడి ఉంటుంది. శ్రోతకు ఆనందం కలిగించడం కోసం తేలికైన పదాలతో శివున్ని ప్రార్థించడం మనకు తెలుస్తుంది.

### 6.2.20.గిరిక మధుర భక్తి–మార్పు:

నాటకంలో గిరిక తన ప్రేమలో ఏదైనా దోషముందేమోనని ఆ కృష్ణమోహనుడు తన దానిగా గిరికను భావించడం లేదని బాధపడుతుంది. ఇలా ప్రతి సంభాషణ మాటల రూపంలో ఉంటే శ్రోత విషయాన్ని గ్రహిస్తాడు. కాని అప్పుడప్పుడు సంగీతంతో కూడిన పాటలు కూడా ఉంటే శ్రోతకు ఉల్లాసంగా ఉంటుంది. ఇక్కడ గిరిక యొక్క విరహ వేదనను ''తాళలేను అమ్మలాల మధు పాళి ....డాగు చేసెనేటికో నేడు నా స్వామి'' అనే పాట పాడుతుంది. ఆమె ఆవేదనను ఈ గాన రూపంలో వ్యక్తం చేయడం శ్రోతను గాన మధురిమ ప్రపంచంలోకి తీసుకెళ్లినట్లు అనిపిస్తుంది. పాట రూపంలో విరహాన్ని తెలియజేయడం నవలలో ఉండదు.

ఈ పాట చివరి లో విరహోత్కంఠిత ఇంతినే' అని అంటుంది.

అష్టవిధ నాయికలలో విరహోత్కంఠిత ఒకటి. విరహోత్కంఠితయైన స్త్రీ విరహంలో ఉంటూ మన్మథున్ని ఇలా ప్రార్థిస్తుంది. ఓ మన్మథా నా ప్రియుని తీసుకుని వస్తానని నా చెలికత్తెలు పోయి ఇంకా రాలేదు నిర్దయుడవై పుష్ప బాణాలతో కరుణ లేక నన్ను బాధిస్తున్నావు. నా కటాక్షాలను జయస్త్రాలను నీకు ఇస్తాను నా ప్రియుని జయించి తీసుకుని వచ్చి నాకు ఇవ్వు[8] అంటూ తన విరహావస్థను తెలియజేస్తుంది.

[8] వేంకట మురళీ కృష్ణ, పోచన పెద్ది(వ్యాఖ్యాత), కావ్యాలంకార సంగ్రహం, పుట:73.

ఈ రేడియో నాటకంలో గిరిక వేణుగోపాలుని మీద ఉన్న విరహాన్ని తాళలేక అతని కోసం వెతుకుతున్న చెలికత్తెలనుద్దేశించి మన్మథుని తో విన్న వించుకుంటుంది. ఇది పై తెలిపిన విరహోత్కంఠిత లక్షణాలు ఈ పాటలోని భావం ఒకే విధమైన అర్థాన్ని తెలియజేస్తున్నట్టు తెలుస్తుంది.

నవలలో దేవాలయంలో హరప్ప, దేవదాసి, ధర్మారావు ఉంటారు. స్వామి వారి కళ్యాణోత్సవాలకు మాత్రం వస్తానని దేవదాసి అంటుంది. దేవదాసి బిగ్గరగా 'వేదానుద్ధరతే జగన్నివహతే...అనే శ్లోకం పాడుతుంది. తన్మయత్వం చెంది ఉంటుంది.

నాటకంలో ధర్మారావు గిరికకు హరప్పను పరిచయం చేసి 'వేదానుద్ధరతే జగన్నివహతే....' అనే శ్లోకం ధర్మారావు పాడ్తాడు. ఈ పద్యం తర్వాత గిరిక స్వామి వారి ఉత్సవాలకు మాత్రం వస్తానని చెప్తుంది. నవలలో దేవదాసి పాడిన శ్లోకాన్ని నాటకంలో ధర్మారావు పాడ్తాడు. గిరిక పొందిన తన్మయత్వాన్ని చూసి హరప్ప ఇటువంటి నక్షత్రాలు ఇంకా మెరుస్తున్నాయంటే అది మన అదృష్టం అనుకుంటాడు. ఈ మాటలు నవలలో ఉండవు ఇది నాటకంలో చేర్చిన మార్పు. నవలలో దేవదాసి అని ఉన్న దాన్ని నాటకంలో గిరిక పేరుతో వ్యవహరిస్తారు.

నవలలో స్వామి ఉత్సవాలకు గిరిక తానే స్వయంగా వెళ్లి ప్రతి గజ్జను పరిశీలించి తీసుకుంటుంది. నాటకంలో ధర్మారావే గిరికకు గజ్జెలు చేయించినట్టు గా ఉంటుంది.

### 6.2.21.జోస్యులు ప్రవేశం– సన్నివేశంలో మార్పు:

నవలలో జోస్యులు ఉత్తరీయం కోసం వెతుకుతూ మంగ పెట్టెను తెరచి అందులో ఉన్న చీరలు, నగలు డబ్బులు, చూసి ఆశ్చర్యపోతాడు. మంగ అమ్మ పంపిందని చెప్తుంది కాని జోస్యులు నమ్మడు. పాఠశాలకు వెళ్లి ఇంటికి తిరిగి వచ్చి మంగమీద కోపంతో ఆమెను కొడతాడు. తిడతాడు. అనేక సందేహాలు అతని మనసులో చోటుచేసుకుంటాయి.

నాటకంలో ఇదే సన్నివేశం ఉన్నా జోస్యులు మంగ ను కొట్టడం ఉండదు. తనలో తాను మంగ ను మార్చింది ఎవరా అని ఆలోచిస్తూ రామేశ్వరమే ఇంతటికి కారణమని తెలుసుకుంటాడు.

నాటకంలో జోస్యులు, మంగమ్మకు కొన్ని మంచిమాటలు చెప్పి రామేశ్వరం ఆస్తినంతా దోచేయమని సలహా ఇచ్చి వెళ్లిపోతాడు. పిచ్చి వాడు లాగా తిరుగుతూ రామేశ్వరాన్ని కొట్టబోయి ముగ్గురు రౌడీల దగ్గర తాను చావు దెబ్బలు తిని చనిపోతాడు.

నాటకంలో జోస్యులు ఆమెకు(మంగ) మంచి మాటలు చెప్పి డబ్బుంటే నీ వాడిందే ఆట పాడిందే పాట అంటూ వెళ్లిపోతాడు. మంగమ్మ డబ్బు వస్తే చెడ్డ పేరు కూడా పోతుందా? ఏమిటిలా పిచ్చివాడిలా పరిగెత్తుతున్నారు మళ్లిరారా అంటుంది. ఇక్కడ జోస్యుల మరణాన్ని తెలియజేయలేదు మంగమ్మ చెప్పిన మాటల ద్వారా జోస్యులు ఇక తిరిగి రారని మాత్రమే అర్థమవుతుంది.

**6.2.22. కిరీటి దుఃఖం– వివాహ ప్రస్తావనలో మార్పు:**

నవలలో కిరీటి తల్లి చనిపోయాక అతనిని ధర్మారావే ఓదారుస్తాడు. నాటకంలో ధర్మారావు తో పాటు అరుంధతి కూడా కిరీటిని ఓదారుస్తుంది. అతనిని బుజ్జగిస్తూ మంచిమాటలు చెప్తుంది. కిరీటి ఏడ్చి ఏడ్చి సొమ్మసిల్లి పోతే అరుంధతి శశిరేఖ వచ్చిందని కిరీటిని కళ్లు తెరవమని చెప్తుంది. నవలలో ఈ మాట ధర్మారావు అంటాడు నాటకంలో అరుంధతి అంటుంది. నాటకంలో అరుంధతి సమయ స్ఫూర్తితో వ్యవహరించినట్టు తెలుస్తుంది.

నవలలో కిరీటి పెళ్లికి అడవి బాపిరాజు వచ్చి పేరంటాండ్రు రాలేని లోటును తీర్చినట్టు అతని పాటలు, పాడతాడని రచయిత మాటల్లో తెలుస్తుంది. నాటకంలో ధర్మారావు పాత్రద్వారా అడవి బాపిరాజు రాక యొక్క ఆనందాన్ని వివరిస్తాడు. అలాగే చమత్కారంగా ఆయన పాటలతో బొమ్మ లేస్తాడు బొమ్మలతో పాట పాడిస్తాడు. అని చెప్పడంతో అడవి బాపిరాజు యొక్క సహజ లక్షణం బయట పడుతుంది.

ధర్మారావు అడవి బాపిరాజును ఉద్దేశించి ఆండాళ్లందరూ అతనికి సోదరీ మణులు, మగవాళ్లందరూ బావలు కదా...కాని దేవులపల్లి కృష్ణశాస్త్రిని మాత్రం అన్నగారు అంటాడు అని చెప్తాడు. దేవుల పల్లి కృష్ణశాస్త్రి పేరు నవలలో ఉండదు. నాటకంలో అతని పేరును సూచించారు.

### 6.2.23.సంభాషణలో మార్పు:

నవలలో రాఘవరావు చెరసాల నుండి విడుదలైన తర్వాత ధర్మారావు ఇంటి నుండి మద్యపాన నిషేధ కార్యక్రమాన్ని మొదలుపెడతాడు. దానికి ధర్మారావుని తోడుకి తీసుకు వెళ్తాడు. వీరు అనేక ఇళ్లకు తిరుగుతారు. ఇంటి వివరాలు, ఏ ఇళ్లకు వెళ్లారో వారి పేర్లు ఆ పాత్రల వివరాలు, వారి సమస్యలు ఇలా అన్ని తెలుసుకోవడానికి కథ విస్తారంగా ఉంటుంది.

నాటకంలో విస్తారమైన వృత్తాంతాన్ని సంక్షిప్తం చేయడం రేడియో నాటక లక్షణం కనుక ఎవరెవరింటికి వెళ్లింది మున్నగు వివరాలు తెలపకుండా ధర్మారావు, రాఘవరావు సంభాషణలలో ధర్మారావు తాను పేద వారు పడుతున్న అగచాట్లను , వారి కష్టాలను మగవాళ్ల వ్యసనం మద్యం ద్వారా ఆడవారు నష్టపోతున్న తీరును గమనించానని అంటాడు. సంభాషణలో నవలలో ఉన్న విస్తారంగా వ్యాపించిన విషయాలన్ని తక్కువ సంభాషణలో కుదించడం ఒక మార్పు.

నవలలో ధర్మారావును, రాధాపతి ఇంటికి ఆహ్వానించడం ఆ ఇల్లు అంతకు ముందు మంగమ్మ ఇల్లని ధర్మారావు గ్రహించడం. బిజిలి విషయాన్ని రాధాపతిని అడిగి తెలుసుకోవడం ఉంటుంది. ఈ సంభాషణ ప్రత్యక్షంగా ఉంటుంది.

నాటకంలో కిరీటి, ధర్మారావుకు రాధాపతిని గుర్తు చేస్తాడు. అలా గుర్తు చేయడానికి బిజిలి గాయకురాలని రాధాపతి ప్రేమించడం తెలియజేస్తాడు. అప్పటికి గాని ధర్మారావుకి , రాధాపతి గుర్తుకు రాడు. కిరీటి ద్వారానే రాధాపతి మంగమ్మ ఇంట్లో ఉంటున్నట్టు తెలుసుకుంటాడు.

నవలలో పంకజమ్మ రాధాపతి గురించి చెబుతూ రాధాపతికి మొదట మహారాష్ట్రపు పిల్ల, తర్వాత వేరే ఆవిడ ఇప్పుడు మన గ్రామ దేవత అని అంటుంది. ధర్మారావుకి గ్రామదేవతంటే మంగమ్మ అని చెప్తుంది. నాటకంలో కిరీటి మంగమ్మను గ్రామ లక్ష్మిగా పేర్కొంటాడు. ధర్మారావు ఎవరని అడిగితే మంగమ్మ అని చెప్తాడు.

నవలలో పంకజమ్మ మంగమ్మను గ్రామ దేవతగా పేర్కొంటే నాటకంలో కిరీటి గ్రామ లక్ష్మిగా పేర్కొంటాడు.

నవలలో జొన్న చేలు వేయడంతో రకరకాల పాములు వచ్చాయని వాటి పేర్లను కొన్నింటిని రచయిత సూచిస్తాడు. నాటకంలో ధర్మారావు, కుమారస్వామి

సంభాషణలో ధర్మారావు పాములు రకాలను తెలుపుతాడు. నవలలోని పాముల పేర్లని చెప్పి అదనంగా దేవతా పాములను కూడా చెప్తాడు. ఇది అదనంగా చేర్చిన మార్పు.

కుమారస్వామి ఈ పాముల మీద లండన్ లో పరిశోధన చేద్దామనుకుంటాడు ఈ మాట నవలలో ఉండదు. ఇది నాటకంలో చేర్చిన మార్పు.

### 6.2.24.ధర్మారావు రెండవ వివాహ ప్రస్తావన–మార్పు

నవలలో ధర్మారావు పశుపతి నుండి తంతి వస్తుంది. చిన్న అరుంధతికి బాగలేదని వెంటనే రమ్మని ఉంటుంది. నాంచారమ్మ బలవంతం మీద ధర్మారావు వెళ్లడానికి సిద్ధపడుతారు. నాటకంలో కుమారస్వామి చెప్పిన తర్వాత పశుపతి ఇంటికి బయలుదేరిన ట్లుగా ఉంటుంది. నవలలో నాంచారమ్మ ద్వారా పశుపతి ఇంటికి వెళ్లిన ట్లుండగా నాటకంలో కుమారస్వామి చెప్పిన తర్వాత వెళ్లినట్లు మార్పు చేశారు.

రామేశ్వర శాస్త్రి(ధర్మారావు కొడుకు) కలలో అమ్మ (అరుంధతి) వచ్చి నన్ను బాగా చదువుకోమని నేను మళ్లి వస్తానని చెప్పినట్టుగా ధర్మారావుతో అంటాడు. ఇది నవలలో ఉండదు. అంటే చిన్న అరుంధతిని పెళ్లిచేసుకుంటాడని సూచన ప్రాయంగా శ్రోతకు తెలుస్తుంది. చివరకు చిన్న అరుంధతితో వివాహం జరుగుతుంది నాటకం పూర్తవుతుంది.

### 6.3. గణపతి– వేయిపడగలు – రేడియో నాటకీకరణ – కుల వ్యవస్థ:

గణపతి, వేయిపడగలు రేడియో నాటకాలను రెండింటిని పరిశీలిస్తే ఈ రెండింట్లో కూడా బ్రాహ్మణ కుటుంబ జీవన విధానం తెలస్తుంది. గణపతి, వేయి పడగలు రెండు రెండు భిన్న భావజాలంతో సాగిన నవలలు. ఇవి రేడియో నాటకీకరణలో కొన్ని సంఘటనలు యధాతథంగా తీసుకుని కొన్ని సంఘటనలను మార్పులు చేసి నాటకీకరణ చేశారు. . దినదినానికి సమాజంలో వస్తున్న మార్పులు వివరించారు.

'గణపతి'ని పరిశీలిస్తే రంగతో గాడిదనెక్కుతాను అన్నప్పుడు ఏమయ్యా బాపనోడివి గాడిదనెక్కుతావా అంటే దానికి సమాధానంగా గణపతి కలిగినవాడు గుఱ్ఱానెక్కుతాడు. లేనివాడు గాడిదనెక్కుతాడు అని అద్భుతమైన సమాధానమిస్తాడు.

ఈ ఒక్క మాటను పరిశీలిస్తే సాధారణంగా కలిగినవాడు, లేనివాడు అనే మాట ఆర్థిక పరిస్థితులను తెలియజేస్తుంది. అంటే ఉన్న దాంట్లో సర్దకుపోవాలి అనే సందేశాన్ని శ్రోతకు ఇస్తూనే దీన్ని లోతుగా పరిశీలిస్తే పూర్వపు రోజుల్లో ప్రతి ఒక కులానికి వృత్తి వ్యవస్థ ఉండేది. ఏ కులం వారు ఆ వృత్తిని చేపట్టేవారు అయితే ఇప్పుడు ఆ తీరు మారింది. గణపతి గాడిదనెక్కడం అనేది ఏ కులంలో వారైనా, ఏ వృత్తిపైనా చేపట్టవచ్చు అనే భావం అంతర్లీనంగా స్ఫురిస్తుంది. పైగా గణపతి వసుదేవుడంతటి వాడు గాడిద కాళ్లు పట్టుకోలేదా అని ఇచ్చిన సమాధానం దీనికి మరింత బలాన్ని చేకూరుస్తుంది. ఇంకా గణపతి గరుడా చలం పక్కన వేషం వేయడానికి నిర్ణయించుకుంటాడు. ఇక్కడ కూడా జాగ్రత్తగా పరిశీలిస్తే మహదేవయ్య గరుడా చలం పక్కన వేషం వేస్తావా? అని గణపతిని అడిగినప్పుడు విష్ణుమూర్తి మోహినీ అవతారం ఎత్త లేదా అని సమాధానం ఇస్తాడు. దీనిని బట్టి ఏపని ఎవరైనా చేయవచ్చు పొట్టనింపుకోవడానికి ఏపని చేసినా తప్పులేదు అనే భావం స్ఫురిస్తుంది.

ఇక వేయిపడగల నాటకాన్ని పరిశీలిస్తే నవలలో కాపు కుటుంబం అని ఉండగా దీన్ని నాటకంలో రైతు కుటుంబంగా మార్పు చేశారు. రేడియో నిబంధనల ప్రకారం రేడియో నాటకంలో కులాన్ని గాని, మతాన్ని గాని ప్రస్తావించడం విరుద్ధం కాబట్టి ఈ మార్పు చేసి ఉండవచ్చని భావిస్తున్నాను. మరో సందర్భంలో నవలలో సూర్య పతి ధర్మారావుకి వంద రూపాయలు ఇచ్చి వచ్చేనెల మరలా పంపిస్తానంటాడు. ధర్మారావు నాలుగు వందలకు తక్కువ కాదు అంటే సూర్య పతి పోవయ్యా పిచ్చి బ్రాహ్మణుడా అనగా ధర్మారావు నేను పిచ్చి బ్రాహ్మణుడను కాను నీవే పిచ్చి కమ్మ వాడవు అంటాడు.

నాటకంలో ఇదే ప్రస్తావన ఉంటుంది. కాని సూర్య పతి పోవయ్యా పిచ్చివాడా అంటే ధర్మారావు పోవయ్యా పిచ్చి మిత్రుడా అని నవ్వుకుంటారు.

ఇక్కడ గమనిస్తే నవలలో ఒకరి కులం ఒకరు ప్రస్తావించు కోవడం ఉంటుంది. రేడియో నాటక లక్షణాలలో కుల, మత, ప్రస్తావన ఉండకూడదు కావున రేడియో నాటకంలో కులానికి సంబంధించిన బ్రాహ్మణ, కమ్మ పదాలను తొలగించి చిన్న మార్పు చేశారు.

సావిత్రమ్మ చంద్రుని లో మచ్చల్లాగా ఈ వివాహాలేంటి అని అడిగినప్పుడు నేను నాలుగు వర్ణాల నుండి వివాహాలు చేసుకుంది. అందరిని సమానంగానే చూడడానికే అంటాడు. ఇంకా హరప్పనాయుడు వీధుల్లో నాటకానికి చూడటానికి వెళ్తున్నప్పుడు జమిందారులు మనం వీధినాటకాలకు వెళ్లకూడదు రేపు ఇక్కడే ఏర్పాటు చేస్తాలే అనగా వెంటనే హరప్ప నాయుడు నేను వెళ్తే తప్పేంటి అనే భావంతో వెళ్తాడు. అంటే పూర్వమున్నటువంటి మూఢాచారాలు నశిస్తున్నట్టు గా ఇక్కడ గోచరిస్తుంది.

ధర్మారావు నువ్వు కూడా గోపికవే అన్నప్పుడు గిరిక నేను వారి కులంలో పుట్టలేదు కదా అంటుంది. దానికి ధర్మారావు కులం గొప్ప కాదమ్మా అని చెప్పి గోపికలు గురించి వివరిస్తాడు ఇక్కడ అందరూ సమానులే అనే భావం తెలుస్తుంది.

**6.4. గణపతి– వేయిపడగలు రేడియో నాటకీకరణ — విమర్శ:**

విమర్శ అంటే కూలంకష చర్చ చేసి మంచి చెడులను సమాన దృష్టితో, సహృదయతతో స్వీకరించి సత్యాన్ని వెల్లడించడం. ఒక కావ్యాన్ని మొత్తంగా గ్రహించి విమర్శ చేసే సంప్రదాయం 19 వ శతాబ్దం ఉత్తరార్థంలో పాశ్చాత్య విమర్శతో సంపర్కం కలిగిన తరువాతనే మన దేశంలో ప్రారంభమైంది.''[9]

తెలుగు సాహిత్య విమర్శలో ప్రధానంగా రెండు ధోరణలున్నాయి. ఒకటి ప్రాచ్యం, రెండోది పాశ్చాత్యం. ప్రాచీనం, ఆధునికం అని రెండు విధాలుగా చెప్పవచ్చు. ఆధునిక జీవనం, ఆధునికత అన్నది మనోనిష్ఠమైనది ఆలోచనా ప్రధానమైనవి. ప్రాచీనత హృదయ నిష్ఠము అనుభవ నిష్ఠము అయినది. ఈ భేదమే ఒక కావ్యంలోని అనుభూతిని, అనుభవాన్ని భిన్న పద్ధతుల్లో పాఠకుడు అందుకోవడానికి కారణం అవుతుంది.[10]

గణపతి వేయిపడగల రేడియో నాటకాలు శ్రోతలకు మంచి సందేశాన్నిచ్చాయి. మన సంస్కృతి, సంప్రదాయాలను తెలియజేశాయి. సమాజంలో మార్పులకు అనుగుణంగా రేడియో అనుసరణ జరిగి ప్రసారమయ్యి శ్రోతలను

[9] వెంకట సుబ్బయ్య, వల్లంపాటి. విమర్శా శిల్పం,పుట:09.

[10] లక్ష్మణ చక్రవర్తి, లక్ష్మణ రేఖ(సాహిత్య విమర్శపై వ్యాసాలు), పుట: 122.

ఆకట్టుకున్నాయి. గణపతి, వేయిపడగలు రేడియో నాటకాలు కొన్ని మార్పులతో దేనికదే సాటిగా చిత్రీకరించబడ్డాయి.

మంచి రచనలో వస్తువు, శిల్పం విడదీయలేనంతగా కలిసిపోవాలి. రచనను అర్థం చేసుకోవడానికి అనుభూతి కలగడానికి, పాఠకుని సామర్థ్యాన్ని క్రియాత్మకం చేసేందుకు Aesthetic distance ఉపకరిస్తుంది.[11]

ఈ రెండు నాటకాలలోనూ పైన పేర్కొన్న ప్రకారం వస్తు, శిల్పం ఒకదానిలో ఒకటి ఒదిగిపోయి శ్రోతలను ఆనందింప చేశాయి. అయితే కొన్ని మార్పులు చేసి ఉంటే బాగుండేదని నాకనిపించింది. నా అభిప్రాయం కింది వివరిస్తున్నాను.

గణపతి, వేయిపడగలు రెండు నాటకాలలోనూ కొన్ని లోటుపాటులున్నాయని నాకనిపించింది. 'గణపతి' రేడియో నాటకాన్ని పరిశీలిస్తే ఇందులో గణపతి తన తల్లి సింగమ్మ గాడిదను ఎక్కినావా అని అడిగినప్పుడు వివిధ దేవతల వాహనాలను తెలియజేస్తూ దేవేంద్రుని వాహనం మేక అని, అగ్నిదేవుని వాహనం గొర్రె, యమధర్మరాజు వాహనం దున్నపోతు, వరుణుని వాహనం ముసలి, వాయుదేవుని వాహనం లేడి, శివుని వాహనం ఎద్దు, విష్ణుమూర్తి వాహనం బొల్లి గద్ద, మన్మథుని వాహనం చిలుక, కుమారస్వామి వాహనం నెమలి. గణపతి దేవుని వాహనం పందికొక్కు అని వాహనాల పేర్లు వివరించి నా వాహనం గాడిద అని వసుదేవుడంతటి వాడు గాడిద కాళ్లు పట్టుకోగా నేను గాడిదనెక్కితే తప్పేంటని తెలుపుతాడు. ఇక్కడ గణపతి ఇన్ని దేవతల వాహనాలు పేర్కొన్నాడు గణపతి అమాయకుడా? అజ్ఞానా? ఒక మంద బుద్ధి కలిగిన వాడికి ఇటువంటి జ్ఞానం ఉంటుందా అని శ్రోతలో ఉదయిస్తుంది. ఇక్కడ తల్లి కొడుకును మెచ్చుకున్నా ఇంకెవ్వరూ గణపతిని మెచ్చుకోక పోవడం ఒక లోటు. తల్లి బిడ్డలను మెచ్చుకోవడం సర్వసాధారణం ఇంకా ఒకటి, రెండు పాత్రలు మెచ్చుకుని ఉండుంటే బాగుండునని నాకనిపించింది. ఆ తర్వాత మహదేవశాస్త్రి గరుడా చలం పక్కన వేషమేస్తావా అన్నప్పుడు విష్ణుమూర్తి మోహినీ అవతారం ఎత్త లేదా అంటాడు. సామాన్యులకు ఇంత జ్ఞానం ఉంటుందా అనే ప్రశ్న తలెత్తుతుంది. ఇక్కడ కూడా గణపతి జ్ఞాన మూర్తిగానే కనబడుతాడు.

---

[11] వెంకటేశ్వర రావు, దార్ల. వీచిక(సాహిత్య విమర్శ వ్యాసాలు),పుట:09.

వేప పుల్లతో పప్పు కలబెట్టావా అని ఓవర్సీస్ అడుగగా వేపపుల్ల ఉపయోగాన్ని వివరిస్తాడు. ఈ సన్నివేశం సందర్భానుసారం నవ్వు వచ్చేలా ఉన్నా ఇందులో కూడా కొంత వాస్తవం దాగి ఉంది. పై సన్నివేశాలలో ఎక్కడా తన తల్లి ఒక సందర్భంలో తప్ప ఇంకెవరూ కూడా ఎక్కడా మెచ్చుకోరు. కాబట్టి గణపతిని మెచ్చుకోవడానికి ఒకటి, రెండు పాత్రలను సృష్టించి ఉన్నా బాగుండేది.

అలాగే వేయి పడగలను పరిశీలిస్తే సావిత్రమ్మ, రామేశ్వర శాస్త్రితో బహు భార్యత్వం అంటే భలే మోజు అంటుంది. రామేశ్వర శాస్త్రి సాక్షాత్తు వాసుదేవుడు నాలుగు వర్ణాల వారు సమానమే అని చెప్తాడు. కాబట్టి నేను నాలుగు వర్ణాల వారిని అనగా క్షత్రియ కన్య రంగాజమ్మ, వైశ్య కన్య హైమవతి, శూద్ర కన్య అయిన మంగ ను వివాహమాడాను అని మూడు వర్ణాలను పేర్కొంటాడు. ఇక్కడ బ్రాహ్మణ వర్ణాన్ని తీసుకురాకపోయినా చెప్పింది భార్యయైన సావిత్రి కాబట్టి ఆమె బ్రాహ్మణ వర్ణమని తెలిసిపోతుంది. దీనితో నాలుగు వర్ణాల వారిని వివాహం చేసుకోవడం తెలుస్తుంది. అయితే శూద్ర వర్ణన నుండి మంగ ను తేవడం బాగానే ఉంది. మరి రత్నగిరిని ఎందుకు ఉంచుకున్నాడు అనే ప్రశ్న వేసుకుంటే వేశ్య కులాన్ని కూడా సమానంగా చూడాలనే ఉద్దేశం అయితే రామేశ్వర శాస్త్రి పైన వాసుదేవుడు నాలుగు వర్ణాలను సృష్టించాడు. నేను నాలుగు వర్ణాల స్త్రీలను చేసుకోవడం అందరిని సమానంగా భావించడం కోసం చేసుకున్నానని పైన నొక్కి మరి చెప్పాడు. మంగ శూద్ర వర్ణానికి చెందింది. రత్నగిరి కూడా వేశ్య అయినప్పటికి శూద్ర కులంలోకి వస్తుంది. ఇక్కడ నాలుగు వర్ణాలు అని నొక్కి చెప్పడంతో రత్నగిరిని నాలుగు వర్ణాల నుంచి పరిహరించవలసి వస్తుంది. అలా కాదు అంటే రత్నగిరిని ఐదో వర్ణాన్ని సూచించే ప్రమాదముంది.

అగ్ర వర్ణాలలో బహు భార్యత్వం అనేది సామాజిక పరమైన మిగులలో ఆ వర్గాలకు గల అధిక వాటాకు అనుగుణంగా ఉన్నట్లు తోస్తుంది. నిమ్న వర్ణాలలో ఏక పత్నిత్వం అనేది పెద్ద కుటుంబాన్ని పోషించలేని నిమ్న వర్ణాల అశక్తతకు సూచికగా తోస్తుంది.[12]

[12] కృష్ణారెడ్డి, కె. భారతదేశ చరిత్ర, పుట:75.

పైన పేర్కొన్న ప్రకారం ఆ కాలంలో ఆర్థికంగా అభివృద్ధి చెందినవారు. ఉన్నత కులస్తులలో బహు భార్యత్వం ఉండడం సర్వ సాధారణం అని తెలుస్తుంది.

ఒక వ్యక్తి చేసుకోవాల్సిన భార్యల సంఖ్యను అతని వర్ణం ద్వారా నిర్ధారించడమైంది. అగ్రవర్ణాల సభ్యులలో బహు భార్యత్వం అమల్లో ఉండగా నిమ్న వర్ణాల సభ్యులు సాధారణంగా ఏకపత్నిత్వాన్ని అనుసరించేవారు.[13] దీనిని బట్టి రామేశ్వర శాస్త్రి ఏ కోవకు చెందుతాడు అన్న ప్రశ్న మిగిలిపోతుంది

సావిత్రమ్మ రామేశ్వర శాస్త్రితో మీరు ఇన్ని వివాహాలు చేసుకున్న మీకు భోజనం పెట్టేటటువంటి భాగ్యం నాకే కలిగింది. అంటుంది. అంటే రామేశ్వర శాస్త్రి మిగతా వాళ్లతో కలసి భోజనం చేయడం లేదా లేక శారీరక సుఖాన్ని మాత్రమే అనుభవించాడా అనే ప్రశ్న శ్రోతకు కలుగుతుంది.

హైమవతిని వివాహం చేసుకున్నట్టు మాటల సందర్భంలో చెప్పారు కాని నాటకాంతం పరిశీలిస్తే హైమవతి జాడ కనబడదు. ఈమె ప్రస్తావన లేకపోవడం హైమవతి ఏమైంది అనే సందేహం ఏర్పడుతుంది. హైమవతి ఏమవుతుందో ఒక మాటలో చెప్పి ఉంటే బాగుండేది.

రామేశ్వర శాస్త్రి రామచంద్రరాజును అస్త్ర శస్త్ర పారంగతుణ్ణి చేయాలని ధర్మారావుని వేద విద్యా పారంగతుణ్ణి చేయాలని అనుకుంటాడు. కాని శ్రీ ధరం పేరును పేర్కొనలేదు.

ధర్మారావు సంకల్ప సిద్ధి కలిగిన వాడుగా ఉంటాడు. అందరికి సలహాలు సూచనలను తెలియజేస్తుంటాడు. అటువంటి ధర్మారావు ఎందుకు దారిద్ర్యాన్ని జయించలేకపోయాడు అనే ప్రశ్న మిగిలిపోతుంది.

పశుపతి ధర్మారావుతో బాల్యవివాహాలు గురించి చర్చ చేస్తాడు. ఇందులో పశుపతి బాల్యవివాహాలు తప్పని వాదించగా ధర్మారావు బాల్యవివాహాలను సమర్థిస్తాడు. పైగా పురుషునికి ఆరేళ్ల పైన యౌవన వయసు ఉంటుంది. స్త్రీకి నలభై ఏళ్ల లోపే ఉంటుందని చెప్తాడు. ఇది లైంగిక వయసు అనేది శ్రోతకు తెలుసుకోవడం వరకైతే బాగుంటుంది. కాని ఒక నాయకుడు బాల్యవివాహాలను సమర్థించడం

---

[13] కృష్ణారెడ్డి, కె. భారతదేశ చరిత్ర, పుట:75.

సుముఖంగా లేదు వేరే పాత్ర ఏదైనా బాల్యవివాహాలను సమర్థించి ధర్మారావు తప్పని వాదించి ఉంటే బాగుండేదని నాకనిపించింది.

నవలలో అరుంధతి ఆరోగ్య పరిస్థితి బాగుండదు. రథంతరి వచ్చి అరుంధతిని పలుకరిస్తుంది. గిరికను తలచుకుని బాధపడ్తుంది.

ఇదే సంభాషణ నాటకంలో ఉన్నప్పటికి  రథంతరి స్థానంలో శశిరేఖ వచ్చినట్లుగా అరుంధతి అని సంబోధిస్తుంది. కాని అక్కడ గొంతు మాత్రం రథంతరి లాగే ఉంటుంది. రికార్డింగ్ లో చిన్న పొరపాటు జరిగి ఉండవచ్చు.

రేడియో నాటకంలో చిన్న పిల్ల, నవలలో రమణి అని మార్చారు. నవలలో ఒక యువకుడుగా ఉన్న పాత్రను నాటకంలో వెంకన్నగా మార్చారు. నవలలో దాసి పాత్రను నాటకంలో రాజమ్మగా సూచించబడింది. ఇలా మార్చడం ద్వారా  ఈ పేర్లు నవలలో కూడా ఉన్నాయని భ్రమపడే అవకాశం ఉంది. ఈ మూడు పేర్లు నవలలో అంతర్లీనంగా మాత్రమే ఉన్నాయి. నాటక సౌలభ్యం కోసం శ్రోతకు అర్థం కావడానికి ఈ పేర్లను సూచించి ఉండవచ్చు.

ఈ నాటకంలో ఒక తొమ్మిదవ భాగమైన పరిచయ కార్యక్రమాలను కలుపుకుంటే పదో భాగం లేదా నాటకం వరకు చూస్తే తొమ్మిదవ భాగంలో సంగీత విరామాలు సూచించకుండా ప్రసారం జరిగింది. దీని వలన శ్రోతకు అర్థం చేసుకోవడానికి కొంత కష్టంగా ఈ భాగం ఉంది.

### 6.5.గణపతి, వేయిపడగలు రేడియో నాటకీకరణ – భాష:

మనసులోని భావాలను ఎదుటి వ్యక్తికి వ్యక్తీకరించడమే భాష. భాష అంటే మానవుడికి ఉన్న అమూల్యమైన శక్తి భాష మాట్లాడగలగడం, భాష మాట్లాడలేని ‘మానవుడికి ఉన్న అమూల్యమైన శక్తి భాష మాట్లాడ కలగడం. భాష మాట్లాడలేని మానవుడు లేనట్లే భాష మాట్లాడ కలిగిన మానవేతర ప్రాణి ఏది లేదు. మెదడులో కాని ముఖ యంత్రంలో కాని లోపాలున్న కొద్దిమందికి తప్ప మిగిలిన మానవులందరికి మాట్లాడే శక్తి ఉంది మానవుడు తన మనస్సులోని అభిప్రాయాలను బహిర్గతం చేయడానికి నోటి ద్వారా చేసే ధ్వనులే భాష. మనకు తెలియని భాష ఒకరు వ్యవహరిస్తున్నప్పుడు మనం వినేవి ఆ వ్యక్తి నోటి ద్వారా చేసే రకరకాల ధ్వనులే. ఆ భాష తెలిసిన వారికి ఆ ధ్వనుల అర్థం బోధపడుతుంది. తెలియని వారికి

వాటి అర్థం బోధపడదు. కాబట్టి భాష అంటే కొన్ని ధ్వనుల సముదాయమేనని దీని వల్ల తెలుస్తుంది.[14]

రచయిత తన రచనలలో ఉపయోగించే భాష గ్రాంథికంలోనైనా ,వ్యవహారంలోనైనా ఉంటుంది. ప్రస్తుత కాలం వ్యవహారిక భాష యే జనాదరణ పొందింది.

గణపతి, వేయిపడగలు నవలలను మనం గమనిస్తే ఈ రెండు నవలలు గ్రాంథిక భాషలోనే రచించబడ్డాయి. ఈ నవలలను చదవడానికి కొంత పాండిత్యం, నిఘంటు పరిజ్ఞానం అవసరం. చాలా కొద్దిమంది ప్రజలు మాత్రమే చదివే అవకాశం ఉంది. ఈ లోటును తీర్చడానికి పండితులకే కాదు పామరులకు సహితం ఆనందానుభూతుల్ని కలిగించడానికి ఈ నవలలను రేడియో నాటకాలుగా ఆకాశవాణి వారు ప్రదర్శింప చేశారు. రేడియో నాటకంగా మారినప్పుడు గణపతి, వేయిపడగల లోని అంశాలు చాలావరకు వ్యవహారిక భాషలోనే సాగాయి. ఎవరైనా గణపతి, వేయిపడగల నవలలోను చదవాలి అనుకున్నప్పుడు ఒకసారి గణపతి, వేయిపడగల రేడియో నాటకాలను విని తరువాత గణపతి ,వేయిపడగలు నవలలను చదివినట్లయితే కొంత అవగాహనతో సులువుగా చదవడానికి వీలవుతుంది. అయితే ఈ నాటకాలలో యధాతథానువాదం చేయకపోవడం వలన చాలా సన్నివేశ భాగాలను మనమే అర్థం చేసుకోవాలి.

### 6.5.1. భాష పదాలు

గణపతి, వేయిపడగలు రేడియో నాటకీకరణలో నేను గమనించిన భాష పదాలు ఈ విధంగా ఉన్నాయి.

1.పుండాకోరుల్లారా – గణపతి రూపాన్ని పిల్లలు కొండముచ్చని హేళన చేస్తూ నవ్వుతారు. దానికి ఉపాధ్యాయుడు ఎందుకు రా ఆ నవ్వులు సైలెంట్ గా ఉండమని పిల్లల్ని అరిచే సందర్భంలో పుండాకోరుల్లారా అనే పదాన్ని వాడుతారు.

2.బలాదూర్– మహదేవశాస్త్రి గణపతిని వంటమనిషిగా కుదిర్చి వారి ఇంట్లో ఓవర్ సీన్ భార్య దగ్గర ముందు వంట నేర్చుకోమంటాడు. గణపతి నేను వంట

[14] సుబ్రహ్మణ్యం, పి. యస్. ఆధునిక భాషా శాస్త్ర సిద్ధాంతాలు,పుట:3.

నేర్చుకోవడమేంటి నల, భీమ పాకాలు కూడా నా ముందు పనికిరావని చెప్పే సందర్భంలో ఈ పదాన్ని వాడుతారు.

వేయిపడగల నాటకంలోని భాషా పదాలను గమనిస్తే...

1. ఏ దుమ్ముకొచ్చారో– ధర్మారావు తన ఇంటి అప్పుల గురించి బాధపడుతూ అప్పుల వాళ్లు ఏ ఆపద తలపెడతారో అని ఆలోచిస్తున్న సందర్భంలో ఈ పదం వాడుతారు.

2. బియ్యం నిండుకున్నాయి– నవలలో బియ్యం లేవురా అని ఉండగా నాటకంలో బియ్యం నిండుకున్నాయని సభ్యోక్తి రూపంలో ఈ పదానికి గౌరవార్థాన్ని సూచించారు.

3. దేవులాడాల్సిందే– గోపన్న రామేశ్వర శాస్త్రి తమరు దేవుళ్లేనండి అంటే రామేశ్వర శాస్త్రి దేవుళ్లేనండి అనే మాటను సందర్భానుగుణంగా మార్చుకుని గోపన్నతో నువ్వు నిజం చెప్పావు పిల్లల కడుపు నింపడానికి నిత్యం దేవుళ్లాడాల్సిందే కదా అని అంటాడు. ఇందులో ఒక అర్థం భగవంతున్ని సూచిస్తే మరో అర్థం తిండికోసం రోజు వెతుక్కోవల్సిందే అనే అర్థం స్ఫురిస్తుంది. గోపన్న అదే పదాన్ని భగవంతుడు మనుషులతో  ఆడుకుంటాడు అని చెప్పడానికి దేవుళ్ళాడతారండి వారికిది క్రీడేనండి అని అంటాడు. దొంగగా ఉన్న తనను జమిందారి ఇంట్లో రుచికరమైన భోజనం చేస్తున్నానని తాను రుచి చూస్తే తప్ప జమిందారు తినడని చెప్తూ ఇదేనండి దేవుళ్లాట అని చెప్తాడు. మనుషులను ఆడించేది ఆ దేవుడేనని మరో అర్థాన్ని తెలియజేస్తారు.

గణపతి, వేయిపడగల నవలలను రేడియో నాటకాలుగా మలిచినప్పుడు ఇటువంటి పదాలను చేర్చి నాటకాన్ని మరింత ఆసక్తికరంగా తీర్చిదిద్దారు.

### 6.5.2. సామెతలు:

గణపతి నాటకంలో గమనించిన సామెతలు

1. కార్తీక మాసంలో వచ్చిన వాన గాలికి చైత్ర మాసంలో చెట్లు కాయలు రాల్తాయా

మేనమామ గణపతి పెద్ద రెడ్డిగారి తోటలో పిల్లల్ని వెంటబెట్టుకెళ్ళి మామిడి కాయల్ని రాల్చేశాడట అంటే తల్లి ఛీ.....ఛీ  మొన్నటి గాలికి అవే రాలిపోయాయేమో

అని అంటుంది. మేనమామ ఆమె మాటకు సమాధానం ఇస్తూ కార్తీక మాసంలో వచ్చిన వాన గాలికి చైత్ర మాసంలో చెట్ల కాయలు రాల్తాయా అని సామెతతో సమాధానం చెప్తాడు. ఇది నవలలో ఉండదు.

2. ఎవరి కొంపలో నిప్పుంటే ఆ కొంపే కాల్తుంది.

గణపతి మేనమామ ఇంటి నుండి వెళ్లిపోయేటప్పుడు నా ఆస్తులు నాకు ఇచ్చేయి అనే సందర్భంలో రా అమ్మా పోదాము ఎవరి కొంపలో నిప్పుంటే ఆ కొంపే కాల్తుంది. అని అంటాడు.

**వేయిపడగలు నవలలో గమనించిన సామెతలు**

1. జేష్టా దేవమ్మలాగా ఇల్లు వెలవెలబోతుంది.

గోపన్న రామేశ్వర శాస్త్రి ఇంటిని పరిశీలించి దరిద్ర దేవత ఇంట్లో తాండవిస్తుంది. అని చెప్పడానికి పై సామెతను ఉపయోగించారు.

2. కోతి దగ్గర నక్కలాగా:

రామేశ్వర శాస్త్రి మరణానంతరం అతన్ని చూడటానికి వచ్చిన నాగన్న శేటుని, శ్రీరాములను ఉద్దేశించి కృష్ణమనాయుడు చెప్పిన సామెత.

ఇటువంటి సామెతల చేరికతో నాటకానికి మెరుగులు దిద్దారు.

ఈ అధ్యాయంలో ప్రధానంగా గణపతి, వేయిపడగల నాటకాలలో జరిగిన మార్పులు చేర్పులను విమర్శనాత్మకంగా వివరించాను.

# ముగింపు

నా పరిశోధనాంశం 'రేడియో నాటకాలుగా మారిన గణపతి, వేయిపడగల నవలలు విమర్శనాత్మక పరిశీలన.' గణపతి, వేయిపడగల నవలలు రెండు ప్రసిద్ధి చెందినవే. ఇవి రెండూ భిన్న భావజాలానికి సంబంధించినవి. అయితే రెండింటి లోనూ సామాజిక, పరిస్థితులు కనబడతాయి. ఈ నవలలను గ్రాంథికంలో రాశారు. ఇది ప్రజలందరికి చదువుకోవడానికి వీలు కాదు కాబట్టి వీటిని రేడియో నాటకాలుగా మలిచి వ్యవహార భాషలో ప్రసారం చేశారు. దీని వలన ప్రజలందరికి ఈ నవలలో ఉన్న కథా సారాంశాన్ని తెలుసుకోవడానికి వీలవుతుంది.

**నా పరిశోధనాంశానికి గల కారణాలు:**

2013 జులైలో వేయిపడగలు రేడియో నాటకం ప్రసారమైనప్పుడు నేను విని రికార్డు చేశాను. కొన్ని మార్పులు, చేర్పులు నా దృష్టికి వచ్చాయి. అప్పుడు దీని మీద పరిశోధన చేస్తే బాగుంటుందనిపించింది. అయితే దీనితో పాటు ఇంకా నవలలు రేడియో నాటకీకరణ చేశారేమోనని ఆకాశవాణి హైదరాబాద్ కేంద్రం వారిని సంప్రదించాను. వారి దగ్గరున్న కొన్ని రేడియో నాటకాల సి.డిలను ఇచ్చారు. వాటిలో గణపతి రేడియో నాటకాన్ని నా పరిశోధనలో చేర్చాను. వేయిపడగల రేడియో నాటక అనుసరణ చేసిన దిట్టకవి శ్యామలాదేవిని సంప్రదించి సహాయ సహకారాలు తీసుకుని నా సందేహాలను తీర్చుకున్నాను. ఇంకా గణపతి, వేయిపడగల రేడియో నాటకాల మీద పరిశోధన చేయాలని నిశ్చయించుకున్నాను.

నేను నా పరిశోధన కొనసాగిస్తున్నప్పుడు ఆకాశవాణి హైదరాబాద్, విజయవాడ, కడప కేంద్రాలను సంప్రదించాను. అయితే, వారి నుండి అనుకున్నంత సహకారం లభించలేదు. దానికి గల కారణాలు సాంకేతిక అనుమతి లేకపోవడమని తెలిపారు. దానికి నేను నిరుత్సాహ పడ్డాను. అయితే కొన్ని సలహాలు, సూచనలు మాత్రం ఇచ్చారు. దాని ప్రకారం నేను రికార్డ్ చేసుకున్న దానితో పరిశోధన పూర్తి చేశాను. చివరకు ఈ రేడియో నాటకాల మీద వచ్చిన స్పందనలు, ఉత్తరాలు ఇవ్వమని పలుమార్లు ఆకాశవాణి వారిని అడిగాను. వాటిమీద చాలా స్పందనలు వచ్చాయి. కాని, ప్రస్తుతానికి ఆ ఉత్తరాలు అందుబాటులో లేవని చెప్పారు. కొంత

వరకు ఆకాశవాణి హైదరాబాద్ కేంద్రం కార్యక్రమ నిర్వాహకులు రాంబాబు గారు కొన్ని వివరాలను అందించారు. మరికొన్నింటిని నేను రకరకాలుగా సేకరించాను. దీనితో నా పరిశోధన పూర్తి చేశాను.

రేడియో నాటకాల మీద పరిశోధన చేయడానికి ముఖ్యకారణాలు 'గణపతి', 'వేయిపడగల' నవలలో నేను గమనించిన అంశాలు. 'గణపతి' నవలలో పాత సంప్రదాయాలకు, మూఢనమ్మకాలకు అడ్డుకట్ట వేయడమే అనే భావం ఆయా సన్నివేశాలలో స్ఫురిస్తుంది. పాత ఆలోచనలకు స్వస్తి చెప్పి కొత్త విధానానికి మార్గం చూపే విధంగా అనేక పాత్రలు వారి సంభాషణ, వారి అలవాట్లు, వ్యక్తిత్వాలు స్పష్టం చేస్తాయి. అలాగే 'వేయిపడగల' నవలలో ఆనాటి సంఘ సంస్కరణ భావాలు ఈ నవలలో స్ఫురిస్తాయి. స్వాతంత్ర్యోద్యమ పరిస్థితులు, జమిందారి వ్యవస్థ వారి పరిపాలన, శిస్తు విధానం , ఆధ్యాత్మికత ఇలాంటి విషయాలను గమనించాను.

నా పరిశోధనాంశం 'రేడియో నాటకాలుగా మారిన గణపతి, వేయిపడగలు విమర్శనాత్మక పరిశీలన' పరిశోధనా సౌలభ్యం కొరకు నా పరిశోధనాంశాన్ని ఆరు అధ్యాయాలుగా విభజించాను. మొదటి అధ్యాయం 'చిలకమర్తి లక్ష్మి నరసింహం, విశ్వనాథ సత్యనారాయణ సాహిత్య కృషి'' గణపతి , వేయిపడగల రచయితలు చిలకమర్తి, విశ్వనాథల కాబట్టి సాహిత్యానికి వారు చేసిన కృషిని తెలుసుకోవాల్సిన అవసరం ఉందనిపించింది. అందువలన ఈ అధ్యాయంలో ముందుగా సాహిత్యం గురించి కొంత వివరించి. తర్వాత చిలకమర్తి, విశ్వనాథ జీవిత వివరాలను సంక్షిప్తంగా పరిచయం చేసి నాటక రంగంలో, నవలా రంగంలో వారు చేసిన కృషిని ఈ అధ్యాయంలో తెలియజేశాను.

చిలకమర్తి, విశ్వనాథ వారి జీవిత వివరాలను పేర్కొన్నాను. వారి జీవితం నేటి తరాల వారికి ఎంతటి ఆదర్శ ప్రాయమైనదో వారి జీవిత వివరాలు తెలుసుకుంటే అర్థమవుతుంది. నాటక సాహిత్యంలో చిలకమర్తి చేసిన కృషిని వివరించి అతని నాటకాలైన ద్రౌపది పరిణయం, గయోపాఖ్యానం, పార్వతి పరిణయం, నాటకాలను సంక్షిప్తంగా వివరించాను. అలాగే విశ్వనాథ నాటకాలు. ధన్య కైలాసం, నర్తన శాల, వేనరాజు నాటకాలను పరిచయం చేశాను. ఇవే కాకుండా నవలా సాహిత్యంలోనూ ప్రత్యేకతను నిలుపుకున్న చిలకమర్తి వారి నవలలను రామచంద్ర విజయం, రాజా

రత్నం, సౌందర్య తిలక, నవలలను, విశ్వనాథ వారి ఏకవీర, దేవతల యుద్ధం, హాహాహూహూ నవలలను పరిచయం చేసి ఈ నాటకాల మీద నవలల మీద ప్రముఖ అభిప్రాయాలను ఈ అధ్యాయంలో పేర్కొన్నాను.

రెండవ అధ్యాయం 'దృశ్య, శ్రవ్య నాటక వికాసం–గణపతి, వేయిపడగల నవలలు పరిచయం' అందువలన రేడియో నాటకాలుగా నాటక సాహిత్య నేపథ్యాన్ని ముందుగా తెలుసుకోవాల్సిన అవసరం ఉందనిపించింది. దశ విధ రూపకాలలో నాటకం ఒకటి. ఆ నాటకం ప్రజలకు చేరడానికి ఆకాశవాణి కేంద్రాలు కొన్ని మార్పులు, చేర్పులు చేసి శ్రోతలకు బాగా అర్థమయ్యే ట్లు ప్రసారం చేస్తున్నాయి. దాన్నే మనం రేడియో నాటకం అంటున్నాం.

ఈ అధ్యాయంలోనే నాటకాన్ని నిర్వచించి తెలుగు నాటక వికాసం ఏవిధంగా పరిణామం చెందిందో పేర్కొని సాంఘిక, చారిత్రక, ప్రచార, మనస్తత్వ నిరూపణ , విషాద, రూపకాలుగా విభజించి వివరించాను. నా పరిశోధనా అంశాన్ని దృష్టిలో పెట్టుకుని కేవలం నాటక వివరాలే కాకుండా రేడియో నాటక చరిత్రను పొందుపరిచాను. రేడియో నాటకాల చరిత్రను తెలుసుకునే ముందు నాటకానికి , రేడియో నాటకానికి మధ్య గల భేద సాదృశ్యాలను వివరించాను. శ్రవ్యాంశాలు, దృశ్యాంశాలను పేర్కొని రంగస్థల నాటకాలు, నవలల కు, రేడియో అనుసరణ ఏ విధంగా జరిగిందో సంక్షిప్తంగా పరిచయం చేశాను. ముఖ్యంగా రేడియో నాటకాలకు ఉండాల్సిన పరిమితులను వివరించాను. ఈ అంశాలన్ని రేడియో నాటకానికి ప్రాముఖ్యతను చేకూరుస్తాయని ఈ అధ్యాయం ద్వారా తెలిపాను.

మూడవ అధ్యాయం 'గణపతి', వేయిపడగల నవలలు: ఇతివృత్త పరిచయం' గణపతి, వేయిపడగలు నవలలు రేడియో నాటకాలుగా మారాయి రేడియో నాటకాలుగా మారినప్పుడు కథా సారాంశంలో ఏమైనా మార్పులు జరిగాయా? మూలం చెడకుండా కథను నడిపించారా లేదా అనే విషయాలు తెలుసుకోవడానికి ఈ నవలల ఇతివృత్త సారాంశాలను తెలుసుకోవాల్సిన అవసరం ఉందని భావించి ఈ అధ్యాయంలో గణపతి, వేయిపడగల నవలల ఇతివృత్తాలను వివరించాను. అంతే కాకుండా గణపతి , వేయిపడగల నవలల ఇతివృత్త నిర్మాణం ఏ దిశగా సాగిందో వివరించాను.

నాల్గవఅధ్యాయం 'రేడియో నాటకీకరణ విధానం శ్రవ్యనాటక లక్షణ సమన్వయం' గణపతి, వేయిపడగల నవలలను నాటకీకరణ చేశారు. అయితే రేడియో నాటకమనేది శ్రవ్యనాటక లక్షణాలను దృష్టిలో పెట్టుకుని చేసినప్పుడే అది చక్కని రేడియో నాటకంగా రూపుదిద్దుతుంది. కావున ముందుగా రేడియో నాటకీకరణ ఏ విధంగా జరిగింది. శ్రవ్యనాటక ముఖ్యాంశాలు పేర్కొని గణపతి, వేయిపడగల నవలలు రేడియో నాటక ప్రసారాలుగా ఏ సంవత్సరంలో చేశారు. ఎన్ని నిమిషాలు, ఎన్ని గంటలు, ఎన్ని వారాలు చేశారు. ధారావాహికంగా చేశారా, గంట నాటకంగా మలిచారా వంటి అంశాలన్ని ఇందులో పొందుపరిచాను.

ఈ వివరాలను తెలిపి హాస్య రచనగా 'గణపతి' నవల ఎంతటి ప్రాధాన్యతను కలిగి ఉంది. దానిని శ్రవ్యనాటకంగా తీర్చిదిద్దినప్పుడు ఎలా రూపుదిద్దుకుందో వివరించాను. గణపతి రేడియో నాటకం హాస్యభరితంగా సాగింది కనుక అసహజత్వం, ఆశ్చర్యం, సందర్భశుద్ధిలేకపోవడం , అతిశయోక్తి వంటి హాస్య లక్షణాలను హాస్యనాటక లక్షణాలను పేర్కొని వాటిని గణపతి రేడియో నాటకానికి అన్వయించి విశ్లేషించాను. అలాగే ధ్వని, నేపథ్య సంగీతం, విరామ సంగీతం వంటి శ్రవ్యనాటక లక్షణాలను వేయిపడగల రేడియో నాటకానికి సమన్వయ పరిచాను. చివర ఈ రేడియో నాటకం వినేటటువంటి శ్రోత అనుభూతి ఎలా ఉందో ఎలాంటి స్పందనకు శ్రోత లోనయ్యాడో వంటి వివరాలను వివరించాను.

ఐదవ అధ్యాయం 'గణపతి', 'వేయిపడగలు': రేడియో నాటకీకరణ పాత్ర పోషణ' నవలలోనైనా, నాటకంలోనైనా, పాత్రలకు ప్రాముఖ్యత ఉంది. ముఖ్యంగా రేడియో నాటకంలో పాత్ర సంభాషణ ద్వారానే శ్రోత విషయాన్ని గ్రహించగలడు కావున పాత్ర ఎంతగా జీవించి సందర్భానుసారంగా, ఆయా సన్నివేశాలలో వారి హావభావాలను గొంతులో పలికించగలుగు తాడో అప్పుడే శ్రోత రేడియో నాటకాన్ని చక్కగా ఆస్వాదించగలుగుతాడు. ఈ అధ్యాయంలో పాత్ర పోషణ అంటే ఏమిటో వివరించి గణపతి, వేయిపడగల రేడియో నాటకాలలోని పాత్రలను పేర్కొన్నాను. ఆ పాత్రలను ధరించిన పాత్రధారుల పేర్లను ఇందులో పొందుపరిచాను.

ఆరవ అధ్యాయం 'రేడియో నాటకీకరణ, మార్పులు, చేర్పులు: విమర్శనాత్మక పరిశీలన' ఈ అధ్యాయంలో రేడియో నాటకాలుగా మారిన గణపతి,

వేయిపడగలులలో చోటుచేసుకున్న మార్పులను, చేర్పులను విశ్లేషణాత్మకంగా వివరించాను. నవలలను రేడియో నాటకాలుగా అనుసరణ చేసేటప్పుడు సంభాషణలోనూ, సన్నివేశాలలోనూ వచ్చిన మార్పులను వివరించాను. నవలలో సుదీర్ఘమైన సంభాషణలు నాటకంలో ఏ విధంగా కుదించారు, వర్ణనలలోను, మార్పు ఏమైనా చేశారా, సన్నివేశాలను సంభాషణ ద్వారా ఎలా చెప్పించారు వంటి అంశాలను పొందుపరిచాను. రేడియో నాటకం కొన్ని పరిమితులకు లోబడి ఉంటుంది. ఇవి పాటించారా లేదా క్షుణ్ణంగా పరిశీలించాను. అలాగే గణపతి, వేయిపడగలు గ్రాంథికంలో సాగిన నవలలు రేడియో నాటకంగా మలిచినప్పుడు వ్యవహార భాషను ఉపయోగించాలి. ఆ దిశలో రేడియో నాటకం సాగిందా లేదా అని పరిశీలించాను. రేడియో నాటకంలో ఉపయోగించిన భాషా పదాలను , సామెతలను పేర్కొని విమర్శనాత్మకంగా అధ్యయనం చేశాను. ఈ విధంగా ఆరు అధ్యాయాలను నా పరిశోధనాంశానికి అనుగుణంగా విభజించుకొని సిద్ధాంత వ్యాసాన్ని పూర్తి చేశాను.

నా ఈ పరిశోధన చేస్తున్నప్పుడు రేడియో నాటకాల మీద పరిశోధనలు చాలా జరగవలసి ఉందనిపించింది. నవలలతో పాటు, కథలు, దృశ్య నాటకాలు, రేడియో నాటకీకరణ చేశారు. ఇటువంటి వాటన్నిటి మీద పరిశోధనలు చేయవచ్చు. పురాణాలకు సంబంధించిన ఇతివృత్తాలు రేడియో నాటకాలుగా ఎలా మారాయి. చారిత్రక ఇతివృత్తాలు రేడియో నాటకాలుగా ఎలా మారాయి, సాంఘిక ఇతివృత్తాలు రేడియో నాటకాలుగా ఎలా మారాయి, వంటి అంశాల మీద పరిశోధనలు జరగవలసి ఉన్నాయి. ఇటువంటి వాటి మీద పరిశోధన చేయవచ్చు. వీటి వల్ల ఒక ప్రక్రియ, మరొక ప్రక్రియగా మారేటప్పుడు జరిగే శిల్పగతాంశాలను గుర్తించవచ్చు. తద్వారా తెలుగు సాహిత్య వికాసానికి ఈ పరిశోధనలు ఎంతగానో సహకరిస్తాయి.

స్వయంగా రేడియో కోసం రాసిన రచనకూ, ఒక రచనను రేడియో నాటకంగా మార్చిన రచనకు చాలా వ్యత్యాసాలు కనిపిస్తాయి. రేడియో నాటకం కోసం రాసే రచనకు స్వేచ్ఛ ఉంటుంది. కానీ, అప్పటికే ఉన్న రచనను మరలా రేడియో కోసం రాసినప్పుడు కత్తిమీద సాములా ఉంటుంది. నాటక ప్రయోక్త చాలా జాగురూకతను ప్రదర్శించాలి. ఇతివృత్తం మారకుండా పాత్రల పేర్లు మరీ

అవసరమైతే తప్ప మార్చడానికి వీలుండదు. అదే రేడియో కోసమే రాసిన రచనల్లో రచయితకు స్వేచ్ఛ ఉంటుంది. ఇవన్నీ ఈ సిద్ధాంత గ్రంథంలో గుర్తించే ప్రయత్నం చేసాను.

ఈ సిద్ధాంత గ్రంథం వల్ల నవలలు రేడియోలుగా మారేటప్పుడు వర్ణనలు, సంభాషణలుగా మారడం, దృశ్యాలు సంగీతంతో వినిపించడం వంటివన్నీ చేసేటప్పుడు పాటించాల్సిన నియమాలను కొన్నింటినైనా గుర్తించానని అనుకుంటున్నాను. ఈ సిద్ధాంత గ్రంథం మరింత ప్రామాణికంగా ఉండడానికి సంబంధిత రంగాల్లో విశేషమైన కృషి చేసిన వారు ఇచ్చే సూచనలు, సలహాలను స్వీకరిస్తానని సవినయంగా మనవి చేస్తున్నాను.

# ఉపయుక్త గ్రంథ సూచిక


అనంత పద్మనాభ రావు, ఆర్. *రేడియో నాటకాల చారిత్రక పరిశీలన*,
కడప: వాసవీ గ్రాఫిక్స్, 2007.

అప్పల స్వామి, పురి పండా. ***సారస్వత వ్యాసములు, (ద్వి. ము)***
(ప్ర.సం),హైదరాబాద్: ఆంధ్రప్రదేశ్ సాహిత్య అకాడమి, 1980.

చక్రవర్తి, లక్ష్మణ. ***లక్ష్మణ రేఖ ( సాహిత్య విమర్శపై వ్యాసాలు,)***
హైదరాబాద్: పొట్టి శ్రీరాములు తెలుగు విశ్వవిద్యాలయం, 2009.

జయప్రభ. ***నాలుగో గోడ, తెలుగులో ఆధునిక నాటకం,***
***(ప్ర.ము),*** నవోదయా బుక్ హౌస్,1992.

లక్ష్మణ చక్రవర్తి, సి. హెచ్, సంపత్కుమారాచార్య, కోవెల. ***తెలుగు సాహిత్య విమర్శా దర్శనం, (పదకొండవ సంపుటి)***
హైదరాబాద్: తెలుగు విశ్వవిద్యాలయం, 2016.

నరసింహారావు, ముని మాణిక్యం. ***మన హాస్యం,(ద్వి. ము),***
హైదరాబాద్: ఆంధ్ర సారస్వత పరిషత్,2009.

నాగభూషణ శర్మ, మొదలి. ***చిలకమర్తి లక్ష్మీ నరసింహం.***
హైదరాబాద్: ఆంధ్ర ప్రదేశ్ సంగీత నాటక అకాడమి, 1973.

నాగభూషణ శర్మ, మొదలి. ***నాటక శిల్పం(ద్వి. ము),*** హైదరాబాద్:
క్రియేటవ్ లింక్స్ పబ్లికేషన్స్,2013.

నాగయ్య, జి. ***తెలుగు సాహిత్య సమీక్ష, (ప్ర.సం)(ఆ.ము)***, తిరుపతి:
నవ్య పరిశోధక ప్రచురణలు, 2009.

భారతి, ముక్తేవి. ***చిలకమర్తి సాహిత్య సేవ, (ప్ర.ము),*** హైదరాబాద్:
విశాలాంధ్ర పబ్లిషింగ్ హౌస్, 1988.

మూర్తి, డి. ఎస్. ఎన్. ***తెలుగు నాటక సాహిత్యం వివిధ రీతులు–***
***పరిణామాలు, (ప్ర.ము),*** బెంగుళూరు: సాహిత్య అకాడమి, 2012.

రమణ, పి. వి. ***పాశ్చాత్యసాంఘిక నాటకం తెలుగు నాటకంపై ప్రభావం,***
***(ప్ర.ము),*** విజయవాడ: పబ్లికేషన్స్ వెంకట రమణ బ్రదర్స్, 1993.

రవీంద్ర త్రివిక్రమ్, ***తెలుగులో శ్రవ్యనాటకాలు,*** హైదరాబాద్:
కర్షక్ ఆర్ట్ ప్రింటర్స్,2012.

రాధాకృష్ణమూర్తి, మిక్కిలినేని. ***ఆంధ్ర నాటక రంగ చరిత్ర, (ప్ర.ము),***
మద్రాసు: రేణుకా గ్రంథ మాల, 1969.

రామకోటి శాస్త్రి, కేతవరపు. ***విశ్వనాథ వైఖరి, (ప్ర.ము),*** హైదరాబాద్:
నవోదయా బుక్ హౌస్,1994.

లక్ష్మీ నరసింహం, చిలకమర్తి, ***పార్వతి పరిణయం,*** రాజమహేంద్రి వరం:
శ్రీ విద్య నిలయ ముద్రాక్షరశాల, 1919.

లక్ష్మీ నరసింహం, ***చిలకమర్తి. గయోపాఖ్యానం,*** రాజమండ్రి:
కొండవల్లి వీర వెంకయ్య అండ్ సన్స్, 1955.

లక్ష్మీ నరసింహం, చిలకమర్తి. ***ద్రౌపది పరిణయం*** 1960.

లక్ష్మీ నరసింహం, చిలకమర్తి. ***రాజా రత్నం, (ప్ర. ము),*** విజయవాడ:
నాగార్జునా ఎంటర్ ప్రైజెస్, 1987.

లక్ష్మీ నరసింహం, చిలకమర్తి. ***రామచంద్ర విజయం, (ప్ర.ము),*** విజయవాడ:
వాహిని ప్రచురణాలయం,1986.

లక్ష్మీ నరసింహం, చిలకమర్తి. ***సౌందర్య తిలక, (ప్ర. ము),*** విజయవాడ:
శ్రీ మానస పబ్లికేషన్స్, 1987.

వెంకట కుటుంబ రావు, బొడ్డపాటి. ***ఆంధ్ర నవలా పరిణామం,***
హైదరాబాద్: ఉస్మానియా యూనివర్శిటి, 1971

వెంకట లక్ష్మీ, నరసింహారావు. ***వేమన పద్య రత్నావళి,(ఆ. ము),***
విజయవాడ: జె.పి. పబ్లికేషన్స్, 2013.

వెంకట సుబ్బయ్య, వల్లంపాటి. ***విమర్శా శిల్పం, (ప్ర. ము)***
విశాలాంధ్ర పబ్లిషింగ్ హౌస్, 2002.

వెంకటాచార్యులు, కొట్టె, ***సంప్రదాయ నాటక సౌరభాలు,***
విజ్ఞాన దీపిక ప్రచురణలు, 2001.

వెంకటేశ్వర రావు, దార్ల. ***వీచిక, (ప్ర. ము),*** హైదరాబాద్:
ప్రజాశక్తి డైలి ప్రింటింగ్ హౌస్,2009.

వెల్చాల, కొండలరావు, (సం). ***జయంతి త్రైమాసిక పత్రిక(సంపుటి 12).*** ఏప్రిల్, జూన్ 2015. మూడవ సంచిక ,

హైదరాబాద్: సిస్టర్ వేదిత ఫౌండేషన్ వారి విశ్వనాథ సాహిత్య పీఠం.

వేంకట మురళి కృష్ణ, పోచన పెద్ది(వ్యాఖ్యాత), ***కావ్యాలంకార సంగ్రహం, (ప్ర. ము),*** రాజమండ్రి: రోహిణి పబ్లికేషన్స్, 1998.

వేంకటేశ్వరరావు, దార్ల. ***జ్ఞానానందకవి ఆమ్రపాలి పరిశీలన, (ప్ర.ము),*** హైదరాబాద్: జ్యోత్స్నా కళా పీఠం, 1999.

వెంకటావధాని, దివాకర్ల. ***వ్యాస సాహితి సంహిత, ఉపన్యాస వ్యాస మంజరి (ప్ర.ము),*** హైదరాబాదు: పద్మావతి ఆర్ట్ ప్రింటర్స్, 1985.

సాహితీ సాంస్కృతిక సంస్థ, ***యువ భారతి,*** సికింద్రాబాద్:1985.

శ్యామలాదేవి, దిట్టకవి(చిరువోలు). ***విశ్వనాథ వారి నవలలో ముఖ్య స్త్రీ పాత్ర చిత్రణం (సి. వ్యా),*** ఆంధ్రవిశ్వవిద్యాలయం,1984.

శ్రీనివాసరెడ్డి, సి. ఎల్. ***సాహితీ సౌరభం(తెలుగు పాఠ్య పుస్తకం)(ప్ర. ము),*** హైదరాబాద్: తెలుగు అకాడమి,2003.

శ్రీరామ అప్పారావు, పోణంగి. ***తెలుగు నాటక వికాసం, (ప్ర. ము),*** హైదరాబాద్: శివాజి ప్రెస్,1967.

సత్య నారాయణ, ***విశ్వనాథ. వేయిపడగలు,(27. ము),*** విజయవాడ: శ్రీ విశ్వనాథ పబ్లికేషన్స్, 2014.

సత్యనారాయణ, విశ్వనాథ***. ఏకవీర,(14.వ. ముద్రణ),*** విజయవాడ: విశ్వనాథ పబ్లికేషన్స్, 1992.

సత్యనారాయణ, ***విశ్వనాథ. దేవతల యుద్ధం, (ద్వి. ము),*** విశ్వవాణి ప్రచురణలు,1960.

సత్యనారాయణ, విశ్వనాథ. ***ధన్య కైలాసం,*** విజయవాడ: కళా పీఠం ఆర్ట్ ప్రింటర్స్,1937.

సత్యనారాయణ, విశ్వనాథ. ***నర్తన శాల, (మూడవ కూర్పు)*** 1955.

సత్యనారాయణ, విశ్వనాథ. ***వేనరాజు, (ప్ర. ము),*** బెజవాడ: ఆంధ్ర గ్రంథాలయ ముద్ర శాల, 1930

సత్యనారాయణ, విశ్వనాథ. ***హాహాహూహూ, (ప్ర. ము).*** తెనాలి:
లక్ష్మీ పవర్ ప్రెస్, 1932.

సుబ్బరామి రెడ్డి, గండవరం. ***ఆధునిక తెలుగు నాటకం,(ప్ర. ము),***
హైదరాబాద్: ప్రవీణ్ పబ్లికేషన్స్, 1989.

సుబ్రహ్మణ్యం, పి. యస్. ***ఆధునిక భాష శాస్త్ర సిద్ధాంతాలు, (తృ. ము),***
హైదరాబాద్: పొట్టిశ్రీరాములుతెలుగు శ్వవిద్యాలయం,1997.

హనుమంతరావు, బి. ఎస్. ఎల్. ***ఆంధ్రుల చరిత్ర,(13 .ము),***
సికింద్రాబాద్: విశాలాంధ్ర పబ్లికేషన్స్, 2012.